స్వేచ్ఛా కవిత్వం

ఏడో సంపుటం (2020-2022)

మాదిరాజు రంగారావు

2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

స్వేచ్ఛా కవిత్వం

ఏడో సంపుటం

రచనా కాలం 2020 - 2022

మాదిరాజు రంగారావు

నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు, ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం ఏడో సంపుటం **(Volume VII)** పునఃముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

మాదిరాజు సంతోష్ కుమార్

దేవులపల్లి హరిత

మాదిరాజు చరిత

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SWECCHAA KAVITHVAMU
Volume VII (2020 - 2022)

by
Prof. Madiraju Ranga Rao

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2023
Second Edition 2026

ISBN : 978-93-5679-884-7

Price : 1000/-

For Copies :
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

Printed at :
Anupama Printers
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

స్వేచ్ఛా కవిత్వం

ఏడో సంపుటం

రచనా కాలం 2020 - 2022

విషయ సూచిక

1.	రేపటి రిజర్వులో (109)	1-34
2.	అక్షతం (110)	35-94
3.	లాక్‌డౌన్ & వర్తమానం మెట్ల మీంచి (111 &112)	95-158
4.	అజేయం (113)	159-192
5.	ఈ వారం కవిత (114)	193-236
6.	గుడ్ బై (115)	237-270
7.	అక్షర హృదయం (116)	271-310
8.	గాయపడిన శాంతి (117)	311-342
9.	వార్తలో కవిత (118)	347-398
10.	నిప్పులపై మేఘం (119)	399-448
11.	తెలియని వాస్తవం (120)	449-506

పీఠిక

స్వేచ్ఛా కవిత్వంలో మొదటి పదం "స్వేచ్ఛ" ప్రజాస్వామ్య భావజాలాన్ని స్ఫురింప చేస్తూంది. దీనికి ఆధునిక యుగంలో సామ్యవాదం జోడింపబడి ప్రాముఖ్యాన్ని దృష్టికి తెస్తుంది. స్థూలంగా దీనితో ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్యభావన మనేది సాహిత్య జగత్తులో ఈనాటి అవసరంగా అభిమానులకు, ఆలోచనాపరులకు, సామాజిక క్రియా కలాపాల్ని కోరేవారికి, పరిస్థితులు దీని పట్ల అభిముఖ్యాన్ని పెంపొందించడం జరిగింది, జరుగుతూంది. ప్రజాస్వామ్యం ఏ కోణంలో ఆలోచించినా ఈ దేశ సంస్కృతి జీవన వాస్తవంలో తప్పనిదే అవుతుంది. ఇది వచన కవిత్వం కాదు. తద్భినమైంది. అనేక విషయాల్లో భేదిస్తుంది. ఈ కుదురు నుండి ఈ కోశం నుండి వివేచనలో ఇది నిలుస్తుంది. కాలం గడచే కొద్దీ అందరికీ అంగీకృతమవుతూంది. దీని వేదిక విశాలతరమైంది. కింది స్థాయి నుండి పై స్థాయి వరకు ప్రగతి శీల సోపానాలతో ఆకర్షిస్తుంది. 1950 నుండి ఈ ప్రస్థానం నా విషయంలోనేకాక విశ్లేషణ కందేవిగా ఇతరుల రచనలలోను దీని జాడలు కనిపిస్తాయి. ఇదొక మార్గం, లక్ష్యం చెదరే అవకాశం లేని దార్శనికంతో సంపన్నమయింది. ఎప్పటికపుడు ఆధునికతను సంతరించుకుంటుంది. సమాజ ప్రగతికీ వ్యక్తి వికాసానికీ బాగా ఉపకరిస్తుంది.

కవులలో తమ తమ వ్యక్తిత్వ నిర్మాణాలతో నైతిక స్వచ్ఛత, లక్ష్యశుద్ధి, ప్రతిభా ప్రకాశం, ఎప్పటికపుడు సమీక్షలో మార్పులకు సంసిద్ధత విశ్లేషణకందుతాయి. స్వేచ్ఛా కవిత్వమన్న పద బంధం ప్రజాస్వామ్య హృదయానికి చెందిన అమూల్యమైన వరం. ఇది ప్రగతిశీలమైంది. జీవన చక్రంలో ఎదురయ్యే సమస్యల్నీ ఎదుర్కొనే అన్ని దిశల్నీ స్పృశిస్తుంది, చింతన కవకాశమిస్తుంది. తగిన చర్యలకు ప్రేరేపిస్తుంది. ఒక విధంగా ఈనాటి పరిస్థితుల్లో ఇదొక ఆదర్శంగా వికాస జగత్తును, ఆపైన స్వేచ్ఛాయుతమైన భౌతిక మానస దశలను చేపడుతుంది.

స్వేచ్ఛా కవిత్వమనేది ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికత చేత సంపన్న మవుతుంది. నేటి సాహిత్య విమర్శలో పాక్షికతకు తావులేని విధంగా, దీని ఉపయోగం విపులమైన ప్రయోజనాలతో కూడింది. ఆధునిక యుగానికి జీవవంతమైన భావ ప్రసార రేఖలతో ఆవిష్కృతం కావడం, సరియైన అవసరమైన ప్రయాణ రూపం. ఇది నవ్యమయిన యుగ మార్గం. పోను పోను ప్రాచుర్యాన్ని పొందుతూంది. అనుభవంతో ఈ దార్శనికత ఈ కృతికి వెన్నెముకయై నిలబెడుతుంది. ఎప్పటికప్పుడు తగిన చర్యలతో జీవిస్తుంది.

–ఆచార్య మాదిరాజు రంగారావు

స్వేచ్ఛా కవిత్వం - 109

రేపటికి రిజేర్వులో

మాదిరాజు రంగారావు

2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

NO. 109

SWECCHA KAVITHVAM

Free - Verse

REPATIKI RESERVULO

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2020

Presented
to
విశ్వ పౌర హృదయం
(Vishva Paura Hrudayam)

పీఠిక

1953 సంవత్సరంలో "తెలుగు స్వతంత్ర (వారపత్రిక)లో ప్రచురితమైన (1) వేదనా స్రవంతి (2) శ్వేతేతర పక్షులు రెండూ నా కవిత్వంలో అస్తిత్వ మూలం – 'స్వేచ్ఛా కవిత్వం' పేరుతో రచన ఆరంభమయింది. అది ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా సాగుతూంది. ఈ ప్రవాహ పరంపరలోనిదీ కృతి "రేపటి రిజర్వులో" 109వ దిగా వెలువడుతూంది. ఇది సమాజ జీవన గతులతో వర్తమాన తలంపై పలు పాయలుగా వైవిధ్యాన్ని కలిగింది. ఈ సృజన చేతన ప్రధానంగా వర్తమానాన్ని ఆశ్రయించింది. యధార్థ జీవన కేంద్రంగా వర్ధిల్లింది. దీనికితోడుగా అక్కడక్కడా చారిత్రక దృష్టితో గతానికి సంబంధించిన స్మృతి చలనం ప్రసక్తమయింది. నేను విశ్వసించే ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికం చేత ప్రయోజన విస్తృతిని పొందింది. ఈ కవిత్వం దీనికిదిగా ఆధునిక వాతావరణంలో ప్రత్యేకతను సంతరించుకుంది.

దైనందిన సంక్షుబ్ధ పరిస్థితులలో పీడన హనన విషాదాలతో పాటు నిర్బంధాలు ఆత్మహత్యలు అనైతికతలతో నిరాశా వాతావరణం చోటు చేసుకోవడం జరుగుతూంది. ఇది తాత్కాలికమనే భావం మనిషి పై విశ్వాసం పెంచుతూంది. ఆశావాహమైన స్థితిని నెలకొల్ప జేయడం కవిత్వ కర్తవ్యం. ఇందులో మనిషిలో పైకి కనిపించని మంచి మనిషి బాధ్యతను కూడ జ్ఞాపకం చేయడం జరిగింది.

సమకాలీనంలో సమాజం ఎదుర్కొనే అనేక సమస్యల ప్రసక్తి నా కవిత్వంలో విషయ మర్యాదను పొందింది, మానవతా స్పందనం – ఆలోచనా ప్రసారంతో రచన ఆపూర్ణమయింది. దీన్ని గమనించవచ్చు. భౌతికమైన చిత్రణం కన్నా సారభూతమైన భావరేఖల చేత ఆవిష్కృతమయింది.

ఈ వెలుగులో ఈ సృజన కృతిలో (1) వర్తమాన ప్రస్తావనకు ప్రాధాన్యం (2) అమరిన ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికత (3) ప్రకృతి నేపథ్యంలో జీవన చిత్రణం – ప్రతీకాత్మకత (4) స్థానికం నుండి ప్రపంచ స్థాయి వరకు మానవీయ భావన (5) మనిషిలో ఆంతరంగా మరో మనిషిలో మంచి వైపు ఊహల చర్యల పయనం (6) మొత్తం మీద తాత్త్వికం – మనస్తత్వ విశ్లేషణం స్పృహకు చోటు – విశ్లేషణ కందుతాయి. పోను పోను జీవితాలు సంకుచితం నుండి విశాలతకు, వైవిధ్యంతో కూడిన స్వచ్ఛా ప్రభావ రూపాలకు గుర్తింపును ఆశించడం సహజం. ఇది ప్రజాస్వామ్య విజయానికి తోడ్పడుతూంది

ఈ కవిత్వం స్వేచ్ఛా జగంతో గతంలోని చేదు అనుభవాలతో పాటు నేడు అమృత శక్తిని తలపించే ఆశాపూర్ణమైన నిర్మాణాత్మకమైన మనోరూపం ఆవశ్యకతను భావింపచేస్తూంది. ఇది సమాజంలో సుస్థితికీ, వ్యక్తి వికాసానికీ అవసరం. ఇది నిఖిల మానవ ప్రగతికి సంకేతం.

– మాదిరాజు రంగారావు

1. రేపటికి రిజేర్వులో

ఆశా రూపం రేపటి రిజర్వులో భద్రంగా
ఎప్పటి నుండో కలసి రాసులుగా
ఇది మానవ జీవన సంస్కృతిలో భాగం
అస్తితతో అలరించడ మొక అనుభవం

ఎవరి కోసమూ వేచి ఉండదు ఉదయం
దేని కోసమో తొందర పడదు సమయం
ఇది చీకటి వేళ అని విరామం కోరదు
కత్తి పదును తేలే దాక! యుద్ధం ఆగదు

మనిషికై మనిషి ఆగేను; కాలం మాత్రం ఆగదు
మిగిలిన ఆశలు రేపటి రిజర్వులోకి
నిఘంటువులో పర్యాయ పదాల వలె
జీవితంలో పరిస్థితులు అమరవు, ఏర్పడవు

విసరిన రాయి దూసిన బాణం వేసిన బాంబు
వివిధ దశలలో దేని హనన క్రీడ దానిదే

ఆశారూపం మనిషిని వేచి ఉంచేదవుతూంది
ఇంద్ర ధనుసును కత్తిరించి మానవాకృతి నిచ్చేరా?
విజ్ఞానం కళ రెండిటి సమన్వయం
సుందర మానుష రూపానికి నిధి వంటిది

ఎచటి నుండి అయినా రావచ్చు మానవ ధర్మం
ఎవరి నుండి అయినా రావచ్చు స్పందన శీలం
నిద్రలో ముఖాన నవ్వు! ఒక రహస్యం
మనసులో విరిసిన ఘటన కావచ్చు

కోరికల్ని బట్టి మనసులో కలలు
మళ్ళీ మళ్ళీ మంచివి రావాలని; కూడా
మిగిలిన ఆశలు రేపటి రిజర్వులోకి
ఖర్చు చేయని పూర్వ సంపద ఎంతో!

2.

ఏ రోజు కారోజు జీవితంలో కొత్త మలుపు
మనిషిలో ఆ రోజు సార్ధకతను పరీక్ష చేసేను
పక్షి పశు జంతు మృగ రూపాలు మానసికంగా
ఎవరు దేన్ని ధరించి పాత్ర వహించేదీ తెలియదు

తెలియని రహస్యాలతో చిక్కువడిన ప్రజాస్వామ్యం
తనపై దోషారోపణల్ని భరించ వలసి వస్తుంది
దారి దొరకని అవకాశం సంకుచితం నేర్పుతుంది
విభేదాలు పదును తేలి లేని నిప్పును రాజేసేను
ఎన్నికలు యథావిధిగ రావడం పోవడం జరుగుతూనే ఉంది
నీరు లేని బావుల లాగ పేదల బ్రతుకులు!

ఆధారమయిన భూమి పెద్ద బాధ్యతతో కనిపిస్తుంది
దూరాన నింగి తలపై నుండి అమాయకంగా మౌనంగా

దిక్కుల గుండెలు అదిరే ప్రచార ఘోషతో శబ్ద జలధి
పగిలిన గాజుముక్కల్లా, రాలిన ఆకుల్లా
తీరాన ప్రసంగాలు వాగ్దానాలు కోకొల్లలు
మానిపెస్టోలు ప్రకటనలు సరేసరి! అరచేతిలో ఆకాశం

దట్టమయిన మంచు తెరలతో సమయం
మనిషిలో రవి తేజం ఆశిస్తూంది!

చేతిలో స్వర్ణ కంకణంతో చెరువు కట్టపై
పులిలా! రాజకీయం పథికుల్ని లోభ పెడుతూంది
ఆ కంకణ మెవరిదో! తెలియదు
దాని స్వీకృతి కెవరు నప్పేదీ తెలియదు!

నడిచే దారిలో బురదలో దిగకుండా అడుగులు
తెలియని స్థితిలో తెలిసిన చతురతతో నేతలు!

చీకటిలో చుక్కలు ఒక్కొక్కరిలో ఒక్కొక్కటి ప్రతిఫలిస్తూ
ఉదయ రశ్మి! అందరిదీ, మంచు తెరలు తొలగిపోయి

3.

ఈ భూమి తలం ఈ జల హృదయం
జీవన చలనంలో ఎచట నయినా ఒకటే
అందరికీ అవకాశం తెరచిన దారులతో
ఇవి అందరివీ తొలి దశలో! విశ్వమయాలు

వ్యక్తిలో స్వార్థం ప్రబలి పై చేయి అయింది
బిగిసిన ముడులతో వ్యవహారం ముదిరింది
రేపు ఎట్లా ఉంటుందో పొంచిన పులి భయంతో
ఈ రోజున కూడ బెట్టే ఆలోచన అధికమైంది

అంచెలు అంచెలుగా క్రియా రూపం వహించింది
రోజు గడస్తుంది! సంపద పెంపుపై అభిలాషతో
సమాజ సంబంధాలెన్ని తీరులో
సమస్యలన్ని విధాలు ! శాఖోపశాఖలుగా

సమస్యలకు పరిష్కార ప్రణాళికల కన్న
వీధులలో హోరెత్తే నినాదాలే జాస్తి!

ఉదయ కిరణ స్పృహతో గడప దాటగనే
ఊహలో పూల దండకు బదులుగా
ఇరువైపుల పదునుతో తళతళ లాడుతూ
ఖడ్గ మెదురు కావడం! అనుకోని అనుభవ చిత్రం!

రాత్రులు చీకటిలో గుప్తంగా జరిగేవి
నేరం హింస ఇపుడు పట్టపగలు భయ దృశ్యం!

కత్తి మొన నుండి విషమ క్షణం
అగ్ని శిఖయై పైకి దూకవచ్చు
మొగ్గలు పూలై అలరించే అభిలాష
మాయమై విశీర్ణ దృశ్యం కనిపించవచ్చు

ప్రకృతి నుండి వ్యక్తి పరిధి దాటి సమాజ వలయంలోకి
ప్రవేశం! సృజన విలయ గతులతో సమాజ రూపం

4.

తమ తమ గుర్తులతో ఎవరికి వారు
ఎవరి ప్రత్యేకతను వారు చూపే యత్నం
అణువణువున చేతన గుణ ప్రసారం
శాంత రేఖ దాటి జ్వలనంతో ఉగ్ర చర్యలలోకి

దాహంతో ఒకరు వీధిలో అలమటిస్తూ ఉంటే
ఎదురుగ నెత్తురు చుక్కలు చిందే తీవ్రతలో ఒకరు
పేదరికం మడతలలో దీనత జీరాడుతూ ఉంటే
శిథిలమైన పురా దృశ్యాల మధ్య తిప్పగ చూచే రొకరు

పశ్చాత్తాప క్రియతో కళంక చరిత్ర తొలగేనా?
శుభ్రతతో స్వచ్ఛత మానస భూమికను వరించేనా?
తన నిలయం ఆవరణంలో పచ్చదనం సువాసన
నెలకొల్పే బాధ్యత యజమానిది ప్రకృతితో బంధుతచే

అభిప్రాయ భేదాలకు వీలులేని సుగమ పథం
మనిషిలో నైతికతకు సంబంధించిన ఆలోచనలో

పయనంలో ఇరువురి వ్యక్తిత్వాలు స్వతంత్రంగా
రైలు పట్టాల వలె సమాంతరంగానే సాగేను
ఎక్కడో మార్పిడిలో జంక్షన్ లో తప్ప
పోయినంత వరకు సమాన భావన తోనే

దారిలో మధ్య మధ్య నదీ నదాలు
వివిధ భంగిమల్లో కళామయాలు
దారి కిరు వైపుల చరిత్ర ఆనవాళ్ళు
ధైర్య కవచం తొడిగే! ఉపదేశికులు

ఊగే జలధి అలలను గాలి హత్తుకొనీ
స్నేహ సుందరతను నేరుగ ప్రకటిస్తుంది
మిగిలిన కన్నీటి చుక్కలు రెండు
చివరగా! అర్పుల కోసం రిజర్వులో

5.

చెట్లతో గాలి భాషణం నిరంతరం సాగుతుంది
మనుషుల మధ్య మాటలు ! విరామ దశ పొందవచ్చు
కళాకృతిలో కవిత శూన్యాన్ని నింపుతుంది అక్షరంతో
వ్యక్తి స్వేచ్ఛలో సమాజ హృదయం వినిపించేను

కాల మెంత మహనీయ మయిందయినా
యంత్ర వాహనం ముందు ఒదగ వలసిందే
ప్రమోదమయినా ప్రమాదమయినా అనుభవం మనిషిదే!
వర్తమానం వెన్నంటి గతం! ఆశీర్వచన ముద్రలో!

ఎక్కడెక్కడి దారులో వచ్చి చేరతాయి
భూమి చివరి అంచున జలధి తీరంపై
కాలం ముందునకే, వెనక్కి అడుగు వేయదు
ఆటంకాల నధిగమిస్తూ ఆవలి తీరంపై ఆశతో

నరాలలో నెత్తురు కదలికలో వెచ్చని స్పృహతో
ఉత్తేజం ఉద్వేగం ఉద్యమం విప్లవం రాగం వీరం
కాలాన్ని కథలతో నింపుతూ; తరుముక వస్తాయి
గుండెపై చేయి వేసి మనిషిని చరిత్రలో నిలుపుతాయి

గతంతో బంధం తెగడం పరంపరకు ఆఘాతం
అదొక పెద్ద లోయయై దాటరాని దవుతుంది
పచ్చని తోటను వదలి ఎడారిని వరించేరా?
ఇసుక మేడతో కల్పన కాకృతి సిద్ధించేనా?

గాలిని దోసిలిలో నింపి ఎవరి కర్పించేరు?
నిజాన్ని గుండెలో దాచి ఎవరిని కాపాడాలని
అది తానే కావచ్చు, కవిగా
అది తనదే కావచ్చు కవితగా
అక్షర రూపంలో చిర యశో రూపం
ఏ పరిమితిలోనిది కాదు, ఆత్మభవం, విశ్వమయం

6.

అక్షరంలో నక్షత్రం వెలుగును ప్రతిఫలిస్తుంది
నిరాశలో జారిపోయే మనిషిని నిలబెడుతుంది
లోయ నుండి పైకి తీసే స్నేహకర మవుతుంది
సృజన విలయ మిశ్రమ సుందరమైన జీవితం
కవితలో జ్ఞాపక చిహ్నంగా మిగులుతుంది కళయై
మనిషికి తన కథను మరొక మారు చూపిస్తుంది

చెట్టు కొమ్మకు తీసిన ఉరి, ఎప్పటిదో విషాద ఘటన
ఇపుడు ప్రతి కొమ్మను ఉరికి గురి చేయడం అమాయకం
ఎపుడొ! పరీక్షితుడు పొందిన చేదు అనుభవం పుష్పగతం
ఇపుడు పూలలో క్రిమి కల్పన! మృత్యుపదం అహేతుకం!

మనిషికి మనిషికి మధ్య ! ఏదో ఒక అడ్డు
ఇనుప తెరో! గాజు తెరో ! మరొకటో మరొకటో!
నిశ్శబ్దంలో శబ్దం జలధిలో పడవలా
తాపంలో చెట్టు నీడ! ప్రాణానికి శాంతి కరంలా

చెట్టులో మనిషి తన బ్రతుకును దర్శించవచ్చు
మనిషితో పాటు నడవలేకపోయినా, ఆదర్శం కావచ్చు
గుండె తడి కోరుతుంది భూమి ఎక్కడయినా ఒకటే
అణువణువు సృజన స్పృహతో తహతహలాడుతుంది

శ్రమ చేతనతో జీవిత మెక్కడయిన ఒకటే అయినా
పూర్తిగ తెలియని రహస్య ఛాయల తోనే ! కవితకు అస్తిత

రహస్య లిపి తెలిసిన హృదయానికి అస్పష్టత ఉండదు
ఏ పదాని కది భావ పూర్ణతతో గగనాన్ని వరిస్తుంది
స్నిగ్ధమైన హృదయానికి స్వాగతం పలుకుతుంది
పైనుండి అవతరణంతో కింది నుండి ఉద్గమనంతో

7.

వెలుగు కొంగు పట్టుకొని నీడ కదలుతుంది
కిరణం నీడకు ధైర్యాన్ని ఇస్తుంది
తన బలాన్ని అందరికీ చూపిస్తుంది
నీడ లోని ఆర్ద్ర గుణం బయటపెడుతుంది

తెలుపు పక్కనే నలుపు
పచ్చదనం తోడుగా ఎర్రదనం
మంచి చెడు సృజన విలయ సూచనలు
అన్నిటినీ కలుపుక పోతుంది కవిత!

ఏ రంగు లేని వస్తువు లేదు
ఏ తీరు లేని బ్రతుకులు లేవు
ఆలోచన అనుభవ రుచి కొత్తదనం కోరుతుంది
సృజన గుణంతో మదిలో ఆర్ద్రత స్నిగ్ధత నవ్యత

వస్తువుతో రహస్య భాషణం కవికే చెల్లుతుంది
ఇది సృజన చేతనలో భాగం అవుతుంది

తెలియనంతవరకు అంతా సామాన్యం
కాస్త పరిచయంతో వెలుగు దృష్టి పడుతుంది
ఉన్న చీకటి మాపేందు కెన్ని ప్రయత్నాలో
లేని వెలుగును తెచ్చేందు కెన్ని ఉపాయాలో

ఎవరు నడచినా నడవక పోయినా
ఎవరు చూచినా చూడక పోయినా
రాత్రివేళ వీధి దీపం వెలుగుతుంది అవసరంలో
నిజం బయట పడాలని కవిత కోరుతుంది

రంగులతో సిద్ధమైన మట్టి బొమ్మ లోతు తెలిస్తే
తానూ వాటిలో ఒకటయి పోవాలనిపిస్తుంది
సాధ్యం కాని వెన్నో! కల్పనలో సులభంగా జరుగుతాయి
పశ్చాత్తాపంలో శుద్ధమైన మనసు యజ్ఞ ఫలం పొందేనా?

8.

ఇది స్వప్నం కాదు వాస్తవ యాన జీవితం
భ్రమలో పరిభ్రమణ వలయంలో కొందరు
పచ్చదనంతో ధరిత్రి, శబ్ద మయంతో గగనం
ఇరు వైపుల నుండీ తప్పనివి అనుభవంలో

భేదం నిరసన యోచనతో ఒక పార్శ్వం
సహనం సమరస స్పందనతో ఒక పార్శ్వం
రాత్రి పగలు కలిసిన రూపంతో రోజు
ఉన్న స్థితులతో సమాధాన పడచేస్తుంది

మనిషిలో క్రియాశక్తి శ్రమ జీవన ప్రేరణం
ఏ రూపంలో నయినా సమాజంలో ఎప్పటికీ
వ్యక్తి వలయం దాటి సమాజ క్షేత్రంలోకి
ప్రయత్న సంరంభంతో మానవ జీవితం

మాసిన వస్త్రంలా శరీరాన్ని పక్కకు పెట్టలేరు
నాటిన విత్తును బట్టి ఫలానుభవం తప్పదు

ఎడారి పరచినా పూల తోట విరిసినా
తనలో భాగంగా భూమి స్వీకరిస్తుంది
చెక్కిన శిల్ప ప్రదర్శన శాల కాదు సమాజం
శ్రమ జీవన సంరంభంలో విశ్వమయం

ఆంతర దృశ్యాలతో మనసులు
రాగ మయమవుతాయి! ఏ చోటనయినా
బాహిర దృశ్యాలతో బ్రతుకులు
సుఖ సంపన్మయ మయ్యేనా? ఎవరికైనా

ప్రశ్నించే మనసు స్వతంత్రమైన వర్తనతో
విరోధాల్ని విచిత్రాల్ని వివాదాల్ని కోరుతుంది
అనల స్నానం స్వప్నంలోనే సాధ్యం
వెలుతురు అభిషేకం! మెలకువలోనే

9.

నేడు రెక్కలు విప్పిన చేతనతో విప్లవం
రేపు జలధిని దాటించేది అవుతుందని విశ్వాసం
ప్రబోధాలకు పనికి వచ్చే నీతి యంత్రం
రేపు వక్రతను సరిచేసేది అవుతుందని, ఆలోచన

మనసులోని పూవు, ముఖాన నవ్వయి అలంకరించవచ్చు
ఊహలోని నిప్పు రవ్వలు, క్రియలో క్రోధమయం కావచ్చు
ఈ రెండూ కావలసిన పనులను తీరుస్తాయనీ
మనిషిలో ఉంటాయి రిజర్వులో ! త్వరపెడతాయి

తీర భూమి లేని జలధి లేదు
హద్దులున్న నింగి కనిపించదు
రెండూ మనిషి జీవితంలో ఎప్పటికీ
క్రింద ఒకటి పైన ఒకటి దార్శనికంలో

పొద్దు వాలుతుంది రాత్రి రాకకు సూచనగా
రెప్పవాలుతుంది కలల రాకకు సిద్ధంగా
మనిషి నుండి అభ్యర్థనతో పనిలేదు
మనసును మార్పుకు వశ పడచేస్తాయి

మౌన ముఖంలో నిశ్శబ్ద సముద్రం
మనసును లాగుతుంది పడవ మాదిరి
ఎంత దూరమయినా అదే జల దృశ్యం
తీరానికి చేరే ఆలోచనల్ని శబ్దిస్తుంది

శిశు దశ లోని అమాయక ముఖం
ఎదిగే కొద్దీ చతుర మతిగ మారుతుంది
ముఖాలు అద్దెకు దొరకవు! మాస్కులు పనిచేయవు
రహస్య జీవన తంత్రం బ్రతుకులో భాగమవుతుంది

నిప్పును ఆర్పలేదు నీడ,
నీడను కాల్చలేదు నిప్పు
పాతవి కొత్తవి ముఖాలతో
కలిసి సాగుతుంది మిగిలిన కథ

10.

స్నేహం కలహం తనవారు తదితరులు ఎత్తులు జిత్తులు
అన్నీ అమరినవే! అడుగు వెనకి వేయలేదు, ధైర్యం సడలలేదు
అడవి దారి ఇచ్చింది, కొండ శిరసు వంచింది
పల్లె స్వాగతమిచ్చింది, అయితే రణంలో జయం ఒక వైపే

ప్రవాహాన్ని ఎంత పదును కత్తితో నయినా
ఎవరు నరక గలరు ? ముక్కలుగా విసర బడేనా?
కట్టె నెవరు ప్రవహించడం చేయగలరు?
దేని శక్తి తీరు గుణం విధం దానికి మితం

నదిపై వంతెన పాతబడి సడలిన సంధులతో
ఊగుతూంది మోయలేని బరువులో ఒత్తిడితో
పిల్లలకెంతో సరదా! అటూ ఇటూ ఊగుతూ సంతోషంతో
వృద్ధులకు భయం! వేస్తుంది! అటు ఇటు కదలుతూ

మరొకరికి సాహస పదం ముందుకు వేయిస్తుంది
కొత్త పాఠం నేర్చుకుంటున్నట్లు ఉంటుంది
అలవాటు కావలసి ఉంది, అడ్డుగా మరో సమస్య
కొత్తగా మార్పులతో చేర్పులతో జరుగుతూనే!

ప్రకృతిలో ప్రతి వస్తువు ఏదో రూపంలో
మనిషికి తన జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చేను
నదులు దాటుతూ గిరులు దిగుతూ కవితలో
ఎప్పటి కపుడు సృజనలో అనుభవ రుచిరం

ఎండను సహించవచ్చు, దప్పిక తీర్చవచ్చు
ఎదురు పడిన రాయితో మాట్లాడవచ్చు
కదలే ప్రవాహ హృదయంతో భాషించవచ్చు
ఊగే కొమ్మలతో చర్చకు దిగవచ్చు

వస్తూ పోయే రోజుల నియతి అందరికీ తెలుసు
బ్రతుకులో మాత్రం జరిగే ఘటన వెనక రహస్యంతో
పూలతో చేతి వేళ్ళతో కోయక
కత్తితో నరకి పొందాలనుకునేవారూ ఎక్కడో
ఎవరో ఉంటేనే చేదు వాస్తవం! తేలిసేది

11.

అనుకోనిది జరుగుతుంది! ఏమరు పాటుతో
అగ్గిపుల్ల గీసి సిగరెట్ అంటించి
విసరేసే ఉద్దేశం! తెలిసినదీ, తెలియనిదీ రెండూ
ఎంత అవసరమయినా హద్దు మీరితే ప్రమాదం

తనకు తెలియకుండ జరగడం విచిత్రం
తెలిసీ! దేనికో లక్షితం కావడం విశేషం
మనసును ఆడిస్తాయి! బాధిస్తాయి! నవ్విస్తాయి
వ్యక్తితో పాటు సమాజమూ భరించవలసిందే

ఉండి ఉండి గాలిలో పరిమళాన్ని విసరుతుంది పారిజాతం
పూలను తాకితే రెక్కలు రాలే సుకుమారతతో
దృశ్యానుభవంలో సంతోషంగా నడవడమే కాదు
ఆ పూవును ఉపయోగించే దాకా! అస్తిమితం మనిషిలో

గిరిపై నుండి కిందికి దొరలే బండ
దారికి ఆటంకంగా మారవచ్చు
గిరి అంచుల నుండి భూమికి దిగే
జలపాతం! రాగ ఝరి వినిపించవచ్చు

సాధ్యం అయ్యేవి కొన్ని, కానివి కొన్ని
తలపుల లోనివి కల్పనలో భద్రంగా
పాత నీరు పోయి కొత్త నీరు రాక
ఆ చోటునుండి ముందుకు కదలికతో నవ్యత

జీవన చలనంలో అనుభవ దృశ్యాలు
మానవ చేతన లహరులతో నిండేను

పిడుగుల శబ్దం! పూర్వపు రణాన్ని జ్ఞాపకం చేస్తుంది
మెరసే తీగెలు ఉత్సవ బుక్కాములను తలపిస్తాయి
అన్నీ తన కోసమేను అన్నట్లుగా
తెలిసినవీ తెలియనివీ అనుకొన్నవి అనుకోనివి కలిసీ

12.

కవితలో మాట పరువుకూ విలువకూ
ప్రమాణ స్థాయిలో అటు ఇటు తూగుతూ
అదృష్ట జగత్తుకు తెరచిన ద్వారంలా మాట
వివిధ విషయ సందర్భాలలో తానై పనిచేస్తుంది

ముందు నుండి అది వర మనిపించవచ్చు
వెనక నుండి శాపంగా వినిపించవచ్చు

కాలాంతరాన ఏమయినా జరగవచ్చు
శాపం చివరకు వరంగా మారవచ్చు
వరరూపం అల్పంగా తోచవచ్చు
దారి తెలిసినంతలోన గమ్యమందినట్లు కాదు

ప్రతిక్షణం నాణెంలా
ఉపయోగపడాలనుకునే వారూ
చేయి నుండి జారి పెట్టెలో చేరాలని
కుతూహలం తీగె సాగి అల్లుకునేను

యశో నిలయానికి ఇటుకల వలె
క్షణాలు వినియోగ పడాలను కునేవారు

నిశ్శబ్దంగా ఉన్న గాలి
పలికే మాటతో వేగ మందుకుంటుంది
అది బాణం వదలవచ్చు
అది బాంబు విసరవచ్చు

ఆలోచన అనుభం ఎంత అపారమయినా
చివరకు మనిషి మనిషే! భౌతిక పరిమితులతో
ఆరంభంలో సంఘం చేతుల్లోకి మనిషి నిర్భయంగా
సమాప్తిలో భూమి చేతుల్లోకి మనిషి అభయంగా

చల్లదనంతో వెచ్చని మాటతో కవిత
వెచ్చ దనంలో పచ్చని మాటతో కవిత
ఎవరు కనిపించినా, కనిపించక పోయినా
తొలి కిరణం మాట్లాడుతుంది మానవ హృదయంతో

13.

ఏ వ్యక్తి ఒంటరి కాదు పరివారంలో
బయటికి మాత్రం అలా అనిపించవచ్చు
లోన సమాజం! ఎన్ని శ్రేణులలోనో
లోన జనత! ఎన్ని మనో విధాలతోనో

ఎప్పటి కపుడు ఖాళీ క్షణాల్ని నింపుతూ
అక్షర జగత్తులో అంతరంగ ప్రకాశంతో
శబ్దానికి అర్థం ఒకటే ముఖ్యం కాదు కవితలో
దైనందిన ఉపయోగాలకు భిన్నమైనదీ వ్యాసంగం

బయట లౌకిక నివాసం లోన అతీత మందిరం
ఎవరివి వారివి ఇష్టమైన గోడలతో తలుపులతో
ఇంటిముందు గేటు, ఎదురుగ వీధి దీపం రాత్రి వెలుగుతో
ఇల్లైనా! ఊరైనా! నగరమయినా! మనిషి, రాత్రి భయవశం

వాహనంలో ఒకరు, మిగతా సీట్లు ఖాళీగా ఉండొచ్చు
ఉపయోగంలో కాలం స్థలం ఇంధనం అవసరమొకటే!
లెక్కలతో పయనం సాగేనా? చిక్కులలో ఆగేనా?
సుఖ యానానికి వాహనం ఉత్తమమైన సాధనం

ఉక్కిరి బిక్కిరి చేసే పొగలతో కలుషితమై
వాతావరణం ఏమరు పాటున అపాయానికి
అవకాశం! కలగొచ్చు! సంతోషంలో స్పీడుతో
ముఖంలో నిశ్శబ్దం! నిటారుగా పర్వతంలా

బలాన్ని ఇస్తుంది! పయనంలో మౌనం
అలసటలో నిదుర తూగవచ్చు నిశ్శబ్దంగా
ప్రమాద క్షణం తెలియకుండ దూకవచ్చు
ఒంటరి మనిషి! సహాయ భుజం కోరేను

అంతవరకు దగ్గరయింది దూరమయిందనిపిస్తుంది
ఏ వ్యక్తీ ఒంటరి స్తంభం కాదు! సమూహ చేతనలో భాగం

14.

ఈ దేశం భారతీయ హృదయ బంధు ప్రపంచం
ఈ భూమి తలం! అందరి నివాస సంస్కృతి సందోహం
పరిమిత స్థల నిబంధనలు లేవు
ఇది అందరి జీవన ధన సంకలనం

ఎప్పటివో కొండ గుర్తు లిప్పటికీ వర్తిస్తూ
ప్రాంతం నుండి ప్రాంతం పరంపరలో కరుణమయం
మతం పేరు గతం పేరు బ్రతుకు పేరులో
ఏ స్థలం నుండి మనిషిని ప్రశ్నగ మార్చలేదు

ఎవరిది? పూర్వం ఏ గుహావాసం నుండి
ఎవరిది? ఇంతకు ముందు ఏ అడవి నిలయం

అందరిలో పురా రూప స్నేహసుందరమైన అనుభవం
మనిషికి సహజమైన మనుగడకు దారులు తీసేను
ఎవరో కొందరు నేర వార్తలతో కనిపిస్తే
అందరికీ ముందుగ! శిక్ష ఖరారు; విపరీతం

సుఖ జీవన భాగ్యం కయి దశ దశలో చరిత్రలో
అభిమానం అభిమతం అనవరతం మనిషిని వెన్నంటే
మనిషిలో ప్రేమ పూచిన జీవన మర్యాదల పరిమళాలతో
స్వాగతం స్వీకరణం మేళనం జీవన సహజం

ఇది తత్త్వ ప్రపంచం కానే కాదు
ఇది జీవన కార్యాచరణ వాస్తవం

మానవ కవచంతో అందరికీ సుఖమూ భద్రత
ఆలన పాలనయే మొట్టమొదటి ప్రభుత కర్తవ్యం
మంచి చెడు కోణాలతో జీవన చక్రంపై
నిరంతరం తిరుగుతుంది అగదు సమాజం

రాత్రి వేళ దివిలో మెరసే నక్షత్రాలు
పగటి వేళ భువిలో ఆశా రూపాలుగా
కష్టంలో నష్టంలో బాధలో మనుషులలో
అభినవ కళికలతో పునరుద్భవమొందేను

15.

ప్రతి మనిషికి భువిపై ఆధారం తప్పనిదీ
బ్రతుకులో దేశ వాసం ఎవరికైన ఉండేదీ
విశాల భూమిపై ఎక్కడైన ప్రాణం నిలుపుకోవచ్చు
ప్రాణ హాని ఉన్నప్పుడు రక్షణ భద్రత పాలకుల కర్తవ్యం

శ్రమ జీవన గతిలో సాగే బాధితుల మనసుల్ని
ఆపద తరుముతుంది, బంధుత దూరమవుతుంది
జిజీవిష మానవ జీవన శక్తికి నిదర్శనం
మారక భావానికి దగ్గరగా, శరణానికి ఆప్తంగా

విశాల తలంపై మనిషి మనసులో సూక్ష్మ రేఖలతో వ్యక్తిత్వం
సన్నని భేదంతో ఆలోచన కందుతుంది, ఆలోచనలో
వాస్తవ జీవితంలో దేశానికి మితమైంది, పౌరసత్వం
జీవన స్పందనతో మనిషి విశ్వమయం ప్రాధాన్యంలో

ప్రాణానికి ముప్పుతో సహనం మౌనం ఇరువైపులలో
రక్షణ కవచంగా నిలుస్తాయి, మానవ శక్తిని కాపాడతాయి

రివాజులు నీతులు నియమాలు శాసనాలు
ఎన్ని పేనినా ఎన్ని అల్లినా ఎన్ని అలలుగ విసరినా
సాధారణ మానవ ధర్మాన్ని విస్మరించడం, హేయం
హైజాక్ చేయలేరు, సమాజ బాధ్యతను వదలేరా?

జరిగేది జరుగుతూనే ఉంటుంది రాకపోకలతో
దేని దారి అదే అవుతుంది కాలాంతరాన చరిత్రలో
ఏ సమయం ఎవరికీ అక్షయ పాత్ర కాదు
అనుకునేవి జరగవు, అనుకోనివి పైబడతాయి

స్వేచ్ఛను బంధించి స్వతంత్రాన్ని విస్మరించి మనిషిని కుదించి
అభిలాషను అంతం చేసే ఆలోచనతో నిరంకుశం ప్రమాదకరం
అందరికీ ఒకే దుస్తులు ఒకే ఆలోచన, ఒకే వర్తనం
సమాజ వైవిధ్యానికి భంగం, మానవ వికాసానికి వ్యతిరేకం

16.

తెల్లవారితే మనిషికి మరో మనిషి ప్రమాదకరమవడం విచిత్రం
ఒకరు చాలు! రాత్రివేళ ఊరును జ్వాలాబంధం చేయడానికి
ఈ దృశ్యం చూచి కొందరు! ఉదయ ప్రకాశమని పలికేరు
మనసు లోని ఏదో కోరిక సాకారం పొందేనని సంతోషించేరు

రోడ్‌పై ప్రమాదంలో విలవిలలాడే
మనిషి బాధ! ఎక్కడైనా ఒకటే దృశ్యం
కవుల నుండి వేరు వేరు కోణాలలో కవితలలో
అన్నీ ఒక చోట కలిస్తేనే, పూర్ణత చేకూరుతుంది

మంచి చెడు అంచులతో మానవ సమాజ చక్రం
సౌహార్ధం కేంద్రంగా తిరుగుతుంది నిరంతరం
మౌన రాశి క్రియాశక్తికి సాధన మవలేదు
శిలా ఫలకం వలె నిలవచ్చు సూచనతో

ఉచితంగా ఏదేని సులభంగా వస్తే పొందే
తొందరలో మనిషి ఎంత కయిన తెగించేను
భూమిపై నడక నింగిలో ఆలోచన
రెండూ మనిషిలోని సహజమైన గుణాలు

రెండింటికీ మధ్య మనిషి మనో జగం
ఊహలతో దిశలను స్పృశిస్తుంది,
నేరమెవరిది? ముందు నిర్ధారణ మవసరం
ఉదార చరిత్రలో ప్రతిపుట మానవీయ సంపదతోనే

నేరానికి ముందు తీర్పుతో శిక్షను ప్రకటించడం న్యాయం కాదు
ఊహలపై అందరినీ ఒకే తాట కట్టివేసేరా?
మానవేతర మైనదేదీ సంఘానికి సమ్మతం కాదు
రాజ్యంలో చట్టం మానవీయ ముఖంతోనే సార్థకం

రెండు అలల మధ్య రెండు స్వరాల మధ్య
రెండు మాటల మధ్య నిశ్శబ్దం మౌనంగా
అది ప్రతి చర్యలో దేని కయిన దారి తీయవచ్చు
రెండిటికీ సిద్ధంగా ఉంచుతుంది ఆశ మనిషిలో

17.

కెరటం ఆగదు క్షణం నిలవదు
జీవన గమనం ఆగదు, దేని కోసమూ
వీటికి పగలు రాత్రితో నిమిత్తం లేదు
ఉదయం సాయం సంధ్యలు రాకపోకలకు ప్రతీకలు

దేశానికి రాజ్యాంగం నిర్దేశకం అదర్శం
వివరణ వ్యాఖ్యానాల్లో దృష్టి భేదం తప్పనిదీ
విషయం తెలియక కొందరు, అవగాహనలేక కొందరు
అన్వయంలో పరిమితులను దాటి, మరి కొందరు

ఇది తత్వ విచార చర్చ కాదు
అనుభవంలో సమాజ వాస్తవ శ్రేయం
వెలుతురు చీకటి రంగుల దుస్తులతో కాలం
అసలు రూపం తెలియకపోవడం సమస్యకు మూలం

పుట్టిన స్థలం మారదు ఆదేశం ఎప్పటిదే
పెరిగే స్థలం దేశం వేరు వేరు కావచ్చు
కావలసిన హంగులతో విశ్వ నరుడు కావచ్చు
ప్రాణం నిలిచే ఆకలి తీరే కోరికతో భూమిపై పయనం

దోష మేదయినా కానీ, నివారించే ఉపాయాల కన్న
మూలచ్ఛేదానికి పాండిత్య ముపక్రమిస్తూంది

ఊహలో కదలే వన్నీ కావలనుకోవడం భ్రమ
మాదిరి బొమ్మలు కారు వ్యక్తులు
యంత్ర మయం కాదు సమాజం

పౌరసత్వమెవరికి బడితే వారికి చెందేది కాదు
ఈ దేశ వ్యవస్థకు ఆధారం! రాజ్యాంగం తోనే

కనిపించేవి కనిపించనివి కారణాలు వశమై
ఏది ఎంత వరకొ అంత దాక జరుగుతుంది
జీవన సంగీత లహరి సోకవచ్చు
విస్ఫోట ధ్వనికి దారి తీయవచ్చు

18.

ఇపుడు దేశభక్తితో దైవభక్తి కూడా సమాంతరంగా
రైలు ప్రయాణంలో పట్టాలవే, జీవన రూపం
ఈ రెండింటిని మీరిన విమాన యానంలా మానవం
లౌకిక వాదంతో స్వేచ్ఛలో సమత నవత భవిత

వ్యక్తికి దేహంలా రాజ్యానికి దేశం
ప్రజలకు నైతిక బలమిస్తుంది రాజ్యాంగం

జీవన ఘర్షణలో అసహనం అశాంతితో
ఏ వైపుకు మరలాలో తెలియని స్థితులలో
ఏ దారి హితకరమో! తెలియని వేళలలో
సమాజ శ్రేయో భావనతోనే, ప్రజాస్వామ్య విజయం

నేరం శిక్ష రెండూ, జంటగ నడిచేవి
భద్రత రక్షణ నిచ్చే రాజ్యంలో బ్రతకడ మవసరం
కరుణ హృదయ సమావిష్కారం తోనే ప్రపంచశాంతి
ధూళి కణం లేని వాతావరణ మెక్కడుంది
మలిన రేఖ పడని జీవన రూప మెక్కడుంది
అని ప్రస్తుత విషమ స్థితికి లొంగనవసరం లేదు

మనసుకు నచ్చిన మతం సాహసం ప్రదర్శిస్తోంది
రెక్కలు విప్పుతూంది, గగనంలో తిప్పుతూంది
మధ్యలో జారిపడితే! బాధ్యత ఆ వ్యక్తిదే !
బ్రతుకుకు కావలసిన లౌకిక వాద ప్రమేయం
రెక్కలు విప్పుతుంది రాజకీయంలో తిప్పుతుంది
మధ్యలో జారిపోతే బాధ్యత ఆ నేతలదే !

'స్వ' భావనలో దేశం జీవితం సమాజం
పరస్పరం ఆశ్రయాలై చరిత్ర కెక్కేను
సీతువుకు ముడుచుకొన్న ఆలోచనలో హృదికి
సూర్యరశ్మి అవసరం! అది రాజ్యాంగ యుతం

అంతరంగం భాషిస్తుంది ప్రతి వ్యక్తిలో
వినే ఓపికలో తీరికలో స్పందనంతోనే సాధ్యం

19.

ఇంత వరకు పూర్తిగ వినని మాట వినబడుతూంది
ఈ దేశమెవరిది? ప్రాణానికి హానిలో క్షేమం ఎక్కడ?
పేదరికంతో పాటు జీవన బాధతో నిరంకుశ పీడనలో
తాపంలో నీడలా ఆదుకునే ఉదార ప్రభుత ఎక్కడ?

పైకి కనిపించే మనిషిలో మరో మనిషి! అంతరంగ స్పృహలో
ప్రేమ కరుణ రెక్కలపై స్థానం మారేనా? మానవ మెక్కడ?

నూయిలోకి చూస్తే దాహం తీరే జలం లేకపోలేదు
ఆర్త ముఖాల మధ్య ఆర్ద్రత ! రాళ్ళ సందునుండి ఉబుకుతూంది
దృష్టి పడిన కళ్ళలో జలబిందువు ఊగవచ్చు
కదలే ఊహలో నీలిమేఘ శకలం కదలేనా?

బావిలో అడుగున నీరు కనిపిస్తే సరిపోదు
పైకి చేది ఆర్తుల కందించే చేతులవసరం
ఈ చర్యల తోనే బావి ఉనికి సార్థకం
ఉన్న జలాలతో ప్రాణం నిలిపే అవకాశం!

పేదరికం తోడుగా నిలువ నీడ గురించి బాధ
క్షోభలో మనసు అగ్ని రూపం పొందుతూంది

రాజనీతిలో కటుచర్యలు ప్రశ్నలకు గురి అయ్యేను
సమస్య ఎండిన జల కళతో బావురు మనరాదు
ఎవరి బ్రతుకైనా నెరియలు పడిన పొలం కారాదు
ఇది బాధిత జన మూలాలను వెదకే సందర్భం కాదు

తగిలిన గాయాలకు ఉపశమనం సత్వర చర్యలతోనే
సానుభూతి వెనక నుండి చీకటి కమ్మిన
మనిషిలో! రవిదో శశిదో కిరణం సోకేనా?
అదర్శం కల్పనలో వేలాడుతూ కనిపిస్తే సరిపోదు

విశాల జనత కన్న నేతకు ప్రాధాన్యం
నిరంకుశ చర్యకు ఊత మిస్తుంది
అద్దంలో కనిపించే ముఖంలా! అందంగా ప్రజాస్వామ్యం
లోన మనోరూపం! అశాంతి దృశ్యంతో నీరు తగ్గిన బావిలా

20.

మెట్టలో ఊరుకు చెరువు, జీవన ఘన సంపద
ప్రాణానికి ఆధారం బావి అయినా, చెలిమ అయినా
ఈ మూడు తంతెలపై పల్లీయుల బ్రతుకులు
వాగులు వరదలు రాబడితో ఇబ్బడిగా

నదీనదాలు చల్లని చూపు సోకని చోట
జలధారల యోజనల పరిణామంలో తెలంగాణ
మ్రోడు రూపం ఎత్తే ఎండిన జీవితాన్ని
చివురింపగ చేస్తుంది సమార్ధ కళతో

చెరువులు ! స్థానిక సంపదలో భాగాలు ఆశ్రయాలు
జీవన స్థితులను కాపాడే జల వికాస దాతలు

ఊరుకు చెరువులు దేశానికి నదులు ప్రపంచానికి సముద్రం
వివిధ దశలలో సంస్కృతుల వికాసాలకు ప్రేరణలు
సమాజానికికవసరమైన శ్రమ కళను పెంచేను
మానవ చరిత్రలో యశోకేతనాన్ని నిలిపేను

ప్రతి మతిలో దేశాల హద్దులు తుడిచేసే ఆలోచనలు
ప్రపంచాన్ని అరచేతిలో బంధించే యోజనలు
నదులు గిరులు జనపదాలు నగరాలు దాటి మనుషులు
భూమిపై స్వతంత్రంగా ! ప్రకృతిలో భాగమై బ్రతకాలనే

చెరువు కట్ట! ఊరుకు వెన్నెముక అయింది
మనిషిని నిటారుగా నిలబెడుతుంది! దృఢంగా
ఊరుకు పలువైపుల రక్షణలు బాల సముద్రాలు
ప్రాణాల్ని నిలిపేవీ, ఆర్థిక స్థాయిని పెంచేవీ!

ఓట్ల రాజకీయం కోట్లాటలలోకి ప్రవేశించి
సమాజాన్ని చీకటిలో అశాంతికి గురిచేసేను
బహు సంక్లిష్ట స్థితులలో మ్రోడు ముఖం సుమింపజేసేను
ఆశావికాస యుతం కవితా రూపం! రేపటికి రిజర్వులో

21.

గాలి శూన్య హృదయంతో వీచదు
ఏవేవో! నింపు కొనే వస్తుంది
అందరికీ తరతమ భేదాలు లేకుండా
ఏదో ఒకటి అందిస్తూ పోతుంది

మాటలో! పరిమళాలో! వార్తలో! ధ్వని సూచనలొ
ఎవరు వినినా వినకపోయినా! మనుషుల్ని స్పృశిస్తూ
అనుకూలమొ ప్రతికూలమొ ఎవరి కిష్టమయినా కాకపోయినా
వడగాలి అయినా శీత వీచి అయినా ఆటంకాల్ని దాటుతూ

స్వేచ్ఛలో భావ జాలానికి సంకేతమై
ఆఖరికి ధూళి కణాలతోనో, పొగలతోనో
ప్రకృతి సహజ పరిణామ దశలతో
బ్రతుకులో గాలి! అనివార్యమై చరిస్తుంది

శూన్యంగా వచ్చిన మనిషి లోకం లోకి
ఎంత అనుభవ సంపదనో వదలి వెళ్ళేను

మంచు కరగడ మంత తేలిక పని కాదు
అందుకు తగిన రవి రశ్మి సోకడ మవసరం
అపుడు ఆర్ద్రమై కదలుతుంది సరిస్తుంది
మనిషిలో ఆయువు రాగం వినిపిస్తుంది

చీకటి కొండను తలపించే నిద్ర
కను రెప్పల కేమాత్రం బరువు కాదు
ఎన్ని కలలనో వహించే మనస్సు క్షణంలో
అన్నిటినీ వదలేసి మెలకువ లోకి వస్తుంది

బొంగరంలా తిరుగుతూ తిరుగుతూ ప్రతి బ్రతుకు
వెళ్ళివెళ్ళి నిలిచేది! సముద్ర జలాల తీరానే
కన్నీటి బిందువు వెనకనున్న
తుపాను ముందు నిశ్శబ్దం! కనిపించకపోవచ్చు
ఆపై సమాజ తలంపై తెలిసేది
అనుకోని బీభత్స ముద్రలతో దృశ్యం

22.

ప్రక్రియలో ఏదీ మౌన ముద్ర వహించలేదు
నిరంతర శబ్దమయం! వాతావరణం సూక్ష్మ స్థితులలో
శ్వాస చర్యచే ఆయువు దీర్ఘీ కృత మవుతుంది
గోడకు వేలాడే క్యాలెండర్ కాలిక స్పృహ కలిగిస్తుంది

ఎంతటి బాధలోను వ్యధలోను కాలం ఆగదు
జీవితం యధావిధిగా సాగి పోతూనే ఉంటుంది

విత్తు మొలకెత్తి శాఖోపశాఖలుగా చీలుతూ ఎదుగుతుంది
ఇది చెట్టుకు ఉపకృతియే! వ్యతిరేకం కాదు
దేని కది స్వతంత్ర దిశలలో పెరిగేను
సమాజమూ అంతే! విభేదాలు వైరుధ్యాలు తప్పనివీ
ఇది భిన్నత్వంలో ఏకతను ప్రదర్శిస్తుంది
ఎవరి బాట వారిది, అంతా కలిసిన స్వతంత్రం అనుపమం

సమాజ శక్తిలో మానవం, అతీత భావనలో దివ్యం
ఎప్పటి నుండో మనుషులలో కలిసి సుందరంగా
సమ భావనతో మిత్రతయే! శత్రుతకు దూరంగా
రోజూ కనిపించే సూర్యునితో పరిచయ మెప్పటిదో
ఏ రోజు కారోజు సరికొత్తగ చూడాలని కోరిక

ఉదయం విప్పారిన నెమలి పింఛంలా కనిపించాలని
విరిసిన ఇంద్ర ధనుసు రమణీయంగా ఉండాలని
విప్పిన కాల సర్పం పడగలా ఎదురు కావచ్చు
పై నుండి విహగం తెచ్చే అమృత కలశం తలపించవచ్చు
ఏదయినా సాధ్యమే! ఇది జీవన స్థితి సూచన ప్రకృతిలో

జీవన గమనంలో ప్రాణానికి హానికర స్థితిలో
ప్రశ్నలతో నిషేధాలతో వేధించడం దారుణం
నిబంధనలతో ఉక్కిరి బిక్కిరి చేయడం నిరంకుశం
కష్టంలో నష్టంలో కరుణ కవకాశంతోనే మానవం

23.

ఒక వైపున సంఘంలో మానవ గుణ వాస్తవం
ఇంకొక వైపున అతీత భావనతో భ్రమణం
ప్రశ్నలకు జవాబులతో ఎవరూ తమ బ్రతుకులలో
తరాజులో వస్తువుల్లా తూగాలని అనుకోరు

మాట బాట ఊహ నీతి కలిసిన రూపం
శిఖరాల మధ్య సంశయాల లోయలు దాటుతూ
విలువల నిర్ణయం మానవీయ ప్రమాణాలతోనే
మనిషిని గుర్తించడం మన్నించడం మొట్టమొదటి కర్తవ్యం

ప్రజాస్వామ్య విజయానికి ఆధార తలం
జన హిత భావనతో ఉత్తమ సంస్కృతి కారణం
గోడలు లేని నిలయం బయలుతో సమానం
వ్యక్తులలో ఎవరి గోడలు వారివి! అవసరాలలో

తప్పిపోయిన మనిషి! ఎక్కడో ఏ ఊరులోనో
ఏ వీధిలోనో! ఏ ఇంటిలోనో, ఉండొచ్చునన్న
సమాధానంతో ఊరకుండ లేదు మనసు
ఆచూకీకయి చూచేందుకయి ఆరాట పడుతుంది
తనలో భాగమయింది తిరిగి పొందాలనీ ఉంటుంది
వ్యక్తి పరిధి నుండి సమాజ క్షేత్రానికి పయనించేను

లోకం దైవం రెండూ నాణెం ఇరు వైపుల
భౌమం అతీతం చే సూచిత మవుతాయి
ఇవి జీవిత విశాలతను పెంచేను సార్థకం చేసేను
కన్నీరు బిందువు వెనక! జలధి ఘోష తునక! వేలాడుతూ

దారులన్ని మూసి తన దారి ఒకటి చాలునన్న
నిరంకుశం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకం

ఈ భూమిపై ప్రతి దారి, పయనంలో అందరిదీ
ఎవరికెపుడు ఎట్లా ఉపయోగపడేదీ వారి స్వంతం

24.

భువి నుండి తెల్లవారే ముందు కోడికూత
దివిలో కనిపించని సూర్యుని మేల్కొల్పేనా?
మంచు కప్పిన లేత కిరణంలా
మనుషులు ఉదయమయినా! వీడని నిద్రలో

తెలవారడంతో తెలివికి పదు నెక్కుతుంది
వెలుతురులో విపణి శాల తెరవ బడుతుంది
ఇది పూర్తిగ అంగీకృతి కాని మాట వాస్తవం
ప్రజల కదలికతో చేతన సాకారం పొందేను

ఇచట అమ్మబడని వస్తువు లేదు
లాభం అనిపిస్తే బేరం కుదిరితే
ఉపయోగం అయితే బయటికి తెలిసినా
రహస్య ప్రకారమయినా! ఆగదు సంరంభం

స్వేచ్ఛలో స్వతంత్ర మయిన అస్తితల వికాసంతో
సహభావం సహకారంతో వైవిధ్యం! అనివార్యం
దీనితో సంఘంలో ప్రతి వ్యక్తి తనకు తాను
ప్రత్యేకం ! అనుకోవడం జరుగుతుంది సహజం!

జీవన శీలం ఒక వైపు నుండి
దార్శనికం ఇంకొక వైపు నుండి
కలిసిన ప్రజాస్వామ్య సమాజ వర్తనం
శిశువు చేతులలో బంతిగ మారే జాబిలి

ఎండ కాస్త మండితే చినుకుకై ఆరాటం
వాన కాస్త ప్రబలితే ఎండకై ఆవేదన
మనిషిపై ప్రకృతి ప్రభావం ప్రత్యక్షంగా
కవితలో భావ ప్రపంచం అభినవంగా

ఎన్ని కవితలు వెడలినా, ఏ రోజునకారోజు
అదే! మొదటిదిగా! ఆత్మీయం నిలుపుతుంది

25.

మాటలు పాతవి, వాటి అమరిక కొత్తగా
మట్టి పాతది, ప్రతిమల రూపాలు కొత్తవి
ప్రదర్శనలో ఆకృతులు, ఊహకు తోచినన్ని
వివిధ ప్రదేశాల సంస్కృతుల సమాగమంతో మనోజ్ఞం

అనుభవ సుందరమయిన కవిత! మనోవేదిపై
వినగానే చదవగానే ఆ క్షణాన
అపూర్వమేదో! చేరినట్లు అనిపిస్తుంది

ఒకదాని కొకటి ఎదురుగా ఎసెంబ్లిలో పార్టీలవలె
ఒకదాని పక్కన ఒకటి! అనిలో మిత్ర గణాల వలె
రోజు నడుస్తుంది చదరంగం లానో వైకుంఠపాళి లానో

మనిషి గురించి మనిషిలో ఆలోచన! పరిచయంతో
విభేదాలు విశేషతలపైనే మొదట చూపు తిరుగుతుంది

దాహంతో బయటికి చాచిన దోసిలిలో
చినుకుల రాశితో తృప్తి చెందవచ్చు

తన వరకే దోసిలి మాత్రంగా కురిసి
సంకుచితం లేని వాన ఆగి పోయేనా?

పూలు సమర్పించేందుకు దోసిలితో పాత్రలు
ప్రేమ! సమర్పించేందుకు, గుండె ఒకటె పాత్రంగా

ఇంటి ముందు నిత్యం చూచే చెట్టు పరిచయంతో
తానొక చెట్టుగ మారాలనిపించవచ్చు ఒకరికి
ఇది కల్పనలో సాధ్యం! కవితలో అక్షర బింబంగా
పోల్చరాని బదులు లేని మనిషి జీవితం స్వతంత్రం

ఒకరొకరికి ఒకటొకటి! అవాలని! సర్పమో శిలయో
ఒకరికి గరుడునిపై ఒకరికి గిరియొ నదియొ మరొకటి
అన్నిటికీ వాంఛా మూలం మనోమయం, జీవగతం
అందరి కోర్కెలు బయటికి వస్తాయి! చర్యల రూపంలో

26.

మనిషికి మనిషి పరిచయం అయితే
ఇది ఏదో ఔపచారికం కాదు, సాధారణం కాదు
సూక్ష్మస్థాయిలలో ప్రభావంతో దేని కది ప్రత్యేకం
కొత్త ప్రపంచ మొకటి తనకు తెలియడమన్నమాట

మనిషి చూపు మను ముందుగ ఆకృతి నలంకరిస్తుంది
ఊహలో మనో రూపం తోచినట్లు ఏర్పడుతుంది
అనుకోకుండా జీవిత రేఖలు విస్తృత మవుతాయి
కొత్త రచన పుస్తకం చేతి కందినట్లు ఉంటుంది

సృజనలో కవితకు పలు స్పందనలు పనిచేస్తాయి
లోలోపల నిశ్శబ్దంగా ప్రక్రియ సాగుతుంది
సూక్ష్మగ్రహణ పటువులకు కొందరికి తెలుస్తుంది
ఇతర వ్యాపకాలలో కొందరికి దృష్టి పడదు

భూమిపై నీది నాది పంపకాల విభేదాలు వైరాలు
తరతరానికీ మారే నిర్మాణాలు, వికాస రూపాలు
మనుషుల మానస క్షేత్రాలకు హద్దులు చూపేను
లౌకిక జీవన వలయాలను విస్తృత పరచేను

ఉదయం ఒక చేతిలో టీ కప్‌తో
మరో చేతిలో సెల్ ఫేస్ బుక్ తో
మార్పును కోరే మతిని తృప్తి పరచేను
ఊహ తిరుగుతుంది విశ్వ వ్యాప్తంగా

బాధలో వ్యధలో కవిత పైకి వస్తుంది
విరిసిన పూవులానో, ఎగిరిన నిప్పులానో
మనిషికి తోడుగ మనిషిలో ఈ రెండూ
పరిమళ వీచిగనో, జ్వాలా సమంగనో

వద్దంటే వదలేది కాదు మట్టితో అనుబంధం
కాదంటే పోయేది కాదు సమాజ ప్రభావం
ప్రేమ కరుణ సానుభూతి ఉదార భావనతో
హృది తలుపులు తెరచినపుడె! చరిత్ర అస్తిత

27.

లలాటాన ప్రజాస్వామ్యం పట్టికతో సమాజం
ఊహలో చర్యలో నీతి మాలిన జీవన రుచితో
నడుస్తూన్న చరిత్రలో విషమ వికృత ఘటనలు
విసరిన చీకటి పీలికలయిన క్షోభాకుల చిత్రం

ఇది తత్కాలానికి పరిమితమే కావచ్చు
పరుగెత్తే రైలు ఆగే స్థితి ఏర్పడుతుంది
పూర్తిగ ముంచేసే దిగులు సుడుల నుండి
ఆశల తరగలపై కదలడమొక అవసరం

పాయలు పాయలుగా పడియలు పడియలతో
ఆలోచన బిగిసి బిగిసి ఆదర్శం గడ్డ కట్టి
తరగి తరగి కదులుతూంది పురోగమన వేగం
ఆగి ఆగి సాగుతూంది సమాజ ప్రవాహం

స్థానీయం విహరణలో ఎన్ని రెక్కలు చాచినా
వెనక నుండి సంస్కృతి పడగ లెన్ని విప్పినా
మనుషుల పరిచయం విశ్వ భావ సహ రేఖలతో
ఆంతర గంధంతో వెలుగులతో మానవతా మయం

ఉదయాశయ లిప్త నుండి
నిర్ని రోధ సూర్య రశ్మికై
మనుషులెదురు చూచేరు
బ్రతుకుపై ఉత్సాహ కళతో

ప్రశ్నకు సరి అయిన జవాబు తోనే
వేగ మందుకుంటుంది జీవన యానం

పెను తుపాను దూరాన విసరి వేయ వచ్చు
భూకంపం భయ పెట్టవచ్చు, ఆపవచ్చు
తిన్నగ సాగే బాట మలుపు తిరిగి
తెలియని కొత్త జగం లోకి దింపవచ్చు

28.

రాత్రి పైకి చూస్తే చుక్కలు మాట్లాడతాయి
పగలు దృశ్యంలో చెట్లు మాట్లాడతాయి
ఇక మనుషులు సరే సరి! ఎచట బడితే అచట!
మనసు లోని మర్మంచే చుట్టబడీ దాచబడీ

జీవన సందర్భంలో ఒకరొకరివి నిప్పత్తులలో
శ్రమ విలువలు కలిసిన రూపం ప్రజాస్వామ్యం
దృష్టికోణం రేఖలు వేరు వేరయి గమనంలో
మంచి చెడుల మధ్య హద్దులు చెదరేను మారేను

పయనంలో దిశ దిశ దారులలో స్వేచ్ఛగా
సమభావం! సహగతిలో సమత నవత కోరుతుంది

గుహ నుండి మనసును బయటికి రప్పిస్తుంది కవిత
విశాల జీవితంలోని విశ్వమయతను చూపుతుంది
అవసరాలకు మించిన సంపదపై ఊగే
వ్యక్తిని అవనిపై బాధ్యతతో నడిపిస్తుంది

రాత్రికి చల్లబడి సుఖకరమయ్యే ననుకుంటే
చుక్కల వెలుతురులో వెళ్ళేదారి సుగమంగా
కంటికి కనబడవచ్చు నని అనుకుంటే
చూపులో నిప్పు కణాలు మెరసేను
భయం వేసి నడక మందగిస్తుంది
అవనికి దిగే లోపల బొగ్గు ముక్కలుగా మారేను

ఎప్పుడేది జరిగేది తెలియని సందర్భాలెన్నో
అవకాశం దొరికితే చాలు మనసులో చేరతాయి

మొదటి అడుగు శూన్యం నుండి మొదలవుతుంది
చివరి అడుగు అనుభవ పూర్ణతను కోరుతుంది

భయం పాదు నుండి పెరిగే
అనుమానం తీగెకు ఏ చేట్టం పూచేదీ,
ఏ విలువల ఫలాలను ఇచ్చేదీ
ముందుగ ఎవరికీ తెలియని రహస్యం!

29.

కవితలో చివరి వాక్యం
బ్రతుకులో చివరి ఊపిరి
రోజులో చివరి కిరణం
మలుపు తిరిగే చివరి చిహ్నం
నవ జగతికి తెరచిన ద్వారం
మనస్సు మార్పుకు సిద్ధ మవుతుంది

మరో క్షణం తమోమయం భయ మనిపించవచ్చు
చాంద్రీ స్నిగ్ధ మయిన ఆర్ద్రత కవకాశ ముంది
చల్ల బడిన వాతావరణంలో కమనీయమైన స్పర్శ
భౌతికాన్ని హ్లాదంగా ఆద మరవ జేస్తుంది

శూన్య మయిందను కున్న బ్రతుకు
సంస్మృతి పూర్ణతను పొందుతుంది

కదలని పర్వత మెప్పటిదో
శిలల మధ్య విగ్రహాలతో
ఆగని ప్రవాహ మెప్పటిదో
ప్రాణుల దాహార్తిని తీరుస్తూ

మనుషులు మాత్రం తరం నుండి తరం కొత్తగా
పరిమితమౌ ఆయువుతో కాలానికి వశమై

జ్ఞాపకాలు పరంపరా గతమైనవి
నీలి మబ్బుల వలె ప్రియ భావనతో

ఒక ఘటన ఎపుడో! జరిగింది ఇపుడు
పాత్రలవే ప్రతీకలతో వేరువేరు మనుషులు

రాత్రి కలలో దహన కాండ దృశ్యం
ఎప్పుడేది ఎదురు పడేది తెలియదు
కవితలో ఉదయం మెలకువలో
సృజన సర్గ పొందవచ్చు, అభినవం

మొదలైంది చివర అంటూ ఎరగదు
కాల చక్ర భ్రమణంలో ఇది అక్షర దృశ్యమయం

30.

మనుషులు భువిలో నిలిచేరు అవసరంలో!
మబ్బులు దివిలో ఏ ఒక చోట నిలిచి పోవు
క్రింద పైన భౌతిక మానస స్థితి సంకేతాలు
అక్షర జగత్తులో సంస్కృతి శిఖరాలపై నడిపిస్తాయి

అక్షరం భరించలేని వస్తువు లేదు
అక్షరం సహించలేని భావన లేదు
తరగల పై నావలా కదలేను
గాలిలో పూవులా తరలేను

దూది పింజల వలె తేలి పోవచ్చు
చెట్ల ఆకులవలె రాలి పడవచ్చు
బ్రతుకు లోన మార్పులు పలు విధాలు
ప్రకృతి లోని స్థితులను తలపిస్తాయి

విధ్వంసం పై ఒకరి దృష్టి ఎప్పటికీ
కొత్త దనంలో సృజన దృశ్యం కోరుతూ
నిర్మాణంలో ఒకరి దృష్టి ఎప్పటికీ
పాత వాటిపై మన్నన కొనసాగుతూనే

ఎక్కడి నుండి ఎక్కడి కెవరు ఎపుడు చేరిందీ
అద్దంలో బింబాలవలె చరిత్రలో కనిపిస్తాయి
మనిషిలో మరో మనిషి దేని నీడ బొమ్మ కాదు
అంతరంగ ప్రకాశంలో అంతర్వీక్షణ రూపం!

తుపాను గాలికి ఊగి ఊగి నిలిచిన చెట్టు
కొత్త వాలకం తయారులో ఉండి తీరుతుంది
అడవిలో ఊరులో రోడ్డుపై నగరంలో
బాధ ఒకటే! చెదరిన వికీర్ణ స్థితి ఒకటే

చెట్టు నీడ తాను నడవాలని ఆరాట పడుతుంది
శిల్ప ముఖం పలకాలని ఉత్సాహ పడుతుంది
నడుస్తూ పలుకుతూ సాగే మనిషిలో కోర్కెలు ఒకటొకటీ
ఏ రోజు కారోజు ఆశకు బలమిచ్చే రిజర్వులో కొన్ని

స్వేచ్ఛా కవిత్వం - 110

అక్షతం

మాదిరాజు రంగారావు

2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SWECCHA KAVITHVAM

Telugu

NO. 110 AKSHATHAM

Free - Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2020

Presented to
my Son
Dr. M. Santhosh Kumar
with blessings
on hisBirthday

కవి మాట

ఈ కృతి 'అక్షతం' మూడు భాగాలుగా ఉంది. (1) లాక్‌డౌన్ (2) "స్వాగతమిస్తుంది", (3) "సెలవు లేదు" ఇది మూడు విధాలయిన వర్తమాన స్థితి స్పందనం చిత్రణం వివేచనతో రూపొందింది. ప్రస్తుతం నడుస్తూన్న కాలంలో వివిధ దృష్టి కోణాలొకచోట కవితా రూపాన్ని పొందాయి. కొన్నిచోట్ల చిన్న చిన్న విభాగాలతో ముక్తకాల్ని తలపిస్తాయి. సామాజిక సూత్ర బంధంతో ఒకటిగానూ భావింప జేస్తాయి. ఇవి వర్తమాన స్థితులలో మానవీయ ప్రకాశంతో దర్శనమిస్తాయి.

ఇందులో ప్రధానంగా భౌతికమైన ఆవరణంపై కన్నా ఆంతరమైన విషయాలోకనం కనిపిస్తుంది. ఇది హేతు దృష్టితో మానవీయ దార్శనికంతో రామణీయతను పొందింది.

మొదటి భాగంలో "కోవిడ్"లో క(కొ)రోనా వైరస్ ప్రభావ స్థితులు దృష్టికి వస్తాయి. మనిషిలో సంకల్పంతో పాటు అన్వేషణ శుభ్రమయిన స్వచ్ఛమైన జీవన రూపంలో వివేచనతో సాధించే ప్రయత్నం అవసరమన్న భావన స్థాపితమయింది. రెండో భాగంలో వర్తమాన జీవన గమనంలో దృష్టికి వచ్చే విశేష స్థితులు విషయ మర్యాదను పొందాయి. సాధారణ జీవితంలోని బాధలు, వేదనలు – కళాత్మకత – ప్రయోజనం తలపుకు వస్తాయి. మొత్తం మీద aesthetics కు సంబంధించిన ఆలోచన ఆయా సందర్భాల్లో స్ఫుటంగా కనిపిస్తుంది. రచన అభివ్యక్తిలో అనుభూతి కళతో పాటు సమాజ ప్రయోజనం విశ్లేషణ కందుతుంది.

కవిలో దార్శనికత ప్రజాస్వామ్య సామ్యవాద మార్గాన్ని వరించింది. భావ నవ్యతకు ప్రాధాన్యంతో ప్రతీయమానాన్ని కలిగింది.

కవిత్వ విషయంలో ఏ కవి అయినా సృజన రూపంలోని అనన్యాన్ని అనితరాన్ని అపూర్వాల్ని అందుకొని వివేచనకు పూనుకోవడం అవసరం. ఇది సద్విమర్శకు దారితీస్తుంది. మంచి విలువలను స్థాపిస్తుంది. కవి తనలో సృజన సమయంలో పొందిన అనుభవ విశేషాన్ని పాఠకుల్లో బింబింపచేసే ప్రయత్నమే అభివ్యక్తి రూపం.

సాహిత్య పరిణామ చరిత్రలో స్వేచ్ఛా కవిత్వం సామాజిక దృష్టితో సాంస్కృతికమైన విలువలతో ప్రగతి పథంలో తనదైన పాత్రను నిర్వహించింది. తన ప్రత్యేకతను నిలుపుకొంది. ఆధునిక తెలుగు కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది.

ఈ కృతి 'అక్షతం' వర్తమాన స్థితుల్లో మౌలికమైన రూపంతో, హాని పొందనిదీ శ్రేయమయిందీ. కష్టాల్లో బాధల్లో నిలదొక్కుకొని నిలిచేదీ జీవశక్తి కలిగిందీ, వ్యంజితం. ఇది కవిత్వంతో పాటు మానవ జీవితానికీ వర్తిస్తుంది. ప్రయోజన పథంలో సుందరమైన జీవన యానంలో మధ్య మధ్య ఎన్ని అంతరాలు ఏర్పడినా అవాంతరాలు ఎదురయినా స్వేచ్ఛాకవిత్వం "Living representative of the undivided humanity of the world".

– మాదిరాజు రంగారావు

లాక్‌డౌన్

I.1

ఆరోజు ఉగాది ఆగమనం
"శార్వరి" వత్సర వసంత ముఖంతో
'కోవిడ్'పై ఈ దేశ విధానం
లాక్‌డౌన్" కర్ఫ్యూతో శిఖర సమం

ఒకరి నుండి ఒకరు ఎడంగా ఉండాలిసి వచ్చే సమయంలో
ఎందరో బాసటగా నిలవడమొక మహనీయ గుణం
క(కొ)రోనా వైరస్ గొలుసు కట్టు ఉనికి ఛిన్నమై, అదృశ్యమై
బ్రతుకులు సామాన్యానికి చేరేనని ఆశ, మనిషిలో

సమస్య భద్రతలో 'క్వారెంటైన్'కు తరలింపబడే
వెడలే నిదాన క్రమంలో పరిష్కార ప్రయత్నాలు
హఠాత్తుగా ఆగిన సమాజ గతిలో సుస్వరత
చెట్టుపైని కోకిల స్వరంలో వినగలిగేమనే

హృదిలో శాంతి కమలం ముడుచుకొని
ఉత్సవ స్పృహలో సంతోషం రేకులు విప్పారేను.

జటిల ప్రశ్నగా మారిన కొ(క)రోనా ప్రమాదం
ఒత్తిడిలో మనసును దిగులు లోయలోకి దింపేను
ఆనందం శాంతి రెండూ అనుభవంతో తెలిసేవీ
ప్రశ్న గురించి తెలియని పండుగ కెదురుగా కోవిడ్

కరోనా ప్రమాద కణం సూక్ష్మదర్శిని పరీక్షలో
పూర్వపు రాణుల పూల కిరీటాన్ని తలపించింది

ఆకుల లో నుండి బయటపడి కొమ్మపై కోకిల
జన ప్రియ స్వరంతో సమాజాన్ని అలరించేను
నింగిని రెక్కలారుస్తూ ఎగిరే పారావతం
జనహిత రాగంతో శాంతి పథం సూచించేను.

ఆవ గింజలా మొదలైన వైరస్ భయం
గుమ్మడి కాయగ మారుతుంది అనుకోకుండా
మనసుకు మోయలేని బండరాయి అవుతుంది
దేహం గేహానికి పరిమితమై హృదయం విశ్వ మయమవుతూంది

I.2

స్వేచ్ఛను హరించినట్లు పైకి తోచే నిబంధనం
భవితకు భద్రమైన సుగమయానం తెలుపుతూంది
శుచితకు స్వచ్ఛతకు కట్టుబడిన బ్రతుకులో
వ్యక్తులు తమ తమ గమ్యంతో పయనం తప్పనిదీ

ఒంటరి నుండి సంఘానికి విజయ లక్ష్యంతో
ఎవరేమి అయ్యేదీ సాధించేదీ ఆ పైనే తెలుస్తుంది
మనముందు వీచే గాలి స్నిగ్ధ స్వరం వినిపించాలనీ
విపదలో తెరచిన క్వారెంటైన్ తలుపులు
మూత బడాలనీ, మనిషి జయం చూడాలనీ

ఇది ఆయుధ ప్రయోగానికి వీలయింది కాదు
చండ సైనికుల్ని పంపి వశం చేసుకునేది కాదు
శుత్రుతలో బల పరీక్షకు నిలిచేదీ కాదు
మనిషి స్వీయ వర్తనలో శుభ్రత వివేకంతో సాధ్యం

చెదరిన ధైర్యంతో ఈ విషమ సమయంలో
భయాక్రాంత మయిన స్థితిలో సమాజం
తమకిది సోకేనేమో అని అనుమానంతో
అడుగు తీసి అడుగు వేయ జాలని మనుషులు

ఎవరిపైన ? ఈ అనుకోని రణ సన్నాహం
అంటే ! కనిపించని గతితో క్రింగే వైరస్ పైనే

చెడుపై పోరాటం వ్యక్తిలో కర్తవ్యం
జన రక్షణ వ్యూహం ప్రభుత్వ బాధ్యత

మనుషుల్ని బాధకు గురిచేస్తూ ఈ వైరస్
కాలాన్ని తన వశం చేసుకున్నట్లు అనిపిస్తుంది

మరో జన జీవన శైలితో, నిశ్చయంతో
'కోవిడ్' పై సమాజ విజయం ! తప్పదు
అన్నిటిలాగే కొన్ని భయదమైన
మారకాల సుడులతో మహామారి ముగియవచ్చు

I.3

ఎవరు కాదనకున్నా ఎవరు ఇష్టపడకున్నా
ఎవరు కనులు మూసుకున్నా
సాయం వేళన చీకటి
చిత్రం ! విషాద వర్ణంలో
కనిపిస్తుంది! అనుమానంలో ముంచుతుంది
స్థానంలో మార్పుతో కోణంలో దృశ్యం ! వేరవుతూంది

ఎంతగానో సుఖ సంపదలను పోగుచేసి
పీఠంలో మలచుకొనీ శిఖరంపై
దేనివలనొ ! బాధ తప్పదు, వేదన ఆగదు
రెండూ చివరకు కావడి కుండలుగా మారేను

ఏడాది కొకటి రెండు మారులు వస్తే రావచ్చు
విసురులతో కసురులతో శత్రువులా తుపాను
ఎదురుపడిన వస్తువుల్ని తీవ్రంగా తాకి
కదలిస్తూ ఎత్తుక పోయే ఉద్దేశం కనిపిస్తుంది

"లాక్ డౌన్" తో 'కోవిడ్' కట్టడి జరిగేననే
మనిషి ప్రజ్ఞ ముందు శక్తి రహిత మవుతుందనే
కాష్ఠంలా రగిలే ప్రాణాంతక మయిందిక
మహామారి ఆగేనని నమ్మకం తగిన చర్యలలో

ధైర్యం కోల్పోయే బ్రతుకుల విషాద దృశ్యాలతో
విలయ చిహ్నం వైరస్! మృత్యువు తలుపులు తెరచేను

ఎవరికి వారు అంటకుండ జాగ్రతలతో
ఉపకృతిలో సాయంకై ఎవరు ముందు కొస్తారు

పూర్వమెన్ని ఉపద్రవాలు రాలేదనీ ప్రశ్న
వాటిలో ఇదొకటిగా మౌన పాత్ర సరిపోయేనా?
గతంలోని అనుభవాల పాఠాలు స్వీకరించవచ్చు
వర్తమాన స్థితిలో ప్రయత్నాలు విధిలో భాగాలు

I. 4

చెడుపై పోరాటం అదీ! బ్రతుకులు మ్రింగే దయితే
విషయంలో చెదరని సావధాన మవసరమవుతుంది
విలయాన్ని జయించే శక్తి ఉంది సృజన చేతనలో
వ్యక్తుల మధ్య సామాజిక దూరం ! ముఖ్యంగా

జీవన శైలిలో పూర్తిగ మార్పు
మనుషుల లో మారక దశను తొలగిస్తుంది.

ఇది మానవ శక్తిలో జిజీవిషను పెంచుతుంది
శుభ్రతతో లోకహితంపై దృష్టి ఈ సమయంలో తప్పనిదీ

ఇది శత్రుదృష్టికాదు వ్యక్తుల అస్తితలను కాపాడడమే
‘నమస్తే’ పదం ప్రియమై అభయమై దశదిశలు మ్రోగవలసిందే

అటు వసంత పర్వ సంరంభంలో తెలుగు ప్రజలు
ఇటు క(కొ)రోనా’ వైరస్‌పై స్వీయ కర్ఫ్యూ బంధనం
మౌన పేటిలో ఒకరి కొకరు కాస్త ఎడంగా
మర్యాదా మయ హృదయం “నమస్తే” మాట వహించింది

దారి లేని చిత్ర మైన విషమ క్లిష్ట వేళలలో
జన సమూహ పంక్తుల బాగు కోసం
స్వయం నియతమైన జనతా కర్ఫ్యూలో
శాంతిని కోరే హృదయానికి ! అగ్ర తాంబూలం

శుష్కతను మరపించే రసమయ గళం
మామిడి కొమ్మ నుండి వసంత కోకిల రావం
నింగిలోకి ఎగిరే తెల్లని పారావతం
వికృతిని మరపించే ప్రకృతి సందేశం

ఈ దేశం ఆదేశం, ఈ జాతి ఆ జాతి భేదం లేదు
ఎక్కడయినా ఎవ్వరయినా ‘కోవిడ్’ వల విసురుతుంది కనబడకుండా

జనతా కర్ఫ్యూ స్వేచ్ఛా జీవన రణంలో స్వచ్ఛ సాధనం
చరిత్రలో సహజమైన సమాజ వికాస మతికి తార్కాణం

I. 5

రోజూ నడచే దారే ఈనాడు కూడ అదే
మహామారి కోవిడ్ చీకటి బలంతో
సుగమంగా నడచే కాలానికి వేగంగా బ్రేక్
దేశం మొత్తంగా లాక్ డౌన్‌లో నిశ్శబ్ద జగం

ఏ సూచన లేకుండా ఎవరికీ తెలియ కుండ
కరోనా ప్రమాదకర సూక్ష్మ జీవి తాండవం
మనిషికి మనిషికి మధ్య ఎడంలో సామాజిక దూరంలో
కోట గోడలా భయం! పయనాన్ని నిలిపివేస్తూంది

దీనిపై పని చేసే యంత్రాంగం ఏదీ లేదు
'వైరస్' గప్‌చుప్‌గా అదృశ్య హస్తాలు చాచేను
మనిషి దీనికై కొత్త రూపం ఎత్తవలసి ఉంది
పూర్వమెన్నిటిపైనో విజయ పతాక ఎగరవేసిన

ధరణి తలం మౌనంగా గగనం నిశ్శబ్దంగా
దిశలు అశాంతి ముద్రలతో నివ్వెరలో తేరుకోని సంఘం
మనిగి ఉన్న చోటునే నిలిచే స్థితిలో, వ్యధతో
తనలో పునరవతరణం ! ఆహ్వానించేను.

కనిపించని కరోనాపై ఎవరి సమరం సాగదు
కట్టడి వశమై మహమ్మారి మాయమవుతుంది

పదులు వందలు వేలు సంఖ్యలో కళేబరాలు
దేశ దేశాలలో మనిషి చతుర మతిని మరపించేను
యుగాలుగా ఆర్జించిన సంస్కృతి మలినీ భూతమై
ఆపదలో మనిషి మనసు భయ కుంచిత మవుతూంది

బయటి చూపుకు కనిపించని అల్పమైన సూక్ష్మజీవి
వైరస్ మనిషిని మృత్యువు ముద్రకు గురి చేస్తూంది
స్వయం నియతి ఆయుధమై పని చేస్తూంది
అక్షయంగా అక్షరం విజయానికి దారి చూపుతూంది

I. 6

సహనం క్షమ మానవత స్పందన త్యాగంతో
కవిత ! మనిషి బదులుగా విజేతను తలపించేను
ఇది మౌన పథంలో నిశ్శబ్ద సమర రూపం
తనలో సజీవ మయిన రక్షణ కవచంతో సిద్ధంగా

కొత్త ప్రణాళికలో కొత్త పార్ములాతో
ఏరోజు విధి విధానం, ఆ రోజునే నిర్వహణం
కనిపించని వ్యతిరేకిని గుర్తిస్తూ వెన్నాడుతూ
గుట్టు బయట పెట్టడమొకటే దీనిపై కర్తవ్య ఫలం

ఇప్పటి అగత్యం వ్యథలో ప్రాణాలను కాపాడడం
బ్రతుకుల్ని స్వచ్ఛమైన జీవన శైలిలోకి మార్చడం

తొలి నుండి ఎన్నిటినో తుడిచి వేసిన మనిషి
"క(కొ)రోనా"ను తొలగించడం సాధ్యమయ్యే విషయమే

వ్యక్తిలో భౌతిక శుభ్రత మానస స్వచ్ఛత తో
భారతీయ జీవన సంస్కృతికి పరిచయమే

ఉగాది ఉదయం వేచి ఉన్న నాలుకపై
వసంత రస బిందువు జారాలని కోరిక

వెలుతురులో జ్వాలా భ్రాంతికి బదులుగా
పచ్చని బంగరు అనుభవ దృశ్యం చూడాలనీ

ఆరు రుచుల మిశ్రమం పంచాంగ శ్రవణంతో
అనుభవ విశేషం మనసుకు కొత్తగ తీర్చాలని

మహనీయమైన కాలం సుందర తరమైన సమయం
ఎవరి కిష్టమయిన పాత్రలో వారు ప్రవేశించేరు

పండుగ రోజున అభినవ మానస రూపం కవిత
వసంత స్పర్శతో కోకిల స్వర బంధువు కావాలనీ

పాపాలకు దోషాలకు దూరమైన స్వచ్ఛ స్థితిలోనూ
భయదమైన రేఖలతో కోవిడ్ ప్రతినిధి కరోనా అనూహ్యంగా

I.7

చండమైన కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు
లాక్ డౌన్‌లో సమాజం! నిశ్శబ్ద సముద్రంలా
గమనంలో వేగం తగ్గి హెచ్చిన బాధల సుడిగుండాలలో
జన రక్షణ లక్ష్యంతో స్వీయమైన వ్యూహంలో బంధనం

నాలుగు గోడల పరిమితిలో విశ్వదృష్టి జీవితం
ఇది తొలగే వ్యూహ రచన వేరు! శాంతి పథంలో
సుఖాలను వదులుకొనీ, కష్టాల నెత్తుకొనీ మోస్తూ
జన పంక్తుల అవసరాలు గ్రహణంలో రవి కిరణాలు

స్వీయ కర్ఫ్యూలో తమకు తాము సరిదిద్దుకొనే జీవితాలు
స్వచ్ఛత శుభ్రత స్వేచ్ఛలో నియతితో మారక తప్పదు
ఎక్కడి కక్కడ శిలలవలె కదలిక ఆగిన వీధులు
అల్లాడే పేద జనం ! కోరేదేమిటి? కాలం గడవడం

మృత్యుభయం నుండి ముక్తమై ఆరోజు పనికి ఆహారం
భూమికెవరూ పచ్చదనం గురించి చెప్పనవసరం లేదు
రవికి తన రశ్మి గురించి గుర్తు చేయనవసరం లేదు
కవికి తన కవిత గురించి ఎవరి బోధ అవసరం లేదు

ఇంటి గడప లోపల బంధుభావంలో అనుభవాలు వేరు
ఇంటి గడప దాటిన వ్యవహారంలో ఆలోచన వేరు

మాటల బ్యాగ్ కవిత ! జేబ్ లాగితే
ఏ రాయో కనిపించేనా? ఏ పామో బయటపడేనా?
రాయి వజ్రమనుకునేరా? పాము అదృష్టమనుకునేరా?
ఎవరి భావ జగం వారిది, అనుకోని ఉపద్రవంలో

ఈ విషమ సమయంలో, విషాద ఘడియలలో
కర్తవ్య నిర్వహణం తోనే రణ సమానస్థితిపై విజయం

శ్రమఫలం పొందే దెపుడో? తెలియదు
క్రియాశక్తి స్వచ్ఛత సన్నుతి తోనే సాధ్యం!

I. 8

ఇంతకు ముందు అనుమానం గాలిపై
మహా మారి పెనుభూతం ! వర్తించేనని
ఇపుడు స్పర్శతో కరోనా ఉపద్రవం
కంటికి కనిపించని రూపంతో కదలుతుంది

మరణ భావనలో తప్ప కనిపించనిదీ
మనిషి మనిషి మధ్య ఎడం పెంచుతుంది
ఇదో కొత్త ప్రభావంతో విపరీతం ! 'కోవిద్'
బడికీ గుడికీ దూరం చేసేను, నిర్మొహమాటంగా

భౌతిక స్థాయిలో పయన మెంత దూరమైనా
మూక ముద్రలో మానస భాషణం ఒదిగేను
సృజన విలయ పార్శ్వ దశలు జీవితాన ఉన్నవే
ఈ సమయం విపరీత స్థితి వేగం అందుకునేను

సమాజంలో అన్ని వ్యవస్థలూ సంస్థలూ, సభలూ
సామూహికా లొకటొకటీ, కర్ఫ్యూలో "షట్ డౌన్"
శిశిర భావ వీచికలు మనిషిని వణకించేను
వర్తమాన క్షణాల్ని బాధా శిఖలపై నడిపించేను

కాలం అమాయకంగా తన వెంట జీవితాల్ని
లాక్కొని పోయేను, ఎక్కడ ఎప్పుడు వదలేదీ తెలియదు
పయనంలో ఎదురగ మహానది! భయదంగా
దాటేందుకు శంకించి ఎవరూ ఆగి పోయేరు?

కళ్ళకు గంతలు కట్టినట్లు రాత్రి చీకటి ఎదురుగా
బ్రతుకులు వ్యర్థమనీ నిరాశలో మునిగే దెవరు?
అడుగడుగున భయభయంగా రోజంతా గడవడం
స్వేచ్ఛకు తలుపులు మూసి తాళం పడిన స్థితిలో
సంకల్పం ఒకటే చాలదు ! అది ఎంత బలమైనదైనా
ఉపజ్ఞతో ధీరత కలిసిన ఆశా కిరణ మవసరం

గ్రహణం వేళ భూమి పూర్తిగా రవికి అడ్డమై
ఏర్పడే నల్లని వలయం చుట్టూ కాంతిరేఖ
ఉంగరం మాదిరి వైరస్ "కరోనా"
అమరికలో సుందరతకు శాస్త్రజ్ఞులు ఆకర్షణ

I. 9

అనుకూలం ప్రతికూలం సహభావం విభేదం
మరెన్నిటినో కలుపుకొని ఒకరొకరిలో ఆలోచన
క్లిష్టమైన స్థితులలో ఒక తాటిపై నడిపిస్తుంది
మానవం! ఇది ప్రాణాలకు ముప్పులో రక్షణం

ఆపదలో ప్రమాదంలో సమరంలో సంక్షోభంలో
ఏ అగ్ని పరీక్షకు దగ్ధ మవని అమర రూపం
విలయ చర్య నుండి సృజన క్రియకు
మానవ వికాస చరిత్రలో తన శక్తిని చాటేను

పచ్చని ఊహలతో ఫలవంతం క్రియలో
ఈ దిశలో స్వీయ నియతి తమ ఇంట్లోనే
బంధు గణ నిలయం! పలు రంగుల పూల గుత్తిలా
'కరోనా' విజృంభణలో అసాధారణ విపదలో!

స్తిమిత మయిన బుద్ధితో శాంతమైన మనసుతో
క్రమ శిక్షణ వర్తనతో మానవ విజయం తథ్యం

ఇది మును ముందు చరిత్రలో మనిషికి
స్వర్ణ కిరీటం తొడిగే అవకాశం లభించేది

బోధ తోనో పాటతోనో ఇది
సరి పెట్టుకొని పోయే విషయం కాదు
పరిచయ మాత్రాన లక్ష్యం ఎవరి స్వంతం కాదు
ఇది సహన పథంలో ప్రజలందరిదీ

సరికొత్త సవాల్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా
మనిషి! భద్రమైన జీవన నీతికి ప్రతీకగా

స్పందన గుణంతో స్వీయ నియతి శీలంతో
ప్రాణాలకు ముప్పులో ! మనిషి నుండి ఆదర్శ రూపం
ఏ ఒకరిలో కాదు ! అందరిలో
ఏ కొందరిది కాదు ! అందరిదీ

I. 10

బయట నలుగురిలో తిరిగేందుకు కరోన భయం తీగెలా
ఎక్కడికి వెళ్ళడం? ప్రపంచ దేశాలన్నిటినీ అలముకునేను
పారిపోవడం కాదు, మన ఇంట్లోనే రక్షణలో భాగంగా
మనిషి ప్రాణ విషయంలో తీసుకొనే జాగ్రత రూపం ఇది

పిల్లలు పెద్దలు పరివారంతో నడిపే అవకాశంతో
బంధు మయం! లక్ష్మణ రేఖను దాటరాని విశేషం
స్వయం నియత వలయంలో హుందాగా ఆత్మీయంగా
మలినానికి దోషానికి పొరపాటుకు దూర దూరంగా

ఏదో పేరుతో ఇంటి దారి పడితే
వ్యక్తి క్షేమం దక్కవచ్చు! కాని సమాజ సుస్థితి భగ్నమయ్యేను

ఇది విషాద దృశ్యాలతో మోడల్ ఆల్బం అయ్యేనా?
ఈ సందర్భంలో ఆశలు బయట కన్న నివాసంలో
స్వచ్ఛమైన రూపాలతో బ్రతుకులు సరిదిద్దబడేనా?
ఇది చరిత్రలో మారణ పర్వంగా పేరొందేనా?

ఇంతగ ప్రజలను కలవరపెట్టే వైరస్ సామాన్యం కాదు
అందుకే అసాధారణ రీతిలో చికిత్సకు ఏర్పాట్లు
అనుక్షణం చిత్రమైన భయావహ వార్తల మధ్య
రోగి నుండి సహకార మనో రూప మవసరం

మలినతనంతో కరకు దనంతోనే
మరణ చరణ రూపానికి మూలం!
జడం లోని వికృత గతికి కీలకం
ప్రాణిని జడంలోకి మార్చే మారణం

కరోన రావడం బహు వేగంగా
పోవడం మాత్రం! ఎంతో మందంగా
ఇది నీరులేని లోతు బావిలో
భయదమైన చీకటి భూతంతో సమం

చెట్ట పట్టాలతో బయట నడచేరోజులు తప్పక వస్తాయి
కరోనా నిష్క్రమణంతో మనిషి మతి ప్రభకు స్వాగతం

I. 11

శాస్త్రజ్ఞులు వైద్యులు పరిశోధకు లెవరికినీ
పూర్వ పరిచయం లేనిది ఈ క(కొ)రోనా
ఈ వైరస్ సంఘంలో వివిధ శ్రేణుల
జీవితాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూంది

లోకంలో తన ఉనికికి బహుమానంగా
మృత్యువును ప్రసాదించేనా? ప్రాణ సంకటంగా
ఎక్కడి కక్కడ శిథిలమైన సంధులతో సమాజం
కొన్ని ఏండ్లు వెనక్కి నెడుతూంది బలవంతంగా

ఇప్పటి కెన్ని చర్యలు తీసుకున్నా
మనిషి వశం కానిది, దీని రహస్యం

చాచిన కరాలతో క(కొ)రోనా! ప్రమాద స్పర్శతో
తలుపులు తెరచిన నిలయం లా లోనికి చేరుతుంది
రెక్కలు మూసిన మహా బోషాణం వలె సమాజం!
లాక్ డౌన్ కర్ఫ్యూలో ! వ్యక్తికి భద్రతతో జనతకు దూరంగా

క్షుద్రమైన ప్రభావాల గురించి బెంగలో
చేతిలో అలంకారంగా ఆదే లాఠితో పోలీస్
ఎవరి చేతులకు కాళ్ళకు సంకెలలు లేవు
స్వేచ్ఛలో స్వయం బంధనతో ప్రయోజన గుణంతో

ప్రమిదలో వత్తితో పాటు తైల మవసరం
ప్రభుత జనత కలిస్తేనే వెలుగుకు విజయం
ఆర్థిక సంక్షోభంలో గ్రాఫ్ దిగిపోయి
సమస్య శిలా ఫలకంగా మారేను

వైరస్ కట్టడికే స్వీయ బంధనం
మనుషుల రక్షణయే తక్షణ కర్తవ్యం
ఇది తమ పాలన విధాన మే విధమయినా
ఎవరి సూచనలోను తుది జవాబు లేదు!

వ్యక్తి స్థాయిలో బాధ మరవ రానిదయితే
సంఘ స్థాయిలో వేదన డైరి పేజీలలో!

I. 12

నైతిక నిర్మల గుణ సౌహార్దం నడతల హృదితో
ఆపదలో చిక్కిన మనుషుల జీవన సంరంభం
కంటికి కనిపించని సూక్ష్మ జీవి వైరస్
మృత్యు ప్రభావంతో విషాద దృశ్యాలను చూపుతూంది

మేఘం నుండి అనుకోని పిడుగులా హఠాత్తుగా జారింది
ఆగక పోగా ఒకరి నుండి మరొకరిపైకి వైరస్ పయనం
జీవన శైలిలో జాగ్రతలతో పూర్తిగ ముడివడింది
ఇది అషామాషి వ్యవహారం కాదు, “కరోనా” విషయం!

ఆకులవలె ఆశలు పచ్చగ ఉండాలని కోరిక
స్వచ్ఛమయిన అవసర గతి విధి విధానాలతో
జీవితం! నడవాలని, ప్రాణాంతక సమయం పోవాలని
కర్ఫ్యూ స్థితిలో అసౌకర్యాన్ని ఎదుర్కొంటూ! ప్రజ ధైర్యంగా

బీభత్స కాండతో సమాజాన్ని దృశ్య మానం చేస్తూంది
దీని ప్రభావ పరిధి! వ్యక్తులకు ఎడంగా, గుంపుకు దూరంగా

ఉపాది కోల్పోయిన శ్రామిక గణాల కదలికలు
గాలికి కదలే కొమ్మలకు వ్రేలాడే చీకటి పీలికలవలె
నివురు కప్పిన నిప్పుల్లా పేద మనసులు
ఈ బూది పొరల నెవరు తొలగించేరు?
తొలగిస్తే అసహన దృశ్యంతో శూన్యం నిండేనా?
ఎవరి ఇంట్లో వారు పదిలంగా వస్తువుల వలె!

బ్రతుకు దెరువు గురించి ఉదాసీనత పనికిరాదు
అపాయకర స్థితులను చేరవలసి వస్తుంది
ఈ స్థితిలో విషాద కర వాతావరణంలో
ఒకే ఒక దృఢ సంకల్పంతో ఆగని పయనం శరణ్యం

వ్యక్తి సమాజం రెండూ పరస్పరాశ్రయాలు
లక్ష్యం ఒకటైన పరస్పర పరి పూరకాలు
స్వయం నియతమైన విధి విధాన క్రమంలో
కర్తవ్య పాలనలోనే గెలుపుకు! సంకేతం!

I. 13

మనిషి కర స్పర్శతో మనిషికి దగ్గర అయితే
'క(కొ)రోనా' వైరస్ అంచులపై నడవాలిసి రావచ్చు
కాస్త ఎడంతో "నమస్తే" తో హృదయం ప్రత్యక్షమై
పూల గుత్తి మర్యాదను సార్థకం చేస్తుంది

మనిషి నుండి మనిషికి సోకే మలిన రూపానికి
మనిషే వాహన సాధన మయి తరలించేను
చోటు నుండి చోటుకు అవలీలగ చేరుతుంది
విషమ వికృత ప్రభావాన్ని బయట పెడుతుంది

సమాజ సమీపతలను తగ్గించే చర్యలలో
మనుషుల క్షేమానికి రక్షణగా తలచేరు
ఇప్పుడయితే కోవిడ్ పైనే అందరి చూపులు
ప్రాణానికి ముప్పులేని స్థితికే కర్ఫ్యూ ప్రాముఖ్యం

పై నుండి క్రింది స్థాయి వరకు
అందరినీ తన వైపు పరుగెత్తింప చేస్తుంది

ప్రాంతం పొలిమేరలు, దేశం సరిహద్దులు
ఏ అడవులు కొండలు నదులు ఏవీ అడ్డుకావు
ఊహకు పక్రియ జోడింపబడే
ప్రజలో విషాద వికలత తొలగాలని ఉంది

"రోగం రట్టు" మాట ఎప్పటిదో? ఇప్పటికీ
ఈ వైరస్ విషయంలో సార్థక మవుతూంది

స్వీయ బంధనలో అసౌకర్యాలతో మనుషులు
ఈ విచిత్రమైన వైరస్ ముందు అల్ప జీవులుగా
మధ్య మధ్య శూన్యాలతో కనిపించడం ! దారుణం!
వీటిని విజ్ఞాన బలంతో నింపేది ! మనుషులే

మనిషిలో మనిషికి వ్యతిరేక సూచనలెన్నో
మనిషిలో మనిషికి బలమైన ఉపజ్ఞ లెన్నో
జీవన గతిలో వికాస చరిత్రలో ఓటము లెన్నో
మనిషిని నిలబెట్టే అస్తికు మూలం విజయాలే

I. 14

‘లాక్ డౌన్’ విడతలుగా అంచెలుగా
తిరిగే సాహస చక్రం వెనక ఆలోచనతో
కూలీల ఇక్కట్లు ! వలస కూలీల బాధలు
ఆకలితో అలమటించేరు అనాథలుగా బ్రతికేరు

అసౌకర్యాల మధ్య అన్నార్తుల హాహాకారాలు
తొలగని ఆటంకాల మధ్య నిరసన గళ దీనులు
స్వయం నియత కర్ఫ్యూ పేరుతో నగరం రోడ్లపై
చేరిన జన సమూహాల నిరసన ప్రదర్శనలు

ఇది ! ప్రభుతకు శోభా కరం కాదు
అట్టడుగున బ్రతికే జన ఘోషకు మచ్చు తునక
దారులన్ని పైకి నిశ్శబ్దంగా మనుషులలో శబ్దం సుడులుగ
మాస్కులతో ముఖాలు నివురు కప్పిన నిప్పు కణాల్లా

ఈ కఠోర చర్యలు మునుముందు ప్రాణం నిలిపే వయినా
ఈ రోజున తిండికి ఏర్పాటులేంది! ప్రాణమెలా నిలుస్తుంది
క్రింది నుండి పైకి దూసే ప్రశ్నలు వాస్తవ సూచనలు
లోపల బాధలు మెలికలు తిరిగే పాముల వలె

ప్రతి వ్యక్తిలో రక్షణ రూపం ప్రకటిత మవదు
బ్రతుకులు పాములు పట్టే బుట్టలు కావు
ఇళ్ళలో మనుషులు ముడుచుకున్న వాలకాలతో
వాడిన మొక్కలవలె మాడిన పోచల వలె

ప్రకృతి నుండో సమాజంలోనో శత్రువు లేంది
మనిషి జీవితంలో రుచి పచి వివిధత లెక్కడ?
ఉద్వేగం ఉద్రేకం ఉత్సాహం ఉత్సేకంతో ఉత్తేజం
కలిసిన ఉద్గమనం తోనే జీవన రూపానికి అస్తిత

ఇంట్లో పదిలంగా ఉండే మాట ఎంత నిజమయినా
సంఘం పట్ల తన కర్తవ్యం కూడా ఒక అవసరం

జీవన శక్తికి మానోజ్ఞం సాఫల్యం నిర్దేశం సార్థకం
అణువు నుండి విశ్వం దాక మెట్లపై నుండి దృశ్య పరంపర!

I. 15

గుడిలో విగ్రహానికి దూరమై
సమాజ పరిసరాలకు బదులుగా
దైవ చిత్ర పటం పైన దృష్టితో
మనో లోక సీమలు స్పృశించేరు

ఎవరి మూల తత్వ విధం వారిది
ఎవరి భావ జగం రీతి వారిది
మార్పుకు తగిన విధంగా
కుటుంబ జీవన సుందరమై

వ్యక్తులలో ప్రాణ భయ సమంతో
గమ్య మొకటే! తమ గృహావరణంలో
ఎవరి నుండి ఎంత కీర్తి మూట కట్టుకున్నా
ప్రాణం తీసే కరోనా వెంటనె పరిహరణీయం

అది చేసే మేలేదో! అంతా కీడే
ప్రతి ఒకరికి పరిమితం అన్నట్లు ఉంటుంది
తత్కాలంలో ఇంద్ర ధనుసు అందంతో
దప్పికలో ముందుకు వచ్చే జలధి అలలతో

కరోనా కట్టడి కవకాశం ఉన్నది
వైజ్ఞానిక స్పృహతో వైయక్తిక జాగ్రతతో
ఎంతటి తీవ్రతలోనూ లాఠీలకు పని చెప్పకుండ
స్వయం కర్వ్యాలో నిర్వహణ బాధ్యతలో నిజ విజయం

ప్రతి పనికీ ఏదో ఒక వైపు
కోరే మంచికి అవకాశం ఉంటుంది
దీన్ని బట్టి చెడును బుజాన వేసుకొని
అమానవ ప్రదర్శనలో భాగం కాలేము

ఈ సమయంలో మనిషికి మనిషి ఎడంలోను
ప్రాణం దక్కిన గుండెకు
పూలగుత్తి! హత్తిన అనుభవ రూపం

I. 16

వ్యక్తికి క్షతి కలిగించే సంఘానికి చేటయ్యే
క(కొ)రోన గురించి చరిత్ర స్మరణతో కొందరు
వివిధ వాద విభేదాల ప్రభావాల రేఖల చిత్రాలతో
ఇది ఇష్ట పడేరు కొందరు, రహస్య ఎజెండాతో

నాలుగు గోడల మధ్య ఇల్లు ! ఆవరణం నుండి
బయటికి విశాలతకు చేరుస్తుంది అవకాశం
ఎక్కడి దక్కడ స్తబ్ధతతో ఒదిగిన సమాజం
ప్రగతికి ఆరోహణలో వేగం తగ్గుతుంది

కొత్త జీవన శైలితో నిజ వాస్తవ గతులతో
ఈ వైరస్‌పై విజయ భవిత విజ్ఞాన యోజన తోనే

మృత్యువు వలతో సిద్ధంగా ఉన్న "కోవిడ్" నైజాన్ని
భగ్నం చేసే చర్యలు ! మానవ యత్న గుణం తోనే

నేతల్ని గడప దాటనీయలేదు
భక్తుల్ని గుడులు చేర నీయలేదు
పగలు రాత్రి జాతి మతం భేదం లేదు
రోజు కూలి మనిషి నుండి రాష్ట్రపతి వరకు

ఇది కనిపించని నాశన బల రహస్యం
సాగి సాగి మనిషి వ్యూహ చక్రంలో నలగవచ్చు
ఎడం కన్న కలిసిన భౌతిక మానస
శక్తులతోనే పని సాధ్యం! సార్థకం

ఈ విషమ సమయం గత చరిత్రను స్మరింప జేసేను
ఈ విలయ దుస్థితి ! సంస్మరణలకు దారులు తీర్చేను

ఇల్లు చేరి ఆత్మీయమైన తృప్తిని పొందితే
బయటి కొచ్చి విశ్వమయ భావ మొందేను

ఈ వైరస్ దేని నీడకాదు, చీకటి బంధువు, మారకం
మహమ్మారి! దీనిపైన విజయమే తక్షణ కర్తవ్యం

I. 17

ఎంతో సాధించిన విజ్ఞాన వివేచనలకు వారసుడయినా
కరోన కరాళంలో ఆందోళన ముఖంతో మనిషి
ఆరోగ్యంలో సద్విధాన మనుసరించని దోషంతో
జన్యు కణంలో చోటు చేసు కుంటుందీ వైరస్

హఠాత్తుగ పలు కష్టాలకు కారణమై వేధిస్తుంది
మృత్యువకు బలమైన కోట నిలయ మవుతుంది
మనిషిలోని అధికతను దిగ జార్చేను
దీని నెదుర్కొనే నిశితమైన ప్రతిభ లేకపోలేదు
సూక్ష్మమైన హేతు దృష్టితో శాస్త్ర పథంతోనే సాధ్యం
నిదుర నుండి మనసు మేల్కోవలసి ఉంది

భౌతిక కాయాన్ని నివాసంలోకి నెట్టేస్తే సరిపోదు
కావలసిన జీవన వికాస శైలి ముఖ్య మవుతుంది
శత్రువు నెదుర్కొనే ప్రయోగంలో వేగంతో
సాగే వైజ్ఞానిక ప్రస్థానం తోనే మానవ విజయం

వ్యక్తికి తన జీవన యానంలో అజ్ఞానంతో
సదోష మలిన పంకంలో దిగ బడితే ప్రమాదం

భౌతిక సుందరత వికృతాకృతి పొందడం
తనలో సవ్వుమైన గుణాన్ని మరచిన దౌర్భాగ్యం తోనే

అస్థి పంజరం రూపానికి ఆధారం, శరీర భాగం
రుధిర మాంసమయం జీవ కణ నిర్మాణం
లోని సూచనతో ప్రయోజన యానం
ఆపదకు దారి తీసే పరిస్థితులు తెలియకుండ దాగేను

ఇది సులభంగా తేలేది కాదు, మరొకటి రావచ్చు
ఎన్నిటితో సంబంధంతోనో కొత్తది! తెరపైకి
ఎప్పటి కపుడు రహస్య ప్రకాశంతో జీవన సౌభాగ్యం
శాంతం సౌఖ్యం వికాసరూపం ! మనుషుల చేతులలో

I. 18

ఎంతో కాలంగా మిత్ర బృందంతో మసలి సమాజంలో
ప్రాణ రక్షణ కయి వదలి! ఇంట్లో లాక్ డౌన్‌లో
ఎన్నిటికో దూరమయినా కొన్నిటికి ఆత్మీయాలయ్యేను
దేనికయినా మనసు సమాధాన పడేను, భయాకాంత్రంలో

సంతోషాలు లేవు శుభకార్యాలు లేవు కుటుంబ రుచియే
నిశ్శబ్దం అంచున అనుమానంగా మాటలు ! పరిమితిలో
పల్చని ధ్వనుల పొరలు చీల్చుకొని పాట బయట పడవచ్చు
కరోన అంతం కయి, నిరీక్షణ క్షణాలతో జీవితాలు

జీవ కళను కోల్పోయిన నగరాలెన్నో ప్రపంచ వ్యాప్తంగా
మనిషిని మనిషి కలిసే బంధం తెగి ఎక్కడికక్కడ
భయం ముడుల చిక్కులలో చిక్కువడిన సందర్భాలు
ముడుచు కున్న రేకులతో పంకజాల వలె బ్రతుకులు

పోవలసిన దారి తప్పి ప్రాణాల్ని చుట్టుకున్న సమస్యతో
భౌతిక నిరాకరణ భావనలో మనిషి మనిషికి ఎడం ఎడం

స్వచ్ఛమైన కోరిక శుభ్రమైన శైలి బ్రతుకులో
ప్రముఖ పాత్ర వహించేను; తనువు పై శ్రద్ధతో

అనుకోని మలిన దోష కలుష స్పర్శా మాత్రం
కరోన ప్రవేశానికి అవకాశం దొరకుతుంది

వైరస్‌కు చోటు లభించే భౌతిక జీవ కణం
మానవ శక్తిలోని సృజన కళను ప్రశ్నగ మారుస్తుంది

అల్పత హీనతతో క్రమ్మిన ధూళి ధూసర స్థితిలో
కనిపించని సూక్ష్మ జీవిలో విస్తరణ కాంక్ష!
ఉత్పత్తికి విజృంభిస్తుంది! మత్యువు నీడలు పెంచుతుంది
మనిషిలో ఆధిపత్యం తల క్రిందులుగా మారేను

పరాన్న జీవి ఆక్రమణంలో అస్తిమితం కల్లోలం
అప్పటి వరకు అన్నీ తెలిసి నట్లు ఉన్న మనిషిలో
అంతలో అమాయకం! బయట పడేను ! అకస్మాత్తుగా
అజ్ఞాన స్తంభంలా నిలిచేనా? సృజన చేతన రూపం చూపేనా?

I. 19

పోరాట మెవరితో? దోమలతోనా? చీమలతోనా?
ఆ దశ గడచి పోయింది ! మనిషి మేధకు రుజువుగా
మెదడు బూజు పట్టలేదు, ఇది జీవన వాస్తవం
కరోనతో రణ సమ స్థితిలో మరెన్నో రావచ్చు

ఈ రోజు చీకటి పేలికల్ని వదలే చర్యలతో కరోనా
బోను నుండి తప్పించుకున్న పులిలా తిరుగుతూంది

సమాజానికి దూరంగా ఏకాంతానికి దగ్గరగా ఇంట్లో
ప్రమాదంనుండి బయట పడిన శరీర భాగ్యంతో
ఆపదకు గురి అరవకుండా వాహన యానంలో
మనుషులు ధీశాలురు అసౌకర్యాల్ని వహించే సహనంతో

కిటికి నుండి బయటికి చూస్తే దృశ్యం
అచటచట శుభ్రంగా కోలుకొనే వాతావరణం
ప్రాణం గురించి భద్రతపై చింతనతో
సుఖ సంపాదన లెవరికి ఇష్టమవుతాయి

డాక్టర్లు నర్సులు సేవకులు రక్షకులు
సమాజాన్ని కనిపెడుతూ కాపాడుతూ నిరంతరం
కష్టంలోను నిర్భయ గుణాలతో మనుషులు
మనిషిపై గట్టి నమ్మకాన్ని నిలిపేరు

ఒంటరిగా ఉండేందుకు బంధనతో పనిలేదు
"సంతోషం" లో అర్థం మనిషి మనిషికి వేరు వేరు

మౌనంగా గడిపేందుకు అనుమతితో పనిలేదు
సందర్భాన్ని బట్టి "సుఖ" నిర్వచనం మారుతుంది
ప్రబోధంతో పనిలేదు ప్రచారంతో పనిలేదు
క్లిష్టమైన సమస్యతో క్షుభ్ధమయిన శత్రు వాతావరణంలో
స్వయం వివేచనతో గడవడమే కావలసింది
భౌతిక మానస సమన్వయంతోనే జీవన భాగ్యం

I. 20

సమస్యకు కారణం ఎవరయినా ఏ దేశ మయినా
మనిషి తప్పిదం తోనే బిందువు నుండి సింధువవుతూంది
కరోనా సోకడం సులభం, పోవడం బహు కష్టం
దోష కలుష మలిన క్షుద్ర ప్రభావ పర్యవసానం

చీకటిని కోరేవారూ ఉన్నారు, మనుషులలో ప్రతిచోట
నిద్రాలోలురు నిద్రా గతులు నిద్రామయులు నిద్రా చరితులు

ఏ రోజు తొలి రేఖలతో ఆకర్షించే ప్రజలతో వీధులు
ఈ రోజు నిర్మానుష్యంగా, రక్షక భటుల పహరాలో
లో నుండి బయటికి వెడలని మనుషులతో శూన్యం
చేక్కలు లేని గగనం కిందికి దిగినట్లు ఉంది

నిజానికి ఆర్భాటాలేవీ అక్కరలేదు
ఆడంబరానికీ ప్రచార దృశ్యాలు ముఖ్యమై
దీనికి జ్యోతిషం అక్కర లేదు
అద్దంలో బింబంలా ఎదుటనే వాస్తవం

"రేపు"ను గురించి ఎవరు చెప్పగలరు?
శూన్యంలో ప్రజలు చేక్కల వలె మెరసేరు

విజ్ఞాన వేత్త లెక్కడ చూచినాతామే మునుముందుగ
సేవా నిరతలు శ్రమ జీవన వ్రతులు శిష్టులు
ఏ రోజూ బిందువుపై నిలిచిన కోణంలో
సమాజ చక్రాన్ని నడిపేరు, జీవన ఫల మాశించేరు

ధనం ముఖ్యం కాదు, పదవులు జన హితంకై
ప్రాణాలు నిలిపి సంతోషం విరిసి బ్రతకడమే లక్ష్యం

ఆపదలో రక్షణ భద్రత కోరే అందరి
గమ్యం ఒకటే! మానవతా కిరణ నిలయం

భూమి మృత్యు పేటి బదులుగ
పచ్చని హృదయాశయం పొందాలనీ
రిస్కు నధిగమించే చర్యలతో పరిశోధనా ఫలం వేక్సిన్
ఒకటే! శాశ్వత రక్షణకు జీవన చేతన కవచం

చరిత్రలోని దేదీ మరపున బడిపోకూడదు
కవితలో బ్రతుకుతాయి ! అక్షరంలో చిరంగా

I. 21

బయటి గేటు మూసి ఇంటి ఆవరణంలో
విరామ సమయంలో నాకు దగ్గరగా
పిడుగు పాటుతో చకితంగా
పచ్చని చెట్టు ధ్వంసమై విలయాకృతి పొందేను

ఇంకా నయం ! దగ్గరలో ఉన్న నాపై పడలేదు
ఈ మాటలో తృప్తి! అనుకోనిది పలు కోణాలలో
ప్రాణం నిలిచింది చాలు ! కావలసిందే దక్కింది
పిడుగు మీద పడితే, జరగరాని దానితో శూన్యం, మిగిలేను

నా చుట్టు ప్రకృతి! నేను ఒంటరిగా ఏకాంత భావనలో
మనిషి మనిషికి ఎడంగా సమూహాలకు దూరంగా సూచనపై
కరోనా ప్రభావ క్షేత్రానికి బయట నా కదలిక
రోజూ భయపెట్టేది, ఈ రోజున తరుము తూంది

దీనికి చికిత్సలో సేవా నిరతితో నిర్భయంగా
ఏ విభాగం డాక్టరయిన ముందుకు వచ్చి తీరతాడు
ఏ విభాగానికి కెవరు చెందిన వారయినా
ప్రాణి క్షేమంపై జీవన భాగ్యం పైనే శ్రమ

ఇపుడు వైద్య రంగంలో విరివిగ మాట్లాడే అంశం
విశ్వ వ్యాప్తంగా భయంతో బంధించే వైరస్ పైనే

భూమి నుండి గగనానికి ప్రాణం చేర్చే అవకాశంతో
జన్యుకణం వ్యాధికి చెందిన చీకటి పాచిక విసరుతూంది

ముందు పరీక్షలు ఆపై కొరెంటైన్ తదుపరి ఐసొలేషన్
చివరన ఇంటికి! ఆయువు శోభతో శుభ్రంగా ఆశా రూపం

పేద కయిన ప్రభువు కయిన తప్పనివీ ప్రక్రియదశలు
కలవారు లేనివారు ఎక్కడికక్కడ! ఆగిన జీవన చక్రంపై
ఏ చోటన దీన్ని గురించి ఆలోచన చేయని మనిషి లేడు
ఇంత వరకు వశం కానిది రేపు భద్రంగా భవితను అందించవచ్చు

I. 22

శత్రువు నుండి భయం చేత ముందుగ
రక్షణ కై బ్యాగులో ఆయుధం లా
వ్యాధికి ముందు నుండి నివారణ వస్తువులతో సిద్ధంగా
కరోన సంక్షోభంలో నిరాశ చుట్టుకొనీ మనుషులు

స్తంభించిన ఉత్సాహం ముడుచుకొన్న ఆశ
ఇపుడు స్వయం నియతికి చేరుతూంది
అలలు ముందు కొచ్చి జలధి గట్టున
ఆగినట్లు, మానుష యత్నాలు ప్రాణం పణంగా

నిన్న రేపు కొసల మధ్య వర్తమానం
వంతెన వలె, సంశయ గమనంలో బ్రతుకులు

వెలుగు నాక్రమింపజూచే
చీకటి వడి అడుగులతో
మనిషి ముఖాన శూన్య వలయం
రేపు మంచికై ఎదురు చూస్తూ
నిన్నటి సమాజ దృశ్యం వేరు
రేపు రెక్కలతో కనిపించేనా?

మహామారి గుర్తులు చిన్ని చిన్న చీకటి ముక్కల్లా
మానవ జీవ కణాలపై ప్రభుతను నెరపేనా?
వీధులు నిశ్శబ్దంగా మనుషులు నిస్తబ్ధంగా
ఫలిత మవతరిస్తే శిరస్సు విజయ పతాకయే

ఏ పనిలో ఉన్నా మనిషి! ఉన్నతిని కాపాడేను
సన్నని జల పాత ధ్వని తరంగాలతో
ఆగని స్వర లహరుల పంక్తులు వరసగా
మానవ జీవన చరిత్రకు సుందర నేపథ్యంతో

కాలానికి ప్రత్యేకత నిచ్చేను
జీవన గతులకు విశేష మబ్బేను

I. 23

కరోనా దుష్ప్రభావం నివాస నియతి దశతో
జీరో స్థాయికి రావలసిందే, స్వచ్ఛతలో శుభ్రతలో

ఏకాంతంలో ఆత్మావలోకనం, వృథా వ్యయం తగ్గడం
పేరుకొన్న సమస్యలు సరించడం హ్లాద కరంగా

స్థిర బిందువు నుండి రేఖ మొదలయి తిన్నగా
ప్రయోజన పరమైన నిజ దృశ్య మవతరించడం
వైజ్ఞానిక శిఖరంపై నుండి కలలు కొన్ని
వాస్తవాకృతుల్ని చూపవచ్చు అనుభవంలో

అంతలో ప్రధాన పాత్రలో జగతిని భయ జలధిలో
తోసింది ! మనిషిలో స్వేచ్ఛా పథం మూత బడింది
ఉపకారం బదులు అపకారం అయినపుడు విషమ స్థితిలో
మహమ్మారి మృత్యు పదం నుండి తొలగడం ! అదృష్టం

ఎగసి వచ్చే కెరటం ! జలనిధి ఒడ్డున ఆగవలసిందే
ఆందోళన చెందడం మానవ మాత్రుల సహజం

అక్కడక్కడ భయ వీచికల్ని చిమ్మే
వెలిగించిన చిచ్చు బుడ్డి నుండి
ఎగసే అగ్నుల దృశ్యంలా కరోనా ప్రకటనం
దీనికి గళ గర్జన చాలదు, తోడుగ చర్యలవసరం

మనసుకు తగినట్లుగ మనుషులు దగ్గరగా
సమాజ బంధంతో సంఘటితం తప్పనిదీ
ఫ్యాక్టరీ సైరన్ వాహనం హారన్ కవి స్వరం వినిపిస్తాయి
ఇవి ఎపుడు బడితే అపుడు వినిపించే ధ్వనులు కావు

నిర్జనంతో బోసి పోయిన వీధులతో నగరాలు
ఎవరి దారి వారిదై త్వరలో తన శోభను పొందేను

సంఘం మధ్యన విలయ శక్తి తిష్ఠవేసి ఉండలేదు
చేతనలో సృజన శక్తి విజ్ఞాన కృషి ఫల మందించేను

I. 24

ఆకలితో అగ్ని వలయ రేఖను దాటి
వలసలుగ దూర దూరాలలో శ్రమ జీవులు
అంతా కలిసి మెలసి ఉండే వీలులేని ప్రభావంలో
కలిమిడి ప్రమాద కరమై ప్రాణ హరణ భయంతో

కరోనా మహామారి ! ప్రపంచ దేశాల నావహించి
మృత్యువు నీడల చిక్కులలో పడేస్తూంది
భూమిపై మట్టి కణ మంత కోరికతో శ్రామిక శ్రేణులు
రోజులుగా సమాజం లాక్ డౌన్ (Lock down)లో జీవన చక్రం షట్‌డౌన్‌లో

ఎప్పటిదో విజయ స్తంభంపై చేరిన పక్షుల వలె
అంతలోన లేచి వాగులో నీరులా తరలేరు
పనులు లేక తిండిలేని విషమ వికల స్థితిలో
ఆసరాను ఆశించే బ్రతుకుల్ని, శూన్యం ! అలము కొనేను

స్వంత ఊరు చేరాలని ఆరాటం నిరుపేదలో
కాలిబాట నడకలో కత్తి అంచు అవుతూంది
ఎరుపు రంగులో ఎండ! పైన పరచిన షామియానాలా
తిరుగు ముఖంలో ఇష్టంలో కష్టం మరపున బడుతూంది

బ్రతుకులో బురద నుండి పంకజాలు లేకపోలేదు
పేదరికం మానసికంగా అంతంతో కరోనాకు గుడ్‌బై ఒక ఆలోచన
పయనంలో గుండెలో మంటలు ఓటమితో కాదు
ఆకలిలో అలసటతో అనల పాత్ర వహించేను

సమాజం తలుపులు పూర్తిగ తెరవ బడీ
బ్రతుకు తీరులో సరి కొత్త నడత తీర్చబడీ
చీకటి ముద్దలిపుడు వెలుతురు దివ్వెలు కావలసి ఉంది
లోన మానసం విజ్ఞాన కిరణంతో
బయట భౌతికం వివేక హృదయంతో

I. 25

మృత్యు నాళిక లోకి దారి తీసే కరోనా ను
పరిశోధనా నాళిక లోకి దింప వలసి ఉంది
ఇంత వరకు దూరంగా ఉన్న ఏకాంత స్థితి
పీఠం పై కిపుడు స్వాగతాన్ని పొందుతూంది

కాస్త ఎడం ఎడంగా పూచే విరిసే పూలు
ఇపుడు గుచ్ఛమై మాలయై అలరించేను
బాగా లేనిది సరి చేయబడీ లేని మంచి గుర్తింపబడీ
మానవానికి కలిసి ధైర్యంతో శత్రు జీవ కణం మాపాలనీ

ఆరోగ్య పథంలో క్రమశిక్షణ ! స్వయం నియతమై
విజయ గమ్యానికి ముఖ్యం ప్రతి వ్యక్తిలో
క్రూరమైన ఈ వైరస్ విజ్ఞాన పరిశోధనలకు పరీక్ష
మానవ మర్యాదను కాపాడే బాధ్యత అందరిదీ

ఎగసి పడే నిప్పు రవ్వలపై నడచే పాదాలను
పచ్చని బాటలో నడిపించవలసి ఉంది
కాలం ఆగదు సాగీ సాగనట్లనిపించవచ్చు బాధలో
ఎక్కడి దక్కడ విశ్లథమై వ్యవస్థ భగ్నమై పోకూడదు

వాహనాల జోరులేదు, విమానాల హోరు లేదు
భూమి మౌన బంధంలో, నింగి నిశ్శబ్ద నిలయమై
మృత్యు కరాలతో కరోనా విశ్వ సమాజాన్ని బాధించేను
వ్యక్తికి సోకేదయినా అంటుతో దేశ దేశ జన సమస్య

లాక్ డౌన్ కర్ఫ్యూతో నెల రోజులు పైన అయినా
ఇంకా సందేహం ఊయెలపై జీవితాలు ఊగేను
ఐసోలేషన్ క్వారెంటైన్ వైద్య నిలయాలలో రోగులు
చర్యల నమోదుకై డైరీలో ఆరోజు పేజి చాలదు

సమీక్షకూ పరిశీలనకూ మార్పుకూ సమయంలో
దశలుగా వెసులు బాటుతో సుస్థితి నాశించేరు
అనువైన స్వయం నియతిలో దృఢమైన మనసుతో
ఇది ప్రేమ కరుణ శాంతి విజయ భావమయం
స్వచ్ఛంద నియంత్రణ రూపం మానవాళి సంక్షేమం

స్వాగతమిస్తుంది

II. 1

స్వాగతమిస్తుంది నగరం ఎవరి కయినా
ధూళి ధూమ తోరణ పంక్తుల వీధులతో

ఏ స్థాయికి చెందిన ఏ దశలో వారయినా
నవతలో వికాస మతిని మేలు కొలుపుతుంది

దాట రాని ఆ రోజును గడపగ చేస్తుంది
దాహం తాపంలో మబ్బు తునక అందినట్లు
ద్రిమ్మరి చీకటిలో వీధి వెలుగు పొందినట్లు
ఆశా శిఖరానికి తన చేతులపై నడుపుతుంది

తనలో ఒకటిగ ఇమిడే బ్రతుకు తెరువులో
తన చెంతకు లాగుతుంది భాగ్య సూచిగా
అప్పటి దాక తెలియని కొత్త జగతిలో
శ్రమ జీవన యంత్ర మయం చేస్తుంది

లోన అంతరంగ మెందరికి పరిచయం
అందరికీ బయటి లోక తంత్రం తోనే

స్వాగతమిస్తుంది హృదయమేక్షణమయినా
పగలు రాత్రి భేదం లేని నవ్య మానవం

ఎదలో మండే ఆశారుణ కీలను
బయలు నుండి బాష్ప జలం ఆర్పేనా?
మౌనంలో వినిపించే ఆపద ఘంటారావం
హృదయంలో ఎప్పటిదో జడిమను వదలించేనా?

తాప శిఖలు అణగిన బూది వేదిపై
శాంత భావ స్తూపం విలసించేనా?
దేహంలో ప్రాణం ఉన్నంత వరకు
విజయం పై ధీమా ప్రతి ఒక్కరిలో

II. 2

అభయ ముద్ర ఛాయలో నిర్భయతకు
నవ జీవన రాగ రశ్మి అలము కొనేనా?
పూర్వపు కథలన్నీ ఇపుడు కొత్తగా
సమాజ దృశ్యంలో చూడ బడేనా?

అనుభవాల రేఖలతో కిర్మీరితమై
అస్తితలకు విచిత్రతలు కలిగించేనా?
సంధించిన మనో ధనుసు చేత మనిషి
తనలో మానవ విభుతను చాటేనా?

అంతో ఇంతో కలహ రవంలేని బ్రతుకు లేదు
మధ్య మధ్య విరామాలు శాంతికి పీఠాలు

పెరిగి పెరిగి పోరు ముదిరితే సమరం
నలిగి కలత చెందేదీ ! సామాన్యులే
ప్రేమ సుమం విరిసి నాల్గు దిశలలో
స్నేహ గంధ ప్రసరణ మొక అవసరం

గుప్తమైన దారి మంచి వైపు దొరకడం
శ్రేయమైన అనుభవ రమణీయ గుణ వరం

మాటకు మరో మాటతో సంభాషణం
చర్యకు మరో చర్యతో క్రియాచరణం
కాలానికి పూల వనీ శోభను తెచ్చేను
భావానికి ఉదయ బంధు ప్రగతిని చూపేను

తమసుకు దూరంగా ఉషసుకు దగ్గరగా
ఉండాలనుకున్నా సాధ్యం కానిది కోరిక

మాటతో చర్యతో మారవచ్చు! మనో గుణం
ఒక క్షణం కుసుమమై, మరోక్షణం అనల కణమై

II. 3

చీకటి ఒకటే మనుషులలో బొమ్మలు వేరు
వెలుతురులోనే, నీడ ఉనికి నిశ్చయం సుభద్రం, స్ఫుటం
ఒత్తిడిలో ఆపదలో కష్టంలో వేదనలో
దివా నిశలు అనుభవ రేఖ లొక్కటే

బాష్ప కణం వెనక కథ ఏదో ఉండవచ్చు
రుధిర లవం చాటున వ్యధ ఏదో ఉండవచ్చు

కెరటం ఖడ్గం శిల అల కుసుమం అనలం
ఎవరి పైన అయినా వాటి ప్రభావ రూపాలొకటే

బ్రతుకంటే ముందుగ తెలియని బాటల వనం
నడచే కొద్దీ కొత్తవి అనుభవాలు ! ఎన్నో
అవసర సమయంలో పాత్ర ధరిస్తుంది ప్రకృతి
ఉన్న పనిని బట్టి ప్రయోజనం ! మనిషికొక విధం

చేతిలో ఉన్న క్షణం వ్యర్థంగా
జార కుండ చూడడమొక పెద్ద పని
చేతిలో కొత్త క్షణం సార్థంగా
కదలి విలువ ! పెరగడమొక అదృష్టం

మనుషులలో గుప్తమైన శక్తి బీజం పెరిగి
సమస్యలేని బ్రతుకులో క్లిష్టత అల్లుకునేను

వెలుతురులో నీడ మనిషి నందుకుంటూ
ఆ రూపంలో నిలుస్తుంది కదలుతుంది పోతుంది

జీవన నది ఒడ్డున పీట వేసుకొని
పొద చాటున పులివలె శత్రువు రూపం

II. 4

ఉదయం సాయం సంధ్యలు ! తరాజే పళ్ళేలు
అనుభవాల బరువుల విలువల లెక్కలతో
స్మృతిలో నిలుస్తాయి ! భద్రంగా వికాస చరిత్రలో
మూడు కాలాల సంపుటియై మనోజగం ! మనిషిలో

తనపై ఎన్ని నెత్తురు రేఖలు జారిందీ
తలపై ఎన్ని కన్నీటి చేక్కలు రాలిందీ
భూమికి తెలియదు మౌన బంధంలో ఉన్నది
మనిషిలో వెలుగుతోనే మనసుకు తెలిసేదీ

గాలికి తెలుసు కానీ అది ఎన్ని పనుల పైనో ?
తొందరలో వెళిపోతుంది ఎవరికీ కనబడకుండా

శ్రమ చలనంలో పొలం పనుల శబ్దంతో
పక్షుల సందడి ! స్వాగత మిస్తుంది రవికి
పగలంతా గడుస్తుంది జీవికలో బహు దూరం
తుది కిరణంతో గూడుకు మరలుతాయి పక్షులు

ఏ కోట గోడ పైనొ
ఏ నది వంతెన అంచునో
వాలవచ్చు, తీరికగా గడుపుతాయి
ప్రకృతిలో కలిసిపోయి ఒకటిగా

పక్షుల నివాస తలం భూమి కాదు
ఎంత తిరిగినా గగనాన చోటు లేదు
కాస్త వెలుగు ఉండగనే గూడు చేర వలసిందే
భద్రంగా కట్టుకున్న నిలయంలో పిల్లల క్షేమంతో

చెట్టు పాదులో బోదెను చుట్టుకున్న
సర్పంపై కన్నా ! దృష్టి, పిల్లలపైనే
ఆరాటంలో ఆలోచన హద్దులలో
మానస పీఠంపై స్థానం తన పిల్లలదే

II. 5

అవని పైన బ్రతుకు అర్థవంతంగా
ఆయువు ముగిసే ముందుగ తాననుకున్నది
కల్పనలో అమరికతో సుందర లోకం
తనలో సుఖ సంతోషాలపైన మోజుతో

బ్రతికినంత కాలం ఎవరికినీ కనబడనిది
హేతువు కందని దయినా, వాస్తవ దూరమైనా
భ్రమలో పెద్ద ఆకర్షణగా మనో లోకం
ప్రతి పనిలో తన ప్రభావంతో, మరోలోకం

చివురు మొగ్గ పూవు ఫలం పూర్ణతలో
పరిణామ దశలతోనే ! జీవన ప్రపంచం
ఏకాంతం కోరినా, మౌనం వహించినా
వస్తూ పోయే వారితో సంబంధం యథాతథం

సమాజ చక్ర భ్రమణంలో జరిగేది జరుగుతూనే
ఉన్నవి జారిపోతూ కొత్తవి చేరిపోతూ ఉంటాయి

సముద్ర మొక అల్లరి పిల్లల ఉత్సాహ ప్రపంచం
ఉత్సవ కళలో పొందే ఉత్సాహమెవరు నిలపగలరు
పరిమిత సుందరతలు బయట కొంత వరకే
కవితలో అక్షరమయమై ఎప్పటికీ అక్షయంగా

మనిషితో మనిషి పరిచయం శిలలు పేర్చినట్లు కాదు
మనసుతో మనసు భాషణం గోడ కట్టినట్లు కాదు
అలను అందుకొని అల రసధునియై సాగాలని
పూవు నందుకొని పూల దండయై వేలాలని

ఎడాదిలో కదలే సన్నని నీటి పాయ
తన ఫాల తలంపై అదృష్ట రేఖను చూపాలని
ఇది దాహం తీర్చే మిత్రం
ఇట కరుణకు సంకేతం

II. 6

రాయిని కంకరగా మార్చే శబ్దం వేరు
రాయిని శిల్పంగా తీర్చే శబ్దం వేరు
చేతిలో పను లెన్ని విధాలో
నడతలో దిశ లన్ని బ్రతుకులో

భూమి అదే చోటు లెన్నో కావలసినవీ
చేను పొలం తోట ఇల్లు ఖననం దహనం
ఎన్నిటిని కలిగితేనో వహిస్తేనో
నిలబడగలిగేది మనిషి సమాజంలో

సమాజం అరణ్యం సృజన జీర్ణ స్థితులొకటే
రెండింటి అనుబంధంతో జీవిత రూపం
కవితలో జ్ఞాపక శాలగా
బ్రతుకులో జీవన స్ఫూర్తిగా

అనుభవాల వెలుగు పూల వాతావరణంలో
చల్లదనం పరిమళం కోరుతుంది మనో రూపం
బ్రతుకులోని బరువును మరపిస్తుంది
ఆయువు కాలంలో రుచి నిస్తుంది

అభిమానం ఆనందం తో పాటుగ ఆశా మయం
ఇది మనో మయమైంది కవితలో కమనీయం
కాలాన్ని నింపుకొనీ, సంఘాన్ని హత్తుకొనీ
జీవన రూపానికి ప్రత్యేకత సిద్ధించేను

ధనం కన్న మిన్న యైన మనిషి మనో బలం
బయటికి కనిపించని ఆంతర ప్రేరణ వశం
రాతి పొరలు తొలగి తేనే నీరు పైకి ఉబికేది
దప్పిక తీరేను బ్రతుకులు పండేను భాగ్యం చేరేను

ప్రకృతితో సహభావం అనివార్యం ఎప్పటికీ
బ్రతుకులో సమభావం తప్పనిదీ కలిసేదీ

II. 7

నడచి నడచి దారి మెత్త బడుతూంది
పోను పోను దూది పరుపు పరచినట్లు
పలికి పలికి స్వరం నాద మవుతూంది
కదలి కలిసి మంచు కణం సరిస్తుంది

చూచి చూచి దృశ్య చిత్త పటమవుతూంది
ఎగసి మెరసి తెలివి పదును తేలేను
కత్తినో చాకునో బ్లేడునో వేళకు తలపించేను
జీవన ఘర్షణలో కొత్తవి తోచే వెన్నో

తరా లెన్ని గడచాయి, యుగాలెన్ని తరలాయి
అడుగునున్న మనిషి స్థాయి మొదటి మెట్టుపైనే
అడవి లోని మనిషి బ్రతుకు శుష్క తరువుగానే
వీధిలోని బిచ్చ కత్తె బొగ్గు ముక్కగానే

మనిషికి తన వేషం సరిచేసుకునే పని లోనే
ఉన్న సమయమంతా హారతి అయ్యేను
మరొకరి గురించి యోచన చేసే వీలెక్కడిది?
స్వార్థ బంధనంలో మనసు శిలా సమయమవుతూంది

దిశ దిశ కిటికీలతో నవ కవితా సౌధం
సృజన మహాద్వారం వెనకనే విమర్శ ద్వారం
సాహితీ ప్రియుల కెవరికైన ముందు నుండి ప్రవేశం సులభం
ఎవరి పయనం వారిది అయినా మానవ బంధం మాటలాడిస్తుంది.

చుట్టు ఉన్న సమాజ సంరంభాన్ని బింబిస్తూ
కవిత పుస్తకంలో పుటలా ఏ రోజున కారోజు
జీవన స్థితి గతులతో అక్షర లోకం
మునుముందు చరిత్రకు ఆకరమవుతుంది

II. 8

ఏ కిటికీ తెరచినా గాలి వెలుతురు లోనికి వస్తుంది
తలుపు తెరిస్తేనే మనిషి లోనికి రాగలిగేది
ద్వారం తెరిస్తేనే మరొకరికి లోనికి వచ్చే అవకాశం
భద్రతతో పాటు రక్షణ కూడ అంతే ముఖ్యం

స్నేహం బంధుత ఆత్మీయం మనోమయాలు
ఓటమి విజయం రుచి తెలిసేది మానవీయ పార్శ్వాలు

దారిన బ్రతుకు పట్ల తృప్తి రేఖలతో సమూహాలు
దారి ప్రక్కన దైన్యం హైన్యం బాధలతో గుంపులు

వ్యక్తి భావ ప్రంపచానికి సమాజ వికాస చరిత్రకు
ఆకృతి నిస్తుంది కవిత దార్శనిక ప్రకాశంలో కళతో

మరో దారి లేక జలధిలో కలిసే నది ఒకటి
జలధిలో కలవడమొక గౌరవమనుకునే దొకటి
తనకు తాను అర్పణలో సులభంగా
బాధ్యత వేరొకరి బుజాలపైకి వెళుతుంది

పుట్టిన స్థానం నుండి సమాప్తి వరకు
పయనంలో కరుణకు కారణమవుతాయి
జీవన బంధువుగా హితకరమవుతాయి
ఉదార భావాలకు నిలయాలవుతాయి

శరణుచే రక్షణ కవచ మేర్పడుతుంది
మైత్రి చే అవగాహన స్థితి ఏర్పడుతుంది

మనిషి నుండి అభిమాన గుణం జారవచ్చు
పై నుండి లోయలో పడి పోయిన దశ రావచ్చు

అనలంలో వేల్చిన స్వర్ణ కిరీటం నిర్మలమై
మళ్ళీ రాజ్యాని కర్హతను పొందవచ్చు

విరామంలో విజయం పొందినట్లు కాదు
బుజాలపై మరో బాధ్యతల బరువులు చేరేను

II. 9

మహనీయుల దాహం తీర్చేందుకు
నిశితమైన శరాఘాత వేగానికి
భూమి నుండి పైకి ఎగసే హ్లాద గంగలా
కవిత వెడలుతుంది, కథకు మలుపు నిస్తుంది

రంగుల కలయికలో ఎన్ని విధాలో
అన్ని విభేదాలతో మనో లోకం
నిరంకుశుల పంజాలో చిక్కిన ఆక్రమణం
శూన్య మనుకునేది కూడ వదలబడదు

ముందు ముందు పొందే ధన సంపదలకు
భోషాణం గానూ ఉపయోగించ వచ్చుననీ
నిజాన్ని దాచేందుకు పెట్టె అవసరం లేదు
ఉన్న చోటునే అది ఉంటుంది గుప్తంగా

మధ్య మధ్య మంచుచే మబ్బుచే కప్పబడీ
జారిపోదు పారిపోదు మారిపోదు ఎప్పటికీ

నిజం సూర్యుని వలె చూపులలో ఒదగనిదీ
తన తేజంతో కనురెప్పలు వాల్చేసే బింబం

మనుషులకే కాదు చెట్లకు కూడా
పక్షుల వలె కొమ్మలపై ఎగరాలని
గాలికి కదలే ఆకులు ఉత్సాహ పడతాయి
ఇది సాధ్యం కాదని అందరికీ తెలిసిన వాస్తవం

కొంత వరకు మనిషిలో ఇనుప రెక్కలపై
తృప్తి రేఖ పొందిన మాట కూడ వాస్తవం
చెట్లు నది గిరి జలధి అన్ని దేని కదే
మనిషి వెనకనే ఎగరి సాగాలని ఒకరొకరిలో

II. 10

బ్రతుకులో ప్రశ్నలుగా మిగిలిన సామాన్యులు
అరిన కొరకంచు ముఖాలతో వీధులలో
లక్ష్యం దారి తప్పి మనిషి భ్రమించేనా?
ప్రజాస్వామ్యంలో హక్కులు కనుమరుగయ్యేనా?

చీకటి స్పర్శతో ప్రశ్న మనుషుల్ని వేరు చేస్తుంది
వెలుతురు స్పృహతో జవాబు మనసుల్ని కలిపేస్తుంది

దహ్యమాన మయితే ప్రశ్న మొలకెత్తే వీలు లేదు
తనువును బంధించవచ్చు, మనసును బంధించలేరు

అతిథిలాగ వచ్చి వెళుతుంది మేఘం
బంధువుగా చేరి వెళుతుంది కిరణం

సకల మయినా వికల మయినా సృజన విలయ
భూమికలతో మనిషిలో వెలుగుల తోనే అన్నీ

పుట్టిన సమయంలో ఎవరేమయ్యేదీ తెలియదు
పెరిగే కొద్దీ దశ దిశ మారే సూచన లెన్నో!
నిప్పంటిన అడవిలో ప్రాణుల ఆర్త ధ్వని
ఏ రోజున ఏ మూలనో వినబడడం ఘోరం

బాధలో ఒకరి పట్ల సానుభూతి ముఖ్యమయినా
కారణాల్ని వెదకి సరి చేయడం హృది కవసరం
రణ మనేది ఏ ఒకరికి మితం కాదు
మిత్ర శత్రు విభజనతో ఇరువురిదీ

ఎప్పటిదో వైరం స్పర్ధలతో సాగుతూ
ఇప్పటికీ తెలిసీ తెలియని ఫలితాలతో
నైతిక నిర్మాణానికి దార్శనికత టార్చ్‌లైట్
అన్వేషణ ఆలోచన కలిసిన ఆచరణం అవశ్యం

II. 11

పనుల అవసరాల్ని బట్టి శ్రేణులుగా
తీర్చ బడిన మార్పులతో సమాజం
ఒకే మాట బాట ఊహ డ్రెస్‌లో
కనిపించాలని కొందరు నేతలలో

గగనంలో ఎగిరేందుకు విహగానికి
ఏ భయ లేశం ఉండదు, సహజం
జలనిధిలో ఈదేందుకు జలచరానికి
ఏ భయ భావం ఉండదు, సహజం

అనుక్షణం దేనికోసమో నిరీక్షణం మనిషిలో
తెలుపుదనంకై రాత్రిలా పచ్చదనంకై భూమిలా
ఎరుపు దనంకై తూర్పులా కోరిక సహజం
కాలాన్ని బట్టి మారే సంబంధంతో దృశ్యం

మనుషులతో ఒకరొకరి మనో విధం భిన్నం
అభిరుచిలో వైవిధ్యం వ్యక్తుల అస్తితలో భాగం
ప్రజాస్వామ్య పథ మొకటే పలు దిశల తెరవబడీ
సృజనలో వివిధ తల కవకాశం కలదీ

మనిషి మనిషిలో ఒక్కొక ఆశా విధం
మేఘాన్నో కిరణాన్నో కెరటాన్నో తలపిస్తూ
ఇది మార్పుకు చిహ్నం కావచ్చు
ఇది మలుపుకు హేతువు కావచ్చు

మరో మనిషిలో పరిచయ మయినా
అస్తితలో విపులత కవకాశంతో
వ్యక్తితలో మార్పుకు దారి చూపవచ్చు
సమాజ సంబంధంతో హద్దు పెరగవచ్చు

II. 12

ఆకు రాలి చెట్టు ! దీన శూన్య స్థితిలో
మరల పచ్చదనంపై ఆశలు సహజం
ఇంతలో బుజాన గొడ్డలితో మనిషి
కలపకు బాగా పనికి వస్తుందనీ ! ఆలోచన

మౌనంలో ముఖం తెరచిన పుస్తకంలా
మాట మూత బడవచ్చు, భావ జగం కనిపిస్తూ
ప్రకృతిలో ప్రతి వస్తువు త్యాగ మయం
బ్రతుకుతో ప్రతి విషయం స్వార్థయుతం

బిగిసిన పిడికిలిలో మట్టి నుండి
సృజన ముఖం చూపేనా? ఎదిగేనా?
బాష్ప జలంతో తరువయి మనోజ్ఞమై
సుమ ఫల సంపద చూపేనా? నిలిచేనా?

దీవించే హస్త ముద్ర కవకాశం లేదు
సూచనలో వేళ్ళకు సడలింతలు లేవు
అసి కీర్తిని వేలు తాక గలిగేనా?
పూల దండ స్వీకరణం జరిగేనా?

స్వేచ్ఛగ చేతులు చేసే పనులెన్నో
మనసుకు నచ్చినవీ, మెచ్చినవీ ఎన్నో?
పలు పాత్రలలో తీర్చ బడినవీ
బహు భంగులలో ఆడ బడేవీ

నిరంకుశంలో స్వేచ్ఛ ఇరుకులో
నలగి అణగి సంకుచిత బంధనంలో
వసంతం తెలియని శిశిరానిది అధికారం
ప్రజల మతం కన్న ఏ ఒక్కరిదో ? ప్రభుత!

II. 13

ఈ భూమి ఒంటరి కాదు, తనతో ఎన్నిటి తోనో
జడమూ చేతనతో సృజన విలయ మిశ్రమ రూపం
మనుషుల సంబంధంతో ఇంద్ర ధనుసు మనోజ్ఞం
వాస్తవమూ కళ కలిసిన అనుభవ రమణీయం

భువిలో సంఘంతో సంబంధం ప్రత్యక్షం
దివిలో వ్యక్తితలకు అనుబంధం పరోక్షం
వస్తువులన్ని ఏదో బోధతోనో సూచనతోనో
అనుభవ దృశ్యాలలో బ్రతుకులు కనిపించేను

శిశువు మాట జోగు అయితే అందరిలో కంగారు
అదే మాట ముందుగ వింటే పట్టరాని సంతోషం
శిశువు మాట నుండి మధు బిందువు ఒలక వచ్చు
పెద్దల మాట నుండి ఖడ్గ ధార తాకవచ్చు

మాట వెనక నుండి స్పందనలో హృదయ లయ
పాటగ మార్చేసేను, రాగమయం చేసేను
అనుభవ మొక మానస రమణీయ వనం
సమయ సమయం కొత్తగా అపూర్వ కళతో

సత్యం ధర్మం ఎప్పటివో మాటలు, వాటితో
స్వేచ్ఛ సమత లిప్పటివీ ! సమాజ పథంలో
జన హిత దార్శనికంలో నూతన లక్ష్యంతో
సమాజ సంబంధంలో హేతు గుణ వివేకంతో

వార్తలతోనో గాధలతోనో చరిత్ర మాదిరి
ఏ స్థితిల్లోనూ కవిత శూన్య హస్తం చూపదు
అర్థ స్ఫూర్తి లేని శబ్దం వినిపించదు
భావ లహరి లేని అర్థం కనిపించదు

II. 14

రహస్యాన్ని ఛేదిస్తూ పోవడమే కవి కర్తవ్యం
లోన హృదిని విప్పారగ చేయడమే కవిత గుణం
ఇది నా స్వంతం నా విషయం నా వస్తువు
అనుకొనేవి ! ఒకటొకటీ! జారిపోయేను

ఉదయం ఎదపై వేలాడే పూల దండతో
సాయం సమయానికి ఒరలో ఖడ్గ బలంతో
సంస్కృతిలో మిగులుతుంది అనుభవ దృశ్యం
మనుషుల హక్కుల భగ్నం కానంత వరకే

గగనంలో ఉత్ప్లవనం తనకు సాధ్యం కాదని తెలుసు
పైన ఎగిరే పక్షిని చూస్తే కోరిక దృఢ మవుతుంది
మనిషి చుట్టు నలు వైపుల దారులనేకం
పోయే దిశ, చేసే పని పొందేదీ, తెలియడ మవసరం

స్వేచ్ఛకై తిరుగుబాటు హక్కుల ఆచరణంలో
స్వేచ్ఛలో పోరాటం ఉన్నది నిలుపుకునేందుకు
ఏ రోజున కారోజున అమృత కిరణ స్పర్శతో
నిలిచే యశో రూపం తన వశం కావాలనీ

ఎన్ని జాగ్రతల తోనో కాపాడబడే దేహం
హఠాత్తుగ పిడుగు పాటు పొందవచ్చు
చకితంగా పెను తుపాను ఎత్తుక పోవచ్చు
దారిలో అనుకోని ప్రమాదానికి గురి కావచ్చు

కవిత స్వాగతిస్తుంది మౌనాక్షర రూపంలో
లోన గభీర జలధి అలల కదలికతో
హృదిని పలకరిస్తుంది సానుభూతి చూపుతుంది
యానంలో శ్రమ పతాక రెప రెప లాడిస్తుంది

II. 15

అటు నుండి భూమి ఆకలి తీర్చేను
ఇటు నుండి నీరు దాహం బాపేను

జీవభూత మయిన మనసు మధ్యలో ఎప్పటికీ
అనుభవం ఆలోచన ఇరు రెక్కలు విదలిస్తూ

గోడకు ఇటుకల వలె కవితలో అక్షరాలు
ఒకటొకటి స్వతంత్రం ! కలయికతో నిలయం!
కళతో దార్శనికంతో మరో భావజగంలోకి
సమాజ నిర్మాణానికి అవసరం కవిత, మానసికం

కష్టంలో నష్టంలో అడుగులు సాగేందుకు
ఉత్సాహం నింపుతుంది కవితలో సృజన చేతన

గత మయినా మత మయినా మనిషి కొక విధం
వెనక నుండి వాద్య విశేషం సమాజం మ్రోగుతుంది

జన చలనం సంరంభంలో మానవం
కవితకు సంప్రేరణ రూపంగా నిలిచేను
ఉద్యమమయితే జలధి అలలపై పడవలా
రణపథ మయితే అనల శిఖలపై మబ్బులా

అన్నిటికీ కేంద్ర బిందువు స్థానంలో కవి
వైవిధ్య సమాజంలో చుట్టూ మనుషుల ప్రత్యేకతలతో
పవమాన రాగ లహరులతో ప్రకృతి చిత్రమయం
నాల్గు దిశల మధ్య ఆకర్షణ రూప విశేషాలు జీవితాలు

సృజన మనో భూమి నుండి కవిత అభినవంగా
ఉదయ సూర్య కిరణం వలె హ్లాద కరంగా
ఉన్నది పాతది అయినా, దిశల మధ్య కొత్తగా
దృష్టి కోణ భేదాలతో కనిపించే విధాలెన్నెన్నో

II. 16

నేలపై మనుషులతో సమాజ సంబంధం
ఎపుడు ఎవరు విడిపోయేదీ తెలియని స్థితిలో
గుండెకు ధైర్యం ఇచ్చే రవి చంద్రులు
నింగి నుండి ఎప్పటికీ వీడని సన్మిత్రులు

కురిసే ముత్యాల జల్లుతో, విరిసే పూల వానతో
మెరుపులతో పిడుగులకూ సిద్ధంగా ఉంటుంది మనస్సు
మబ్బుల ఆక్రమణంతో రవి ఆగమనం ఆగదు
చీకటి ఆలోచనతో శశి బింబం మాయదు తొలగదు

మోదం ఖేదం భావ స్థానాలతో కవిత మారుతుంది
గుండె లయ ఎన్నటికీ పక్క వాద్యం కాదు
స్పందనలో మనిషి ప్రాణ శక్తికి మూలం
కవితలో ఆత్మీయమై వీడని శబ్ద సారం

నీడ నిలవదు చేతి వేళ్ళకూ అందదు
కవి దృష్టికి మాత్రం స్నిగ్ధంగా ప్రియంగా
ఓడ ఆగదు నీటి తరగల జాలులో
కవి దృష్టికి మాత్రం కష్టంలో మిత్రంవలె

పక్షి ఎగురుతూ అలల తలలు నిమురుతుంది
కాళ్ళతో తరగల తలపులు చిమ్ముతుంది
చూపులో అందమైన దృశ్యంతో నీటిలో
సబ్‌మెరిన్‌లా కవిత! లోతులు చూపిస్తుంది

ఆలోచనలో గవేషణకు వీలు కల్పిస్తుంది
విపులతలో ఆకాశానికి సమంగా ఉంటుంది
పాత దనం వదలి కొత్తదనంతో కవిత
సమాజ రూపానికి కీర్తి పతాకగా ఎదురుగా

II. 17

అక్షరాల బోనులో హరిణం పులి సింహం
ఏదయినా అందం ఆపద ఉత్సాహం సూచనలు
మనుషులలో ప్రాణుల బంధం నిలిపేను కవితలో
సృజన స్థాయి పెరిగేను, వస్తువు విస్తృతి పొందేను

ఇదే మనిషి అయితే అనుమానం చేతులు చాచేను
మనసుకు ఆలోచనలో అన్వేషణం పని పెరిగేను
మనిషి చివరి దశలో మనోగత రూపం
ఆశల రెక్కలపై కల్పనలో భ్రమిస్తుంది

తన తలపై సూటిగ స్వర్గం ! అందనున్నదై
ఇహం కన్న పరంలోని మేలు ! అంచనాలతో

శ్రమ గతిలో వ్యక్తి కన్న పనికే ప్రాధాన్యం
సమాజ కోణం లోనే ప్రయోజనం

పొందే అనుభవ స్మృతి విశేషాల గాథలు
మంచివి అయితే మెడలో పూలదండలు పడేను
చెడ్డవి అయితే ఎదురుగ కొరవి శిఖలు తిరిగేను
మనిషి జీవితం స్టేజిపై సిద్ధమైన ప్రదర్శనం కాదు

మనిషి మరొక మనిషి అపుడపుడూ శత్రువు
మరో ప్రాణి వస్తువు విషయం లోనూ ఉండొచ్చు
అదొక సమస్య కావచ్చు, వ్యాధికి మూలం వైరస్
గొలుసు కట్టు వ్యాప్తిలో ప్రాణాంతకం "కరోనా"

ఒకటి తరువాత ఒకటి మనిషి చుట్టు వలయాలు
పొంచి, దేశం జాతి మతం వర్గం భేదం లేకుండా,
ప్రతి చర్యల తోనో అను చర్యలతోనో దీనిని
గెలిచే అభిలాషతో కొందరు ! వైజ్ఞానిక శక్తులతో

II. 18

ఇది సమరంలో విజయం లాంటిది
మనిషిలో శక్తుల్ని జ్ఞప్తికి తెచ్చేను
ఈ రణంలో విజయ ఫలం ప్రజలది
మరణ భయం వదలిన సంకల్ప యాత్రలో

ముళ్ళ వలె దారిలో ప్రశ్నలు సహజం
పయనం సాగడ మొకటే మతి ప్రభకు తార్కాణం
బాధకు భేదం లేదు, వ్యాధికి కరుణ ఉండదు
ప్రమాదాన్ని ఎదుర్కొనడం స్వచ్ఛమైన శక్తితోనే

నిశ్శబ్దాన్ని శ్రేయో రూపంగా తలచే వారూ
శబ్దాన్ని ప్రేయో భావనగా యోచించే వారూ

మిగిలిన ఇరు దిశలలో ఎదురెదురుగ
సృజన రూప మొకవైపు, విమర్శ గుణమొక వైపు

అడవిలో చరించే పులిని బోనులో చేర్చినట్లు
నింగిలో చరించే పావురాన్ని బంధించలేరు

ఆపదలో భయం జాగ్రతలకు పురికొల్పుతుంది
స్వీయ రక్షణకై మనిషిని ఉత్తేజ పరుస్తుంది

వాద్య విశేష రూపంలో ఎదురుగ నిశ్శబ్దం
చేతి వేళ్ళు తాకితే తంత్రులు మాట్లాడేను
మ్రోగించే నైపుణిలో కళతోనే
నాద లహరి అందరికీ వినిపిస్తుంది

అందం ఆనందం! ఎక్కడ ఉంది?
విరిసిన పూవులో కదలే మాటలో
శిశువు ఆటలో హృదయ లయలో
బిక్షువు పాత్రలో పడే నాణెం శబ్దంలో

II. 19

ఉద్యమ మయినా యుద్ధం అయినా చరిత్రలో
పొగలను చీల్చుకొనీ మంటల పై నుండీ
బయట పడిన శూరులకే అస్తిత కవకాశం
ఈ గెలుపుకు ఎక్కువ పని, మతి చతురత తోనే

కల కరగుతుంది అంతలో సరిస్తుంది
మెలకువతో అలయై తరలుతుంది, ఆగదు
అనుభవ తలాన విత్తబడిన బీజం
కలలో తరువయ్యేనా? బరువులు నింపేనా?

పాపాలను ఉన్న చోటు నిండుతుంది మనసులో
పుణ్యాన్ని నింపుకొని తనలో మనస్సు బ్యాగ్‌లో

శూన్యంగా ఉన్న చోటు నిండుతుంది మనసులో
వివిధ వస్తు చయంతో స్మృతి మందిర మవుతుంది

తనలో అనుభవ రూపాలు గడ్డ కట్టి
ఏక శిలయై మరో కలకు కారణమై
బయటకు రావడమొక మేజిక్ ప్రయోజనం
శిల్పికై నిరీక్షణం సమాజ ప్రదర్శనకు భేష్

ఒక దిశ కాక పోతే మరో దిశ ప్రతిగా
ఒక పని కాక పోతే మరో పని బదులుగ
భుక్తికి రక్తికి శక్తిని ప్రకటించేను మనిషి
ఒక ఊరు వదలి మరో ఊరు ప్రియంగా

రాత్రి వేళ చేక్కలు ! గగన మంటపంలో
చల్లిన పూలనో పరచిన మణులనో
ఎగసిన రవ్వలనో అన్నపు మెతుకులనో
తలపించ వచ్చు ఒకరొకరి కొక విధంగా

కవిత కదలిస్తుంది మనసును ప్రశ్నలతో
కవి నుండి సమాధానం ! కవితలో భద్రంగా
ఒంటరి తనం చుట్టూ విశాల సమాజం
లోన లోతు జలధి పై పైన భ్రమలతో గగనం

II. 20

రాత్రి అతిథిగా వచ్చిన వ్యక్తి ఆశ్రయంలో
తెల్లవారే సరికి ఉదయ కిరణంతో
తాను యజమాని కావాలని కోరిక
కల్పనలో ఏర్పడింది, వాస్తవ రూపం పొందవచ్చు

కొంత సేపు నీలి మబ్బు చాటును పొందాలనీ
చండతలో సూర్యునికీ మనసులో ఉండవచ్చు
తన నీడ వెంట ఉంటే, తనతో పాటు నడిస్తే
చల్లదనం లభించేనా? ఛత్రం అయ్యేనా?

పూర్వం అడవిలో ఉండే మనిషి, నిజమే
అక్కడొక పూవు అలం కృతికి సుందరతలో
ఇక్కడొక ఫలం ఆకలి తీరేందుకో
ఇప్పుడు ఊరు చుట్టూ తోట పొలం చేనుతో

అందరిలో ఏదో ఆయుధ ముంటుంది
ఉపయోగించే సమయం సందర్భంలో
పొరపాటునో ! గ్రహ పాటునో
అనుకోనిది ! జరగవచ్చు తెలియదు

చెలామణిలో లేని పాత నాణెంతో
బజారులో కావలసిన వస్తువు లభించేనా?
సత్యానికి మంచి డైస్ లాగా
బాగా ఉపయోగిస్తుంది అబద్ధం

ఏదయినా ఎవరయినా తన కవిత మరొకరి
ఎదురు పడిన బాల్య మిత్రం వలె ఉండాలి
ఆఖరికి అద్దంలో ముఖ బింబమయినా సరే
తుమ్మ ముళ్ళ చెట్టు ఎదుట నిలువ కూడదు

రాత్రి జరిగిన హత్య కెవరు బాధ్యులు?
సాక్ష్య మెవరు? ఎవరికి తెలిసినా తెలియకపోయినా
కవి బుజాలపైనే! అందరి బాధ్యతలూ కవివే
సాక్ష్యం న్యాయం నిర్ణయం శిక్ష అన్ని పాత్రలూ

II. 21

శబ్దంలో నిశ్శబ్ద మనో లోకంతో కవిత
జీవితమూ సమాజమూ కలిసిన అనుభవ కళతో
కవి తదుపరి సహృదయులకు తమదే అన్నట్లుగా
అక్షర మనోజ్ఞమై కాలానికి సంపద అవుతుంది

పదమూ అర్థం భావన ప్రకటన ఆకర్షణలో
అనన్యమైన దర్శనమిస్తుంది కవిత, మనసుకొక విధంగా
కదలికలో చేతన, స్పందనలో జీవం ఆయువు పట్లుగా
దశ దశలో ఎన్నిటినో సాధించింది మనిషి, మనిషే

గిరి శిఖరం నుండి క్రిందికి దూకే జలపాతానికి
ముందు దారి నెవరు నిర్ణయ పరచేరు
చలన మొక విధం కాదు, నడత ఒక తీరు కాదు
భిన్న భిన్న మనో జగాలతో కవిత లెన్ని విధాలో

ప్రతి కవి లక్ష్యం ప్రేమ, కరుణ, శాంతి మానవత
పయనంలో మధ్య మధ్య కలహ సమర విషాద దృశ్యాలతో
కదలే నవ వికాస చక్రానికి అరయై
కవి కోరే దొకటే ! సమరస భావనతో అభ్యుదయం

వర్తమాన తలంపైన కాళ్ళు నిలబడితేనే
గతంలోని విత్తు నుండి భవిత ఫలం అందేదీ

కవిత వెడలుతుంది మనో గగనంలోని
మబ్బు నుండి జారే జల కణ కుసుమాల్లా
చెట్టు నుండి ఆకులు పూలు ఫలాల్లా
కోరికలన్నీ ఒకటికావు! మిత్ర శత్రు బలాలతో

ఒక గొడ్డలి గాటుతో చెట్టు పని అంతం కాదు
ఒక దుర్ఘటనతో మనిషి బ్రతుకు సమాప్తి కాదు

నేడు ఉదయ కిరణ పంక్తులవే పురోగమనంలో
నేటి ప్రశ్నకు సమాధానమై పయనం సాగుతుంది

II. 22

మనిషి బ్రతుకు ప్రకృతికి సమగతిలో సాగదు
మనో విధం ప్రవేశంతో నడతలు మారేను
పొందే అనుభవ లోకం ఛిన్నమై
కోరే ప్రయోజన దిశలు వేరయ్యేను

విహనం వలె పై కెగిరే కోరిక ఎప్పటిదో?
విమాన యాన సుఖంలో తృప్తి రేఖ మెరసేను

ప్రతి సమస్య వెనక జన గళ రవం ! సరిస్తూ
పరిష్కార యోచనలో నేతలు ఒకరొకరు
తెలియని దానిని గురించి చింతనలో కవిత
అక్షర రమణీయ మయిన రహస్య విపాటనం

కవిత శబ్ద మయం గగనంలో చిర బంధుత
జీవ సార రూపంతో భావ మయం ఆకర్షకం
ఇది ఆకలి తీర్చేది కావచ్చు
కత్తి నెత్త జేయవచ్చు "అసమంజస" స్థితిలో

బాణంతో పాటు మిసైల్‌ను అభిమానిస్తూ
ఇంతవరకు సాగిన వికాస దశలలో
ఆయుధ రూపాలెన్నో ! సమాజ గర్వకారణమై
సమస్య తీరవచ్చు కొత్తది చేరవచ్చు, మారవచ్చు

ప్రకృతి భూమికలో సమాజ దృశ్యంలో మార్పు
వికృతి ప్రభావాలలో మనిషిలో అందోళన వేదన
మంత్రాంగం రాజ్యాంగం తీర్చిన పాత్రలలో
పైన చంద్ర బింబం! టేబిల్‌పై ఐస్‌క్రీం ప్లేట్‌లా

ప్రేమను పంచాలని కరుణను చూపాలని శాంతిని పొందాలని
పూలతో పండ్లతో కదలే చెట్టు గాలి ఏ ఒకరిది కాదు
మనిషిని ఆపదలు విరాగం వైపు నడిపంచేను
ఆ వెనకనే మనిషి నీడలో సర్పం కదలుతూ మెల్లగా
పైన విహగం గుండ్రంగా చక్కర్లు కొడుతూ
క్రింద చకితంగా సర్పం పక్కనున్న పొదలోకి దూరేను

సెలవు లేదు

III. 1

మనో నిలయం ఒకవైపు నుండి
చేతిలో పూవు తోనో ఫలం తోనో
మరో వైపు నుండి అపుడపుడు
చేతిలో విల్లు తోనో కత్తి తోనో

జీవన భాగ్యంకై మనుషులు ఎప్పటికీ
పురా యుగం నుండి నేటి వరకు
మిత్ర శత్రు కలహ సమర గతులతో
కవిత ! తిప్పుతుంది రెండు రెక్కలపై

ఆహారం దేహానికి అవసరమయినట్లు
ఉత్సాహం వీరానికి ప్రధాన మవుతూంది
తనలో ఆశకు ఎత్తుగ ఆరోహణలో
సార్థకమై ఆయువు సాగాలని కోరిక

మబ్బులలో చిక్కుకొనీ భూమికి చినుకులతో
భూమి తలంపై పిడుగుకు గురి కావచ్చు

జలధి హోరు ఎవరికోసమో శబ్దించదు
విను కలిలో అందరికీ సాగే స్వరమొకటే
వన మయినా గిరి అయినా మనిషయినా
శబ్దంలో నాదం రసమయమై స్పృశించేను

మనుషులు తొడిగే రంగుల దుస్తుల్ని కిరణం
చూపుతుంది మారవచ్చు పాత్ర కనుగుణంగా

III. 2

మనిషి మొదటి పరిచయ రేఖ తోనే
అసలు రూపమేధో మనసుకు తెలుస్తుంది
జ్వాలయా చీకటా దీపమా కిరణమా?
కలిగే ప్రశ్నలకు జవాబులు వెదకుతూ

అవసరాన్ని బట్టి శూన్య స్థానాలను నింపుతూ
చేర్పులెన్నో మార్పు లెన్నో జీవన గమనంలో
నింగి నుండి నీలి మబ్బు శాంతి సందేశం
భూమిని పచ్చని వాస్తవాకృతి నిస్తుంది

మనిషి హృదిని హ్లాద పరుస్తూ
ప్రకృతి ఎదకు సృజన హత్తుతూ

భూమి నావహించిన జల రాశిలా
తెలిసిన దాని కన్న తెలియనిదే ఎక్కువ

మనిషి కవసరమయిన వెలుగు కొంతే
మిగతాది తొలగించే నియంత లెవరు?

చీకటిలో కాని ! వెలుగు విలువ తెలియదు
తానే వెలుగై కదలాలని మనిషిలో

దీపం వెలుతురులో నడవడమొక ఎత్తు
తానే దీపమై పోవడమొక ఎత్తు
చీకటి నెదుర్కొనే సంకల్ప బలంతో
మనిషి దీపం కావచ్చు
మనసు సూర్యుడు కావచ్చు

III. 3

ఉదయం స్వర్ణ వర్ణ కిరణం
బ్రతుకులను ఆశా రేఖలపై నడపాలని
సాయం వేళల పిశంగ వర్ణం
బ్రతుకులో విరాగ ఛాయను దింపుతుంది

గగనంలో ఇంద్ర ధనుసు విరిసి పగలు
మనిషి నిలిచిన భువిని మరపిస్తుంది
రాత్రి చుక్కలు జలధిలో పడవల వలె
కాలక్షేపానికి బాగా తోడ్పడతాయి

చీకటి నెదుర్కొనే మానస బలమిస్తాయి
చీకటితో మైత్రిని పెంపొదిస్తాయి
బ్రతుకు చివరలో వ్యక్తికి లభించే కానుక
మృత్యువు ! అనుభవ విశేషంతో అపూర్వం

ఇంకొకరికి ఒప్పు జెప్పేది కాదు
మరొకరితో పంచు కునేది కాదు
భూమి నుండి నిష్క్రమణం జరిగినా
స్మృతి వని కవితలో భద్రంగా చిరంగా

వివిధ కుసుమ పరిమళాలలో
పూర్వం జరిగిన కథలు తరలుతాయి
చీకటిలో మాటలు ఆకృతి భేదాలతో
వెలుతురులో మాటలు ! అర్థంలో మార్పుతో

III. 4

తాపంలో శుష్కమైన స్థితిలో
పలు శ్రేణుల సముదాయాల సమాజం
మబ్బు నుండి చినుకులతో పాటు
మెరపు వెంట పిడుగుకు సిద్ధంగా ఉంటుంది

కాలాన్ని ఆక్రమించే శక్తిలో
మనసుల్ని ఆవహించే రక్తిలో
రెండు రెక్కలపై ఎగిరే విమానం కాదు జీవితం !
అప్పటికపుడు పయనం దిశ మారుతుంది

ఇది స్క్రీన్‌పై చలన చిత్ర ప్రదర్శనం కాదు
ముందుగ అన్నీ సమకూరిన సామగ్రీ సమగ్రం కాదు

ప్రహరి గోడ ఎత్తు పెరిగే కొద్ది
నింగి ఎత్తు ఎక్కువయి పోతుంది

ఎవరికి వారు తోటలో పూవులా సంఘంలో
విరిసి పరిమళంతో గాలికి ఉల్లాస పడాలనే

బాధలో వేదనచే జారిన అశ్రువు
అనల క్షణాన్ని తలపించేనా?
మళ్లె మొగ్గను చూపించేనా?
శూన్యంలో తెలియని రహస్యమై పోయేనా?

వేదికపై తన పాత్ర మాటల్ని మరచి
మరోపాత్రలో ప్రవేశించి నాటకం సాగుతూంది

III. 5

ఏదో ఒక వైపున మనిషి ముఖం
ఏదో ఒక కోణంలో చూపు
దిశ నుండి దిశకు తిరుగుతూ
వల పన్న వచ్చు, రంగవల్లి తీర్చ వచ్చు

ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు
ఏదో ఒక దారిన పయనం తప్పదు
శక్తి లాగి నంత వరకు తనలో
రక్తి ఆగనంత వరకు హృదిలో

దీనికే హద్దులు లేవు, నియతులు లేవు
రాజ్యానికి వ్యవహారానికి వ్యాపారానికి కవితకూ

ప్రకృతి భూమికతో బ్రతుకులు తప్పనివీ
మెతుకుకై ఆరాటం ఆవేదన ఎప్పటికీ

గ్రీష్మ తాపం లేంది మబ్బులు లేవు
వర్ష హృదయం లేంది ప్రకృతి రూపం లేదు

నిజానికి ఉన్నది వెలుగు ప్రతిరూపం నీడ !
చుట్టు వస్తువులు పలు రంగుల కలయికతో

రాత్రి ఆగదు చీకటి రాక తప్పదు
ఇది తెలిసినా ఎవరు తప్పుకుంటారు?
దిశ నుండి దిశకు చూపులతో కోణాలతో
నవచేతన వికసిస్తేనే కవితకు అభినవం

III. 6

కను చూపుకు చాటయినా కుసుమం
గంధంతో అనుభవాన్ని ప్రేమమయం చేస్తుంది
ఇది విప్పారే శబ్దగతం ! కవితకు సహజం
దూరం దూరం పవనం వాస్తవాన్ని తరలిస్తుంది

అక్షర వాహనంపై బహు సులభంగా
వర్తమాన పథంలో ఎవరి గమ్యం వారిది
అక్షర ముకురంలో వాస్తవ దృశ్యాలతో
వ్యక్తుల జయాపజయాలు సమాజ పరమయ్యేను

పాత్రల చర్యలు ప్రతి చర్యలతో సమాజం
వ్యక్తి బ్రతుకుతో చరిత్ర నిర్మాణం! ఒక నాటకం

అనుమానం బాధ భయం ఖేదం
మూట కట్టి పెట్టెలో దాచేవి కావు
పయనంలో వాహనం నుండి మూటను
బయటికి విసరి పడినట్లు పోయేది కాదు

సంచిలోంచి జారిన నాణేల్లా చినుకులు
భూమి వశమై మనిషిని మురిపించేను

తాపంలో ఎండిన చెట్టు గొడ్డలి గాట్లతో
అంతం కాదు, జీవ సార మూలంతో
చివురు ముఖంలో నవ్వును ప్రకటిస్తుంది
ఆర్ద్ర స్పర్శతో వసంత శోభను సూచిస్తుంది

మూసిన పిడికిలిలా చీకటి రాత్రి గడచి
ఎత్తిన చేతులతో ఉదయం వెలుతురు దీవెన

III. 7

చీకటి రాకతో ప్రతి వస్తువు రంగు మారి కనిపిస్తుంది
నలుపు లోకి అన్నీ స్థూల దృష్టిలో ఒకే విధంగా
గుడిసె పై పడిన అనల కణంతో మంట లెగసి
చీకటి నొసటన తీర్చిన తిలకం గుర్తు కొచ్చేనా?

పేద బ్రతుకులోని ఆగ్రహ జ్వాలను తలపించేనా?
రాత్రి గుండెలో వెలిగే వేదన చూపేనా?
పగలు వెలుగులో రణ శబ్దం తప్పక పోవచ్చు
కాని, రాత్రి వీణా నిక్వాణం వినాలనే కోరిక

వికసించిన మనసుతో మనిషి మాట వినాలనీ
జ్వాల లణగి పూల మాలయై క్షణాల నలంకరించేనా?
ఇది వాస్తవ మవడానికెంత కాలం పట్టేనో
అనుభవాని కొచ్చేందు కెన్ని దశలు గడవాలో?

నీలి మబ్బులో నీరులా మనిషి మనసులో కరుణలా
కాలానికి రసాకృతి నిస్తుంది కవిత! వివిధ ఘటనలతో
ఇది ఎంత వరకో! అంత వరకె రూపొందుతూంది
అపై మనిషిని ఆలోచనలో గడపగ చేస్తుంది

రేకులు విప్పారి పూవు నేల రాలుతుంది
ఏ రూప మెత్తేదీ ఎప్పుడు ఎదిగేదీ, తెలియదు
తన ఎకౌంటులో బాలెన్స్ తోనే
చెక్కు చెల్లి క్యాష్ చేతికందేదీ!

III. 8

గాలి ఊపిరి పోస్తూ దేహాన్ని వేణు మయం చేస్తుంది
భౌతిక మానస స్థాయి భేదాలతో జీవితాలు అంతటా

ఎంతటి కల్పన లోను బ్రతుకుల వెనక నుండి
శ్రమ జీవన చలనంలో హృదయ రాగం ! వాస్తవమై

ఇంటిముందు గోడకు వేసిన రంగుల అమరికతో
ఇంద్ర ధనుసు రూప మిచ్చి తీర్చి నమ్మించలేరు

బుజాన శాలువాతో శాంతి పాఠం వల్లిస్తూ
క్రూర చర్యకు ప్రేరణతో నీడకు తోడుగ నిలిచేరు

ఎవరు ఎక్కడ ఉండేదీ ? ఎటుపోయేదీ మరొకరికి తెలియదు
మృత్యువు విషయం గాలికి కూడ తెలియదు, అమాయకం
బహు ప్రమాదకరమైన రూపం వస్తువు భావనతో
ప్రతి మనిషికి బయట! పోరాటం తప్పనిదవుతుంది

అల్పీయం నుండి మహనీయం దాక వివిధ క్షేత్రాల్లో
స్థూలమైన సూక్ష్మమైన హద్దుల గీతలు దాటుతూ
మినహాయింపులు లేని జీవ బలంతోనే మనుగడ
పనికి రానివిగా వదలినవి సృజన రూపం పొందేను

కల్పన వాస్తవం ఇరు తీరాల మధ్య ప్రవాహమైన జీవితంలో
అడ్డంగా నడవడం పొడవునా పయనించడం మనిషికి ఇష్టం
నీడలు ఆయుధాలుగా మారిన ఘటనలెన్నో

ప్రాణం కయి సుఖ భాగ్యంకయి అన్నిటినీ వదలి
మనిషి నుండి మనిషి దూరం జరగవచ్చు
మనిషి రూపం గుర్తు పట్టగల చిరునవ్వు ముఖ్యమవుతుంది

III. 9

ఉదయ బింబ మెంత శుభ సంకేతమయినా
జీవితాన అనుభవాలు భిన్న భావమయాలు కావచ్చు
మోదం ఖేదం రాగం వేదన ఓటమి విజయం ఎన్నో
ప్రకృతిలో సంస్థితులకు సమాంతరాలు కావు

పగలు రాత్రి సూర్య చంద్రుల నాయకత్వంలో
ప్రతి రోజు గంటలపై ఆరోహణ మవరోహణం
కాల గమనంలో దృశ్య ప్రకృతితో మానస బంధంతో
జీవితాన ఏదీ దేనికీ అనువర్తన రూపం కాదు

మెరపులతో ఉరుములతో శీతల పవనంతో
మేఘం పిడుగులతో భయ చిత్రం గీస్తుంది
ఎదురుగ అస్థి పంజరం వలె ఉన్న చెట్టు
ఆకులతో తుష్టిని చూపేను, పుష్టిని పొందేను

రోజూ నడచే దారి మధ్యలో ఒక రోజున
కాళ్ళ సందులలో నుండి సర్వం మెరుపులా దూసేను
ఆకు రాలుతుంది కెరటం కదలుతుంది
క్షణ మాగదు కాలం, మనిషి చూపు భూమిపైనే

ఖాళీ బ్యాగ్‌తో బయలు దేరిన మనిషి
వస్తువుల్ని నింపుకొని నిలయం చేరేను
పూవు నుండి పరిమళం మనిషి ఆలోచనలో
ఇది తెలిసేది మనసు సృజన రూపమయితేనే

వసంత హృదయంలో సంవదిస్తుంది అక్షరం
అక్షర తేజం నడిపిస్తుంది మనిషిని భయరహితంగా

III. 10

కవిత ఆగదు ఏ స్థితిలోనూ
సమాప్తి లేదు ఏ దశలోనూ
పుట్టుక కెదురుచూస్తాయి కళ్ళు
అవి భవిత ముఖం వైపు చూడ లేవు

కష్టంలో నష్టంలో బరువులో బాధలో
జీవితాన్ని వదలి మనిషి దేనిని వహించేను
ఇది తగదని తెలిసి కూడ మనసులో
మనుషులు చేసే పనులెన్నో స్వార్థంలో

కవితకు మూల మెక్కడో లేదు
ఎదురుగ జీవిత రూపం ప్రేరణలో
కొండలుగా రాశీ భూత మయిన కాలమెంతో
ఏ దుస్థితిలోనో దౌర్భాగ్యం మనిషి వశమవుతుంది?

భూకంపం తుపాను సునామి మహామారి పతనం
వెనక నుండి మనిషిలో ఆశా రూపం నిర్మాణంలో
అభద్రతలో చుట్టూ అశాంతి వలయంలో అన్నీ
యథాతథం మధ్య మధ్య మనిషి పరివర్తన చేతనతో

మానవ యానంలో సమాజ దృశ్యం నుండి కవిత
వర్తమాన జన స్పందన చరిత్ర ! కాలం స్క్రీన్ పై

పుణ్యం పాపం ప్రేమ ద్వేషం నేరం శిక్ష
రంగుల కమ్ముల ప్రశ్నల పంజరంలో అంతరంగం

ఉరి తీయబడిన మనిషి చివరిమాట స్వర భేదం
ఇప్పటికీ గాలిలో తిరుగుతూ మరో స్వరంతో !

స్వేచ్ఛా కవిత్వం - 111 & 112

లాక్ డౌన్
(రెండో భాగం)
&
వర్తమానం మెట్లమీంచి

మాదిరాజు రంగారావు

2020
రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్-28.

No. 111 & 112

SWECCHA KAVITHVAM

Free - Verse

Telugu

LOCK DOWN (second part)

&

VARTHAMANAM METLA MEENCHI

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2020

Presented to
my Son
Dr. M. Santhosh Kumar
with affection
on his Happy Birthday

భూమిక

ఈ " వర్తమానం మెట్ల మీంచి" కృతి వ్యక్తి, సమాజం, ప్రకృతి–ప్రగతి బిందువుల నుండి సాగిన రేఖా చిత్ర సంపుటి. ఇది అనుభూతి స్పందనలతో ప్రగతి లక్ష్యంగా రూపొందింది. ఈనాటి జీవన వాస్తవాన్ని ప్రతిఫలిస్తూంది. దీనితో పాటు "కరోనా"పై "లాక్‌డౌన్" పేరుతో రెండో భాగం (26–43) చేర్చబడింది. "అక్షతం" టైటిల్‌తో వెలువడిన కృతిలో మొదటి భాగం 1–25 ఖండికలు కనిపిస్తాయి.

ఈ రెండూ కలిపి 1–43 ఖండికలతో కరోనాపై ''లాక్‌డౌన్'' కావ్యం సంపన్నమయింది. ఇది వివిధ కోణాలలో వేయి పంక్తులకు పైగా అవతరించింది. ఈ దీర్ఘ కవిత సంఘటనల్ని, సందర్భాల్ని ఆశ్రయించింది. తత్కాలీనమైన ప్రాముఖ్యాన్ని కలిగింది. విషయం చేత చిర ప్రయోజనాన్ని పొందింది.

ప్రస్తుత రచన "వర్తమానం మెట్ల మీంచి" లో (1) బాహ్యం (2) ఆంతరం రెండు పొరలు దృష్టికి వస్తాయి. మొదటి పొరలో సాధారణ విషయం రెండో పొరలో విశేష భావనా రూపం పరిశీలన కందుతాయి. ఇది కవిత్వానికి భావ సాంద్రతను చేకూరుస్తుంది. మొత్తం మీద రచన మానవీయం కేంద్రంగా ప్రజాస్వామ్య సామ్యవాదం దార్శనిక లక్ష్యంగా ప్రగతి రూపాన్ని పొందింది. సంక్షోభం నుండి శాంతానికి పయనించాలనే మనిషి ఆశయం.

(1) వ్యక్తి వికాసం (2) సమాజ స్థితి గతులు (3) ప్రకృతి నిజ స్వరూపం (4) మానవ మనస్తత్వం (5) వర్తమాన తలం నుండి భవితకు పయనాన్ని గమనించవచ్చు. ఆంతరమైన భావ సౌందర్యానికి ప్రాధాన్యం కలిగింది. తన ప్రత్యేకతను నిలుపుకుంటూంది.

ఇక "స్వేచ్ఛా కవిత్వ" మన్న మాట – నేను 1958 నుండి ఉపయోగిస్తూ వస్తూంది. అప్పటికి "రచన కవిత్వ" మన్నమాట స్థిర పడలేదు. విషయంపై చర్చలు జరిగాయి. నేను సమంజసమనుకున్న "స్వేచ్ఛా కవిత్వ" మన్న మాటనే ఉపయోగిస్తూ వచ్చాను. ఇప్పటికీ పరంపరగా నిరంతరమైన ప్రవాహ రూపం సాగుతూంది. ఇది సృజన కృతికి మంచి వాహనంగా ఉపయోగపడుతూంది.

సాహిత్య సహృదయులకు స్వాగతం.

– మాదిరాజు రంగారావు

లాక్ డౌన్ (రెండో భాగం)

II. 26

ఎప్పటికీ ఏకాంతంగా వసించలేరు మనుషులు
స్వేచ్ఛను కోరుతుంది మనసు, అణగి ఉండలేదు
శుచి శుభ్రత నియమ నియతితో వ్యక్తిత్వం
జీవన లయ సుందరమై, కరోనాకు అందనిదీ,
బయటి సమాజాన్ని కాదని స్వయం నియంత్రణంతో
సమూహాలకు పరిసరాలకు దూర మెప్పటిదాకా
వ్యక్తి విధులతో పాటు సమాజ బాధ్యతలు
వికాస గతిలో విస్మరించే వీలులేదు, ఎవరికైన

మనిషిని చూస్తే మనిషిలో కోవిడ్ మాటలే ! మాటలు
బ్రతుకుపైన నిరాశతో ధైర్యం కోల్పోయేరు
గూడు నుండి పక్షి ! బయటికి వస్తుంది
స్వేచ్ఛగా కొమ్మపై వాలుతుంది, కల స్వరంతో
మనిషి గడప దాటితే తిరిగే సమాజ చక్రంలో
నిరంతర గతిలో సమూహాలతో శ్రేణులతో పని!
ఇది వైరస్ ! జీవితాన్ని విషాద మయం చేస్తూంది
శ్రమ శక్తుల్ని బూది దిబ్బలుగా మార్చి వేస్తూంది
కరోన ప్రభావంతో డీలా పడిన జీవితాలు
ఆగిపోయిన పనులతో ఎండిన తరువును తలపించేను

ఐస్‌క్రీం ముక్కల్లా ఓదార్పు మాటలతో
ఆకలి తీరేనా? ప్రాణాలు నిలిచేనా?
అవసరాలు తీరేనా? బాధలు తొలగేనా?
ఊయెలపై ఊగుతూ! గమ్యం చేరేరా?
పోవలసిన గమ్యమేదో? దారిని చూపేనా?
బలాన్ని హరించే కరోనా ! మృత్యువు ప్రతినిధి అవుతూంది
మనిషితో మనిషి పని చేయడం ఆగని సహజ క్రియ
తుది విజయమిదే! మనిషిలో ఉపజ్ఞ పరిశోధనతో
సహకారం సహభావం తోనే సమాజ వికాసం
దోషానికి తావులేని నిర్మల యానంతోనే భవిష్యత్తు

II. 27

గుండెకు కవచం లేకుండా రణ ప్రవేశం జరిగేనా?
శిరస్త్రాణం లేకుండా శింజానం మ్రోగేనా?
మనిషిలో సమర చర్యకు రక్షణ విధులెన్నో
విశేష విధానం తోనే కరోనాపై పోరాటం

ప్రజకు మేలు చేసే లక్ష్యం ధైర్యంతో నడిపిస్తుంది
ఒక్క అడుగు వెనక్కి వేసే ప్రశ్న రాని సమస్య ఇది
నాలుగు గోడల మధ్య మెలగడ మవసరమయింది
రవిపై నమ్మకమున్నా చీకటిలో దీపంతోనే పని

లిప్తల చక్రాలపై నడచే కాలం ఆగదు
ఎటు బడితే అటు పోయేది కాదీ వాహనం
శక్తి ప్రదర్శన కవకాశాన్ని ఎవరు వదలుతారు?
కరోనాను ఎదుర్కొనే సంకల్పబలంతో ఇపుడు మనిషి

బాధా నిరాశలతో భయ సందేహాలతో
గడచే జీవన యానంలో మార్పు అవసరమవుతుంది
సమాజ శక్తిని గుర్తిస్తూనే సమూహాలకు దూరంగా
మనుషుల ప్రాణంతో పని! బాధ్యతలను పెంచేను

వ్యక్తి నుండి సమాజ స్థాయిలో చికిత్సా కార్యక్రమం
కరోనా కట్టడిలో మానుష యత్నంలో ఒక విజయం
సమాజ చరిత్రలో ఇలాంటి విషమ స్థితులెన్నో
అధిగమించిన దేశాలకు కొత్తకాదు, భయదమైంది

కఠిన వాస్తవాల్ని ఎదుర్కొని నిలిచే జీవితం
పరిణామ క్రమంలో వికాస దశలకు మూలం

మహామారి కరోనాను శమింపచేసే పద్ధతి
రేపు దీనిని తుడిచిపెట్టే గొప్ప పనిలో కీలకం
ఇపుడు జరుగుతూంది ప్రపంచ స్థాయిలో
రణ సమానమైన సాహస ప్రేరణతోనే
మలినం మాట మరుగున బడి మరచి
తళతళలాడే స్వచ్ఛతతో బ్రతికేమనే

II. 28

వ్యక్తి క్షేమం సమాజ శ్రేయంకై
కఠిన దీక్షా సాధనం స్వీయ కర్ఫ్యూ
నవ జీవన నిర్మాణానికి అవకాశం లాక్ డౌన్
ఇవి సార్థక మవడంలో ఉంది మనిషి ప్రజ్ఞ

సరికొత్త దశ దిశగా ఆలోచనలో సమాజం
పొందే ఫలితం అందరిదీ, సమన్యాయం సమష్టిగా
సూక్ష్మదర్శినిలో కిరీటాన్ని పోలిన కాంతి వలయం సూక్ష్మజీవి
గ్రహణంలో సూర్యుని చుట్టూ నీలి మచ్చనంటి జ్వాలా కంకణం
మలినం నుండి ప్రమాదకరమైన వైరస్ కరోనా
విషమ సమస్యకు దీటైన జవాబు మనిషి వర్తన చర్యలతోనే

మారణ గుణ రూపంపై హఠాత్తుగా రణ వాతావరణం
నిశితమైన ఎండకూ తీవ్రమైన తుపానుకూ తట్టుకునే
యోజనతో మనిషి సిద్ధమయ్యేను త్యాగశీలంతో
విలయ రూపమెపుడు అవతరించేదీ తెలియదు

సమాజ వ్యవస్థ ఎక్కడికక్కడ స్తంభించిన స్థితిలో
ఉన్నతి అవనతమై వికసనం ముకుళితమై జీవితాలు
ఇంట్లో ఎంత కాలం గడపేరు, ప్రయోజనాలు వదలుకొనీ
దేనికయిన వ్యవస్థ ఎప్పటికీ సిద్ధంగా ఉండవలసిందే

ప్రమాదకరమైన వైరస్ ప్రభావ దృశ్యాలు; భయ రూపాలై
అనుకోని విషాద భయాల్ని దింపేను, మనిషి బ్రతుకులో
ఇదొక గొలుసు కట్టుగ మనిషి నుండి మనిషి మనిషికి
దీనిని ఛిన్నం చేయడం నివారణ పథకంలో భాగం

అవసరాలతో పాటు బ్రతుకులో అమూల్యాలను
కోల్పోయే దుస్థితి సమస్యకు జటిలం చేసేను
పని చేయని వ్యవస్థ తీరు తెన్నులు చెదరేను
ముందుగ భయం నుండి మనసులు ముక్తం కావలసి ఉంది
ప్రేమ కరుణ మమత సమత ఒకటొకటీ దిశలలో
జారిపోయి జీవితాలు శూన్యానికి ప్రతినిధులయ్యేను

II. 29

మనిషి చుట్టు నియమ నిబంధనలు హఠాత్తుగా
అంతలో కంచెలు వెలసేను, హద్దులు మారేను
ఇవి ముళ్ళను వెలయించవచ్చు పూలను కుసుమించవచ్చు
ప్రాణ రక్షణలో రెండిటికీ ప్రాధాన్యం లభిస్తుంది

కంటికి కనిపించని అనల వలయ కంకణం
కరోనా జీవితాలకు మృత్యు ఘాతమయ్యేను
మనిషిలో మూల శక్తిని కోల్పో జేసేను
బుస వినిపించని సర్పంలా నిశ్శబ్దంగా
కాలాన్ని చుట్టుకొని ! వ్యధను కలిగించేను
ఇది తల ఎత్తి మనిషి ఎదుర్కోవలసిన సమయం

ఇచట ఆధిపత్యం మాట చెల్లదు
ఇపుడు నిరంకుశం ప్రసక్తి లేదు
మనుషుల ప్రాణంకై సమాజ సుస్థితికై
క్లిష్టమైన నిబంధనలు ! తప్పనివీ

సుగమంగా పయనం సాగేందుకు మార్గం ఒకటే
జీవన శైలిలో ఆచరణతో వర్తనలో మార్పు
శుచి శుభ్రత నిర్మలినంతో జీవన యానం
భౌతిక మానస స్థాయిల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం

స్వేచ్ఛ అంటే ఏది బడితే అది చేసేందుకు కాదు
బృందాల అశ్లీలాలు సమూహాల అరాజకాలు,
వ్యక్తిలో మురికితనం మోడుతనం పోవలసి ఉంది
లేంది కరోనాయే కాదు మరొకటి భయదంగా రావచ్చు

ఏది ఏమయినా వీటికి అందరూ ఒకటే భేదం లేదు
సమవర్తియై యముని పాత్ర వహించేను నిశ్శబ్దంగా
మనుషులందరూ దూరమయి! వ్యవస్థ భగ్నం కావచ్చు
సరికొత్త విలువలతో మ్రోడులు చిగిర్చ వలసి ఉంది

కరోనాను తొలగించడం సత్వర చర్యలలో భాగం
ఆరోగ్యం మహా భాగ్యం, ప్రాణం జీవన ప్రకాశ దీపం

II. 30

స్వేచ్ఛలో శ్రమ జీవన మొక వికాస రూపం
ఎవరి జీవనం వారిది పయనం గమ్యంలో
స్వచ్ఛమైంది శుభ్రమైంది భౌతిక మానస స్థాయిలో
తగిన వాతావరణంకై కవిత సమ సమాజంలో

వర్షంతో సృజన భూమి అంతలో బురద అవుతుంది
ఊపిరి తీసే గాలి ధూళితో పొగలతో మలిన మవుతుంది
నడతలో దోషంతో వక్రత సమస్యను వికృత పరుస్తుంది
స్థాయిలో సూర్యరశ్మి అవనికి సృజన యోగ్యతనిస్తుంది

ఏ స్థితిలోను విషమత శ్రమ చేతన కంతరాయం కారాదు
వ్యక్తి నుండి వర్తనం సమాజ శక్తికి క్షతి కారాదు
భౌతికం గురించి చర్యలు సరి చేయడమవసరం
మానస విషయంలో ఎవరి అభిమతం పరిమితి వారిది

సిద్ధాతం ఒకవైపు ఆచరణం మరోవైపు
తూకంలో బ్రతుకుల విలువలు తారుమారు కారాదు
నాల్గు దిశల మధ్య బహు విస్తార సమాజం
నాలుగు స్తంభాలపైన భద్రమైన నిలయం

శుభ్రమైన పద్ధతి స్వచ్ఛమైన వర్తనంతో వైరస్‌కు దూరంగా
స్వేచ్ఛకు పరిమితులు విధింపబడవచ్చు
మరికితనం కరకుతనం దీన హీన స్థితికి జార్చేను
తగని అడ్డదారులలో అంతరాయాలెన్నో
మేఘంలా స్వేచ్ఛను కోరుతుంది మనస్సు
కరుణ శాంతి సమత నవత భావనా మయం

స్వచ్ఛమైన గాలినెవరు సమయానికందించేరు
శుభ్రమైన నడతనెవరు బ్రతుకులో చూపించేరు
మనిషి నుండి మనిషి దూరంగా జరిగే స్థితి రాకూడదు
ఇది సమగ్ర సమాజ వికాసానికి కలిగే ఆఘాతం

ఆదర్శానికీ ఆచరణకూ మధ్య ఏమైనా రావచ్చు
పూల మొక్క ఎదగవచ్చు, ముళ్ళ కంచె నిలపబడవచ్చు
గోడ తల ఎత్తవచ్చు, శిల్పం రావచ్చు, మనిషి నిలవచ్చు
భయంతో ముక్తమై మనిషి ముందుగ సశక్తం కావాలి

II. 31

చేయి చేయి కలవక పోతే మానేరు హేండ్ షేక్ లో
అడుగు తో అడుగు పడితే చాలు, నవయానంలో
మనసు నంటి మనసు ఏకమై కదలితే చాలు
ప్రమాద ఘడియలో సమస్యకు పరిష్కారం దొరకుతుంది

ఈ రణంలో కత్తితో అస్త్రంతో బాంబుతో పనిలేదు
ప్రాణ రక్షణంతో సమాజ భద్రత కోసమే పోరాటం
సూక్ష్మజీవి వైరస్ నుండి ప్రాణాలను కాపాడేందుకు
సరికొత్త జీవన రూపంతో మనిషి ఉద్గమించేను

వ్యక్తి స్వయం నీతి నిబంధనలతో ఆయువు
దీర్ఘమై క్షేమాన్ని సంతరింప చేసేందుకే, ఇది
ఒత్తిడిలో నియతి బంధనం స్వల్ప కాలికం
ఎటు తిరిగీ మనిషి ప్రజాస్వామ్య స్వేచ్ఛకు రావలసిందే

కరోనాకు సమాప్తి రేఖ తీసుక రావాలని
సమాజ నిర్మాణానికి కొత్త రూప మొసగాలని
ఆపద కష్టం నష్టం ఓటమిలో
దాగిన రహస్యమేదో బయటకు రావాలని

గెలుపు ప్రణాళికలను సిద్ధం చేసి
సంఘంలో మానవ శక్తి విలువ పెంచాలని
దాహం తీరేందుకు మంచి నీరుకై బావిని తవ్వుతూ
బంగారం బయట పడాలని ఎవరు కోరతారు?

ఈ సమయం! రణ నిర్వచనం మారింది
మనిషి భద్రత కభయ హస్తమందిస్తుంది
చైనా నుండి మొదలైన నాశన పర్వంలో
ప్రాణ హానియైన జీవి నెదుర్కొంటుంది

చీకటిలో హంతకుడు పొమ్మంటే నిష్క్రమించేనా?
ఆ సమయంలో కిరణ కరుడు తన హస్తం చాచేనా?
కోటగోడలా చుట్టుకున్న మృత్యువు నుండి
మనిషి పైకి ఎగిరేను, క్రియాశక్తి నైపుణితో

II. 32

ఆయువు ఒకటే మనిషి జీవితంలో వ్యక్తిగతం
మిగతావి అంతో ఇంతో సమాజ సంబంధం ఉన్నవి
ఏ ఒకచోటనో పర్వతంలా పడి ఉండ లేదు మనిషి
రాళ్ళ మధ్య చెట్లతో చల్లగ పచ్చగ ఉన్నా సరే

వెచ్చ వెచ్చని ఊహలతో కాలం గడచేనా?
మానవ సంబంధం లేని చోట సుఖకరమయ్యేనా?
మనిషి మనిషి కలుపు కొని పోవడమే సామాజికం
లోపలి నుండి ప్రకాశించే సంస్కారం పని చేస్తుంది

మృత్యు శబ్దం భయదచ్ఛాయలతో ఆవరిస్తుంది
ఇది అనుభవంలోకి వచ్చేసరికి స్పృహ ఉండదు
అందుకే నేమో కవులు దీనిని మిత్రంగా భావించేరు
ఏ కవి మనస్సు మరణ భయ విలోలం కాదు

కోరికతో ఆయువు ఎక్కడికయినా తీసుక వెళుతుంది
హిమగిరి శిఖరానికి చేర్చ వచ్చు ధవళ వాతావరణంలో
బాధలో ఆర్తితో ఒంటరి తనం తొలగినపుడే
సమూహంలో మనసు ఊరట పొందుతుంది

సమూహంతో మనసు ఊరట పొందుతుంది
ఇంట్లో అందరు కలిసి కుటుంబం పంచుకొనే
ఆలోచనతో మినీ ప్రపంచ మవుతుంది

కిటికీ నుండి చూస్తే చూపు మేరలో మహా ప్రపంచం
ఎక్కడి కక్కడ ఏవో హద్దులతో ముక్కలు ముక్కలుగా
ముక్కలన్ని చక్కగ కలిసిన ఆదర్శంతో
మనిషి జీవితం గడుస్తుంది ఏ ఒత్తిడి లేకుండా

పదుగురితో పయనంలో ఏకాంతం సాధ్యమయ్యేనా?
పల్చని ప్రతిఫలన వసనం కప్పబడీ, తెలిసిందే
పొడవులో నిడివిలో పెరిగే ఆకాశమంత ఆశ
పయనంలో హద్దులు చెరగేను, లేదా మాయమయ్యేను

ఎన్నో వ్యక్తిత్వాలను నింపుకున్న కవిత! సృజన రూపం
మంచికీ చెడుకీ తన దనిపించే మనోజ్ఞ నిలయం
భూమి నుండి పైకి తరువు మొలకలా ఆశ, జీవితంలో
మనిషి శక్తి స్పర్శతో ప్రయోజనాన్ని తలపించేను

II. 33

పురా యుగాల నుండి ఆధునికం వరకు దశదశలో
ఎన్నిటినో తన వశం చేసుకున్న మనిషి
మిథ్యా కల్పనల్ని సుందర వాస్తవాలుగ తీర్చి
మొదట్లో పడిన కష్టాల స్థానంలో సుఖ జీవితాలు

ప్రతి సమాజ విభాగంలో ఎన్నో సాధించిన విజేత
స్థిరతకు భంగం కలిగించే క్రూరమైన కరోనాకు
ఇపుడు అనుక్షణం భయంతో కంపించేను
ఊగే ఊయెలలో శిశువులా అమాయకంగా

ధనం బలం అధికారం దీని ముందు తీసికట్టు
వైరస్ దెబ్బకు పరీక్షల్ని అధిగమించి ఉత్సాహంగా
ఇంటి పట్టు నంటుకొని గడపాలిసి వస్తుంది
నియమ నిబంధనల బంధన మొక విశేషం

ఇది మనిషి నుండి మనిషిని దూరం ఉంచుతుంది నిజమే
మనసులు మాత్రం ఒకటిగ కలిసి ఉంచుతుంది
అనుమానం చక్రంలో తిప్పుతుంది
సంశయ రేఖపైన నిలుపుతుంది

ఇది మరొక మహా మారి వంటిది కాదు
పూర్వానుభవం లేకపోవడం! ఒక మైనస్
పరిశోధనపై అభిలాష మానవ విజయంపై ఉత్సుకత
ప్రాణ హరణ జీవిపై చర్యకు పురికొల్పుతాయి

మానవీయమైన ధైర్య సాహసగుణ చేతన
బ్రతుకులో భవితకు భద్రత శుచితను కోరుతూంది
మనిషి మేధ కారణ సహితంగా చూపే యానం
ఎప్పటిదో కావచ్చు, మనం మరచింది ఇపుడు
చాలా అవసరం బ్రతుకు నిలవడానికి ఆయువుపట్టుగా
ఇపుడు మార్పు అంటరాని తనానికి అనుమతి సూచనకాదు
ప్రజల రాకపోకలతో సందడిగా ఉండే వీధులు
నిశ్శబ్ద నగరంలో మౌన శిల్ప శాలలుగా మారేను
మహామాయావి కరోనా ఇపుడేదో విధంగా
జీవ శక్తిగల మనిషిని శిలగా మార్చేనా

II. 34

కలిసే బాధ భౌతికమని ఎవరు ఉపేక్షించగలరు
ఆయువు ఉన్నంత వరకు శరీర భావన వీడదు
అనురాగం కారుణ్యం పొంగే వెలుతురు హృదయంపై
అంతో ఇంతో మంచి చెడు పరిసరాల ప్రభావాలు

నిరాశ దింపుతుంది లోయలోకి నిర్దాక్షిణ్యంగా
దురాశ నిలుపుతుంది ముళ్ళకంచె చుట్టూ అవలీలగా
ప్రాణ హాని భయం విషాద తటాన త్రిప్పుతుంది
బీభత్స కాండకు ప్రేరణ మవుతుంది వైరస్

దృశ్యమాన వాస్తవం రేపటికి సూచనగా
జీవన సమస్య నుండి అనుభవాన్ని పెంచుతుంది
సాధారణ దృష్టిలో రోజూ కనిపించే కుసుమం
ఒక రోజు విశేష స్థితిలో మనిషి నలంకరిస్తుంది

భూకంపం పెనుతుపాను అపుడపుడూ వస్తూ పోతాయి
సూక్ష్మజీవి కరోనా తిష్ఠవేసి ప్రాణాంతక మవుతూంది
ఇది పరంపరా రూపంలో బహుకాలం లాగుతూంది
మైనంగా ఆక్రమించి చకితంగా బయట పడుతూంది

దైవం ప్రసక్తి లేదు, నమ్మకాలు కరగిపోయి
మంత్ర తంత్ర మహిమల ఊసు లేదు
ఉన్న నివారణోపాయాలన్నీ పనికి రానివై
ప్రాణ రక్షణకై ఉన్నది మానవ శక్తి ప్రకటనం

ఆహార, వ్యవహారాల్లో నియమ నిబంధనలతో
భద్రత వలయంలో బ్రతకడమొక దీక్షా బంధం
ప్రమాదాలు తెచ్చిపెట్టే విపరీత సంఘటనలు
సమాజ వ్యవస్థను వ్యక్తి ప్రతిష్ఠను శిథిల మొనర్చేను

రాసులు రాసులుగా ప్రాణం లేని ఆకారాలు
గ్రీష్మంలో తడి తొలగిన చెరువుల వలె బ్రతుకులు
శిశిరంలో ఆకు రాలిన తరువుల వలె ఆలోచనలు
జీవ శక్తితో మానవ తేజంతో రావలసి ఉంది
అమృతాయమానమైన సమయం తప్పక వస్తుంది

II. 35

ఈ సమయంలో సమస్య మనిషిలో కరోనా నుండి
త్యాగం కరుణతో మానవ సంబంధంవైపు మరలుతూంది
ఇది వినోదానికో విలాసానికో తమాషాకో కాదు, మానవం
మంచికి ఉపయోగ పడే పాత్రకే స్వాగతం

హఠాత్తుగా తన చర్యతో తెలిసే శత్రువు ఇది
తెలిసి చేయగలిగిందీ లేదు, అంచనాకు అందనిదీ
కరోనా అనగానే బయటికి వెళ్ళినప్పుడు
కళ్ళు బయర్లు క్రమ్మి వ్యక్తులలో ఆందోళన

ఏ సైరన్ ఏ హారన్ ఏ అలార్మ్ ఏ పిడుగు
విస్ఫోటం ఆయుధం ఏదీ పని చేయదు

వుహాన్ నుండి ఊహించరాని ఉన్మాద ఘోర చర్య
కరోనా వైరస్ విడుదల, ఇది క్రూరమైన మతి గెలుపు
చోటు నుండి చోటుకు వ్యాప్తి రేఖపై
ఎవరిపై ఏ సమయంలో దాడి జరిగేదీ తెలియదు

నాశన పర్వంలో క్లిష్టమైన పాత్ర వహిస్తుంది
ఇది ఎవరి అధీనంలో లోని సూక్ష్మజీవి
వాదానికి వీలు లేదు, బోధకు అవకాశం లేదు
మారే ప్రసక్తి లేదు, అజ్ఞానం మౌర్ఖ్యం నిండి

మనుషుల స్థాయి భేదాలతో పనిలేదు
మహామారి అందరికీ సమంగా కానుక దయచేస్తుంది
జీవ శక్తి ఉన్న మోడు మళ్ళీ చివురిస్తుంది
ఈ వైరస్‌ను జయించేది మనిషిలో సృజన శోధనయే

భయద విలయ వ్యాప్తికి కట్టడి ఎంత అవసరమో
సుఖద భావ దీప్తికి ప్రేరణ అంత అతి ముఖ్యం

మనిషి నుండి మనిషిని దూరం చేసే సందర్భం
సమాజ గతిలో విషాద ఘట్టానికి స్వాగతం, తాత్కాలికం
ప్రతి వ్యక్తిలో అంతో ఇంతో మనో యానం
అశాంతి అంధకారం నుండి వెలుతురు భావనలోకి

II. 36

జలధి ఘోష నేపథ్యంలో జన గణ స్వరం వినిపించేనా?
ఇదేమీ పట్ట నట్లుగ మనుషులలో గుండె లయ
మాటలో పాటలో బ్రతుకులో కవితలో సుందరతకు
శబ్దం ! నేతృత్వం వహిస్తుంది జీవన పరిశుద్ధమై

చుట్టూ శిలలెన్ని ఉన్నా భూమిపై నిలయానికి
పునాదిలో చేరే అర్హత కొన్నిటికి మాత్రమే
మిగతావి ఏమయ్యేది ముందు ఎవరు చెప్పగలరు?
స్మారక ఫలకం కావచ్చు, శాసన శిల కావొచ్చు

పై నుండి చినుకులు జారే ముందు
మేఘం మాట్లాడుతుంది, ప్రేమగా
భూమితో చెట్టుతో నదితో ప్రాణులతో
మనిషితో నెమలి ఈకతో దువ్వినట్లు

మనిషిలో ఊహా బలాన్ని బట్టి
కవితలో కాలం ఏ రూపంలోనో
రెక్కలపై విహగంలా ఎగరవచ్చు
నేలపైన సర్పంలా పాకవచ్చు

హరిణంలా గంతులేస్తూ పోవచ్చు
పులినోట కరచుకొని పరుగెత్త వచ్చు
జీవితంలో తెలిసిన వెన్ని రూపాలో
అన్ని సంకేతాలతో కొత్త ప్రపంచం!

కడుపులో ఆకలి మంటలు గుండెలో జ్వాలా రూపంతో
అసంఘటిత శ్రమ శక్తులు వలస కూలీలు బరువు నడకలతో
కాలం నుండి ఎరుపు నుండి తెలుపు అంచులతో
నలుపు లోకి దిగుతూంది, కరోనా ప్రభావంతో
సమాజ మేస్థితిలో ఉంటే అది కవితలో బింబిస్తుంది

నియమ శుభ్రతలకు కట్టు పడిన స్వయం నియంత్రణంతో
జీవన క్లిష్ట పథంలో స్వేచ్ఛా భావనతో ప్రతి మనిషీ
చెల్లని విలువలు తొలగి కొత్తవి రావాలనీ
కరోనా అంతం చదరంగం ఆటలో తొలగే పావు కాదు

II. 37

లాక్ డౌన్‌తో సమాజంలో బ్రతికే వ్యవస్థలన్ని
ఎక్కడి దక్కడ రోజులు విషమంగా బ్రేక్ డౌన్‌లో
శిశిర ఘాతానికి దెబ్బతిన్న పూలతోటలా
అంతా తెలిసీ కష్టాలు సహించేరు మంచి భవితకై

భయం దూరమై ధైర్యం అందుకొనీ మనసు
బ్రతికే ఆశను ఫలవంతం చేయాలని వర్తమానం
విరామం కాలంలో కావలసింది అందుతూ ఏ కాస్తో
సాధారణ స్థాయిలో జరిగేది జరుగుతూ ఏ కొంతో

గత కాలం కీర్తిని నెమరువేస్తూ హాయిగా
దొరకిన నీడన సుఖవంతం కోరి కాదు
కావలసిందీ! నిష్కృతి కానే కాదు
యానంలో సేవా మతి చర్యకు పురస్కృతి

ఎవరైనా బాధ్యత తెలిసిన వ్యక్తులలో
బ్రతికే ఇచ్చను ఫలవంతం చేసే ఆశయం
కరోనాను హైరానా పరచే వ్యూహ రచనతో
శైశిరాన్ని మరపించే వసంత స్పర్శ కోరేను

గెలుపుకు మహాద్వారం తెరచే సందర్భంలో
కనిపించే విషాద చిహ్నాలు ! ఓటమిలోవి కావు
నిన్న మరచిన త్యాగం! నేడు మనుషులలో పుష్కలంగా
కరోనా కట్టడికి మనోయానం అవసరమవుతుంది

ఈ విపత్కర సమయం ! నెత్తురు చుక్కలకు బదులు
రంగుల జీవన చిత్రం కనిపించడం! విశేషం
భౌతికం మానసం రెండు రెక్కలపై మనోయానం
రేకులు విరిసిన జీవన పుష్పంకై అన్వేషణం

దైన్యంలో ఇళ్ళకు చేరే వలస కూలీల దృశ్యం
పతనమవుతూన్న పాలకుల విలువలకు సంకేతం
శ్రామిక శ్రేణుల అనిశ్చిమ స్థితిలో, క్షితిజం
స్పందమాన హృదయంతో స్వాగతం పలుకుతూంది

II. 38

షట్ డౌన్‌లో వివిధ దశలు నిశ్శబ్దంగా
ఆరోహణలో విజయానికి మెట్ల వలె
ఒక్కొక మెట్టుపై ఒక్కొక విధం అనుభవం
చేతికి చిక్కినట్లే అయి అంతలో మరోచోట కరోనా

విజ్ఞానం వివేకం శ్రేయో హృదయంతో మనిషి
సూక్ష్మజీవి ఉనికిని అంతం చేసే పనిలో ఆశా కిరణం
ఈ ధరా తలంపై మానవశక్తి ప్రకటన కవకాశం
ఎప్పటికయినా నిర్మల జీవన సాధన పధంలోనే విజయం

బ్రతికే తీరులలో ఉన్న ఉత్తమ సంస్కార విధంతో
ఈ వైరస్ ప్రమాదకరం దరికి చేరదు సాహసం చేయదు
తరతరాలకు మేలు చేసే జీవన శైలితో
వ్యక్తి నుండి సమాజానికి అనువర్తన సౌభాగ్యం

కర్తవ్యం మరచి పోక బాధ్యతల్ని గుర్తించి
బ్రతకడ మొక సుఖద జీవన రహస్యం
మనిషిలో ప్రేమ త్యాగం కరుణ ధైర్యం
నాలుగు స్తంభాలపై జీవన నిలయం

ఇది మనిషికి తోడుగ బంధువుగ మిత్రంగా
సమాజ గతిలో భాగమైంది మనుషులతో మనుషులకై
సృజనకు దారులు మూసి, మృత్యువుకు తలుపులు తెరచి
మాటకు తోడుకు మైత్రికి దూరం చేస్తుంది కరోనా

సింహం పులి ముఖాలు తొడుగులు తొలగించి
సహజమైన మనిషి ముఖంతో బ్రతకడం శ్రేయం

శబ్ద సారం సంగీతం భావాకృతి కవిత
రెండూ విషాద స్థితులలో ఉపశమన శరణ్యాలు
వ్యక్తి వలయం నుండి సమాజ క్షేత్రంలోకి
కుదుట పడే వీలుకు బలమిచ్చే మానసికాలు

మనిషి మనిషికీ మధ్య వంతెన సంభాషణ
ఆసరాగా తోడు వ్యక్తిలో అస్తితను పెంచేను
దూరమవడం తాత్కాలికం
దగ్గరవడం జీవన సహజం

II. 39

వివిధ భావాలను వాదాలను వేదికపైకి తెస్తుంది
దూరాన్ని పెంచేది, అయినా కరుణ కవకాశ మిస్తుంది
వర్తమాన తలంపై ఎక్కువగా చర్చితమయ్యే కరోన
ఎందరికో బాధను వ్యధను కలిగించే మహామారి

ఇపుడయితే మానవ జాతికి శత్రువు, కనిపించని క్రూర జీవి
గొలుసు కట్టు రూపంలో ప్రపంచాన్ని ఆవరిస్తూంది
సమాజంలో ఉన్న ప్రతి సేవా విభాగాన్ని
తన చుట్టు తిప్పుకొనే మహా లౌకిక సర్పం

మేధావుల నుండి సామాన్యుల వరకు నేతల నుండి అధికారుల వరకు
వర్తకుల నుండి శ్రామికుల వరకు, ఎక్కడా ఏ మినహాయింపు లేకుండా
గుప్పిట్లో బంధిస్తుంది, నిర్దయగా విలవిల లాడ జేస్తుంది
దీన్ని కట్టడి చేసే దశ గుర్తు పట్టి చికిత్సకు దిగడు

ఆయుధం గురి తప్పవచ్చు, మాట మార వచ్చు
కరోన జాడను ముందుగ పసిగట్ట లేరు
సుడి గుండంలా చిక్కు ముడుల వలలా వదలదు
దీని క్షతికి మనిషి దీక్షా రూపం వహించేను

కష్టానికి దుఃఖానికి అస్థిరతకు కారణమైన
దీనిని అంతం చేసే పక్రియ జన క్షేమంకై రెండో దశలో
మనిషి కిది కొరక రాని కొయ్య అయింది
దీని సమాప్తి సమాజ భవితకు బహుమానం

అహంకారానికి తొడిగిన ముళ్ళ కిరీటంలా
ఊహలో విలయ రూపం మృత్యు నృత్య విశేషం
తీగెలు తెగి, దుమ్ములోకి దూరమైన వయోలిన్
నవ రూపంతోనే! మనిషిలో జీవన సంగీతం

సమాజ గతి క్రమానికి మానసికావసరం
స్తబ్ధతలో జడ రూపం సృజనకు భిన్నం
కలవడం మాట్లాడడం తోడుగ ఉండడం నడవడం
స్నేహం ప్రేమ వాత్సల్యం దయ జీవన రూపంలో భాగం

ఇది సమాజాన్ని అరణ్యం చేసేనా? ఏమో
మనుషుల్ని బొమ్మలుగా మార్చేసేనా? అవచ్చు

II. 40

జీవన స్థితి ఏ తీరుగ ఉన్నా కాలం
బ్రతుకుల్ని తన వెంట తీసుకొనే వెళుతుంది
కష్టమయినా దుఃఖమయినా భరించక తప్పదు
సంఖ్య మితం కాదు అందరికీ సోకుతుంది కరోనా

సందర్భం మారుతుంది, ఒత్తిడులు వేరవుతాయి
ఎండు టాకులవలె ఆశలు ! మట్టి పాలవుతాయి
అనుకోని విషమ ఘట్టం ఎదురయి నిలిపేయవచ్చు
అడ్డంకులు దాటుతూ పోయేను మనిషి దృఢ చిత్తంతో

మనిషి భయపడే వెన్నో! అనుకునేవీ ! అనుకోనివీ!
అన్నిటినీ సహించే అలవాటవుతుంది క్రమంగా
మృత్యు వార్త వినే వరకూ ఎవరికీ తెలియనిదీ సూక్ష్మ క్రిమి
భయ మహాసముద్రం ! బ్రతుకుల కాటంకంగా మారేను

దీని అధిగమించడం సామాన్య విషయం కాదు
లాక్ డౌన్‌తో కార్య కలాపాలన్నీ నియంత్రిత మయ్యేను
మనుష్యుల్ని దూరం చేసే ప్రమాద కరమైన మహావ్యాధి
వైద్యులతో పాటు సేవాచరణులు పరికరాలు అవసరం

పట్టణానికి పొట్ట కోసం వచ్చి బ్రతికే వారు
మహామారి ప్రభావంతో పనులు లేక అలమటించేరు
ఈ విష క్రిమికి మంచి చెడు ఒప్పు తప్పు తెలియదు
ఎవరిపైన అయినా సరే విరుచుక పడుతుంది

గట్టి భద్రత లోను మృత్యు ప్రవేశానికి సందులతో
"ఆరోగ్యం భాగ్యం" "వైద్యుడు హరి" మాటలు తెలిసొచ్చేను
ఇది పరీక్ష సమయం! ఆయుధంతో పనిలేని రణ సంరంభం
వజ్ర సంకల్పంతో ఆచరణ శీలతో సాధించే కార్యం

స్వచ్ఛంద కర్ఫ్యూలో లాక్ డౌన్ బంధనలో
మూలంతో పచ్చని చెట్టులా బ్రతుకులు నిలబడతాయనే
స్వార్థానికి సెలవు పలికి పరోపకారానికి చేతులు చాచి
అడుగులు ముందుకు వేయడమే తక్షణ కర్తవ్యం

II. 41

కష్టంలో వేదనలో మనిషి చూపు
అవని నుండి నింగి వైపు మరలుతుంది
శూన్యంలో ఒంటరిగా నిలవ లేక
అనుబంధంతో క్రిందికి దిగుతుంది

విరిసిన పద్మం పంకం నుండి ఎగసి
గంధం విసరే దయినా అందంగా
సంఘానికి దూరంగా ఒంటరిగా
అస్తితలో తన శుచితను చాటుతుంది

కనిపించని శత్రువుతో రణం
ఇప్పటికీ వినిపించే ప్రధాన విషయం
చీకటిలో ఎదురుపడే శత్రువు క్రూరతపై
మనిషికి రణ తంత్రం ! విప్పాలిసి వస్తుంది

ఉపేక్ష చేసే మృత్యువు కాహ్వాన మందినట్లే
అన్ని వైపుల జాగ్రత పాటించాలిసిందే
అన్ని విధాల శుభ్రతతో బ్రతకాలిసిందే
ఆపదలలో ప్రతిసారి కొత్త జన్మ మొలకెత్తదు

ఎక్కడి దక్కడ స్తబ్ధ మయి పోయి! సమాజ చలనం
ఇళ్ళలో గడపడం ఎక్కువ కాలం సరికాదు
స్వేచ్ఛలో పరిమితుల్ని వ్యక్తి గ్రహించవలసి ఉంది
స్థాయిలో సమాజ స్థితిని కాపాడ వలసి ఉంది

సూక్ష్మ దర్శినిలో కనిపించే కరోనా కిరీట రూపం
ముక్కలయి మాయమై చూడవలసి ఉంది
గ్రహణ వేళ సూర్యుని చుట్టూ కాంతి వలయ కంకణం
తొలగి మట్టి కణాలలో కలిసి పోయేననే

తప్తమైన హృదయం నుండి బాధా శిఖలపై
కరుణ సేచనలతో కొందరు వెళ్ళి పోయారు
ఇప్పుడు మానవ నాశనాన్ని తప్పించే క్రియాశక్తితో
వచ్చే రోజు మానవ శక్తితో ప్రతి ఎదను హత్తుకొనేననే

II. 42

మితిమీరిన కోర్కెలతో అశ్లీల సంరంభాలను
మలిన దోష వర్తనల్ని అనారోగ్య పరిస్థితుల్ని
కత్తిరించే సందర్భం ఇది కొందరు అనుకోవచ్చు
ఎంతటి ఉల్లాస సన్నాహ చర్యలయినా చర్యలు
ఉత్తమ సంస్కారానాకి మచ్చలు ప్రమాదకరం
ఇపుడిది ఇళ్ళలో సహనానికి పరీక్ష అవుతూంది

పంజరంలో చిలకల్లా పిల్లలు, బడులు లేవు
కిటికి ఊచల సందులలో నుండి పెద్దల చూపులు

వాడిన కోర్కెలతో క్షణాలు గడవడం కష్టంగా
పనికి దూరం తిండికి ఎడం బ్రతుకు దుర్భరం

ఈ దేశం ఆ ప్రజ అని లేదు ! అందరు భయ బంధనలో
జనతను పీడించే సంక్షోభం ప్రపంచాన్ని చుడుతూంది

ఏకాంతం అవసరమయినా అది స్వల్పకాలికం కావాలి
బలవంతపు విధి నియమం కాకూడదు, బహుకాలం
అస్థిరతకు నష్టానికి దారి తీస్తుంది ఆర్థికంగా
ఆదరువుకు తలుపులు మూత బడేను హఠాత్తుగా

"కరోన" దూకుడుతో ప్రాణాలకు కలిగే ముప్పుతో
మనుషులు మౌన శిలా స్తంభాలుగ మారేరు
నిశ్శబ్ద వాద్యాల్లా పరిమితులలో గదులలో గడిపేరు
సమాజ చలనం ఆగి వ్యవస్థలు చెదరిపోయేను

మానవ సంబంధాలెక్కడి కక్కడ ఛిన్నమై చీలి
వ్రేలాడే పీలికలయి గాలికి కదలేను
ఆపద బోనులో ఈనాటి మనిషి ! స్వేచ్ఛా జీవి
ఇనుప కమ్ముల ఎడం నుండి విడుదలకై చూచేను

ఏది ఎట్లా ఉన్నా బ్రతుకులు ఇనుప రేకుల పద్మం అవకూడదు
గుండె వేగం హెచ్చి భయం ప్రతిక్షణం జలధిలో ముంచుతూంది
ఓటములతో మనిషి ఎప్పటికీ బ్రతుకు గడపలేడు
ఒంటరి భ్రమణంలో కాలం ప్రగతిని కోల్పోయేను
బ్రతకడమొక రణ వ్యూహ రచన కాకూడదు ఎప్పటికీ
ఆరోగ్యం జీవన భాగ్యం దృశ్యం నిరంతర మవసరం మార్పులతో

II. 43

ఇది కాలాన్ని ఆవహించి నిరంకుశంగా
మనుషుల్ని ముంగాళ్ళపై పరుగెత్తించేను
సాయం వేళ అస్తమయ దిశలో
సంధ్యారుణ చిత్రం బాధామయం
మనుషులకు బదిలి అవుతున్నట్లు ఉంది

త్వరత్వరగా దేశ దేశాల నావరించే
క్రూరమైన అదృశ్య రూపం కరోనా
తగిన ప్రణాళికతో మాయ మయ్యేనా?

ఇది ఎవరిపై రణం కాదు,
అకారణమైన ఉదగ్రమైన సూక్ష్మజీవిని
అంతం చేయడమే ప్రధాన లక్ష్యం

చండ కిరణ సదృశమైన సంకల్పంతో
పన్నిన వలను ఛిన్నం చేయడమే తక్షణ కర్తవ్యం

ఉగాది సందర్భంలో కానుకగా విచ్చేసింది
వచ్చే ఉగాని నాటికయినా అంతమయ్యేనా?
విస్తరణ కాంక్షా రూపం ఇది
ఎదుట నున్న వ్యక్తి బాధలో మోదాన్ని పొందేను
మనిషిలో జాగరూకత నంటుకొని
అనుభవ శుద్ధమైన నిర్మల రూప మవసరం
ప్రస్తుతం ప్రత్యేకత ఏమంటే? దేవతలతో
మంత్రతంత్ర ప్రమేయం లేదు, చీకటి ప్రసక్తి లేదు

శిశువులనీ వృద్ధులనీ కాస్తయినా కరుణ లేదు
కనిపించని ప్రమాదకర జీవి, అనుకోకుండా
గాలిలో తీగెలా సాగి నిప్పు పూలు జార్చేను

'లాక్ డౌన్ ' లో కరోనా కట్టడితో ఊరట పొందీ
జీవన భాగ్యం ఆరోగ్యం సుస్థితి స్పృహ అవసరం
చూపు కందని దారుణాన్ని మట్టు పెట్టడం
మానవ చరిత్రకు స్వర్ణ కిరీటం అమరడమే

వర్తమానం మెట్ల మీంచి

I. 1

కవితలో ప్రతిఫలించని విషయమంటూ లేదు
భువికీ దివికీ చెందిన మనోమయ దృష్టితో
వాస్తవమూ కల్పనతో మిశ్రమ గుణ రంజితమై
అక్షర జగతికి సుందర సార్ధకతను కూర్చేను

శబ్దంలో ఒదుగుతుంది విశాల గగనం
అర్థంలో కదలుతుంది సమాజ హృదయం
మనిషి నడచే దారి పక్కన నేలపై
నడవాలని మాట్లాడాలని కోరిక చెట్టులో

కవి హృదయం మాట్లాడుతుంది సూటిగా
మబ్బుతో మెరపుతో పిడుగుతో ప్రతి వస్తువుతో
నీలి మబ్బు కిందికి దిగి మెల్లగా ఒక క్షణం
ఎద ఎదను స్పృశిస్తూ పోవాలని శ్రమ జీవిలో

ఎందరిలో ఎన్నిటిపై కోరిక లెన్ని ఉన్నా
అందని వైనా మబ్బులు భువి దాహం తీర్చేను
అందని వయినా పైన ఉన్న సూర్య చంద్రులు
వెలుతురు వెన్నెల కళతో తృప్తి రేఖలందిస్తాయి

ముందుగ రిహార్సలంటూ లేకుండా అప్పటికపుడు
సాగే నాటకంలో భాగమవుతుంది జీవిత మపూర్వం

తలుపులు తెరచి ఉండే కవితాలయంలో ప్రవేశానికి
గోడలు అడ్డుకావు, శిల్పం ఆహ్వానిస్తుంది
కిటికీ మాట్లాడుతుంది స్వేచ్ఛా పరిధులు గురించి
నిలయం మాట్లాడుతుంది జీవన సుందరత గురించి

అభిరుచి ఆనందం నియతం ఆకర్షణ గురించి
వీటి నుండి మనిషి తెలుసుకొనేదే ఎక్కువ

టెలిగ్రాఫ్ తీగెలలో కదలే మాటలు బొమ్మలవలె
ఆకాశం దారులలో ఇంటర్నెట్ వార్తల వలె
బయటికి కనిపించని వెన్నో ? సూక్ష్మ స్థాయిలో
గుండెకు తృప్తిగ యోజనతో అంతర్యానం

I. 2 వంతెనలా నిలుపుతూ

రాలిన పూల వలె కొన్ని క్షణాలు దారిలో
రేకులు చెదరినా పరిమళాన్ని వీడవు
విసరిన రాళ్ళవలె కొన్ని క్షణాలు వీధిలో
గాయ పరచి స్మృహలో తిష్ఠ వేస్తాయి

దారిన వెళ్లే మనుషుల వైపు చూస్తాయి
ఎవరిదైనా చల్లని వీక్షణం స్పృశించేననీ
ఎవరి దయినా మెత్తని ఆదరం లభించేననీ
ఏ వస్తువైన నిష్క్రియగా పడి ఉంటే శోభలేదు

గిరి శిఖరాన నీరు నిలిచి దారి దొరికితే
అవని పైకి దిగి ఆగని వేగంతో
ఎగుడు దిగుడు శిలలయినా సరించాలిసిందే
లోయలో భయ భయంగా అడుగు సాగవలసిందే

పడవల్ని మోస్తూ తరలే ప్రవాహంలా
సృజన చేతన ! సామాజిక సక్రియలో
ఊహల్ని ఆర్ద్ర పరుస్తూ అక్షరాల్ని మొలకెత్తించేను.

కవితలో ప్రకృతితో సమాజ సంబంధం
ప్రాణమయం మనో మయం రెండిటితో కలిసీ
అమూల్యమీ సుందర శరీర నిర్మాణ విశేషం

ఏ కవి హృదయమైన తీర్చిన పూల వనమే కాదు
జ్వాలా చలనంతో దృశ్యం! ఎదురవుతుంది కూడ
నిశీథి వస్తుంది శాంతి లక్ష్యంగా నిశ్శబ్దంగా
పగలు గడుస్తుంది జీవన సంరంభంతో సశబ్దంగా

పోరాడే సందర్భంలో వెనక నుండి ఆలోచన
తన ప్రాణం గురించి పచ్చని ఆశా కేతనం కదలుతుంది

యానంలో రెండు రైలు పట్టాల మధ్య ఎడంలా
నీతికి నడతకు మధ్య తప్పనిదీ అంతరం
వ్యక్తికీ సమాజానికీ మధ్య అగాధంపై వంతెనలా
కవిత ! రెండిటి సంబంధం నిలుపుతూ ఎప్పటికీ

I. 3 అన్నీ యథా తథం

ఏ స్థితిలో నయినా సద్యఃస్పందనం మానుషం
ఒక కవితలో ముందుగ సాధ్యం, హృదయవశం
అన్ని స్థితులలో కాలాలలో ధ్వనిస్తుంది భావజగం
గుణాలతో పాటుగ ప్రభావాలనూ తెలుపుతుంది

చీకటి ఆలోచనకు వివేక రూపమిస్తుంది
కవిచే కవితలో సాధ్యం కాని దేముంది?
శబ్ద జగత్తులో సృజన రూపం హృదయ గతం
ఎంత మెత్తనిదై ఆర్ద్రత కలిగినా మేఘం! హృదయ సమం కాదు

వాదాలకు భేదాలకు చర్చలకు దూరమై కవితలో
స్పందమాన హృదయం ఆవిష్కృత మవుతుంది నవ్యమై
కోరినంత హృదయమంతా మనిషి నింపుకొన్నా
ఉదయరశ్మి వెన్నెల రెండూ తరగని సంపదలు

అందరివీ భ్రమలు కావు కల్పనలు కావు!
ప్రేమ కరుణ రాగ భావ వాస్తవాలు
చీకటి భయ సమయంలో రాత్రి
వీధి దీప కాంతి అదుపులో సర్వం

రైలు దిగి స్టేషన్ నుండి ఇల్లు చేరే పయనంలో
మధ్య దారిలో నిలిపిన విగ్రహమొక ఆకర్షణ
చాచిన చేయి నుండి ఆదర్శం వెలుతురులో
మనసులో చీకటి బొమ్మలు తొలగించేను

తెలిసి చేసినవి చేయరానివి మదిలో భ్రమిస్తాయి
అనుకోని కొత్త దారి కనిపిస్తుంది ఆలోచనలో
మరచిపోయిన బాధ్యతలు తల లెత్తుతాయి
మనసుకు కొత్త ప్రపంచం పరిచయమవుతుంది

చెట్టుకు తగిలిన గొడ్డలి వేటుకు గాయంతో
కొమ్మకు పూచే పూవు ఫలం మారేనా?
పరిమళం వేరయ్యేనా? ఏదీ జరగదు
అన్నీ యథాతథం! మనిషీ అంతే మూల మనో విధంతో

I. 4 నిరీక్షణం

బయటి బాధలను భరించే శక్తితో భౌతికం
లోని వేదనను సహించే రక్తితో మానసం
కష్టాల నధిగమిస్తూ ఆటంకాలు దాటుతూ
ఆగని జీవన వాహనం! సంశ్లిష్టం ! స్వతంత్రం

దారి నుండి మరో దారిలోకి
కాల చక్ర గతిలో పగలు రాత్రి భేదంతో
రాత్రిని చీకటి తెలిసీ తెలియనట్లుగా
మనసుకు మాత్రం ! ఎప్పటికీ ఇవి ఒకటే

అక్షర పంక్తిలో కవిత సరిస్తుంది
మలుపులు తిరుగుతూ మార్పులు పొందుతూ
ఎందరికో దాహం తీరుస్తూ
అందరికీ హ్లాదం కూరుస్తూ

హృదయం మాట్లాడుతుంది తన భాషలో
ఇది అందరికీ తెలిసిందే; సూర్య రశ్మిలా

ఎన్ని మాటలు అల్లినా
ఎన్ని ఊహలు పన్నినా
మనో మూలం తోనే కవిత! స్వేచ్ఛగా
ఎదిగే చెట్టులా దేని కది ప్రత్యేకంగా

రోజు మారినా; నిన్నటి బంధం తెగదు
నేడు కొత్త బంధం ఏర్పడుతుంది,
అనుభవమెప్పటికపుడు అలలవలె కొత్తగా
మనో రూపం మాత్రం అదే జీవితమంతా

కవితపై చివరి మాట! కవిది కాదు
పాఠకులది! శ్రోతలది ! విమర్శకులది

ఉపదేశం సందేశం విలువలతో మనసు నలరించేను
జీవితంలో భద్రంగా సీత నగల మూటలా

ఎన్ని కథలు విన్నా నీతులెన్ని తెలిపినా ఆప్తంగా
తనలో మంటల నార్పే మేఘుంకై నిరీక్షణం మనిషిలో

I. 5 నావకు భేదం లేదు

ఉత్సాహం ఉద్రేకం రెక్కలపై మనిషి జీవితం
నిర్మాణం విధ్వంసం మధ్య కిరణరేఖ మానుషం

ఇల్లు ఆవరణంలో విస్పారిన పూల పరిమళం
ప్రహరి గోడ కవతల ఉన్న వారికీ లభిస్తుంది
దీని నెవరు ఆపగలరు?
ఇది అందరినీ చేరుతుంది

సూర్యుడదే ! వెలుగులు అవే
చంద్రుడదే వెన్నెల అదే
ఉన్నవారయినా లేని వారయినా
రోజు రోజు అనుభవాల రుచులు వేరు

తెల్లవారుతూనే సమాచారం మోసుకొనీ
ఏ రోజూ దిన పత్రిక అక్షర దర్పణం
ప్రతి సమస్యలో తాను భాగం అవుతూ
అరచేతిలో సమాజ తమాష చూపిస్తుంది

చలనం ఆగిన కాలం స్థితిలో గతం ముడుచుకొనీ
చలనంలో వేగం అందుకునీ వర్తమాన క్షణం
తిరిగే కాల చక్రంపై బొమ్మల వలె మనుషులు
వర్తమానం ఆగదు, మనుషుల నిజ రూపం తెలియదు

పల్లె నుండి పట్టణానికి పెరుగుతూన్న మోజులో
కాలం వేగంతో పరుగెత్తే పనులను వరించేరు
ధనం సుఖం భాగ్యం భోగంతో
శూన్యాన్ని పూర్ణం చేసే ఆలోచనలో బ్రతుకులు
చూచే దృష్టి కోణంలో భేదాన్ని బట్టి
ఎన్నుకొన్న సమాజ పథంలో దృశ్యంలో మార్పులు

చీకటిలో మనిషి ముఖం చూచే కోరిక
వెలిగే దీప సహాయంతోనే తీరుతుంది
యానంలో నావకు ఏ భేదం ఉండదు
అందరినీ గట్టుకు చేర్చేను ప్రియంగా

I. 6 కవితలో ఉపయోగిత

జన నేతకు తెలుస్తుంది ఏ నిర్ణయ మవసరమో
కవి మనసుకు తెలుస్తుంది ఏది యోగ్యమో! కవితలో
కవితలో గుణస్పందన శిల్ప ప్రయోజనం ! పై
అభిప్రాయ విభేదాలు సృజనకు విపులత చేకూర్చేను

మబ్బులా స్వప్నం కనిపించి తరలి పోతుంది
తిరిగి వచ్చే ఆశలేదు కాని కోరిక నిలిచే ఉంటుంది
సమాజంలో సంఘటనలు కవితకు ప్రేరణలు
బ్రతుకుల వలె ఎవరి దారి వారిది అవుతుంది

కవుల మధ్య నిప్పు కణం వలె శత్రుతతో పనిలేదు
ఇది సిగరెట్ వెలిగించడాని కయితే ఇబ్బందిలేదు
పెద్దగ చేసి చలి కాచుకొనేది కావడం విచిత్రం
విపరీతమొ ప్రమాదమో దహన కాండ జరగవచ్చు

చరిత్ర గొంతు నొక్కి నిజాన్ని దాచేసేవారు
గుండెపైన వేటు వేసి కసి అంచును చూపేవారు

చీకటి వెన్నెల వెలుతురు దుస్తులతో జీవితం
ఎప్పటికీ రంగుల చిత్ర రూపంలో కనిపిస్తుంది
ఇవి ఎన్ని తీరులో మనిషి బ్రతుకులన్ని విధాలు
పలు రంగుల మేళన లోనే మనుషుల వ్యక్తిత్వాలు

ప్రతి నిరసనకు నినాదానికి చరిత్ర ఉంటుంది
సాధించే యత్నంలో పోరాటం చివరి అస్త్రం
ఎవరి ప్రశ్నలు వారు సిద్ధం చేసుకునేరు
జవాబుల బాధ్యత మాత్రం ఇతరులపై వదలేరు

భూమి నావహించింది సరిపోక జలాలు
గట్టు దాటి ఆక్రమణకు ఎగసేను సముద్రం

మనిషి మనో రూపం ఇదే విధం చరిత్రలో
కవితలో వెనక నుండి నేపథ్యంగా వర్తిస్తుంది
దీనిని గమనించడమొక పని అయితే
కవితలో ఉపయోగానికి రావడమొక విశేషం

I. 7 అవసరం - ఉపయోగం

కళలు తగ్గిన చంద్ర బింబం
ఒకరి దృష్టిలో కర్షకుని చేతిలో కొడవలిగా
పథం వేరవు తుంది
ఉత్తేజం కలిగిస్తుంది, సమాజ కోణంలో
మరొకరికి ప్రేయసి ఫాల తలంగా
మరో పథం తెలుపుతుంది
వస్తువు ఒకటే, అనుభవ రూపాలు వేరు
వేరు వేరు జీవితాల్ని సంకేతింపవచ్చు

ఉత్తేజంలో పల్లెకు వెళ్ళాలని పించవచ్చు
సస్య క్షేత్రాల అదృష్టం చూడాలనిపించవచ్చు
ఇల్లు - సమాజం ఇరు తీరాలతో
ప్రవాహ రూపాన్ని ముందు నిలుపుతుంది
రెండిటి సమన్వయంతో నడుస్తుంది
మనిషి స్వేచ్ఛా జీవితం ! ఎవరి ప్రమేయంతో పనిలేదు

పసిడి పలుకులు జారే శైశవంలో
వచ్చే మాట కవితను తలపించేనా
వినేవారికి ఒకరొకరికి భావ స్ఫూర్తి వేరుగా
ఇది కవిత కాదనే సాహస మెవరు చేస్తారు

పైగా సంతోషంతో స్వాగతం పలికేరు
అనుకరణలతో తాము పరవశించిపోతారు
అనుభవంలోవి అన్నీ కవితకు ప్రేరణలై
ఆలోచనలో చేరే వన్నీ కవితకు ప్రియమై
నేలపై తొలకరి చినుకులవలె అక్షరాలు
కవితలో భుమిని తడిపేను, మనసు కుదట పడేను

ఉదయ మయితే వీధి దీపంతో పనిలేదు
కవిత అయితే అవసరానికి వెలుగుతో
అవసరాన్ని గుర్తించడ మెంత ముఖ్యమో
ఉపయోగానికి రావడమంత వాస్తవం

I. 8 చీకటి చేతులలో

పారాడే శిశు దశ నుండి పరిణతిలో వృద్ధ వరకు
స్వేచ్ఛా జీవనంలో బయట రూపాలెన్నో కోరికలన్ని
అన్నీ తన వశమై ప్రభుతను చాటాలని మనుషులు
ప్రభుతను ప్రశ్నించే ఘటనల మధ్యలో వైరస్

సామాజిక సంస్పృహ మానవ సంస్పందనం కళాకృతితో
రెండు కాళ్ళపై స్వేచ్ఛా నవ కవిత్వం! భిన్న భిన్నంగా
చీకటిలో కలిసి పోదు ఏదీ కరగిపోదు మాయమవదు
మరునాడు ఉదయ కిరణం అన్నిటినీ వివేచన కందిస్తుంది

మనిషికి మనిషికి మధ్య దూరం ఎక్కువై
ఏకాంతం పరచబడీ మందత ప్రబలుతుంది
ఇప్పటికీ నాగరక దశా సమాజంలో
వివక్షలు విభేదాలు ఏదో ఒక పేరుతో

భూమిపైన బురద ధూళి పొగ మలినం
వీటి నుండి తప్పుకోవడం జరిగేదేనా?
ఘర్షణలో క్షణాలలో ధూమం కమ్ముకొనీ
అనల జ్వాలా చలనం చోటు చేసుకునేను

విధ్వంసం బీభత్సం, ఊహించని ఘటనలతో
వీధులు నిర్మానుష్యంగా పోలీసులతో కర్ఫ్యూ

రాత్రి చుక్కలు కనిపెట్టుకొనే ఉంటాయి
పగలు చెట్లు తోడుగ నిలచే ఉంటాయి
ఉదయ కిరణం ప్రతి రోజూ తప్పనిదీ
పూల దండలా అలంకరించాలనీ కోరిక

గుండెపైనో గళం పైనో తొక్కి పట్టి
పద ఘట్టనతో స్వరమణచేసే దృశ్యం
మనిషి కన్న దౌర్భాగ్యుడు లేడనిపిస్తుంది
హింసకు స్వేచ్ఛ మనిషిని క్రూరంగా మలుస్తూంది
మనసు తలుపులు మూయబడి చీకటి చేతులలో
మనిషి శక్తిని పరీక్షకు గురిచేస్తుంది విషమ స్థితి

I. 9 దొరికిన పాత్రలో

ఏ రోజూ కలహ బంధు స్వరాలతో కాకపోతే
ఏ విపదో వైరస్‌తోనో, కొట్టు మిట్టాడేను సమాజం
క్షోభాకుల జలధిగానే శాంతంగా ఉండేది క్వాచిత్కం
ఎవరికి వారు వలయాలతో తమ వస్తు చయాలతో

ఇవి కాక మనిషిని వెంటాడేను మనిషి
ఆపైన మనిషిని మనిషి వేటాడేను
ఇపుడిది నగరారణ్యంలో మానవేతర గుణాలతో
కుటిలమైన బ్రతుకులు జటిలమై ప్రయోజనం మారేను

నిలయానికి ముందు వెనక ఆ వైపు ఈ వైపు
మధ్య మధ్య సన్నని సందులతో తెరలు
కాస్త అయినా జరగవు, జరిపే వీలు లేదు
అసలు మనిషిని చూడాలని లోన తహతహ

స్క్రీన్ లేంది చిత్ర మేలా దర్శనమిస్తుంది
సినిమా నెట్లా చూడగలరు? చూపించగలరు
చూచేవారూ చూపేవారూ మధ్య అభిరుచి వంతెన
మాయ కాదు మర్మం లేదు అంతా జీవిత వాస్తవమే
మారిన స్థితిలో కొత్త సృజన చిత్రం తప్పదు
ఇది మానవ సహజమైంది, సమాజ పరివర్తనలో భాగం

మాటి మాటికీ మనిషి లేని రెక్కలు ఊహించు కొనీ
తనలో విరామ సుందరమైన ఉపశమనంతో
పైకి ఎగర జూచేను చివరకు మిగిలేది విమాన యానం
చెట్టుకు కనిపించే పూవు ఫలం, మనిషి వశాలే
ఇంటి నుండి బయట పడే వారికి లోక పరిచయం
సమూహంలో సంతోషం, సమజానికి ప్రయోజనం

ఏకాంతమనేది ఎపుడు బడితే అపుడు లభించదు
ఎంతటి సూర్య కిరణమైనా గోడ నిలుపుతుంది
కాసేపయినా ! ఎంతటి మనిషి అయినా
లభించిన పాత్రలో ఒదిగి పోవలసిందే

I. 10 గెలుపుకై పట్టులో

కిరణానికి మలినం అంటదు
హృదయానికి వికృతి లేదు
కవిత ఎప్పటికీ నవ నవం
అంతర్యానానికి వాహనం

కాళ్ళు నడకలో ఆరి తేరిన పరంపరలో
రెక్కలతో మనిషికి పని! గగన విహారానికా?
నిర్జన శూన్యంలో బ్రతుకులేమి సాధించేను?
ఊహకు పరిమితం కానిదీ జీవన వాస్తవం

మనిషి చుట్టూ పరివారం వివిధ శ్రేణులలో
బ్రతుకులో నిజ శక్తికి ప్రయోజనం లభిస్తుంది

గగనం క్రిందికి దిగదు, దిగేది కాదు
మనిషి పైకి ఎగుర వీలులేదు, ఎగరదు
ప్రతి వస్తువు ప్రతి మనిషి తమ పరిమితులలో
శక్తికి మించిన పనులతో విషా పర్వం మొదలు

చీకటి మెట్లపై నడచే వెలుతురు రూపం
ఆరోహణలో మానవ జీవన హేతువు

ఎవరయినా సాధించే మహనీయం ఏమిటి? అంటే
తానే సాధన మయ్యేనో దానిని బట్టే ఉంటుంది
కోరే తన కాంక్షా హృదయం తెలియాలి
తన గమ్యం ముందుగ నిర్ణీతం కావాలి

ఊహలు కల్పనలు వీడవు, ఎప్పటికీ ఉంటాయి
వాస్తవ జగత్తులో అనుభవ రూపమే మిన్న

ఇపుడు మనిషి పగలయితే నడచే కిరణం
రాత్రి వెలిగే దీపం! అయితే మరీ మంచిది

ఎన్ని ఏండ్లు గడచినా అన్నీ అవే! బాహ్య ప్రపంచంలో
రూపమదే ! కోరికలవే! తీరినా తీరకపోయినా
ఓటమికి శక్తులెన్నో పనిచేస్తాయి వెనుక నుండి
గెలుపులో పట్టుకై ఎన్ని ఎత్తులో! మనిషి మనిషిలో

I. 11 మోయక తప్పనిదీ

మనిషిని మనిషికి దూరం చేస్తుంది అభిప్రాయ విభేదం
ఆపద శంకించవచ్చు, ప్రాణ హాని తలచవచ్చు
స్వార్థం పెరగవచ్చు, మనస్తత్వ విచిత్రం కావచ్చు
ఏదయినా మంచి చెడు దారులలో వాస్తవాన్ని తెలుపుతుంది

కనుచూపుకు కనిపించినంత మేరలోని భూమిని
తన వశం చేసుకొనే ఆలోచన ముందుకు సాగిస్తుంది
తత్కాలంలో విభేదాలను పక్కకు తొలగజేసే ప్రభావం
దారిన విరిసిన సుమ పరిమళ వీచికకే ఉంది

పయనంలో ఏమి జరిగినా అడుగు ముందుకే సాగుతుంది
అనుకున్నది వచ్చి ఉన్నచోట ఎదురుగ నిలబడదు
జీవిత కాలంలో ఆయువుతో పయనం తప్పదు
చేసిన పుణ్య పాప భావన కళ్ళలో తారాడేను,

దీని సూచనగా ముఖాన దృశ్యం! అనుభవ రమణీయం
అక్షర దర్పణంలో బింబించే కవిత తలుపుకు తెస్తుంది

సందర్భాన్ని బట్టి అక్షర రూపమే దయినా కావచ్చు
ప్రవాహం కావచ్చు, ఎగసే అలల జలధి కావచ్చు
మాట్లాడే ముఖం కావచ్చు, పోరాడే ఆయుధం కావచ్చు
లోపలి గుహ రహస్యం తెలిసేందుకు కిరణ సూచి చాలు

సమాజ సందర్భంలో ఒక మాటపై ఎన్ని ఆలోచనలో
కాలాంతరాన అర్థ శాఖల విస్తీర్ణం జరిగేను
మాట అదే ! పలు విధాలుగ బహు ముఖాలుగ
ఎప్పటికపుడు సరికొత్తగ మారుతుంది కవితలో

పలికే మాట వినే మాట పాతది కావచ్చు
సందర్భంలో అర్థం అవసరంలో ఉపయోగం కొత్తగా
చెట్టు అయినా మనిషి అయినా అనుభవంలో
అనుక్షణం బ్రతుకు బరువు మోయక తప్పదు
తృప్తికో విరామానికో తన పరిమితిలోనో
ముగిసినట్లు ఉంటుంది కవిత కాని సమాప్తి లేదు

I. 12 ప్రవేశనీయం

అన్నిటిలో సులభం జూద మాడడం తాకట్టు పెట్టడం
ఇవి అందరికీ సాధ్యం కాదు, కొందరికే చెల్లుతుంది
విపరీత మనఃప్రభావ స్థితికి మనిషి లోను కావచ్చు

స్నేహం బంధుత ప్రేమ నమ్మకం విలువలు మరచి
ఖాళి సంచి ముఖాలతో శిశిర తరువును తలపించేరు
మట్టి కుండ బ్రతుకు లేక్షణాన ముక్కలయ్యేదీ తెలియదు

మట్టి కణాలలో కలిసి చినుకుతో మొక్కను చూపేనా?
ఒక ఘటనతో బ్రతుకులు ఏమయ్యేదీ తెలియదు
తెలిసీ చేసేది లేదు, వెనక్కి వెళ్ళేది లేదు

కర్షకులు కార్మికులు ఉద్యోగులు వృత్తి కారులు
తదితరుల శ్రమ చేతన ఒకటే పైపై రూపాలు వేరు

మబ్బులు ఘర్షించవు, అలలు కలహ పడవు
నీడలు పోరాడవు, వెలుగులు యుద్ధం చేయవు
చెట్టు పూలు పూస్తే భూమి నవ్వినట్లు ఉంటుంది
ఫలభరమయితే సంపద పొందినట్లు ఉంటుంది

తూర్పున రవి బింబం రోజూ చూచేదే
మనిషిలో మనో జగం వేరు వేరు దృశ్యాలతో
పోయే దిశ మారవచ్చు, వెళ్ళే దారి వేరు కావచ్చు
పొందే ఫలితం మరొకటి, జీవన యానం మారొచ్చు

నడవ లేని చెట్లు కదల లేని శిలలు
తమ సంగతికి రుతువులకు వదలేసేను
వర్తమానం ఎన్నిటినో నింపుకొని కదలుతూ
స్వేచ్ఛలో మనిషికి బాధ్యత గుర్తుకు తెచ్చేను

క్షేత్రాలను పలకరిస్తూ నగరాలను పరామర్శిస్తూ
రోజు నిష్క్రమిస్తుంది భవితకు సూచనతో
తలుపులు మూతపడని కవిత ఎప్పటికీ స్వాగతిస్తూ
గోడలు ఎరగని మనస్సు ఎప్పటికీ విశ్వమయం

I. 13 అందమైన సార్థకం

పగలు సూర్యరశ్మి మనో జవం పెంచుతుంది
ఉత్సాహంలో ఉత్తేజం ముందుకు నడిపిస్తుంది
చంద్రకాంతి మదిలో కల్పన కవకాశ మిస్తుంది
ఉల్లాసానికి హ్లాదానికి కళాకృతిని ఇస్తుంది

మనుషులు తమలో శక్తి నిధులు మరచి
నిరాశలో మునుగుతూ వేదనలో మండుతూ
కష్టాలకు గురి అయ్యేరు
పరిమితి రేఖలు మరచేరు

చుట్టూ ఉన్న మంచి అవకాశాలు చేయి జారి
నాలుగు వైపులలో దిశా పథాలు వదలిపెట్టి
యానంలో కష్టం గురించి చింతన జరిపేరు
కాలం బాగా లేదని పర నిందకు పూనేరు

కాలాన్ని కత్తిరించి తన సైజుకు
తగిన డ్రెస్సులో నిరంతరం మార్పులతో
వ్యవహారం నడపడమొక కళ
కవితా చక్రంపై తిరగడమొక గ్లామర్

దప్పికలో ఎత్తిన గాజు గ్లాసు నీరులో
తన ముఖ బింబం చుస్తూ సేవించడం
తనను తాను అర్థం చేసుకొనే ఆలోచన
పూర్తిగ తెలియక ముందే ఖాళీ గ్లాసు స్మరణలో

నీటిపైన తేలుతూ మునగ కుండ నావలో
పయనం ఆశ్చర్యం ఔనో కాదో కానీ
అంత సేపు చిన్న నావకు మహా సముద్రం
తల వంచుతూ దారి నీయడం విశేషం

శ్రమ జీవన బంధువుగా పగలు
కష్టం ఉపశమనంలో మిత్రంగా రాత్రి
ధైర్యంగా అవతలి గట్టుకు చేరడమే
కవిత ప్రయోజనం అందమైన సార్థకం

I. 14 ఇరు పార్శ్వాలు

చూడక తప్పదు వినక తప్పదు
కన్నదీ విన్నదీ నిశ్శబ్దంగా శబ్దంలోకి
ప్రవేశిస్తుంది కవితకు విషయ హస్త మందిస్తుంది
సమాజ వాస్తవాన్ని భద్ర పరుస్తుంది

నిశ్శబ్ద క్షణాల్ని నాద మయం చేసేందుకు
దీన మైన స్థితిని ఉత్సాహ దీప్తిగ మార్చేందుకు
మౌనాన్ని సంభాషణ వేదికగా తీర్చేందుకు
సమాజ శక్తిని పూర్తిగ విప్పారగ చేసే పనిలో
అంతలో రక్త చిత్రమయ రూప మెదురవుతుంది
ఎక్కడి కక్కడ జీవితాలు స్తంభాకృతి పొందేను

పై నుండి రవి వెలుగులు పుష్కలంగా చేరినా
దిశలలో ఇంకా చీకటి ముఖాలు తొలగి చూస్తూ
చీకట్లను మనుషుల తీరులుగా మార్చడమొక కళ
ఇవి వెలుతురులను మ్రింగేనా? ఇది కవితలోనే సాధ్యం

మంచి చెడు చూడక తప్పదు, వినక తప్పదు
చుట్టూ ఉన్న నిశ్శబ్దంతో మాట్లాడక తప్పదు
ఉత్సుకతతో ఉన్న నిశ్శబ్దాన్ని మాట్లాడించక తప్పదు
తప్పని వెన్నో ! అన్నీ సుదీర్ఘ కథలో భాగాలే

రాజ్యాన్ని కూల్చే వ్యూహాలతో కొందరు
బ్రతుకుల్ని తీర్చే ప్రణాళికలతో కొందరు
నభం ఊడి పడేట్లుగా పిడుగులు పడవచ్చు
భూమిని మ్రింగ మన్నట్లుగా జలధిపైకి పొంగవచ్చు
నడక తప్పదు, దారుల మలుపులు తప్పవు
లేంది! దిశా భేదం లేదు వైవిధ్యం లేదు యానంలో

నిద్రలో కోల్పోయిన అస్తితను పొందేదెప్పుడు?
మెలకువలో మరచిన వ్యక్తిత్వం చూపే దెప్పుడు?
పద్యంలో తేజస్సు స్వేచ్ఛా కవితలో ఓజస్సు
ఇవి ఉషస్సుకు పార్శ్వాలు సృజనలో చేతన ప్రతినిధులు

I. 15 ఎవరి యానం వారిది

నిశ్శబ్ద మెంతటి దయినా అనివార్యమై అలముకొన్నా
ఒక మాటతో ఒక పదంతో చేతన పొందుతుంది
ఏకాంతంలోనూ సమాజ స్పృహకు బలమిస్తుంది
కాలాన్ని సమాధిగా ఏ సన్మతి భావించదు

నిశ్శబ్దం శిఖరారోహణలో ఉత్సాహ హస్త మందిస్తుంది
గడియారం ముల్లు ఆగితే కాలచక్రం నిలిచేనా
అద్దంలో ముఖ బింబాన్ని పరామర్శిస్తుంది ఆలోచన
బయట యానానికి ముందుగ రంగం సిద్ధం చేస్తుంది

"నేను" పరిమిత వలయం నిశ్శబ్దం నుండి
"మనం" విశాల క్షేత్రం సశబ్దం లోకి
పయనం ఒకరనుకునేంత సులభం కాదు
దీనికెన్ని అవరోధాలో, ప్రతికూలాలో దారిలో

గతంలో తవ్విన గోతుల జ్ఞాపకాల కన్న
వర్తమాన పథంలో అనుభవ చిత్రాలకు ప్రాధాన్యం

తాపంలో జలదాన్ని కౌగిలించుకోవాలని ఒకరు
అది క్రింది దిగలేదు, మనిషి పై కెరగ లేదు
మనసులో కోరిక చల్లని పవమాన వీచికై వేచి
ఎప్పటికయినా తీరక పోయేనా? అనుకోనీ ఆశతో

నిశ్శబ్దంలో శబ్దం అనురణనం తన ఉనికిని చాటేను
ఇది ఆకాశ విశాల హృదయంలో గుప్తంగా నిలిచేను

నినదించే కాలం కొత్త కవిత కోరుతూంది
ప్రవహించే క్షణాలు వేగ మందు కొనేవిగా
ఏ మనసు ఖాళీగా ఉండదు, ఏదో చేరుతూనే
నిశ్శబ్దంలో శబ్దం ఏ రాగానికయినా సిద్ధంగా

రెప్పలు వాలినంత మాత్రాన నిదుర పోయినట్లు కాదు
నిద్ర ముంచినంత మాత్రాన ప్రపంచం లేనట్లు కాదు

ఎవరి అంతర్యానం వారి స్వంతం రహస్యమయం
ఇతరు లెవరి మాటతో పనిలేదే కవితకు నిశ్శబ్దంలో

I. 16 అభేదం

గాయపరచే దొకరు ! చూచి బాధ పడేది ఒకరు
ఉపశమనం చేసేదొకరు ! సానుభూతి చూపేదొకరు
నీతి బోధించే దొకరు ! పట్టనట్లుగ ఉండేదొకరు
ఎవరి పాత్రలలో వారు ! సమాజ చలన మందరిలో

ఎవరి స్వేచ్ఛలో వారు అగ్నులయ్యేరు
సమిధలై కొందరు మేఘమై పవనమై ఒకరొకరు
ఇంద్ర ధనసు అయి ఒకరు, అన్నీ కలిస్తేనే ప్రపంచం
ప్రకృతి మనిషి వాతావరణం బ్రతుకులతో సమాజం

తన కోసం ఏడుపు! పరుల కోసం నవ్వు
రెండిటి ఆకర్షణ కథలో జీవన గతిలో
కావలసిన దానికన్న బెత్తెడొ! జానెడొ! దూరంలో
ప్రతిదీ తప్పి పోవడం ఒక తంతు విషాదానుభవం

ప్రాణం ఎగిరిపోయి శూన్యమైన శరీరాన్ని తలపించే
ఏ విగ్రహమో శిల నుండి స్వర్ణం వరకు ఏర్పడేను
ప్రజల దృష్టి పడేచోట నాలుగు దారుల మధ్య
ప్రమోదాలకూ ప్రమాదాలకూ మౌన సాక్షిగా
ఒకరి చేత పూలు చల్ల బడవచ్చు
ఒకరి చేత రాళ్ళు విసర బడవచ్చు

గాలికి తరలివచ్చే ధూళి పొరల నుండి
కాపాడుతుంది ఇంటి ముందు పచ్చనిచెట్టు
బురద చిమ్మడం సరదా కిందికి రాదు
వికార చర్యలకు నిదర్శన మవుతుంది

గాలికి సాగిపోయే మాటల మధ్య నుండి ధ్వనుల నుండి
హృదయ బంధువై స్వరం! స్పృశిస్తుంది పరిమళాలతో

ఇంట్లో గోడకు వేలాడే ఒరలో కత్తి
ఎపుడెవరి చేతిలో పడేదీ తెలియదు
వీరుడు కావచ్చు హంతకుడు కావచ్చు
గుణ భేదం లేదు ఆయుధానికందరూ సమానమే

I. 17 తెలిసీ తెలియని

కవిత వస్తుంది ఎక్కడి నుండి? అంటే
ఉదయ రాగం నుండీ హృదయ వేదన నుండీ
తొలకరి జల్లు నుండి నవ్వు ముఖం నుండీ
కన్నీటి చుక్కనుండి తప్పని ఘర్షణ నుండీ

ఎచటికి వెళ్ళినా నాతో నీడ ఉండనే ఉంటుంది
చల్లని హృదయంతో మంచిని గుర్తు చేస్తుంది
ప్రతి వ్యక్తిలో చంద్రునిలో మచ్చలా ఏదో దోషం
ఏ మైనస్ పాయెంట్‌తో తిరస్కరించలే మెవరినీ

మౌన గగన ముఖంలో మబ్బులు కదలేను
మెరపులు మెరసేను, పిడుగులు జారేను
సృజన భూమి మేల్కొనేను, చినుకులలో చేతనతో
శ్రమ జీవన గ్రంథంలో కొత్త సర్గ మొదలయ్యేను

గ్రీష్మ తాప బాధ అయినా మరొకటయినా
మరపించే స్వరం హృదయ లయలో పలికేను
అది వయొలిన్ కావచ్చు సితార్ కావచ్చు
వీణ కావచ్చు; తీగెలపై సృజన చేతనతో

సంక్షోభంలోనూ మదిలో ఆశా మయమై
ఏదీ ఆగదు! కాలంతో పాటు చలన శక్తితో

తుపానుకు భయపడి వీచే గాలులతో
మబ్బులు వెనక్కి వెళ్ళవు! నదులు ఆగవు
చెట్లు భయపడవు! వేగాన్ని సహిస్తాయి
కల్లోల జలధికి భయపడి భూమి ఎటు పోతుంది
సంక్షుబ్ధ సమాజానికి భయపడి మనిషి ఎటు పోయేను
కథ కంచికి పోతుంది, మనిషి ఇంటికి వెళ్ళేను

వంచితమై కుంచితమై బ్రతుకులు
భవితకయి ఎదురు చూస్తూ జీవన రుచికై
బహిర్యానంతో పాటు మనిషిలో అంతర్యానం
మనిషికి తెలిసీ తెలియని స్థితిలో సాగుతుంది

I. 18 చీకటిని సింహాసనంగా

స్టేషన్ నుండి వెళ్ళే రైలుకు వీడ్కోలు
వచ్చే స్టేషన్‌లో రైలుకు స్వాగతం
వీడ్కోలు స్వాగతాల సిగ్నల్స్
ఎక్కేవారు దిగేవారుతో జన యానం

పొలాలను చేలను ఊళ్ళను దాటుతూ
నగరం యాత్రిక శోభను స్పృశిస్తూ
పురా స్మృతులను మేల్కొల్పే అరణ్య దృశ్యాలతో
అంతర్యానం ! ప్రతి మనసులో నిశ్శబ్దంగా

పల్లె నుండి గాలులు నగరానికి చేరుతూ
ఆప్తమిత్రం వలె అందరినీ పలకరిస్తూ పోయేను
సమాచారాన్ని చేరవేసే పత్రికలవలె నిరంతరం
చోటు నుండి చోటుకు వినిపిస్తూ పోయేను

మంచి చెడులపై సమానమైన దృష్టితో
బహు విధ అస్తితలతో సృజన మయం కవిత
ఎవరి మధ్య ఏ స్థాయిలో ఘర్షణ లెన్ని జరిగినా
అవి కొమ్మలు మూలం వేరు ! అదే ఆధిక్యభావ జాలం

రణతంత్రం శాంతి నీతి వ్యక్తి వ్యక్తిలో భిన్న భిన్నం
ఏ సుఖం ? ఏ సమాజం! ఎవరి నుండి ఎవరికి?
ఏ హృదయం కాదనదు, జన సుఖం విశ్వమయం
అయినా మనిషి నుండి మనిషికి ప్రకృతి నుండి కష్టాలెన్నో

దేనికయిన చివర గెలుపు మనిషిది అవడం ముఖ్యం
ఎవరి నడత గమ్యం వారివశం అభిమతం
బుజం బుజం కలిపి తోడుగ లక్ష్యం చేరాలిసిందే
నిజం పై ముసుగు పొరలు తొలగాలిసిందే

భౌతికంగా ఒకరికొకరు దూరమైనా తత్కాలికంగా
మనసు విశ్వమయం ఊహా ప్రపంచ గతం
వెలుగును పక్కకు పెట్టి చీకటిని నిపుణతతో
సింహాసనంగా మలచు కొనే వారూ ఉన్నారు

II. 19 నిరాశ నుండి ఆశ

ఆకలి రంగు ఎరుపు, కాకపోతే నలుపులోనో
ఎరుపులో కోపం ! నిప్పు సెగల నృత్యం
నలుపులో దైన్యం క్షామ ముద్ర బింబిస్తుంది
సాగే ఆశాలతకు ఎక్కువగా ఈ సందర్భంలో
పూల బదులు ముళ్ళు తేలవచ్చు
ముళ్ళ బదులు నిప్పు రవ్వలు ఎగరవచ్చు

ఆకలికీ దాహానికీ పాత్ర భేదం లేదు
పల్లె నుండి నగరం వరకు ఎక్కడైన సరే
దప్పిక రంగు సాయం సంధ్యలో మాసిన ఎరుపు
కాకపోతే బూది గాను మారవచ్చు

ఆకలి దప్పికలు భౌతికమైన అవసరాలు
అపుడపుడు మనస్తత్వ రూపం సూచించవచ్చు
సమాజం నాలుగు వైపుల దారులు
ఏదారి నుండైనా పయనం సాగవచ్చు

సమాజ శ్రేయంకై మనసు కోరుతుంది 'శాంతి'
ఎవరూ కోరని సమరం ముందుకు వస్తుంది
అంత కాలం గుప్తంగా ఉంటుంది
సుప్తంగాను ఉండవచ్చు మనసులో

క్షణంలో తల ఎత్తి విజృంభించవచ్చు
దీనికి మనిషిలో జాగరూకత అవసరం

ఏ వ్యాధి అయినా కనికరం కన్న కఠినతయే ఎక్కువ
మహా మారి అయితే చెప్పరాని ప్రమాదం
అనుకునే లోపల దూకుతుంది, అందరినీ ఆవహిస్తుంది
మనిషికి లోనుండి ధైర్య కవచ మందుతుంది

ఎవరూ ఎవరి ముందు తలవంచ నవసరం లేదు
క్లిష్ట దశలో ఎవరి కర్తవ్యం వారు నిర్వహిస్తే చాలు
శ్రమ శక్తి ప్రభావంతో విజయం లభిస్తుందనే !
నిరాశ నుండి ఆశ పూచి అదుకుంటుందనే !

I. 20 కరుణ జలం

అనల కణాల చేత చుట్ట బడీ పచ్చని ప్రజాస్వామ్యం
ఇపుడు సంక్షోభ రేఖలతో చిత్పార్పితమవుతూంది
స్వేచ్ఛకు ఉండవలసిన విలువలు కరువై
దురుపయోగంలో చూపులు శూన్యంలో భ్రమించేను

స్వేచ్ఛ దేని కోసం? ఎవరికి? ఎంతవరకు? ఎందుకు?
ఈ ప్రశ్నలకు సమాధానాలెక్కడ ఈనాటి జీవితాలలో
ఎవరి ఆలోచన వారికి మితం వ్యక్తిత్వంలో భాగం
సమాజ హితకార్యానికి ప్రయోజన ముద్దిష్టం

ప్రశ్నలు బాణాల్లా ఇప్పటికీ మనసులపై దూసేను
ఇంత వరకు సరియైన సమాధానం దొరకనే లేదు
అన్నీ యథాతథంగానే షెల్ఫ్‌లో కనిపించే బొమ్మల్లా
మనిషిపై మనిషి నిరంకుశం, ఆధిపత్యం, హింస ఉన్నదే
చారిత్రక వాస్తవంతో సామాజిక వివేచనతో
అంతరంగ ప్రకాశంతో కొంత వరకే సాధ్యం

తలుపులు తెరవబడిన స్వేచ్ఛ దారి చూపుతుంది
ఆశలో ప్రాప్తానికి పోటీలో ప్రతిభకు గెలుపుకు
జాలి ఎరగని ప్రభుత అధికార సర్పదర్పంతో
కాలాన్ని వశపరచుకొనే ఉద్దేశం పొందుతూంది

భయ సందేహాలను వీడి గట్టుకు చేరాలిసి ఉంది
అనుమానం తెరలు తొలగి నిజం తేలాలిసి ఉంది
అనుభవంతో పొందిన సూచనలను పాటించడం
ఆలోచనలో మెరసే వివేచనను గ్రహించడం
స్వేచ్ఛకు ఉపకృతులై జీవితం సుగమంగా సాగేను

కిరణం దిశలను కలుపుతుంది స్నేహమయం చేస్తుంది
మరచినవి జ్ఞాపకం చేస్తుంది! సరి దిద్దుతుంది
నిశ్శబ్దంలో శబ్దం మనసును కదలిస్తుంది

చండమైన గ్రీష్మంలో నీటి పాయ పేదగ మారవచ్చు
రైతు కళ్ళ నుండి జలబిందువు లయితే ఆగదు

I. 21 ప్రశ్నలకు సమాధానాలు

ఆటలో నియమాలు పాటలో వరసలు
స్వేచ్ఛలో ఊహలు ఆచరణకు ఉత్సాహంతో
శబ్దంలో కదలుతుంది అర్థంలో నదిస్తుంది భావన
ఇది విరామ సమయంలో విధ్వంస రూపం మెత్తరాదు

పొలం పని నుండి ఆఫీసు విధుల వరకు
వ్యాపార జగత్తు నుండి వ్యవహార లోకం వరకు
ఏదీ విలాసానికీ వినోదానికీ సిద్ధంగా ఉండదు
స్వేచ్ఛలో బరువును బాధ్యతను నిర్వర్తిస్తుంది

కదలాలని, నడవాలని మనిషితో నీడ
ప్రయత్న మొక సుందర అనుభవ యానం
నిశ్శబ్దం ఇరువురినీ ఆహ్వానిస్తుంది
శబ్దం మాత్రం మనిషిని సన్మానిస్తుంది

అలల అలజడి జన సమ్మర్ధానికి సూచన
రూపానికీ నీడకూ మధ్య ప్రజల నుండి ఊహామయం
శత్రువు కాదు మిత్రం కాదు పరిచయమైన అంతరంగం
నాతో నడవాలని కనిపెట్టుక ఉండే రూపం

కదలి నడచి పోయే కొద్దీ
నిజ రహస్యం ! విప్పారుతుంది
అందేదీ అందనిదీ ఆ తరువాత మాట
తెలిసేదీ తెలియనిదీ మానిసికావసరం

సమాజ ముఖ చిత్రం రోజుకొక తీరు
ప్రతి మనిషిని కొత్త ప్రపంచం లోకి దింపుతుంది
ఏ పని లేకపోతే చెట్లనో రాళ్ళనో లెక్క పెడుతూ
కాలక్షేపం చేయడం సరదాగా ఒకరొకరికీ

దాహం క్షుధ అశాంతి హింస
సమాజంలో స్వేచ్ఛకు భంగకరం
మౌన బంధంతో సమస్య తీరేనా?
అమాయక ముఖాల ప్రదర్శనం కలిసి వచ్చేనా?
ముందు యక్ష ప్రశ్నలకు సమాధానం వస్తేనే
ప్రాణాలు నిలిచేదీ, గండం నుండి బయట పడేదీ

I. 22 కావలసింది

అడుగు ముందుకు పడితే అది విజయంలో భాగం
నిలిచి పోతే యథాస్థితికి ఆలవాలం
గాలి కదలుతుంది, నది ప్రవిస్తుంది ఆలోచన ఆగదు
కోరికల పోటీ కలహం శత్రుత మధ్య మధ్య విరామం

ఇది సమీక్షకు సమయం, చింతన కవకాశం
పశ్చాత్తాపానికి వీలు! మార్పుకు నవోదయం
కవిత! పాట విజ్ఞానం ప్రబోధం ఎన్నో
మనసులో శూన్య నిలయాలను నింపుతాయి

జీవన మౌలిక వర్తన రీతులలో మార్పు లేదు
అదే! కోపం ద్వేషం పీడన హింస నేరం శిక్ష
కార్య కారణ పరంపరల దీర్ఘ సంపుటి జీవితం
ఇందులో ప్రధాన పాత్ర మనిషే! మనో మయమై

పై పొర లౌకిక వ్యవహార జగన్మోహనమై
పూచే కోర్కెల తీగెలల్లుకొని రమణీయమై
సృజన విలయ శక్తులతో సమాజం చేరే
మంచి చెడుల పూలు ముళ్ళు తప్పనిదీ గులాబి

కలహ వర్తనం విగత నైతికం క్రూర ఘాతుక చర్యల
సంరంభం ప్రజాస్వామ్య ప్రయోజనాన్ని భగ్నం చేసేను
సమాజంలో సంక్షోభానికి దారులు తెరచేను

బయట పూల గుచ్ఛం బదులు కాలానికి
అనల కీల ! ఎదురవుతూంది అలంకరిస్తూంది
పలు జాడల మిశ్రమ దృశ్యంపై
మనిషి చూపు పడదు, నిలవదు
అడుగు జాడపై మరో అడుగు నిలవదు

తనకు తానుగ సంకెలలు వేసుకొని
ఎన్ని రోజులు గడపగలరు ఇంటిలో
మలిన రహిత ఉదయ రశ్మి ఆవాహనతో
జీవితాన్ని సమాజ చలనంతో నడపడమే కావలసింది

I. 23 వ్యవహర్త కర్త

పగలంతా ఎండకు వేడెక్కిన రాతి గుండెల్ని
రాత్రి వేళ చల్ల బడిన గాలి శాంత పరుస్తుంది
పగలంతా పనులలో గడపే శ్రమ జీవుల
తీరని కోర్కెలు వాదాల నినాదాలతో తృప్తి పడేనా?

కాలం ఎవరికీ దగ్గర కాదు సమంగా వర్తిస్తుంది
అభిమానం స్నేహం బంధుత లేనే లేవు పరిచయమే
కదలే కాల పటంపై జరిగి పోయిన దృశ్యాలు
జ్ఞాపకాలలో సుభద్రంగా అనుభవ గంధంతో

ప్రతి పనిలో పూర్తి కానిదేదో మిగిలే ఉంటుంది
ఇది ముగించి పోవడ మంటూ ఉండదు
విషయ మంతరించి పోకుండా మరో తరానికి
చేరుతుంది, పరంపర సాగుతుంది అవిచ్ఛిన్నంగా

కవితకు సమయంతో పని లేదు, సద్యోజాతం
గాలికి కాలంతో పనిలేదు పరిమళ బంధువు
మాటకు పాటకు విషయ నియతి లేదు
ఏ జీవన చక్రాలకు విరామం లేదు

తీవ్రమయిన కలహం రణానికి దారి తీస్తుంది
మధ్య మధ్య ఎందరు వస్తూ పోతూ ఉంటారు
ప్రేరకులు బోధకులు మిత్రులు అనుచరులు
రణ ప్రియులు శాంతి దూతలు ఎందరో! పనులపై

ఒకరికి కావలసినపుడు లేనిది దరి జేరదు
ఒకరికి ఇష్టం లేనపుడు ఉన్నది తొలగిపోదు
కాలంతో నడవడమొక చతురమైన కార్యం
చీకటిలో ఆరని దీపంతోనే రోజుకు పూర్ణత

తానే తన కవితకు వ్యవహర్త కర్త
మరో కవి బదులుగ ఉండే వీలులేదు
స్వయం తృప్తితో దృఢ సంకల్పంతో
సమస్యను జయింపవచ్చు నిజ స్వేచ్ఛా మతితో

I. 24 సమస్యకు సమాధానమై

నిశీథి వెలుతురు రూపం మన ఉనికి
చీకట్లను వెలిగిస్తూ పోవడమే మన కర్తవ్యం
ఈ నిశా రూప మెంతవరకు నిలిచేను
నిదురులో కొంత సమయం సులభంగా గడుస్తుంది

విరామంలో కళ్ళు మూతబడి తరలి పోతుంది
కళ్ళు తెరచి ఉండవచ్చు భద్రత బాధ్యతలోను
రోజు నుండి చీకటిని తొలగించే దెవరు?
మనసు లోని నీడలను మరపించే దెవరు?

ఏది న్యాయం? ఏది ధర్మం? అంతరంగానికి తెలుస్తుంది
తెలిసీ తెలియని సంధి స్థానంలో మనో రూపం
సూక్ష్మమైన భేదాలను గుర్తించ లేకపోవచ్చు
స్వార్థంలో సహజమైన వివేచన అణచబడవచ్చు

వితరణ గుణత్యాగ శీల ఔదార్యాలను
తమ స్వార్థానికి వాడుకొనే వారే అందరూ
పుట్టగనే భవిత గురించి యోచన మొదలయ్యేనా?
పై బడిన వయసులో మరో జన్మ గురించి తలచేరా?

గాలిలో వెలిగే వత్తిని కాపాడే ఉపాయం తెలిసి
తనువులో ప్రాణాన్ని నిలిపే ప్రతిభను మరచేరా?
భయం ఉన్నంతవరకు మృత్యువు మన పక్కనే

ఏడాది గడుస్తుంది రుతువుల ప్రభావాలతో
మనిషి సహించేను, వహించేను జీవిక సాగించేను
జరిగే నాశనాన్ని అరికట్టే వజ్ర సంకల్పంతో

ప్రపంచీకరణం తగ్గి మానవీకరణం ముందు వస్తూంది
స్వార్థం అంతరించి త్యాగం ముందుకు రావాలనే
అందరూ సుఖంగా బ్రతికి బట్టకట్టాలనీ
ప్రాణం ఉంటేనే సమస్యకు సమాధానమై నిలిచేది

నిశా భయం తొలగి వెలుతురు ముఖంతో
చీకట్లను పక్కకు తొలగిస్తూ పోవడమే విజయం

I. 25 ఆగని సృజన

కవితను వినేవారు చదివేవారు ఆదరించేవారు
ఉన్నారో ? లేదో? ప్రశ్నతో ఏ సృజన ఆగదు
సంశయంతో మనో రూపం నిలిచి పోదు
మబ్బు కమ్మిన సూర్యుని వలె అది తత్కాలికం

భూమిపై ఎదురు చూచే పనులెన్నో
ఇవేవీ పూర్తి అవకుండానే మనిషి
అవతలి లోకంపై తన ఆలోచన చాచేను
పొందే దెపుడో తెలియని శూన్యంలో తారాడేను

ఏదో దుర్ఘటనకు భయపడి దిగులుతో
ఒంటరి అయి పోవడం శూన్యాన్ని వరించడమే
మిత్రత శత్రుత జీవన నది కిరువైపుల
సమయ సమయం మనిషి చర్య ! ఏదో తీరంలో

నిశీథి అయినా విషాద మయం కాదు
చుక్కలు చంద్రుడు వెన్నెల బ్రతుకుల జాడలు
మనుషుల అలికిడి హ్లాద ముఖాలతో
మనిషి పట్ల అనురాగాన్ని పెంచేవి

ప్రియం కాని గతాన్ని ఎవరు దగ్ధం చేసేరు
ఏమి చేస్తే ప్రభావ పర్యవసానం తొలగేను
లోని కోర్కె పాల పొంగులానో, జలధి అలవలెనో
అనుకోకుండా పైకి ఉబికి కదలి ఆవహించేను

రాత్రి వీధిలో మనుషులు ఒకరొకరిలో వేరు వేరుగా
చెట్టునొ గిరినో నదినో శిల్పాన్నో జ్ఞప్తికి తెచ్చేను
పరాజయానికి బాధకు నిశ ఎప్పటికీ సంకేతం కాదు
శమనానికి పునర్యానానికి చక్కని అవకాశ మిస్తుంది

వ్యక్తితో సమాజం ప్రకృతితో భువి దివి
కవితలో తమకు స్థానంకై ఎదురు చూచేను
అనుభవాల్ని రాత్రి చీకటిలో కలిసిపోయినా
ఉదయ కిరణంతో పాటుగ మొలకలెత్తేను అభినవంగా

I. 26 సృజన హృదయం

ఆదర్శ రూపం వీధిలోకి అడుగు వేయగనే
ఆ వెనకనే కొందరు బహు ఇష్టంగా నడచేరు
దొరికిన నీడలో చల్ల దనం ఆశించి కొందరు
దీనిపై ఆరాలను తీసేందుకు కొందరు

ఎవరి గుప్తమైన ఆలోచన నిలయంలో వారు
కనిపించే దానికన్న లోన కనబడనిదే ఎక్కువ !
కాలం కలిసి రావడమంటూ ఉండదు
కాలాన్ని కలుపుకొని పోవడం లోనే ఉంది ప్రజ్ఞ

గిరి శిఖరా లెన్నో నింగిలోకి దూసి ఒకటొకటీ
తానే ముఖ్య నేతగా భావించేను ఎత్తులో,
తాను కనే స్వప్నం జలమై దారి దొరకి
ధునియై ప్రియమై జీవ ధారయై భూమికి దిగేను

అల్లుకొన్న తీగె వలె నిలిచిన స్నేహం
స్వార్థంలో బంధం తెగి సర్ప రూప మెత్తేను
ఎంత గాఢమయిన ప్రేమ అయినా హృదిలో
గులాబి పుష్పం బదులుగ అనల జ్వాల కనిపించేను

ఇది ఈనాటి సంశ్లిష్ట జీవన సమాజ రూపం
బయట ఒకటి, లోన ఒకటి పొరలలో వ్యాసంగం
బ్రతుకులు దిబ్బలుగా బహు కాలం నిలిచేనా?
మనసులు దిమ్మెలుగా చిరకాలం సాగేనా?

మొక్కలోని జీవన చేతన పొందాలనే ఉంటుంది
చెట్టులోని ప్రయోజన విశాలతతో నిలవాలనే
మనిషి పరిచయం నిలుస్తుంది కొన్ని గుర్తులతో
పూల తీగెగనో ! పండ్ల చెట్టుగనో ముళ్ళ కొమ్మగనో

దేశంలో నేతలు ఎవరికి వారు తాము శాసకులుగా
జీవన భాగ్యానికి ప్రతినిధులు స్వార్థంలో దారిద్రాన్ని పంచేరు
విస్ఫోటం బదులుగ నిర్మాణ సృజన హృదయంతో
గెలుపుకు నిర్వచనంగా నిలబడాలని మనసులో ఉండాలి

I. 27 సమాజ బంధుతతో

ఒక వైపున వెలుతురు ఒక వైపున చీకటి
ఒక వైపున మెలకువ ఒక వైపున నిద్దుర
కలిసిన మనో జగంతో జీవన సంకేతం
మ్రోగే సప్త వర్ణ కిరణ తంత్రులు మనసులో

అంతరంగ ప్రకాశంపై దృష్టి పడని మనుషులు
అహంకార మనోరూపం చేసే పనులు బ్రతుకులో
ఎప్పటివో కథలలో విన్నవి, అవే ! మళ్ళీ మళ్ళీ
మారిన ముఖాలతో సరికొత్త దుస్తులతో

పరివర్తన ప్రవాహంలో పడవ ఎంత దూరం?
తీరాన భూమిపై మరో ఊరు చేరేదాకా
మనుషుల సందడిలో జీవన యంత్రం ఆకర్షణ
వినిపించే శబ్దం కనిపించే దృశ్యం అనుభవ కళతో

చిన్న నాటి ఊరు వదలి నగరం చేరే వరకూ
ఊహలలో మనస్సు భాగ్యం సౌఖ్యం విభవం విజయంపై
చక్రంలో అరల పంక్తి వలె భ్రమణంలో రోజులు కొత్తగా
ఆధునికంలో వాస్తవ జీవన బింబా లొకటొకటీ

బాణం నుండి మిసైల్ అశ్వం నుండి విమానం దాకా
మధ్య మధ్య వికృత వేష ధారుల ప్రదర్శనలు
విలాసమో వినోదమో అవసరాలకు తప్పనివో
శిల్పం నుండి రసమయందాకా కవితలోనే సాధ్యం

ఆధునిక ప్రభావ క్షేత్రంలో ఏ కవి మినహాయింపు కాదు
ఆధునికం నుండి నేటి జీవితాన్ని వేరు చేయలే రెవరూ
వివేచనను తప్పి వ్యవహరిస్తే విషమత తప్పదు
వాస్తవాన్ని వదలి కల్పనలో, బ్రతుకు దారి దొరకదు

ప్రశ్నల కేవో జవాబు లీయడం ప్రజ్ఞ కాదు
అది హేతువుతో సార్థకతను స్వనిస్తేనే విజయం

ఇది ప్రజాస్వామ్య యుగం సామ్యవాద ఛాయలతో
హృది ప్రియ హిత కర సమాజ బంధుతతో కవితలో

I. 28 ఎల్లవెళల పయనం

వీథిలో బిచ్చమెత్తే బ్రతుకు రాకూడదు
ఈ మాట ఎప్పటికీ గాలిలో తిరుగుతూనే ఉంటుంది
అదే తన పనిగా ప్రతిధ్వనిస్తూ మాటి మాటికీ
ప్రతి చెవిలో స్వనిస్తూ ముందుకు వెళుతుంది

ప్రతి మతంలో చెప్పదగింది, ప్రబోధంతో
చేతికి బిక్షా పాత్రను ఇవ్వడం
లేకపోతే చాచిన దోసిలి ఉండనే ఉంది
పడవలా జీవన జలధిని దాటించే ఉపాయం!

పొందే వారికి ఐహికమయిన అవసరం
ఇచ్చే వారిలో రిజర్వు చేస్తుంది పరమం
రెండిటి మధ్య చిన్న వంతెనలా తాత్త్వికం
కష్టాల్ని దాటించేందుకు, సుగమత చేకూరేందుకు

దేని కోసం ఈ పయనం అంటే
లేనిది పొందడానికీ ఉన్నది పెరగడానికీ
మనుషుల పరిచయాల అల్లికతో
జీవిత మొక సుందర నిలయంగా తీర్చడానికీ

ఈ రోజున నిన్న మరుగున పడుతుంది
ఆహ్వానం పలికినా తిరిగి కనిపించదు
ముందు ఏమి జరిగేదీ తెలియని జీవన చిత్రంలో
ఈ రోజున క్షణాలు మనిషి వశంలో బొమ్మలు

బ్రతుకు జలధిలో కెరటాల నృత్య వినోదంలా
వెలుగు జగంలో మనుషుల వర్తమాన ప్రదర్శనం
చీకటిలో కాసారంలో బింబించే చుక్కల
పడవలలో కనిపించేరు పరిచయమున్నవారు

మాటతో పాటతో కాలాన్ని అందంగా గడపాలనీ
ఎవరి ఇష్టం వారిది, ఎవరి గమ్యం వారిది
రాత్రిలోను పయనం సాగుతుంది నిర్భయంగా
పగలు ప్రజల మధ్యలో రాత్రి చుక్కల మధ్య నుండి

II. 29 అవకాశం ఉన్నపుడే

ఏ ప్రాణి దాహం తీరుస్తుంది ? జలాంజలి
భూమి దాహం తీర్చేనా? మనిషి కోరిక తీర్చేనా?
గతం వర్తమానం భవిత ఏదయినా
అన్ని కలిసి సంపుటియై స్వప్నంలో ఊరటగా

లౌకిక ప్రయోజనం కన్న, మానసిక తృప్తితో
మనసులో ఎగసే వీటి రాక నెవరు ఆపగలరు?

నడకలో కాలం కరగి సరిస్తుంది
ఊహలో జగత్తు తనదై తోస్తుంది
శ్వాసలో ప్రాణం బ్రతుకును పొడిగిస్తుంది
అన్నీ సమానం అందరిలో ఒక వ్యక్తిత్వం తప్ప

మస్తిష్కంలో నిలిచిన మంచు తెర
సూర్యుని రాకతో తొలగేనా?
సమాజంలో ఈదే బ్రతుకులో
కవిత ! పడవలా ఉపకరించేనా?

నాలో అనుమానం చీకటి గదిలా
దీపంకై ఎదురు చూస్తుంది మనస్సు
పూర్ణిమ నిశ పొంగే జలధిలా
నాలో హృదయం కవితా మయమై

రాత్రి భయాల్ని మరచి ప్రస్తుతానికి
వెలుగుకు స్వాగతం పలుకుతుంది హృదయం
అయినా చీకటి ప్రతినిధులు నీడలు వీడవు
ఉండనే ఉంటాయి, నాతో పాటు బంధులవలె

రక్షణ యోజనతో కట్టిన ఎత్తైన గోడలు
అవతల ఉన్న వారికి అడ్డు కాకూడదు

ఉదయం సూర్యుని అగ్ని మండలానికెదురుగా
వడపోతల జోన్లు దాటి వచ్చే వెలుగును అనందిస్తూ
అనుకూలం కానపుడు వ్యతిరేకం అయినపుడు
కొత్త పుస్తకమై జీవితం మొదలు కాదు! ఎవరిలో

I. 30 తెలియని ప్రపంచం

ప్రతి మట్టి కణంలో సృజన శక్తి లవం
ఇది నాకూ నీకు చెందదు, విశ్వ ప్రజలందరిదీ
భూమితో అనుబంధం సహజం, అనివార్యం
మొదలు నుండి చివరి దాక నడక నుండి నడత దాక

ఇది ఒక తరానికీ యుగానికీ చెందింది కాదు
ఇది జీవన రూపంతో ముడి వడిన వాస్తవం
స్వప్నం ఎలాంటిదయినా ఎట్లా ఉన్నా మనిషికి
ఇష్టంగా వినోదంగా విలాసంగా ఊరటగా లోలోన

విరామ సుందరంగా పునరాలోకనంగా బాగానే ఉంటుంది
జలధిపై నౌకాయానంలానో, నింగిలో విమానయానం లానో

ధగ ధగ లాడే ఎర్రని పట్టు వస్త్రాలతో సూర్యుడు
మనిషిలో మెత్తని ఉజ్వలతను విస్పారగ జేసేను
చీకటిని దూరం చేసి బ్రతుకులో ప్రేరణ అయ్యేను
మనిషిలో క్రియాశక్తిని దింపి, ఆచరణలోకి దింపేను

మనిషి విలువ బయట వ్యాపారంలో భాగం కాదు
అద్దంలో రవి బింబంలా మనిషిలో అంత రంగం

ఒక రోజున ఉదయం అస్తమయంతో
చీకటి చుక్కలు వెన్నెల చంద్రుడు మిత్రులతో
ఏ కథ ముగియదు, ఏ పని పూర్తి కాదు
ఎంత కాలం గడపాలో ఎవరికీ తెలియదు

స్టేషన్‌లో ప్లాట్ ఫార్మ్ పై ప్రయాణికులతో
బిక్షువులు చిరు వ్యాపారులు సందడితో జీవన చలనం
వచ్చిపోయే రైళ్ళు దిగే ఎక్కే జన సందోహం
రైలులో జూదం ఆడేవారూ, మబ్బుల్లో విహరించే వారూ

ప్రవహించే నదిపై బ్రిడ్జి నుండి వెళ్ళేప్పుడు
స్మృతుల్ని నదిలో విసరి పారేస్తూ
అంతలో భిక్షువు కీర్తన పాడుతూ
మనిషికి తెలియని ప్రపంచంలోకి నడిపించేను

I. 31 కొత్త ప్రపంచం

ఉదార భావనకు భౌతిక ప్రతీక చెట్టు
త్యాగ శీలానికి ఆర్ద్ర చిహ్నం ప్రవాహం
బరువు బాధ్యతలకు సంకేతం వసుధ
మనిషి మనసు జీవన చైతన్య నిలయం

భయం గొలిపే వార్త ఎక్కడి నుండో
ఎంత దూర మయినా పయనించేను మనిషి కోసం

చెట్ల మధ్య గడిపే కవి మనస్సు
చెట్టుతో ఏకమై కవితగా మారుతుంది
అలలను చూస్తూ కదిలే కవి ఊహ
అలయై అక్షరంలో కవితను పొందుతుంది
మబ్బులతో నడచే మనిషి ఆలోచన
శబ్దంలో కవితయై అర్థం వర్షిస్తుంది

రాజ్యం ఆదర్శం దేశం రాజ్యాంగం పౌరసత్వం
దేని పరిమితులు దానివే అన్నీ కలిసి సమాజం
శ్లిష్టమై విశేషాల సంకలన గ్రంథం ఎప్పటికీ
వీటితోనే బాధ్యత తెలిసేదీ, విధి నిర్వర్తించేదీ

అన్నిటినీ మించి భూమిపై సమాజ చింతనతో
మానవీయ వికాస రోచి, మానవతా గంధసూచి

చేతిలో కత్తి లేక పోయినా
మనసులో పదను తేలిన ఆలోచన
కత్తి చేసే పనులన్ని చేస్తుంది
మనిషిలో ధైర్యాన్ని నిలుపుతుంది

మనిషి అర్థమయితే బ్రతుకు లోతు తెలుస్తుంది
కవిత ! అర్థమయితే మనసు అడుగు తెలుస్తుంది

ప్రతిభ చేత రెక్కలపై ఎగిరో
జలధి పైన వంతెనయై నిలిచో
పడవగానో! కవిత! ఒడ్డుకు చేరుస్తుంది
ఏ తుపాను ఏ సునామి వచ్చి పోయేవే ! ఆపై బీభత్సం
శిశిరం తరువాతనే వస్తుంది వసంతం కొత్త ప్రపంచంతో

I. 32 సమాజ శ్రేయం

తీగెలపై కమాన్ చలనంలో నైపుణిచే
స్వర మేదయినా స్వనిస్తుంది వయొలిన్
శబ్దంలో భావ గమనంలో ఉపజ్ఞచే
స్పందన హృదయం పలుకుతుంది కవిత

ఒకరి దృష్టిలో అపమార్గం మరొక దృష్టిలో సన్మార్గం
రెండిటి ఘర్షణతో రణ చక్రం తిరుగుతూంది
అందమైన కల్పన కవకాశం తగ్గుతుంది
నిష్కర మయిన నిజం బయటికి రావాలనే

మేఘం వస్తుంది చినుకు పడకుండా వెళ్ళవచ్చు
విచిత్ర సందర్భంలో శూన్య ముఖంతో
నిరాశా శిఖరంపై కర్షకుడు క్షేత్రంలో
అభ్యర్థన పత్రంలా చేతులు చాచి

ఈనాటి భారతంలో ప్రముఖ పాత్రలో శ్రామికం
క్షేత్రంలో నెరియం నుండి సర్వం తల ఎత్తుతుంది
యంత్రం జీవన లయ నందుకొని పని చేస్తుంది
చినుకులు పడితే ఏ ఒక చెట్టుకో మితం కాదు

సంజవేళ పక్షులు నిర్భయంగా గూళ్ళకు చేరతాయి
పగటి వేళ మనుషులు భయభయంగా నడిచేరు
దుర్వార్తను వినని ఏ రోజు లేదు
ఇది తప్పని విషయ మయింది సమాజంలో

ఉదయం వస్తుంది మనసులు తేజోవంతమయ్యే నని
ఆశపడే బ్రతుకుల్ని అనలమయం చేస్తూంది పగలు

శభ్రమైన గాలి స్వచ్ఛమైన నీరు స్ఫటిక సమం హృదయం
కోరే మనుషులిపుడు ఉన్నదానితో సర్దుక పోవలసిందే
హృదయం జ్వాలామయం అయ్యే కన్నా
పూల గుత్తి అయితేనే సమాజానికి శ్రేయం
పయనంలో అడవులు కొండలు నదులు అవరోధాలు
ఎన్ని సారులు దాట వలసివచ్చేనో? పరీక్షలన్ని మారులు

I. 33 జ్వాలా కేతనం

ఇప్పటికీ ఆదే కీలలతో వృథా శకలాలు
పనిలేనివారు పని చేయనివారు పని తెలియని వారు
హఠాత్తుగా పరివర్తన ప్రవాహంకై ఎదరు చూచేరు
బీటలు వారిన నేల నుండి మొక్కను తలచేరు

దీనికై ! దార్శనికమొ పోరాటమొ విప్లవమో తలచేరు
బహు రూపంలో మారే రంగుల వేషాలతో
ఎప్పటి కయినా దేని కయినా సిద్ధంగా ఉండే వారూ
ఏ ఎండ కా గొడుగు పట్టే నేర్పరులూ తప్పదు

నలుపు ఎరుపు రెక్కలతో ఎగిరే పక్షులు
ధనం నుండి ఖ్యాతి వరకు జీవితాశయంలో

ఊరు వదలి అడవులు చేరే నడచే జ్వాలలు
ఆయుధ శబ్దంతో కాలాన్ని కదలించాలనీ
విప్లవ పతాకంతో లలాట తలాన్ని తీర్చేరు
అనుకున్న తడవుగా మార్పుకు ఆరాట పడేరు

ఇది కమ్మిన చీకట్లను పోగొట్టేనా?
ఇది ఎగసే ఆకలి మంటను ఆర్పేనా?
ఆ సందర్భంలో కావలసిన సామగ్రి తప్ప
ఏవేవో ప్రసంగాలు వాగ్దానాలు మానిఫెస్టోలు
ప్రణాళికలు కల్పనలతో కాలం గడిపేరు
నేతలు మేధావులు అధికారులు అధినాథులు

ఎప్పటివో సమస్యలు సమాజంలో ఇప్పటికీ
మాటలవే చేతలవే నీతులవే బ్రతుకులవే
జ్వాలా పతాక పై కెగసేను, ఆకలినుండా?
వెడలిన సెగల పొగలతో మేఘం! కదలేనా?

ఆకలి చల్లబడేనా? ఊరట కలిగించేనా?
భూమిపై పై నుండి జారే చినుకులు
నాణేల్లా శబ్దించేనా? సంపద భోగం పెరిగేనా?
మనిషిని మనిషిగ తీరుస్తూ అందరి ఆకలి తీర్చేనా?

I. 34 హిమాశ్రువులు

మనిషి నుండి మనిషికి మధ్య ఎడంలో
నిప్పు కణిక లుండవచ్చు, దాటాలిసి రావచ్చు
సుఖ కర పయనంలో పూలకు అవకాశంతో
మనసులో చినుకులతో మేఘం కదలవచ్చు

ప్రశ్నలకు జవాబులతో పనిలేదు సామాన్యులకు
సిద్ధాంతాలకు చెందిన వాదాలను కోరేది లేదు
పెద్ద సంఖ్యలో ప్రజలతో దేశం పతాక ఒకటే
ప్రపంచ ప్రజలందరిలో; ఆకలి రూపం ఒకటే

లోన అగ్ని కీల నుండి రాలే
నిప్పు పూలు ఒకటే, మానవ మొకటే

కెరటానికి గట్టుకు చేరడమే గమ్యం
దీపానికి దారులు చూపడమే లక్ష్యం
దారిలో ఏమి ఎదురయ్యేదీ దీపం బాధ్యత కాదు
సర్పం కనిపించవచ్చు, దోపిడి జరగవచ్చు

తెలిసినా తెలియక పోయినా అన్నిటికీ సిద్ధంగా
మనిషి మనసు చీకటిలోనూ పయనం సాగించేను
మనిషి మాత్రం చీకటి ముద్ద కాదు
ఎవరి చేతిలోనో మారే బొమ్మ కాదు

ఆచరణంలో మనోయుతమై రూపమేర్పడేను
నిర్మాణంతో విధ్వంసం పాత్రను వహించేను
కదలే అలయే తీరం చేరుతుంది
కదలని శిల ! ఉన్న చోటునే మౌనంగా

భూమిపై ఆకలితో తపించే మనిషిని చూచి
దూరంలో పై నుండి హిమగిరి శిఖరం
ఉదయ రశ్మికి జారే మంచు బిందువులు
పేద పట్ల సానుభూతి ఆశ్రువులయ్యేను
ఎప్పటికయినా ఆకలి తీర్చే దొకటే
మనిషికి పనితో శ్రమ జీవన ఫల రూపం

I. 35 వాస్తవమై

అనుక్షణం మనిషిలో ఏదో ఒక నిర్మాణం
కొత్తవి చేరేను పాతవి వివేచనలో నిలిచేను
వ్యక్తిత్వం వికసిత మవుతూ పరిణతికి చేరువలో
పని లేని వారినుండి తీరిక లేని వారి దాక

చుట్టు ప్రకృతి సమాజం మధ్యలో మనిషి జీవితం
ఒంటరి తనాని కవకాశ మెక్కడుంది? లేదు
జ్ఞాపకాలతో మనసు ఎప్పటికీ నిండుగా
ఏదో లక్ష్యంతో బ్రతుకులు ! ఊహలో క్రియలో

తొలి దశలో శిశు వలయం దాటి అమాయకం
అపై మరో మరో దశలు దాటుతూ! స్వేచ్ఛగా
దేనికది తన పరిమిత వలయంలో తిప్పేను
కలలు! తెలుపులో, మెలకువ పలు రంగులలో

ముఖాన్ని చూసుకునే ముందు అద్దాన్ని
తుడిస్తేనే బింబానికి స్ఫుటత లభిస్తుంది
అద్దాని కంట గట్టే అపవాదు తప్పుతుంది
తనలోను తృప్తి రేఖ తళ తళ లాడుతుంది

ఏ రోజూ మానుష శక్తికి పరీక్షా సమయం
మనిషి దృష్టి పడని మరపునబడి పోయే
అంతరంగం ప్రతిబింబిస్తుంది కవితలో
మనసును మేల్కొలుపుతుంది దారిని చూపిస్తుంది

అభిప్రాయ విభేదాల మధ్య మండే చర్చలు
నిజం తెలిసేందు కయితే! నష్టం లేదు
స్నేహం ప్రేమ దయ ఉదారతతో నిండిన
హృదయాల మధ్య విభేదాల ప్రసక్తి లేదు

ఎప్పటికీ సమాజ చేతనలో భాగమైంది
వాస్తవ శక్తులతో జీవన ధుని ప్రగతి పథంలో
నీళ్ళు నిధులు నియామకాల గురించి ప్రజల ఉద్యమం
కలలకు సుందర వాస్తవం తెలంగాణ అవతరణం
వెనకనే అమూల్యమైన భద్ర పేటి గతం
సమకాలీన తరానికి ప్రతినిధియై కవిత

I. 36 సృజన పథం

ఉన్న గూడును ఛిన్నం చేసి పొతుంది తుపాను
మరో గూడును సిద్ధం చేసుకుంటాయి పక్షులు

రవి నిష్క్రమణం తదుపరి ఏర్పడే ఖాళీలో
చీకటి చేరుతుంది సంకెలగా మారుతుంది
ఇది తొలగేందుకు సూర్య కిరణ మొకటి చాలు

దేహమెంత శుభ్రంగా ఉండాలిసి వస్తుందో
సంఘమంత స్వచ్ఛంగా ఉండాలిసి ఉంటుంది
రెండిటి కలయికతో ఉత్తమ సంస్కార శ్రేణి చేరుతుంది
వ్యక్తి – దేశం కలిసిన అపూర్వ సమాజ రూపం గొప్పది

మబ్బులతో కలిసి పయనం పై కోరిక చాలదు
పిడుగులను సహించే శక్తి కూడ అవసరం

బ్రతుకు తెరువులో పని చూపే బాధ్యత
ప్రజా స్వామ్య పాలనలో ప్రభుత్వ ప్రణాళికది
ఆకలి మాటలు లేకుండా రోజు గడవడం
సమాజ జీవన సంస్కృతి స్థాయికి చిహ్నం

ప్రవాహాలెన్నో వాటిపై వంతెన లెన్నో
జలధారను దాటేందుకు సులభం అయ్యేందుకు
ఇది కవితకూ వర్తిస్తుంది అందరినీ కలుపుతుంది
మిత్ర శత్రు స్వ పర భేదం లేకుండా

చీకటిలో వెలుగై నడవడం ప్రజాస్వామ్య లక్షణం
అందరికీ వెలుగులు పంచడం మానవ చిర ధర్మం
బాల్య దశలోవి అనుభవాలు, చెదరనివీ వీడనవీ
ముడుపు కట్టిన నాణేల్లా స్మృతిలో భద్రంగా
అభాగ్యులు అనాధులూ ఉన్నవారు లేనివారు అందరూ
ఈ అక్షర నిలయంలోకి ప్రవేశానికి ఎప్పటికీ స్వాగతం
కవితలో విశ్వ హృదయం ప్రతిబింబిస్తుంది
ఎందరివో నడకలతో నడతలతో సృజన పథం

I. 37 కవిత వెడలుతుంది

కవిత వెడలుతుంది మనో మూలం నుండి
రోజు గడచి రోజుపై ఆశా సంకేతంతో
జీవన ప్రేరణ యై వాస్తవ గతి భావనలో
ఇది హృదయ వశం శక్తిమయం పలు పాత్రలలో

శక్తి రేఖ లేంది సృజన లేదు కవిత లేదు
మెరపు తీగె వలెనో వెలుగు లహరి వలెనో
ఉదయ రశ్మితో ఉషస్సు
హృదయ పీఠ మలంకరించేను

కవిత్వమొక జలరాశి, సరిస్తుంది నదియై
ప్రవాహ వేగంలో కొట్టుక పోవడం కాదు
అనుభవ స్పందనతో పయనం ముఖ్యం
కాలాంతారాన నిలిచేది అక్షర దృశ్యం ఒకటే

తృప్తికి పూచిన పూవులా కనిపించవచ్చు
ఆలోచన కందే శశి కళలా తోచవచ్చు

ముఖంలో చెక్కిన శిల్ప భంగిమకన్నా
కౌసుమ గుచ్ఛం సహృదయ సంకేతం
కవిత ఎడారిలో సరసును చూపిస్తుంది
శిలల నుండి రసాకృతిని జారుస్తుంది

బిందువు నుండి రేఖ, రేఖలతో చిత్రం
మనిషి నుండి మనీషి ! మనీషిలో మనస్వి
ప్రశ్నకు సమాధానం సమాధానంలో వాదం
వాదంతో భేదం భేదం నుండి మరో మార్గం

భేదించే పక్షంతో ఘర్షణ తప్పనిది కాదు
ప్రేమ కరుణ సహన భూమికలతో ప్రజాస్వామ్యం

I. 38 చాచిన చేతులలో

సూర్య బింబ మెప్పటిదో ఇప్పటికీ అదే
యుగ యుగాలుగా జగతిని చేతనతో
కాంతి కళలు నింపుతూ మనిషి మనిషిలో
సమాజ రూపానికి కొత్త శక్తి నిచ్చేను

రోజు రోజు మారే జీవన గతులతో
ఎవరితో ఎవరికినీ పోలికలు కుదరవు
ఎవరి బాట వారిది, ఎవరి యాత్ర వారిది
ఊహలలో కోరికలు వారి వారి స్వంతం

రాత్రి ఎన్ని దీప తోరణాలు వెలిగినా
పగలు వెలుగుతో సరికావు ప్రభావంలో
హ్లాదకరాలయినా వెన్నెల వేళలు
నిదురలోనో గోడల మధ్యనో గడచేను

గాలి వెలుగు! పిడికిలిలో నిలిచేవి కావు
స్వేచ్ఛకూ స్వతంత్రానికి ప్రేరణలయ్యేను
నిరంకుశానికి బ్రేకులు వేసే గుర్తులు
వర్తనంలో సమన్యాయం చూపే

ఆకలి వేస్తే మనిషికి పంటను చూపేరా?
మునుముందుగ ఆహారం అందించేరా?
దప్పిక వేస్తే మనిషికి మబ్బును చూపేరా?
చేతికి తాగే నీరును అందించేరా?

ఎప్పుడేది అవసరమొ తెలిసి చేయడం విజ్ఞత
ప్రకృతి వనరులందరి ఏ ఒకరి సొత్తు కావు

చీకటి బ్లాక్ బోర్డుపై అక్షర పంక్తులు
కవితలయి మనిషిలో ఆశలు నింపుతాయి
భయం వదలి రాత్రి చాచిన చేతులలో
వాలడ మొక సుందర సందర్భ విశేషం

I. 39 కాలం వాహనమై

ఎండలో వానలో మంచులో చెట్టు
ఉన్న చోటు వదలి ఎక్కడికీ వెళ్ళదు
మొలక నుండి మాను వరకు పచ్చదనంతో
అన్నిటినీ భరిస్తుంది, ధూళి ధూమ, కలుషాల్నీ

ప్రాణానికి ముప్పులోనా! పొట్ట కొసమొ
క్షణాలలో వదలి మనిషి కదలి పోయేను
ప్రాణ భయం లేని చోట
కాస్త సుఖం ఉన్న చోట
ఏ దశలో ఎచటి కయినా
అనుమానం లేకుండా పయనం సాగుతుంది

స్థానీయం ప్రాంతీయం దేశీయం ప్రాపంచికం
ఒకదానితో ఒకటి కలిసి అస్తితలో మానవీయం
ఈనాటి కవితలో ఇది విషయానికి కేంద్రం
అక్షర రూపంలో బ్రతుకులు ప్రతిఫలించేను

కలలో నిలువున గోడలు ఉండవు
యధేచ్ఛా యానానికి అవకాశం బాగా
మెలకువలో ఎటు చూచినా గోడలు
గగనంలో గోడలు! కనిపించవు, నిలబడలేవు

మనిషిలో పేరుకొన్ని మలినం తనువును బాధించేను
మితిమీరిన క్షుద్రత మనసును పీడించేను

ఆర్ద్ర భావనతో పయోదం తలపుకు వస్తుంది
శాంతి పావురం వచ్చి బుజాలపై కూర్చోదు
ఆ సమయంలో దీనికెంత సహనశక్తి అవసరమో ?
ఉద్రేక మతిశయించి అమానుషం విజృంభించేను !

I. 40 ఏ మూల నుండో

ఎవరి అనుమతి అవసరం లేని కవితలో
మాట కత్తి అంచును మెరపించ వచ్చు
మాట పూల మాలను తలపించ వచ్చు
లక్ష్యంలో ప్రయోజనం విభిన్న పార్శ్వాలలో

కవితలో మరో స్వరం వివిధ స్థాయిలలో
నదీ ధ్వని గనో జలధి హోరుగనో
వ్యక్తి మనో వర్తన కనుగుణంగా
నారీ రూపం మానవీయ భావనతో

ఎవరి బ్రతుకు ఎప్పటికీ సుఖదమై మోడల్ అవదు
చాచిన చీకటి చేతులలో ఆట వస్తువు కావచ్చు
గెలుపు అంచులలో నుండి జారవచ్చు హఠాత్తుగా
కవితకు వస్తువులో వైవిధ్యం పుష్కలమై, నవమై

బ్రతుకులో గడచే కాలం
కవితలో అద్దం లో వలె
చేతి కందక పోయినా
మనసు కలను చేరుతుంది

పని జరగనపుడు మనిషి చేసే ఘనకార్యం
కాలాన్ని నిందకు గురి చేయడం, జరుగుతుంది
ముగింపు పలకడం మనసు పని అయితే
పరంపరను సరింప చేయడం కవి బాధ్యత

ఎంతగ అవసరమయినా
పగలుకు ముగింపు తప్పదు
ఎంతటి విరోధమయినా
కవితకు ముగింపు ఉండదు

కాలం గాయాలతో నెత్తురు చారలతో
చిత్రత మవుతున్నా సంక్షుబ్ధ స్థితిలో
శాంతి మాట వినిపించదు, ఏ మూల నుండో
భయ దృశ్యం మాత్రం! తప్పక కనిపిస్తుంది

I. 41 కవి కవికీ

అపుడపుడు మనిషి ఊహను మించిన అనుభవం
ప్రమాదకరమో? భయానకమో? ఎదుర్కోవలసి వస్తుంది
విజ్ఞానం వివేకం కలిసి దాటే అవకాశ ముంది
అదుపులో లేని ఆందోళనలో మానవ రూపం

త్యాగం ఔదార్యం నిపుణత సహనం అవసరమవుతాయి
ఇది బీభత్స ముద్రల సంపుటం! అందరికీ తెలిసిందే
అనిశ్చయ స్థితులలో బ్రతుకులు! స్తంభించిన చలనంతో
నియతమైన విధానాన్ని కోరుతుంది ! సమాజం

ఇది ఏదో కొందరి వ్యక్తి స్థాయి సమస్య కాదు
ఇది సమష్టి స్థాయిలో సమాజానికి చెందింది
దీని తరువాత మరొకటి చోటు చేసుకోవచ్చు
ప్రకృతి నుండి కావచ్చు, మనిషి నుండి కావచ్చు

ఏదో ఒక విషాద దృశ్యం! ఏ రోజూ
ఉదయం మొదటి కిరణంతో మొదలయి
సాయం చివరి కిరణంతో ముగిసీ
రాత్రి చీకటికి సమాధాన పడేను మనస్సు

మనిషితో మనిషి మాటలు తక్కువగా
మౌనంలో ఎక్కువ సమయం గడపడం జరుగుతుంది
సంతోషాన్ని పంచుకొనే వారు ఎందరో
బాధల రుచిని పంచు కొనేవారు ఉండరు

కవి మనో జగత్తు అక్షర రూపంలో వెడలుతుంది
హిమ గిరి శిఖరంలా అంతరంగం మౌనంగా
కిరణ స్పర్శచే కరగుతుంది! సరిస్తుంది కిందికి
ఒకరికి పూల గుచ్ఛంలా కనిపించవచ్చు
ఒకరికి నిప్పుల కుంపటిలా అనిపించవచ్చు
కవి కవికీ స్పందనలో వివిధ ప్రయోజనాలతో

I. 42 మహదవకాశం

గాయంపై కన్నీటి చుక్క
బాధను తొలగించేనా?
గాయాల్ని శుభ్ర పరచేనా?
ఎదకు ఊరట కలిగించేనా?

గాయం కనిపించగానే మనసు
జ్ఞాపకాల రెక్కలు విప్పుతుంది
మనసు నావహించి తిప్పుతుంది
గతంలో అనుభవం చిత్ర రూపం పొందుతుంది

ఎదురుగ ఆకాశం దూరాన వంగిపోయి
ఎవరి కోసమైనా, ముందుగ మనిషి యానంలో
నడచి నడచి మనిషి మును ముందుకు
సముద్ర జలాలలో అడుగులు పడేను

భూమి నుండి నీరుపై అభిలాషతో
దొరకిన పడవపై పయనం సాగేను
రెండూ మనిషి వశంలో జీవన గమనం సాగేను
ఆకాశం ఉండనే ఉంది, విహగ భావ రూపంతో

ఏడాది చివరి రోజున పాతకు సెలవు పలకాలనే
కొత్త వత్సరంతో కొత్త దశను పొందాలనే
భౌతిక స్థితిలో పరివర్తన కోరుతుంది మానసం
కాలంతో కదలే జీవితంలో ప్రమోదమో! విషాదమో

మట్టికి బంగారానికి విలువలలో భేదం
ఎంతో ఉన్న మాట వాస్తవం అయినా
పాత్రలు వహించే విషయం ఒకటే
దేని ప్రయోజనం దానిది ! ఉపయోగంలో

శాంతి పీఠ మెక్కడనో లేదు ఉన్నది తనలోనే
ఏ జీవికి లేని మహదవకాశం మనిషికి కవితలో

స్వేచ్ఛా కవిత్వం - 113

అజేయం

మాదిరాజు రంగారావు

2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

No. 113

SWECCHA KAVITHVAM

Free - Verse

Telugu

AJEYAM

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2020

Presented to
Dr. M. Santhosh Kumar
with
blessings and affection
on his Happy Birthday

పీఠిక - ఆంతర్యం

ఈ కృతి " అజేయం " స్వేచ్ఛా కవిత్వం పరం పరలోనిది. వర్తమాన కాలంలో సంక్షోభం, ఓటమి, బాధలు, వేదనల నుండి సుస్థితి శాంతి విజయంతో అమానవం (de-humanise) నుండి పునః మానవం (re-humanise) గమ్యానికి చేరే సమాజ యానం. ఈ సందర్భంలో కవుల పాత్ర తమ తమ వాదాలకూ విశ్వాసాలకూ ఆలోచనలకూ ఆదర్శాలకూ అనుగుణంగా రూపొందడం సహజం. విధ్వంసానికీ విరోధానికీ అలజడికీ ఉన్న ప్రచారం నిర్మాణానికీ సహభావానికీ ప్రశాంతతకు ఉండదు. అంతమాత్రాన నిర్మాణ క్రమం ఆగదు. ఏదో ఒక స్థాయిలో జరుగుతూనే ఉంటుంది. ఇది నిరంతర ప్రక్రియ. వినాశనం, విధ్వంసంతో ఏర్పడే శూన్యాన్ని ఉన్నతమైన విలువలతో పూరించవలసి ఉంటుంది. ఇది సంక్లిష్ట పరిస్థితుల్లో మానవ విజయాన్ని ఆవిష్కరిస్తుంది.

ఇందులో 'కరోనా' పై కొత్తగా వ్రాసిన కవితలు ఉన్నాయి. ఇవి ఇదివరకు ప్రచురించిన రెండు భాగలలోనివి కావు. వర్తమాన స్థితి గతుల విషయంలో ఈ 'కోవిడ్' నుండి తప్పించుకోవడం సృజన రచనలో సాధ్యం కాని విషయం. అందుకే ఆనాటి వార్తల్ని బట్టి స్పందన రూపం కొన్ని కరోనా కవితల్లో కనిపిస్తుంది.

స్థానికం నుండి ప్రపంచీకరణం వరకు ఈనాటి కవులు ఎదుర్కొనే ఎన్నోఅంశాలు కనిపిస్తాయి. ఆయా సందర్భాలలో కవి activist పాత్రను వహించడమూ దృష్టికి వస్తుంది. డిసెంటింగ్ వాయిస్‌కు ప్రాధాన్యం సమస్యను క్షుణ్ణంగా పరిశీలించేందుకు తోడ్పడుతుంది. ఇది ప్రజాస్వామ్యంలో సమగ్రమైన functioning కు అవసరం, ముఖ్యమైందీ.

ఇందులో వర్తమాన స్థితిగతుల విషయంతో కవిత భావ రూపాల్లో అభివ్యక్తమైంది. సామాజిక రాజకీయ నైతిక మనస్తత్వ కోణాల్లో హేతు సహితమైన ఆలోచనతో అనుభవ సాంద్రత విశ్లేషణ కందుతూంది. ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికంతో మనిషిలో కష్టాల్ని బాధల్ని, వేదనల్ని అననుకూలాల్నీ అతిక్రమించి అధిగమించి సాధించే అజేయమైన రూపం - సామాజిక వాస్తవంగా అవతరించింది. స్థానికం నుండి విశ్వమయం దాకా ఆలోచనా ప్రసారం కవితాత్మకతను పొందింది.

కవి ఎవరినీ నిరాకరించడు. తిరస్కరించడు. కవిత అన్నిటినీ స్వీకరిస్తుంది, స్వాగతిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో "అజేయ మయిన" స్థానాన్ని నిలుపుకుంటుందనే కవి ఆంతర్యం.

- మాదిరాజు రంగారావు

1. నవ మానవ గీతమై

కవిలో నిశ్శబ్దం ఒక మౌన వాద్య విశేషం
సహనానికి సంకేతం, ప్రగతికి నవ ప్రేరణం
అంతర చేతనచే అక్షర కృతి వెడలుతుంది
కవితయై మోడులో వసంత కళ నింపుతుంది

నియతమైన సమయమనీ లేదు దీనికి
దిశ దిశలో మతి మతికీ పథం చూపుతుంది
రావలసిన మార్పులెన్నో! సమాజ గతిలో
కాలాని కతీతమై హృదయ బంధువై

దివా నిశల భ్రమణం యధాతథంగా
జీవన లక్ష్యం కవి కవి దొక విధం

శ్రమ శక్తుల ఉపయోగంతో
పలు వనరుల వినియోగంతో
జన హిత వాస్తవ చరిత్రలో చిత్త శుద్ధితో
స్వేచ్ఛా జీవన విభవం కోరేను సమాజం
శ్రమ శక్తుల విలువలతో అమృతకళను పొందేను
ఉద్యమ చర్యలతో పథకం వాస్తవమై
తెలంగాణ అవతరణం ! శాంతి సమర్పకంగా
ప్రజా స్వామ్య పథంలో ఇది ! సాధించిన విజయం

శ్రమ జీవన స్పర్శ లేని బ్రతుకులు లేవు
శ్రమ కేతన మెరగని ఏ దేశం లేదు
పలు స్థాయిలలో సమాజ నవ నిర్మాణంలో
శ్రమ సాధన సంకేతాలు ! ఈ చేతులు
విప్పారిన ఫాల తలంపై శ్రమ రేఖలతో
అభయంతో పాటుగ దీవెన లొసగేను

కొరడా ఝుళిపించేను, పగ్గాలు వహించేను
రక్షణకై ఆయుధాన్ని ధరించేను
భద్రతలో ఎప్పటికీ మెలకువగా
కష్టంలో ఆశా రూపంతో సిద్ధంగా

మనసుకు తోడుగ ఉంటుంది కవిత
నవ మానవ గీతమై శ్రమ చింతన ఫలమై

2. నేడుకు వెల్‌కమ్

ఎత్తిన అరచేయి ఇపుడు శ్రమ సంకేతం
మనిషిని పురికొల్పుతుంది క్రియాశక్తితో
తను చేసే పనులలో ఈ జీవితం
అనితరం ! పుటల రోజుల పుస్తకం

నిన్నకు గుడ్‌బైతో నేడుకు వెల్‌కమ్
భవితకు సిద్ధంగా ఆలోచనలో మనోమయం
ప్రభుతకు ఆరాటంతో నేతల వ్యూహాలు
సృజనకు అవకాశంతో కవి వేదికలు

పరచిన ఎడారి ఖండంవలె ఖాళి కాగితం
చినుకుల అక్షర పంక్తులకై ఎదురు చూచేను
భాగ్యవంత మయిన భవితకై
వ్యక్తిలో జీవన రుచి యత్నం
మానవీయ మయిన పచ్చదనంతో
కళ కళ లాడాలని కవి కవితలో
చీకటిలో దాగిన వస్తువులు
రవి కిరణంతో బయట పడేను

ఇంటికి ఆవరణం దేశానికి సరిహద్దులు
మాటకు సందర్భం మనసుకు ఆలోచన
ఉన్నదానిపై అతృప్తి లేని దానికై చింతన
వీటి మిశ్రమంతో ప్రతి జీవన రూపం

శిశు దశలో ఖాళీగా ఉన్న మనసు క్రమంగా
ఎదిగే కొద్దీ సమాజ రూపం నింపుకునేను

స్వార్థం లో మనిషి అడుగు వెనక్కి జరిగేను
మును ముందుకు కదలే ఆలోచన వికృతమై
కోపంలో క్రౌర్యం మనసుకు అడవిలోకి విసరేను
హింసకు విధ్వంసానికి బాటలు వెదకేను

ఉదయ రశ్మి చేతులలో తెరవబడే పుస్తకం
రాత్రి వేళ చీకటిలో రహస్య మయ మవుతుంది

3. ఉదయం మదిలో

ఏదో ఒక ఉపయోగం లేని కవిత లేదు
కవిలో రూపొందే అస్తిత తో వెడలేను
ఏ రోజూ సంధ్యా సందేహంతో సమస్య !
విషయం ఏదో ఒక ఫలితంకై నిరీక్షణం

ఏదో ఒక పద్ధతిలో తీగెలు మీటబడీ
ఆంతర గుణ స్పందనతో నాద మవతరించేను
చుట్టూ మనుషులు ! వస్తువులు ! మధ్య
ఒంటరి తన మెక్కడుంది?
తనలో ఒత్తిడిలో పైకుబికే
మానవ స్థితిలో స్వగతం, ఒక పాత్ర !

దారిలో అనల కణం ఎదురుపడీ
కాలేనని భయం వేసి పక్కకు తొలగేరు
రానున్న చలి గురించి యోచనలో పడేరా?
సిగరెట్ ముట్టించుకొని పయనం సాగించేరా?

భయం పక్కనే మరో ఉపయోగం
మనిషి మనిషి కొక అనుభవ రూపం

తాపంలో నీడకై తిరిగే మనుషులు
నీలి మబ్బు రాకకై ఎదురు చూచేరు
అది తన చేతులలో లేదని తెలిసినా
అవసరం మనిషిని తొందర పెడుతుంది

ఇరుకు సందులలో తిప్పుతుంది రాజకీయం
విరిసిన దిశలలో తిప్పుతుంది కవిత్వం

పవనం మనిషికి స్వేచ్ఛను బోధిస్తుంది
మేఘం ఉదార సందేశం ఇస్తుంది
పూలదండ ఎదురుగ కనిపించక పోవచ్చు
కత్తితో సమయ మెదురయితేనే ప్రమాదం

ప్రతి ఉదయం మదిలో కొత్తగ విరిసిన
గులాబి పుష్ప యశసు కోరుతుంది

4. ఆశయ విజయం

కాలం చేతికి అందినట్లే ఉంటుంది
అంతలో అలవలె జారిపోతుంది
తడి మాత్రం మిగులుతుంది కొంతసేపు
మరచిన కరుణను జ్ఞప్తికి తెస్తుంది

చినుకుతో అమూల్యమైన మట్టి నుండి
పచ్చని శోభా రూపం తల ఎత్తుతుంది
ఖరీదయిన బంగారం విలువల ఆకర్షణతో
మనిషిలో ఏ ఆశలు కుసుమిత మయ్యను?

ఉదయ కిరణంతో రాత్రి దాగిన 'నిజం'
బయట పడేనా? ఏ నీడలోనొ దూరేనా?
సంకెల తొలగిన నిజం స్వేచ్ఛలోనె సాధ్యం
అందమైన వాస్తవం కవిత లోనె! దొరుకుతుంది

పచ్చని జీవితానికి డోకా లేదనుకుంటే
ఎర్రని ప్రతాప తేజం మనిషిని భయ పెట్టేను
తనలో సమాజం, సమాజంలో తాను
ప్రభావ జాలంతో భౌతిక మానస కలనం

అడవి దారిలో మందు పాతర ప్రేలి
ఎగసే ధూళితో భయ శబ్దం దూసికొనీ
బాధలో అనుభవ సంపద పెరిగేనా?
వేదనలో మానస నైశిత్యం పొందేనా?

ఎవరికి వారు తాము నమ్మే దేవత
ఎప్పటికీ తమ పక్షమే నిలవాలని
ఆలోచనలో కోరిక వేళ్ళు పాతుకొని
పొందేదేదో! చివరకు కాలానిది నిర్ణయం

రైల్వే స్టేషన్ ప్లాట్ ఫార్మ్ చేరి
వచ్చి పోయే రైళ్ళను చూస్తూ చూస్తూ
తన కవసరమైంది వచ్చినపుడే పయనం
తన గమ్యం చేరితేనే ఆశయ విజయం

5. పడవ అయి కవిత అయి

లేచిన అభయ హస్తంలా ఆలయ గోపురం
చూచే మనసు ఆశాలత యై అల్లుకునేను
మనసుకు ధైర్య గుణం దుస్తులు తొడిగేను
సమాజ శక్తుల తోనే దీని అస్తిత

అణగిన జీవితంలా దూరాన పూరి గుడిసె
సమాజ శ్రేయం తెలియని దీన హీన స్థితిలో
వీరం జిగేష కయి ఉరక లెత్తుతుంది మనిషిలో
బాధా గాథలతో కరుణ సరిస్తుంది కవితలో

ఇది ప్రవహించే నదిలా కనిపించవచ్చు
ఇది పరుగెత్తే రైలును తలపించవచ్చు
మనుషుల ఆశయ భూమికలెన్ని తీరులో
కవితకు వాహన రూపాలన్ని విధాలు

ఎంత నాగరక వికాస రూపమనుకున్నా
మనిషిలో ఆటవికం ఒక మూలన గుప్తంగా
ఎప్పటిదో ఆ అనుభవం ఇప్పటికీ
ఒకటొకటి పురా స్మృతుల సంకేతాలతో

చీకటిలో జరిగిన హత్యకు సాక్ష్యమెవరు?
ఉదయ కిరణంతో ఏదైన క్లూ దొరకవచ్చు

జీవితానికి చెరొక వైపున మంచి చెడు
నాణెంలా చలామణి అవుతుంది సమాజంలో
చంద్రబింబం వెలుగుతో చూపులు కలిసేను
సూర్యబింబం వెలుగులో కదలిక హెచ్చేను

వస్తువుకు నీడకు మధ్య విభజన రేఖ సందేహంగా
వస్తువుతో పొందలేనిది, నీడతో పొందవచ్చు

కవితకు అనుకూల ప్రతికూల పక్షాలు లేవు
అంతరంగ ప్రకాశంతో 'నిజం' బయట పడుతుంది

దోసిలి నీళ్ళలో జారిన బాష్ప కణం స్పందనలో
పడవ అయి కవిత అయి పయనం సాగిస్తుంది

6. అందరికీ తెరచిన దారులలో

సముద్రం మాట్లాడుతుంది కల్లోల స్థితి గురించి
గగనం మాట్లాడుతుంది నిశ్శబ్ద స్థితిని గురించి
భూమి మాట్లాడుతుంది సృజన లోకం గురించి
మనిషి అయితే మరో మనిషి గురించి తెలిసీ తెలియక

చివురించిన మనసు చిరునవ్వులో బయట పడుతుంది
కుసుమించిన హృదయం ప్రవర్తనలో బయట పడుతుంది

వర్తమాన శిఖరాలపై ఈనాటి కవిత
గత విలోకనంతో భవిష్యద్దర్శనంతో
ఉత్సాహ కర మయిన అనల తేజంతో
అమృత కళ మెరసే ఉదార చరితతో

కవి ప్రేక్షక పాత్ర వదలి
సమాజ చలనంలో భాగమయ్యేను
సమాజానికి తన కృతి ఒక ఉపదగా
కవిత సాగేను ఆగని పయనంలో
ప్రతి వ్యక్తిలో తన దయిన ప్రపంచం
ఎవరికీ తెలియనిదీ, బయటికి ప్రభాత రూపంతో

బయట కాలు జారుతుందని
పయనం మార్చేరా? మానేరా
ఇంటి ముందు ఆకు రాలిన చెట్టు
అశుభమని వెనక్కి మరలేరా?

కాల దర్పణంలో బింబించే మంటలు
కాల్చేవి కావు, అవును ! ఉత్సాహకాలు
కాలం వాహనమయి పయనం సాగిస్తుంది
జీవన కథలో ఏర్పడే దోషం మనుషులదే!

శాంతిలో రణంలో సమాజ గతిలో
శ్రమ శక్తికి లేదు విరామం! నిర్మాణంలో
ప్రాంతీయ జాతీయ ప్రపంచ భావనతో అందరికీ
తెరచిన దారులతో ప్రజాస్వామ్యంలో విలువలు

7. కోరింది దొరికితే

ఆశా మూలం నిలుపుతుంది తనలో జీవన తరువును
ఏ రోజున కారోజు సువర్ణ హారంతో మొదలు
ఇది తన మెడలో చేరాలని కోరిక మనిషిలో
తను చేసే పనికిది సన్మానమో! ఉపాయనమో!

ఇంటి ముందు వీధిలో భిక్షువు కేక
తొలి పొద్దు నుండి రాత్రి వరకు
ఎంత కాలం గడచినా వీడని దరిద్రం
సమాజాన్ని జటిలమైన సమస్యలోకి లాగుతుంది

ఓటు హక్కు గురించి తెలియదు
పౌర హక్కుల గురించి సరే సరి
బిక్షుక పాత్రలో ఎందరో సమాజంలో
కవులు నేతలు వివిధ వృత్తుల వారు వ్యాపకాల వారు

గెలుపుపై ఆరాటంతో తమ వేషం మార్చేరు
పైన వెలిగే సూర్యచంద్రుల దీవెనలు కోరేరు
భూమిపై చెట్లు గాలిచే సందేశం పంపిస్తాయి
తమ నీడలలో ఆశ్రయానికి ఆహ్వానిస్తాయి

ఖాళీ చోటు దొరకదు, బిక్షువులంతా ద్రిమ్మరులే
సమాజ హృదయంలో స్థిర నివాసం సులభం కాదు
ఇంట్లో నుండి బయటికి అడుగు వేసే వారు
బిక్షువు దీవెనలు ! శుభ దృశ్యంగా తలచేరు
మానవ స్వరంలో దైన్యం! కలవర పరచే విషయం
కొందరు దీనిని ఆర్థిక సమస్యగా తలచేరు

ఆ ఇంట్లోని మనుషుల పేర్లతో ఆర్తి ధ్వనిస్తుంది
ఇది వీడని సమాజ సంబంధం ఎప్పటిదో?

ఇది ఎవరూ అంతగ పట్టించుకోని సమాజ విషయం
పుస్తకంలో అచ్చుతప్పులు పట్టికలా బిక్షువుల వరస
కోరింది దొరికితే చూపులో పూలు రాలతాయి
అన్నం వస్త్రం చిల్లర నాణేల చుట్టూ తిరుగుతుంది

8. ప్రాణం ఉన్నంత కాలం

వెలగని దీప స్తంభంలా ఇంటి ముందు బిక్షువు
వరదలో తేలే కాగితపు పడవలా కదలేను
బ్రతకడానికి కావలసిన అన్నం ముద్దకై
కాలాన్ని ఎదుర్కొనే మ్రోడులా బ్రతికేను

అడుక్కోవడం రోజు వారి పనిలా ఉంది
దానం పరలోకానికి సుగమత కూర్చేనని కొందరు
ఇది స్వర్గారోహణకు మెట్లలో భాగంగా తలచేరు
సమాజం యాచకులకు నిలయమై అదుకునేను

కదలే మబ్బుల పీలికలతో దిశా రూపం వలె
చినిగిన దుస్తులతో బిక్షువు ఆశా రూపంతో
దరిద్ర దూతగా వీధులలో తిరుగుతూ
పెద్దలు నిలిచిన చోట కాసేపు ఆగేను

కాలికి గుచ్చుకొన్న ముళ్ళవలె బాధలు
ఇవి తొలగిస్తూ ముందుకు పోవడమే కర్తవ్యం

అవమానం తిరస్కారం కసరులు విసరులు
వేదనలు పక్కకు నెడుతూ పోవడమే ! జరిగేది
జీవిత మంటే హేంగర్‌కు వేలాడే డ్రెస్‌లతో
వార్డ్ రోబ్ కాదు, సమయానికి తీసి తొడుక్కోడానికి

బాధలలో ఆశ బ్రతుకును నిలుపుతుంది
అద్దం ముక్కలో తన ముఖం అందంగానే కనిపిస్తుంది
నేరాలలో పోలీసులకు సమాచార బ్యాంక్
పలు విధాలుగా భిక్షువుల పాత్ర! రహస్య ప్రకారంగా

సెంటర్ కార్నర్‌లో రాత్రి చీకటిలో ఆరిపోయిన
వీధి దీపంతో బిక్షువు ! తలగడలో నోట్ల కట్టలు
ఈ దేశం రహస్య భాగ్యానికి చిన్ని గుర్తుగా
వ్యక్తి నుండి సమాజానికి పెరిగే సంపద గ్రాఫ్‌లో
ఇది ఏ లెక్కలోకి వస్తుందో తెలియదు
ప్రాణం ఉన్నంతకాలం తృప్తిగా బ్రతికించింది

9. పరిష్కారం

అందరిలో వలెనే బిక్షువులలోను ఏ భేదం లేకుండా
రవి కిరణం ఉత్తేజం నింపుతుంది సమంగా
అయితే, ఇది ధూళి పొరలచే కప్పబడవచ్చు
ఇది దరిద్రం! బ్రతుకులో విఘాతం కలిగించే ప్రతికూలం

అందరిలో వలెనే భిక్షువులలోను ఏ భేదం లేకుండా
శశి కిరణం ఆహ్లాదం నింపుతుంది, సమంగా
అయితే ఇది చలిలో చీకటిచే కప్పబడవచ్చు
ఇదే దరిద్రం ! బ్రతుకులో నిరోధం కలిగించే వ్యతిరేకం

ఇంతవరకు సమాజ వికాసంలో భాగం కాలేదు
నేతలు పాలకులు పెద్దలు విస్మరించిన వాస్తవం
కవిత ఏమి చేస్తుంది? అంటే చేసేది కూడ ఉంది
సంస్కరణల పునాదిపై పరివర్తనపై ఫోకస్
ఇది తత్కాలంతో సహాయంతో తీరే
సమస్య కాదు, దీర్ఘకాలికమైన ప్రణాళిక అవసరం

విశాల ప్రయోజనాల ప్రణాళికతో నిరంతరం
చిత్త శుద్ధితో వ్యవహరింప దగిన విషయం
ఎవరిపై అమర్షతో ఘర్షణతో పనిలేదు
శ్రమ జీవన గుణంతో గమ్యం చేరే సంకల్పంతోనే

కార్య సాధనలో అంకిత భావం ముఖ్యం వ్యక్తులలో
తోట పొలం బడి యంత్రం నైతిక బల సంపదతో
సమాజ చింతన పథంలో వ్యక్తి పట్ల శ్రద్ధతో
ప్రగతి శీల ప్రస్థానం తోనే మానవ విజయం

పగటి వేళ కష్టాలు బాధా సెగల మధ్య నడిపిస్తే
రాత్రి వేళ చుక్కలు ! పై నుండి చల్ల బరచేను
ప్రకృతి పట్ల ప్రియత ! సామాజిక బంధుతతో
మానవీయ భావనతోనే పరిష్కారం, కవితా లక్ష్యం

10. నవ దర్శనం

మనిషి జాడ మరవని ఏకాంతం లోనే కాదు
జన సమూహాల లోను కవిత వినిపిస్తుంది
తేజంతో ప్రేరణగా అనురాగంతో ఆప్తంగా
అపుడూ ఇపుడూ ఎపుడూ మేఘంలా కదలుతుంది

ఇది కవిదే కాదు, శ్రోతలదీ పాఠకులదీ
నాలుగు దారుల కూడలిలో సిగ్నలవలె పనిచేస్తుంది
ఇది అక్షర సంపదతో విశ్వమయం
ఇది స్వాగత వదనంతో ప్రతి చోట

బిక్షుక మనస్తత్వ రూపాలతో కొందరు, సమాజంలో
నేతలు కవులు పాలకులు వర్తకులు వ్యవహర్లలు
అవసర సందర్భాలలో బిక్షాటనలో కనిపించేరు
ఆ సమయం దాటాక అంతా మరచి మరో వేషంలో

ముఖాన చిరునవ్వు కాగితం పూవు అయితే ప్రమాదం
చేతిలో పని మొక్కుబడి అయితే ఫలితం మారవచ్చు
మైలు రాయి చూపుతుంది ఎంత దూరం వచ్చిందీ
అదే రాయి మరోవైపు, ఇంకెంత దూరం ఉందీ
మనిషి మనసు కూడ ఇరు పాత్రలు వహిస్తుంది
ఎటువంటి పని అయినా ఎక్కువ తక్కువ లేదు, అదే విధం
మంచి ఫలితంలో వికాస ప్రవాహం సరిస్తుంది
బిక్షాటన సమాజంలో ఇప్పట్లో పోయేది కాదు

తన నీడ చెబుతుంది వేళ ఎంత అయిందీ
ఏది నిజం? ఎవరు సాక్షి? చెప్పగలది ఒక అంతరంగమే
ఎవరు సంప్రదిస్తారు? ఎవరు ఏ మాట వింటారు?
ఎవరి వీలు వెంట వారు యాచనలో పాలనలో

శాంతి సూచనగా పావురం వచ్చి ఎదుట వాలుతుంది
అధిక శక్తితో మిసైల్ దూసుక పోతుంది పైకి
వయొలిన్ తీగెలపై కమాన్ కదలికతో శ్రవణీయం
అనుభవం చలనంతో మనిషిలో నవ జీవన దర్శనం

11. మళ్ళీ రేపే

కిరణానికి భేదం లేదు అన్నిటినీ స్పృశిస్తుంది
ఏదీ దాచదు అన్నిటినీ అందరికీ చూపిస్తుంది
చీకటికీ భేదం లేదు, అన్నిటినీ దాచేస్తుంది
సముద్ర గర్భంలో వలె రహస్యాన్ని కాపాడుతుంది

ఏ మనసూ ఎప్పటికీ వెలుతురు మాత్రమే కోరదు
అపుడపుడూ చీకటి అవసరమూ కలుగుతుంది
మనుగడలో సమస్యలు దాటేందుకు
ఆరోహణలో మెట్లుగ ఉపయోగ పడుతుంది

వెలుతురు ఆగమనం తప్పదు, వెనకనే చీకటి పొంచీ
ఇది మాయకాదు, అంతా వాస్తవం అనుభవ రూపం
ప్రపంచ సింహాసనంపై తూర్పున ఉషస్సు
మనిషిలో ఉత్సాహాన్ని ఉత్తేజ పరుస్తుంది
శుభ్రమయిన రూపంతో చూపు సార్థక మవుతుంది
దివ్యమైన కిరణాలతో కనులు కమలాలవుతాయి

కుసుమ రాశి శిఖరం నుండి కవి మనసు
అడుగులు వేస్తుంది కవితలో భావధారతో
నిన్నటి గాయల్ని మరపించి
నేడు పుష్పాలతో అలకృతం కావాలనీ

ఇది కొన్ని లిప్తల అనుభవ మనోజ్ఞం
అపై తాపంలోకి మారుతుంది దృశ్యం

ఇంటి గడప దాటగనే కనిపించే దృశ్యం వేరు
ఎవరి మనసు దేన్ని వరించేదీ ముందుగ తెలియదు
కవితలో ఎన్నిటికో స్థానం అనలకణాలకూ ఉంది
ఉత్సాహం ఉత్తేజం కయి, పనులు కోరేవారూ ఉన్నారు

ఉచ్ఛ్వాస నిశ్వాస పరంపరలో వినిపించే
గుండె లయ కవితలో జనహిత కార్యంలో

లోకాన్ని స్వర్ణమయం చేసే ఘడియలో కవిత
మళ్ళీ రేపే! ఉషోదయంలో దృశ్యం చైతన్యమయం

12. మతిలో మృగాన్ని పెంచే

కవిత నుండి కిరణం సూటిగ దిగుతుంది
హృదయంలో ఆకర్షణ ప్రభావాన్ని శబ్దిస్తుంది
మనిషి చేసే పనికిది ఆదర్శ సూచన కావచ్చు
సమాజ చింతనలో శ్రమ పతాక కదలుతుంది

రణమూ ఆపై శాంతి అంత సులభంగా దొరకవు
ఇవి వివేకంతో సాధించే యత్నం జరుగుతూ ఉంటుంది
చూస్తూ ఉండగనే జారిపోయే అలలవలె
దిశ నుండి దిశకు వెలుతురు చేతన రూపం

సుందరమైన ఆలోచనతో అన్వేషణలో కొందరు
స్వీయ జీవితం నుండి పూర్తిగ సమాజ సేవలోకి తరలేరు
కిరణ మెవరి నిర్వచనానికీ లొంగదు, వివేకంలా
హృదయానుభవంలో సుందరమైన ప్రతీకగా నిలుస్తూంది

దేనికది అరలతో మనో నిలయం
బ్రతుకులో బహు విధ వ్యాపకాలకు స్థానం
ఇపుడు రణం అడవికి తరలింది
శాంతి ఇపుడో మరపున బడింది

ఎప్పటికపుడు హద్దులు చెరగి కొత్తవి ఏర్పడేను
అధికతలోనో శాంతి అనో రణం ముంచుకొనివస్తుంది
రెక్కల్ని అతికించుకొని ఎగర జూచే సాహసంతో
చక్రాల్ని సంతరించుకొని పరుగెత్తే యత్నం

శాంతి ఎవరికి? వ్యక్తికా? సమాజానికా?
రణం ముగిసాక దీని ప్రభావం దారుణం
మనిషి మనిషిగా బ్రతకడం లోనే ఉంది
సుఖాలతో పాటు శాంతి! సహజ సుందరంగా

స్నేహ సుందరంగా జనతకు పూలను పంచేందుకు
మనసులో పూల చెట్టును పెంచే దెవరు?
అంతా మతిలో జంతువునో మృగాన్నో పెంచేవారే
ఇది తన సహజ గుణంతో మనిషిని భ్రింగేస్తుంది

13. దారులు వేరయినా

రథ చక్రానికి అరలు అవసరంలా
సమాజ గమనానికి వ్యక్తుల జీవనం ప్రధానం
రేకులు లేకుండా పద్మానికి ఆకృతి లేదు
అమరికలో అందం శూన్యంలో వ్రేలాడేను

ఆకు రాలి పునర్నవానికి సిద్ధంగా ఉన్న
చెట్టు వలె సహజమైన మార్పులతో బ్రతుకులు
చెట్టు వలె ఏదో ఒక చోట మారకుండ ఉండలేవు
నిరంతరం ప్రవహించడమే అనుభవంలో జీవితం

ఏదో ఒక శ్రమలో మగ్నమైన బ్రతుకులు
ఎవరి కోసమో పనికై ఎదురు చూడవు
శ్రమ చలనంలో కాలం కరుగుతుంది
దాహానికో పంటలకో నిలవలకో
శ్రమ చక్రంతో తిరిగే మనిషికి తెలుసు
కాలంలో మార్పుల కతీతమైన మనోరూపం

హిమ శిఖరాలను తలపించే మౌనాకృతులు
రవి రశ్మికి కరగి ముందుకు సాగేను
పోయినంత మేర భూమితో మాట్లాడేను
గాలిలో నిశ్శబ్దం నాదాకృతి పొందేను
స్వేచ్ఛలోనే వైవిధ్యానికి అవకాశం
గాలి కదలిక తోనే ప్రాణానికి ఆయువు పెరిగేది

చీకటి ప్రశ్నలకు సమాధానం
ఒక్క సూర్యుని ప్రకాశం తోనే
నిశి దీపం వెలుతురు
మానుష యత్నంలో భాగం
కాల ప్రవాహంలో పడవల్లా జీవితాలు
పోవలసిన గమ్యం చేరే వరకే పయనం
శ్రమ జగత్తులో జడతకు తావులేదు
అవనిపై దారులు వేరయినా సత్క్రియకే ప్రాధాన్యం

14. విలువలతో ఫలితం

అమ్మ చేతులలో వొడిలో నుండి
మట్టితో ఆరంభ మవుతుంది
భౌతిక ప్రపంచంతో అనుబంధం
వాస్తవ నిజ రేఖలపై అనుభవం

భూమిపై నడక నేర్వగనే
స్వతంత్ర భావ ప్రపంచం! శిశువులో

చీకటి వ్యర్థం కాదు, భయపడనవసరం లేదు
రాత్రికి చీకటి తీగెల నమర్చి మీటితే
నాద లహరి వినిపిస్తుంది మనసు నలరిస్తుంది
మాట పలుకుతుంది హృదయం స్పందిస్తుంది

సముద్రమంటే భయం లేని దెవరికి
పడవపై పయనించడం మనిషి ప్రజ్ఞకు నిదర్శనం
విమానంపై దాటడం విజ్ఞాన విద్యకు తార్కాణం
తాను స్వయంగా ఈదడం ధైర్య సాహస వ్యక్తిత్వం

కరోనాపై విజయం మునుముందు జరిగే
మానవ సంకల్ప శక్తికి క్రియా రూప మహనీయం
కవి అందరికీ చెందిన అక్షర నేత
అనుభవ శీలంతో కవిత సృజన యానం

తుపాను కెగిరి పోకుండా చెట్టును వేళ్ళు నిలుపుతాయి
దొరకిన చిలుక ఎగిరి పోకుండా పంజరం ఉండనే ఉంది
భుజగ భయం లేకుండా మూతతో బుట్ట సిద్ధంగా
మనిషి నుండి భయం, సూక్ష్మజీవి వైరస్ కరోనా ప్రభావం

దీనిపై విజయానికి మనిషి మనో బలంతో సిద్ధంగా
ఉన్నత పరిశోధన ఉత్తమ జీవన శైలి తోనే సాధ్యం
ఒక సాధనం దొరికి నంత మాత్రాన
లక్ష్యం సాధించినట్లు కాదు సంపూర్ణంగా

అవసరానికి సమకూడితేనే విలువలతో ఫలితం
చరిత్రలో సమాజ భాగ్యానికి సుందరతనిస్తుంది

15. అన్నీ అవసర భాగాలే

అంతా 'నిశ్శబ్దంగా ఉంది,' అనుకునే లోపల
శబ్దం నాదమై హృదయం స్పృశిస్తుంది
కవితలో సుందర దృశ్యం నిర్మిత మవుతుంది
ఎవరి ఇష్టంతో పని లేకుండా అక్షర జగత్తులో
దేని వంతు, అది నిర్వర్తిస్తుంది మనో వేదిపై
పగలు చెట్లు రాత్రి చుక్కలు మాట్లాడతాయి
వెలుతురులో సుపథను చూపాలని ఆప్తంగా
చీకటిలో చంద్రుని చూపాలని స్నేహంగా

మనిషి నుండి ఆగని ఆలోచన జీవన గతిలో
ముంజేతి పైనో బుజానో శాంతి పావురంతో
ఆగని వాస్తవ దృశ్యం కావాలని కోరిక
ఉంటే సరిపోయేనా? వాతావరణం సంగతి ఏమిటి?

చెట్ల వెనక నుండి ప్రేలిన ఆయుధం
చెట్ల సందులలో నుండి ఒకరొకరూ
కదలే మనుషులు నెత్తురు మరకల దుస్తులతో
అనుమానంలో వీరుల జాడలతో

పద ధ్వని ఒకటే కవిలో ఇరువైపుల నుండీ
ఒకరు ఇష్ట పడేదీ, ఒకరు చేంపకోరేదీ
అడవికి మౌనంగా రణ చరిత్ర సృజించేరు
నిశ్శబ్దం అంచున అడవి పక్షి స్వరం
ఏది నిజం? ఎంత వరకు ?
దాగిన నిప్పు నుండి పొగనా?
తీరని సందేహం అంచులలో కాలం
ఆగి ఆగి చర్యకు ప్రతి చర్యగ మానవం

ఇది అక్షర ముకురంలో బింబం ! సంక్షుభ్ధం
చరిత్రలో పాతుకపోయిన వేరులతో
దీని వెనక నుండి పనిచేసే చేతులెన్నో
అన్నీ ! సమాజ యంత్రంలో అవసర భాగాలే

16. స్తిమితంగా స్మితంగా

శిల కరగదు, ముక్కలు ముక్కలు కావచ్చు
కవి మాట మేఘ శకలాలు కావచ్చు
ఆర్ద్ర స్పర్శతో మనసు పచ్చదనం పొందొచ్చు
వ్యక్తిలో హక్కుల్ని మొలకెత్తించవచ్చు

మనిషిలో బాధ్యతను జ్ఞప్తికి తేవచ్చు
పిడికిలి నెత్త జేసి ప్రశ్నగ మార్చ వచ్చు
వాదాన్ని నినాదంగా మలచి వాడ వచ్చు
చరిత్రలో ఉద్యమ మార్గాన్ని చూపవచ్చు

అభిప్రాయ విభేదాలు ఉండవచ్చు సహజం
సంశ్లిష్ట జీవితం ముడులు విప్పి చూపుతుంది
అవసర మనిపించని జోక్యం నిరసిస్తుంది
స్వార్థం ఖడ్గానికి ఇతరులు బలి అవడం దారుణం

కవి మనస్సు శిల అయితే కవిత వెడలదు
శిల్పి కెదురు చూడ వలసి వస్తుంది
ఆర్ద్రతకు తావు లేని స్థితిలో శిల్పంతో
ప్రయోజనం కొంత వరకు పొందచ్చు

ఎవరు ఏది అయ్యేది ఆదర్శ జగత్తులో
కాలం చేతులలో మానవ మతి నిర్ణయమే
స్వార్థం అడుగు కింద అణగి మణగి పీడితులు
మౌనంగా ఉన్నంత వరకు పీడకుల చెల్లుబాటు

నిశ్శబ్దం చెదరితే అలజడి అందల మెక్కుతుంది
స్థిరత లేని సమాజం నిప్పంటిన బ్రతుకు భయంతో
క్షణాలు నడచేను, స్తిమితంగా పరుగిడనూ వచ్చు
ఎగరలేవు, పయనం దిశ అనిశ్చయం ఆందోళన

జ్వాలా తంత్రుల్ని మీటే చతురులు ఉన్నారు
ధారా తంత్రుల్ని మీటే నిపుణులు ఉన్నారు
ఉదయ కిరణ తంత్రులపై శాంత భావ సాంద్రంగా
వర్తమాన స్వరం వినిపిస్తుంది కవిత శాంతంగా స్మితంగా

17. మరచే ప్రసక్తి లేదు

వ్యక్తిలో అంతో ఇంతో చిన్నదో పెద్దదో
తనకు తగిన విధంలో శ్రమ జీవన ప్రపంచం
భౌతికం మానసం ఆలోచనా గగనం ఆశయ జలదం
ఆశను నిలిపేవీ ఆనందం పంచేవీ గమనం సాగించేవి

ఏ ఊరు చేరినా ఏ అడవి వెళ్ళినా ఏ వ్యాపకమయినా
మనో మూల విషయంలో ఎవరికి వారు స్వతంత్రం
తనదైన మంచి చెడు ఎత్తులతో పావుల చదరంగం
ఒక చిన్న కోరిక మలుపుకు కారణ మవుతుంది

స్నేహం ఆప్తం ఆత్మీయంతో మానసం
బయట విపణిలో దొరికే వస్తువు కాదు
సులభంగా చేతికందే పూవో ఫలమో కాదు
జీవ నదిలా ప్రవహిస్తూ పోవడం దీని పని

కన్నీరు ఒలికినా నెత్తురు చిందినా
ఆశయ వస్తువు ఆహుతి కావడం ఘోరం
మదిలో స్వయం నిర్మితమైన ప్రపంచం
అభిమాన రేఖలతో "నేను" బిందువు బంధంలో

జలనిధి మేఘాన్ని వదలుతుంది పైకి
కరుణ జలంతో ఇది భూమిని అభిషేకించేను
పంటలతో అదృష్ట బీజం ఆకృతి పొందేను
శ్రమ జీవన చలనానికి హేతువుగా నిలిచేను

కవిత అంటే మట్టి కణం నుండి నింగిలోకి
అనుభవంతో ఆదర్శం అల్లుకొన్న మానస లత
మంచు గడ్డ అయితే సహనంలో నిష్క్రియా రూపమే
కోష్ణ చేతనతోనే బయట సృజన రూపం సరిస్తుంది

వాహనం తరువాత పయనం కాలి నడకనే
ధైర్యం రెపరెప లాడుతూ శ్రమ పతాకతో సమాజం
ఎవరికి పట్టినా పట్టక పోయినా ముందుకు సాగుతుంది
ఏ సమస్య తీర్పులో బాధ్యత మరచే ప్రసక్తి లేదు

18. మనిషి మాత్రం

ముఖంలో "నిజం" మరో భావనచే కప్పబడీ
మల్లె మందారం పారిజాతం గులాబి కాకపోతే
అంగారం బూదితో, లేకపోతే మొనతేలిన కంటకమో
ఎవరికిష్ట మైంది వారు; వహించేరు! కనబడేరు!

దేనితోనో ఒక దానితో చాటు అవుతుంది
దేని కోసమొ మనసులో సమస్యను దాచేస్తాయి
దేని చేత కప్ప బడని శూన్య ముఖం ఉండదు
మనిషి జీవితంలో ఇదొక తెలియని అనుభవ విశేషం

అంతో ఇంతో కొందరి దృష్టికి రావచ్చు
ఇది అంతశ్చేతన వశం ప్రేరణ నవ రూపం

దీనికి శిశువు ముఖం స్వాగత చూపుతుంది
వృద్ధ ముఖంలో ఆహ్వానం ఎప్పటికీ సిద్ధంగా
జరుగుతూన్న దానికి సమాధాన పడుతుంది
సమాజ సందర్భాల్ని మన్నిస్తుంది, సంతోషంగా

లోన, నిశ్శబ్ద దృశ్యం
బయట సశబ్ద లోకం
లోనుండి బయటికి బయటి నుండి లోనికి
నిరంతరం మనిషి! జీవన గమనంలో

లోన ఆదర్శం దార్శనికం నీతులు ప్రబోధాలు
బయట వాస్తవం స్వార్థం ఉపయోగం తృప్తి రేఖలు
హక్కులు ఉద్యమాలు ఘర్షణలు సంక్షోభం
బాధా చిత్రార్పితాలయి అనల స్వరం వినిపిస్తాయి

బ్రతుకులో ఓటమి పాలు ఎక్కువై
గెలుపుపై ప్రభావ ఛాయ కమ్ముతుంది

గాయాల బాధ ఒకటే కారణ సందర్భాలు వేరు
ఉండే ప్రయోజనాలు వేరు, సోకే ప్రభావాలు వేరు

గాలి ఆప్తంగా స్పృశిస్తూ పోతుంది సంతృప్తి రేఖపై
మనిషి మాత్రం కరోనాచే మనిషి నుండి ఎడంగా

19. స్వేచ్ఛాచరణం

కవికి తన కవిత గురించి సృజన విషయం
ఎవరూ జ్ఞాపకం చేయనవసరం లేదు
జలధికి జలదాగమనం గురించి బాధ్యతను
ప్రజల బాధను చెప్పే అవసరం లేదు

రవికి రాత్రి నుండి జగత్తుని
ముక్తం చేసే సూచనతో పనిలేదు
జల సమార్ద్ర స్పర్శతో భూమి నుండి
బీజం మొలకెత్తే శిక్షణతో పనిలేదు

గిరి శిఖరం నుండి కిందికి దూకే జలధార
కింద నున్న శిలల గురించి వెనకాడదు
ముందుగ తెలియని గమ్యం గురించి ప్రవాహం
చింతించదు కెరటం యోచన చేయదు

భూమిపై దగ్గరలో పక్కనున్న మనిషి కన్న
ఎదుర్కొనే సమస్యపై గగన ముఖం చూచే దెందరొ?
మనిషిని మరచే వారెందరో కోకొల్లలు
కరోన విషయంలో ఇది జరగలేదు అదృష్టం

మానవ జీవన చింతనలో అద్భుతాలకై చూచేరు
ఒక చూపులో పుష్పం ఒక చూపులో ఫలం
అనుకున్నది తడవుగ ప్రత్యక్షం కావాలని
కోరిక ఇప్పటిదా? ఎప్పటిదో! వరాలలో

తను నిలయ సమీపంలో పచ్చని చెట్టు
కల రవాలతో పక్షులు మనిషి జీవితంలో
ఎన్నిటినో సూచన చేసేను, ప్రతీక లయ్యేను
తెలిసినవనిపించినవీ, తెలియనివీ, ఎన్నెన్నో

పక్షి నుండి నేర్చుకునేది మొదటిది భద్రత
భూమి కెత్తులో కొమ్మలలో గూడు! అభయంగా
తన ఆహారం! సంపాదనకై రోజూ
నాల్గు దిశలు చుట్టి వచ్చే స్వేచ్ఛాచరణం

20. బ్రతుకులో లక్ష్యం

కాలం వేసే ప్రశ్నకు కావలసింది, హృదయానికి
తెలివైన సమాధానం కాదు, నైతిక గుణ ఆచరణం

జలధి హోరు భాష, గట్టుకు తెలుస్తుంది
పూల మౌన భాష గాలికి తెలుస్తుంది
కవికి తెలుస్తుంది మనసులోని రహస్యం
మాట లోనె కవిత రేకులు విప్పారుతాయి

చకితంగా పైన పయనించే మేఘం నుండి
చినుకుల అక్షర పంక్తులతో కవిత
పదం పదం అంచులలో నుండి
నలు వైపుల భావ ప్రసారంతో కవిత

ఆహారం ఆరోగ్యం సంపద యశస్సు
నాలుగు దిశా స్తంభాలపై జీవన నిలయం
ఆలయ శిఖరం దూరం నుండి పిలుస్తుంది
ఆలోచన విప్పారి అతీతాన్ని స్పృశించేను

ఒక కొసలో సౌముఖ్యం ఒక కొసలో వైముఖ్యం
స్వేచ్ఛా స్వతంత్ర జీవన గమనంలో తప్పనివీ

చంద్రుడు అందరికీ చెందిన హ్లాద బింబం
దీన్ని ముక్కలు చేసి అందరికి పంచేరా?
విశ్వమయం మానవ రూపం మంటూనే
స్వంతమైన చిన్ని చిన్న గదులలో నిలిపేరా?

సూర్యుడు అందరికీ చెందిన విశ్వ బింబం
కిరణాలను వేరు చేసి అందరికీ పంచేరా?

ఆలోచనలో ఎవరి విహారం వారిది! ప్రీతికరం
వర్తనలో నిరంకుశం ఒకరికి నచ్చవచ్చు

చుట్టూ కత్తులు తోడుగ హింస రచనలో
బ్రతుకులు అభిమానించే వారు ఉండవచ్చు

నీటిలో పడవ గమ్యం తీరాన్ని చేరడం
బ్రతుకులో మనిషి లక్ష్యం! ప్రాణాల్ని నిలపడం

21. కాలి బాటనే

చెట్టుపై కొమ్మలలో గూడు నుండి పక్షి
నింగిలోకి ఎగిరేను, నడకపై కోరిక మిగిలే ఉంది
భూమిపై సంఘ జీవి మనిషి తన నిలయం నుండి
బయట పడేను పైకెగరడంపై కోరిక మిగిలే ఉంది

భౌతిక రూప మెంత నిజమో
దాని నీడ కూడ అంత వాస్తవం
ఇది జీవన గమనంలో ఎన్నిటికో
ప్రతీకయై బహు పాత్రలు నిర్వర్తించేను

జ్వాలా చలనం చూచి అందానికి మురిసేవారూ
బాధా సరణం చూచి సంతాపం చెందే వారూ
పనిలో పూర్తిగ మునిగి తమ చుట్టూ
జరిగేవేవొ ! గమనించని వారూ!

తమ చూపులతో కోరిన దేవరైనా
కావలసిన దీవెన లొసగే వారూ
ఈ విషమ సమయంలో కరోనా దుష్టతను
నిందించేవారు ! శపించేవారు! శత్రు దృష్టితో

మృత్యు భయం వల విసరబడి విష క్రిమిని
ఛేదించే సత్ప్రయత్నంలో మనిషి
కవి తన అస్తితలో పునాదిపై నిర్మాణం
విశ్వ మానవ శ్రేయో రూపం చూపేను

దేనికీ భయపడని మానవ హిత భూమికతో
స్వీయం నుండి సమాజానికి కృతి పయనం
కాళ్ళు తడబడి నిలవడం, మాట పెకలక పోవడం
చీకటితో సంధి యత్నం కవితకు ప్రమాద సూచికలు

నిరసనలో అలజడిలో రాజకీయ క్షోభలో
ఏ వైపు చేరదు నిర్వహణంలో కవి హృదయం
ఊరు వదలి మరో ఊరు కష్టాలలో మునిగి
బ్రతకడమొక బాధయై కాలి బాటనే పయనం

22. రాత్రులు ఏకాంతంలో

కవిత బయట పడేందుకు యమ యాతన అక్కరలేదు
చెట్టు కొమ్మకు పూవులా, జలధి నుండి మేఘంలా
ఉదయం రవి కిరణంలా, రాత్రి చంద్ర బింబంలా
సందర్భానికి వశమై సృజన రూపమొందుతుంది

మొదటిసారి తొలకరి వానలో తడిసినట్లు ఉంటుంది
ఉత్సాహం ఉల్లాసంలో మనిషిలో భయం దూరమయ్యేను

ఏ రోజు కారోజు ఉదయ క్షణం అమృత కళతో
మరో తేదీతో కొత్తగా పరిచయమయినట్లు ఉంటుంది
అపై తగినట్లుగ జీవన లిప్తలు కదలేను
మనిషి మనిషికీ అనుభవ రూపం మారేను

సాయం సంధ్యలో నిన్న బూది అయిన క్షణాల బదులు
ఉదయం సంధ్యలో కుసుమిత క్షణాలెదురవుతాయనే
ఆశా రూపం! బ్రతుకులో నిర్మాణానికి వీలుగా
క్షణం వెనకనే మరో క్షణం అలవలె సిద్ధంగా

ఒక మూల నుండి షార్ట్ సర్క్యూట్ వలన పొగలు
అంతట్లో ఎగసే మంటలు! విధ్వంస చణంగా

పరుగుతీస్తూ అగ్ని మాపక వాహనం
హడావిడిగా సిబ్బంది సమూహం
అదుపులోకి తెచ్చేరు స్తిమితం కూర్చేరు
ప్రాణభయం లేకుండా సంపద నశించకుండా
ఎవరి పనిలో వారు బాధ్యతగా

స్తిమితం కోల్పోయిన ఘటనలెన్నో
మధ్య మధ్య దగ్ధమైన విషాద దృశ్యాలతో

కవిత సూదిలా పని చేస్తుంది హృదిలో
ఆలోచనల్ని డ్రెస్‌లుగా మారుస్తుంది
దుస్తు లెవరికయినా ధరించక తప్పదు
ఇవి భావ మయాలు ! పలు తీరులలో

మీటిన జీవన తంత్రులపై శబ్ద సారచిత్రం
మనసుకు వినిపిస్తుంది ఆ రోజు అనుభవం
రాత్రులు ఏకాంతంలో శాంతంగా

23. శత్రు పక్షంగా

నిశీధిలో వెన్నెలో చీకటో లేని రోజు ఉందా?
కష్టం లేని బాధ ఎరగని బ్రతుకు ఉందా?
సృష్టిలో పగలు రాత్రి కాల విభాగాలు
బ్రతుకులో కష్టం బాధ అనుభవ ప్రభావాలు

రాత్రి కలను గాజు కేస్‌లో భద్రపరచి
ఉషఃకాల హృదయంలా కవిత వెడలుతుంది
మెలకువ సింహాసన మధిష్ఠించి నట్లు ఉంటుంది
బయట ప్రకాశంలో అన్నీ స్పష్టంగా చూపులో
మూలన ఒదిగిన చీకటి బొమ్మలతో సహా
మంచి చెడు శిష్టులు దుష్టులు హతులు హంతకులు
అందరూ కవితకు సమానం వివిధ ప్రాంతాలలో
మనిషిలో చేతన రూపానికి ప్రాధాన్యంతో

బీజంలో దాగి ఉన్న సుమ ఫల స్పృహలా
సంఘర్షణ సమన్వయంతో పరిణామ దశలు
కష్టాలున్నాయని ప్రాణాలను వదల రెవరూ
ఎదుర్కొనే శక్తిని మేల్కొల్పి పేరు, విజయం కాంక్షించేరు

ఇంద్ర జాలంలో చూపే వస్తువు వలె
చాచిన అరచేయిలో వచ్చి పడదు ఏదీ,
అన్నీ శ్రమ జీవన విలసన పరిణామంతోనే
కాలం అన్నిటి పట్ల ఒకే విధంగా ఉంటుంది

బ్రతుకులో మార్పుతో కనీస స్థాయిలో
మనిషిలో ఆరాటం! పచ్చదనంతో భవితకై

దరిద్ర మయితేనేం? సృజన గుణం తొలగదు
సుందరతను కోల్పోదు శుష్కమైన సరసి అవదు
కవి మనస్సు పర్వతంలా ఉండలేదు నిశ్చలంగా
కాలంతో పాటు నదిలా ప్రవహిస్తూనే ఉంటుంది

నిన్న పుష్ప గుచ్ఛంతో ఎదురు పడిన సంధ్య
నేడు ఆయుధ గర్జతో ఎదురు కావచ్చు
సమస్యపై ప్రశ్నలు వదలినంత మాత్రాన
శత్రు పక్షంగా పరిగణించవలసిన పనిలేదు

24. నిరోధం! విరోధం!

ఏదో ఒక పనితో బ్రతుకు గడవడం కోసం
పల్లె నుండి నగరానికి కఠిన వాస్తవంలో
కళ్ళలో అసంతృప్తి వేలాడుతూ ఎంతకాలం?
సంపాదన సుఖం పేరు ప్రతిష్ఠలొకటొకటీ!

ముఖాన మండే కుంపటితో ఎంత కాలం
పూల తీగ సాగేనా? కుసుమ శోభ చూపేనా?

ఎందరు వీడినా ఊరు ఉనికి అంతరించదు
ప్రతి బ్రతుకులో మౌలికమైన అవసరాలను తీర్చేది
ఆహారం నుండి ఆచ్ఛాదనం వరకు
మధ్య మధ్య తీరిక రోజులలో స్మృతులతో

మనిషిని ఖాళీగా ఉంచదు నగరం
ఏదో ఒక పనిలో జీవనానికి వరం

ఉదయ కిరణంతో చీకటి తొలగినట్లు
శ్రమ తేజంతో దరిద్రం తొలగేనా?
ప్రతి వికాస దశలో దేనికది ఇంకా మిగిలి
మనిషిలోని బలహీనతల్ని సూచిస్తూంది

మనిషి తన ఉనికిని ఉన్నతిని కోల్పోయేదిలేదు
క్షీణ దశలు విషమ స్థితులు వస్తాయి, పోతాయి
ఏకాంతంలోను మనసు చరిస్తుంది సమాజంలో
ఖాళీలను పూరించేది మాత్రం ఎవరో కొందరే

ఆలోచన మొలకెత్తుతుంది అక్షర భూమిపై
విజ్ఞాన శిఖరాల నందుకొనే అనుభవంలో
పరివర్తన కోరుతుంది, సమాజ రూపంలో
మెలకువ సరస్సులో పైకి తేలే పద్మంలా

చీకటి నుండి బయట పడవచ్చు దీప సహాయంతో
ఆరని వెలుగై మనిషి బ్రతకడం సులభం కాదు
పరిశోధనా పథంలో నైతిక బల నియతంతో
శ్రమరూపం ఒకటే! కరోనాకు నిరోధం ! విరోధం!

25. అభిజ్ఞానం వలె

ఈ మృత్యు హేలా వర్తనం ఎవరిది? కరోనాదేనా?
జన గణ విషాద దృశ్యాలను వదలుతూంది
దీని ప్రభావ జాలంలో చకితంగా చిక్కేరు మనుషులు
విలవిలలాడేరు, బయట పడడానికెంత తతంగమో?

మనిషిలో సహనాన్ని జీవ శక్తి ప్రమాణాన్ని
ఏ సూచన లేకుండా పరీక్షకు గురి చేస్తూంది
ఇందులో ఆశ్చర్యం లేదు, విశేషం లేదు
ఇంత వరకు తెలియని ప్రమాద జీవి నుండి దుశ్చర్య ఉంది

విషమయ దుశ్చర్యలో కఠినతతో క్రూరత
విపరీత గుణంతో ఏమీ తెలియని ప్రజలను శాసిస్తూంది

ప్రాణానికి అవసరమయిన పవనం
తుపాన్‌ను మోసుకొని వస్తుంది పోతుంది
కరోన మాత్రం కొంతకాలం తిష్ట వేసేట్లు ఉంది
ఒకరి తరువాత మరొకరిని ఆవహిస్తూ నిశ్శబ్దంగా

భౌతిక మానస స్థాయిలలో బ్రతుకులకు
అంటిన మలినంతో దీనికి అవకాశం దొరకేను
తమంతట తాము స్వచ్ఛతను కోరగ చేస్తూంది
మనిషి మనిషికీ శుభ్రతను అలవడ చేస్తూంది

చెడును ప్రభావితం చేసే ఆలోచనతో పాటు
ఉన్న స్థితిని చక్కబరచే యత్నంలో యంత్రాంగం
ఇది ఎవరో కొందరి చికిత్సతో ఆగదు
అందరికీ సోకే వేగంతో చరిస్తూంది
దీనికి సమయ నియతి లేదు, కాలంతో కదలేను
సమూహాలపై ప్రభావంతో, ముందుకు సాగుతూంది

కనిపించని వైరస్ మనిషిని అగమ్య గోచరంలో పడేస్తుంది
ఇది అవసర కారణం కాకపోయినా పరిశీలనలో
మనిషిలో నియమ నియత పథంలో స్వచ్ఛంగా
వ్యక్తిత్వం రూపొందేను, మానవ బంధుతకవకాశంతో

చేపలకై విసరిన వలలో పడి తెలియకుండ
సమస్య తీరే అభిజ్ఞానం వలె వేక్సిన్ లభిస్తుందనే

26. సంజీవని పాత్ర

ఇంత వరకు ఇంటిపై ఎక్కువ ధ్యాసలేని వారు
ఇపుడు రాగ బంధంతో సమయాలను గడిపేరు
చిన్న పెద్ద భేదం లేకుండా వర్ణ చిత్రం చూపేరు
కాలి నడక సాగలేని నదిని దాట వచ్చు ఉపాయంగా
ఏదో ఒక సాధనం దాటగ చేస్తుంది
అవతలి ఒడ్డుకు క్షేమంగా చేరుస్తుంది
కన్నీటి బిందువును దాట గలిగే దెవరు?
వేదనా శకలాన్ని వదలించుకునే దెవరు?

ఈ స్థితిలో ధైర్యమొకటే చాలదు, మతి ప్రభ అవసరం
కాలం ఎవరినీ బాధించదు, మౌనంగా ఉంటుంది
సూర్యచంద్రుల వెలుగు చూపులలో ఏ రోజు
ఎవరిదో కన్నీటితో పరి శుభ్రమై కదలుతుంది

తోట చేను పొలంపై నుండి గాలి! వీస్తూ
కట్టడిలో నగర శూన్య ముఖాన్ని పరామర్శిస్తుంది
నిన్నటి వరకు సమాజం మరచి వాస్తవ రూపం
ఈ రోజున క్షణంలో శుభ్రమై అక్షర రూపం పొందేను

ఈ విషమ పరిస్థితులలో దరిద్రాన్ని తుడిచేసే
చర్యలతో నవ జీవన మానవం అవసరం
కరోన రాకతో కర్తవ్యం గుర్తుకు వచ్చినా
ఈ ఎడమూ దూరం నియత్రణం బ్రతుకులో తాత్కాలికం
అనుబంధం స్నేహం శాశ్వతమైన వాస్తవాలు
వీటిని వీడే ప్రసక్తి లేదు ఈ వైజ్ఞానిక యుగంలో

విజ్ఞాన శిఖరం చేరిన మానవ విజయంపై ఆకాంక్షతో
పీఠం దిగి కరోనా మాత్రం కనిపించని దూరం పోవలసిందే

దారిలో ఎండిన చెట్లు పచ్చగా మారేను
బ్రతుకులో విషాద ఘడియ రాగమయ మయ్యేను
కరోనాను కట్టడి చేసే యత్నంలో ఔషధం త్వరలో
అమృత సంజీవని పాత్ర వహించేను సమాజంలో

27. నిప్పుటేరులాగా లోన

కళ్ళలో కారం చల్లి శత్రువును దాటాలని ఒకరు
ఇంత దుమ్ము విసరి ముందుకు సాగాలని ఒకరు
ఆ దాగిన రూపం కనిపిస్తేగా ఈ పని చేసేందుకు
ఇంతవరకు దీనితో పోరాటం గాలిలో చేతులు తిప్పడమే

ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా
మాస్క్‌తో శ్వాస ప్రవేశాన్ని రహస్య నిలయంగా మార్చేరు
కష్టం వేదన బాధ దుఃఖం ఎప్పటివో అయినా
ఇవి దీర్ఘకాల జీవన ప్రకటనలో భాగం కారాదు

ఇంటి ఆవరణం వరకు అనుబంధం స్వీయం
గేటు దాటితే వీధిలో విశాలమైన సమాజ పరం
ఊహించరాని వేగంతో మృత్యు హస్తం వైరస్
ఇప్పటి వరకు ఎందరినో పొట్టన పెట్టుకుంది
కనిపించని శత్రువుపై రణం సాగుతూంది
అనుమానంలో సూచనతో పసికట్టే విధంలో

వ్యాధి పేరు తోనే భయం పాకుతూంది
ఒత్తిడిలో బ్రతుకులు చిన్నా భిన్నమయ్యేను

మానవ శక్తుల ప్రత్యేకతలోనూ వికాస చరిత్రలో
కొన్ని పరిమితుల తోనే ఇపుడు కాలం గడుస్తూంది
సమస్య నుండి ఎగిరేందుకు పక్షి లక్షణం లేదు
సుదూరంగా ఉంచేందుకు మృగం బాబతు లేదు
సృష్టిలో ఉన్నవి అన్ని వర్తనలో ఎంతో కొంత
కలిసిన మిశ్రమంగా దేనితోను పోల్చరాని రూపం
బ్రతుకును గడిపేది నీతిలో పరిమితులలోనే
రూపం నిలిచేది కొన్ని మంచి పనులతోనే

చేతనలో మనిషి తనకు తాను సాటిగా
అభిమాన వశంలో ఎంత కయిన తెగించేను
కాకర చేదులా బయట కష్టం సహించేను
నిప్పు టేరులాగ లోన బాధను భరించేను

28. దాటడమే కర్తవ్యం

ఉన్నతి కోరే లక్ష్యం చేరేందుకు
దౌష్ట్యంపై రణ చర్యలు తప్పవు,
సందర్భానికి తగిన మానుష చర్యలతో
విజయ పథంలో చరిత్ర రూపుదిద్దుకునేను

నిజం తెలిసేది భూమి పొరలలో వేరులతోనే
పైకి కనిపించేది చెట్టు ఆకారం మాత్రమే
మనిషికి కావలసిన పూవు ఫలం కలపతో
అలరిస్తుంది ! ప్రజల కోసమన్నట్లుగ బ్రతుకుతుంది

సినిమాలో స్క్రీన్‌పై నటీనటుల మాటలు చేష్టలు
ఎవరి కోస మంటే నటకుల తృప్తి రేఖతో పాటుగ
ప్రేక్షకుల కోసమనీ! అందరికీ తెలిసిన వాస్తవం
కవి నట గాయక శ్రమ రూపం జన హృది స్పందన కోసమే

పైకి తోచే నిజాన్ని కప్పేస్తుంది కళ సుందరంగా
మనిషి అంతరంగానికి మాత్రమే తెలుస్తుంది! నిజం

బొమ్మల భాష పిల్లలకు బాగా తెలుస్తుంది
ప్రతిమల భాష పెద్దలకు బాగా తెలుస్తుంది
మనిషి భాష మనిషి హృదికి బాగా వినబడుతుంది
సమాజ భాష ప్రతి మనిషికి తెలుస్తుంది, తెలియాలి

అర్థం మాత్రం నదిలో చేపలా కదలుతుంది
చెరువులో పద్మంలా దూరం నుండి కనబడేను
మబ్బులో నీరులా లోన దాగి ఉండవచ్చు
వోటర్ చేతిలో వోటులా రెపరెపలాడేను

మనిషి మనిషికీ మధ్య దూరం ఎడారి కాకూడదు
ఇది సస్య శ్యామల మయ్యే కృషి అవసరం
మనిషిని ఏదో ఒక పేరుతో బంధించచ్చు
కాలాన్ని బంధించే ఆలోచన నెరవేరదు, సాగదు

నది గిరి ఎడారి జలధి ఏదీ వదల బడలేదు
బాధలు వేదన సహిస్తూ దాటడమే మనుషుల కర్తవ్యం

29. ముసుగు లేని ఎడం లేని

సమాజ ప్రగతి చరిత్రలో ఒక పక్షం ఓటమి ప్రజాస్వామ్యంలో
పునర్విలోకనానికీ వివేచనకూ అవకాశం దొరకుతుంది
అమ్మ తప్ప ఎవరు తెలియకుండా జనించిన శిశువు
శూన్యంగా ఒంటరిగా ఏమీ లేకుండ వచ్చేను
ఒక ఏడుపుతో తన ఉనికి తెలియజేసి ఎదిగి పెద్దయి
చిట్ట చివర ఎంతో వదలి వేసి శూన్యంలోకి నిష్క్రమించేను

సంపద చరిత్ర యశస్సు నిర్మాణం శ్రమ గుర్తులు
ఒకరొకరివి అంతో ఇంతో భాగంతో సమాజం
వీరుడు కవి శాస్త్రవేత్త పాలకులు మరెందరో
తమ శక్తి యుక్తులను సంఘాని కర్పణ కావించేరు

వికాస సంస్కరణలు ఉద్యమ పరివర్తనలు రణం పణం
ఓటమి గెలుపులు మిశ్రమ గుణ సంకేతాలతో జీవితం
చెడుపై విజయం తప్పని సరి అవుతుంది, మనిషిలో
అనితర క్రూరత కఠినతతో చెడుకు నిలయం కరోనా

జీవన గమనంలో దీనికి దీటుగ శరణ్య మొకటే
వ్యక్తి శక్తి సంఘ బలం కలిసిన మానవ విజ్ఞాన ఘనం
అలజడి ఘర్షణ ముఖాముఖి రణ చర్యల ప్రసక్తి లేదు
నాలుగు వైపుల నుండీ జన హీత నీతి నిబంధనతోనే

ప్రతి రుతువు తన ప్రభావంతో కర్తవ్యం నిర్వర్తిస్తుంది
ప్రకృతి అయిన ప్రాణి అయిన మనిషి అయిన ఒకటే
సమత నవత పరివర్తన అవసరం ! మనసు కోరుతుంది
మార్పులేని జడ దశలో స్థగితం ఏర్పడుతుంది
విచ్ఛిన్నానికి సూచనగానూ కనిపిస్తుంది

హద్దులు మీరిన గ్రీష్మం వర్ష శిశిర మేదయినా
జీవన చలన వ్యవస్థలో లయ తప్పితే
మానవ చరిత్రలో దశ చెదురుతుంది మారుతుంది

సమాజం కోరుతుంది అనురాగం ఆర్ద్రత ఆత్మీయం
ముసుగులేని ఎడం లేని స్నేహ మయంతో మానవం

30. వెలుతురుతో ఎప్పటికీ

తిరగ బడిన మనిషి తల క్రిందుగ నడచేనా?
అతనిలో ఆలోచన దిశ తప్పేనా? మారేనా?
శీర్షాసన భంగిమను తలపించేనా?
భేదం దృశ్యం లోనా? చూచే కోణంలోనా?

కాలు జారడం నర్తనంలో భాగ మయ్యేనా?
ఇదొక విచిత్ర ప్రయోగమా? సమస్యలో చేరేనా?

నడచే దారిన ధూళిలో పడే అడుగు జాడ
స్వంతం అయితే! ఆ తదుపరి వచ్చేవి కలసి
క్షుణ్ణమై జన హిత కరమవుతుంది దారి,
ఏది ఎవరి అడుగు జాడో గుర్తించడం కుదరదు

కళ్ళలో కోప శిఖలు వెడలినంత సులభంగా
వెనకనే తరలే బాష్ప కణాలు జారవు
దీని కెంత వేదన అవసరమో?
అంత కంత నటన కూడ ముఖ్యం

ఏ సమస్యకు పూర్తి జవాబు దొరకదు
వచ్చిన దానితో దొరకిన దానితోనే తృప్తి
బ్రతుకులు గడుస్తాయి పోయిన కొద్దీ
చిక్కుముడులు సుడిగుండాలు తప్పనివీ పయనంలో

ఏదో సమస్యలేని జీవితం లేదు ఏ రోజూ
చిన్నదో పెద్దదో పాతదో కొత్తదో నీడలా
వెను వెనుకనే ఉంటుంది! అందుబాటులో
పరిష్కారంలో విధ్వంసం సులభం నిర్మాణం శ్రమ జనితం

మనిషి ఉనికికి బహు ప్రమాదకరమైన కరోనా ! త్వరలో
వైజ్ఞానిక ప్రయోగ ఫలితంతో కనుమరుగు కాక తప్పదు

చీకటిలోకి నడవాలని ఎవరికీ ఉండదు
చీకటియే మనిషి ఉన్న చోటికి వస్తుంది
అందులో కరోనా ఒకటి చీకటి శిలా శకలం
జాగ్రతలో మనిషి పాత్ర! ఎప్పటికీ చూపే వెలుతురుతో "అజేయం"

స్వేచ్ఛా కవిత్వం - 114

ఈ వారం కవిత

రెండు భాగాలు

మాదిరాజు రంగారావు

2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

114 SWECCHA KAVITHVAM

Free - Verse

EE VARAM KAVITHA (TWO PARTS)

Telugu

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2020

Presented to
my Son
Dr. M. Santhosh Kumar
with
affection and blessings
on his Birthday

కవి మాట – మరో లోకం

ఇది "ఈ వారం కవిత" స్వేచ్ఛా కవిత్వం (114) లో కృతి. మరీ చిన్నదీ మరీ పెద్దది కాకుండా 20–24 పంక్తుల్లో 40 కవితల సంపుటి. రెండు భాగాలుగా (20+20) ఉంది. నేను విశ్వసించే ప్రజాస్వామ్య సామ్యవాద ఛాయలతో, దార్శనిక విషయంలో దృష్టికి వస్తుంది. కవిత్వ విషయంలో (1) మానవ జీవితం – సమాజం (2) వ్యక్తి వికాసం – మనస్తత్వ చిత్రణం (3) సమాజ సందర్భాలు – వ్యక్తి అనుభూతి విశేషం, (4) కొంత కాల్పనికత – కొంత వాస్తవికతతో కూడింది. భావ రూపాలు (Images) ప్రతీకలు (Symbols) మధ్య మధ్య అంతర్విశ్లేషణం (Internal Analysis) కలిగింది. హేతు దృష్టితో అనుభూతి సాంద్రతతో ఆపూర్ణమయింది.

మొత్తం మీద ఇదొక కొత్త ప్రయత్నంగా భావిస్తాను. ఇందులో భావ సాంద్రత ఎక్కువ. కవిత చదువుతూంటే రెండు పొరలు స్పష్టంగా అందుతాయి. మొదటిది జీవితం – సమాజం, రెండోది మనో రూపం. చుట్టూ ఉన్న పరిస్థితులు స్ఫూర్తికి వస్తాయి ఈనాడు కవిత్వంలో ఈ లక్షణానికి ప్రాధాన్యం ఉందనే నా అభిప్రాయం.

ఇవి ప్రతి ఆదివారం Mobile face book లో ప్రత్యక్షమవడం జరిగింది. అమెరికాలో ఉన్న కొందరు మిత్రుల, బంధువుల కోరికపై ఈ పద్ధతిని ఆలోచన చేసి కళాత్మకంగా రూపొందించడం జరిగింది ఇదొక సత్ప్రయత్నం.

అవగాహనకు పెద్ద ఆటంకాలు లేకుండా సులభ సుందరమైన ప్రవాహకతను కలిగినవి. కవిత్వ పఠన సందర్భంలో సాధారణమైన వచన పద్ధతితో పాటు స్వర తరంగం కదలికల్ని గుర్తించవచ్చు. ఇది ఏ ప్రయత్నం లేకుండా automatic గా జరిగిన ప్రత్యేకత. ఇది సృజన చేతనలో భాగం.

కవిత్వాన్ని విమర్శలో కన్న పాఠకులు స్వయంగా పఠన స్థాయిలో ఎక్కువ ప్రయోజనాన్ని పొందగలరనీ అనుభూతి – ఆలోచన రెండూ కలిసిన తమదైన అనుభవ విశేషాన్ని పెంచుకోగలరనీ అభిలాష. కవిత్వం క్షాళనంలో మానసికంగా స్వచ్ఛతకు శుభ్రతకు ముఖ్యంగా మార్పుకు కారణమయింది, అందరికీ తెలిసిన విషయం మరో లోకాన్ని చూపిస్తుంది.

సాహిత్య సహృదయులకు స్వాగత హృదయంతో..

– మాదిరాజు రంగారావు

1. హృదయం మిన్న

కవి మనసుకు చీకటి భయం లేశం లేదు
శస్త్రమొ అస్త్రమొ ఉపకరణం కావచ్చు

ముంగిట గాలికి జారిన పూల తోరణమో
భ్రమలో భుజగమొ ! ఏ దయినా ఒకటే

భుజగ భయం శత్రు భయం ఇరువైపుల
కవిలో మిత్ర పదం కిరణమై శరణమై

కాలి సగం ఆరిన చీకటి ముక్కలు
పొయిలోవా! చితిలోవా ! బాధలోవా!

కాలంతో పాటు మనసు ఎన్నిటినో
సహనంతో వహనంతో మును ముందునకే

ప్రజలందరు కలిసిన మానవ రూపం ఒకటే
చిన్న చిన్న విభాగాలు అస్తితలో నిజ శాఖలు

కవి మనసుకు మృత్యువు భయ లేశం లేదు
ఉత్పవనంలో కవితకు హృదయం ఒకటే

ప్రాంతం దేశం మత భావం తన ఆవరణం
ఉన్నతి కెళ్ళే కొద్దీ ఒకటొకటీ వదలేను

మబ్బులతో భూమిపైన మనుషులతో
మాటలాడుతుంది కవిత! హృదయభాష

కవి మనసుకు చీకటి భయ భావం సున్న
ఆరోహణలో కవితకు హృదయం మిన్న

2. దేని కయిన స్వాగతం

వేదనలో మంటలతో హృదయ సుమం బూది కాదు
బాధలలో వేడి దాగి, భావ శాఖి బొగ్గు అవదు

కోరిక లెప్పటికిని పచ్చగ ఉండాలని
ఆశా మతిలో ఒకటొకటి భద్రంగా

ఉదయారుణ కిరణం మనిషి మనిషిలో ఒకటే
రుచు లెన్నో! దిశలన్ని! చూపు పడే కొద్దీ

కోష్మ రశ్మి మనిషిలో క్రియను సుమిత పరచేను
అనుమాన భయం తొలగి నవ దృశ్యం చూపేను

ప్రతి దినమొక తెలియని విషయమేదొ కొత్తగా
అందుకనే ఎప్పటికిని పూర్తి అవని బ్రతుకులు

ఎప్పటివో ! సమాజాన పేరు కొనీ
గుప్త పేటిలోని వెన్నో ! తెలియనివీ

జేబులోని చేతి వేళ్ళు నింగి అంచు తాకేను
నడకలో అడుగు కింది నేల ! తనది అయ్యేన?

పయనంలో దారి మధ్య గిరి ఎదురయితే
మనసులో విమానంపై కోరిక దాటించేను

పయనంలో దారి మధ్య నది ఎదురయితే
మనసులో పడవగ ఆలోచన దాటించేను

ఎవరి నైన కవి నిరాకరించడు, తొలగడు
దేని కయిన కవిత! స్వాగతం పలుకుతుంది

3. వెలుగుల సంకెల

భూమి పైన అడుగులతో మనుషులకు
దొరకు తుంది మహదవకాశం ఆసరా

ఇది స్వర్గం కన్న మిన్నయా? ఏ మయినా
చిర నవ బంధంతో బ్రతుకులు గడచేను

కొందరు మహనీయులు నిశ్శబ్ద సమాజాన్ని
స్పందన హృదయంతో శబ్ద మయం చేసేరు

ఇది సంస్కృతి నిలయమై విలువలు పెరిగేను
మది నూతన సృజనయై తలపులు మారేను

ఎంత వెలుగు అందినా లోన ఉన్న పాత్రలు
ఎప్పటికిని శూన్యమైన ఆకృతి తోనే

ఒకరికి చెందిన పోర్షన్ మరొకరికి వాచికమై
పొరపాటునొ! చతురతనో ! బ్రతుకులు సాగేను

ఆక్రమణం సంవరణం బహుమానం సంచయనం
ఎన్ని విధాలుగనొ! ఈ జీవన సంకలనం

ఆగని కాలం గతిలో ఏదో ఒక పనిలో
శ్రమ చేతన సత్ఫలితమె! సమ సమాజ సార్థం

హద్దులు దాటిన నేరంతో చీకటి సంకెల
హద్దులు తెలిసిన బాధ్యతతో వెలుగుల సంకెల

ఒకటి వచ్చి పై బడేను బాధా మయమై
ఒకటి తాను వరించేను సంప్రీణంగా

4. ఆశలు ఓడలు

జలధి పైన అలలపై ఆశలుగా ఓడలు
తటం నుండి తటానికి తరలే దూతలు

సరంగు అదుపులో యానం అవసర రమణీయం
శ్రామికులకు జీవన భృతి, జనతకు కార్యకలాపం

ప్రాణ భయంలో నిరోధ పంక్తి దాటుతూ
ఒంటరి లోను పయనం గమ్యం చేర్చేను

ప్రమాదాలు అపాయాలు ఆపదలూ మరొకటీ
విసరిన కాలం వలలో చేపల వలె క్షణాలు

తీరం చేరగనే ఆరోజున దశ ఆఖరు
ప్రయాణికులు క్షణంలో ఎవరి దారిన వారు

తిరుగు ప్రయాణంలో తమ బాధ్యత కోసం
బ్రతుకు తెరువుపై ముఖాలు చూపులు నిలిపేను

బలహీనం జాడలు మరపించే ధైర్యంతో
చూపు చివర వ్రేలాడేను నిజ జీవన శకలం

నేతకు బలమైన యాన సాధనమై జిగీషలో
మనిషికి ఆశా నిలయం ! ప్రేరణ చిహ్నం

రక్షణలో మలుపులతో రాజనీతి మార్పులతో
సమాజ వేగంలో మానవ శక్తులు సార్థకమై

చరిత్రలో కొత్త యాన దశ సూచికగా
రణ విజయం రాజకీయ రూపం తీర్చేను

5. సమాధానాల ఖజాన

మనిషి గళం నుండి స్వరం వినబడే నందరికీ
ఎవరి కిష్ట మైంది వారి మనసులో చేరేను

మనిషి కనుల నుండి వెడలు చిత్ర పంక్తిలో
ఎవరి కిష్టమైంది వారి మనసులో నిలిచేను

పరిచయ మున్నా లేకపోయినా ఎవరి అనుభవం వారిది
దీనికి ఏ పురాస్మృతుల గవేషణం! జరిగేను?

రూపు చూపు మాటలో సమతను కోల్పోవచ్చు
ఎండిన కొమ్మను పట్టుక వ్రేలాడదు కుసుమం

తాపంలో మబ్బులతో పాటుగ నడచే కోరిక
ప్రతి మదిలో తల ఎత్తడమొక సహజ గుణం

మెరపులతో పాటుగ అశని పాత ఘటనలు
బల సంపద తోడుగ సహనశక్తి తప్పదు

ఒకరిమాట స్పృశిస్తుంది, రాలే పూవులాగ
ఒకరి మాట తాకుతుంది, ఎగసే నిప్పులాగ

ఎప్పుడో వచ్చే ఆపదలకు ఇప్పటి నుండే
జాగ్రత్తల వ్యూహ రచనతో మేధావి గణం

రాజకీయ చతురతయె! స్వార్థ భావగతియె
తోసి వేసి మనిషిని తొక్కుతూ పోవడం అరాజకం

తెలియని ప్రశ్నకు జవాబుకై నింగివైపు చూచేరా?
సమస్యల చింతనలో సమాధాన ఖజానాగ తోచేనా?

6. భవిత హృదయం

దూసిన బాణం మ్రోగిన శపథం లేచిన కిరణం
ప్రభావ గతిలో వెనుకకు మరలే ప్రసక్తి లేదు

మాటకు పాటకు మిత్రత ఎప్పటిదో
కవితకు బంధుత నవ్యత ఇప్పటిదీ

ఎంత కాల మయినా ఎప్పటికీ అభినవం
మార్పుకు సూచనగా పదపదం ప్రగతి వశం

సర్కస్‌లో తాడుపైన నడకలో బాలెన్సుతో
ప్రజాస్వామ్య రేఖపైన నడవడి ఒక పరీక్షయే

గాయపడిన స్వేచ్ఛ నుండి జారిన నెత్తురు చుక్కలు
గగనంలో రాత్రి కనులు తెరచిన తారాగణం

కవికీ కవికీ వేరు వేరు స్వతంత్ర భూమికలు
గాయపడిన స్వేచ్ఛకు ఉపశమనం అవసరం

మంచి చెడులు కలిసి వేరు చేయరాని
కవితలో చుట్టూ వస్తువులు ! కొరత లేదు

ప్రమాదంలోనొ ఘర్షణలోనొ ముక్కలైన
ప్రజాస్వామ్య వాహనంలో వర్తమాన సమాజం

సాయం సంధ్యా దృశ్యాన్ని తలపించే జీవన పటంపై
విషాద చిత్రం! రేపటికి తొలగేనని ఆశ

నేడు కూలిన చెట్టు లేచి, రేపు నిలబడకపోవచ్చు
రేపు చూచే మొక్కలో భవిత హృదయం కనిపించనీ

7. లక్ష్యం ఒకటే

ప్రవహించే జీవన రూపం అణవణువు చేతన రూపం
ప్రజలకు ఉపకృతిలో శిలలు దాటి ముందుకు సాగడమే

దోసిలి మట్టి నుండి తరువు పైకి ఎదగ వచ్చు
గాలి నీరు వెలుగు స్పర్శ కోరుతుంది సృజన భవం

వెన్నెల అద్దంలో సరిగా కనబడని ముఖంకై
ఎచటెచటో వెదకేను కనులు, నాల్గు దిశలలో

పూర్ణ చంద్ర బింబంతో పోలిక కనిపించేనా?
మనిషి అంతరంగంలో నిజ రూపం తోచేనా?

బ్రతుకు బాటలో నడకో ఏ వాహనమో
అందుబాటులో ఉన్నది ఆ సమయం సన్మిత్రం

ఎదిగే బ్రతుకుల్ని అడుగు క్రింద అణచి వేసే
నిరంకుశం సమస్యకు బీజ భూతమవు తూంది

మూసిన తలపుల్ని తెరవజేస్తుంది, ఉద్యమం
వివేచనకు దారి, చూపు తుంది, ప్రజాస్వామ్యం

దేశ దేశ ప్రజల మధ్య సరికొత్త స్నేహవార్త
ఎప్పటి కప్పుడు శక్తిని పోటీకి సిద్ధ పరుస్తుంది

విజయ ప్రాప్తిలో మనిషి మనసు పీఠం అవుతుంది
తన యత్నం ఎగసిన తారా జువ్వను తలపించేను

దిశలు చుట్టి వచ్చే అనుభవ దృశ్యాలెన్నో
వాహన మేదయినా, లక్ష్యం ఒకటే, జన శ్రేయం

8. కల్పన మరపున బడి

కల్పనలో గడుస్తుంది బ్రతుకులో బహు భాగం
వాస్తవానుభవంలో సమస్యలెన్నో! ఎదురవుతూ

తృప్తి రేఖ మానసికం, తోరణ మవుతుంది
మట్టి అంట కుండ బ్రతుకులు సాగేనా?

మౌన బంధనంలో ఉన్నా మనిషి
సమాజ చలనంలో ఒక భాగం

ప్రేక్షక పాత్ర వహించే వ్యక్తి
ప్రపంచ చేతనలో ఒక పార్శ్వం

బోనులో చిక్కిన పులి కొన్ని అడుగుల మేరలో
తిరుగుతుంది లోనుండి, చూస్తూ అమాయకంగా

విజయం మనిషిని పీఠంపై నిలుపుతుంది
ఆ సమయం అంతా తన వశమైనట్లుగనే

ప్రభుత కూడ దీనికి తోడయితే
ఎదురులేని ధీమా! నియంతగ మార్చేను

కవితలో మరో పాత్రకు వీలును కలిగించేను
స్వేచ్ఛలో స్వతంత్రం వికృత రూపం పొందవచ్చు

నినాదం స్ఫులింగం మై దహన కాండ జరగవచ్చు
వెనకనే విస్ఫోటం భయ గుహలో దింపవచ్చు

ప్రతి పూవుకు అవకాశం సృజన వనంలో
ప్రజాస్వామ్య భావనకు జన చేతన వేదికయై

ఫలితం మార్చేను సమాజ సందర్భంలో
కల్పన మరపున బడేను, జన వాస్తవ చేతనతో

9. కదలని చూపులు

ఏ జీవన వికాస వాద మయినా
ఏ మానుష ప్రయత్న రూప మయినా
రాజ్యాంగం సవరణతో మార్పులు కోరేరు
ఆశల వాస్తవ ఫలితం ప్రజ పొందాలనీ

గ్రీష్మంలో చెట్టు ఎండి పోవచ్చు
దరిద్రమైన ఆకారం దాల్చవచ్చు
భూమిలో వేరు మిగులుతుంది ఆర్ద్రంగా
సృజనలో సజీవ పాత్రను పోషిస్తుంది

బయట పడని నిజా లెన్నో! మనసులో
హేతు దృష్టికి ఎంతో అందే అవకాశంతో

ఎక్కడి వారు అక్కడ ! భయ వలయంలో
చీకటిలో ఎండిన బావుల వలె గడిపేరు

కష్టాలకు నష్టాలకు గురి చేసే వైరస్
మనిషి విజయ శక్తి తోనే నిష్క్రమణం

రోజుల మెట్లపై ఆరోహణలో కనులకు
పై నుండి చూస్తే లోతులు, పెరిగిన లోయలు

మరణ భయంతో మనసు శూన్య నిలయమయ్యేనా?
కనిపించని మహా మారి హస్తాలలో బంధితమై
విషాద ముద్రలతో పచ్చదనం తరిగిన బ్రతుకులు
నియతంగా తిరిగే కాల చక్రంపై కదలని బొమ్మలు

10. స్వేచ్ఛలోనె సాధ్యం

నీలి మబ్బు అంచున రవి కిరణంలా
ప్రపంచ యానం చేయాలని కోరిక ! ఎప్పటిదో
ఏదో కాస్త అయిన తీరే దొక కవిత లోనె
ఆర్ద మైన భావనతో తేజో రూపంతో

అడవిలో చెట్ల మధ్య కదలే, శిఖల కెదురుగా
పూల గుత్తిలా కనబడాలని, కోరిక ! ఎప్పటిదో
ఇది ఎప్పటికైనా తీరే దొక కవితలోనే
శౌర్యంతో రాగంతో చెరొక వైపు నుండి

మరణం పొందని ప్రాణి లేదు
విలయం కాని వస్తువు లేదు
సౌఖ్యం భాగ్యం అధికారం కాంక్షతో
చివరి క్షణం వరకూ ఆరాటంలో మనుషులు !

పొలాలు పంటలు చెరువులు తోటల నేపథ్యంలో
పరిశ్రమల సంరంభం ఆకర్షణ దృశ్యంలో
మనిషి విజయ గాధలపై సంఘంలో ఆశలు
అపూర్వమైన అస్మితలు, స్వేచ్ఛలోనే సాధ్యం

గదిలో టేబుల్‌పై ఎదురుగ, వెండి హంస
గోడకు వ్రేలాడుతూ, పురివిప్పిన నెమలి చిత్రం

లోనుండి గుండె వినిపించే శబ్ద తరంగాలతో
పోటీ పడుతూంది, బయటి గోడ గడియారం

11. శ్రమ చేతనలో

శ్రమ చేతన అడవిలో మొదలయి ఊరులో విప్పారేను
అంచెలు అంచెలుగా నగరంలో వివిధతలను పొందేను

భౌతిక మానస స్థాయిలలో లౌకిక తాత్విక శ్రేణులలో
జీవన రీతులు మారాలనీ, కొత్త దనం పొందాలనీ

మస్తిష్క నిలయం వెనకనే బారులు తీరి కలలు
లోనికి ప్రవేశించే ఆరాటంతో మనుషులు ఎప్పటికీ

మదిలో నాటిన కోరిక విత్తనాలు పలు రకాలు
అనుభవస్థితిలో చూచేవి ఏవో కొన్ని మాత్రమే!

చిట్ట చివరి మెట్టు అంటూ లేదు అనుభవంలో
చిట్ట చివరి వాక్యమంటూ లేదు ఏ కవితలో

ఉదయం ఎప్పటిదే ! రోజూ వచ్చే ప్రకాశ రూపం
అనుభవ రేఖలతో జీవన చిత్రాలు వేరు వేరు

ప్రశ్నల పట్టికతో లలాటాన జవాబుకై చూచేను కళ్ళు
మోదం ఖేదం శబ్దం వాదంతో చర్చా వేదికలెన్నో

మనుషుల బ్రతుకులు ఒక చోటునుండి మరో చోటుకు
ఎవరు ఆపగలిగారు? ఈ ధరా తలంపైన ఇంతవరకు

చేతిలో బిక్షా పాత్రతోనో బుజాన జోలెతోనో
ఒరలో పదును కత్తితోనో హృది గులాబి పుష్పంతోనో

ఏ దృశ్యంలో సందర్భం ఎవరి కెంత అవసరమో తెలియదు
ఎడారి కలలు దాటుతూ శ్రమ చేతనలో గడపేరు మనుషులు

12. అమూల్యాలు

ఈ విశాల ప్రపంచంలో భాగ మయ్యేందుకు
ఎవరి అనుమతితో సమ్మతితో పనిలేదు

భూమిపై ఏ ఖండంలో చూచినా సమాజ గతిలో
మనిషి యశో చిహ్నాలు ! జన జీవన బింబాలు

శక్తి కలది అణచి వేత నుండీ అననుకూలం లోనూ
లేస్తుంది ఎదుగుతుంది ప్రకటిత మవుతుంది

గోపురంలా మినార్ క్లాక్ టవర్‌లా నిలుస్తుంది
పలు దిశలకు కేంద్రమై దారులు చూపిస్తుంది

మాట రాని చోట గళం ! స్వర ధుని సరిస్తుంది
దారి లేని చోట అడుగు ! జాడలు కనిపిస్తాయి

ఉత్సవ కళతో నేడు మోదం కూర్చే తోరణం
మరో రోజుకు వాడిపోయి కసవులో కలిసేను
ఇది అందరికీ తెలిసిన విషయమే అయినా
తోరణం కట్టవలసిందే ! ఉత్సవం జరగవలసిందే

సాయం సంధ్య వెనకనే నిశ్శబ్దంగా వచ్చే రాత్రి
పొందే ఏకాంత విరామ సుందరతలు తక్కువేమి కాదు

చీకటిని దగ్ధం చేయాలని కొందరు
వెలుతురును ముక్కలు చేయాలని కొందరు
ఈ రెండూ ఎవరి చేతను అయ్యే పనులు కావు
మనో జగంలో ఎప్పటికీ ఉండే ! అమూల్యాలు

13. విశ్వమయమై

మట్టి నుండి పైకి వస్తుంది మొక్క
మట్టి అంట కుండా పూలను
గాలిలో నిలుపుతుంది కొమ్మపై
దీని వేరు మాత్రం మట్టిలోనే

భూమి అగ్ని గాలి నీరు నింగి
వేరు వేరు స్వరాలతో అలరిస్తాయి
ఇది అందరికీ తెలిసిన రహస్యం
ఆ పాటను వినేదెవరు? సృజనలో హృదయమే

దేహం ఉన్నంత వరకు గాయాలు తప్పవు
చిన్నతనంలో భౌతికం – పెద్ద తనంలో మానసికం
రెండూ సమాంతరంగా మధ్య మధ్య ఒకటిగనో
ఎక్కువ తక్కువలతో మనసుకు పని కల్పించేను

కాలాంతరాన గాయం మాయం కావచ్చు
మనసు పేటిలో జ్ఞాపకం భద్రంగా ! ఉంటుంది
ఆత్మ శోధనలో పరిశీలనలో బయటికి వస్తూంది
వ్యక్తుల అస్తిత్వంలో విలువల కెపుడైన ఉపకరిస్తుంది

ప్రతి గాయం చిన్నదో పెద్దదో ! జ్ఞాపకంలో
కథను పొంగ చేస్తుంది ! పైకి ఉబుక చేస్తుంది

మనిషి అడుగులు మట్టిపై, జీవన నిలయానికి దారిలో
మనిషి చూపులు ! దిశలలో, విశ్వమయమై వికాసంలో

14. అవకాశం

ఎవరూ శూన్యంలో ఒంటరి స్తంభం కాదు
చుట్టూ ప్రతి దిశలో కోణాల అనుబంధం

ఎవరూ శూన్యంలో ఒంటరి శిల్పం కాదు
చుట్టూ ఎన్నిటితోనొ అవసరాల అనివార్యం

జీవిత మంటేనే మనుషుల సంబంధ ప్రపంచం
అందరికీ ఎందరితోనో, ఎప్పటికీ ఎన్నిటితోనో

ఇంద్ర ధనుసు అందం ఎవరికి హ్లాదం కాదు?
భౌతికావసరాలు తీరాకనే ! విశేష మేదయినా
దివిలో కరుణాలయ మేఘంతో పాటుగ
చూచే కళ్ళలో మెరపుతో ఆర్ద్రత దిగుతుంది

కొందరి ముఖాలలో ఏడుపు అలంకారమవుతుంది
కొందరి ముఖాలలో వేదన కుసుమ దళమవుతుంది

ఎవరి క్రాస్‌ను వారు మోసుక వెళ్ళ వలసిందే
ఒకరి జీవితాన్ని మరొకరు రూపొందించలేరు

ఇపుడు అడవి పూర్వపు ప్రకృతి శోభానిలయం కాదు
అక్కడక్కడ బుల్లెట్‌ల గుర్తులతో విచిత్ర చిత్ర మయం

అందరి వాదాలకు ఆదరణీయమైంది కవిత
నిద్రాణ జగత్తును మేల్కొల్పే ఉదయం రాగ నవం

నిన్నటి పూవు రాలేనని విచారమా?
కొత్త కుసుమం చూచేమని సంతసమా?

ఉండి ఉండి హఠాత్తుగా విరామ నిశ్శబ్దం
మనిషిలోని అంతరంగ స్వరానికి అవకాశం

15. దరిద్రం బదులుగ

ఆకాశం ఖాళిగా ఉన్నట్లు కనిపిస్తుంది
అంతలో నీలిమబ్బులు వస్తాయి హ్లాదంగా
భూమిని జల సేచనతో ఆర్ద్ర పరచిపోతాయి
తాపంతో ఉన్న ఆశలు చల్లనై మొగ్గ తొడుగుతాయి

వెలుతురు వెన్నెలలు ఉపయోగానికి ముందుగ
సంచులలో చేర్చి భద్ర పరచుకునేవి కావు

చీకటి అక్కర లేదని పోగు చేసి మూటకట్టి
ఏ మూలనొ ! దాచి, మరచి పోయేది కాదు

వీటి ఆగమనం నిష్క్రమణం సందర్భ సహితంగా
మనుషులు సరి చేసుకొని బ్రతక వలసిందే
సమాజ శక్తులు సిద్ధం కావలసిందే
ప్రకృతికి సమాంతర రేఖపై జీవితాలు

ఉదయం వస్తుంది ! కలకలారావ మహితంగా
మహాద్వారం బంగరు తలుపులు తెరచుకుంటాయి
అద్దంలో బింబాల్లా స్మృతిలో అనుభవాలు
జీవన నిర్మాణంలో గుణగణాలు మిగులుతాయి !

మట్టిలో సృజన గుణం
మనిషిలో ఆత్మ శక్తి
రెండూ కలిసిన మనోజ్ఞ రూపం జీవితం
దరిద్రం బదులుగ భాగ్యాన్ని వశం చేస్తుంది కవిత

16. విశాల వేదిక

రవి బింబం శశి కిరణం దివా నిశా ప్రకారాలు
రావలసిన వేళలోనె వస్తాయి, వెళతాయి

స్వేచ్ఛా భావ పథంలో నియత కాల గతిలో
ప్రకృతి ప్రభావం దేశ సంస్కృతిలో భాగం అవుతుంది

అనుభవ యానంలో జీవన దృశ్యం మారుతుంది
సృజన విధం భిన్నమై కవిత వేరు అవుతుంది

దూరం నుండి భయం గొలిపే నీడలు
దగ్గరలో స్నిగ్ధమయిన ఆశ్రయాలయ్యేను

గడచే కాలంతో నడచే బ్రతుకులు
వర్తనలో మంచి చెడుల సంబంధంతో

చరిత్ర మేల్కొని ఉంటుంది శిధిలాలలోనూ
రణాలు కోటలు నిర్మాణ రూపాల గుర్తులతో

మార్పు లేని గుడిసెలు పేదల నివాసాలు
ఇప్పటికీ జడతలో నిదురించే చరిత్రతో

మాసిన చినిగిన దుస్తులతో తిరిగే దీనులు
సంఘానికి అనుబంధంగా దరిద్రుల బ్రతుకులు

ప్రభువుకు కిరీట మెంత ముఖ్యమైనదో
పేదకు బిక్షా పాత్ర అంతగ తప్పనిదీ

కవిత దేని నుండి ఒక పక్కకు తొలగిపోదు
అన్నిటికీ అందరికీ నిజ విశాల వేదిక అవుతుంది

17. ప్రవహించే అనుభవం

ప్రకాశ మాన ఉదయంతో రోజు మొదలయినా
కత్తిరించవలసి ఉన్న చీకటి రిబ్బను లెన్నో
ఆగని ఆశలు విశాల జలనిధి లహరులు
దప్పిక వేస్తే, ఇవి అద్దాల కేసులో బొమ్మలు

చేయి బ్యాగ్‌లో మంచి నీరు బాటిల్ కై
నడక భూమిపై నీటి వనరుల వైపు

మనిషిలో వెలుగు నీడల రూపం ఏదయినా
తెర చాటుగ కావచ్చు ! కానీ అంతరించదు

రవి కిరణం మాట్లాడుతుంది ఉత్తేజం నింపుతుంది
శశి బింబం మాట్లాడుతుంది హ్లాదం నింపుతుంది

చీకటిలో దోష మెవరి దయినా కావచ్చు
ఎవరికి తెలియదనుకునే ధీమాతోను

గగన విహరణంతో దివితో బంధం
జల సేచనతో అవనితో బంధం
ఎప్పటిదో ఇప్పటికీ పేరు నిలుపుకునే
మేఘం ! చిర సమాజ మానస చిహ్నం

ఒక క్రమంలో వచ్చి పోయే రుతువులు
అనుకోని మిశ్రమ గుణాలతో బ్రతుకులు

ప్రతి సందర్భంలో ఇరు వైపులతో
ప్రవహిస్తుంది అనుభవ రూపం
పొంగి పొరలి గట్టు దాటి తరలి
విపుల సమాజాన్ని ఆవహించాలనీ

18. ఈ రోజు నాకై నాదే

ఈ దివసం నాకై, నాదే అన్నట్లుగ ఉంటుంది
మరునాటికి గతమై మేలై అందరి దవుతుంది

ప్రతిభ సృజన కళా రూపం శిఖరమై
కవిని నిలుపుతుంది, యశో గంధంతో

శబ్దాలను మోసుకొనీ కదలుతుంది గాలి
ఆప్తంగా మనిషి మనిషి చెవిని ఊదుతుంది

యుద్ధానికి విముఖం, శాంతానికి సుముఖం బౌద్ధం
యుద్ధం 'కర్తవ్యం లో భాగం' అంటుంది గీత

ఆదర్శం వేరు అనుభవ వాస్తవాలు వేరు
ఇరు రెక్కలపై సమాజ వాహనంతో కాలం

వికాస విభవాలకు లౌకిక వ్యూహాలు చరిత్రలో
కష్టాల పయోధిని దాటిస్తుంది, మనో విహంగం

మేధో సౌధం మొదలు హృదయ పదం దాక
ఊహ నుండి అనుభవ తటం వరకు
మధ్య చిన్న గేటు రక్షణ పరిసరాలతో
అయినా జరిగేది అదే, ప్రేలిన ఆయుధ శబ్దం

శాంతిని కోరే జనత, అశాంతిచే చుట్టబడీ
జరిగే దేదో తెలియని తంత్రంలో రహస్యం

చరిత్ర పుటలలో పదే పదే శాంతి సందేశం
సమాజ కథలో వ్యథా భరిత వికల పరితాపం

19. చేతులెన్ని పనులలోనో

బహు కాలంగా నిరాకృతు లయిన దీనులు మూలల
ఇపుడు సమాజ చలనంలో పురస్కృతులతో దళితులు

ప్రజాస్వామ్య స్వేచ్ఛలో రాజ్యాంగం నిర్దేశంతో
హక్కుల ఉపయోగంలో సమాజ బంధం కొత్తగా

ఇది మానవ సూత్రంలో మార్పులతో అభేదమై
ఆచరణ తలంపై శ్రమ న్యాయం కోరేరు

శాంతి పథంలో ! మానవ హిత దిశలో పయనం
ప్రపంచ నిజ బంధువుగా సత్క్రియకే ప్రాధాన్యం

సంస్కర్తలు త్యాగధనులు ఉద్యమ విప్లవ శిఖలు నుండి
సమాజ చింతనలో వికాస దశలో ఉపదలు, అమేయం

బుజంతో బుజం కలిసి నడచేరు సమతతో
స్వేచ్ఛలో రోజు కెన్ని పనులో ! ఆ చేతులతో

ఆశీస్సు నుండి అభిభాషణం వరకు ఏ రోజూ
నిశా జలధి తీరం చేరుతుంది మనసు భద్రంగా

ఉదయానికి పదును తేలి, పేద స్వరం ధ్వనించేను
చేతు లెన్ని పనులలోనో! శ్రమ జీవన బంధువులు

హృదయం తాకే స్పందన ! తృప్తి తటంపై నిలిచేను
మార్పు వస్తుంది శాంతి మెడలో పూల దండతో

నిశా మౌన బంధం సడలేను
నిశ్శబ్దం నాద మయం అయ్యేను

మనసు పాదు నుండి వెలుతురు తీగెలు
దిశల అంచుల నుండి పందిరి అయ్యేను

మరో ఉదయంతో కొత్త జగత్తు పై కోరిక
రాలే కన్నీటి చుక్క, పూవుగ మారేను

20. మనసు విమర్శలో

ఇంటి ముంగిలిలో బయట కుర్చిలో తీరికగా
చేతిలో కాగితంపై కవిత! సృజన పంక్తులతో

కూర్చున్న కవి దృగ్వలయంలో తుమ్మెద స్వేచ్ఛగా

నాద ఝరితో దగ్గరయిన కొద్దీ, సాంద్రమైన
ఝంకార ధ్వని విశేషం ! చెవులతో పాటుగ
దృష్టిని ఆకర్షించేను ! నిరంతర స్వర భ్రమణంతో

నా చుట్టూ పలు మారులు తిరిగి చెవికి దగ్గరగా
వస్తుంది చనువుగా, మాట్లాడే పురామిత్రం వలె

భయాక్రాంత స్థితిలో చేయి చకితంగా
పక్కన ఉన్న వార్తా పత్రిక నందుకొనీ
అటూ ఇటూ విసరే గాలికి సారంగం
వడి వడిగా దూరం వెడలి పోతుంది

దగ్గరగా రాకముందు దూర దూరం నుండి
మనసుకెంతో ప్రియంగా భావితమయింది
దగ్గరకు వచ్చేస్తే కుట్టేనని భయం! పొంగుతుంది
విషమ భావ బంధంలో మనసు చిక్కుకునేను

ఇంటి తలుపులు కిటికీలు తెరచే ఉన్నాయి
లోపలి కెళ్ళి అందరినీ పరామర్శించేననుకున్నా

అతిథిలా వచ్చింది, మిత్రమై వెళిపోయింది
ప్రాణం కుదట పడింది, మనసు విమర్శలో పడింది

వచ్చిన తుమ్మెద నా కోసం కాదనిపిస్తుంది
చేతిలో కాగితంపై కవితలో పంక్తులుగా
అక్షర మధు కణాల కయి ! ఆరాటంతో
అంతలో ఆత్మీయ మవుతుంది! అతీత బంధంతో

ఈవారం కవిత (రెండో భాగం)

21. వేచి చూడవలసిందే

సృజనకు వెల్‌కమ్ పలుకుతుంది కవితా హృదయం
బాధానల శమనంతో ఆర్ద్ర భావ చలనంతో

వడివడిగా కదలుతుంది వర్తమాన క్షణం
దశ దశలో సంక్షుబ్ధం నుండి కోలుకుంటూ

అడకత్తెరలో వలె ఇరువైపుల ఒత్తిడిలో
ఉండే వ్యక్తిత్వం కోరే సమాజం
ఎన్ని ముక్కలయ్యేది తెలియనిదీ వాస్తవం
ఇప్పటి దాక జరుగుతూంది ఇదే! చరిత్రలో

నేటి కవిత వెడలుతూంది బహువిధ నేపథ్యంలో
ఇది నాది నీది ఇతరులదీ నవ మానవ జీవన గీతం

ఈ నిద్రాణ జగత్తును జడత నుండి మేల్కొలిపే
కిరణం ! ఎపుడు బడితే అపుడు వచ్చేది కాదు

ఆర్తి గొన్న మట్టిపైన జల్లులతో జాలుల వలె
సికతా రాసుల మధ్య వర్షపు వాకల వలె

అక్షర పంక్తులు కవితలో జనహిత ధునిగా
విప్పారిన పూల పరిమళంతో, వికసించిన మానవ తేజంతో

సంఘంలో ఎన్నిసార్లు లోక యాత్ర జరిగినా
సృజనకు అవకాశం ఎప్పటికీ మిగిలే ఉంటుంది

వ్యక్తి తీరు సంఘ నీతి ఇరువైపుల నుండీ
కవుల దృష్టి భేదంలో పరివర్తన కోరేను

వ్యక్తిలో బలహీనత లొకటొకటి
జీవన గమనంపై ఒత్తిడి పెంచేను

పూవును తుంచేందుకు చేయి కదలుతుంది అల వలె
ఆ స్థానంలో కుసుమం కయి వేచి చూడవలసిందే

22. ఎండిన గంధంతో

మజిలి మజిలికి దారిలో స్మృతి శకలాల వలె
అక్కడక్కడ పడి చెదరిన గాజు ముక్కలు

ఎవరి చేతి నుండి జారి పడిన వస్తువో ?
ఎవరు విసరిన రాళ్ళకు గురి అయిందో ?

చింతన లో ఒక్కొక ముక్క తీసి చూచి
రాసులుగా పక్కకు చేర్చే లోపల
మరో మనిషి ముఖం కనబడుతుంది
ఒక్కొక ముక్కలో ఒక్కొక కోణంలో!

ముక్కలన్ని ఒకచోట చేరిస్తే వివిధ ముఖాలతో
సమాజ రూపం తోచేను మహా దర్పణంలో

ఆ సమయం ఏది నిజం? ఏది భ్రమ ! సందేహంలో
కవుల మనో భూమికలో బింబాలకు చోటు కవిత

సందేహం ఊయెలపై ఊగుతుంది ఆలోచన
చలనంలో ముఖాల్ని గుర్తు పట్ట రానంతగా

పెను గాలికి పక్షి గూడుతో చెట్టు కొమ్మ
పెళ పెళ విరిగి భయ శబ్దంతో దగ్గరలో పడేను

పక్షి గూడు భద్రంగా ఆకుల మధ్య అల్లబడీ
పక్షుల కలకలారావంతో అంతా యథా తథం

ఈ సమయంలో మనిషికి మాత్రం కళ్ళ ముందు
జరిగేది! చూస్తూ ఉండడమే, చూడక తప్పనిదీ

తన దాకా వచ్చినపుడు గాని తెలియని విషయం
ఎండిన గంధంతో మానవం పూలను పూచేనా?

23. నిరీక్షణం తప్పదు

పై నుండి నీలి మబ్బులు ఆశీస్సులు అందించేను
దిశల నుండి చల్లని గాలి మనిషి ఎదను హత్తుకొనేను

అనలాన్ని అనలం అణచ లేదు, ఆర్పలేదు
హింసకు ప్రతి హింస సమాధానం కాదు

ఉద్రేకంలో ఆలోచన, వర్తనలో అగ్ని సమమయ్యేను
నీలి మబ్బు రాకతో జలకణాలతో శ్రమ చేతన పూచేను

కంటకమై ప్రశ్న! బాధించవచ్చు
కుసుమ గుచ్ఛమై జవాబు రావచ్చు

ఆయుధమై ప్రశ్న ప్రేలితే ప్రమాదం
ఘర్షణ తెచ్చే సమస్య మహాదారుణం

ఎడారిలో పరిచయానికి మనుషుల
దరిద్రం గురించి చెప్ప నవసరం లేదు

నిప్పులతో ఆట లాడే
నేతలకు ! నీళ్ళతో పనిలేదు

జీవితాని కేది మంచిది? ఏది అవసరమంటే
అనుభవ పత్రంలో జవాబు తోనే తెలుస్తుంది

చేలికి కాచుకునే ఆహారం వండుకునే ప్రయోజనాలతో
అగ్నికి పెద్ద పీట వేసేరా? అంతస్తత్వం గురించి మరచేరా?

పూపును చిదిమి వేయడం క్షణంలో పని
అదే చోట నయితే మరో పూవుకై నిరీక్షణం తప్పదు

24. చిత్రమయం

ఎడారి మేటల మధ్య వాన చినుకుల చాలు వలె
చీకటి ముఖాన వీధి దీపం వెలుతురు వలె

అక్షర నిలయంలో కవిత నవ కళా మయం
తోటలో పూల వలె మదిలో జ్ఞాప కాలొకటొకటి

పూవును చిదిమి దీపంగా మలచేరా?
దేని ప్రత్యేకత దానిది పరిమితులలో

గ్రీస్మంలో తరువు నీడ జ్వాలాకృతి పొందేనా?
చెట్టు ఛత్రమై నిలవచ్చు! కల్పనలో మరొకటి

కవుల మనసు అన్నిటికీ సిద్ధపడే ఉంటుంది
సృజనలో అన్నీ అందమైనవే
ఏదయినా సందర్భంతోనే ఔచిత్యం

దీపం ! పుష్పం ! ఏదయినా అవసరంలో మనోజ్ఞాలు
మానసిక ప్రపంచంలోను విలువల ప్రత్యేకతలతో

భయపెడుతూ ధైర్యమిస్తూ మెరపులు ఉరుములతో
జల సంపద దించి మేఘం వెళ్ళిపోతుంది

వేదనలో అణువుణువును ఆర్ద్రపరుస్తుంది
పైనుండి భువికి సందేశం పంపిస్తుంది

కంటి నీరు తుడుస్తుంది ఆర్తిలో పవనం
చల్లని స్పర్శతో హ్లాదమయం చేస్తుంది

కొండలలో దాగిన చేతన మేల్కొని తరలే
నదిలా కదలుతుంది సమాజంలో కవిత్వం

తెలుపు నలుపు ఎరుపు రేఖలతో చిత్రమయం
కాలం! ఇతరేతర రంగులతో కలిసి జీవితం!

25. వాస్తవ తలం పైనే

కాలి బాట సన సన్నగ పొడవుగ మలుపులతో
మలకలు తిరుగుతూ నదిలా తీగెలా సాగుతూ

కదలుతూన్న ఫణి భ్రాంతిని కలిగించేను మనిషిలో
రైలు ప్రయాణంలో ప్రకృతి! వెనుకకు పోయే అనుభవం

జీవన చలనంలో వాస్తవం! కలలలో కల్పనలు
కోర్కెల ప్రతీకలయి అనుభవ లోకం కొత్తది!

నాలుకపై అనుకోని అమృత బిందువు జారవచ్చు
చేతిలో ఊహించని విషం పాత్ర చేరవచ్చు

చూపు పడని వైపు నుండి కత్తి దూయవచ్చు
పయనంలో స్వాగత హారతి ఎదురు కావచ్చు

తరిమిన కొద్దీ చీకటి దూర దూరం జరుగుతుంది
ఆగే సరికి ముందుకు వచ్చే యత్నం చేస్తుంది

చీకటి ఉన్నంత వరకు చేతిలో దీపంతో
పనులు తప్పవు ఎవరికైన! ఎంతటి విజయంలోనూ

గులాబి పూవుకై చేయి చాచి మనిషి
కంటకాల కాపలా చూచి వెనక్కి మరలేనా?

నీడను నమ్ముకొని నిలయం మరచే దెవ్వరు?
ఎన్ని హంగులు అమరినా ఏదో తక్కువ అనిపిస్తుంది

తోడు మనిషి నుండి విశ్వ మిత్రం దాకా
పయనంలో అడుగులు వాస్తవ తలంపైనే

26.

ఒకసారి ముద్ర పడితే చెరగని దారియై
అడుగు తీసి అడుగు వేసే లోపల వర్తమానం

అనల గానం కన్న ప్రతి హృదయంలో
అమృత రాగం వినబడాలని ఆశ

బ్రతుకులో వదలని భౌతిక మానసాలొకటొకటి
కలలలో స్వేచ్ఛగా తిరగాలని పొంచి పొంచి

బ్రతికినంత కాలం ఈ భూమితోనే బంధం
ఆపైన తెలియని దానిని గురించి ఆలోచన
కల్పనలో కాలం గడుస్తుంది! బహు వేగంగా
రిజర్వులో సుఖాలు సిద్ధ పరచుకునే యత్నంలో

చిన్నదో ! పెద్దదో ! కంటికి కనబడని
జ్వాలా సంచారం ప్రతి గుండెలో

ప్రభావాల అనుభవాలు కొందరిలో
కవి హృదిలో మాత్రం! అక్షర దీప్తిలో

ఆహుతిలో ప్రతి వస్తువు బూదిగా
మారుతుంది చిట్ట చివరి మెట్టులో

మాయనిది ఆరనిది ప్రకాశ రూపం
అమృత చిహ్నం! కవిత లోనే సాధ్యం

కోరిక ఏదీ మిగల కుండ ఏ మనో రూపం
పూర్తిగ ఆకులు రాలిన నగ్న తరువు కాదు

27. ప్రగతికి ప్రేరణగా

బాధల బరువును ఒక పక్కకు నెడుతుంది కవిత
మనసుకు నచ్చిన దస్తులు కొత్తవి తొడుగుతుంది

లేలేత రశ్మిలా సహృదయులలో అనుభవ కళ
అపూర్వ సందర్భం! దొరకినట్లు ఉంటుంది

సౌందర్యం ప్రేమ కలిసిన మనోజ్ఞం
ఉన్నతికీ విపులతకూ దారులు చూపేను
దీనికి ప్రతినిధి ఒకటే " స్త్రీ " రూపం
గుణ వర్తనలో ఎదురుగ ఏదీ నిలువదు

ప్రతి దార్శనికంలో ఎంతో కొంత నిజం
వజ్రం లానో పద్మంలానో ఉనికిని చాటుతుంది
బయట పడని తరాల ఖజాన వలె మనిషిలో
మెరపు లానొ కత్తిలానొ పని చేయవచ్చు

చేతిలో పెన్ను అమాంతం ఆయుధమై
అడవి నాశ్రయించడ మొక విచిత్రం

అనల కిరీటంపై ఉబలాటం కొందరిలో
రవి కిది ప్రత్యామ్నాయంగానూ తలచేరు

వికాస దశలలో పొందిన సమాజ సంస్కృతి
వ్యక్తిత్వంలో భాగం! ఏ కవి దీనిని వదలి వేసేను

అన్నిటిలో మేలైనవి కలిసిన వ్యవస్థ ప్రజాస్వామ్యం
అగ్నుల నార్పే జల యంత్రం వలె ఎప్పటికీ సిద్ధంగా

మనసుకు పరితృప్తిగ ప్రగతికి ప్రేరణగా బ్రతుకులో
అర్థానికతీతమైన భావమయం దార్శనికం కవితలో

28. ఆమర రూపం

ఒంటరిగా ఉన్న మనిషిలో బయట దారిలో
గిరులు నదులు చెట్లు శిలలు మాటలాడతాయి

ఒంటరి భావనలో మనసుకు మంచి కాలక్షేపం
ఇవి మనిషికి తమ వనరులు అర్పిస్తాయి

సమజాన్ని విడదీసే మొదటి కారణం
చినిగిన దుస్తులు ! పనిలో మట్టి చేతులు

మనిషి మనిషినీ కలిపే సహజ కారణం
ఆపదలో ఆదుకొనే మానవ హృదయం

అహంకార పీఠం పై ఉన్నంత వరకు
ఏమయినా జరగ వచ్చు, నిరంకుశ గతిలో

అహం క్రియను స్వార్థంలో తిప్పే మది నుండి
ఏదైనా జరగవచ్చు నీతులతో బోధలతో పైపై వేషంలో

ఎన్ని చెప్పినా బ్రతుకులు తమ తమ వలయాల్లో
లౌకిక చక్రంపైనే భ్రమణం నిరంతరం

బీటలు వారిన ధరిత్రి కలిసేదీ, పంటల నిచ్చేదీ
ఉదార హృదయంతో జలదం కరుణిస్తేనే

కశ్మలం కల్మషం దోషం నేరం నుండి ముక్తమైన
మనో భూమికలతోనే, విలువలతో మానవ చరిత్ర

ఉద్వేగం నింపుతుంది జడతలో చేతన
ఉత్తేజం కలిగిస్తుంది స్తబ్ధతలో కిరణం
మనిషిలో ఆయువును సార్థకమొనరించేను
బ్రతుకులో ఆమర రూపం బయటకి వస్తుంది

29. వెలుగు దివ్వెతో

జలధిని దాటే సమయంకై వేచి ఉన్న మనిషికి
అలలు లెక్క పెట్టడం తోనే సరి పోయేను

లెక్కలు తేలే దెప్పుడు? పయనం సాగే దెప్పుడు?
బ్రతుకులో పయనం సమయం సందర్భం తోనే

గాలికి ఏ వార్త అయినా ఒకటే మోదమో ఖేదమో
వహిస్తుంది సహిస్తుంది జాగృత్తగా ముందుకు తరలుతుంది

ఉదయం తూరుపు దిశలో రాత్రి కన్న కలలు
దగ్ధం అయ్యే చిత్రం ఏ రోజు మనిషి మనోగతం

విప్పారిన వాస్తవాను భవం పద్మం వలె తోచేను
ఎవరికి వారు తెలిసీ తెలీకుండా మరొకరితో పోటీ

గేటు వద్ద పూల తీగె చుట్టు తిరిగే తుమ్మెద
పూల నుండి మధు కణాలు గ్రహించే యత్నంలో

మనుషులు పొందే హెచ్చరికలు బోధలుగా మారేను
శ్రమ శక్తికి ప్రేరణయై రవి కిరణం స్పృశించేను

శిథిలాలపై రవి ప్రకాశం ! సానుభూతి కరాలతో
కదలే మనుషులలో "శాంతి" మాత్రం ధ్వనించేను

నవ నిర్మాణంపై ఆలోచనా విహగం ఎగురుతూంది
మనుషుల ఆశలు మోసుకొనీ గగనం తాకాలనీ

కళ్ళు మూసుకుంటే చీకటి తొలగి పోయేనా?
కళ్ళు తెరిస్తేనే తగిలిన గాయం కనిపించేదీ

మనోబలంతో చీకటి దాటే కోరిక! ఎప్పటిదో
వెలుగు దివ్వెతో పయనం సార్థకమయ్యే దిశలో కృషిలో

30. ఎడారిలో కారాదు

నెమలి ఈక జీవన భాగ్యంలా చేతి కందితే
అది చేరుతుంది నేరుగ పుస్తక నిలయానికి

ఎపుడైనా చింతనలో పుస్తకాన్ని తెరిస్తే
బాధను మరపించేను ఉపశమనం కలిగించేను

పయనంలో ప్రతి ఒకరు ఉన్న దాని కన్న
తక్కువ దూరంలో చేరే దారిని కోరేరు

ఆవాసంలో ప్రతి ఒకరు ఉన్న దాని కన్న
ఇబ్బడి ముబ్బడిగా పొందే తీరులు కలిగేరు

ఆహారం కావలసిన సందర్భంలో మనుషులు
ఆనందం పేరుతో ఇంద్ర ధనుసును భుజించేరా?

ఉన్న ఖాళీలలను నింపే ఉద్దేశం కన్నా
వేటితో దేన్ని నింపాలన్నది అవశ్య సమస్య

సూర్యునికి గమనంలో తేజం ఒకటే ఏ రోజూ
పయనంలో మనిషి బ్రతుకులో మారే దిశలెన్నో

ఉన్నది, సుగమ సుందర మైనది కొత్త దారిని
కోరే ఆలోచన తీగెలాగ సాగేను! మనసులో

నిశీథి ఆగమనంతో నిరాశ చెంది బ్రతుకులు
సూర్యుని ఆగమనంపై సందేహం వెలిబుచ్చేరా?

నిశా నిష్క్రమణం 'శాంత' పదంతో జరగాలనీ
దోపిడికీ హత్యలకూ నీలి తెర కారదనీ

శ్రమ చేతన నీడలో ఎవరి కయిన అవకాశం
ఎడారిలో నాటిన విత్తుల బ్రతుకులు కారాదు

31. ప్రశ్నలుగా

ఉదయం మండుతూ ఉన్నట్లు కాల్పనిక స్థానంలో
సజీవ స్పందనలో సృజన రూపం సమాజంలో

శ్రమ భావనతో సమాజాన్ని మేల్కొలుపుతుంది
గుండెకు జీవ నాదంతో ఆయువు పెంచుతుంది

సృజన విలయ దృశ్యాలు ఆకర్షణ అపకర్షణలో
అనుభవ రమణీయాలు, జీవన యాత్రా బింబాలు

ఎవరి పనులలో వారు తల ఎత్తలేని వ్యాపకాలలో
తల ఎత్తి చూస్తే, కర్మ సాక్షితో సంభాషణ జరగవచ్చు
ఎన్నో జ్ఞాపకానికి రావచ్చు
అణగిన చీకట్లు మళ్ళీ లేవచ్చు

భూమి అనగానే మట్టితో తక్కువ భావన
గగన మనగానే అందని ఎక్కువ భావన

చెట్టుకు పూచిన పూవు కాదు
కొమ్మకు వ్రేలే ఫలం కాదు,
స్నేహం ప్రేమ అనుభవంలో
సుందర మనోజ్ఞ రూపాలు

నేను ఎవరు? అన్నది ప్రపంచ సంబంధాలను
నిలిపే పంచే మానవ చరిత్ర ప్రతినిధి

స్వేచ్ఛకు అవకాశంతో దూరదూరం వెళ్ళే మనిషి
నిరంకుశం వలయాకార రేఖపై తిరిగేను

కల్పనలో కత్తులు దూసి వీరులుగా తేలేరా?
అణగారిన బ్రతుకులు మొలకలయి ప్రశ్నలుగా మారేనా?

32. చేక్కలవలె జ్ఞాపకాలు

చెట్టుకు మూలం మట్టి నుండి మొలక పెరిగి
వీడని జీవన బంధంతో బ్రతికేను

దీనితో ముడి వడింది తన భవిత
మేఘంకై నింగి వైపు చూచేను
నింగి వంగి జలధి వైపు చూచేను
నడచే మనిషి ఇంచు మించు ఇంతే నీరువైపు

మనుషులు మరచే ఉదార కరుణలతో మేఘం
ముక్కలయిన గతాన్ని ఒకటిగ చూపుతుంది
ఒక్కటిగా ఉన్న దాన్ని ముక్కలు చేస్తుంది
క్రుంగిన బ్రతుకుల్ని పైకి లేవచేస్తుంది

మనసులు మరచే అంతఃకరణంతో అతీతం
జ్ఞాపకం వస్తుంది, ఇందులో రహస్యమేమీ లేదు
అంతా బట్ట బయలే! స్పష్టంగా
బిందువు నుండి చిత్రం వరకు

బయట మనుషులు మేడలు దారులు దీపాలు
దృశ్యం వెనుక ఆలోచన ! మానవ చేతనతో

త్యాగం మూర్తీభవించిన తరువు ముందు
మనిషి! కావలసిన దాని కయి చేతులు చాచేను

మనిషిలో తాను రవి కిరణమై నడవాలని
చెట్టుకు తన వద్దకు మనుషులు రావాలని

నిశ్శబ్దం నుండి శబ్దం వెడలుతుంది
గాలిలో పాటగా వనంలో లేడిలా
దేహంతో మనిషిలో ఊపిరితో ప్రాణం
శబ్దంలో భావజగం చేక్కలవలె జ్ఞాపకాలు

ఎన్ని ఉన్నా ఎంతగా పై చేయి అయినా
మనిషి తన కథలో కీలు బొమ్మ మాదిరిగా

33. క్రియా రూపం ఎక్కడ?

శ్రమ చేతనలో ఆలోచన అన్వేషణ నిరీక్షణ
తప్పని బ్రతుకులో దేనినో కోరేను, మరేదో పొందేను

జరిగే వాటికి సమాధాన పడుతూ పోతుంది జీవితం
కవిత! వాస్తవాను భవంలో ఎద ఎదలో ప్రతిఫలిస్తుంది

శిశువు ముఖంలో స్వచ్ఛమైన నవ్వుకోసం
ఉదయ కిరణంలా కదలాలని మనిషి
నీడ ఉంటుంది తోడుగా కాచుకొనీ
తెల్లని పూల చెండులా సమయం గంతేస్తుంది

నిశ్శబ్దం నుండి శబ్దం
చీకటి నుండి వెలుతురులా
అనుభవ వాస్తవ దృశ్యం
ఎప్పటికీ సాగుతుంది ప్రవాహంలా

దేహంతో మనిషి ఊపిరితో ప్రాణం
శబ్దంతో భావం ! సృజనతో ప్రపంచం
చల్లిన పూలవలె మెరసే చేక్కలవలె
భద్రంగా స్మృతులు సందర్భంకయి వేచి

ఆ లిప్తలు ఝుంఝు వలె వెడలవచ్చు
ఆ క్షణాలు గంధ పవనం వలె తరలవచ్చు

కవిలో భావ జగం కవితలో బింబించేను
మనిషి వీడినా, మనిషిని వీడని వెన్నో

స్వతంత్రమైన మనిషిలో స్వేచ్ఛా చరణంలో
కోరిక యే లేంది క్రియా లోకమెక్కడుంది?

34. ఏమయినా ఎపుడయినా

ఎవరికి వారు తమతమ పరిచయాలతో సరిపోదు
తాము చేసే పనుల నుండి సుఫలం చేకూరాలనీ

శ్రమ గతిలో విజయ పతాక రెపరెపలాడాలనీ
ప్రతి ఒక్కరికీ సమ న్యాయం చేకూరాలనీ

కవితలో శబ్దం అమృత భావ నిలయమై
మృత్యువును మిత్రంగా మారుస్తుంది లిప్తలో

కవితలో శబ్దం సూర్య కిరణ స్పృహతో
చీకటిని వెలుతురుగా తీరుస్తుంది క్షణంలో

అడవి ఊరు పట్టణం త్రిదశలలో
అనుభవ మొక వాస్తవ చలనమై మనిషిలో

నిర్మాణానికి చేతులు చాచిన సమయంలో
శుష్కమైన చెట్టు కొమ్మ పచ్చదనం చూపేను

ఆకు పచ్చని బయలులో నడచిన అడుగులు
అడ్డు పడే నిప్పు రవ్వలపై నడవాలిసి వస్తుంది

ఎప్పుడయినా ప్రకృతి తన మనసు విప్పుతుంది
అమ్మ లాగ మాటలాడుతుంది పచ్చ పచ్చగా

ఎవరూ మరొకరిలా ఉండ నవసరం లేదు
తమ అస్తిత మూల మేదో దాన్ని నిలబెడితే చాలు

ఏమయినా కిరణమై నడవాలని మనిషిలో
ఎపుడయినా మేఘమై కనిపించాలని మనసులో

35. వర్షంతో

ఉత్సాహం ఉద్రేకం ఉద్వేగం విపరీతం మనుషులలో
అనుకోని ఘటనలతో వ్యవస్థలు తారు మారయ్యేను

ఒక వైపున అడవిలో పరచిన పచ్చని పరుపు నేలపై
రాలిన నెత్తురు చుక్కలు, క్రిందికి దిగిన చుక్కలవలె

హృదిలో నుండి జ్వాల పైకి లేస్తుంది వేదనలో
పెదవులపై మాటలు, కవితాలోకం పొందేను

చేయి చాచి ఆకాశాన్ని కొలవాలని ఒకరు
నడక సాగి దేశాలు చుట్టి రావాలని ఒకరు

ప్రతి వ్యక్తిలో తనదైన ప్రమాణాలతో
విలువల నిర్ధారణ జరుగుతూంది కవితలో
కవిలో సృజన కోణం మారిపోతూంది
హృదయం సరికొత్త దృశ్యంతో నిండుతుంది

మంచి చెడు ! విభజన రేఖలతో బ్రతుకులు సాగవు
ఊరు నుండి ఊరుకు, జీవన సుఖ సౌభాగ్యం కోరేరు

సమస్యతో కలహానికి, కలహంతో ఘర్షణకు
దీని నుండి హింసకు, దారులు పలువైపుల నుండి

శ్రమ జీవికి ఊరయినా నగరమయినా ఒకటే
ఆహారం ఆవాసం వసనం అవసరా లొకటే !

పెదవులపై శబ్దం పాటగా వెడలుతుంది
ఎక్కడికి వెళ్ళినా అదే ప్రకృతి, అవే పాత్రలు సమాజంలో

ఎంతటి అతిశయ స్థితులలోను ఆక్రమణంలో
మేఘం కోపంలో పిడుగులు వదలవచ్చు వర్షంతో

36. సృజనలో స్వాగతం

అనుభవంలో ప్రజాస్వామ్య సంస్కృతి రూపం
పురా స్థితుల నుండి వర్తమాన దశల వరకు

జవ వాక్యం శిరోధార్యమై ఎన్నికలతో
అన్నిటికీ తనలో ఇముడ చేసుకునే వ్యవస్థ

గాలి కదలి నంత మేర గళ ధ్వనికి స్వేచ్ఛ
వివిధ దశలలో దిశ దిశ దేశాలు విస్తరించేను

రవి బింబం ప్రాణిలో తేజాన్ని నింపుతుంది
శశి బింబం జీవిలో హ్లాదాన్ని పరుస్తుంది

సమాజ కర్తవ్యంలో భాగమై నిరంతరం
ఆశకు వేలాడే కోర్కెలతో వర్తమానం

ఉన్న వారికి లేని వారికి కిరణ స్పర్శ ఒకటే
దృక్పథంలో అభిలాషతో అనుభవం వేరవుతుంది

గుడిసె అయిన మేడ అయిన నీడ అయిన
వీధి కార్నర్ అయిన పౌర హక్కులు ఒకటే

వెన్నెలలో పాట పొంగులా ఉబికి వస్తుంది
తెరచిన కిటికీ నుండి స్వరం లోనికి వస్తుంది
వెలుతురులో కవిత మబ్బులా ఆవహిస్తుంది
విపుల హృదయ వనిలో, పూలతో మాట్లాడుతుంది

పుస్తకంలో ఎపుడొ దాచి ఉంచిన నెమలి ఈక
తెరచి చూస్తే ! తనలో కళాత్మకతను మెరపిస్తుంది

స్మృతి రేఖలతో మనస్సు చిత్రం అవుతుంది
కొత్త దారి సృజనలో స్వాగతం పలుకుతుంది

37. జవాబులతో

మౌనంగా ఉన్న చెట్టుపై పక్షుల సందడి
ఉదయం సాయం వేళలలో కలకలారావాలు

చెట్టుతో మాట్లాడుతూ ఉన్నట్లే ఉంటుంది
నిశ్శబ్దంలో శబ్ద సుందరమై కాలక్షేపం జరుగుతుంది

మనిషి జీవితం తనకన్న తన చుట్టూ ఉన్న
మనుషుల సంబంధాలతోనే బహు విస్తృత మవుతుంది

ఏ పనిచేత, దేని విలువలు తగ్గేదీ పెరిగేదీ
తెలియని అమాయకంలో మనుషులు వర్తించేరు

ఎప్పటివో ప్రశ్నలు ! ఇప్పటికీ సజీవంగా
సరి అయిన జవాబులు దొరకక కొన్ని

సరి పడక కొన్ని ! శూన్య ముఖాలతో కొన్ని
ప్రశ్న లేక పోతే జీరో స్థాయిలో వికాస చరిత్ర

స్వార్థంతో కుంచితమై జీవన రూపాలు
విశాలతను కోల్పోయి తెలియని స్థితిలో

మనుషులు నడచే విగ్రహ రూపాలు కారు
జవాబులతో ఎగిరిన విజయ పతాకలెన్నో

ప్రకృతిలో వస్తు చయంలో కొన్నిటిని గ్రహించి
గుణాలతో ఖాళీలను పూరించుకొనేరా?

ప్రతి బ్రతుకు వెనక శ్రమను ప్రోత్సహించే
వాస్తవ శక్తులతో సమాజం! వ్యక్తిపై దృష్టితో

ప్రకృతికి సమాంతరం అనిపించేనా బ్రతుకులు
దేని కదే స్వతంత్రంగా, స్వేచ్ఛా జీవన గంధంతో

38. వాస్తవానికి దీటుగా

పిడికిలిలో బంధించిన నీరు
ఏలాగో సందు చేసుకొని
వేళ్ళ సందులలో నుండి జారేను
తన జన్మ స్థానం చేర లేక పోయినా
బంధన నుండి విమోచనం సంతోషకరం
స్వేచ్ఛా జీవన రూపంతో ప్రాణాధారమైంది

పిడికిలి విప్పగనే తడిసిన అరచేయి
మనిషిలో తరిగిన ఆర్ద్రతను జ్ఞాపకం చేసేను

దాహం తీరే ఒక గ్లాసెడు నీరు
జలధిని ధిక్కరిస్తుంది, ఉపకృతి సూచిస్తుంది

రాలిపడే ఒక కన్నీటి చుక్కతో
జలధి అడుగు వెనక్కి వేస్తుంది

చేతిలో చిక్కిన చేక్కని చిలుక
ఎగిరి పోయే ఉద్దేశంతో వేచి ఉంది
గోముగా దువ్వుతూ ప్రేమను చూపే
మనిషిపై నమ్మకం చిగిర్చి నిలుస్తుంది

పంజరంలోకి బదిలీ చేయబడీ
వేళకు ఆహారం, భద్రత ఆవాసం

మధ్య ఇనుప సువ్వలు తగిన రక్షణలో
నేర్చిన అదృష్ట శిక్షణలో మాటలాడుతుంది

మనిషి బ్రతుకులో వాస్తవ చలనానికి దీటుగ
పరివారంలో స్వేచ్ఛగ ఒకటయి పోతుంది

39. సూచనలిస్తుంది

పడవ కదలేందుకు జల తలంవలె
ప్రగతికి వాస్తవిక స్ఫూర్తియే ప్రధానం

నడకలో అడుగు జాడలు వెంటరావు
ఎక్కడి కక్కడ నిలిచి సూచన లీయవచ్చు

గడ్డ కట్టిన మంచు ముద్దలా సందర్భం
కాస్త వెచ్చని రశ్మి సోకె తేనే కదలుతుంది

ఎవరో వెనక నుండి తోస్తే అయ్యేది కాదు
సమాజ చింతనలో ప్రగతి తోనే సాధ్యం

కాలాన్ని పట్టుకొని ఆయువు సాగుతుంది
సృజనలో కవితకు రవి కిరణం ప్రేరణం

యానంలో స్మృతి విశేషం మిగులుతుంది
అనుభవంలో సుందరతను పెంచుతుంది

బ్రతుకులో ఏది తొలగినా లోటులోటే !
దీన్ని గురించి లౌకికం జరుగుతుంది మనిషిలో

చేతిలో పాశాన్ని బయట గేటుకు తగిలించి
విరామ దశ లోకి వెళుతుంది మృత్యువు

అద్దంలో బయటికి కనిపించని అంతరంగం
లో నుండి మనిషికి ధైర్యాన్ని ప్రసాదిస్తుంది

అంతరంగ దీప్తికి కనబడేను లోని మనిషి
అద్దంతో పని లేకుండానే, అవసరం తీరుతుంది
మాటలాడుతూనో పాట పాడుతూనో
మరో చూపు పడే చోటుకు సూచన లిస్తుంది

40. కావలసింది

స్వేచ్ఛా కవితలో దార్శనికం అనివార్యం
జీవన వాస్తవ చేతనతో కళామయం

ఈ రోజు అవసరమైంది అగ్ని గీతం కాదు
దగ్ధమైన ధరణిపై పచ్చదనంలో చేతన రాగం

ఎదురుగ గేటుపై వాలిన పాల పిట్ట
'బొకే'ను తలపిస్తుంది శుభ పరిణామంగా

సాధారణ జీవితంలో ఆయుధాల ప్రసక్తి ఉండదు
సహన శాంత ప్రేమలు కోరే వాతావరణంలో
మట్టి ముద్దకు ఆకృతిని ఇచ్చే చేతులు
పనిలో కళతో, కొత్త లోకం చూపించేను

ప్రాణం ఉన్నంత వరకు పరిజ్ఞానం ప్రబోధం
రెండిటి సుగమ సుందరతతో జీవితం ముఖ్యమై
మబ్బులు క్రమ్మిన సూర్యునివలె అపుడపుడూ
విషాద ఛాయను పొందవచ్చు అంతరంగం

నిన్న కత్తిని పూనిన చేతులు, విరామాలతో
నేడు బాంబులు విసరేను హఠాత్తుగా

ఎవరికి వారు జీవితాలలో స్వతంత్రంగా
తమ తమ ప్రత్యేకతలతో, కోరేవి ఎన్నో?

రేపటి సూర్యుని ఉదయంపై నమ్మకంతో
ఆదర్శ శిఖరాలపై మనిషి ఊహలు కదలేను

ఇపుడు కావలసింది, అగ్ని గీతం కాదు
జడతను చేతనతో నింపే అమృత గీతం

స్వేచ్ఛా కవిత్వం - 115

గుడ్ బై

మాదిరాజు రంగారావు

2021

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

115 SWECCHA KAVITHVAM

Free - Verse

GOOD BYE

Telugu

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2021

Presented to
my Son
Dr. M. Santhosh Kumar
on his Birthday
with affection

పీఠిక

స్వేచ్ఛా కవిత్వంలో 115 "గుడ్ బై" కృతి, ఈ కవి చివరి సాహిత్య దశకు చెందింది. సాధారణ జీవన తలంపై వాస్తవ స్థితిగతులకు అవకాశం కలిగింది. ఉన్నతమైన ఆదర్శంతో ఉత్తమమైన విలువల్ని వ్యంజింప చేస్తూంది. దార్శనికంలో ప్రజాస్వామ్య సామ్యవాద లక్ష్యాన్ని సూచిస్తూంది.

ఈ ప్రక్రియ తెలుగులో బహు విశాలమైన క్షేత్రాన్ని ఆవహించింది. ఇందులో (1) సమాజం (2) ప్రకృతి (3) వ్యక్తి – వ్యక్తిత్వం (4) మనో విధాలు – ప్రవర్తనలు, ఈ నాలుగు దిశా స్తంభాలపై ఆవిష్కృతమయింది. ఇందులో మానవ జీవితంతో పాటు సమాజం గురించి ఆలోచన స్థానికం నుండి ప్రాపంచికం వరకు, వివిధ సందర్భాల్ని ఆశ్రయించింది. రచనలో విషయ నిర్వహణం వెనక సారభూతమైన తాత్విక ఛాయల్ని గమనించవచ్చు. ఇవి హేతుదృష్టిలో తీర్చబడినాయి.

వర్తమాన స్థితిగతుల ఆలోకనం ఆధునిక భావోన్మీలనాన్ని పొందింది. ఇది ప్రగతి శీల స్ఫోరకమయింది. ఇందులో సృజన చేతన అక్షర పద వాక్య ప్రసారాలు, సంవిధానంలో అలలలోని లయను తలపించే ప్రవాహకతను అనుభవానికి తెస్తుంది. విషయ ప్రతిపాదనంలో "అంతరంగం" ప్రధానమైన పాత్ర వహించింది.

సృజనలో భావ రూపాలు ప్రతీకలు మనస్తత్వ విశ్లేషణలు కళాత్మక స్థాయికెంతగానో తోడ్పడినాయి. కవిత్వ విషయంలో వస్తువు మొదలుకొని లక్ష్యం వరకు ఏది ఉండాలో? ఏది ఉండకూడదో? నిర్ణయం కవులదే. వివిధ స్థాయిలలో పలు నేపథ్యాలతో వేరు వేరు గమ్యాలలో ఈనాడు కవిత్వం వెడలుతూంది. Directగా పాఠకుల శ్రోతల సహృదయులతో సంబంధం మంచి పరిణామ విశేషం. తమ తమ స్పందనల ఆధారంగా హేతు దృష్టితో సహృదయుల అనుశీలనం వివేచనం కావ్య ప్రతిష్ఠకు బాగా ఉపకరిస్తాయి. పరంపరను కాపాడతాయి. నవ్యతను స్వాగతిస్తాయి. ఇది ఆలంకారికులు చెప్పిందే. సృజనలో కొత్తదనం చేత కవిత కళాత్మకంతో పాటు ప్రయోజనపరం దృష్ట్యా మానసిక శూన్యాన్ని నింపుతుంది. ఇదొక భాగ్య విశేషం.

– మాదిరాజు రంగారావు

1. ఇదీ సంగతి

కవిత విపణి శాలలో దొరికే వస్తువు కాదు
లోన హృదయ ప్రియం, బయట విశ్వమయం

కళతో దార్శనికం సృజనలో అవసరం
ఇది రచనకు పూర్ణత కూర్చే విషయం

దేశం సంఘం ఏదయినా విజయ మెవరి దయినా
కాలంతో మారే సమాజ శైలీ పార్శ్వాలలో
ఆలోచనలో క్రియలో ప్రభావ రూప మొకటే
ప్రతి ఒకరు కోరేరు కొత్త అనుభవ రూపం

జీవితం అడవి కాదు! ఎప్పటికీ కాలేదు
విషమ ఘటనలో మృగం బయటకు రావచ్చు
బాధలలో సందర్భంలో సమాజ సుందరత చెడీ
మరచిన అడవి భయం ఆవహించవచ్చు

దీని కన్న బ్రతుకులో జలనిధి నయమనిపిస్తుంది
అలల కదలికలో ఆర్ద్రమైన హృదయంతో
దార్శనిక చేతనతో సమాజ జడతలు తొలగేను
సమస్య పరిష్కృతికి ప్రబోధ మవసరమవుతుంది

కవితకు నిలయం అక్షర పద నిర్మాణం
స్పందనలో భావనతో ప్రాణితమవుతుంది
ఆదర్శ రేఖలతో విలువలు చేకూరుతాయి
దార్శనికంతో లక్ష్యం ప్రభాత సుందరతను పొందుతుంది

అవసరానికి బ్రతుకులో సందర్భం ఎదురై
మరో పాత్రలోకి దిగవలసి వస్తుంది
ప్రతి కథలో తమ తమవిశేషతలను విస్తరిస్తూ
ఒకే గొడుగు క్రింద విశ్వమయత చాటేను

2. ఒకటి మరొకటి

సృష్టిలోని వస్తువులు ప్రాణులు వ్యక్తులు తమ చరిత్రలో
అవసరమైనపుడు తమ శక్తిని వినియోగించేరు

మట్టి అంటని చేతులతో తమ తమ జీవితాలలో
స్వచ్ఛమైన మనసుతో శుభ్రంగా ఎందరు గడపేరు

ఆవేశం ఉద్రేకంతో స్వార్థంతో
చివరి మెట్టు హింస దాక
అవరోహణలో ఎక్కడికక్కడ సిద్ధంగా
చేతనతో రవి కిరణంలా మనసులో
బుద్ధులెన్ని విధాలో ! అన్ని తీరుల ఉపాయాలు

పలు రంగుల ఉజ్వల రూపం కవిత
చేతనతో రవి బింబంలా మనసు
కల్పనలకు తావు లేని వాస్తవ గతిలో
కావలసింది ఇపుడు జీవన సౌభాగ్యం
ఆభరణంగా కాదు ప్రజాస్వామ్యం
అందని మృగతృష్ణ కాదు, అందే ప్రవాహ రూపం

ఆటవిక దశలో ప్రభావ ముద్రలతో
జ్ఞప్తికి వచ్చే చరిత్ర! అనుభవాలతో
చెట్ల మధ్య నుండి జనత నిర్మాణాలలోకి
సేవా వర్తన మిచ్చట సాధారణ విషయం కాదు

అక్షర వాటిలో కనిపించే కవిత వెనక
ఆలోచన లెప్పటివో ! చేతనలో ఇప్పటికీ
ఏకాంతంలోనూ వదలని సమాజ చింతన
వేరు వేరు పొరలలో కవిలో ఒదిగీ
అందులో ఒకటి చేతిలో ఆయుధంతో
కనబడని దొకటి బెల్టులో బాంబుతో

3. వెలుగుల సంకెల

కవిత అందరికీ చోటుతో పుష్పక విమానం
బ్రతుకులో హింస నుండి తప్పించేదీ ప్రజాస్వామ్యం

సూచన హెచ్చరిక ప్రబోధంతో ఆప్త మవుతుంది
వ్యక్తి నుండి సమాజానికి సోపాన క్రమ మవుతుంది

అక్షర జగత్తుకు కవితలో దార్శనికం
లౌకిక పథాన పయనంలో వెలుగు పదం
పద పదం స్వేచ్ఛలో మానవం అల్లుకొనీ
తీగెలా పందిరియై శాంతి ప్రసాదిస్తుంది

కవితా యానంలో శబ్ద మొక వాహనం
భూమి జలం అనల పథం సంస్ఫురణతో
ఎవరి గమ్యం వారికి పరిమితమై
లక్ష్యంలో ఫలితాలెన్నో విధాలుగా

అణువులో రహస్య శక్తి మొదలు
మనిషిలో జీవన రక్తి వరకు
సూక్ష్మ దర్శన దృష్టికి మాత్ర మందే
పొరల క్రింద మరో మనోజగం

శిశువు జననం తల్లి హృదికి తెలిసినట్లు
ఉదయాగమనాన్ని పక్షులు పసి కట్టినట్లు
మబ్బుల కదలిక దాహ వనికి తెలిసినట్లు
కవితలో వెలుగుతో చీకటి తొలగుతుంది

ఇది స్పందన భవం స్వతంత్రం ! మనోజ్ఞం
ఆచరణ గుణంతో లక్ష్యం సుగమమవుతుంది
కవితలో నిజం నిప్పులా బూదిచే కప్పబడీ
అనుభవ శిఖరంపై జ్వాలాతోరణమయ్యేను

రవి ప్రతినిధి వలె రాత్రి సమయంలో దీపం
ఎన్నిటికో సాక్ష్యంగా ఉంటుంది నిశ్చలంగా

4. ఎన్నిటికో బంధువుగా

ఉదయ పతాక చే ప్రేరిత మవుతుంది కవిత
కవి హృదయం తలుపులు తెరవబడీ బయటి కొస్తుంది
బ్రతుకులో ఎదురయ్యే సందేహాలొకటొకటీ తీరుతూ
సమాజ గతిలో అభినవ రూపం వేగం పెరుగుతుంది

ఏ విషమ స్థితిలో జీవన గమనం ఆగదు
కాలంతో పాటు అడుగు సాగ వలసిందే
కవితలో సృజన రూపం! నిత్య నూత్నమయింది
బ్రతుకులో పర్యవసానం మరో జగం దిగుతుంది

మట్టి అయినా స్వర్ణమయినా మూర్తి మాటలాడదు
అవి చెప్పే మాట కవి మదిలో ప్రతిఫలిస్తుంది
బహు విధాలుగా దశా దిశలలో ప్రకటితమవుతుంది
అన్నిటికీ తెలిసేది, ఒక హృదయభాషయే

స్నేహ గుణంతో గమ్యం దగ్గరవుతుంది
దొరికిన వస్తువు చుట్టూ ఊహలు అల్లబడీ
లోపల రూపం ఏర్పడుతుంది హేతు దృష్టితో
అపూర్వ వస్తువులతో నిండుతుంది మ్యూజియం

అల్పమైనది శక్తి లేనిది జారి పోతుంది
మధ్యలోనే దారిలో చదికిల బడవచ్చు
నీరు నిలవదు వాలులో అందం ఒలుకుతుంది
రాయి కదలదు ! శిల్పంతో అందరినీ రప్పిస్తుంది

కవితలో విషయం పర్వత పంక్తిలా నిలచి
పద పదం కలిసి భావన రసధుని వలె సాగుతుంది
అంతరంగ ప్రకాశంతో కవిత చూపుతుంది
ఎన్నిటికో ఆత్మ బంధువుగా మారుతుంది

5. స్మృతుల పూలతో

కవి భౌతిక రూపం కనిపించక పోవచ్చు
అక్షరాలు మౌనం వదలుతాయి, పలుకుతాయి
ఉత్సాహం కలిగిస్తుంది, ఉత్తేజం నింపుతుంది
అభినవంతో మనసుకు కొత్తలోకం తిప్పుతుంది

ఎంత కాలమయినా, ఎందరి మధ్యనయినా,
ఎచట నయినా, కొత్త ముఖాలు పరిచయమవుతాయి
రాత్రితో సహవాసం పగలుతో సహజీవనం
మనిషితో అనుబంధం, కవితతో ఆత్మీయం

వెలుగు పేరుతో మంటలు రేపే వారు లేకపోలేదు
మార్పు పేరుతో రంగులద్దే వారు లేకపోలేదు
ప్రకృతిలో వెలుగు రాక ఆగదు
జనతలో మార్పుపై కోర్కె దాగదు

పరుల సానుభూతి కయి కొందరు
ఏడుపు ముఖంతో కనిపించేవారు, ఇష్టంగా
బాధలోను ధైర్యంతో కొందరు
నవ్వు ముఖంతో కనబడేరు స్వచ్ఛంగా

కవిత గగనంలో తిప్పుతుంది విహంగమై
కవిత భూమిపైన తిప్పుతుంది వాహనమై
కవిత జలధిని దాటిస్తుంది నావమై
ఉన్న జీవిత కాలంలో పాఠాలెన్నో వినిపిస్తుంది

శాంతికి దారులు చూపిస్తుంది అయినా
మనిషి మాత్రం ఏ రణ సన్నాహంలోనో
భవనం కూలుతుంది, శిధిలాల స్మృతులు మిగులుతాయి
దొరకిన ఆధారంపై తీగెల వలె సాగుతాయి పూలతో

6. జిగీష

తుపాను వస్తుంది, ప్రకృతి గజగజలాడుతుంది
భూకంపం వస్తుంది శిథిల ప్రపంచం ఎదురవుతుంది
సునామి సరే సరి విధ్వంసంలో విలయ తాండవం చేస్తుంది
అన్నిటి నుండీ సమాజం తేరుకొనేను విజయ శక్తితో

నిర్మాణంలో కన్న చరిత్రలో విధ్వంసానికి స్థానం
జారిపోయిన విలువలపై శిథిలాలలో అన్వేషణం

మృత్యువుకే ఉపదేశం అక్కరలేదు
దాని దారి ఎవరికీ తెలియని రహస్యం

రాలే ఆకులవలె ఒడ్డున విరిగే అలలవలె
మెరసే నిప్పులా విసరిన రాయి ముక్కలా
తాడు తెగి బావిలో పడిన బొక్కెనలా
విషాద స్థితిలో దారులన్ని తెరవబడేను

వ్యక్తి కిది మొదటి చివరి అనుభవ విశేషం
చెప్పే అవకాశం లేదు, ఎవరు ఎవరికి నమూనా కాదు

ఎంతటి ప్రబోధంలోను అమర రూపం ప్రసక్తి లేదు
కఠోరమైన వాస్తవాన్ని మనిషి ఎదుర్కోవలసిందే

పోయిన మనిషి యశోరూపానికి
రంగు లద్దడం మొదలవుతుంది
పని కట్టుకొని అభిమానం శిల్పంగా
రూపొందించే యత్నం జరుగుతుంది

ఎక్కడ కయినా మంచి చోటుకే కావచ్చు
నమ్మకం మనసును ఎప్పటికపుడు సిద్ధపరుస్తుంది

గిరి ఆకాశం వైపు చూస్తుంది
ఇంకా అపై ఎదగాలని ఉబలాటం
నదికి భూమిపై తన అడుగులు పడాలని
మనిషికి భూమినీ నింగినీ గెలవాలని

7. పరీక్షలో దార్శనికం

గ్రీష్మ చండతకు చెరువు ఎండిపోవచ్చు
దీనిని ఏ షామియా ఆపగలదు
చలిగాలికి ఆకు వణకుతుంది, ముడుచు కొంటుంది
దీనికే విధం బ్రేక్ వేసి నిలపగలరు?

మబ్బు నుండి పిడుగు పాటు భయదం తెలిసిందే
దీని నెవరు సమయానికి బ్యాగ్ లోకి దింపగలరు?
కాలంతో పాటు నడచే బ్రతుకులు
ఏ సందర్భంలోను మర బొమ్మలు కావు

సింహానికి నడక నేర్ప నవసరం లేదు
మనిషికి నడకతో నడత కూడ అవసరం
జీవన గతిలో మనిషి మనిషికీ వేరు వేరు జాగ్రతలు
లౌకిక వేదికపై తమ కిష్టమైన ప్రదర్శనలలో

విజ్ఞానం అధికారం సంపద శాఖలతో
దేని కది చుట్టూర స్వతంత్ర రూపాలతో
జాతి మతం కులం ప్రాంతం రంగులలో
ఎప్పటి కపుడు కొత్త పాత్రలలో జీవితాలు

తన కోరిక నెరవేరడ మొకటే లక్ష్యంగా
హింసకు హత్యకు వెనకాడని పీడకులు
ఏ బాధకు ఏ మార్పుకు తొలగని ఇనుప గుండెలు
సమాజ చరిత్రను నడిపించేను మనో మూలాలు

ఏ చెట్టు కూడా మనిషికి ఆదర్శం కాదు
నడక లేనిది మనసు లేనిది మనిషికి సాటిరాదు
కలలో కల్పనలో ఊహ బాగానే ఉంటుంది
మెలకువలో వాస్తవంలో నిరాశలో ముంచుతుంది
కవి అంతర్నయన ప్రకాశంలో ఎన్నో రహస్యాలు
బయట పడతాయి, దార్శనికాన్ని పరీక్ష చేస్తూ

8. తాండవం అనుసరించి లాస్యం

మనుషుల మాటలు చేతలు జరిగే, నాటకంలో భాగాలే
ఎవరి పాత్ర ఏమిటో? నిర్ణయం వారిదే అప్పటికపుడు

కాలం చెల్లడమంటూ లేదు, మనిషి పయనంలో
ఎంత అనుభవ ముంటే అంతగా విలువలు పెరిగేను
ఒకరి దృష్టి పాక్షికమై కొంత కనబడకపోవచ్చు
అంతమాత్రాన విషమ శూన్య భావం పొందదు

స్వేచ్ఛా వర్తనలో ఎగసే అలల పొంగుతో
దూకే జలధి విలయ కాండను నిలుపుతుంది
తీరం పొడవున భద్రత కవచం! చెలియలి కట్ట
ఇది మానవ జీవితంలో లోను అవసరమైన వాస్తవం

జలదం వస్తుంది సమాజాన్ని పలకరిస్తుంది
కదలు తుంది, ప్రకృతిని పరామర్శిస్తుంది
ఎన్నిటినో బాధల నుండి ఆదుకొని రక్షిస్తుంది
ఇది ఆర్ద్ర వ్యక్తిత్వానికి మనోజ్ఞ రూపం

సృజన విలయ చర్యలలో దృశ్యాలు ! అనేకం
ప్రకృతితో పాటు మనిషి బ్రతుకులను గురి అయ్యేను

పూర్వజనుల నుండి సంతతికి లభించే
సంపద వలె వేచి ఉన్న ప్రజలకు
ప్రాణాధారమయింది! ఉదార చరితతో మేఘం
తన రాకతో మనిషి తలను ఎత్తగ చేసేను

మేఘు మెంత స్వతంత్ర మయిన దయినా
గాలి వాటు బాటలపైనే కదిలేదీ, కురిసేదీ
కాల వేదిపై ఆతప తాండవాన్ని అనుసరించి
జలనృత్యం ! తప్పక వచ్చేననే అందరి విశ్వాసం

9. అవసరాలకు దారులెన్నో

కవితలో నాటబడిన పదం చూపుతుంది
భావనలో సుమ పరిమళ ఫల రుచి రూపం

ఎవరి కేది ఎట్లా దొరికేదీ తెలియదు
కోరిక పూర్తిగ పొందే అవకాశం! క్వాచిత్కం
ఇష్టంతో పాటు ఇష్టం లేనివి! అవరోధాలెన్నో
సహకారం సహయోగంతో నడుస్తుంది జీవితం

రాత్రి వేళ గాలి వాన తీవ్రత
రోడ్డుపైన చెట్టు కూలిన దృశ్యం
పక్కన ఉన్నవి భద్రంగా, వరసగా
పచ్చదనంతో చెదరని ఆయువు కళతో

దూరం నుండి కనిపించే చంద్రుని మచ్చలా
ప్రతి వ్యక్తిలో ఏదో ఒక దోషం చిత్రంగా

కాలాంతరాన తెలియవచ్చు, తెలియక పోవచ్చు
అది శుష్కీభూతమైన తరువు కావచ్చు
ఎండిన చెరువు కావచ్చు. ఆరని కొరవి కావచ్చు
అనుమానం చిక్కు ముడి, రేపు తొలగవచ్చు

రథం సాగుతుంది భూమి తలంపై
విమాన మెగురుతుంది పవన పథంలో
నావ తరలు తుంది నీటి తలంపై
దేని కది ప్రత్యేకతతో ఉపయోగంలో

ముఖంలో అమరిన పూల గుత్తితోనో
గుండెపై నిలిచిన నిప్పుల మాటల తోనో
ఆగని జీవితంలో ఎవరి దారి వారిది
మధ్య మధ్య అవసరాల కేర్పడే దారు లెన్నో

10. బయటపడే వెన్నో

అరణ్యమంటే భయం ! మృగం ఎదురు పడేవని
పట్టణ మంటే ప్రియం! ఇది వికాస రూపమనీ
మౌలికమైన అవసరాలు పొందేమనీ కష్టాలు తీరేననీ
నాగరక శోభతో ఆకర్షణ చిమ్ముతుంది, నిలుపుతుంది

ఎపుడయిన దారి తప్పి ఏ పులియొ
జన పదం చేరితే ! తరిమే ధైర్యంతో ప్రజలు
తప్పని విషమ స్థితిలో హత మార్చేరు
స్థితిని చక్క పరచేందుకు బంధించేరు

ఇది కొందరి జీవికకు సహాయకరంగా
బోను నుండి శిక్షణలై ప్రదర్శనకు తరలేను
అలసటలు మరచిన ప్రజలు వింతగ ఆనందించేరు
జన జీవన చలనంలో మృగమొక విచిత్రంలో భాగం

నగరం చేరిన సంస్కార సంపద తరిగిపోయి
ఎవరిలోనో ఆటవికం చోటు చేసుకుంటుంది
బాధకు హింసకు హత్యకు గురి చేయవచ్చు
ప్రమాద కర దృశ్యాలతో తెరపై జీవిత కథ

ఆపద గురించి చింతనలో కలలు నిండుతాయి
మనిషి పర్వతం కాదు, ఎండిన నది కావచ్చు
మనిషి గెలుపు మెట్లపై వెనకనుండి ఒటమికి
మరొకరు వికృత చర్యలతో, లోలోకి ఆటవికంగా

క్రితం మృగం బోనులో హఠాత్తుగా చేరినట్లు
ఇక్కడ మనిషి జైలులో ఉండడం జరిగేను
రెండిటికీ మధ్య భేదం, ఉంటుంది అనివార్యం
లేంది సంక్షోభంలో సమాజం! ప్రమాదాలలో
అంతరంగ ప్రకాశంతో ఎన్నో బయటపడతాయి
ఆదర్శానికి దగ్గరగా దార్శనిక లక్ష్యంతో వెలువడతాయి

11. కలలు - వాస్తవాలు

కవితలో పూవు నిప్పు కణం కావచ్చు
కవితలో చెట్టు మనిషి బ్రతుకు కావచ్చు
కత్తి కలమై కలం కత్తియై అనుకోని
చరిత్ర ఏర్పడవచ్చు మార్పును సూచించవచ్చు

కల్పనలో భాగాలనిపించవచ్చు పైకి ఒకటొకటి
జీవన గమనంలో వాస్తవ బంధుతలను చూపేను

రాలే ఆకు రాలుతూ పూచిన పూలు కోయబడుతూ
కూలే భవనం కూలుతూ చెరువులో నీరు మాయమవుతూ
భౌతిక జీవన సంకలనం సమాజం ఆశలు నిలుపుతూ
ఇది ఎవరూ ఆపలేనిది, అందరికీ చెందిన అనుభవం

కవితకు కవి వ్యక్తిత్వానికి సంబంధం! సహజమైంది
కనిపించీ కనిపించని సూక్ష్మమైన ఆంతర విషయం
ఇది జీవన నదిపై వంతెన వలె
ఇరు కొసలకు సమ ప్రాధాన్యం కలిగింది

కాగితంపై అక్షరాల వలె గగనంలో చుక్కలు
చిన్ని చిన్ని ఆశల మొగ్గల వలె పరచుకొనీ
రాలిన శ్రమ బిందువులను మెరపించేను
ప్రమిదెలలో వెలిగే వత్తుల్ని తలపించేరు

శిశువు కందబోయే చంద్ర బింబ ముఖంలా
పరుగెత్తే లేడి వెనక దూకుతూ పులిలా
ఎయిరో డ్రామ్ నుండి ఎగర బోయే విమానంలా
కవి మనసు నుండి కవిత అనుకోని సమయంలో

ఇంద్ర ధనుసు నందుకొనే ఎదిగిన బ్రతుకులో
దైవం అవతార స్వరం! అనుభవాల్ని పంచేను
కవిత అవతరిస్తుంది! మనసులో మెరపు సూచనతో
ప్రజల కలలు వాస్తవాలు కలిసిన సుందర రూపం

12. వాస్తవ బింబం

బట్టబయలులో ఆధారం నిరుపేద కుటిలా
చుట్టు మూసిన పిల్లలతో పక్షి గూడులా
మహా దరిద్ర శకలాలకు ఆశ్రయ ఖండంలా
ఇంటి ముందు చెట్టు నీడ పరచబడీ, వస్తువుతో

ఇది కవి హృదయ మిత్రం! శాంత పదం
నేరాలను దాచే రహస్య నిలయం కాదు
హత్యలను మరపించే ఉపాయ స్థలం కాదు
దరి చేరే హృదయ భాషను బాగా తెలిసింది

మనిషికి మనిషి కనబడనపుడు ఇదే మిత్రం
శాఖోపశాఖలుగా పచ్చని ఆకుల ప్రభావంతో
కవిలో సృజన చేతనకు ప్రేరణ గుణంతో
సమాజ స్ఫూర్తితో మనసుకు ప్రతినిధి ఈ నీడ

మనిషిలో గుహ రూపం తీరు కాదు బయలులో
ప్రతి వస్తువు చిర కాల పరిచయంతో
బాగా తెలిసిన రూపం, తెలియనట్లు ఉంటుంది
మిత్ర శత్రు మతం దేశం భేదాలు లేవు ! దీనికి

దొంగ దొర పాము కప్ప కదలికలతో నీడ
సహజమైన ఆదరణం ఫలించే ఆశ్రయం
ఎంత వాడి కిరణ మయినా
ఎంత వేడి ఎండ అయినా
పై నుండి పచ్చని ఆశీస్సులతో ఫలవంతంగా
తన అంచులలో సూర్యుని చండతను నిలిపేను

ఎవరిదో ఇట ఉంచిన లగేజిలా
లో నుండి తీసిన కత్తి సంచిగా
తాప హరణ రూపంతో హిత కర మానుషంతో
ప్రజా స్వామ్య బంధువు నీడ సమాజ వాస్తవ చిహ్నం

13. సృజన ఫలం

మస్తిష్కంలో ఆగని ఆలోచన మతిచే
మనసులో ప్రవాహ రూపంలో సాగుతుంది
తెలిసిన దారే అయినా, తడవ తడవకూ
కొత్త అనుభవం, మనుషుల చర్యలతో
దేని కది సమయ సమయం కొత్త కవితలా
వాస్తవ చేతనతో స్పందనతో జీవితంలో

నాతో పాటు బయలు దేరిన పక్షి
పయనం మధ్యలో చెట్టునో చేరేను
నాతో పాటు ఎవరు ఉన్నా లేకపోయినా
నా నీడ మాత్రం వదలదు, వీడని మిత్రంలా

పై నుండి వేగంగా వచ్చే వాహనం
చకితంగా రోడ్డుకు అడ్డంగా వెళ్ళే సర్పం
టైర్‌ల నుండి ఒడుపుగ తప్పించుకొన్నదో
పరుగిడింది, దెబ్బతిన్నదో? తెలియదు

ఆలోచనలో సృజన రూపం అనుభవంలో ఆరితేరి
అక్షర వశమై కవిత పద ఘటిత మవుతుంది
స్థిర కృతితో సుందర మనోమయ మవుతుంది
రోజురోజుకీ మారే సమాజానికి బంధువు అవుతుంది

సారభూతమైన అనుభూతి ఘనీభూత మవుతుంది
శిల్పంగా బయటపడుతుంది, బహితంతర స్థాయిలో
కల్పనలో కవిత! బయట పడుతుంది అనుకోకుండా
కలల్ని మెడలో వ్రేలాడేసుకొని సాగేరు కొందరు

స్వేచ్ఛకు ప్రతిమయై మానవశక్తిని నిలుపుతుంది
సంకల్పం వెలుతురులో క్రియారూపం విస్తరించి
కవి బాధ్యత పెరుగుతుంది, వాస్తవ మర్యాదలతో
విజయ దశకు చేరే సృజన ఫలం ఉల్లాసం నింపుతుంది

14. ఎక్కడి దక్కడే

సృజన నిలయమైన మస్తిష్కంలో ప్రతిభ
మనసు నుండి ఏ రూపమయినా వహిస్తుంది
ఆలోచనా రేఖలతో అనుభవ పరిపుష్టిలో
మనిషిలో దీనిచే మరో లోకం దిగుతుంది

గగనం నుండి మేఘం హృదిలోకి దిగుతుంది
దయా సేచనతో దీన జన జీవితానికి
పచ్చదనం తేవచ్చు, ఫలవంతం చేయవచ్చు
అక్షర పద బంధుతతో భాగ్య వశం కావచ్చు

కవి ఉన్నత మతి శిఖరం నుండి నది
శిలలను నిమురుతూ ప్రతుకులో సాగవచ్చు
ఆర్ద్ర భావనతో శుష్క జీవితంలో
దాహార్తిని తీర్చవచ్చు ఆకలి బాధను బాపవచ్చు

నాతో పాటుగ బయలు దేరిన పక్షి
మధ్యలో ప్రక్కన ఉన్న చెట్టు
కొమ్మపైకి చేరేను ఇలా తొలగేవి ఎన్నో
నీరు మాత్రం నాతో సాగుతుంది ఎంత దూరమైనా

కన్నీరు ఆగదు, దానికే అడ్డంకి లేదు
ఇందులో దాచే రహస్యం లేదు, అంతా బయలే
అస్తమించే సూర్యుడు ఎక్కడికి? వెళతాడు
రాత్రి వేళ విశ్రాంతి తీసుకొనే కవి ఎదలోకి

మరునాటికి చార్జ్ అవుతుంది మనో రూపం
కవిత వెడలుతుంది ప్రభాత సుందరంగా
కవికి ఏదీ నిషిద్ధం కాదు సభ్య సమాజంలోనివి
ఏ ఆటకు అయినా నియమ నిబంధనలు తప్పవు
ఆడే తీరు వేరు వేరుగా, ఉల్లాసం కలిగించే
ప్రతుకుల్ని ఆశా మయం చేసేను, సుస్వరతను పొందేను

15. అందరికీ తెలిసిందీ

ఆల్బంలో ఫోటోలు ఎప్పటివో పాతని
హృదయ స్పందనలో కొత్త అనుభవం కలిగేను
స్మృతి చిత్రాలను ఆలోచన వదలుతుంది
అన్నీ ఇష్టంలో జీవితమలంకరించేను

ఎవరు చేరినా ఎవరు పోయినా
ఏది లేకపోయినా, ఏది కరువయినా
ఎప్పటికీ అనుభవ రూపంతో సమాజంలో
మనిషిని నిత్య నూతనంగా ఉంచేను

సృజన విలయ మిశ్రమ రూపంలో
నవ చరిత్ర నిర్మాణానికి దారి తీసేను

జలధికి అలసటలేదు, ఎప్పటికీ కదలుతూ
సంఘానికి విరామంలేదు క్రియా రూపంలో

సహనంతో భూమి ఉత్సాహంతో జలధి
మనిషికి ఇరు వైపుల రెండు దృశ్యాలతో
మధ్యన తెలియని కట్టపై మానవం
పైన పోతూ భుజంపై వాలుతుంది పావురం

చాచిన చేతికి అందబోతుంది ఆదర్శబింబం
భూమి జలం నింగి త్రిభుజాకారంతో
జీవిత మొక వికాస లోక బింబమై

పైకి చూస్తే గోపుర శిఖరం అందని ఎత్తులో
జీవన వాస్తవ చిత్రం, చక్రంపై తిరిగే విగ్రహాలు
ఉత్సవ మూర్తు లొకటొకటీ మానవ చిహ్నాలు

ప్రకృతి కెంత అవసరమో బ్రతుకునకంత ముఖ్యం మేఘం
సమాజానికి ఉత్సవ రూపం మనసుకు ఆశా రూపం
కవితలో హృదయ భాష విశ్వమయం అందరికీ తెలిసిందీ
జడతలోను చేతనతో స్వాగతం పలుకుతుంది
కవితలో సుందర వాస్తవ దృశ్యం బింబిస్తుంది

16. ఉదయ వాస్తవం

నిలయం బయట ఇరు స్థాయిలలో
తారస పడేరు కొందరు, అనుకొన్న వారు అనుకోనివారు
పలు విధాల మార్పుల ముఖాలతో కనిపించేరు
అనుభవంలో వస్తువు ఎన్ని తీరులలోనో తీర్చబడీ
అసలు ముఖం వెనక నుండి ముందుకు వాలకాలు
శుభ్రంగా సుందరంగా బయటికి వస్తాయి

కథలో స్టేషన్‌లో మరొకచోట ఎక్కడయినా
జీవిత మొకటే, భంగిమలు వేరు
సూర్య కిరణ నిశిత దృష్టికి సందిగ్ధ స్థితులు
జీవన చలనంలో వేరు వేరుగా ఒకటొకటీ

మట్టి ఇనుము మంచు సువర్ణం కాగితం మరొకటితో
చేసిన రూపంతో ముందుకు వస్తుంది వ్యవహారం

చాటునే కత్తి పిస్టల్ దాచి ఉండవచ్చు
ఇది రణం కాదు, లౌకికం ప్రమాదకరం

పూల గుత్తి ముఖంతో కనిపించాలని కొందరు
అగ్ని శిఖలై బొగ్గై పోయేరు అనుకోకుండా
జీవితమొకటే ముఖమొకటే ఎవరికయినా
వెనుకనుండి మరో ముఖం ముందుకు వస్తుంది
గాలికి అన్నీ తెలుసు మౌనంగా ఉంటుంది
కాకపోతే మనుషుల మాటల్ని మోసుకపోయేను

ఒకరి బ్రతుకు వారిది అయినా ఎప్పటినుండో
మరొకరిని నడిపించాలని కోరిక మనిషిలో
ఈ నిశీధి తొలగనిదే దాటరానిదీ కాదు
భయం గడ్డకట్టి పర్వత పంక్తి అవచ్చు
కిరణం కరగిస్తుంది నిజం ప్రవహిస్తుంది వాస్తవమై
నిజం ఎపుడు బయట పడితే అది ఉదయ వాస్తవం

17. ఆకృతి ఆకాశంలో

చెలియలి కట్టపై నిలిచి అలలను చూస్తూ
వాటితో కలిసి పయనించాలని కోరిక
లోతు జ్ఞాపకం వచ్చి వెనక్కి లాగ బడవచ్చు
మనిషిలో జిగీష కేదో ఒక సాధన ముపకరించేను

జలనిధి దాటేందుకు నింగిని చేరేందుకు
సంకల్పంతో సాహస యత్న మవసరం
విజ్ఞానం బలంతో ఏ నావో ఏ విమానమో ! మరొకటో
దేని కది ఎప్పటికపుడు మనిషికి పూర్ణత అనిపించేను

రాత్రి గడవడానికి ఏది అడ్డంకి కాదు
ఎవరు కోరినా కోరక పోయినా ఆగదు
ఎంతటి విరోధ మయినా వ్యతిరేక పరిస్థితులలో
కావాలని దారి పొడవునా ముళ్ళనెవరు పరుస్తారు

ఏదో కారణంగా ఇవి వచ్చి పడేను తప్ప
కాలికి మల్లు దిగేను, మనసుకు మాట తగిలేను

బ్రతుకును రణ రంగంగా మార్చే అవసర మెవరికి?
మాట నుండి ఆయుధానికి పరుగిడుతుంది మనస్సు
మృత్యువు నిలయం ఇనుప తలుపులు తెరవబడతాయి
ఎపుడు బడితే అపుడు దొరకనిదీ అమృత లవం

దీని కెంత మథన మవసరమో యోజనలో
కలహ మెంత పెరిగేనో? పక్షాలలో

దారి ప్రక్క చెట్టు కొమ్మ చివర వేలాడే
పండు కోసి సంచిలో వేసుకోవాలని
అనుకోగానే ఆరాటం తీరేనా?
దీని కెన్ని సందేహంలో? అవరోధాలో?

నీరు నిండిన కుండ కింద పడి
మట్టిలో, ఆకృతి ఆకాశంలో కలిసేను

18. వికాస పథంలో

సృజన మతిలో ఆలోచన మంచు గడ్డ అవదు
వెలుపల చేతనతో ప్రవహించే భావరసాకృతి

జలధిలో ఎత్తిన తలతో నిలిచిన సబ్ మెరిన్
బహుళార్ధక సహాయ యంత్రం! వాస్తవ రూపం

రణంలో నిలుస్తుంది రక్షణ కవచంలా
భద్రతలో శాంతిని మేల్కొనజేసే వాహనం

విత్తు నుండి పెరిగిన చెట్టుపై చివరికొమ్మకు
పూచిన ఆశలు దశలలో ఆకులు పూలు వరకు
దశలలో పరిణామ జీవితం! ఒక వాస్తవానుభవం
సృష్టిలో దీని కిదే సాటి, ఆయువు సార్థకం

బయట వానలు తుపాను చలి మంచు తాకిడులను
తట్టుకునే చేవతో ప్రకృతితతో పాటు మనుషులు

అర్ధరాత్రి మేల్కొని ఇంకా ఉదయం కాలేదని
చింతనలో విసుగులో నిరీక్షణలో గడపేవారూ
శిలలతో మౌనంగా, అలలతో మాటలతో
గడిపేను మనిషి, రెండిటికి అతీతంగా అంతరంగం

ఆకాశం బ్లాంక్ పేపరులా ఏనాడూ కనిపించదు
ఒకే ఒక సుందరమైన శరత్పూర్ణిమనాడు తప్ప
దిశల ప్రేములో, అద్దంలా తళతలాడుతుంది
పైకి చూస్తే చిత్రంగా ముఖ బింబం కనిపిస్తుంది

వెన్నెల తల ఎత్తగ చేస్తుంది ఆప్తంగా
శుభ్రమైన అంతరంగ స్ఫూర్తిని మెరపిస్తుంది

కదలని శిలల మధ్య, ఊగే చెట్ల మధ్య
మనుషులు ! కదలీ కదలని జగత్తులో పాత్రలతో
ఇన్నిటిని మీరి ఎప్పటికపుడు అభినవ చేతనతో
వికాస రూపానికి దారులలో మానవ గాథలు

19. అన్నీ మనిషికే ! అన్నిటికీ మనిషే

జీవన దశలతో విజయ గాథల సోపానాలకు
కలహాలను సమరాలను దాట వలసి వస్తుంది
గాయ పడవచ్చు బాధ కలగవచ్చు, అదృశ్యం కావచ్చు
తన అస్తిత జీర్ణమై ఛిన్నమై విసర బడవచ్చు

జలధి హోరులో ఆర్తి, గాలి విసరులో హేల
నది అలలలో చిత్రం, మనిషి సృజనలో కవిత

నిశీథిలో కనిపించని స్థితిలో వెలుగు అవసరం
కష్టంలో అడుగు పడని గతిలో, మనిషి ప్రధానం

ప్రేమ కరుణ వీరం త్యాగం
చక్రాల జీవన వాహనం
ఎవరి వాహనం వారిది! తత్కాలంలో
నచ్చడమో ! అలవాటో ! అవసరమో!

ప్రేమ కరుణ చరణాలపై నడకలు
వీరం త్యాగం హస్తాలపై చేతలు
హృదిలో గులాబిని మరచి చేతిలో లాఠితో
ఎక్కడెక్కడో తిరిగేరు ఒంటరిగా సమర్పణలో

మొబైల్ కాల్ లిస్టులో ఎన్ని పేరులో
అందరితో సంబంధం సమాజ వాస్తవం

మ్యూజియంలో అమూల్యమైన వస్తువుల మధ్య
ఎంత కాలం గడిపేరు, ఆనందం కళ పేరుతో
జీవ వంతమయి సమాజంలోకి రావలసిందే!
ముందుకు నడిచే కథ సాగవలసిందే!

నింగి జలధి భూమి చెట్టు గిరి నది ఒకటొకటీ
తమ కథలను తెలుపుతాయి మనిషికి!
మనిషి మాత్రం తన కథను చెప్పేది మనిషికే
అర్చేదీ తీర్చేదీ వినేదీ మనిషే ఆత్మబింబం

20. మనసు విమర్శలో

ఈ లోకంలోకి రావడం ఎవరి మాటపై
ఈ యాతనలో సాగడం ఎవరి ఆజ్ఞపై
ఈ బ్రతుకును తీర్చి దిద్దడ మెవరి కోసం?
ఆలోచనలో ఎపుడో ఒకపుడు ప్రశ్నలు దిగేను

ఏదయినా తన అవసరం క్రియాఫలం మనోవిధంతోనే
వదలిన వెన్నో? పొందేవి ఎన్నో? నిరంతరంగా
ఎవరి ప్రోత్సాహమయినా, ఎవరి ప్రమేయమయినా
మనిషిలో స్వతంత్ర శక్తిలోన దిశా నిర్దేశం చేస్తుంది

అందరితో పాటు వ్యక్తి వెనక! కవిలోనూ
మరో పాత్ర ! సృజన బాధ్యత నిర్వహిస్తూ !
కళపై అభిరుచితో ప్రజ గురించి చింతనతో
సాగుతుంది కవి పయనం! మర్యాదాలంకృతంగా

సాయం సంధ్యలో పనికి రానివి దగ్ధమయ్యే
జ్వాలా దృశ్యం! పడమర దిశలో ! ఎగసీ!
జలదంకై జనత చూపులు ప్రసరించేను
దీనికి బదులుగ చీకటి వస్తుంది! దూతగా

వేచి ఉన్న రాత్రి విరామ నిద్రలో మనుషులు
తెల్లవారితేనే మెలకువలో ఆశా బందువు
కనిపించేదీ! చేతనతో వ్యక్తిని నిలబెట్టేదీ,
రాత్రి జారిన హిమ స్పర్శ! ప్రాణం నిలిపేనని వార్త!

కాలగతిలో మనిషి చర్యలతో ముక్కలు కావచ్చు
ముక్కలన్ని ఒకటై కొత్త రూపం పొందవచ్చు

పరిణామంలో శిథిలాల నుండి నిస్తబ్ధత నుండి
వికాసంలో నిర్మాణం జరగడంలో ఆశ్చర్యంలేదు
శ్రమ చేతనతో చరిత్రకు చలనం లభించేను
సృజన ప్రతిభతో మనిషి కాలాన్ని జయించేను

21. చీకటి ఉదయం

ప్రవహించే నదిలో ప్రతి బింబంలా కవిత
కాలాన్ని బట్టి మారుతుంది, క్షణ క్షణం నవంగా
కవితగా కవి మారడం ఒక గొప్ప విషయం
ఇది అనుకుంటే జరిగేది కాదు, సృజనలో భాగం

తెరిచిన పుస్తకంలా ఆకాశం
దృశ్య కావ్య పుటల్ని తలపిస్తుంది
అదృశ్యమైనవి భావింపచేస్తుంది
పరిచయంలో ఏండ్లుగ దాగిన రహస్యాలతో

ఎన్ని వేల మైళ్ళ దూరంలో ఉన్నా
పగలు సూర్య ప్రభతో ప్రేరణగా
రాత్రి చంద్ర తారా గణంతో స్నిగ్ధంగా
బాధలలో ఆప్తంగా కాలం గడచేను

పగలు పలు రంగుల దర్పణంలో
బ్రతుకుల దృశ్యాలొకటొకటీ!
దేని కదే, మారే జీవన చిత్రాలతో
స్వేచ్ఛలో నిశ్శబ్దం కన్నా, శబ్ద ప్రపంచం ఎక్కడ

గాలి అన్నిటి హృదయ భాష అందుకొని వీస్తుంది
కలిమి లేముల స్థితులను నింపుకొని వినిపిస్తుంది
ఇపుడు చిత్ర కారుల కాన్వాస్‌పై మాత్రం
చిక్కని ఎరుపు నీలిరంగులలో జ్వాలా చిత్రం!

ఇపుడు కవి మనసు ఊయెలపై భాగ్యం కాదు
రాళ్ళపై ముళ్ళపై నిప్పులపై నడవాలని చూపేదీ
స్వేచ్ఛకు అవకాశం, బంధనలో బిగింపబడుతుంది
అరెస్టులో అవకాశం, అగ్ని మయమవుతుంది
ఫ్రేమ్‌లో పోటోలా, జీవితంలో బాక్ డ్రాప్ చీకటి ఉదయం

22. బోధలు - పాటలు

మస్తిష్క శాల పలు స్వప్న దృశ్యాలకు నిలయం
ఎన్నిటి కయినా మనసులో అవకాశం దొరకేననీ
అందులోను పగటి కలలకు ప్రవేశం సులభం
కలలు వస్తాయి, వాటి దారిన అవి వెళ్ళిపోతాయి

స్నేహం బంధుత వైరం సమరం సూచన హెచ్చరికలతో
పూర్వ పరిచయంతో అనుబంధంతో లోనికి వచ్చేరు
గగనంలో తెల్లని మబ్బుల వలె కదలుతాయి
చీకటి ముసుగులో కనబడీ భయ చకితం చేస్తాయి

మనో జలధి అడుగున పడి ఉన్నవి
పడవల వలె పైకి తీసి చూపుతాయి

గ్రీష్మంలో పశ్చిమాన అస్తమయంలో తేజం
కలల వెనక మండే కశ్మలాన్ని తలపిస్తాయి
తెల్లని నాణెం జేబులో ఉన్నది ఉన్నట్లే ఉంటుంది
జేబు నుండి తీయడం జేబులో వేయడం పనిగా
నమ్మకంపై గురితో, కాలం గడుస్తుంది
ఆ సమయం తృప్తిగా గడిస్తే చాలనిపిస్తుంది

బాల్యంలో ఒకసారి నడచిన దారి ఆత్మీయమై
ఎప్పటికినీ విప్పారిన హృదయంతో చూస్తుంది
జ్ఞాపకాలు నిర్మలమైనవి రంగులు వేయబడీ
బ్రతికి నంత కాలం! కలలతో మస్తిష్కంలో ఒక మూలన

మనిషిలో చిరమైన కోరిక! ప్రవాహమై సాగాలనీ
మనసులో మృగాల్ని మరచి, పూల చెట్లును పెంచాలనీ

ఒక చోట అస్తమయం మరోచోట ఉదయ మదేవేళ
మనో వీధులలో తోరణ పంక్తుల వలె వేలాడుతూ కలలు

దూరం నుండి ఆలయ శిఖరం, బోధలు వినిపించేను
ప్రక్కన శిథిలాలలో శకలాలు, పాటలు తలపించేను

23. చరిత్రలో వజ్రం

ఒకసారి పరిచయంతో ఇష్టమైన మాట
చిర బంధంతో పాటలో స్వర మవుతుంది
ఎక్కడ ఉన్నా గాలి వీస్తుంది వివిధ స్థాయిలలో
దిశా నిర్దేశంతో పయనిస్తుంది ప్రాణిత లోకంలో

సుమ హృదయానికి కలహ పాత్ర తెలియదు
రణ ధ్వని ప్రసక్తి లేదు, సుందర పరిమళాలు తప్ప
ఖడ్గ మదికి స్నేహంతో ప్రేమతో పనిలేదు
దారిలో దిగిన ముల్లు శత్రువును జ్ఞాపకం చేస్తుంది

నిరోధం విరోధం మలుపుకు కారణమై
నడచే మనుషుల గమ్యం దిశ మారవచ్చు

అంకిత భావానికి బరువుల సంగతి తెలియదు
తనలో బాధ్యత మేఘంలా నడిపిస్తుంది

అస్తిత్వం వ్యక్తిలో సమాజ బంధాలతో
తత్వ శోభ పొందుతుంది, విశ్వమయమై

కవితలో జీవన తత్వం లోతులు చూపేను
నవతలో విశాలతలు, నిజ దృష్టికి వచ్చేను

ఆకలి వైరం సమరం క్రూర మనో రూపం
అధికార బలంతో అహంకారం నిప్పులు పూసేను
ఉదార గుణాలతో యశో బింబాలను వదలేను

ప్రకృతి ప్రాణి మనిషి ఒకరి నొకరు బాధించే
ఘటనలు లేకపోలేదు, సంశ్లిష్ట జీవితాలలో
దీని పరాకాష్ట! బాధలు హింసలు ! మృత్యువు కాహ్వానం

నిటలంపై అగ్ని రేఖలా విధి శాసనం
దిశ దిశలో ప్రజాస్వామ్య జలదంకై చూపులు
సాహస చర్యలో తగిలిన గాయంతో 'శాంతి' పదం
కాలంపై వజ్రంలా తళ తళ మెరసేను చరిత్రలో

24. గది ముందు

మబ్బు ! కదలి నట్లు ఝరిణి సాగి నట్లు చెట్టు ఎదిగి నట్లు
పక్షి ఎగిరి నట్లు పగలు వెలిగి నట్లు బ్రతుకు సాగాలని

కానీ ! లిప్తలు మంచు పలకలవలె గడ్డ కట్టవచ్చు
క్షణాలు నిప్పు కణాలవలె ఎగసి పడవచ్చు

సమయం నిశా కరవాలమై మెడపై సూటిగా
ప్రమాదాన్ని ఎదుర్కొనేను ! మనిషిలో శక్తి చలనం

ఎవరి నెవరు కాపాడేరో! తెలిసిన గాథలలో
మనిషిని మనిషి హతమార్చే దృశ్యాలే ఎక్కువ
నెత్తురు చిత్రాల అలంకరణలతో సమాజం
వ్యూహం పన్ని దారులు మూసి దెబ్బ తీయడమే

ఆశల పల్లకి పై ఊరేగుతూ కొందరు
ఆశల రథం పై పయనించాలని కొందరు
మబ్బులు కదలడ మాగేనా? ఏదీ ఆగదు
నీరు పారడం నిలిచేనా? అన్నీ జరిగేవే !

మనిషి జీవితంలో స్థితులెన్నో ఒకటొకటీ
దారులు మూసినవీ, తలుపులు తెరచినవీ
మనిషి మనిషి మధ్య ఎడం! పయనంలో
అడుగు వేయడంతో భవిత ! కొగిలించుకునేను

పెదవులు తెరవలేని మాటలను హృదయం చెబుతుంది
హృది కందని వాటిని అంతరంగం చెబుతుంది
మదిలో అందని కోర్కె లొకటొకటీ
నేరుగ కలల నాశ్రయించేను

చీకటి తెరపై వెలుతురు గీతల బొమ్మలు
ఊరట కలిగించేను, ఆశలు బ్రతికించేను

మస్తిష్క ద్వారం ముందు చీకటి కాపలాగా
మనిషి మది గది ముందు బొచ్చుకుక్కలా ఉదయం !

25. అలలు కలలు

ప్రతి దిశ కొక ప్రత్యేకత ఉంది
ఉదయం అస్తమయం కుడి ఎడమలలో
రవి కిరణ పథంలో మానవ యానం
నాల్గు దిశలలో సమాజ జీవన సంరంభం

నిప్పంటి నట్లున్న ఆలోచనల్ని శమింప చేస్తూ
మనిషి వెనకనే నీడలు! ఆశీస్సు కరాలు సాచి

బ్రతుకులో దార్శనికం కలగానే మిగులుతుంది
మనసులో ఆదర్శం లోపంతోనే మిగులుతుంది
ఈ రెండు చక్రాలకు మరో రెండు చేరేను
అనుభవమూ వాస్తవమూ సమాజ వాహన గతిలో

వెలుతురులో ఎరుపుదనం ఇనుమడించడం కాదు
దాని ప్రభావం బ్రతుకులపై ఎంత వరకు అని?
ప్రక్కన పచ్చదనం ఏపుగ ఎదగడం అవసరమే
దాని ఉపయోగం బ్రతుకులో ఎంతవరకు ఉండేనని?

ఉదయంలో తెలుపు దనం ఎంత స్వచ్ఛమని కాదు
అది మానవ రూపానికి మూలం! మొదటిది తప్పనిదీ
నీలి రంగు సరేసరి! నీడలో నింగిలో నిద్రలో
పలు రంగుల కలయికతో జీవితం అవసరాల వాస్తవం.

కన్నీరు తుడిచినంత మాత్రాన బాధలు తొలగేనా?
శమనం సమస్యను జ్ఞప్తి నుండి జార్చేనా?

నదిలా సాగే మనిషి జీవితంలో
అగ్గిపుల్ల గీసి వేస్తే, ఏమయ్యేను?
మండే కొరకంచును అంటిస్తే
అలలు మండేనా? కలలు కాలేనా?

26. వివిధ పాత్రలలో

జ్వాలా బంధంతో శిఖలుగా విప్లవం
కిరణ స్పర్శతో వేడిగా ఉద్యమం
ఆచరణ గుణంతో జన హిత కరాలతో
సమస్య పరిష్కృతిలో వినిపించేను చరమ గీతం

వెనకనే సమాజ గతిలో నిర్మాణ స్వరంతో
స్వాగత రూపం సంసిద్ధంగా ఉంటుంది

సమాజ పరివర్తనలో సుందరమైన వాస్తవం
దార్శనిక పథంలో వ్యక్తుల పురోగమనం

హింస తప్పని, చర్యల రూపం కాదు ప్రజాస్వామ్యం
సమాజ చరిత్రలో ప్రతి వ్యక్తిని భాగం చేసేను

అనల కర ప్రసారాలతో దగ్ధమైంది
జలద సేచనచే సృజనకు దారితీసేను

ఉద్యమం విప్లవంలో ఘర్షణలు పలు స్థాయిల్లో
మనిషిలో నిజం సంఘంలో వాస్తవం బయటపడేను

ఒక దిశగా నిశ్శబ్దంగా నిష్క్రమించిన చీకటి
మరో దిశలో మెల మెల్లగా ప్రవేశం! జరిగేను
జీవన దృశ్యం పై అనుకోని ప్రభావ ముద్రలతో
ఇది బ్రతుకును వీడని శాశ్వత బంధువు

మబ్బులు మూసినా మంచు క్రమ్మినా వానలు ముసిరినా
బయట పడక తప్పని రవి బింబం వలె ఆశా రూపం
ఆలోచనలకు మించిన అంచనాలతో తీర్చబడేను
ఎక్కడికక్కడ తగిన సవరణలతో బ్రతుకులు సాగేను

పాత కోట నిశ్చలంగా శిథిలాల అలంకారాలతో
దర్వాజ తలుపులు తెరవబడీ వచ్చే వారికై
తోరణమై జ్ఞాపకాలు ఆహ్వాన రూపం పొందేను
ఎవరికి వారు సమాజంలో భాగమై వివిధ పాత్రలలో

27. ఏ పని అయినా

మట్టి పని అయినా మెషిన్ పని అయినా
చివరన పరిణామ ఫలం శ్రమ జనితం
ఇది పూవునొ పండునొ తలపించే పర్యవసానం
నిలుపుతుంది సాగుతుంది ప్రవృత్తి వృత్తి వ్యాపకాలలో

తన జీవన రేఖ నుండి మానవ చింతన దృశ్యం వరకూ
పని చేసే చేతులకు ! గొలుసు పడే స్థితులున్నాయి
గమ్యం చేరే కాళ్ళు నిశ్శబ్ద పథంలో
శృంఖల రవళించే వారూ ఉన్నారు

ఉన్న దుస్థితి నుండి సుస్థితికి చేరే
కోర్కెలు చుట్టలు గా అందరిలో
ఆపరాని మార్పు ఉరవడిలో వస్తే తప్ప
జడత కరగి కదలి ప్రవహించే వీలు లేదు

మనిషి నడకలో ఒత్తిడి వసుధకు తెలుస్తుంది
పయనంలో వహిస్తుంది చేతన గుణ రూపం

గగనం పిడికిలి తెరిస్తే జలదం ఎగిరేనా?
మేఘం హృదయం విప్పితే ఆర్ద్రత ఒలికేనా?
గగనం పిడికిలి వలె మానవ సంకల్ప హృదయం
మేఘం హృదయం వలె మానవతా రాగ రూపం

జీవన చలనంలో సృజనకు ఎపుడయినా ఎవరయినా
ఆర్ద్రత రాగంతోనే, అస్తితకు అవకాశం

స్వచ్ఛంగా శుభ్రంగా ఉన్న మనో రూపం
అవసరాలలో ! పలు రంగులు చోటు చేసుకునేను

మనిషిలో ఆలోచన ప్రవాహమై కదలవచ్చు
బ్రతుకులో అనుభవం హిమాకృతులు పొందవచ్చు

హంస నెమలి జింక పావురం తమ గుణ వర్తనలో
మనసును నడిపించేను ప్రజాస్వామ్య సమాజంలో

28. వడపోతకు గురియై

వ్యక్తి నుండి సమాజానికి మానవ ప్రయాణం
తన అస్మితతో జన హితలోకం లోకి

అద్దంలో ముఖం సూచన చేస్తుంది హెచ్చరిస్తుంది
పోయే దారిని గురించి ఆలోచన విసరుతుంది
పోవలసిన రథంపైన ఆలోకన మెరపిస్తుంది
తెలిసీ తెలియని సందిగ్ధ స్థితిలో మానవం

ఒకరి ముద్ర మరొకరిపై పరిమితులలో
తాప శిఖలపై నడవాలిసి రావచ్చు
నీటి అలలపై తేలవలసి రావచ్చు
వెలుతురు చీకటి పొలిమేరలలో అనుమానంలో

మనో జగత్తులో మ్యూజియం, వివిధ వస్తు చయంతో
గతం పట్ల ఆదరణ, వర్తమానానికి స్వాగతం

పుట్టుక నుండీ జాతక చక్రంలో మారే స్థితులతో
తిరిగే దశ నుండి దశకు చేరే ఆరోహణలో
బంధు మిత్ర పరిచయ సంబంధాలతో జీవితం
బింబాలో ప్రతిబింబాలో ప్రశ్నలు తూగాడేను జవాబులకై

అమరిన జీవన వ్యూహంలో పీఠంపై ఆశతో
గెలుపు కై ఆరాటం పోరాటం మనసులో ఎప్పటికీ
మనోదాహం తీర్చేను కవిత అనుభవ ధునితో
మరో రూపం ఇచ్చేను నవత మార్పుల గతిలో

కలం పాళి కొనపై భూమి తిరుగుతూ
కలం పాళి అంచున నింగి పరచుకొనీ
కలం పాళి చివరన విడుదలయిన సిరాతో
అక్షర చిత్రాలు ! తేలుతూ బయటపడేను
మౌన ముద్రలో కాలం మిశ్రమ సంకేతాలతో గడచేను
వడపోతకు గురియై నిలిచే యశో మూర్తులతో

29. మరోలోకం

కవిత చెప్పేప్పుడు వ్రాసేప్పుడు మనసు
మేఘు వాహనమై పయనింప చేస్తుంది
కవిత పలికేప్పుడు చదివేప్పుడు ఊహ
సూర్య కిరణ తేజంతో ! సరిస్తుంది

చలి బాపే నులి వెచ్చదనంతో కవిచే
ఉత్సాహ తంత్రులు! మీట బడేను కవితలో

ప్రేమకు కరుణకు సృజనకు శాంతికి
కవిత ! చివరి మజిలీ! స్మారక లక్ష్యంతో
కవితలో ఇపుడు పద పదం మధ్య
ఖడ్గ చాలనమో! బాంబు రహస్యమో?

కదలే నది వెంబడి సాగుతుంది మనసు
తీరాన చరిత్ర స్మృతులతో, సంస్కృతి గంధంతో
వర్తమాన స్పృహలతో, వికాస ప్రతినిధియై
అక్షర పద పంక్తులచే నిర్మాణం! సుందర వాహనం

మరు క్షణంలో ఏమి జరిగేది తెలియదు
అయినా కాలాన్ని శాసించాలనే ఆలోచన
విధి పేరిట తలవంచేడం జరుగుతుంది
శ్రమ జీవన ఫలాన్ని కోరడం సహజం

కొండ కొమ్ము నుండి క్రిందికి ప్రవాహం దిగినట్లు
ఆటకు పాటకు సావకాశ మయ్యే వెన్నెలవలె
సరసి బురద నుండి పైకి ముఖమెత్తిన పద్మం వలె
కవిత ! దిశలు చేరుతుంది పరిమళ చేతనతో

దోషానికి నేరానికి మనిషి మనసు! శిక్ష కన్నా
క్షమను కోరుతుంది, మరో అవకాశంతో
దేహంలో జీవాణువుల శక్తిని పెంచుతుంది
మనసులో తెలియని అభినవ లోకం దింపుతుంది

30. సంవేదన - సందేశం

దివి నుండి సూర్య చంద్రుల ప్రకాశ ప్రసారం
భువిపై ఆ వెలుతురులో విభవ సుందరంగా

ఒక్కొక్క దిశలో అనుభవ మొక్కక్క విధం
శూన్యమనుకున్నది మనిషికి విషయ మవుతుంది
దారులు తెరవబడీ పయనం సాగుతుంది సుగమంగా
చీకట్ల ప్రభావం ఎక్కడో రహస్య ప్రదేశాలలోనే

గాయ పడిన వ్యక్తి బాధ తెలిసేందుకు
తాము కూడ గాయపడ నవసరం లేదెవరికీ
ఈ భువి మనుషుల ఆక్రమణంలో జీవన గతులతో
ఆ దివి కనిపించని దేవతలకు నిలయమైంది అతీతమై

సమయ సమయం జీవన సంకలనాలతో కవిత
సృజన కళతో అభినవ రూపం పొందుతూంది

కష్టంలో నష్టంలో భవిత గురించి చింతన
మానసిక క్షేత్రాలలో ఆశా వాహనమై ఎగిరేను

ఇతరుల నాకర్షించేందుకు ఆత్మహత్య జరగదు
ఆవేశంలో ఆలోచన స్తబ్ధమై జరగ రానిది జరిగేను
ప్రమాదంలో చనిపోవచ్చు
విరోధంలో చంపబడొచ్చు
నిరాశ లెన్ని విధాలో? చావులన్ని తీరులు
కొమ్మ నుండి జారే పూవులా నిష్క్రమణం జరగవచ్చు

గట్టు దాటి ఎగసి పడే కెరటం వలె తొలగవచ్చు
చెదరిన స్థితుల కలిసి ఆయువులో మళ్ళీ చేకూరేనా?

తీరికలో మనసు గతంలోకి జారుతుంది
ఊరటకూ పశ్చాత్తాపానికీ పనికి వస్తుంది

తొలకరి చినుకుల కయి వేచి చూచే కళ్ళలో నుండి
రాలే బాష్ప బిందువు వెనక ఎంత సంవేదనో? సందేశమో?

స్వేచ్ఛా కవిత్వం - 116

అక్షర హృదయం

మాదిరాజు రంగారావు

2021

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

116 AKSHRA HRUDAYAM

SWECCHA KAVITHVAM

Telugu

Free - Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2021

Presented to

my daughter

Dr. Charitha M.

California, USA

with blessings

on her Birthday

పీఠిక

కవిత్వం ప్రధానంగా దాని ప్రభావాన్ని విశ్లేషిస్తే 1) భౌతికమైన మానసికమైన స్థాయిలలో వైయుక్తికమైన దృష్టితోను సామాజికమైన దృష్టితోను రెండు విధాలుగా అనుభవానికి వస్తుంది. దృష్టి అనడంతోనే కోణం మారుతుంది. కోణంలో దృశ్యం మారుతుంది. దీనితో పాటు లౌకికం తాత్త్వికం దార్శనికం పొరలు మనసు నావరించి ప్రత్యేకతల్ని తలపిస్తాయి. కాలం గడచే కొద్దీ ప్రభావం విప్పారుతూనే ఉండటం మంచి కవిత్వ లక్షణం. ఎన్ని సమస్యలున్నా స్పందన స్పృహ కోల్పోరాదు.

సృజనలో 1) అభివ్యక్తి కళ 2) దార్శనికత రెండూ కలిసిన కవితాత్మ ప్రధాన పాత్ర వహిస్తుదనడంలో సందేహం లేదు. దీనికి కవిలో తాను నిర్వహించే పని పట్ల అంకిత భావం తల్లీనత, స్థిరత చేత అంతర్వ్యక్తిత్వానికి బలమేర్పడుతుంది. ఎట్టి పరిస్థితులలోను మానసికంగా కుంచితం కారాదు. ప్రఫుల్లం కావాలి. గొప్ప రచనల్లో ఈ అంశాల్ని స్పష్టంగా గమనించవచ్చు.

స్వేచ్ఛా కవిత్వంలో ఈ వెలుతురు పథాన్ని అనుభవ క్రమంలో చూడవచ్చు.

ఇక బయటి ఆవరణంలో మానవం – మానవత, జీవితం – సమాజం – నాలుగు చక్రాలపై నడచే అక్షర వాహనం ప్రత్యక్షమవుతుంది. ఇది ఏదో అర్థంకాని తాత్త్వికమైన గహన విషయం కాదు. జీవితంలో కాలాంతరాన వడపోసిన సారభూతమైన విలువలతో సంపన్నమయింది.

ఈ కృతిని చదవగానే లేదా వినగానే మనస్సులో మరో జగత్తు అవతరించడం ఒక అనుభవ విశేషం. స్థూలంగా చెబితే వ్యక్తిలోని స్థితిగతుల్ని గురించి సమాజంలోని చలన శీలాన్ని గురించి 1) వ్యక్తి వికాసం 2) సమాజ దర్శనం రెండిటి సమ్మేళనంతో ఆకర్షణీయతను కలిగింది. వివిధ వాద సిద్ధాంతాల వేదిక అయిన ప్రజస్వామ్యం విలువల్ని గుర్తుకు తెస్తూంది.

ఇక ఆధునిక కవిత్వంలో అనివార్యాలుగా వస్తూన్న భావరూపాలు, ప్రతీకలు, మనస్తత్వ ధోరణులు చైతన్య స్రవంతి లహరులు విశ్లేషణకందుతాయి.

ఇది సహృదయ విమర్శకుల బాధ్యతను పెంచుతూంది. కవిలో విశిష్టమైన సృజన రూపాన్ని తలపిస్తూంది.

స్వాగత హృదయంతో...

– మాదిరాజు రంగారావు

1. ప్రతి బ్రతుకూ విలువైనది

నవ్వు ముఖంలో ఉదయం మొదటి కిరణం
ఏడ్పు ముఖంలో సాయం చివరి కిరణం
ఇవి రోజులో పగలుకు మొదలు చివరలు
జీవన ఘటనలలో తప్పని అనుభవాలు

కవికి కవితలో రెండూ సమానం
భావనలో సాంద్రత విలువల సంగతితో
వచ్చే తరం ఇంత కన్న మేలైన బ్రతుకులలో
దరిద్రం వదలిన ఆరోహణ క్రమం సాగాలనీ

దారులన్ని మూత బడిన విషమ స్థితిలో
తీవ్ర పదం పొందుతుంది అనల జలధిలా
ఆర్పే హృదయంతో ఆదర్శం నిలిచేనా?
వసంత స్పృహ కవకాశం మనిషికి దొరికేనా?

ఇది సుమ శోభను వదలి
అగ్ని దీప్తి పొందేనా?
చేతిలో కనిపించే పూల గుత్తితో
బ్యాగులో దాచేసిన రివాల్వరుతో

వీథిలో మనిషి స్వేచ్ఛగా! అనుమానం లేకుండా
ఏ ఘోరం జరిగేనో! తెలియని మహదాశ్చర్యంగా

కట్టె నిప్పు బొగ్గు మట్టి మనసు
అనల చర్యలతో సతమత మయ్యేను
భ్రమావరణ శూన్యంతో అబద్ధం కాదేదీ
నిజ జీవన వ్యూహాలతో వాస్తవమైనవీ అన్నీ

సౌభాగ్యం సంక్షోభం సహనం అలజడి పయనం ఆటంకం
అన్నిటినీ దాటుతూ జీవితం! ఆగనిదీ తప్పనివీ
కాలంతో పాటు సమాజం నిరంతర చలనంతో గతమై
మానవ చరిత్రలో సంపదల ఖజానాగా మారేను

ఎవరికి వలసిన క్రియను వారు అపేక్షించేరు
ఎవరికి నచ్చని చర్యను వారు ఉపేక్షించేరు
సమాజంలో అందరికీ అవకాశం తప్పనిసరి
అందునా జన స్వామ్యంలో ప్రతి బ్రతుకూ విలువైనది

2. స్వేచ్ఛలో స్వతంత్రం

మట్టిని చూడగనే జ్ఞాపకం వస్తుంది మొక్క
చెట్టును చూడగనే జ్ఞాపకం వచ్చేను మనిషి

మట్టి మొక్క మనిషి అనుబంధం మాత్రం మదిలో
సమాజ దార్శనికానికి ప్రతీకరూపమిచ్చేను

అర్ధరాత్రి దేశ స్వతంత్ర సమావిష్కారం
ఆ క్షణం నుండి పెరిగిన వ్యక్తుల విధులు బాధ్యతలు
చీకటి మేఘం నుండి మెరుపుల వలె చూపేను
చూపులలో విజయంతో ఆశా నవ రూపాలు

సమస్యల ఆభరణాలతో ఈ దేశం
పరివర్తనలో వాస్తవాకృతి మిరుమిట్లు గొలిపేను
ప్రవాహమై దరిద్రాన్ని తుడిచేయాలసి ఉంది
వనరులతో ఆకలిని చల్లార్చాలిసి ఉంది

కిరణ తంత్రులపై ఉదయ రాగం వినిపించేను
జీవన పటంపై భాగ్య దృశ్యం రావలసి ఉంది

నిన్న ఉన్నదే ప్రకృతి – సమాజ పార్శ్వాలు
ఆచరణ జగత్తులో పరివర్తన లభించేను

కొత్త ఉదయంతో చరిత్రలో జనరూపం
స్వస్థాన బలంతో అస్తితలు ప్రజాస్వామ్యంలో
సామాన్యుని కోరిక పూచేననీ, ఫలమందే ననీ
జనత చేతిలో అదృష్టం ! స్వేచ్ఛకు నిలయమైన స్వతంత్రం

మనిషి తన విజయం కోరే సమస్య లెన్నో
చుట్టు! తిరిగే సీతాకోక చిలుకల వలెనో
తలను స్పృశిస్తూ ఎగిరే పిచ్చుకల వలెనో
ప్రయోగ శాలా రూపంలో ఈ జీవితం

ఉద్దేశంలో అర్థం పెరిగే పదం
ఎంత ఎత్తుకయినా తీసుక వెళుతుంది
ఎన్ని దిశల చివరల నయిన చూపుతుంది
ప్రతిభ చేత కవితలో కిరణ మవుతుంది

3. చీకటి శిల్పంగా

పొద్దునే గూడు నుండి బయట పడి పగలంతా
విహరణంతో గడచే పక్షుల వలె మనుజులు

నాలుగు గోడల బయట స్వేచ్ఛ కెంతో అవకాశం
వ్యక్తిలో తన బాధ్యతలను మెరపిస్తుంది

ఈ వైవిధ్య సమాజంలో ! ఏ చోటు నుండైనా
ప్రశ్నల జెండాలు రెప రెప లాడ వచ్చు ఎదురుగా
మనిషికొక విధంగా చరిత్రలో మనుషుల జవాబులు
నిజమేదో ఎవరికిని తెలియని స్థితి అసలు విషయం

హింస హత్య పీడన కలహం, సంకుచితాలలో
అణచివేత ఆక్రమణం స్వార్థంలో బ్రతుకులు

దేశం ఈ స్థితిలో ఎందరి చేతులు మారిందో?
అది కొందరి అవసరాలకే పరిమితమయింది

పాలకు లెందరు వచ్చినా, నైతికమైన పునాదు లొకటే
శిథిలాలపై నిర్మాణ శిఖరాలు వేరుగా ఎత్తుగా
శ్రమ శక్తుల ప్రగతి ఫలం! ప్రజలకు చెందిందీ
ఇది చింతనలో కన్న మనిషి ఆచరణం తోనే సాధ్యం

సమ న్యాయంలో వస్తువు సమ భావం తూకంలో
తరాజు పళ్ళేలు ఒకటి కిందికి మరొకటి పైకి

మనిషి మనిషిని కలుపుకొని పోయే కన్నా పాలనలో
స్వేచ్ఛా యానంలో మనసులు విడిపోయే స్థితులే ఎక్కువ

సమాజ చరిత్రలో నిర్మాణ విశేషాల కన్న
విధ్వంస పరంపరకే ఎంతో ప్రాధాన్యం!
పంచాయతి నుండి పార్లమెంటు వరకు
ప్రతి మెట్టు పైన విరోధ పక్షం ఆటంకం.

కల్లోల ప్రవాహాన్ని దాటే వంతెన అందరిదీ
ఎవరో కొందరిలో స్వంతానికి దుర్భర మతి కారాదు
మానవ శక్తుల పై కన్న అతీతంపై విశ్వాసంతో
వెలుతురు కిరణం బదులు చీకటి శిల్పంగా మారేను

4. జన స్వామ్యం వెలుతురుదే

ఏ వినీల భయం వలనొ ఈ నిశీధి కొందరు
భీరువు లై ఏ దరినొ సమయం గడిపేరు
మౌన ముద్రలో కొందరు శాంత సుందరంగా
కళ్ళు మూసుకొని కొందరు పైకి పొంగే జలధి భయంతో

ఉదయ స్పర్శతో బ్రతుకులు శబ్ద మయ మయ్యేను
కాలంతో మాట లాడుతుంది పరివర్తన సమాజం

వ్యక్తి రక్తి నుండి సంఘ శక్తికి పయనంలో
వేరు వేరు దారులలో నడతలలో మార్పులతో

రవి చంద్రుల ఆదర్శంతో జీవితమొక ప్రేయో రూపం
ఇది లోపలి జ్వాలా ప్రకటన రూపం కావచ్చు
మంచు బొమ్మల కొలువుగ కనబడవచ్చు
అన్నిటి అనుబంధంతో జీవన చక్రం కదలేను

నేతల డొల్ల తనంతో జనత జడిమ వైఖరితో
ఏ దారి లభించేనో? ఏ పయనం సాగేనో తెలియదు
మృత్యువు తీర్చిన ఘటనలు ఎదురుగా
క్షణ క్షణం భయంతో మనుషుల బ్రతుకులు

ఏమయినా కానీ మును ముందుకు పోవలసిందే
ఎదురుగ స్వాగత పంక్తులు వినబడవలసిందే

లేవగనే సూర్యుడు అడుగు వేసి ముందుకు
జలధిలో సరసిలో నదిలో చెలిమెలో అంజలిలో
నీటి దర్పణంలో తన ముఖం చూచుకునేను
చల్లని ఆశ్వాసంతో పయనం మొదలవుతుంది

తన చుట్టు ఉన్న ప్రకృతి దృశ్య నేపథ్యంలో
మనిషి మనసు దగ్గరో దూరమొ మనుషుల పైనే

వెలుతురు చీకటి పొలిమేరలు గమనంలో
ఆదర్శం వాస్తవం రెండిటి మధ్యన పోటీ
గెలుపెవరిది? అంటే జీవన రుచి భాగ్యంలో
ముందు చూపులో కదలే ప్రజాస్వామ్యం వెలుతురుదే

5. ఎవరి నెవరు?

గతంలోని మట్టి తీసి బొమ్మలు చేసి
రంగు లేసి వర్తమాన ప్రదర్శనలను తీర్చేరు

అన్ని ముందుగ సిద్ధ పరచి అనుకునే విధంగా
దృశ్య పరంపరలు తీసే సినిమా కాదు జీవితం

మొట్ట మొదటి కర్తవ్యం ! ఆకలి సెగల నార్పడం
ఆపైనే ఆలోచన! సంపాదన భోగం మిగతావీ

అడుగు వరసలో వేళకు ఆహారం సులభం కాదు
శ్రమ జీవన గతిలో కృషి ఫలం ఎవరిది? ఎంత?

ప్రాథమికావసరాలలో అందరికీ చెందినదీ
ఆపై మోజు ధనంపై, ఆరాటం అధికారంపై

జన్మభూమి దేశభక్తి భావనతో
ప్రియతర మవుతుంది ఆత్మ రాగంతో

గమ్యం చేరేందు కెన్ని దారులో
బ్రతుకులు, గడచేందు కన్ని ఉపాయాలు

గుడిలో గంటలు మ్రోగేను పదే పదే
దైవాన్ని సమాయత్త పరచేందుకు, నమ్మకంగా
ఆర్తిలో పిలుపుతో పరుగెత్తుక వచ్చేనని
మనోగతం శబ్ద తరంగంపై చేరేనని

ప్రతి మనిషి బ్రతుకులో ప్రియమైన లక్ష్యం
శాసిస్తుంది పాలిస్తుంది తీరుస్తుంది నడిపిస్తుంది

అమానుషాన్ని పీఠంపై నిలపడం
ఇష్టమైన పనికా దెవరికినీ ఎప్పటికీ

అడవిలో చరించే మృగం దారి తప్పి
ఊరు చేరి మనుషులలో దూరేనా?
మృత్యువు తలుపులు తెరవబడీ హఠాత్తుగా
ఎవరి నెవరు హతమార్చేదీ తెలియని రహస్యం

6. బొగ్గు కుప్పవలె

ఎవరి పట్ల శత్రుత దేనికి? ఎంత వరకు
ఇది మృగాన్నే కాదు మృత్యువును రక్షిస్తుంది
మరో వ్యక్తి అండను కోరేను మనిషి తనలో
నిర్ణయ బిందువు ఎరుగని మంచికైన చెడుకైన

విపణిలో మానవత ఆశకు దొరికేది కాదు
ఇది చూపుకు కనిపించని మనిషిలోని వెలుగు
అంతరంగ స్పృహతో మనసుకు అందే విషయం
పగలు రాత్రి భేదం లేని అతీతమైన నిజ రూపం

వ్యక్తితో పరిచయం ఎడారి సంబంధం కారాదు
నీలిమబ్బు కదలికతో చినుకు జారడం అవసరం
ఎడారిని సమీపించగనే గాలి బరువెక్కుతుంది
ప్రకృతి వ్యధల కథల దృశ్య ప్రకటనంతో

గాలి తాకి చెట్టు అలరుతుంది, వణకుతుంది
మంద తీవ్ర గతులతో చలనంలో భేదంతో
అనుమానం ఆటంకం వ్యతిరేకం బ్రతుకులలో
అధిగమించే సహన రేఖ అవసరం నిరంతరం

ప్రతి వ్యక్తి మేధలో చిన్నదో పెద్దదో ప్రయోగశాల
తనతో మరొకరికి లాభించే విధంతో అపూర్వం
తన లోని బలం తెలిసిన మనిషి మనసు
విజయేచ్ఛా భావనలో ఓటమి నంగీకరించదు

ఒకపుడు నదీ తీరాలలో సంస్కృతి నిలయాలు
ఇపుడు సిమెంటు దారుల కూడలిలో హోర్డింగులు

ఎవరి చివరి గమ్యం శ్మశానం కాదు సమాధి కాదు
విరామ పధంలో వెలిగే ప్రేరణ రూపం యశోరూపం

వీధిలో కార్నర్‌లో బొగ్గు కుప్పవలె బిక్షువు
అనల కణంతో నిప్పై చలి కాచుకునే దయ్యేనా?
ఎవరికి? సమాజానికా? ప్రభుత్వానికా?
దరిద్రరూపం దేనికయిన పనికి వస్తుందనా?

7. అన్నిటికి నిలయం

మనిషిలో ఎన్ని ప్రపంచాలో పైకి కనిపించనివి
వాటిలో జీవితాన అనుభవ వికాస రూపమొకటి
కాలం గడచే కొద్దీ లిప్తల మెట్లపై ఆరోహణలో
పైన ఇంద్ర ధనుసు నిలయం చేరాలని ఆలోచన

జలధిలో కెరటాల వలె మనసులో ఆలోచనలు
పైకి కనిపించని అక్షర పద బంధువులు సృజనలో

నది కదలుతుంది; ఎక్కడెక్కడి నుండో ఎవరెవరో
దప్పికలో పైరు పంటకై ఆశ్రయణీయం అయ్యేను
ఆహారోత్పత్తులకై ఎన్ని ఉపాయాలో శ్రమ రూపాలో
అవసరాల పనులలో విజయం ఒక లక్ష్యంగా

వేరు వేరు ప్రభావ ముద్రలతో రుతువులు
వేరు వేరు జీవన రీతులతో బ్రతుకులు
కష్టాలను నష్టాలను చెప్పుకునేందుకంతా సిద్ధంగా
తీర్చే చర్చా వేదికగా కవితను భావించేరు

ధరిత్రితో కర్షకులు మాట్లాడేరు
యంత్రంతో కార్మికులు భాషించేరు
వేరు వేరు వ్యాపకాలలో మరొకరు మరొకరు
సమాజ శక్తులతో ! మాటా ముచ్చట జరిపేరు

సంఘంలో పలు విధాల బలం వెన్నుదన్నుగా
ముందుకు వెళ్ళేందుకు రహదారులు సిద్ధంగా
నేటి పనికి నిన్నటి యోచన చలనం వలె
రేపటి పనికి నేటి ఊహలు అవసరం

కాలాని కతీతంగా కవి రచనలో మానవ శక్తులు
గుప్త నిధుల వలె తవ్విన కొద్దీ బయట పడేను
సూర్యుని వలె వెలిగే లోని మనః ప్రకాశానికి
మాటతో సృజనకు అంతరంగ మవసరం
అన్నిటికీ ఆశ్రయ నిలయమైన కవిత
ఎన్నిటినో తనలో ఇముడ్చుకొని మెరసేను

8. ఎప్పటి కయిన

చెప్పరాని దెంతో ! ఉంటుంది ఎవరి కయినా
వినే వారు దొరకాలే కాని సమాప్తి లేదు
చేరే మజిలీ గురించి అనుభవ జగమెంతో
పయనానికి అంతంలేదు, దారులు భిన్నం కావచ్చు

ఏ కాయ పండు కోసమో తార రాలి పడేందుకో
చెట్ల పైకి నింగిలోకి విసరిన రాయి
గురి తప్పవచ్చు, నిరాశ ముఖాన దిగవచ్చు
అక్కడ చేరిన మరొకరిని గాయ పరచొచ్చు

ఒకరి విమర్శ నిప్పుల కుంపటిలా
అదే ! మరొకరికి ఎర్రని సుమ గుచ్ఛంలా
ఏదయినా! కవి పాత్ర ! అందని ఎత్తులో
ఇతరుల పని చెట్లూ చుక్కలు లెక్కపెట్టడమే

"స్వేచ్ఛ" అన్న మాట వినని వారు కూడ ఉన్నారు
వినబడినా! ఒంట బట్టని వారు ఉన్నారు
అమాయకుల వలె కనిపించేవారూ ఉన్నారు
దురపయోగంలోనో నిరుపయోగంలోనో గడపేరు

అర్ధరాత్రి ఈ దేశం స్వాతంత్ర్యం తేదీల సంధిలో
అది నిద్రా నిశీధి, మెలకువలో ఏ కొందరో ! నేతలు
ఎవరి పరిమితులతో వారు తమ తమ హక్కులతో
ఎవరి అనుభూతిలో వారు సంతృప్తి రేఖలతో

కష్టమైన నష్టమైన బాధ్యత వ్యక్తులదే
చలికి సెగ కాచుకొనే కుంపటివలె
ఏదో ఒక కారణం! అనుకూలం కాని స్వేచ్ఛలో
నిప్పుతో చెలగాటం జరగవచ్చు అనుకోనిది

చెప్పని "నిజం" ఎవరికైన తెలియని రహస్యం
మబ్బులో సూర్యుని బింబం వలె పరిగుప్తంగా
ఎప్పటి కయిన వర్తమానం ప్రతిక్షణం భవిత వైపే
గతం మరుపున బడుతుంది, భవిత జ్ఞాపక సూచి అవుతుంది

9. కన్నీరు నెత్తురు పోటీ

దుఃఖంలో హృదయ నిలయం కిటికి తెరచుకుంటుంది
ఇది మానసికం, బయటి నుండి పూర్తిగ కనిపించనిదీ
మోదంలో హృదయ ద్వారం తలుపు విప్పారుతుంది
మనిషిలో మాత్రం ఎప్పటికీ సంతోషంగా ఉండాలనీ

బాధలో శిశిరం అడుగులు వేస్తూ ఉన్నట్లు ఉంటుంది
తృప్తిలో పచ్చని శాలువ ధరించి నట్లుగ ఉంటుంది

వేదికపై నుండి ఆదర్శం దశ దిశలు ధ్వనిస్తుంది
జీవితాన నీలి మబ్బులాగ అందకుండ పోతుంది

ఎడారి ముఖంలో గ్రీష్మ భావరూపం నిలుస్తుంది
జలదాగమనంకై చూపులు నిగిడిస్తుంది

శబ్దంతో పాటు మనసు ! కవిత నావహిస్తుంది
కదలికలో చేతన అభినవ రూపం పొందుతుంది
తన మనసులో ఆలోచన ఎదుటి వ్యక్తి కన్నులలో
కనిపించాలని కవిలో కోరిక ప్రతిఫలిస్తుంది మాటలలో

ఈ బ్రతుకున కవతల ఉండేదేదో ఉంటే ఉండనీ
ఆది బ్రతుకును మ్రింగేసి శూన్య పటం నిలపకూడదు
మనిషిలో ఆకర్షణ చింతనకు దారి తీస్తుంది
తాను బ్రతికే లోకాన్ని మరపించి, మరొకటి చూపుతుంది

పొలం చేను తోట మైదానంలో మొక్కకు రైతుకు బంధం
సామాన్యుని కామనలో వికాస భూమికతో యంత్ర యుగం

ఎవరి కొంగు పట్టుకొని కవి తిరగడు
ఎవరి చేయి పట్టుకొని కవిత రాదు

కాళ్ళ నేలపై మస్తిష్కం ఆకాశంలో
సమాజ రేఖలతో కవిత స్పందన హృదయంతో

జీవన రణం భయాన్ని దిశా వలయంపై విసరీ
కన్నీటి చుక్కలతో నెత్తురు చారలు పోటీపడతాయి

10. కథలన్ని తీరులు

చాచిన అరచేతులు పైకి రేఖలతో శూన్యంగా
కానీ వాటి బుజాలపై ఎన్ని సమస్యలో
గగనంలో మేఘ శకలం కనబడితే చాలు
విత్తులో వచ్చే పంట కళ్ళలో కళకళలాడేను

అన్నం అందించే చేతులకు సంకెళ్ళు
ఇది పాలకుల నీతి చరితకు సూచన అవుతూంది
ఇది వెన్నతో అందిన లౌకిక తంత్రం కాకూడదు
శ్రమ ఫలితంలో తమ ఇంటి దీపం ఆరకూడదు

చివరన పర్యవసానంలో ఏమి జరిగేదీ తెలిసేదీ
చేతికందేదీ నిలిచేదీ కాలంపై అనుభవ గతిలోనే

గగనాన కనిపించే మేఘం రైతు కన్నులలో సజలంగా
విత్తనం పడకముందే భాగ్యానికి బేరసారాలు
ఏదో ఒక సమస్య మధ్యలో పంటల ప్రతిదశలో
శుష్కీ భూతమో తుఫాను వేగమో కీటక చర్యలో

ఏదో ఒక పేరుతో సమస్యపై అలజడులు
శాంతికి ఉరి చుట్టి విషాద రాగం వినజేసేరు
చుట్టు జరిగేవి చూస్తూ వింటూ ఏ హృదయం
మౌనంగా ఉండేను మనిషి మేల్కొనే దెప్పుడు?

అన్నిదారులూ మూతపడేను అపజయ సూచనతో
మిగిలింది ఒక కవితయే ! అక్షర హృదయంతో
తన కోసం పన్నిన బోనును పులి
నోట కరచుకొని పరుగుతీసేను

మనిషి చూపులో జరిగే ఈ కూడని పనికి
జరిగేదేమి? బాణం దూసేరా? బాంబు విసరేరా?

సముద్రం మౌనం ఎరగదు సమాజం చలనం మానదు
ప్రతిమలెన్ని విధాలో కథలన్ని తీరులు మనిషిలో
వేటికవి కళ్ళు చెవులు మతి పనిచేసే స్థితిలో
సరి అయిన అంతరంగ స్పందనతో నిరంతరం

11. భేదం లేదు

ఈ సమయం పూల చెట్టు అయినా పొగల జాడలతో
నిప్పు పూలు పూచేనా? భ్రమలో తిరుగాడగ జేసేనా?
మాటలో వసంత హృదయం శబ్దించవచ్చు
బ్రతుకులో గగనం మౌన భాష మాట్లాడుతుంది

చూస్తూ ఉన్న కొద్దీ వింటూ ఉన్న కొద్దీ
ఏవేవో కథలు కల్పనలుతో సమాజంలో
ఒకటొకటీ దుర్భర జీవన చర్యలతో
ఆకాంక్షలు ముఖాన తొంగి చూచేను

నేతలు మతు లెక్కడ తాకట్టు పడినవో
అపుడపుడు నిరాశలో నిలువున మునుగుతూ
ఆ వెనక నుండి ఒత్తిడిలో పరిస్థితులొకటొకటీ
అలల వలె ముందుకు సాగేను! ఎందాక? గట్టు దాక

ఎగసే అలలు జీవన భాగ్యాన్ని గుర్తుకు తెచ్చేను
అక్షర పంక్తిలో ధ్వనించే అనురాగం పలు దిశలలో
గాలిలో వినేవారు వినేరు, అన్నట్లు కాకుండా
అందరికీ చెందిందీ కర్తవ్య బోధను చేసేదీ

పనికి రానివి ఒకటొకటి చీకటి మూలన చేరేను
పనికివచ్చే ఒకొటొకటి వెలుగును వరించేను
జ్ఞాపకాలు భద్రంగా మనసు పేటిలో
అపుడపుడు బయట పడి ఉత్సాహం నింపేను

ఇవి ఎన్ని రంగులలోనో అన్ని స్థితుల తీరులతో
ఉత్సాహం నింపేను ముందుకు నడిపించేను
జెండాకు బదులు బుజాన నాగలితో
నినాదాల హోరులో కర్షక సమూహ స్వరచక్రం
దిశలు చుట్టి వచ్చేనా? అందరికి తెలియజేస్తూ
ప్రజాస్వామ్య గతిలో ఆదర్శాన్ని వాస్తవం చేస్తూ

హార్మనీ మెట్లపై ధ్వని లహరుల వలె క్షణాలు
సంస్క్రియా పరిమళాలకు పగలు రాత్రి భేదం లేదు

12. శిల సందు నుండి

పాలనలో హింసను హంసగ మార్చేందుకు
ప్రేమతో ఉదార కరుణ సహన నీతి అవసరం
వీటికి చోటు లేని ఏ దర్శన మయినా
వాదంలో అగ్ని శిఖల నృత్యమే జరుగుతుంది

చర్యకు కఠిన చర్య మాటకు వాడి మాట
ఏ సమస్య మూలాన్ని స్పృశించలేదు తీర్చలేదు
జీవన గతిలో ఆయుధ యోజనతో పనిలేదు
పూల గుత్తితో మర్యాదా నిపుణతతో సాధ్యం

మణి దీపంతో చీకటి రాత్రి గడవదు
విప్పారిన ఆలోచన గుఫ్ న వెడలవచ్చు
వేగంలో తీవ్రమయిన శక్తితో పవమానం
బలం తగ్గిన చెట్టును పెనుగాలి పెకలిస్తుంది

తత్కాల విజయంతో ఊహల ఊయలపై
దిశలను తాకే కల్పనల అల్లికలు మతిలో

జీవితం క్షణాలలో అదృశ్యమయ్యే ఇంద్ర ధనుసుకాదు
నిరంతర ఘోషలో కల్లోల రూప జలధి, కాదు

దువాళించు సీతాకోక చిలుకలు తుమ్మెదలు
రోజు నెన్ని ప్రమాదాల నుండి బయట పడేనో?
జలధిలో ప్రాణులకు పైకి వచ్చేయాలని కోరిక
మనిషిలో ఆలోచనలకు బయట సత్క్రియపై కోరిక

చీలిన చెట్టు కొమ్మ ముందునకే సాగుతుంది
వెనక్కు మరలి తిరిగి పూర్వ స్థితికి రాలేదు
చీలిన నది పాయ ముందునకే సరిస్తుంది
వెనక్క మరలి మరల పూర్వస్థితి పొందలేదు

పగిలిన శిల సందునుండి వాన చినుకుతో
మట్టి కణం స్పర్శతో సృజన చేతన! ఎదురుగా

13. తలుపులు తెరవబడే

ఏ గోడో ఏ చువ్వలో కనిపించని దూరంలో
ఏ బంధం లోనొ తాను ఉన్నట్లనిపించేను

ఏ బోనో కారాగారమొ విశాలావ కాశంతో
స్వేచ్ఛగ తిరిగేందుకు వీలుగ క్షేత్ర పరిధిలో

ప్రతి వ్యక్తి జీవిత మొక అనుకోని
ఇంద్ర ధనుసు క్షణాలతో భావ క్రియా చలనం

అపుడపుడు నిరాశకు గురిచేసేను
అయినా లక్ష్యం వాస్తవ పథంలోనే

పలు ఊహలతో కోణాలలో దారులతో మజిలీలు
వ్యక్తి పదం పక్కకు జరిగి సమాజ మందుకునే
కవులలో స్వతంత్రమైన వ్యూహ రచన కవిత
ఒకరి సృజన రహస్య మింకొకరికి తెలియదు

లోతుకు పోవాలసి వస్తుంది
ఎత్తును చేరాలసి ఉంటుంది
మనిషి మనిషికొక కిరణం పంచబడదు
విశ్వమంత ఒకటే సూర్యుని తేజం
ఇది కవితకు వర్తించే చేతన రూపం
అక్షర పద ఘటితమయిన స్పందన రూపం
ప్రతి వ్యక్తిలో ఏదో ఒక ప్రత్యేకత ఆకర్షణ
లేనిది సృష్టికి పూర్ణత చేకూరదు, వ్యర్థం కాకూడదు

నది ఎంత ఎత్తులో కఠిన శిలల మధ్య పుట్టినా
వంపులలో నుండి తరలి జలధి చేరవలసిందే
ఉదయ కిరణ స్పర్శతో బంగరు తలుపులు మనసులో
బ్రతుకు పట్ల ఎక్కడ లేని జీవన నీతిని పెంచేను

రాత్రి వెన్నెలలో చెట్టు
సుప్త చేతనలో కోర్కెలతో
తనలో కలల కవకాశం దొరికేను
స్వేచ్ఛకు హృది తలుపులు తెరవబడేను

14. మసక మనసులో

కవితకు సమాజంతో ఎంత సంబంధమో
ప్రకృతి తోను అంతే చెదరని అనుబంధం
శాంతికై ఆలోచనలో క్రియా శక్తితో యత్నం
అహంకార విస్ఫోటం రణ కారణమయ్యేను

చెట్టును చూస్తే కొందరికి మసక మసకలో
మనిషి నిలిచి నట్లే ఉంటుంది ప్రత్యామ్నాయంగా
నడవ లేని దయినా మనిషిని తలపించేను
మేధ లేనిదయినా అస్తిత చూపేను సజీవంగా

విత్తున గురించి ఆలోచనలో గతం జ్ఞప్తికి రావచ్చు
పూలతో పండ్లతో వర్తమానం బుట్ట నింపవచ్చు

వెలుతురుచే మనిషికి పరిచయమైన మనిషి
మిత్రంగామారి, గిరి శిఖరం చేరవచ్చు
శత్రువుగా మారి లోయలోకి జార్చవచ్చు
ఒంటరిగా పయనం సాగ చేయవచ్చు

చిన్నవొ పెద్దవొ కథలో జీవితాలు
పణం ఒడ్డి రణంలో పడిన వీరులు
ఇపుడు చెట్ల రూపంలో తోచేరా?
పండుగ బొమ్మలై కొలువున చేరేరా?

ఇహ పర భావన సంస్ఫురణంతో
శిల్పాలై ఆలయ నిలయాలలో జ్ఞాపికలయ్యేనా?

కళ్ళు మూత బడక పోవచ్చు
పెదవులు కదలి నట్లని పించవచ్చు
చెవులు ఉన్నా లేకపోయినా ఒకటే
అంతశ్చేతనతో అంతరంగ మవసరం తప్పనిదీ

సూర్యుడో ఆఖరికి చంద్రుడో చుక్కలో లేని జగత్తు లేదు
స్పందనలేని బదులు రాని చెట్టుతో స్నేహ వశంగా
వివేక బింబం తోనే మనిషి అస్తిత చేకూరేను
మబ్బు మసక తొలగీ ఉదయ కిరణంకై వేచి ఉండవలసిందే

15. పోటీ

గాధలతో చరిత్రయై అనుభవ సంపదతో బ్రతుకులు
ఆగని పరివర్తనలో మానవ మనోజ్ఞ రూపంతో

శ్రమ చేతనతో ప్రవాహ గతిలో సమాజం
మేఘ పంక్తి ప్రతి ఫలనం ఒక సుందర వాస్తవం

తనకు కొంత తెలిసి కొంత తెలియని
మనసు పాత్ర కీలకమయి దృశ్య మాన మవుతుంది

జలధిని చూడగనే గతం పరచినట్లు
కదలే అలలను చూడగనే వర్తమానం
సామాన్యం స్థాయి నుండి విశేషం, ప్రత్యేకం
క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు
కవితలో చోటు పుష్పక విమానం వలె
ఏదీ తిరస్కృతం కాదు, అన్నీ పురస్కృతాలే

మానవ సమాజమే కాదు కవితలో చేరేది
విశ్వమయం సర్వసృష్టియుతం మంచి చెడు కలనం
పూర్ణ బింబ రూపంలో హృదయానికి హ్లాదంగా
చాచిన అరచేయిలో ఏదో ఒక పూవో ! పండో ?

జీవన సందర్భంలో వివిధ దశలలో కవిత
కష్టం సౌఖ్యం పేదరికం సౌభాగ్యం మిత్రత శత్రుతలతో
ఏదీ తేల్చి చెప్పరాని సందిగ్ధానికి వశమయ్యేను
మొదటి నుండి చివరి దాక వ్యాపకాలు వ్యవహారాలు

బయటి నుండి వాహనం హారన్ విజిల్
స్తబ్ధతను వదలించేను మనసును పురికొల్పేను
దెబ్బతిన్న శరీరం పై గాయాలు
కథలో అనుకోని మలుపులను తెచ్చేను

కింద శ్మశానంలో ఎగసిన ధూమ పంక్తి
పైని నీలి మబ్బుతో పోటీ పడేను
దూరం వెళ్ళలేని స్థితిలో
మనిషి మనసులో దిగేను సూటిగా

16. రోజు గడుస్తుంది

ఎవరయినా కానీ అంతరంగ స్పందన మరచి
ప్రభువుల కను కూలమొ ! ప్రతి కూలమొ ! పక్షాలు
వివిధ పాత్రలలో ఈనాటి కవులు ! ఎక్కువ సంఖ్యలో
చాలా కొద్ది మంది ఇరు వైపుల హేతు దృష్టితో సాగేరు

ఎంత పొగడితే అంత లౌకిక వ్యవహారంలో విజయం
ఎంత తెగబడితే అంత కంత ప్రచార పర్వం పత్రికలలో
ఎంత జ్వలిస్తే అంత ప్రకాశ భాగ్యమనుకునేరు
ఇవి జీవన యానంలో పొందే మర్యాదాలంకృతాలు

సమస్యల పరిష్కారంలో మానవ హక్కుల రక్షణలో
కవిత! శక్తివంతమయిన ప్రయోగ సాధనమవుతూంది
ప్రజల నుండి ఉద్యమం! సాగుతుంది సశక్తంగా
మనిషిలో బీజ భూతమైన పనికి క్రియా రూపమిస్తుంది

మేఘంతో వర్షం వలె, సూర్యునితో వెలుగులవలె
అవని తలంపై నది వలె, గగనంలో పవనం వలె
లోని వ్యక్తి బయటి కవి ఇరువురు ఒకటే సృజన విషయంలో
సామాన్యుల కన్న మిన్నగ ఎత్తులో అక్షర పంక్తులుగా ఊహలు

ఇపుడు స్వర్గం నరకం వేరు వేరుగా లేవు
రెండూ కలిసిన మిశ్రమ రూపం వర్తమాన వాస్తవం

చేతనకూ మెలకువకూ మధ్య తెలివిలా
తెలుపునకూ నలుపునకూ మధ్య ఎరుపు రేఖ
ఆవరించిన పెను చీకటిలో దీపం! చిన్నదయినా
ప్రభుతను ప్రదర్శిస్తుంది, వెలుతురుల బలంతో

ఉదయం నలుపు తప్ప అన్ని రంగుల కలయికతో
కిర్మీరం! వెనకనే కనిపించీ కనిపించని ముఖంతో చీకటి
ఉత్సాహం ఆవేశం ఆక్రోశం ఆవేదన ప్రయోజనం
అన్నీ కలిసి సహన సంపుటిగా రోజు గడుస్తుంది వడిగా

17. మోదమో ఖేదమో

గుండ్రంగా తిరిగే వాస్తవ జీవన చక్రంపై
నిజ రూపం దొరకడం బహు కష్టం ! ఏ రోజూ
ధూళి ధూమ పంక్తులతో వాతావరణం పేజివలె
కష్టం నష్టం మలిన కల్మషాలు లేని బ్రతుకు లేదు

కట్ట తెగిన చెరువు ! బహు ప్రమాదకరం
నీతి లేని బ్రతుకు ! అనుకోని అపాయ కరం

జీవన బాధ సమాజ గాధగా మారుతుంది చరిత్రలో
గతంలో భాగమై భవితకు ఎరుపు సూచి అవుతుంది

ఆపదలో కోల్పోయిన నవ్వుకు బదులుగా శమనంగా
పై నుండి చుక్కలు మినుకు మినుకున సానుభూతితో
ఉదయ ప్రకాశం హ్లాద సుందరతలకు సంకేతం
శక్తిని మేల్కొలిపి మనిషిని ముందుకు నడిపిస్తుంది

మట్టికి తెలుస్తుంది వెలుతురులో సృజన ప్రపంచం
మనిషికి తెలుస్తుంది మనస్సులో జీవన సత్యం

ఒకరి నుండి హక్కుల కయి ఆరాటం పోరాటంతో
కవిత శక్తివంతమైన సాధనం ప్రయోగంలో
ఇది! ప్రజల నుండి వెలువడుతుంది వజ్రాయుధంలా
మనిషిలో స్తబ్ధమైన యోచనకు క్రియాశీల మిస్తుంది

నిర్మాణ వికాస రూపంలో రెక్కలపై ఉద్గమనం
మనిషికి ఆరోహణలో జీవితమొక మనోజ్ఞ వాస్తవం

కొత్త మాట కయి గాలి ఆరాట పడుతుంది
కొత్త ముఖం కయి సందర్భం ఆరాట పడుతుంది

ప్రకృతిలో పచ్చదనం ఎరుపులోకి మారవచ్చు
మార్పుకు తప్పక రావలసిన చర్యకు సూచనగా

పునర్విలోకనం కొత్త బాధ్యతలను పెంచేను
పశ్చాత్తాపం క్షాళనతో స్వచ్ఛత చూపేను
ఒక బాష్ప కణం మోదమో ఖేదమో బీజమై
మనో లోకంలో మహా తరువుగ మారేను

18. తప్పనివి

ఏరోజు కారోజు ఎవరి ప్రయాణం వారిది
తొలి ఉషః కిరణంతో ఆరంభం మొకరికి
ప్రభాతోన్మీలనంతో పునర్భవం చూపేను
సమాజ గమనంతో కాలం కదలితేనే సార్థకం

మరొకరికి అర్ధరాత్రి క్షణం నుండి రోజు మొదలు
ఈ నిశీథి ఎందరో విరామ స్థితిలో ఉండవచ్చు
కొందరు కలలలో మైమరచి ఉండవచ్చు
నియంత్రణం నుండి అధీనం తప్పి కొన్ని స్వేచ్ఛలో

సృజన హృదయానికి ఉషస్సు బహు ప్రీతికరం
కొత్త యోజనలకు అర్ధరాత్రి మెలకువతో గడపేరు
అన్నిటికీ సిద్ధంగా ఉంటుంది మనోరూపం
అవసరం కలగవచ్చు, ప్రయోజనం చూపవచ్చు

మృత్యుభయం లేకపోవచ్చు తుల్య స్థితిని పొందవచ్చు
ఇది చుట్టూ ఉన్న అమరికలను భగ్నం చేస్తుంది
సమూహంలో శూన్య మేర్పడి నట్లుగ ఉంటుంది
ఏదో తెగిన బంధం లేని లోటు చూపిస్తుంది

కవితలో పద పదం ఎన్ని రంగుల లోనో
చిత్రాలై కవితలు శాలా నిలయమేర్పడేను

భౌతిక దూరంలోనూ తెగని మానస బంధం
మనిషి మనిషి తోనే కాదు, ఉన్న ప్రపంచంతోనూ
ఎంతటి స్వేచ్ఛ లోను మానసిక తృప్తి లోను
భౌతికాన్ని వదలి పూర్తి అవదు మానస రూపం

శరీర నిర్బంధంలో పొందే చెప్పరాని అసౌకర్యం
మనిషిని నెమ్మదిగా జడత లోకి దింపుతుంది

పూజనీయం హ్లాదనీయం మానవీయం దైవీయంలో
ఎంత గొప్ప పాత్రలోనూ ఎప్పటికీ శిల శిలయే

ఏరోజు కారోజు ఎవరి జీవన విధం వారిది
స్వేచ్ఛలో తప్పని జీవన నియత నిబంధన లెన్నో

19. రైతు స్థాయిక్ బ్రతుకు బ్రేక్

కాలాన్ని అర్థవంతం చేసే చలనంలో
సంఘాన్ని జీవ వంతం చేసే యోచనలో
కాలం అనుకూలం కై ఎదురు చూస్తూ
ఉన్న దానితో గడచేను రైతు జీవితం

నాగలితో మొదలవుతుంది అదృష్ట బిందువు
చినుకులతో రేఖల రూపం పొందుతుంది
పంటకు బంగారం అబ్బేనని తృప్తి కళతో
కొడవలి ప్రత్యక్షమవుతుంది, ఫల రూపమందిస్తుంది

విత్తు నుండి విత్తుకు కారణమౌ సంతోషం స్పందిస్తుంది
శ్రమ చేతనతో అంచెలుగా ఇది పరిణత రూపం
ఫలితం అందే సమయానికి అవసరాలు పేరుకొనీ
సమాజ చలన చక్రం క్రింద, నలిగే స్థితి లేకపోలేదు

బేర సారాలతో తూకం ధర రాబడి మాయా జాలంలో
ఎప్పటి నుండో వచ్చే విపణి నమూనాలో మాయమయ్యే
భ్రమింప జేసే వాతావరణంలో దళారుల వ్యవహారం
ఆశించిన దానికి బదులుగ నిరాశ తూగేను తరాజులో

మురిపెం ముచ్చటగా వచ్చిన పంట, పళ్ళెంలో హారతిలా
ప్రకృతికి నైవేద్యంగా ! సంఘానికి ఉపదగా చెల్లేను

కర్షక కార్మిక సమూహాల సంఘటిత శక్తి రూపం
సమాజ జీవన గతులను నిర్దేశించేదవుతూంది
పయనించే కాల మహా వాహనాన్ని పరుగెత్తించేను
కుదట పడిన మనసుకు ధైర్య కళ లభించేను

వ్యక్తిలో క్షుధను మరపించే ఆశా రూపం
రాసులుగా సమాజాన్ని భాగ్య దశకు చేర్చేను
సామాన్యుల బ్రతుకులలో వ్యక్తి స్థాయిలో మాత్రం
శూన్యమైన అరచేతులలో దరిద్ర తాండవం జరిగేను
మళ్ళీ కథ మొదటికి ఫలితం ఎప్పటిదే ఇప్పటికీ
వాలిన పొద్దులో ఎండిన ముఖంతో అడుగులు బరువుగా

20. పొలంలో హాలికుడు

రైతు స్థయికులో ఉంటే హఠాత్తుగా
బ్రతుకు బ్రేకులో సతమతమవుతుంది
కొత్త వరాల జల్లు కురవక పోయినా
ఉన్నది కాపాడు కోవడం కూడ అవసరం

బ్రతుకుల్ని విస్తృత పరచే కృషితో
బ్రతుకులకు ఉన్నతి నిచ్చే మదితో
లౌకిక జీవన భాగ్యంతో మానసికానందం
రెండిటితో పూర్ణత ! చేకూరుతుంది వ్యక్తిలో

శ్రామికులను నిర్బంధించమంటే
వ్యక్తి స్వేచ్ఛలో కార్యకలాపాలను ఆపడమే
పవన రూపాన్ని బోనులోకి నెట్టడమే
మేఘ బృంధాన్ని జైలులోన పెట్టడమే

అన్నదాత ఆలోచనలను జ్వాలాకృతి నివ్వడం
జ్వాలా తంత్రులపై అలజడిని మీటడమే

మనుజుల ప్రాణాలు నిలిచేందుకు
బ్రతుకులు సుఖదంగా నడచేందుకు
పనితో కర్షక యత్నం కాలాన్ని జయిస్తుంది
సమాజ సుస్థితికి వెన్నెముకగ నిలుస్తుంది

నడచే కర్షక పద మెంత ఇష్టమో భూమికి
పచ్చదనంతో పరచి సృజన రూప మిచ్చేను

పాలకుల కరకుదనం మొండితనంతో అహంకారం
జన సమూహ వృత్తులు బంధాలను ఛిన్నాభిన్నం చేసేను
మానవతా పటానికి శూన్య రూపమిచ్చేను
రాబడిని పక్కకు పెడితే బ్రతుకులు బాధామయాలే

కోడి కూతతో మేల్కొని విధి నిర్వహణంలో
పక్షుల కలకలారావంతో బయలుదేరి
రవి కిరణానికి కాస్త ముందుగ పోటీలో నిలబడీ
పొలంలో హాలికుడు క్షేత్ర వీరుడు తన పనిలో

21. ప్రమేయాలు

చీకటి పడే ముందు మునిమాపున ఇల్లు చేరే
రైతు బ్రతుకు బాటలో కష్టానికి పొలిమేరలు లేవు
ఈ నాగలి ఎప్పటిదో? దీనిని నమ్ముకొని బ్రతుకులు
తరాలుగా జీవన రూపానికి పుష్టి తుష్టి పొందేరా

వీరి అనుభవంలో తీవ్రమైనవి నిశితమైనవి బాధించేవి
రుతువులు రెండే! ఎండలతో గ్రీష్మం! ముసురులతో వర్షం
ప్రతి ఏడు ఉండేవీ ఈ రుతువుల ప్రభావాలు
కష్ట జీవి శరీరం తట్టుకొనే శ్రమశక్తికి నిలయం

నాగలి చాలుతో విత్తిన అదృష్టం! ఏమయ్యేదీ
ఎంత కలిసి వచ్చేదీ తేలేదీ చిట్టచివరి దశలోనే
పంట చేతికి వచ్చేది, లాభమో నష్టమో! కానీ
మధ్య దళారుల ఆశలలో అంతా తలక్రిందులయ్యేను

నాట్లతో ముందుకు సాగి ఎదిగిన క్షేత్రం
కోతలతో కుప్పలుగా భాగ్యరాశి ఎవరిది?
కాలం అపుడపుడు కష్టంలో ముంచవచ్చు
విపరీత స్థితిలో నిరాశకు లోనుకావచ్చు

శ్రామిక జగత్తులో జీవన రూపం అంతా
కల్పన ఎరగని వాస్తవ చక్రంపైనే తిరిగేను

పక్షుల కలకల ధ్వనితో లేచిన మనిషి
పొలం నుండి ఇంటికి గోధూళి మధ్యనుండి
ముసరే చీకట్లను చీల్చుకొని ఇంటికి
కాస్త మసక క్రమ్మిన దారిని జీరో బల్బు వెలుగుతో

బండి చక్రం వలె కొన్ని ఏండ్లు తిరిగే జీవితానికి
ఇరుసులా ! వ్యవసాయం ఈ దేశం ప్రగతిలో
ఇంతకు ముందు తెలియని దృశ్యాలిపుడు వింతగా
నిరసనలు ప్రదర్శనలు అలజడులు ఉద్యమాలు! వీధులలో
ఈ క్షేత్రంలో నాగలితో మొదలై కొడవలితో ముగిసేదాక
విత్తునుండి కోత వరకు వివిధ దశలలో శ్రమ బంధు ప్రమేయాలు

22. జీవన గీతం

పొలం పనులలో మనుషులు పొందే అనుభవం
బయట ప్రకృతిలో మార్పుల కనుగుణమైన విధంలో
జీవన రూపంలో జిజీవిషను పెంచుతుంది
కాలాన్ని జయిస్తూ పోవడమే ఆయువు పని

ఇచ్ఛ లేంది బ్రతుకు లేదు
నీరు లేంది పంట లేదు
ప్రకృతితో అనుబంధం పల్లెలలో
ఎప్పటికప్పుడు కొత్తగ! ఉంటుంది

ఇక్కడ కల్పనల కలల ప్రసక్తి లేదు
అంతా కరగి పారే వాస్తవ ప్రవాహమే
అపుడపుడు వేడి వేడి మాటలు హెచ్చరికలు
నిశ్శబ్ద వాతావరణాన్ని శబ్దమయం చేసేను

దీన హీన స్థితులు బట్ట బయలుగా
పేదరికం బంధువులా అంటుకొనీ
జలధి ఘోషను తలపించేను గాథా రూపం
హాహాకార ధ్వని వినిపించేను బాధా హృదయం

వెలుతురు గోడలతో నిర్మితమైన భవనం
ఈ జీవిత రూపం, పునాది చీకటిలోనే

మబ్బు నుండి సందు చేసుకొనే చినుకులా
మట్టి నుండి సుతారంగా ఎదిగే మొక్కలా
ఈ సమయం రేపు భవితకు శ్రేయంగా
కొత్త రోజూ వచ్చేననీ, కొత్త బ్రతుకు చూచేమనీ

గాలి పాత పాట వినిపించదు
ఎప్పటికీ ఏదో కొత్తది తలపిస్తూ పోతుంది
పేదరికంలో బ్రతుకులు గడవాలని ఉండదు
పీడన వశమై రోజులు రావాలని ఉండదు
పరిష్కార సుందరతను పొంది సమస్య
భాగ్యవంతమైన జీవన గీతం కావాలనే

23. అదృశ్య రూపం

గిరి శిఖరం ఎత్తులో అందక తిరిగే సమస్య
హేతు బలం హృదయంతో కిందికి దిగుతుంది
కోట గోడల మధ్య నున్న మనసుకు
మార్గ మొకటే ఉద్గమనంతో విశాలత

పాలనలో ముందుగ వర్తించే బలం లాఠీ
ఆపై మిగతావి ఆ చివరకు నిర్బంధం
స్వేచ్ఛను తుంచితే హరిస్తే అన్నీ కుదుట బడతాయని
భ్రమ ! ఉద్యమంపై ఆధిపత్య ప్రదర్శనం! ప్రతిచోట

చతురోపాయాలతో సంసిద్ధంగా ప్రభుత్వాలు
ప్రజాస్వామ్య వేదికపై చర్చలు కొనసాగిస్తూనే
ఎవరి వాదంలో వారు నిశ్చలంగా స్వంత ఎజెండా
అడుగు ముందుకేస్తే తక్కువ తనంగా ఇరు పక్షాలు

కాలానికి సరిపడని చట్టాలు నియమాలు
ప్రకటనలో, వెలుగులు ఆరిన చిచ్చు బుడ్ల వలె
దేని వెనుక ఎవరి హస్తం ఏ తంత్రం ఉన్నా
దేశ పౌరుల దృష్టితో విషమం ఇది కొలిక్కి రావడమవసరం

ఆ రాజులు లేక పోవచ్చు, కోటల ధ్వంసం సులభం కాదు
తరతరాల పరంపరలో భాగంగా అవశేషాలను పట్టుకొనీ
దమన కాండలో శిక్షానీతితో శాంతిని సాధించేరా? పెద్దలు
బూడిద క్రమ్మిన నిప్పుల క్షణాలపై నడిపించేరా ? ప్రజలను

ఎవరి స్థాయి పరిమితులు వారివి అయినా
వెసులు బాటు సర్దుబాటు తప్పదు, సమాజ హితంలో
ఎవరి రిమోట్ ఏ వ్యూహంతో పని చేసినా
కష్ట జీవులు కర్షకుల చరిత్రలో “ఉదార” పదంపై దృష్టి అవసరం

స్వేచ్ఛలో సాయుధమో అపరాధమో దేనికయిన అవకాశం
అయితే ఆదర్శం అరచేతుల కందని సూర్యబింబం
కిరణ ప్రసారంతో ప్రకాశ రూపంతో సంతోషంగా
సమాధాన పడడ మొక అవశ్యమైన ప్రజాస్వామ్య విధం

24. కథ మారుతుంది

నేరం శిక్ష పాపం పశ్చాత్తాపం దోషం సవరణ
ఖేదం మోదం వేదన శాంతంతో అనుభవ ప్రపంచం
జీవిత కాలంలో మనసు నావహించేను
ఇవి లేని జీవితం ! చిత్రం లేని ఫ్రేమ్!

ఆలోచనలు బహు విధాలు ! భిన్న భిన్నం సమాజం
మాటతో భావ ప్రసారంతో తన అస్తితను తెలిపేను

ఎప్పటి కపుడు ఆయువు తీగెల్ని సరిచేసుకుంటూ
పోవడమే జరుగుతుంది! సునాదాన్ని కోరే మనసు

దాహం తీర్చే నీరుతో, ఆకలి బాపే పంటతో
మోదంతో విప్పారే ! హృదయం, మౌలికమైన అవసరంలో

పూవు ఏడుపు ముఖంతో కనిపించదు
అనల శకలం బాధను మెర పించేను
ఎపుడు? ఏది? అవసరమో దానికి సిద్ధంగా
వాస్తవ చలనం మానవ భౌతిక జగత్తులో

చీకట్లను తొలగించే వెలుగులు కోరేరు
నిర్నిరోధంగా నియత యానం సాగాలనే

చుట్టు చీకటి కోట గోడతో పని సులభం కాదు
మూసిన తలుపుల మధ్య ఉద్గమనంతో సాధ్యం

వెలుతురు ఎవరి ఆస్తి కాదు, అందరిదీ
బయట ఇంటి ముందు ఉన్న వెలుగు బల్బు
దారిన వెళ్ళే ప్రతి మనిషిని ఆదరిస్తుంది
ఉత్సాహం నింపుతుంది మనిషిలో ఉదారంగా

మూసిన పుస్తకంలా నిశీథి మౌనంగా
రాత్రికి నిద్రకు సంబంధం ఎప్పటిదో?
మనిషిలో శక్తిని నిలువ పరుస్తుంది
ఆలోచనా శిఖరాలకు మనసును చేరుస్తుంది

ఆకు ఎండినా పూవు వాడినా క్షతం కాదు తరువు
మూలంలో జీవన సారంతో కొత్త కథకు మారుతుంది

25. యంత్రాలవలె

పండుగ రోజు ఏదైనా రోజువారి ఏడుపుకు తావు లేదు
ఇది ఉల్లాస ఉదార విరామ వేళలతో పూర్ణమయింది

ఎవరి పట్ల సానుభూతి మాటల అల్లిక కళలచే
కాలాన్ని కొత్త డ్రెస్‌లో సమోద రూపంలో చూపలేదు

రాత్రి వేళ చుక్కల వలె అనుభవాలు
మనసులో అవలీలగ చోటు చేసుకోనేను

పండుగ అంటే ఆ రోజు కష్టాలను మరచి
ఉన్న భాగ్య దశను ప్రీతి కరంగా మలచడం
తనతో పాటు పోటీలో మరొకరు ఉంటేనే
సందర్భానికి తగిన శోభతో గెలుపుకు విలువ

నలుపు రేఖ అసంతృప్తి కవకాశం లేదు
నిరసనలో ఎరుపు సూచికి వీలులేదు
ముఖాన చీకటి బొమ్మల కొలువుకు చోటులేదు
ఏ పూవైనా ఏడుపుతో తన ముఖం చూపదు

చలి కాచు కొనే నెపంతో చేరి అగ్ని ముందు
వెనక నుండి చాటుగ నిప్పంటించే వారూ ఉన్నారు
ఏమీ తెలియనట్లు కళ్ళు మూసుకునే వారూ అక్కడే
ఏదో పని మిషతో మాయమైపోయే వారూ ఉన్నారు

పండుగ రోజున ఘోరమేదీ జరగదనే
ఉగ్రవాద మయినా శత్రు చర్య అయినా

అగ్నికి దయ ఉండదు కాల్చడమే పని
ఒక్క క్షణంలో శత్రువు రూపమెత్తి
దుర్భర జీవన చిత్రం సృజించవచ్చు
అగ్నికి ఆహుతి పుణ్యమనుకునేరు కొందరు

సహజంగా బయట పడే వాటికి తోడుగా
యంత్రాల వలె కష్టాలు సృజించే నేతలెందరో?

26. భిక్షాటనం

ఆయుధ సంబంధం లేకుండా ఉద్యమం ఒక తపస్సు
మంటల కన్న ప్రకాశ రాగమే సూర్యునికి అందం
ప్రయోగంలో బులెట్ కన్న పుష్పమే అంతరాత్మకభిమతం
ఆలోచన ఆయుధం కాలేదు, మనిషి ఉనికి ఆచరణంతోనే

కవితలో ఆశారూపం బ్రతుకులో ఎదిగేను తరువుగా
మనిషిలో వికాస హేతువు, చేసే పని సార్థకం ప్రధానం

కలలు మరుగున బడి మరవడం ఎంత మంచి విషయమో
లేంది, మెలకువలో వెంటబడితే మాత్రం అంతా కలవరమే

కశ్మలాన్ని ఎప్పటికపుడు శుభ్ర పరచడ మవసరం
కల్మషాన్ని అప్పటికపుడు దగ్ధ పరచడం ముఖ్యం

కోరిక కాశ్రయం దొరికితే చాలు దిశల నందుకో చూచేను
అనుభవంలో తృప్తికి చివరి అంచు, గగనమవడమున్నదే

అణచివేత సందులలో నుండీ ఆక్రందన వాడి బాణమై
పీడకుల్ని ఛేదించే లక్ష్యంతో అస్త్రరూపం పొందుతుంది

సాయం సంధ్యా సమయం విలయభావ చిత్రం కాదు
ప్రకృతిలో మార్పుకు చిహ్నం మనిషికి విరామ సంకేతం

ఏది ఎవరికి నచ్చినా నచ్చక పోయినా అది ఆగదు
ఒకరికి మేలని పించింది, మరొకరికి కాక పోవచ్చు

ఒంటరి తనానికి ఊహా సౌధం నిర్మించుకొని
ఎవరికి వారు తమకు తాము బంధనలో బ్రతికేరు

తాపమయినా వానలయినా, శీతమయినా
కాల విపరిణామాలకు సమాధాన పడే ప్రజలో
మనసుల స్థితితో మనుషులు అననుకూలగతిలో
శ్రమ ఫలం విషయంలో ఆటంకం అసంతృప్తి

అక్షర మాలలో మొదటి అక్షరం వదలబడేనా?
అక్కడ దాని స్థానం పదిలం బ్రతుకులో ప్రతిఫలనం
మదిలో ఆశలు! పూలు బదులు ముళ్ళు చూపవచ్చు
పగలంతా క్షేత్రంలో పని, రాత్రులు భిక్షాటనమా?

27. భవిత వికాసం

సమాజ నేపథ్యంగా ఉన్న ప్రకృతిలో
గిరులు నదులు చెట్లు మట్టిపై దృశ్యంలో
మనుజులు శిలల వలె కనిపించ వచ్చు
పరిసరాల ప్రభావంతో నిస్తబ్ధ క్రియలో

శిలలతో సంబంధం ఎప్పటిదో? ఇప్పటిదా?
తొలి మానవ చరిత్ర నుండి నిష్క్రియకు ప్రతీకమై
కళాత్మకత కాశ్రయమై కఠినంలో కమనీయంగా
సృజనలో సందర్భ బలంతో, ప్రతీక స్థానం గొప్పది

జల కళతో సరించాలని శిలలో కోరిక సహజం
చినుకులు పడుతూనే జారి తరలి పోతాయి
ఆర్ద్ర భావ స్పృహ ఒక అపూర్వమైన అనుభవ క్రియ
జడమూ చేతన కలిసిన రూపం అభిషేక స్థానం

కనిపించని దేవతల ఆకారాలతో కొన్ని
కమనీయమైన కళా భంగిమలతో కొన్ని
పునాదిలో సౌధానికి బలమిచ్చేవి కొన్ని
ఎవరి చేతనో విసరబడి గాయపరచేవి కొన్ని

జీవన గమనంలో స్థిర సోపానాలయ్యేవి కొన్ని
ఎవరెవరోచేరి కలిసే విశాల భావ రూపంలో కొన్ని
సందర్భం ఏదయినా మంచు భావ జ్ఞప్తికి వస్తుంది
కిరణ స్పర్శతో కరగి ధునియై దాహం తీర్చవచ్చు

గుహావాసం నుండి నగర స్థానం వరకు శిలా ఘటితాలు
కోట నుండి భంగిమల వరకు వికాసపాత్ర రమణీయాలు
ఆలయం శాసనం కట్టడం తీర్చే శిలా ఖండాలు
జీవన సంస్కృతిలో భాగ్యానికి తగిన విధంగా అమరేను
కృషిలో సాధనతో శిల్ప పరంపర చూడవచ్చు
జ్ఞాపక ఫలకాలతో పరిశోధన కుపకరించేను

మనిషి హృదయ స్పందనం మనిషిని తలపించవచ్చు
వర్తమాన దృశ్యం నుండి వేరవుతుంది భవిత వికాసం

28. తృప్తి రేఖతో

ఆ కనిపించే ఆకాశంలో ఆపై కనిపించని
లోకాలపైన, ఆలోచన జరిగినంత గొప్పగా
ఈ భూమిపై సమాజంలో మనుషుల గురించి
కావలసిన యోజనతో శ్రద్ధ ఎపుడు కనబడింది?

ఉన్న దానితో సరిపెట్టుకోవడమే జరిగిన పని
లేని దాని కోసం అదృశ్యకరాలకై వేచి చూడడమే
సమాజావసరాలతో హృదయ స్పందన తోనే ఏదయినా
ఆయా రుతువుల రాగాలతోనే జీవన సౌందర్య కళలు

అద్దాల అల్మెరాలో కండ పుష్టి లేని ఓజస్సు లేని
అస్థి పంజరం వేలాడుతూ మ్యూజియంలో వలె
తెలిసిన చరిత్రలో ఘట్టాలను నెమరు వేసుకుంటూ
ఏర్పడే ఖాళీలను అందంగా అమర్చుకుంటూ
దరిద్ర తాండవాన్ని మనో వేదికపై తిలకిస్తూ
తన కథ చెప్పేనా? మన కథ వినేనా?

శిలల మెట్ల పై నుండి దిగే జలధారలా చరిత్ర
ఆగనిదీ, ఎపుడే కొత్త దారి పట్టేదీ తెలియదు
దౌర్భాగ్యానికి దుర్భరత తోడయిన సందర్భంలో
కష్టాల రాసుల వలె, కొండలు పంక్తులు పంక్తులుగా

గిరులను ఆరామాలుగా, శిలలను శిల్పాలుగా
మలచిన శాలా రూపాలతో భాగ్యం చూపేరు
ప్రకృతిలో వసంతం రాక నవ దృశ్యం కనిపించినా
బ్రతుకులో మనిషికి పూవు ఫలం చేరక పోవచ్చు

తమకు తగిన శ్రమ జీవన చలనంలో ఎందరికి ?
సాధారణ తృప్తి రేఖ, పచ్చని దృశ్యంతో అలరించేను?

29. అభినవ యానం

జలధి తటాన నావ నిశ్చల మౌన ముద్రతో
అవతలి గట్టుకు చేరే లక్ష్యంతో సిద్ధంగా
దూరం నుండి చూస్తే చెక్కిన శిల్ప నిలయం వలె
మనో రూపాన్ని అలంకరించేను మహదాశయం

తపస్సులో నున్న మౌనిలా నిరంజనంగా
వివిధ ప్రయాణికులతో సహాయ గుణ చరితతో
తీరాన నిలిచి ఉంది తాకే చిరు అలలతో
పేదకు జీవనం ప్రయాణికులకు ఆశా కరం

సమాజ వికాస చరిత్రలో
పరివర్తన దశ సంకేతం
కొద్ది సేపటికే ప్రయాణికులతో
జలాలలపై సొగసుగా యానం

అలలపై తేలుతూ వంపులు సొంపులతో
వేగమందు కునేను ! అలలను చీలుస్తూ

ఒడ్డు నుండి ఒడ్డుకు చేర్చే జల సాధనం
ప్రయాణికులతో సుమ గుచ్ఛంలా కదలేను
దుస్తర మనుకున్నది సులభతరం చేసేను
మనిషిలోని శక్తిని ప్రకటిత మొనరించేను

విభేదాలతో ముక్కలయిన మానవం
తిరిగి ఒకటవుతుంది పయనంలో

వాహనం లోకి ప్రవేశించాక మధ్య ఆగేది లేదు
తన దయిన ప్రపంచంలో ఎవరి ప్రమేయం లేదు

నడక వాహనం పడవ విమానం నాలుగు స్థాయిలలో
మనిషి వికాసం మార్పులో నవ సమాజం
తరం తరువాత తరం అందుకునేను ప్రగతి రూపం
అడవి భూమి జలం గగన పథాలలో విజయం

30. దిగలేని రవి

సరసిలో విరసిన కమలాల మధ్య
ప్రతి ఫలించే రవి తేజో బింబానికి
భూమి పై నడవాలని కోరిక ఎంతో
ఇది సాధ్యం కాదని తెలిసీ ! కోరిక

ప్రకాశ ప్రసారంతో దిశలు విస్తరించేను
ఎప్పటి కయినా నెరవేరక పోయేనా? అని
ఎవరి ఊహ మాట చర్య వారికి ఇష్టం
అది దీవెన కావచ్చు శాపం కావచ్చు తప్పదు

ఆచరణంలో వ్యక్తుల ప్రయోజనం ప్రతిష్ఠ
సమాజ చరిత్రలో సంస్కృతి బింబంలో భాగం
కష్ట జీవుల చేతులలో దేశ ప్రగతి భాగ్యం
చరిత్ర పుటలో అక్షర పంక్తులు దేని కది వేరుగా
తెలుపు ఎరుపు నలుపు రంగులలో వేరు వేరుగా
శ్రమ విభజన ప్రయోజనం చూపే జీవనగతి గ్రాఫ్

ఇది జీవన వాస్తవ రేఖలపై ఏర్పడే అపూర్వం
ఇది కాలం ప్రకటించే నిర్ణయంలో తెలియని రహస్యం

నవతలో అనుభవ సాంద్రతతో చెక్కిన శిల్ప నిలయం
కవితలో రసమయ భావనతో ప్రవాహ సంకేతం

అనల కణమై దహన క్రియ కవకాశం కలగవచ్చు
వాన చినుకై పచ్చదనానికి దారి తీయవచ్చు
కవితలో ప్రతీక కళకు స్థానం అమేయమై
బ్రతుకులో సంస్కార దశకు సూచికగా దార్శనికం

ఉదయ హృదయ స్పర్శతో మనుషుల జీవితాలతో
కవితలో తేజో రూపంగా మారే కిరణాలతో
ప్రతి రోజూ ఒక సృజన చేతనా దృశ్యం
సరి కొత్త అధ్యాయంతో మొదలవుతుంది

31. ఫలవంతం

ప్రతి పండుగకూ మనసులో ఏదో పరివర్తన కాంక్ష
మనిషిలో సరికొత్త శ్రేయో భావనతో ఆలోచన
ప్రతి వత్సర మొకటొకటీ విశేషతలతో
మానసికంగా శక్తిని పెంచేను బ్రతుకులో

పగలు మెలకువతో పన్నిన వ్యూహ రచన
రాత్రి కలలో ముగ్గుల రూపంలో కనిపించేను
పండుగ వస్తుంది ఏదో పేరుతో సందర్భోచితంగా
సానుకూల దృష్టిలో మనసును సమన్వయ పరుస్తుంది

ఆ పూట గడవని వారికి పండుగ అనుభవం
ప్రేక్షక పాత్రలోనే డిటోగానో షరా మామూలుగానో

ఇట మాసికలకు చోటులేదు ఆలోచనలో
పరివర్తన దశలో సరికొత్తకు మాత్రమే ప్రవేశం
మార్పుకు ఉత్సాహ పడుతుంది సమాజం
వివిధ తలకు మొగ్గు చూపుతుంది, మనస్సు

రుతువులు వస్తాయి వాటి క్రమంలో తప్పకుండా
బ్రతుకులు గడచేను ఎపుడేమి జరిగేనో తెలియకుండా

మంచు ముసుగు కప్పుకొని వస్తుంది
భూమి దప్పిని తీరుస్తూ పోతుంది
కుసుమ శోభతో హృదయ సౌందర్యం ప్రకటిస్తుంది
కాలం ! విజయ గాథకై ప్రజను ఉపక్రమింపచేస్తుంది

కళ్ళముందు సూర్యుడు తూర్పు నుండి పశ్చిమాన
నిశా నదిలో మునిగి శుభ్రమై అగ్నులారి
ఉదయం తేలేను రశ్మితో హసన్మనోజ్ఞమై
ప్రతి ఒక్కరి హృదిలో ఉదయాస్తమయ ప్రభావాలు

శ్రమ జీవుల చేతులలో జీవన ప్రగతి దశలు
వీధి లైటు స్తంభాల్లా మనషులిపుడు దూరదూరంగా
ఒక దాని వెలుగును మరొకటి అందుకొనీ, సుందరంగా
మానవ జీవన రుచిని ఫలవంతం చేసేను విజయంగా

32. ప్రజాయై నమః - శ్రమాయై నమః

వెలుతురు నిర్భయ మిత్రం ధైర్యానికి ఆయుధం
అయినా మనుషులు భయపడేరు మనుషులకు

లోపం దోషం అంత సులభంగా సరిదిద్ద బడేవి కావు
ఎప్పటి కప్పుడు ఆవేశంలో అనుకోని మొలకలు ఎదిగేను

లౌకిక సౌధ మెంత ఎత్తు విశాలతలను పొందినా
దార్శనిక మూల బలం తోనే ఆయువు చెల్లుతుంది
"దున్నే వాడికి భూమి" నినాదంలో ఆకర్షణ గొప్పగా
ప్రకృతి నుండి మనిషి దాక సహకారం తోనే సాధ్యం

పంట చేతికొచ్చే లోపల ఎన్ని అవసరాలో
ఏది లోపమయినా వ్యవహారం తల క్రిందవుతుంది

తనలో నేరమో! దోషమో! భయపడే సమయంలో
తప్పుకునేందుకు సాగే ఉద్యమ ప్రదర్శనలో చేరేరు
గతాన్ని గుహలో దాచి సుభద్రంగా
దోషి పాలిట ఇది ఒక రహస్య తంత్రం

వర్తమానం కుసుమ మాలతో తిరిగేను ఆదర్శంలో
బయట జెండా నీడలో ఊరట పొందేను
గ్రీష్మంలో చల్లని నదిలో తేజో బింబంలా ఉండాలనీ
రాజకీయ రంగంలో పావుల కదలికలకు వీలుగా

ప్రవాహాన్ని చూచి భయపడే వారిముందు
గట్టుకు చేరే లోపల సుడి గుండాలెన్నో
వ్యతిరేకతలను అనుకూలంగా మలచుకొనే
చతురతకు పర్వతం లేవచ్చు! చెట్టు నడవచ్చు

తమ తమ బ్రతుకులు తళ తళలాడాలనీ
పచ్చని కళ ఎప్పటికీ ఉండాలనీ
గుంపులో ఓం ప్రజాయై నమః
వ్యక్తిలో ఓం శ్రమాయై నమః

33. జర్నలిజమ్ సబ్ మెరిన్

అక్షర హృదయం కవితలో జర్నలిజంలోను
స్పందనలో భావ జగం అన్వేషణలో నిజం
చల్లని చూపుతో బాధ ఉపశమిస్తుంది
వెచ్చని స్పర్శతో వణుకును సరి చేస్తుంది
మానసిక దరిద్రాన్ని మరపున బడ జేస్తుంది
ఎడారి కథలను కుసుమిత మొనరిస్తుంది

వీటితో సమాన మొక రవి కిరణం మాత్రమే
అంతరంగ చేతనతో లోని మనిషి వెలిగేను

గగనంలో విహగ మెంత కాలం తిరుగుతుంది?
ఆరోజున మునిమాపున భూమికి రావలసిందే
మట్టి అంట కుండ గూడు చేరుతుంది
చేతనలో మనిషి మనసు కూడ ఇంతే

విజయ కాంక్షతో మెరసే మనిషి బ్రతుకు
క్షణం పాటు ప్రాణ భయం కూడ తలచదు

దారిన అడ్డంగా ఉన్న అగ్ని రేఖ దాటుతూ
ఎదురుగ ఎత్తుగ నిలిచిన చీకటి గోడలు తొలగుతూ
వ్యక్తిత్వంలో సాహస పద పంక్తులతో
ఏ దిశలో ఏ పనికయినా అడుగులు ముందునకే

చరిత్రను వీపులపై మోస్తూ
సంస్కృతిని బుజాలపై నిలిపే
వర్తమాన సమాజ చలనంలో
అన్వేషణ పరిశోధన మదిలో

నవ కవితకు సరి జతగ చక్రం జర్నలిజం
శాసన పాలన న్యాయం హక్కులు చింతనలో
గాలికి రవంత విరామం లేదు, ఉండదు
వార్తకు ఏ విధమయిన సెలవు లేదు

పొద్దునే ఒక చేతిలో టీ / కాఫీ కప్పు
మరో చేతిలో సమాచార పత్రిక
వార్తలపై ప్రజలో పొంగే ఉత్సుకతతో
అందరికి త్వరగా చేరాలని జర్నలిస్టు తహతహ

వెనక నుండి నేతల రహస్య నిర్దేశంపై
ప్రక్క నుండి పెట్టుబడి దారుల కోరిక పై
కబుర్ల కాలక్షేపంలో కాల చక్రం నడచేనా?
నిప్పు లేంది పొగ రాదని, మంటలపై చూపులు

నేతలో ఏ తప్పు జరగదని ధీమాతో చతురత
అపుడపుడు నిరాశలో పొంగే! కల్లోల సమాజం

బాధలో దించిన తలతో ఉన్న జనతను
వీధిలో ఎత్తిన తలతో నడిపిస్తుంది
రణ చర్యలకయినా సిద్ధంగా ఆపదలో
మేలుకు శాంతికి కట్టువడిన సహన గుణంతో

ధూళి సోకని తనువు లేదు
పొగలు క్రమ్మని మనసు లేదు
భూమి అగ్ని రెండు ! భౌతిక మానసాలు
అక్షర శక్తితో శుభ్రత కవకాశం !

బరువు బాధ్యతలతో కవితతో జర్నలిజం
అక్షర ధామానికి అస్తిత్వం చేకూర్చేను

ప్రాంతీయం నుండి ప్రపంచ స్థాయి వరకు
సమాచార తరంగాలపై జర్నలిజం " సబ్‌మెరిన్ "

34. సహ యోగం - ఇంటర్నెట్

ఇపుడు కవిత అంటే సృజన కళకు మితం కాదు
సుందరతలతో పాటు ప్రయోజన తత్పరత కలిగిందీ
తోడుగ జర్నలిజం అక్షర బల ప్రదర్శనం
వెనుక నుండి రంగుల రేఖలతో చతుర రాజకీయం

విపణి దృష్టితో బ్రతుక్కి తొడుగుల వలె లౌకికం
స్వేచ్ఛలో స్వతంత్ర పాత్రలో అక్షర రమణీయం
వ్యక్తి మూలం నుండి సమాజ దిశలు విస్తరించేను
ఎదలను ఆర్తి నుండి ముక్తం చేసే పనిలో రెండూ

ఎవరి పనుల నిర్వహణంలో వారు "నిజం" గవేషణలో
దారిన అడుగు జాడ లెందరివో కలిసిన సంశ్లిష్టం
కొత్త మాట వినాలని కొత్త ముఖం చూడాలని
కవితలో ఉత్తేజం జర్నలిజంలో ఉద్వేగం పొంగులతో

అక్షర మౌనం తొలగుతుంది, ధ్వనిస్తుంది ఆకర్షిస్తుంది
ఆటకు ఒక్కరితో సొగసురాదు ఎదురగ మరో వ్యక్తి అవసరం

అందరిలో నెత్తురు రంగు ఒకటే ఎరుపు సజీవ చిహ్నం
బ్రడ్ గ్రూపులు వేరు, మనో విధాలు వేరు అనుభవాలు వేరు

సంఘంతో మేఘం అనుబంధం ఎప్పటిదో?
సమాచారం అందించే వార్తా పత్రిక పాత్రలో ఇంటర్నెట్
పురా కథలతో మానవేతర పాత్రలు! సరేసరి
ఇప్పటికీ వార్తలో పావురాయి సందేశం ఉండనే ఉంది

దేని ప్రత్యేకత దానిది పరిపూరక గుణంతో
ఆదాన ప్రదానాలతో పెరిగేను స్నేహ బంధం

స్థలం నుండి స్థలానికి మారవచ్చు ఎవరయినా
లేనిది ఇచ్చేందుకో ఉన్నది పొందేందుకో అవకాశంతో
దూరాల్ని దగ్గర చేసేను కొత్తదనం పల్లవించేను
నిజ నిర్ధారణలో రెండిటి సహయోగం అక్షర హృదయం

స్వేచ్ఛా కవిత్వం - 117

గాయపడిన శాంతి

మాదిరాజు రంగారావు

2021

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

117 SWECCHA KAVITHVAM

GAYAPADINA SHANTI

Telugu Poetry

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2021

Presented to
Dr. M. Santhosh Kumar
with affection & blessings

పీఠిక

స్వేచ్ఛా కవిత్వం పరంపరా క్రమంలో ఇది "117" వది, "గాయపడిన శాంతి" ఇది వర్తమాన సమాజంలో ఉగాది ఉత్సాహ లహరులపై నుండి కాంతి శిఖరాలను స్పృశిస్తూంది. ఈ మధ్య సమయాలలో అలజడి ఆక్రందన ఆర్తి విషాదంతో సహనం ప్రేమ కరుణ ఉత్సాహం శమంకోరే పలు సందర్భాల్ని పురస్కరించుకొని సాగింది. ఇది వర్తమాన సమాజ స్థితుల్ని తలపిస్తూంది. పట్ట పగలు చీకటి పేలికలు మనుషుల ముఖాల్ని కప్పేయడం కనిపిస్తూంది. చూడకూడని ఘటనలు జరిగిపోతున్నాయి, చేయరాని పనులు సినిమాలో విపరీత దృశ్యాల్ని మించిపోతున్నాయి.

వ్యక్తి స్థాయిలో మొదలై సమాజ చలనంలో పరివర్తన లక్ష్యంతో కవిత్వంలో అనివార్యమైన దార్శనిక ప్రభావాన్ని భావింపచేస్తూంది. స్థిరత, దృఢత నైతికతతో పాటు స్పందన గుణం ప్రజాస్వామ్య భావజాలంతో ఆకర్షిస్తుంది. అక్షర జగత్తు నుండి వెలువడిన సామాజిక చేతనా రూపం ప్రగతి శీలంతో సంపన్నమయింది.

ఈ సందర్భంలో ఎప్పటి వలెనే భావరూపాలు (Images) ప్రతీకలు (Symbols) అనుభూతి ముద్రలు సహృదయుల కళాత్మక చింతన కందుతాయి. ఆధునికం గుణ వాచిగా కవిత్వంలో అనితరమైన అవసరమైన సామాజిక పాత్రను వహిస్తూంది. ఇరవై ఏండ్ల కొకసారి కవులు వస్తూన్న మార్పుల్ని గుర్తించడం, వాటిని పరిశీలించడం అవసరం, అవసరమైన మార్పులకు సిద్ధం కావడమూ మంచిది. ఇది సాహిత్య విమర్శలో భాగంగా మంచి పాత్రను నిర్వర్తిస్తూంది.

కవి దృష్టి ఏ స్థితిలోను ఏదో ఒకచోట నిలిచిపోదు, సాగుతూనే ఉంటుంది. విశ్వమయతను పొందుతుంది. భూమిపై నడకతో మొదలయిన మనిషి ఆపైన నీరు గాలి గగనం ఆశ్రయించవలసి రావడం, గెలిచే విధం, వైజ్ఞానిక విజయాలు, వికాస దశలతోనే. ఈ స్థితి నిస్సందేహంగా అన్ని విషయాలలో వర్తమానంలో ఆధునికత యొక్క అనివార్యతను జ్ఞప్తికి తెస్తుంది. అక్షరంలో నిక్షిప్తమైన కంటికి కనిపించీ కనిపించని భావలోకం పరిమళ పవమాన సుందరతను పొందుతూంది. దీనికిదే సాటిగా నిలుస్తూంది. కవి పాత్ర ఒకరు చెపితే ఏర్పడేది కాదు, ఎవరికి వారు స్వతంత్రంగా రూపొందే స్వేచ్ఛా వ్యక్తిత్వంతో స్వయం మనో విషయం. ప్రగతి భావనతో సమాజ సుహితకరమయింది. హృదికి హ్లాదమయమయింది.

– మాదిరాజు రంగారావు

1. గాయపడిన శాంతి

అరవై ఏండ్ల ఆవృత్తంలో ఒక్కొక పేరుతో
ప్రతి వత్సర రూపం! ఒక్కొక వసంత బింబం
ఇది ప్రజలకు, పొందే జీవన స్థితులను సూచిస్తూంది
బ్రతుకులలో ఉత్సేకం నింపుతుంది ఆర్భంగా రుచిరంగా

కాలాంతరాన గ్రహాల చలన ప్రభావం
పండే ఆశల తీరులతో పంచాంగం శ్రవణం
భౌతిక మానస స్థితులలో వచ్చే మార్పులు
తరం నుండి తరాని కందే ! సంపదల చిట్టా

వర్తమానం బిందువు నుండి భవిష్యత్తు రేఖలపై
సుఖాలు పొందే తృప్తిని కోరే మానుష యత్నం
ప్రతి వ్యక్తిలో ఒక్కొక విధం అభినవ స్వరం
ఇది కవితలో ముడుపు కట్టి నంత భద్రంగా

ఈరోజు ఈ చేయి ఎత్తితే అందే పూలు పండ్లు
లోన కల్పతరువు, బయట రసాల సాల శాఖాకృతి
మిగతా రోజులు ! తెలియని యథార్థాలెన్నో
ఈ రోజు ఏదో కాస్త తెలిసి నట్లుగా ఉంటుంది

అదృష్ట సరస్సులో ఆశను పడవగా మార్చేరు
రోజు గడుస్తుంది అద్దిన మానవీయ కళతో
ఎదురుగ బరువులు ! పక్కకు తొలగి నట్లయి
ఉత్సాహ ప్రకాశ రూపంతో ఉగాది ప్రియ మయ్యేను

బ్రతుకులో దరిద్ర వాలకాన్ని అస్తమయ రేఖపై విసరి
మనసును చాంద్రీ హ్లోదమయం చేసేను సమయం
తప్తమైన శుష్కమైన తరు రేఖల బుజాలపై
పచ్చని శాలువ ! ఉగాది హృదయం! తలపించేను

ఈ రోజున నాలుకపై నర్తించే రుచులెన్నో
స్వంత వాహనం వలె కాలంపై చూచే కమనీయాలెన్నో

ఈ రోజున రవి కిరణం కత్తి లోని పదును తొలగి
మెత్తని హృదయంతో నవ కవితయై ప్లవిస్తూంది

2.

ఈ రోజు ఉదయం ఆరు రుచుల కలనంతో
మిశ్రమ భాగ్యంతో జీవన శకలం ! ఉగాది సంరంభం
ప్రకృతి పూల తీగెలతో మనసును బంధిస్తుంది
మనసు భావ బంధంతో ప్రకృతిని వరిస్తుంది

చేతిలో ఆశా పుష్పంతో లేలేత ఉదయ కిరణం
ప్రతి వ్యక్తి ముఖాన్ని స్పృశిస్తుంది ప్రేమగా
రోజూ వినిపించే మాటలు ! కవితలుగా మారేను
పిన్నల నుండి పెద్దల వరకు ఉత్సవ వలయంలో

అమర కుసుమ దళాల అమరికలా సమాజం
ఎదురుగ పరిమళ రస ప్రేయో రూపం
సరి కొత్త దృశ్యాలతో ప్రజల మనో జగం
బంధువు వలె కాలం! వేచి ఉన్న భవితతో

ఈ రోజు అద్దంలో మనిషి ముఖం తళతళ లాడేను
జీవితాన కావలసిన సహన శాంతి సుందరతలతో
ఆదర్శం 'ప్రేమ'లో ఒదిగిన వాస్తవ చిత్రాలు బయట
భిన్న భిన్న ప్రకృతులతో శమించిన ప్రతి చర్యలతో

తెరచిన ముంగిలి ద్వారం నుండి వెలుతురు బొమ్మలు
ఆయువు ఉన్నంత వరకు వీడని ప్రకృతి బంధంలో
ఒకరొకరి పరిచయం స్నేహ కళను పొందేను
వర్తమాన పవమానం పరిమళ వశం చేసేను

వర్తమాన కాలం కెరటాలను వహించేను
హద్దులలో స్వేచ్ఛలో ఉత్సవ రుచి పొందేను
మనసులో అతీత భావ మయ మయి మనిషి
కలిసి వస్తే రాజ్య పీఠాన్ని అలంకరింప చూచేను

ఉదయం కయి ప్రతిదీ సిద్ధంగా, ఆ సమయంలో
వివిధ వర్ణ పుష్ప మాలలతో సమాజం ఎదురుచూస్తుంది
సాయం సమయం నిష్క్రమణ మహా దృశ్యంతో
చీకటి పొగలను చుట్టుకొనీ ఏమాత్రం వెనుదీయదు

3.

మానవ జీవన ప్రస్థానంలో దిశ దిశలో దారులెన్నో
అన్ని విధాలుగా శ్రమ జీవన రూపాలు ప్రయోజనంలో
సమాజ పరిణామ దశ దశలో తమ తమ ప్రత్యేకతలతో
ప్రజాస్వామ్య ప్రయోగంలో సమర్థులెవరైన అనుసరించవచ్చు

శక్తి కొలది తమకు ఇష్టంపై అవలంబించవచ్చు
వర్తమాన పరివర్తనలో వ్యక్తి స్వేచ్ఛ ప్రధాన కేంద్రం
కష్ట జీవుల నుండి బుద్ధి జీవుల వరకు సమాజంలో
భౌతిక మానస స్థాయిలలో దేని ప్రత్యేకత దానిదే

వృత్తిలో పరంపరగా వచ్చే నైపుణ్యం నిలబెడుతుంది
ప్రవృత్తిలో ప్రతిభను గుర్తించవచ్చు ఆదరించవచ్చు
మనిషికి ప్రియమైనవి కొన్ని, తప్పనివి కొన్ని పనులు
మంచి చెడులతో జీవన నిర్ధరి కిరు తీరాలలో సంరంభం

కత్తికి తెలుస్తుంది నెత్తురు భాష
కవులకు తెలుస్తుంది అక్షర రహస్యం
శరీర కష్టానికి దూరమైన అనుభవాల నుండి
సాహిత్యం సంగీతం తాత్త్వికం వైజ్ఞానికం

మానవ విశాల వ్యక్తిత్వానికి బహు పార్శ్వాలు
కళా శాస్త్రాలయి సంస్కృతికి ప్రతినిధు లయ్యేను
ఇవి సమాజ శక్తికి పూర్ణత చేకూర్చేను
మనసుకు హ్లాదంతో మనో రూపమిచ్చేను

సమయ సమయం జీవితం కోరుతుంది
ఉన్నతిని ఉదాత్తతను విపులతను సార్థకంగా
మంచి చెడు మిశ్రమ సంకేతాలతో కూడుకొని
ఒడ్డు నుండి ఒడ్డుకు బ్రతుకు పడవ కదులుతుంది

శిల ఉంటుంది మౌనంగా నిర్భయంగా
ఉలి చెప్పినట్లు వివిధ శిల్ప రూపాలవుతాయి

శిల్పిలో అభిమతినీ వ్యక్తిలో అభిరుచినీ పెంచేను
ప్రవృత్తిలో వృత్తిని ఏకం చేస్తుంది జీవితానుభవం

4.

అభిమానం స్నేహం ప్రేమ బంధుత సుందరతలతో
ఒకరి కొకరి మధ్య వంతెన వలె పరిచయం
అలల వలె కలసి ఒకరి కొకరు తోడుగ కదలేరు
లేంది సమాజ జీవన వ్యవస్థలో అనుబంధ మెక్కడుంది?

తనకు అనుగుణంగా లేని స్వేచ్ఛకు
బంధన గతి కల్పించే యత్నం, మనిషి మనిషిలో
చట్టం నియమం నిబంధనం పేరుతో నిరంకుశం
తరాలు గడచినా ఆజ్ఞలవే ! మౌలిక స్థితులవే

మొదట చిన్న బొట్టుగ రాలిన చీకటి
క్రమంగా చేరుతూ ఒక టొకటీ, మరికొన్నిటితో
కొండను తలపించేను, దారికి అడ్డంగా నిలిచేను
కలహం శత్రుత సమరం వశం చేసుకొనీ
మనో లోకాన్ని అంతలో ఆటవికంగా మార్చేను
అలజడి అశాంతితో చుట్టలుగా మృత్యు భయం

సరికొత్త రూపాలపై అభిలాషతో
సందర్భం మారేను దృశ్యం వేరయ్యేను
గతం జ్ఞాపకం వస్తుంది పైకి ఉబికి వరసగా
ఒడ్డుకు చేరే అలల వలె కదలుతూ, తరలుతూ

విభేదాలలో కన్నా స్నేహంలో మనసును
సమయం ముంచుతుంది పైకి తీస్తుంది శుభ్రంగా

తోడు మనిషి లేనపుడు నీడ ధైర్యమిస్తుంది
గాలి వెలుతురు అండలో సుగమంగా గడచేను
వీటికి ప్రత్యామ్నాయం దొరుకుతుంది కవితలో
అంతరంగ గంధంలో ఉనికిలో మనోహర శిల్పమై

మనిషిపై నమ్మకంతో నిబద్ధ గుణంతో పయనం
సందర్భ వాహనంపై అందరికీ తెలిసిన వాస్తవం

కష్ట సమయంలో మనిషి ! ఏకాంతం కోరేను
రాతి బండ బ్రతుకును శిల్పంగా మార్చే యత్నంలో

5.

కవి దృష్టికి ప్రతి వస్తువు వేలాడుతుంది తూగుతూ
తనలో అపూర్వతను మనసున ప్రదర్శించేను
ఒక దానిలో ఒకటి కలిసి సూక్ష్మ సూక్ష్మ స్థాయిలలో
ప్రపంచానుభవంలో జీవన వాస్తవాన్ని ఎత్తి చూపేను

ఎత్తును లోతును చూపి చకితం చేస్తుంది
మరో జగత్తు నిర్మాణం ఒక కవికే సాధ్యం
మనో జగత్తులో చేరిన వన్నీ ఒకటొకటీ
అక్షర ప్రపంచంలో ప్రత్యక్ష మొక విశేషం

అంతరంగ రూపం తెలిసినా తెలియకపోయినా
జీవన చలనంలో కోరిక లొకటొకటీ అల్లుకునేను

వస్తూ పోయే వాహన ధ్వనుల మధ్య నుండి
చోటు చేసుకొనీ క్రాస్ చేసేరు ! నిర్భయంగా
గాలిలో తేలిపోయే ఆకులానో మనిషి
జీవన వాహన సంరంభంలో పయనం! ఒక విచిత్రం

చిక్కు ముడులు విడదీస్తూ సహనంతో
సమస్యల గొలుసులు వదలించుకుంటూ
పచ్చని బ్రతుకుపై విశ్వాసంతో ఆశామయమై
నిజ శక్తిని ప్రకటిస్తూ కదలేరు మనుషులు

పైన విమాన యానం నుండి మనిషి దృష్టి ప్రసారం
క్రింద చల్లని జలధిలో ఈదే సూర్యబింబ సౌందర్యం
అలలపై అందినట్లయి నీటిలో జారి నట్లయి
గతాన్ని మరపిస్తుంది, వర్తమానం దారి చూపుతుంది

విసరిన మల్లె పూల చెండులా పైన చంద్రుడు
చీకటిని వశం చేసుకునేను తన వెన్నెల కళతో

స్నేహం తీగెకు పూచిన మల్లె పూలు
మనిషికి చీకటికి ఆశా సంకేతాలయ్యేను

మనసులో స్వేచ్ఛా రూపం విరిసి పద్మంలా
అందం గంధం వహిస్తూ కదలుతుంది పవనం

6.

నిశీథి అన్వేషణలో దర్శన బింబం కవిత
ఒకరొకరిలో ఒక్కొక విధం బయట పడుతుంది
ఇది వెన్నెలలో వలె వర్తమాన దృశ్యాల్ని
మనసుపై ముద్రిస్తుంది, మెలకువ దారులలో

దీనికి పగలు రాత్రి వెలుతురు చీకటి
భేదం లేదు ఎట్టి స్థితి లోను అడుగులు ముందునకే
వెలుతురుతో మైత్రీ బంధం ఎప్పటికిని
చీకటితో మాట్లాడుతుంది నేరుగా మనస్సు

శబ్దంలో అర్థం స్వర్ణ పేటిలో అమూల్యంలా
దీన్ని తెరచి నపుడే తెలుస్తుంది ఏముందీ
వజ్రమొ ఆభరణమొ ఏ నిజ రూపమో?
వాగ్దానం విశ్వాసం ఏదైనా కావచ్చు మానసికం

కవితలలో విభేదాలు ఉంటాయి అనివార్యాలు
ఈ చీలే బిందువు నుండి ప్రత్యేకత మొదలు
ఎవరి అక్షర ప్రపంచం వారిది సృజనలో
మనో రూపం కేంద్రంగా అస్తిత సిద్ధిస్తుంది

జలద భాష భూమికి తెలుస్తుంది
ప్రతిమ భాష మనసుకు తెలుస్తుంది
జన హృదయం కవికి బాగా తెలుస్తుంది
కవితలో భద్రంగా గుప్తంగా ఎప్పటికీ

పేదరికంపై సమరం చీకటితో శత్రుత
ఇప్పటిదా? ఎప్పటిదో? సంఘంలో ప్రకృతిలో
పద పదానికీ సంబంధం మనిషి మనిషితో పరిచయం
బ్రతుకులో కవితో పరివర్తన గుణంతో

బ్రతుకును చూస్తే ప్రకృతి నేపథ్యం గుర్తుకు వస్తుంది
మనిషిని చూస్తే బ్రతుకులో "నిజం" తీగె సాగుతుంది
మనిషి మనిషిలో చర్య ప్రతిచర్యల సంబంధంతో
అర్ధాంతర భావన మెదలుతుంది జీవన వాస్తవంపై

7.

విశ్వంలో భాగమయిన మనిషి తన శక్తితో
ప్రకృతి నుండి భేదించేను, ప్రభావంతో జీవించేను

రవి తన ఉదయంపై నమ్మకాన్ని బూది చేయదు
మనిషిపై మనిషి నమ్మకం అయితే, సంశయ భ్రమణం

పూలను పూయవచ్చు ముళ్ళను చూపవచ్చు
చీకటి దారులలో వెలుతురు నింపవచ్చు
నిప్పుకణంతో వెలుగు దివ్వెను తలపించవచ్చు
దేని కయిన సమాధాన పడుతూ మార్పులతో

చెట్టు నీడనో గోడ పంచనో చేరే
పేదలు ఎచటికి పోతారు
గాలిని ఆహారిస్తూ వీధి మూలన చేరవచ్చు
చీకటిని కప్పుకొని రాత్రి నిదుర పోవచ్చు

కనిపించని విషయంలో దాగిన రహస్యం
అందరికీ తెలిసీ తెలియనట్లుగా ! దారిద్ర్యం

దరిద్రం, ఏదో సాధారణ రూపంలో రాదు
ఉప్పెన వలె తుపాను వలె సునామి వలె వస్తుంది
నీరు గాలి కలిసిన శక్తి ప్రకటనంతో
మనిషికి తన చుట్టూ శిథిలాలను ప్రదర్శించేను

సమాజంలో వ్యక్తులు రుతువు రుతువులో
ప్రకృతి ప్రభావానికి చెదరిన స్థితి నెదుర్కొనేను
బాధలోను తన ఉనికిని కాపాడుకునేను
సమాజ బంధుతలను ఎంతో కొంత నిలిపేను

ఇది దేశ జాతి మత ప్రత్యేకతల కతీతమైంది
ప్రజ లందరు ఎదుర్కొనే ఉమ్మడి శత్రువు

ఈ సమయం జ్వల దుదగ్ర సూర్యుడు
చేయగలిగిందేమీ లేదు, విపత్తులో
పైగా మబ్బుల శాలువాతో కనిపించీ కనిపించని
రూపం ఆ చోటు నుండి కనుమరుగయ్యేను

ఏ సమయమైనా సుఖంలోను, దుఃఖంలోను
మనిషికి తోడు మనిషే, అంతర ప్రేరణ వశమై

8.

లిప్తలలో మంచు పలకల వలె క్షణాలతో పరచబడిన కాలం
ప్రకృతి శక్తి పట్ల బంధుతను ఆర్ద్రతను కనబరుస్తుంది

ఎండకు శిలలు భయపడవు
చలికి శిల్పం వణకదు
మనిషి నుండి మనిషి కోరేను స్పందనం
జలాభిషేకానికి విగ్రహమెదురు చూస్తుంది

ప్రతి వస్తువు దేని విశిష్ట గుణం దానిదే
వస్తువుల ప్రభావాల ప్రసారంతోనే మార్పులు
మదిలో దాగిన నిజం తెలుసుకోవాలని
ప్రతి ఒకరిలో ఎప్పటి నుండో ప్రయత్నాలు
ఏదో కొంత అవగత మవగానే సంతోషం కలుగుతుంది
ప్రతి చర్యకు దిగేను సహనం కోల్పోయి, కోపం రావచ్చు

ఎవరి మనో జగం వారిది
ఎవరి దృష్టి కోణం వారిది
ఏమైనా కానీ దోషి మెడకు ఉరిత్రాడు
చుట్టడం ! సాధారణ బ్రతుక్కి భంగం

ఎత్తులో కోరిక సుప్తంగా
బయటి ప్రపంచంలోకి రావాలని
మనిషిలో కోరిక ఎగబ్రాకుతుంది అనుకూలంలో
గగనాన్ని చుట్టుతుంది, దిశల్ని స్పృశిస్తుంది

మనిషిలో అసాధ్యమన్న మాట మ్రోగి
గాల పటం వలె పరిభ్రమించేనా? పైన

అనుకూలం ప్రతికూలం రెండూ చెరొక వైపు
మనిషి స్వేచ్ఛను అదుపు చేస్తూ, తలుపులు తెరుస్తూ

మనిషిలో చేతన ఉదయం వలె మనసును
ఆవహించి సమస్తం, ఎన్నిటినో చూపించేను
అవి ఒకటొకటీ తనవి కావాలని కోరిక
రణానికి సిద్ధంగా చివరన శాంతి గీతంతో

9.

ఒక సమయంలో అంత శక్తి గల రవి బింబం
హిమ యవనిక తోనో ఆర్ద్ర మేఘంతోనో
పై నుండి దిగే వరకు తాప శమన చింతనలో గడపేను
కాంతిలో సహన శీలం, తనలో ఎంతో ఉన్నా

శ్రేయో భావన దీవెన ప్రసరించే కరాలలో
అపుడపుడు చండంగా తీవ్రంగా కోపంలో మనుషులవలె

ప్రకృతిలో సాటిలేని రూపాలయినా అనూహ్యంగా
అపుడపుడు మానవ నిజ రూపాన్ని సూచిస్తాయి

నది ప్రవహిస్తుంది ఆగని జీవిత చలనం వలె
ఆర్ద్ర దృష్టితో భూమికి, పచ్చని అవసరాన్ని ఇస్తుంది

చెట్టుపై పక్షులు గూడు నుండి ఎగురుతాయి
సరాసరి నింగిలోకి ఆహారన్వేషణలో తిరుగుతాయి

క్రింది నుండి ఇది చూచే చెట్టు నీడ
తాను కూడ పై కెగరాలని కోరుతుంది
రెక్కలు చాచిన పక్షి ననుకరిస్తుంది, గాలికి కదలుతూ
అనుకరణతో మనిషి నేర్చుకునే వెన్నో బ్రతుకులో

మనిషిలో సాధ్యమైంది మతి ప్రతిభచే కొన్ని
చెట్టు నీడచే సాధ్య మయ్యేనా? పైకి ఎగిరేనా ?
తొలి మాపున ముని మాపున పక్షులు చెట్టుపై
కలకల రావాలతో తమ ఉనికి తెలియజేసేను

ఇవి బ్రతుకులో వాస్తవమై సర్వ విశేషతలు తలపించేను
ప్రకృతిలో వస్తువుల చర్యలతో కొత్త జగత్తు తోచేను

పచ్చని ఆకు లెంత కప్పబడినా సన్మాన శాలువాతో
మనిషి చూపు పూవుపై ఫలంపై అనుభవ రుచిరం

ప్రకృతిలోని వస్తు చయం ప్రయోజనంతో జీవితాలు
తరం నుండి తరానికి పనికివచ్చే కనిపించని విత్తనం

హ్లాదమో చండమో ఏ వస్తువు ఏ పాత్ర వహించినా
మనిషి లోని జీవన వాస్తవ ప్రపంచాన్ని తలపించేను

10.

ఒకరికొకరు పరిచయ సమయాలలో పథపథంలో
అడుగు ముందుకు పడుతూ పయనం సాగేను
ఏ దిశ నుండో రాయి విసరబడేను
ఎవరో ఒకరికి తగిలి గాయమవుతుంది
రాజకీయ తంత్రంలో చర్యకు ప్రతి చర్యతో
ఇది మనసుకు హత్తిన అగ్ని కణం కావచ్చు

గాలికి కొమ్మ ఊగి ఆకు రాలుతూ రివ్వున
బుజాల ఎత్తున ఏదో చెప్పాలని చూస్తుంది
పయనంలో మసక వేసిన మంచు క్రమ్మిన ఆలోచన
దూకే వేడి కిరణంతో ఎక్కడిదక్కడ చెదరిపోతుంది

మట్టి అంటకుండ మేఘం కదలుతుంది గగనంలో
భూమిపై కొండపై సరసులో చినుకులతో ఆనందిస్తుంది
మట్టి ఎరగని మేఘం మనిషి మనసులోను
వేదనలో పై కెగసిన ఆలోచన నుండి చల్లగా

బయటి గాలి మేడల తలలు నిమురుతూ పోతుంది
కింద రాతి బండలను పలకరిస్తూ పోతుంది
ఆకు రాలడం ఆకు రావడం రెండు స్థితులు
సానుభూతిలో సంతోషంతలో ముంచి పైకి తీస్తాయి

ఏ కాలం ఏ దేశం ఏ ప్రజ అయినా
పరిచయమొక అవసరం, ఇది తెలియని దెందరో?

ఏదో కాస్త తెలిసి అంతా తెలియకుండ
ధ్వజస్తంభం వలె నిలవడమొక వీడని పట్టుదల
విసరే గాలి అలసటను తుడిచి పోతుంది
బాధలు మరపించి చల్లని మలుపు తిప్పుతుంది

ఉదయం కళ్లు తెరవగానే మనిషికీ మనిషికీ మధ్య
చీకటి బొమ్మల ప్రవేశం జరుగుతుంది అవలీలగా
అక్షర జగత్తు ప్రకాశానికి కవితలో
"నిజం" ఒక సుందర రవి కిరణ సమం

11.

ఉరి కంబం మట్లాడుతుంది ఖైదీతో
జైలు ఆవరణంలో రూపాల నేర చరిత్రతో
ఉరి తాడు పూల దండలా నేరాన్ని అలంకరించేనా?
శిక్షకు బదులు క్షమతకు జార్చే పనిలో కవిత

సమాజ చరిత్రలో వ్యక్తి వికాస రూపాల్ని
కాలం ! వెనుక నుండి ముందుకు నడిపిస్తుంది
ఎవరి ఒప్పో ! ఎవరి తప్పో ! ఏర్పడిన ఖాళీలను
పూరించే పనిలో కవి ! ఉదార చరితలో భాగమై

రాజకీయ కక్షలతో మనుషుల మధ్య వైరం
వారిలో ఆ ప్రక్కనున్న పొదల లోకి దూర్చేను
వేదన స్పందన ఇరు రెక్కలపై కవిత ఎప్పటికీ
ఎంత దూరమయినా మనసును తీసుక వెళుతుంది

చట్టం ఎవరి చుట్టం కాకపోవచ్చు
ఇది కొందరికి తోడుగ ఉండవచ్చు
పోయినంత మేర నీడలా అనుసరించేను
బ్రతికి నంత మేర కవితను కాపాడేను

భూమిపై నడకలా కాగితంపై కవిత ప్రియంగా
ఎందరికో సూచనగా నిజంపైన దృష్టిలో
మంచు ముక్కలా తాపంలో మాట జార వచ్చు
నిప్పు కణంలా నిరాశతో మాట తాకవచ్చు

ఈత తెలియని వ్యక్తి నది లోకి దిగితే
కత్తి అంచుల వలె అలలు తళతళ మెరుస్తాయి

మనిషి మనిషి మధ్య వంతెన అవసరమై
మనసు మనసు మధ్య ఆకాశం దిగవచ్చు

పరిచయాలతో ప్రవాహశీల మవుతుంది స్నేహం
లేంది బ్రతుకు ఏ శిలా పంక్తినో ఎడారినో తలపించేను

భవిత లేని బ్రతుకు నిలిచిన ఎండ మావియే
కదలిక లేని జనత నిలిచిన రాతి గుట్టయే

12.

ఉదయం చేతితో తెరిచిన వార్తా పత్రిక పుటలో
అక్షర చిత్రాలు ! మాటల స్వరాలు ! భావ రేఖలతో
దివా నిశా నిజాలొకటొకటీ, అందరికీ
చేరవేసేను ఉత్సాహం సానుభూతి ఊరటగా

తీర్చిన దుస్తుల వలె పలికే మాటలతో అక్షర రూపాలు
ఎవరికి వారు అనుకూలం కానివి మరొకరికి చెందినవీ

అన్నీ కలిసి వస్తే బయట పూలమాలతో స్వాగతం
ఏదీ కలిసి రాకపోతే మెడకు తాడుతో ఉరి లాగడం

శ్వాస తంత్రులు మీటితేనే ఆయువు సాగేది
కథ నడచేను హృదయం స్పందించేను
స్వరం పలుకుతుంది జీవిత మలరిస్తుంది
ప్రతి వ్యక్తిలో అస్తిత తన ముద్రతో ప్రత్యేకంగా

అభిరుచి భేదంలో ఎవరి ఇష్టంలో వారు
సజీవ చరిత్రతో సుందరతను కోరేరు
వార్తల బరువుతో గాలి మందంగా కదలి కదలి
జలధి అలలపై ఒకటొకటీ దిగ విడిచి పోయేను

భూమిపై పూలనో నింగిలో చుక్కలనో లెక్క పెడుతూ గడిపేరా?
ఆకలి తీరేనా? దాహం మరచేరా? భేదం మాసేనా?
కక్ష పెరిగి కారం చల్లిన గుండెపై గునపం దిగేనా?
రాళ్ళ వానలా అక్షరాలు విషాద చిత్రం చూపేనా?

ప్రజా స్వామ్య ప్రకాశం ప్రయోజన రూపం
ఏ హాలుకో ఇంటికో పరిమితం కాకూడదు

మార్కెట్ విలువల లాభాలతో జత పడకూడదు
అభిప్రాయ భేదాల తీవ్ర శిఖర దశలలో
ప్రస్తుత మున్న ఆ మనిషి తలను తీసేసేరా?
మరొకటి అమర్చి తమ పని గడిపేవారా?

అసహనం అశాంతి కలహం వేదన నష్టం
ఎప్పటికీ ఉండేవని ఉపేక్షకు గురి అయ్యేరా?

13.

గడచిన రోజులు మనుషులతో మెలడగం కష్టమయితే
ఈ రోజులలో వ్యాధులతో గడవడం అందరికి ప్రమాదం
మృత్యువు నుండి గట్టెక్కడం వలె బాధాకరంగా
ఇంత వరకు సాధించిన విజయం ఏ మూలనో

నిన్న ఆహారం ముఖ్యమయితే నేడు ఆక్సిజన్ అత్యవసరం
ఇది ప్రాణ శక్తికి మూలం; ఒకరిద్దరికి కాదు జనాభాకు
అవసరం పెరిగి హఠాత్తుగా, అనితర వస్తువయి
బుజాలపై బరువు దించరానిదై క్రుంగ తీస్తూంది

మనిషి వెనక నీడలా కొరత, తప్పని దవుతూంది
ఆరాటానికీ ఆవేదనకూ మనిషిని గురిచేస్తూ
జడత నుండి చేతనతో మొక్కలా
మనుషులలో కోరిక 'కరోనా' కేంద్రంగా వెడలేను

అలజడి ఆందోళన ఆవేశం రణరంగాలయి
బ్రతుకులో మానవ శక్తిని పరీక్షకు గురిచేసేను
ఏ రోజు దేని తోనో సమరం జరగక తప్పనిది
ఇపుడు ప్రతిరోజు అదే సమస్య ఎదుట నిలబడేను

మనిషిని నిశ్శబ్దంగా ఉండనీయని పరిస్థితులు
మనిషికి జీవన తంత్రులపై విషాదం వినిపిస్తూంది
ఇపుడు విశ్వ వ్యాప్తమై సవేగ చలనంతో
చరిత్ర పుటల్ని చీకటి అక్షరాల్లోకి దింపుతుంది

ఇది మనిషి మతి కతీమైన వైరస్ గుప్తంగా
మురికితో గాలి నుండి శ్వాస పథంలో పయనం
అందరి పై జాడ్యాన్ని నెరపే రహస్య ప్రకారం
ఇపుడు మనిషి దీనిపై ప్రభుతను సాధించే యత్నంలో

ఇది సాధారణమైన అవసర వస్తువు కాదు, ఔషధం
జీవన రక్షణ కనివార్యమై ఎందరి చేతులపైనో కృషి
మనుషులలో బాధ్యతలో పూనే నిరంతర కృషిని జ్ఞాపకం చేస్తుంది
మనుషుల సంఘటిత శక్తిలోని, విజయ రేఖను తలపిస్తుంది

ఇది ఇప్పటికి వదలబోని సమస్య ! మృత్యుమయం
సంఘం ఆరోగ్యంతో ముడిపడిన నెగెటివ్ రూపం

14.

ప్రతి వ్యక్తిలో ప్రవాహం చిన్నదో పెద్దదో
కొండ నుండి రాళ్ళ మధ్య సన్నగ సరిస్తుంది
మనిషిలో ఇదొక చేతన ప్రేరణ రూపం
బ్రతుకులో పాత్రలకు జీవన రూపం ఇస్తుంది

మంద్రం నుండి తీవ్రం వరకు స్థితులను పాలిస్తుంది
ఆయువుతో సమంగా బట్ట గట్టి జీవిస్తుంది

అలజడి విభేదాలు కలహం శత్రుతలతో
భస్మవేది నిర్మాణంలో భాగ స్వాములయ్యేరు
విలయ తాండవ ప్రదర్శనకు రంగం సిద్ధమవుతుంది
వ్యక్తి నుండి సమాజంలో చేరే నాశన రూపాలెన్నో

అంతరాత్మ ముందు అంతా ఒకటే
నేరం కప్పబడీ ద్వేషం దాచబడీ మనుషులు
ముసుగు తొలగి రహస్యంలో నిజం చకితంగా
సన్నని మెరపులా చూపులో జగా పొందేను

నది ఒడ్డున ఇరు వైపుల జరిగే ఘటన లెన్నో
సాక్షి ఎవరు? చెట్టు, ఆకాశం, వస్తూ పోయే మనుషులు

కవితలో అక్షరం బీజ భూతమై కొత్తగా
ధనూరావం అశ్వరింఖ ఆయుధం ప్రేలిన ధ్వని
ఆపదలో మృత్యువును హెచ్చరించేను
పిడుగు జారినట్లుగ భయ భావం అలము కునేను

ప్రతి వ్యక్తిలో ప్రవాహం మలుపులతో చేతనతో
జీవన చలనంలో ధైర్యాన్ని ఇస్తూ గడిపిస్తుంది
మలకలు పోయే కొద్దీ చరిత్రలో జీవితాలు
తరతరానికీ కొత్త రూపంతో ప్రత్యక్ష మయ్యేను

15.

వ్యక్తిలో చిన్నదో పెద్దదో చిరు కొండలతో
నది ! ఆర్త భావ సంకేతంగా భావ క్షేత్రంలో
మట్టికి సృజనార్హత కల్పించేను
రాళ్లకు స్నిగ్ధతలను తీర్చేను

ఇరు వైపుల సమాజం పచ్చని సంస్కార శోభతో
మనిషిలో నిహితమైన సృజన నవం గుర్తుకు తెస్తుంది

పైన ఎవరు ఉంది? ఏమి ఉంది? ఊహ మాత్రమే
తెలియదు కానీ, తెలిసినంతలో నమ్మకం
ఆపై పై గురించి ఆలోచన మస్తిష్క శాలలో
క్రింద వీడ రాని మట్టిపై అనుభవ సుందరతలతో

జీవితంలో వాస్తవాన్ని కల్పనతో ఊహా జగతిని
కలుపుతుంది, దుస్తరమైన ప్రవాహాన్ని దాటిస్తుంది
బ్రతుకులో అవసరాలు పెరిగే కొద్దీ అవి తీరేందుకు
ఆలోచన విస్తరిస్తుంది, ప్రపంచీకరణమవుతూంది

అంతర్జాలంలో సమాజ జీవితం ఆలోచనలో
అందని ఎత్తులో మనిషిని నడిపిస్తుంది

జలధిలోని కెరటాలను శాసిస్తుంది గాలి
మాట కలుపుతుంది ఇరువైపుల చేరే వంతెనయై

దహన తాప స్థితులలో బాధను తీర్చే మేఘం
చినుకులతో భూమిపై పునర్జీవ దృశ్య మావిష్కరిస్తుంది

ప్రతి వ్యక్తి బ్రతుకులో గెలుపును కోరేను
హద్దులు దాటి, ఏదేమైనా గమ్యం చేరాలని
ఇందుకై క్షణాల్ని నిప్పు రవ్వలుగా మార్చేను
చతురత చూపేను, నిపుణతతో పని సాధించేను

తలపై గగన యశో కిరీటం నిలవాలనీ
మౌన ముఖాలను పలకరింపజేయాలనీ
నిశ్శబ్దాన్ని శబ్దాకృతులతో రూపొందించేను
సంఘంలో ఉద్యమ పతాకలను నడిపించేను

16.

గతం అద్దం కాదు వట్టి బ్లాక్ బోర్డ్
చాక్ పీస్‌కు ఉపయోగ పడే సాధనం
అపుడపుడు పలు రంగులలోను పనికి వచ్చే
అవసరానికి బ్రతుకులోన బహు ప్రయోజనాలతో

ఇది మానుష మతి ప్రతిభ తోనే సాధ్యం
పూవు పూచినా ఫలం అందినా విత్తు నాటినా
వర్తమానంతోనే, తృప్తి ఎక్కడి కక్కడ పూర్ణతచే
గతాన్ని భద్రపరచేవి ఒక మట్టిలోని వేరులే

బ్రతుకులో చిన్న ఆశ, కొమ్మతో పూవును నిలబెడుతుంది
ఫలంలో పునరవ తారాలకు జన్యువుకు వీలు కలగచేస్తుంది

పైనుండి జారడం మొదలైనా ఎవరయినా
అనుకున్నా అనుకోక పోయినా లోయ లోకే సూటిగా
సరాసరి చీకటి చిరునామాయే లభిస్తుంది
ఆరోహణలో నయితే ఏ వెలుగో తాడో పట్టుకొనీ,
ప్రతి మనసులో గిరి తరు నది హిమ పాళీ శిల్పాలు.
గాలిలో పయనించే మాట ఎవరి స్వంతం కాదు, బంధం కాదు

దీని ప్రభావం స్వరంలో పదంలో మనిషి రూపం మారేను
అందరిపై అన్ని విధాలా సంస్కృతికి చిహ్నమై కళయై
జల బిందువు కావచ్చు ! అనల కణం కావచ్చు మంచు రేకు కావచ్చు
ఎవరికి కావలసింది వారు గ్రహించేరు, వహించేరు, లాభించేను

ఆప్తం కావచ్చు, శప్తం కావచ్చు, ఏ దారి అయినా
హితమో ! విపదో ! తృణమో ! పణమో పొందవచ్చు

ఏ సమాజ హితంలోనో బంధం లోనో అనుకోనిదో
తగిలిన గాయం మరచి చలనంతో స్పందనం ఎదలో దాగీ
గాలిలో పూవులా చూపును ఆకర్షిస్తుంది
ఎండి రాలే ఆకులా ! నిజం తెలుపుతుంది

అలల వలె మబ్బుల వలె మరొకటి మరొకటి
స్మృతులు కదలుతాయి మెలకువలో హద్దులు మీరీ

17.

అందరికీ అపుడపుడు కొత్త ముఖంతో కనిపించాలనీ
రోజూ ఒక కొత్త ముఖంతో బయటపడాలని కొందరిలో
నిజ రూపం గుప్తంగా ఎవరికి తెలియకుండ కొందరిలో
"ఎవుడే విధంగా బయట పడేనో" అని జాగ్రత్త పడేరు

విరామ వేళలో ఏదయినా కథ వినాలని కొందరు
పని కట్టుకొని కవితలు వినిపించే కవులు కొందరు
క్యాలెండర్‌లో తేదీల అంకెల మెట్లపై పయనించేరు
తమ బ్రతుకులు క్రమ గతిలో మును ముందుకు సాగాలని

వెనక నుండి క్షణాలు ఆగని లహరుల వలె కదలుతూ
కాళ్ళకు సంకెళ్ళుగా మారవచ్చు, దారి తప్పవచ్చు
అపుడపుడు భూమి తలం నుండి మనిషి
గగన తలంపై నడచే ఆలోచనలో చూపుతో

ఎదురయిన నదిలో దిగగానే అలలు కాళ్ళకు
శిశువుల వలె చ్చుకొని అనురాగం నింపేను

ఉదయం మంచు మొగ్గలు జారే వాతావరణంలో
వెలుతురులకు ఆటంకం తొలగీ దారి దొరకేను

ఎండిన ఆకు రాలి గతంలో భాగమయ్యేను
రావలసిన పూవులకై చూపులు వెదకేను
నిన్నటి కథలో భాగమే ఈ రోజు కూడ సాగుతుంది
కొత్త మలుపులు పొందవచ్చు, దారి వేరు కావచ్చు

మరో కథలో పాత్రలుగా మారేవారూ ఉన్నారు
వెలుతురుచే చీకటి దూర దూరం విస్తరింపబడీ
ఎక్కిడికి చేరిందీ తెలియని వాస్తవమెవరికైన ఎపుడైన
అదృశ్యమైంది, ఎగిరి వచ్చి నిలుస్తుంది అవశ్యంగా

మనిషిలో కల్మషంతో గూడు కట్టుకొని ఉన్నది మారి,
కాలంతో శుభ్రమైన వెలుతురు హంసయై స్వచ్ఛమై
ప్రతి హృదయం రూపొందాలని, అందరిలో ఆకాంక్ష

18.

సమాజంలో ఒక భాగ మయిన వ్యక్తి
ప్రకృతి నుండి వేరయ్యేను, దాని ప్రభావంలో గడిపేను
రవి తన ఉదయంపై నమ్మకాన్ని బూది చేయడు
మనిషిపై మనిషిలో నమ్మకం సంశయ గ్రస్తమై

పూలను పూయవచ్చు ముళ్ళను చూపవచ్చు
చీకటి దారులతో దిశలను నింపవచ్చు
నిప్పు కణాలతో వెలుగు దివ్వెల్ని తలపించవచ్చు
దేని కయినా సమాధాన పడుతూ పోవడమే ! జరిగేను

చెట్టు నీడనో గోడ పంచనో
చేరే పేదలు ఎచటికి పోగలరు?
వీధి మూలన చేరవచ్చు ! గాలిని ఆహారిస్తూ
చీకటిని కప్పుకొని, రాత్రి నిదుర పోవచ్చు

కనిపించని విషయంలో దాగిన రహస్యం
అందరికీ తెలిసీ, తెలియనట్లుగా ! దరిద్రం

మాటలో సాగే అర్థం హృదిని మీటుతుంది
ఎవరి ఆలోచనతో వారిని, పరిమితిలో నడిపిస్తుంది

తేనె చుక్క ఎచట పడిందీ; చీమ మతికి తెలిసినట్లు
మనిషికి తెలియదు, అది అంతలోనె చేరుతుంది

ఉదయం విరిసిన పూవు చూచి మనిషి కెంత సంతోషమో
తానొక పూవైతే ఎంత బాగుంటుంది అనుకునేను
తన చేతిలో పూవుతో వెను తిరిగిన మనిషిలో
తృప్తి రేఖపై మెరుస్తూ మెరుపు తీగెలా ఆలోచన

ఉన్న వస్తువులన్నీ మనిషి వశమయ్యేను
మనిషి మతి ప్రభతో ఏ గొప్పవి వశం కావు

ఏ వస్తువు ఉనికి దానిది, అస్తితలో విశిష్టతతో
ఒక దానికి మరొకటి ప్రత్యామ్నాయం కానేరదు

నిజ రూపం మనిషికి తెలిసే దెపుడో
అన్వేషణ మొదలై వివేచనలో ప్రకాశంతోనే

19.

ఒకరి కవిత గగనంలో ఎగరేసిన పతంగి
ఎగిరి ఎగిరి భ్రమణంలో వాలిపోయి దిగుతూ
ఏ చెట్టు కొమ్మకో విద్యుత్ స్తంభం తీగెలకో
తగులుకొని చినిగి నిరాశా లోకం చూపేను

ఒకరి కవిత నిద్రా ముద్రితమైన సమయంలో
అనుకోని విధంగా హనన పాత్రతో కలిసి ఒకరు

ఒకరి కవిత పట్టాలు తప్పిన రైలులా
ఒరిగి పోయి బీభత్సంలో భయావహమయ్యేను
మరొకరి కవిత మనసును శుభ్ర పరుస్తుంది
గాలి వలె దశ దిశలలో వేగం హెచ్చేను.

ఒకరి కవిత సిగ్నల్ వద్ద నిలిచిన ట్రాఫిక్
గ్రీన్ లైట్ కోసం ఎదురు చూస్తూ వాహనాలు
అంతలో వర్షం ! సిమెంటు రోడ్డు పై వరదలు
జల వేగానికి వాహనాలు కొట్టుక పోవచ్చు

ప్రతి మదిలో గ్రీష్మ తాండవంతో పాటు
ఒక ప్రక్కన చినుకుల ఆశను నిలుపుకోనీ
వేచి ఉన్న సమాజం, ఆశతో సస్యమయం
ఉదయం మంచుచే శుభ్రమైన వాలకం

చలి కాచుకోడానికి పచ్చని చెట్టు క్రింద
మంట లెగసి పొగలు క్రమ్మి కమలిన
కొమ్మల్ని ఎవరు చక్క పరుస్తారు
వేచి ఉన్న ఆశల్ని ఎవరు నిలుపుతారు

మంచు చేత శుభ్రమైన కిరణంలా
అంతరంగ ప్రకాశంతో కవిత ! స్వచ్ఛంగా
పెరిగిన విలువలతో సర్వం ప్రియమయ్యేను
ప్రకృతిలో ప్రతిదీ కవితకు వస్తువు అయ్యేను

మస్తిష్కంలో ఆలోచనా ప్రపంచంలో కవిత
భూమి నుండి ఆకాశానికి పయనం ప్రోత్సహించేను
ప్రోత్సాహంలో వైజ్ఞానిక యత్నాలెన్నో?
వ్యక్తిని ఆధునిక సోపానాలపైన నడిపించేను

20.

పండుగ వస్తుంది నిర్నిరోధంగా నిష్కళంకంగా
మనసును నిర్మలినం చేసి శుభ్రపరచేందుకు
ఉదయ కాంతి వాహనం నుండి దిగుతుంది
తన విభవ ప్రదర్శనంతో నిలయం చేరుతుంది
లలాటాన భవిత మెరుపు తీగెలా మెరుస్తూ
సమాజం పెన్నిధిలో పండుగ ఒక భాగంగా

తనకు ఏ తరువు పూవు ఫలం అవసరమో ముఖ్యమో
అది దాని విత్తు లోనే సుప్తమైంది, మేల్కొంటుంది
ఎవరు ఏది ఎపుడు కోరేదీ, పొందేదీ, తెలియదు
అవి తన జీవన భాగ్యంలో భాగం కావాలనే

అందిరినీ కలుపుకపోయే సూత్రం ఆధారంగా కాలం
స్నేహం బంధుత ప్రేమలతో ఉత్సాహం నింపుతుంది
ఒకరొకరికి ఒక్కొక్క విధంగా తోచవచ్చు సందర్భం
భిన్న భిన్న జీవన దృశ్యాలతో ఉత్సవ సంకలనం

ఈ విశాల ప్రపంచంలో తెలిసింది మాత్రం కొద్దే
తెలుసుకొనే ఆలోచనలో మావన యత్నం ఎంతో
మనో రహస్య పేటిక తెరచే అభిలాషతో
మనిషిలో మరో మనిషి, ఈ పనులలో నిమగ్నమై

ఒక రోజు ఉదయం జ్వాలగా కనిపించవచ్చు
పండుగ రోజున మాత్రం వ్రేలాడే పూల గుత్తులుగా
ఆ రోజున సమయం, అంతశ్చేతన గుణంతో
పెరిగిన విలువలతో సర్వం ఇష్టంగా తోచేను

ప్రాణం నిలిపేదీ తీసేది ఒకటే అది పవనం
ఇది తుపానుగా మారి ప్రాణాంతకమయ్యేను
పిడుగు పాటు వరదలు ప్రమాదాల నుండి
తేరుకున్న మనోజ్ఞ చిహ్నం సమాజంలో పండుగ

మేల్కొన్న మనో జలధిలో అలల వలె
మాటలు కవితలై ఈ రోజు ! అలంకరిస్తాయి

21.

కంటికి కనిపించని సూక్ష్మ జీవ రూపం "వైరస్"
ఇది మనుషుల ఆయువుపై కత్తెర వేటుతో
ప్రమాదకరమైన వ్యాధితో ఆపదలో ముంచేను
భౌతిక మానస స్థాయిలతో పీడకు గురిచేసేను

భూమికి భేదం లేదు, తోట అనీ క్షేత్ర మనీ అడవి అనీ
శ్మశాన మనీ సమాధి అనీ ! అవసరాలు తీర్చే అమ్మలా
మట్టికి మిత్ర శత్రు భేదం లేదు నేలపై అంతా సమం
పాత్ర నిర్వహణంలో అన్నిటికీ అందరికీ స్వాగతం లభిస్తుంది

తాను ఇచ్చే దాని కన్న, పొందేది ఎక్కువగా కోరేను మనిషి
మనిషి ప్రమేయం తోనే మనుషులలో విభేదాలు తగాదాలు

ఒకటొకటి ఒక్కొక కలహానికి కారణమై
సమాజంలో సంక్షోభం అలలు తల లెత్తేను

మనిషిలో స్తిమితం కోల్పోజేస్తుంది "కరోనా"
చీకటి బొమ్మలను వరసగా విడుదల చేస్తుంది
ఆకులు రాలి ఎండిన కొమ్మలపై తిరుగుతూ
నీరు లేని లోతు లోయలో నివాసం పొందేను

అనుమానం నింపుతుంది, సందేహం పెంచుతుంది
భయదమైన మృత్యు ముఖంతో, చీకటి అడుగులతో
హఠాత్తుగా ఎదురయ్యే కష్టాలెన్ని విధాలో
అన్నిటికీ ఉపాయాలు రెడిగా ఉండవు

విలువలు తగ్గిన మార్కెట్‌లో
వెల వెల బోయే వాతావరణం

గోడకు తగిలించిన క్యాలెండర్‌లో తేదీలు
మరచిన రోజుల్ని జ్ఞాపకం చేసేను
కాలం సరస్సులో రాత్రి బింబించే చుక్కల్లా
మనిషి చేతి కందని ఆశలు మెరుస్తూ

ప్రశ్నలకు గురి చేసి కాలం ! వెళ్లి పోతుంది
వసంతానికి రహస్యం లేదు, సమయానికి ప్రకటితమవుతుంది

22.

ముళ్ళ మధ్య నున్న గులాబి పూవును తెంపడం
ఒక కళ ఇది చాలా సున్నిత మయిన పని
ఇది సూక్ష్మమైన అనుభూతి స్పందన నిలయం
మనిషి హృదికి అవసరం ఎపుడో ఒక సమయం

అలాగే పూవులన్ని మల్లె జాజి మందారం
పారిజాతం మనసు మనసు కొక విధంగా హ్లాదకరం
జీవన గతిలో అభిరుచులు శాఖలు శాఖలుగా
బ్రతుకులోని రమ్య వనికి పూర్ణత కూర్చేను

రాజకీయ వర్తక విజ్ఞాన కళా సాహిత్య పథంలో
దిశలు ! మనిషి పుట్టుకతో స్వాగత మిచ్చేను
ఉత్సవ రూపంలో కల సుందర వాస్తవ మయ్యేనా?
వీటి మధ్య నుండి విలువలు మానస చింతనలు

ఒకటొకటీ కలసి వేరు వేరుగాను నిజమయ్యేను
దేశ దేశ ప్రసార మాన వికాస రూప చిత్రాలతో
కనిపించే ఏ వాస్తవ లోకానికి ఇది
మానసం, చేతన గుణ ప్రతిఫలనం

తన శక్తికి తగిన భావ ప్రపంచం మనిషిలో
మలినం తారాడుతుంది చుట్టూ గాలిలో
జడత నిలిచి ఉంటుంది దారిలో ఎదురుగా
దీని సార్ధకం మాత్రం ! మనిషి మతి విభవానిదే

ఉదయం వరకు ఉన్న చీకటి ప్రవేశిస్తుంది
మనుషుల మనసులలో పాత్రలలో చేరుతుంది
ఇది పూర్తిగ పరచిన వ్యవహారం కాదు
మతిలో ఎక్కడి కక్కడ మడచిన పొరలతో

తనలో తిరిగే స్వార్థ చక్రానికే ప్రాధాన్యం
ఒక సుందర స్వప్న ప్రపంచం వెనకనే పయనం
చెట్టుపై కొమ్మ చివరనో అందమైన వజ్రం పైనో
పూచిన పుష్పంపైనో ఫలంపైనో చూపులు ఎప్పటికీ

23.

ముఖ్యమైన అవసరం వస్తువుల లోటు, జన నష్టం ఆందోళనం
మనిషి నుండి మనిషి దూరం, నియతం నిర్బంధం శాసనయుతం
ఈ దుస్థితిలో అడవిలో గన్‌లతో తిరిగే వారు
అది లోపం ! ఇది తక్కువ ! అని ఆందోళనలోకి ఊగేవారు

రాత్రి సమయంలో వెన్నెల ఒకటే స్నిగ్ధంగా శాంతంగా
నినాదాలు నమ్మకాలు సిద్ధాంతాలు వ్యతిరేకాలను మరచి
ఇవి కొన్ని రోజులతో తొలగేవి కావు ! అసౌకర్యంలోనూ
ఇవి విడతలు విడతలుగా మనిషిని విరామానికి పంపేను

గాయంతో కోలుకొని ప్రాణం బయట పడవచ్చు
"కరోన"లో చిక్కి బయటపడడం మరో జన్మయే
కోలుకోవచ్చు, విడిచి పోవచ్చు చెరి సగం అవకాశం
విరామ దశలలో శాంతం! జీవన మూలం అవసరం

ఆయుధం లేని, బ్రతుకులు కాపాడే దెవరు? అంటే
విస్మరించే వీలు లేని, బాధ్యతలో ప్రజల ప్రభుత్వం

పంట తరువాత పంటకు భూమి సంతపిస్తుంది
చెట్టు తరువాత మొక్కకు నేల ఎదురు చూస్తుంది
నివాసాను గుణం కాదని అడవిని తగల బెట్టేరా?
వాన రాక ఆలస్యమైందని భూమిని వదలి వేసేరా?

బయట గాలి పుష్కలంగా వీచే సమయంలో
కిటికీలు తలుపులు మూసిపెట్టి నట్లు ఉంటూంది

దీని కున్న సమాధి నయ మనిపిస్తుంది
ఈ నిశ్శబ్ద సమయంలో ప్రతి అడుగు మృత్యు ఖండం

అడవిలో నెత్తురు చుక్కల జాడల దారిన
పులి అడుగులు నది వైపు చూపేను
శుభ్రమై గట్టుకు క్షేమంగా చేరేను పులి
ఇది మనిషికి బ్రతుకులో ప్రేరణ రూపమవుతూంది

ఒక కల వెళ్ళి పోతుంది, మరొకటి మనసులో సిద్ధంగా
ఈ మధ్య జీవన వాస్తవం, వైరం బదులుగ వైరస్ దాకా
విషాద మూలంతో అనల సుమం పూచి నట్లు ఉంటుంది
భయం పొరల మధ్య, అభయ హృదయంతో మనిషి ఒంటరిగా

24.

ఏకాంతం ఎక్కడుంది? సంశ్లిష్టమైన సమాజంలో
కొండపైనో? నది ఒడ్డునో ? జలధి తీరానో
ఇవి మూడు దేని కవే భౌతిక మానసాతీతాలతో
పై నుండి నీలి మబ్బు కింది వస్తువుల్ని చల్ల బరుస్తుంది

కావలసింది ? తాపానికి ఉపశమన హస్తం
దాహంలో నీరు బ్రతుక్కి పోషణ పదార్థం
ఆర్తమయిన అనుభవ ప్రపంచంతో హృదిని
కరుణతో రాగంతో ఉత్సాహంలో జీవన యత్నం

ఎవరి నిశ్చయం వారిది ఏకాంతంలో ఇష్టంగా
జన మత నిర్ణయం అందరికీ చెందింది
శ్రమ జీవుల మేధావుల వర్తకుల తంత్రజ్ఞుల
వ్యవహర్తల నేతల ఒకరిద్దరేమిటి అందరిదీ

సరిహద్దులు ఎరగని ప్రయాణ సంచరణంలో
ఒకరితో మరొకరు జీవన సంక్లిష్ట స్థితులలో
గతం అయితే దిశల ఉనికి సూచన పనియే
వర్తమాన పయనం ! గంధ మయం అయినా
మలుపులు సందేహిస్తూ ఆలస్యం కావచ్చు
దారిని ప్రశ్నిస్తే మధ్యలో పయన మాగవచ్చు

గాలి వెలుతురులకు పుణ్యం పాపంతో
సంబధం లేదు, సమర ఘోషలోను శాంతి స్వరం!
ఏకాంతం నుండి సమాజ వాతావరణంలోకి
రావడమొక సుందరమైన బంధంతోనే

చీకట్లను మెట్లుగ మలచుకునే ప్రజ్ఞ
వెలుతురులో, కఠినమైన అవని పైనే

కవితకు వ్యక్తి పరిధి ఏర్పడేను వ్రాసే స్థితిలో
తన కర్తవ్యం వదలి, సమాజ బాధ్యత పూనేను

కవి వ్యక్తిత్వం ఇరువైపుల ప్రసార రేఖలతో
అంతర్ బహిర్ ఆవరణంలో ప్రవేశ మందరికీ

25.

బయట నుండి కనిపించేది లోన ఉంది తోచనిది
ప్రతి వస్తువు విషయానికి దాపరికం ఎంతో కొంత
బహిరంతర సుందర ప్రయోజనాలతో మనుషులు
కనబడే బ్రతుకులో కనిపించని భూమికపై దృష్టి

కవి అయినా నేత అయినా పొందే నిరంతర గమనంలో
కోరే వెనక ఉన్న గుణ జాల విశేష మెంతో
సమాజ చరిత్రలో పూర్ణత కుపకరిస్తుంది
నిదురించే వాస్తవాన్ని మేల్కొల్పుతుంది

భయంలో భద్రత నిచ్చేది నిజం అయినా
అది కుంచితమై అవకాశం కోల్పోతుంది
ప్రశ్నకు వీలుగ తానై నిలిచేను వ్యక్తి
తానే కటు ప్రశ్న అయి పోవడం విచిత్రం

దీపం చేత రాత్రి చీకటిలో ఇంటికి అందం
వెన్నెలచే రాత్రి ఊహలు ఆగని అలల వలె
పగలు రాత్రి ఊహలు ఆగని మబ్బుల వలె
నిరాశలో ఆశను నిలుపుతూ కదలేను

ఇంటి మెడలో తావీజుగ నిలిచిన దీపం
భయం వదలి దూరాన ఉన్న రాజ్యం ఏలాలని
నమ్మకాన్ని గట్టి పరచే సందర్భంలో
ప్రతీకలో భాగ్యాన్ని కనబడ చేస్తుంది

రాత్రి చుక్కల వలె వ్యక్తిలో ఆలోచనలు
ఉదయం తోటలో విరిసిన పూలయి తోచేను
రాత్రి వేళ ముక్కలయి చెదరిన రహస్యం
పొద్దున పడవలో అలవోకగ తేలేను

పగటి వేళ సమస్యకు సమాధాన యోచనలో
కవితలో పదాలపై ఆత్మీయం నెలకొనేను

కవి మనసుకు మోదంగా హ్లాదంగా ఇరుపార్శ్వాలు
కాలం గడచేను, పగలు రాత్రి యాన రూపాలై

26.

కష్టంలో రాటు తేలి గాధలలో దీటు అయి,
జీవ ప్రసార రేఖలతో మృత్యువుకు దూరమయ్యేను
అంటించిన కశ్మలం అపుడే దూరం జరిగేది కాదు
పొంచి ఉన్న దరిద్రం, ఆ వెనకనే దాగుడు మూతలతో

భౌతిక మానస రూపాలకు బరువులు రెండు
చెరొక వైపు నుండి తమ ఉనికి చాటేను
మనిషి లోని విలువలకు మేలిమికి ఎప్పటికప్పుడు
అద్దం పడుతుంది, తూకం వేస్తుంది సమాజ న్యాయం

రాత్రి నుండి పగలుకు సులభంగా
పగలు నుండి రాత్రికి అలవోకగ
చేరడమొక తప్పని అనుభవ వాస్తవం
మోదం ఖేదం నాణేని కిరు వైపుల వలె

టాస్‌లో ఎపుడే వైపు ముఖం చూపేదీ
తెలియదు, అంతా ఒప్పుకొనే పరివర్తనం
నీడ తొలగడ మంటే అటూ ఇటూ
వస్తువు నుండి కాలం క్రమించడమే

రవి శశి చూపు లెప్పటికిని ఒకే విధం
తాపంతో హ్లాదంతో జీవశక్తిని కాపాడేరు

త్రుంచక పోయినా మనిషి, సమయం గడచే కొద్దీ
పూచి రాలి భూమికి అర్పితమై విత్తన మయ్యేను పుష్పం

మరో జీవన దశకు కారణ మయ్యేను
జగతికి పునరుద్భవ చేతన ప్రకటించేను

మట్టి నీరు గాలి వెలుగుల అవకాశంతో
పరి పోషణతో నిజ సుందరతను పొందేను

ఏదో ఒకటి గూడో గుడిసో భవనమో
పనిలో ఎవరికిని మనసును ఖాళీగా ఉండదు

లేంది మనిషి ముఖం మాత్రం తనలో
చూపేను ! ఎదారి శకలంగానో మూసిన దిశగానో

27.

పరిభ్రమించే అభయ చక్రంలో మనిషి తిరిగేను
సుఖము దుఃఖము ఆపద విషాదం దశలలో
విశాల విశ్వాన్ని తన వశం చేసుకోవాలని
కష్టంలో నష్టంలో ఒకటొకటీ మనుషుల హద్దులు చూపేను

అపుడపుడు ఏర్పడిన కల్పనా రూపాలు
ఎపుడెపుడొ వాస్తవ రేఖలతో "నిజం"
ముఖం చూపవచ్చు చరిత్రలో జరిగిన వెన్నో!
ప్రతి మనసు ఒక అనుభవ స్మృతి భవనంగా మారేను

జల మిత్రమొ ! జల బంధువొ ! జల దేవతయొ
మనిషిలో రసాకృతి రూపం, ఇది లేని ఊరు ఉండదు
అక్కడక్కడ అవసర జీవన సుందరతలతో విగ్రహాలు
జల శత్రువు లేకపోలేదు, వరదలు తుఫాను బీభత్సంతో

హిమ శిలా పాళీ సమూహాలు శ్రేణులుగా
లోపలి నీరు స్తంభించి, మనిషికి ప్రేయో రూపాలు
గాలిలో మాట తేలుతూ పోతుంది బంధువులా
వెనకనే పాట ఊగుతూ వస్తుంది, సన్మిత్రంలా

చెట్టు పక్షి మనిషి! ఎప్పటి అనుబంధంతోనో
జీవన రూపంలో పోలికలతో ఆకర్షించేను
కవితలో సుందర కల్పన దించేను
బ్రతుకులో మానుష హృదయం కోరేను

అడుగు వేస్తే జారే నని భయం చీకటిలో
రవి కిరణ స్పర్శకై తపిస్తుంది, నిశీథి
తేజో రూపంతో నైజం లక్ష్యంతో గతిలో చేతనతో
చరిత్రలో మనిషి ఉనికిని కాపాడే విధంలో ఆలోచనలెన్నో

ఆ సమయంలో పరిస్థితులు చీకటిని కోటగ మార్చేను
రక్షణలో రహస్య ప్రకారాలతో గుండెకు ధైర్యం ఇచ్చేను
పగలు ! వెలుతురులో శ్రమ చేతన రూపం
నిశ! అయితే జన గాథకు విరామ సమయం

28.

ఆగని ఎగసే జ్వాలా మనోమయం అహంకారం
దీన్ని వశం చేసుకోగలది ఒకటే, దయా మేఘం
ఇది ఎవరి వెనకనో పిలుపు పైనొ తరలి వచ్చేది కాదు
ఉదయ సాయం వేళల వస్తువు లొకటే, ఉద్దేశాలు వేరు

కరుణలో ఆర్ద్రత జీవితాని కవసరం
రాగంతో సృజనకు భూమిక తప్పదు

ఆరాటం ఆవేశం ఉద్వేగం ఆవేదన కలిసి
జీవన ప్రాంగణాన అల్లికతో పందిరి అయ్యేను

ఉభయ సంధ్యల చక్రాలపై దివా నిశలు
జీవిత వాహనం తరలుతుంది చేతనతో
మేధలో చేరే వస్తువు లెన్నో? ఎప్పటెప్పటివో
కలసి పోయి, అవసరానికి బయట పడవచ్చు

పగలు ఎండలు ! ఉద్యమ గాథలతో జ్వాలా రూపం
వెలుతురు ఉన్నంత వరకు నీడ వస్తువుతో ఉంటుంది
ఇది బూదికాదు వాడిపోదు మాయదు తొలగదు
కష్టంలో మనిషి హృదయంలో ఆశా కేతన మవుతుంది

ప్రకృతి తోనొ ప్రాణితోనొ వ్యాధితోనొ ప్రభుతతోనో
శాంతి కళ తరిగేను, సమర ఘోష తప్పని దయ్యేను
దీనికి కొత్త లేదు పాతలేదు ప్రజల అవసరం ముఖ్యం
రణ చరిత్రలో ఉద్యమ పర్వంలో నాశన ఘట్టా లెన్నో

తోట చుట్టు కంచె, ఇంటి చుట్టు గోడ రక్షణలో
మనిషి చుట్టూ గీతలు, భయ కారణం తొలగేందుకు

శ్రమ చక్రం కదలితేనే బ్రతుకులు ముందుకు సాగేది
నిజ హృదయం వెలిగితేనే, లోని చీకటి తొలగేది
ఎన్ని సమూహాలయినా ఎన్ని విధాలయినా వ్యక్తికి
పయనంలో చెదరని లక్ష్యంతోనే విజయం

బుజాలపై నుండి ఎగిరే పావురాళ్ళు సీతాకోక చిల్కలు
స్వేచ్ఛా చరణంలో శాంత భావ కమనీయానికి సంకేతం

29.

ఈ చెట్టు తనకు తెలియకుండగనే
చివురు వేసేనా? పూలు పూచేనా? పండ్లు ఒసగేనా
సాహస చతురతతో గాలం విసిరి నట్లు
సృజన ప్రభావానికి భాగ్యం వ్యక్తి వశ మయ్యేనా

కథ ఎచట మొదలయ్యేదీ తెలియదు
కనిపించే చెట్టులో దశలు దశలు
అనుభవ మనోజ్ఞమై అభిలాషా నవమై
జీవన పూర్ణత పయి ఆశలు నింపేను

చర్యలలో భాగమై వాదాలు వినిపించేను
స్వార్థంలో పరిష్కారం తలుపులు మూతపడేను

నిన్నటి వరకు చేతిలో ఎరుపు రంగు గుర్తులు
ఈనాడు ఎన్నో పలు రంగుల లోకి మారేను
అనుభవంలో ఏదీ చివరి మాట లేదు
ఉన్న విషయాలన్నీ కవి కోసమే అన్నట్లుగా

మనిషి బ్రతుకు గురించి చింతనలు
మరొక లోకం దర్శన మిస్తుంది అనుభవంలో
స్థలం నుండి స్థలానికి ఆకర్షణ లాగుతుంది
ధనం విద్య పదవి భాగ్యం ఆదర్శం ముఖ్యమై

భూమి చెట్టు గగనం రవి చీకటి చంద్రుడు
కవితో మాట్లాడతాయి, కవులు మాట్లాడతారు

భయమెక్కడ? తెలియక పోవడమే భయం
అన్నిటిని దాటి పోవడమే నిజ జీవన విజయం

కష్టంలో నష్టంలో పనికి రావనుకునీ
మోదంలో సౌఖ్యంలో పనికి వచ్చేవనీ
పాతవి వదలడం, కొత్తవి కోరడం
పూర్వ శ్రమ ఫలం దాచుకునేందుకు కావచ్చు

స్వంత లాభంతో ప్రయోజనం చూచేను మనిషి
అనుభవ ప్రపంచం ముఖ్యమై కొత్త దారు లేర్పడేను

30.

ఉరుముతుంది మేఘం! మహా భయాక్రాంతంగా
ఆకాశం అదిరి ఊడి పడుతున్నట్లు అనిపిస్తుంది

మనసులో అలజడి విమానంలా హృదయ మెగురుతూ
శబ్దం గాట్లతో, నిశ్శబ్దం ! చీకటి రేఖల చిత్రాలతో

నిరంతరం జల ధారా ప్రసారమాన రూపంతో
ప్రవాహం ఉన్నది దేనికి ? పనికి రానివి విసరబడేందుకా?
పైకి కంటికి కనిపించని రక్షణ కవచంలా సాగుతూ
ధైర్యంతో అన్నీ వహిస్తూ మనిషిని మునుముందుకు నడిపించేనా?

ప్రతి క్షణం నవ నవంగా బ్రతుకులు గడవాలనీ
అనుక్షణం అభినవంగా మనస్సు నిలవాలనీ
ఇది కవితలో చెల్లుతుంది అమూల్యం, అపూర్వం
ప్రతిభ విలువలు పెంచుతుంది అనుకోకుండా

ప్రతి జీవ కణంలో సృజన చేతన లేశమయినా
ఉంటే, జీవన ఘర్షణలో మిగులుతూ ఉంటే
కొరతను తీరుస్తూనో, మిగులును కూరుస్తూనో
చర్యకు ప్రతిచర్య వెనక, ప్రకాశ రూపంలో విజయం

ఇది దారిలోని ప్రకృతిని పలకరిస్తుంది
మనిషికి ఆంతర శక్తిని ప్రసాదిస్తుంది

ఎప్పటికి ఒక దశలోనే ఉండిపోదు, సమాజం
వికాస చరిత్రలో, ఆధునికం చేతులు చాస్తుంది

దారిన రాలిన ఆకులు ఒక వైపున గాలికి కదలుతూ
మరో ప్రక్కన పూచేందుకు విత్తులు మొక్కలు, కొత్తతరం

చెలరేగిన మంటల నార్పే సంరంభంలో
పయనం, గాయపడిన శాంతికి చికిత్సతో వేదనలో

ఊహలు ప్రతి ఊహలు చర్యలు ప్రతి చర్యలు
కల్పన వాస్తవ రేఖల మధ్యన ప్రశ్నలతో మనుషులు

రాత్రి చీకటిలో తయారైన వాడి ప్రశ్నావళి
పగలు వెలుతురులో జవాబుకై వేచి ఉండేను

ఇసుక మేటల మధ్య, నీటి చెలమల పైన నమ్మకంతో
పయనంలో హఠాత్తుగా పైకి చిమ్ముతూ గ్యాస్ జవాబుగా

31.

తానొక మనిషి మనీషి మనస్వి అనుకునేను ప్రతి వ్యక్తి
ఇతరులు జంతువులో మృగాలో మరొకరు! బ్రతుకులో
సందర్భాన్ని బట్టి మారేరు, అనుకూల వశంగా నయి
లౌకిక తంత్రంలో భాగమై, సృజనలో ప్రతీక లయ్యేరు

ధ్వంసం అనుసరించి నిర్మాణం జరిగేనా? ఆ వెనకనే
ఆయువు వీడక తప్పని కవి ముఖం కన్న
కవిత ! బాగా చెబుతుంది! వారి జాతకం
అంతరంగ రూపంతో మాట్లాడుతూంది సూటిగా

లోన ప్రభుత నలంకరింప జూచేను
బయట పీడనం బలంతో మెలగేను
దారిన దొరికింది అందుకుంటూ నిర్భయంగా
కల గూర బుట్టగా మారేను సందర్భం

భావ జగత్తులో స్మృతి శాలా నిలయంలో
మనిషితో మనిషి కథ ! కలిసి సమాజ మయ్యేను
చంద్ర కళలు గాయాన్ని చల్ల బరుస్తాయి
సూర్య కళలు శౌర్యానికి దీప్తి నిస్తాయి

బ్రతుకులో భయం అడవిలో గుహలా అమరి
అపుడపుడు వాటిని చూడ వలసి వస్తుంది
మధ్యలో ఆదర్శం వాద / వివాదం అంచులలో
నడచేరు అక్షరాన్ని తూటాగా ఉపయోగించేరు
అక్షరాల్ని పూల దండగా మార్చివేయనూ వచ్చు
తూటాలు పూలు కలిసి జవాబులుగ మారేనా?

కథలన్ని కలిసి విశ్వమయం, మానవ జీవితం
పరిమితులలో నయితే స్థానీయంతో తన దేశం

అడవి నుండి బయట పడేందు కెన్ని
ఆటంకాలు తొలగి రావలసి ఉంటుందో?

ప్రతి వ్యక్తిలో సమాజ శక్తి పరంపర రూపం
అంతరంగం చూపుతుంది, నిర్మాణంలో లక్ష్యం

32.

రోజు కొక ఉదయ జగత్తులోకి అడుగు పడుతూ
రాత్రులు చీకటి జలధిని దాటేను మనిషి సులభంగా
దీనికి తీరు తెన్ను లెన్నో! నిద్రా వాహన మొకటి ఇందులో
నిశ్శబ్ద జలధిలో చకితంగా మునిగి తేలిన నవానుభవం

ఇక మనుషులయితే సరే సరి ! మాటలతో చర్యలతో
కొత్తదనం చూపుతారు! అనుభవ రుచి నడిపిస్తుంది
దూరాన ఎడారి తళతళ లాడుతూ జల కళతో
దాహం వేసిన మనిషి అవసరాన్ని బట్టి భ్రమించేను

ఒకరు చేపలు పట్టే గాలంతో సిద్ధ మయ్యేరు
ఇది తెలియడ మొక సూక్ష్మ మయిన అనుభవ రూపం
ఎక్కడా ఒక చెట్టు లేదు, పిట్టలేదు మనుషులు అంతే
మనసు మాత్రం జీవికలో అందల మెక్కించేననీ

ఎప్పుడైన ఎక్కడైన కవిత ఒంటరి కాదు
చుట్టూ మనుషులు వస్తువులు ప్రేరణ శక్తులు
చుట్టూ ఉన్న జగం పాత దయినా, అనుభవం కొత్తది
కవిత కొత్తది ! చుట్టూ ఉన్నవేవో, తనలో ఇముడ్చుకొనీ

సృజన విశ్వమయమై అందరికీ ప్రియమై
అవని క్రమ్మి, నింగి కెగసి, దిశలు ప్రాకి
మనిషి యశో రూపం ! వెలగాలని కోరేను
ఇది అగ్నిలో తప్తమైన హిరణ్మయ తేజం వలె

తోట చేను పొలం యంత్రం వ్యవహారం మరొకటి
ఎన్ని కలిస్తేనో కార్య కారణ సమాజం ఏర్పడేను

ఇంటి ముందు చెట్టు ఎప్పటిదో ఎదిగే గార్డులా
ఒకనాడు మట్టిలో కలిసి, మరో రూపమెత్తాలని

కవితలో అక్షర నిజ శక్తికి చివర లేదు
అనుభవ ప్రభావంతో ముందుకు సాగడమే పని

అన్నిటిని కలుపుకొని కాలం గడుస్తుంది
ఇది దేనిని వదలదు ! దీన్ని ఏదీ వదలదు ! ఒకటై

స్వేచ్ఛా కవిత్వం - 118

వార్తలో కవిత

మాదిరాజు రంగారావు

2022

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

118 SWECCHA KAVITHVAM

VAARTHA LO KAVITHA

Free verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2022

Presented to
my wife
Smt. Indira

పీఠిక

దీనిని గురించి

పత్రికల్లో రోజువారి వెలువడే వార్తల్ని దృష్టిలో పెట్టుకొని సాగింది. వీటిలో ప్రధానమైన విషయమో అంశమో నేపథ్యమో ప్రభావమో కవిత్వాన్ని ప్రేరేపించడం జరిగింది. ఇవి ఏరోజు కారోజు స్పందనతో సద్యోజాతమైనవి. అప్పటికప్పుడు వెలువడడంలో సహజతతో పాటు Concern ప్రాముఖ్యం స్పష్టం. ఇవి చాలా భాగం భావ రూపాలతో ప్రతీకలతో ఆవిష్కృత మయినాయి. వర్తమాన యధార్థ స్థితి సూచనలు మెరపు తీగెలవలె భాసిస్తాయి. అన్నిటికీ కేంద్రం ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికం. దీని వెలుగులు ప్రకాశించడం జరిగింది. ఇది కవిత్వ ప్రయోజనంలో కీలకమైంది.

వార్తలలోని 1. విషయం చాలా సూక్ష్మమైన పొరలలో ఉన్నదీ, 2. సారభూతమైనది 3. నేపథ్యంతో విలసించేదీ 4. సమాజ చింతనకు దారి తీసేదీ 5. వ్యక్తి విశ్లేషణం – 6. సమాజ స్థితులు దృష్టికి వస్తాయి. రచన ప్రధానంగా కవిత్వ కళకు సంబంధించిన విషయం సూచనలతో సంపన్నమయింది. చారిత్రక దృష్టితో పలు అంశాలు స్ఫూర్తికి వస్తాయి.

వర్తమాన కాలంలో ఆధునిక కవిత్వం స్వేచ్ఛకు వేదికగా ఉన్న మాట వాస్తవం. ఇది ఎంతో వైవిధ్యంతో కూడింది. వివిధతలతో పలు కోణాల్లో జీవితాల విశ్లేషణ నుండి దార్శనికం వరకు పర్యాప్తమయింది. "వార్తలలో కవిత్వ"మన్న శీర్షిక తగినదనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో కవిత్వంలో గూఢత దీన్ని కప్పేస్తుంది.

సృజన చేతనలో నవ ప్రాధాన్యాన్ని తలపిస్తుంది. సామాజిక సందర్భాలలో విలపించేవి.

కవి హృదయం 1) వ్యక్తితో– సమాజం 2) సమస్య – సందర్భం 3) విషయం – అనుభవంతో ముఖ్యంగా స్పందన – చర్య ప్రతి చర్యల ప్రభావాలను గమనించవచ్చు.

1953–54 నుండి స్వేచ్ఛ కవిత్వం పేరుతో సాగుతూన్న రచనా పరంపరలో 118 వది. భౌతిక మానసిక అతీత స్థాయిల్లోని భావ ప్రసారాన్ని సులభంగా గుర్తించవచ్చు ప్రత్యేకతల చేత విశ్లేషణ. వివేచన కవకాశ మిస్తూంది.

ఆశా స్ఫూర్తితో కవిత్వంలో అక్షర శక్తిని గుర్తించే సహృదయ సమాజానికి స్వాగతం! "వార్తలో కవిత" ఒక ప్రయోగ భానవతో సామాజిక వాస్తవికతను ప్రతిఫలిస్తూంది.

– మాదిరాజు రంగారావు

1. అంతం లేనిది

ఇప్పుడున్న శైశిర సందర్భాలను ప్రహరులతో
రంగు లద్ది ప్రతుకుల్ని వసంత శోభతో నింపాలనీ
ఆశా లోకం చిన్న తనం నుండీ మనిషిలో
నిజ కాంక్షా చిర స్నేహం, ఒక నాటిది కాదు

ఎత్తిన కొరకంచు తలకు పాగా వలె
మల్లెపూల మాలతో వేదన తీర్చాలని
వీలు వెంట పైకి గాలి కెగిరి పోవాలని
రంగుల గాలిపటంలా జీవన వాస్తవ దృశ్యం

తాపానికి నీలిమబ్బు శాలువ కప్పుకొనీ
గగన జలధిలో రవి పడవలా సాగేను
ఎంతగ తన కథలో ఒంటరి తనం కోరినా
బ్రతుకులో ఇతరులతో సంబంధం అనివార్యం

రాత్రి – కన్న కలలు ఒకటొకటి ఉదయం
వీధి దీప స్తంభాలకు తలలపైన చేరినవి
పొద్దు పొడవడంతో అన్నీ మటు మాయం
రాత్రికి చుక్కలుగా స్వాగత మణులయ్యేను

ఉదయం వస్తుంది సప్త వర్ణ రుచిర స్పర్శతో
బయటకు భౌతిక రూపం శుభ్ర పరచబడీ
లోన ఉన్న మనో జగం! స్వచ్ఛతకై చూచేను
భావ జాల దిశలు రాగ రంజిత మయ్యేను

వ్యక్తిలోని ఆశ వెలుతురు నది వలె ఆగనిదై
రాత్రి గడుస్తుంది దివ్వెల ముఖాలతో మౌనంగా
ఎన్ని బాధలయినా అలల వలె సమహృదయంతో
జలధిలా ! అంతంలేని వార్తలతో ప్రజాస్వామ్య ప్రకాశం

2. చీకటి బొమ్మలుగా

బయటికి కనిపించని గుప్త మనో రూపాలొకటొకటీ
వాక్యానికీ వాక్యానికీ మధ్య ఎడంలో చేరేను అలవోకగా
అందరికీ తెలియని సంఘటలెన్నో ! రోజూ జరిగేను
లోన మనిషి విజయం తనదే నని సంబర పడేను

విషయ విమర్శలో ఎవరి దృష్టి అభిమతం వారిది
కథనంలో వాస్తవ మెన్ని దుస్తులతోనో కనిపించేను
ఏ నిజం? ఏ శిథిలాల క్రింద నలిగి ఉందో తెలియదు
హృదికీ మతికీ మధ్య దూరం చూపులకందనంతగా

అడవులలో బ్రతుకులు వెళ్ళబుచ్చే వారెపుడో! కొందరు
సుఖం మేలు సౌకర్యం కోరీ! పట్నం చేరేరు సులభంగా
ఇపుడు! సంఘంలో విషమ స్థితులు పోగొట్టాలనీ జ్వాలలై
అడవి కేంద్ర మవుతూంది, బ్రతుకు బండలవుతూంది

తరాలుగా సాగివచ్చే శ్రమ సంస్కృతితో సమాజ వికాసం
కాలి బాట నుండి గాలి పథంలోకి యాన చరిత్రలో
కలలకు వాస్తవ రూపమిచ్చి బ్రతుకు మెరుగు పరచాలని
సర్వం యంత్రమయమై వ్యక్తిలో గుప్త శక్తిని చూపేను

స్వచ్ఛమైన మానవ చేతన ఇపుడు హఠాత్తుగా
భయ వలయంలో తిరుగుతూ ఒంటరి భావనతో
చుట్టు రక్షక భటులతో లఘు రణ వ్యూహం తలపించేను
ఉదయం సాయం సంధ్యలకు భేదం లేకుండా పోతూంది

క్షేమంకై కఠిన చర్యలకు సిద్ధంగా ఎప్పిటికపుడు
వ్యక్తుల సహకారంతో ప్రభుత ముందు కొస్తూంది
ఎదపై నిప్పుల కుంపటితో వలసలు! మౌన ప్రదర్శనలతో
ఎక్కడికిని మనుషులు చీకటి బొమ్మలుగా మారని చోటుకు

3. మౌన పీఠం

అంప శయ్యపై ప్రాణం మిగిలి ఉన్న మహావీరుడు
విరామ సమయంలోనూ అంతో ఇంతో రణ చింతనలో
నిష్క్రమణంకై తలుపులు తెరవబడీ! పూర్తిగా
ఆలోచనలో విషాద మోద సన్నివేశ సంకలనం

జలధిలో విసరిన గాలానికి అనుకోకుండా
హఠాత్తుగా తగిలిన చేపలా! క్షోభాకుల హృదయం
బాధా జ్వలిత మనో రూపం! బింబంతో అంతరంగం
స్వేచ్ఛా మయమయింది! విజయ గాథ తెలిపేను

ఇది కాలం వేసే శిక్షలో ఒక భేదం కావచ్చు
జరిగింది త్యాగమో మోచనమో! ఉదారతో
రెపరెపలాడుతూ ఆరనున్న దీపంలా ఆయువు
ఒక వైపు నుండి మరో వైపు చూపులతో

ఒక మాట ఒక చేతతో అనూహ్య పరిణామం
ఎప్పటికీ కట్టు కొయ్యకు బంధించిన స్థితియా?
రాజ్యాలు తలక్రిందుల కావచ్చు
మనుషుల అనుబంధాలు చెదరవచ్చు

మానవేతి హాసంలో అపూర్వ ఘటనలు
యశోరూపంతో చరిత్ర నలంకరించేను
సమాజ దృశ్యం! మారవచ్చు! భిన్నమైన దృష్టితో
జీవన యానంలో అస్థిరత మనసు మూగ పరచేను

నీలి మబ్బు ముక్కలొక దాని వెంట మరొకటి
కమ్మిన రవి బింబంలా తెలియని నిజాలెన్నో

మాట ఏలుతుంది వీరంతో తమస్సు ప్రబలుతుంది
సాత్వికాన్ని ఆవహిస్తుంది, మౌన పీఠాన్ని ఆక్రమిస్తుంది

4. నిరీక్షణం

పయనంలో ఎదుర్కొనే సమస్యలో చేతికందే
జేబులో గలగల లాడే నాణేల వలె జవాబులు
బాధలు వేదన ఆపద దుఃఖం దేని కది
కాలం పరచిన అగ్ని శిఖలతో జీవితాలు

ఎవరి బ్రతుకు వారిది అయినా స్వేచ్ఛ లోను
సందేహం సంశయం సందేశం దిశ దిశలో
పథ పథాన జీవన దృశ్యాలు సమాజంలో
లోకంలో దేనికీ దూరం కాలేదు జీవితం

మనుషుల కోరిక లెన్నో ఇరు వైపుల నుండీ
మనసు కోరినవే కాదు, కోరనివీ అవసరాలు ఎన్నో
విభేదాలు శత్రుతలు మధ్య బ్రతుకులు
వివిధ రుతు మేళన ప్రభావాల్ని తలపించేను

చిక్కిన పావురం పైకెగిరి పోకుండా
మూసిన పిడికిలిలో ఎంతసేపు బంధించేరు
అధికారం రాజకీయం రెండు రెక్కలపై
జీవన వాస్తవం ఎపుడే దిశలో తిప్పేది తెలియదు

అవసరం లేనిది లేదు, కవితలో
కవులు ఇష్టపడని విషయమంటూ లేదు
వ్యక్తిలో ఆశా రూపం నదిలా ప్రవహిస్తూ
దాహం తీరేందుకు భాగ్యం పండించేవరకు

సానుభూతి కవకాశం లేక పోలేదు
కష్టంలో నష్టంలో బాధలో దరిద్రంలో
ఏ దిశ నుండో ! మనిషి నుండి మనిషికి
స్వానుభూతితో నిరీక్షణం తప్పదు నిరాశలో

5.

పూలతో పాటుగా ముళ్ళు తప్పనివి ప్రకృతిలో
హ్లాద కరంతో పాటు బ్రతుకులోను బాధాకరం
మనిషి లోను దీనికి సమాంతరంగా అపుడపుడు
స్పందన హృదయంతో నిశిత మేధ పై పొరలో

దేని అవసరమనుకున్నప్పుడు అది చేరేను
సందర్భం అనుసరించి, ముఖాలు చూపేను
విలువలు తెలియని స్థితిలో కొందరి బ్రతుకులు
లౌకికం వర్తకం రాజకీయ నైతికం
ఎన్నో సమాజ ప్రగతికి వివిధ కోణాలలో
జీవన ప్రయోజనంలో వికాస గమ్యంతో

పురా దశలనుండి ఆధునిక యుగం వరకు
పరంపరా సూత్ర పంక్తుల ఛేదనలో మనుషులు
తప్పని అవసరాలలోనే మార్పును అవలంబించేరు
కల్పనలో ఆరంభ బిందువుతో మొదలైంది
వాస్తవాన నిఖిల మానవాభ్యుదయం కోరేరు
ఎన్ని సాధించినా ఇంకా మిగిలే, సాధించవలసినవి

గడియారం లోలకంలా మానవ హృదయం
చలనంలో లయతో బ్రతుకులు గడచేను

ప్రతి ఒక్కరి ఆశలో విజయ కాంక్ష బలీయంగా
ఆరాటంలో ఎదురుగ బండ రాయిలా ఆటంకం
సమ భావన సూత్రంతో ముళ్ళు పూలు కలిపేరా
దీనితో సమాజంలో విలువలు పెరిగేనా?

సమాజంలో కొందరి బ్రతుకులలోనే శిఖరాలు
మిగతావారి బ్రతుకులలో గోతులు, లోయలు

6. విభేదం

సవేగ వాహనంలో వెనక్కి పరుగెత్తినట్లు దృశ్యాలు
అనుభవంలో ఉన్నదేది? కంటి ముందు కదలేది ఏది?
మౌనం వహించడమే జరుగుతుంది, మనుషులలో
రవి కిరణంలా ప్రకృతి సుందరతలో భాగం కావాలనీ

గతాన్ని మరవడమంత సులభం కాదు
చెలమలో నీరులా పైకి ఉబికి వస్తుంది
సూచన మాత్రంగా నైనా ఎన్నో తెలియనివి
తన పాటకు ఒక గళం సరిపోతుంది
తన మాటకు మరొకరు పక్కన అవసరం
గెలుపు ఓటమిలో రుచి భేదం తెలుస్తుంది

పగలు తాపంలో చిరు జల్లుతో శమనం
సుఖ లేశాన్ని చూపేను, ఇది కోరే మనిషికి

బికారిని నిలయం దరిద్రునికి స్థానం
రుతు చక్ర భ్రమణంతో పాటు తిరిగేను
మంచు ముక్కలానో అగ్ని కణంలానో ఒదిగేను
వసంతానుభవం లేని నిరుపేదల కథలు వేరు

ప్రతి వ్యక్తికి సమాజంలో ఏ భేదం లేకుండా
ప్రత్యేకంగా బ్రతకాలని కోరిక గాఢంగా
చీకటిని ధైర్యంగా ఎదుర్కొనే మని బ్రతుకులో
కొత్త మనిషిగా అంతర్నయన దీప్తితో ఎప్పటికీ

ఎవరి దృష్టిలో వారు, ఉన్నత శిఖరం
మస్తిష్క శిఖరానికి పూలమాల తొడగాలని
కళ్ళు ముక్కు నొసలు ముఖం తీర్చిన రూపం ఒకటే,
ఊహలో చర్యలో భేదంతో ఎవరికి వారు

7. రాగం ద్వేషం

బయట గోడపై రాతలు చదవగల వారికి
ఉత్సాహ మిస్తుంది ఆలోచనలో దింపుతుంది
స్వయం స్వేచ్ఛవలె స్వయం బంధనం
ఒక్కొక సందర్భంలో అవసరమవుతుంది
ఈలోపల ఆపదను పసి గట్టే చర్యలు
మనుషుల ఆరోగ్యం భద్రత క్షేమం గురించి

చుట్టు ఎందరో పనులు పైన వెళ్ళేవారు
పనులు లేక ఆకలితో తిరిగే వారు
గాలి వీస్తుంది ఆగదు, దిశలు స్పృశిస్తూ వెళుతుంది
ఎంత దూరమయినా, మందంగా వేగంగా తీవ్రంగా

చీకటి గురించి భయ మక్కరలేదిపుడు
ఇది రోజూ అనుభవంలో డిటో లోదే
అంతంత మాత్రం భయ భావం బ్రతుకులో
నిదురలో అవలీలగా దాటేను దుర్గమం

పగటి వేళనే మనిషికి భయం లోలోన చింతనచే
బ్రతుకులో సమస్యల గురించి బాధల గురించి

సానుభూతి పవనాలు వీచక పోవు
అవి గ్రీష్మానికి సృజన ముఖం ఇచ్చేనా?
అనుభవం మీద కాని మనసుకు తెలిసి రాదు
అందాక ఎవరైనా అనుభవించవలసిందే ఆపదలో

కల్పనా జగం లేంది వాస్తవానికి ప్రేరణ అయింది
వాస్తవ తలం లేంది బ్రతుకును తీర్చి దిద్దే
తన శ్రమ శక్తిచే శున్యాన్ని పూర్ణం చేయాలని మనిషి
నీతి నియమం రాగం ద్వేషం రేఖలతో సంశ్లిష్ట జీవితం

8. రాగ సంపద

గతంలోకి జారిపోయిన వాస్తవాలు తెలియని దెందరో
తెలిసిన రహస్యం జ్ఞాపకం లేనివారు ఉన్నారు వీరితో

చెట్టు ఎక్కడున్నా ప్రాణవాయువును ప్రసరిస్తూంది
మట్టి ఎక్కడున్నా సృజన శక్తిని ప్రకటిస్తుంది

మనిషి ఎక్కడున్నా విజయ స్వరం అందుకోవాలని
తనలో ఎదిగే మానుష శిఖారాలను నిలపాలని
మనిషికి స్వాగత మిచ్చే ప్రకృతికి
ధన్యవాదాలను మరవలేరు ప్రజలు

అలసతలో నిష్క్రియ దరిద్రాన్ని సమాజంలో పరుస్తుందనీ
ఉద్రేకంలో గ్రీష్మ చండతను కాలం మండి స్తుందనీ
తుపానులో వరదలచే బీభత్స ముద్రలు వదలేనని
ఇట్లా ఎన్నయినా ప్రకృతి జీవన భూమిక అవుతుంది

శిశు దిశ నుండి వృద్ధాప్యం వరకు
ప్రకృతిలో సమాంతరంగా సమాజం
ప్రత్యక్షంగా కావలసిన సంపదతో బ్రతికించేది
మనిషికి దారులు చూపేది జీవితాన్ని పండించేది

నిరంతర చేతనతో సమాజ శక్తి తక్కువేమి కాదు
పుట్టిన లిప్త నుండి సమాజంతో వీడని సంబంధం
శిశువును మనిషిగా మనస్వీగా మనీషిగా మార్చేను
శిక్షణలో రక్షణలో ఆయువు గడుస్తుంది హ్లోదంగా

కలహంలో సమరంలో అనివార్యమైన జీవన రూపం
బాధల గాధలతో గొప్ప సమాజ చరిత్రను నిర్మిస్తుంది
ప్రేమ కరుణ సహన శాంతి నాలుగు కోణాలలో
మేఘ హృదయంతో రాగ సంపదతో బ్రతకడ మొక విజయం

9. అతీతం ఆశామయం

ఎవరో తమ కిష్టమైన వారిపైనే
కిరణం ప్రసరించాలని అనుకోడు రవి
తమకు మాత్రం కిరణ ప్రసారం చేరితే
చాలునని అనుకోరెవరూ మనుషులలో

అవనిపై నది ప్రవహించినంత మేర
దూరం అనుకోదు, అలసట ప్రకటించదు
స్వార్థం ఎరగని ప్రవర్తనలో పరివర్తన
అందరికీ మేలును కూర్చేదిగా కదలుతుంది

ఈ మట్టి పైన మనిషి జీవితమూ అంతే
స్వార్థంలో ముక్కలు చేసి, భేదం చూపేను
ఇది తుది శ్వాసతో విశ్వమయమవుతుందని
తన యశోరూపం మిగులుతుందని మనసులో

కాలానికెంత వశమయినా, స్వేచ్ఛను మరచి
నిష్క్రియతో మౌనం వహిస్తేనే, అభ్యంతరం
మూల గుణం మారదు, సందిగ్ధ భ్రమణంలో
రావలసింది రావాలని కావలసింది చేరాలని

మనిషిలో ఆశా రూపం ఎప్పటికీ ఉండేది
విధ్వంసం నిర్మాణం ఒక దాని వెనుక ఒకటి
అందరిలో ఎక్కడున్నా తప్పని సరిగా
మందంగానో తీవ్రంగాఓ స్తబ్ధంగానో

విగ్రహంలో దైవాన్ని రూపు దిద్దుకునేను
అనుభవ శిఖరం చేరిన మనో రూపంతో
తాను దైవంగా ప్రకటింపచూచేను మనిషి
అందరినీ ఆకర్షించే అతీతం ఆశామయం

10. రహస్య పథాన

ఉదయ రాగంతో ఒకటయి మానసికంగా
కావలసిన దారిని వెదకి పట్టుకునేరు
ప్రయోజన దిశగా సంకల్పానికి సుమార్గమై
బ్రతికినంత కాలం ఉత్తేజం కలిగే స్వరంతో

అస్తితతో ఉన్న వ్యక్తిని నాస్తికత ఎలా వరిస్తుంది
ఆశలు దూరం కావచ్చు, నిరాకరణం జరగదు
ఆడవిలో కన్నా జన పదంలో నగరంలో
సంసిద్ధం చేసుకొనేరు, బ్రతికేరు
తమకు చెందని అడవిలో కొత్త వారు కనిపిస్తే
ఆయుధంపై వ్రేళ్ళు కదలేను, సందేహాలు కమ్ముకొనీ
కొత్త మనిషి మాట వినబడితే చాలు
తత్కాలం క్షణాలు నిశ్శబ్దంగా గడచేను

తన నీడ వెనక ! వెలుతురు రెక్కలు విప్పుతుంది
పచ్చని చెట్ల చల్లదనంలో వర్తమానం హ్లాదంగా
ఉన్న వారి భవితను కాపాడే ఆశ్రయమై
రంగులు జీవన సంకేతాలయి వెలసేను

దేహంపై గాయాలను గులాబి రేకులుగా తలచేరు
ప్రతీకారంలో మనస్సు జ్వాలా రూపాన్ని పొందేను
ఒక్కొక్క జీవిత మొక్కొక్క రంగులో వెలిసేను
గాయాలు అలంకరింపబడినవారు కొందరు
బుజాలపై పావురాళ్ళను వహించిన వారు కొందరు
అర్థవంతమయిన ముగింపుకు చూపు లెదురుచూచేను

ఎదురుగా ఉన్నది చాలదన్నట్లుగా సందర్భం
గడ్డ కట్టిన కాలాన్ని కరగింప జేసేను
రహస్య పథాన ప్రవహింపజేసేను తెలియకుండా
ఒక్కొక్క వస్తువు ఒక్కొక్క సంకేతం ధ్వనించేను

11. వజ్రమై నిజం

ఇక్కడి నుండి సందేహ భ్రమణంలో భ్రమలతో
ఎక్కడికి చేరేరు? అనుకుంటూనే తమ తమ
అవసరాల ఒత్తిడికి తలవంచి పయనం సాగేను
అక్కడ కూడ ఇంతే ! దీనికి అనుజుల వలె జీవితాలు

స్నేహం ప్రేమ కరుణ ఉదారత నాలుగు దిశల నుండి
మనిషి కేంద్ర బిందువుగా రూపాలు వహించేను
వీటి ప్రభావ రూపాలతో జీవన బింబ మేర్పడేను
నిశ్శబ్దం తలుపులు తెరవబడీ, శబ్ద సహితమై
అక్షర జగత్తులోకి ప్రవేశించవలసిందే
కొత్త మనోలోకం ఆవిష్కృత మవుతుంది

మరొక పయనం అడవిలోకి సాయుధుల కారణంగా
పగలు చెట్టు కొమ్మల్ని హత్తుకొని దాచబడతాయి
రాత్రి వేళ మనుషుల అలకిడిని టార్జెట్ చేసేను
బయటికి కనిపించని రూపంలో రహస్య వర్తనం

ఉండి ఉండి హఠాత్తుగ అగ్ని చిత్రం కనిపిస్తుంది
నిర్భయంగా మృత్యువు తన ముసుగు వదలుతుంది
అడవి జీవితానికి ఆశ్రయ మవుతుంది
అడవి నుండి జన పదానికి జనపదాల నుండి అడవికి
దేశానికి చెందిన అన్ని హక్కులు కలిగినవారు
అన్నిటిని వదలి అడవులలో భయ ముద్రలతో

ఉన్మద శిఖరం నుండి ఉగ్రవాద పవనం
తమ భద్రతకు రక్షణకు పనికి వచ్చే కవచం
"నిజం" వజ్రమై ఎక్కడ దాగిందో తెలియదు
గడ్డకట్టిన మానవతను ప్రవహింపచేయడమే లక్ష్యం

12. రెండూ ఒకటే

కాలం ఎవరికి తోచినట్లు వారికి అనిపిస్తుంది
ప్రవహించే నది వలెనో మహా వట వృక్షం వలెనో
ఇది ఎవరికి మిత్రం కాదు; శత్రువు కాదు
ప్రకృతి పరిణామ వికాసాల్లో తన విధి వహిస్తుంది

చివురు వేసినా ఆకు రాలినా ఫలం అందినా
స్థలం కాలంతో మనిషి క్రియలు అనివార్యాలు
సమయానికీ యత్నానికీ అనుబంధం, తప్పనిదీ
సృజనతో వాటిలో మార్పుల కవకాశం! అనవరతం

బ్రతుకు నంటి కవితలో తాత్వికం పునాది,
కనిపించి కనిపించని చింతన గుణ బలంతో
వాస్తవ తలాన మబ్బుల వలె దీవిస్తూ
భూమిపైన సమాజ గీతం ప్రవహించేను

కాల పటంపై క్షణ క్షణం సమాజంలో
చిత్ర రూపం మారుతుంది ప్రగతిలో
కాల వాహనంపై ఒక లక్ష్యంతో
మనిషి చిత్రం మారుతుంది, కథలో

పురుష ముఖంలో సూర్యుని తేజో రూపం
స్త్రీ వదనంలో చంద్రుని వెన్నెల బింబం
ఇరువురిలో ప్రభావాలు పంచినట్లు ఉంటుంది
మంచి కవిత్వం ఇరువురి గాథలను విప్పుతుంది

జన గణ ప్రయోజనాల భావనలో
ఎవరి అస్తిత వారిది, రహస్యం వారిది
స్త్రీ పురుషుల విలక్షణతలు వేరు వేరుగా
కల్పన సాకారం పొందే ఊహలు ఆశలు ఒకటే

13. ఎంతోకొంత

కల్పనలకు వాస్తవాకృతి శిఖరారోహణం
ఆటంకం సహజం తొలగడమూ ఆగదు
నిజంలోన హృదయ తంత్రులు మీటుతుంది
రాగ రంజితమై క్షణాలు సంస్కృతిని పొందేను

దొరకిన అవకాశం సద్వినియోగం కావడం విశేషం
నదిలో కొట్టుకొని పోవడం దౌర్భాగ్యం
ఒడ్డున పడి పయనం సాగడం ఒక అదృష్టం
సందర్భం గెలుపుకు సహకరించడమొక అనుకూలం

గెలుపుకు కారణాలు రహస్యంగా పదిలంగా
ఎవరికి తెలియని విషయాలు ఎప్పటికీ అందరిలో
గెలుపు గుర్రం పరుగులో ఇచ్చే ప్రాధాన్యాన్ని బట్టి
పోవలసిన లక్ష్యానికి ముందుకు దూసుక పోతుంది

అన్నింటిని కూడ గట్టుకొని ప్రయత్నం
వృత్తినీ ప్రవృత్తినీ జోడించి జీవితాన్ని వరిస్తుంది
తిరిగి తిరిగి మనిషి కనిపించే సూర్యుడో చంద్రుడో
తాను రత్న కిరీటం ధరించాలని మనసులో ఉబలాటం

ఈ స్థితిలో జరిగిన కాలం గురించి కాక
రానున్న దానిని గురించి మాత్రమే ఆలోచన
ప్రవహించే నదిలో ఎన్ని కొట్టుక పోతాయో
చివరకు మిగిలేది కాల వాహనంపై విజయం మాత్రమే

మరొకరిలో లేని దేదో ఒడ్డుకు చేర్చే గుణంతో
అదుపులో ప్రజ్ఞ ! ఆశా రూపాన్ని నడిపించ వచ్చు
గెలుపుకు అన్నీ కలిసి రావడం ఒక మంచి విషయం అయితే
లోని వెలుగు మనిషి ! ఎంతో కొంత దారి చూపడం మరొకటి

14. కోరినవి

ప్రతి వ్యక్తితో కలహమో స్నేహమో మాటలు వినబడతాయి
అలజడి యత్నం మాయమై మానవ తేజం వెలుగుతుంది

ప్రతి ఘటనలో ఏ కొందరో ఉద్యమ స్థాయిలో ఉన్న
వారు మాత్రమే ఉత్తేజం పొందేరు, ముందుకు సాగేరు

బయట నుండి ఆయుధం ప్రేలితే గురి తప్పి
కిటికీ చువ్వల మధ్య నుండి దూసి ఎదురుగ
గోడకు అమర్చిన అద్దాన్ని ముక్కలు చేసేను
చూసే ప్రతి ముక్కలో ఎవరిదో ఒక ముఖం
అది శత్రువు కావచ్చు ప్రతి ముక్కలో ఒకటి
అద్దం ముక్కలెన్నో ముఖాలన్నీ అక్షతంగా
జరిగిన సంఘటనలో నిజం ఎందరికి తెలియునో
కానీ తెలిసినట్లుగా కథ అల్లబడుతుంది చరిత్రలో

నెత్తురు రేఖలతో కప్పబడిన చరిత్రలో
కన్నీళ్లతో తుడిచి వేయబడిన పేజీలో
వాస్తవ మేదో కల్పనతో రూపొందినదే
ఆలోచనలో మనిషి నిజాన్ని పట్టుకోవాలని

విధ్వంసంలో కొంత వాస్తవం తొలగిపోతుంది
కావాలని స్వార్థంలో కొంత నిజం చెదరిపోతుంది
విరోధం, సంఘర్షణ సమరంలో మనుషులు
మనుషుల మనేది మరచి పోవడం దారుణం

తాను మెచ్చిన పనిలో తల మునిగిన మనిషి
తల ఎత్తే లోపల అదృశ్యమవుతుంది
కొండ రాళ్ళలో నుండి నది సాగి బహు దూరం
జలధిలో కలిసేనని అనుకునేనా? కోరేనా?

15. గుర్తుల కలయిక

చివురు పూవు ఫలంతో చెట్టు, మానవ మిత్రం
మనిషిని పోలినదై, బహు విషయాలలో
భూమిపై నడక లేని వేరులతో పాతుకొనీ
మట్టితో అనుబంధం తప్పనిదై రెండింటికీ

చెట్టుకు వేళ్ళతో స్థిరత భూమిపై
మనిషికి భూమితో అనుబంధం జీవితమంతా
ఈ భేదం పూర్తిగ జీవన రూపం మార్చేను
ప్రయోజనాలలో భిన్నతలను కూర్చేను

ఘర్షణ రణ ఘటనల చిత్రణమే కాదు
శాంత హృదయ సమావేశ సందర్భాలు కూడ
గాయాలతో బయట పడేవారు
రణ బీభత్సంతో పాటు మిగిలేరు జ్ఞాపకంగా
స్థావర జంగమ పరిణామ వికాసాలతో
వాటి వాటి అవసరాలతో శోభను పెంచేను

అనుకోని సమస్య లెదురయినా చకితంగా
బాధలలో బ్రతుకులు తల క్రిందులయినా
ఆలోచనలు ప్రయోగ ఫలితాలలో
ఎప్పటికీ పై చేయి మనిషి ఉపజ్ఞదే

ఒకరి మారణాయుధంతో క్షణాలలో
పొగలతో సెగలతో సర్వనాశనమయినట్లు
అపాయకర క్రిములు గాలిలో వ్యాప్తమవుతూ
జన వినాశనానికి కొత్త దారులు సృజించేను

వ్యక్తిలో, సంఘంలో శుచి రహితం కరోనాగా మారేను
ప్రజలను భయ వాతావరణంలో నిర్బంధానికి గురి చేసేను

16. ప్రకృతి అవసరం

ప్రకృతిపై ప్రాణిపై మనిషిపై క్రిమి ఆధిపత్యం
ఎప్పటికీ అసంపూర్ణమే, ఆదాన ప్రదానాలతో
కష్టం వచ్చినపుడు నష్టం కలిగి నపుడు
మనుషులు తమ మతి చతురతను చూపాలిసి వస్తుంది

మనిషిలో విజయ శిఖరం ! శక్తిని ప్రకటిస్తుంది
అవసరాన్ని బట్టి కాలానికతీతంగా ప్రవర్తనం
న్యాయం ఒకటే, ఎక్కడయినా, తీర్పులు వేరు వేరు
దీనికి కాలంతో పనిలేదు ఎప్పటికీ, మతులతో అనేకం

ఎడారి వేచి చూస్తుంది పచ్చని క్షేత్రంకై
జలధి ఆరాట పడుతుంది దాహం తీర్చాలని
మనిషికి నప్పేది కాదు, మౌనం స్తంభంలా
భూమి ఎదురు చూస్తుంది చెట్టు నీడకై

ఎండకు గొడుగులా మబ్బులు వస్తూపోతాయి
వాన చినుకు గురించి ఆలోచించి నట్లు లేదు
గొడుగు వలన కాదు, వాన వలన స్నేహ సుందరమవుతుంది
నీడ దేనికీ లొంగి కాదు, ఎప్పటికీ ! ఎవరికీ

కవిత గతాన్ని స్ఫురింప జేసి మనో దృశ్య మవుతుంది
ఇదే వర్తమానాన్ని కళ్ళముందు నిలుపుతుంది
భవితకు కల్పనలో ఆశా రేఖలు నింపుతుంది
చీకటిలో మనసుకు టార్చ్‌లా వెలుగు చూపుతుంది

స్థల కాలాలను దాటి అతీతమైన దృశ్య ప్రపంచం
చలిలో రాత్రి వేళ నులి వెచ్చని స్పర్శ కోరుతుంది

పగలు శీత గంధ పవనంతో చల్లగ స్పృశిస్తుంది
మనిషి అవసరంవలె మనిషికి ప్రకృతి అవసరం ఎంతో

17. హృదయానికి పరిచయం

అక్షరాల విత్తులతో మనసులు పైరు పంటతో
బ్రతుకున ఆకలి తీర్చే ఆదరువవుతుంది
వ్యక్తిలో కోరికలకు సమాజంలో దారులు చూపేను
ప్రేరణ శక్తినిస్తుంది, విజయ రక్తి పెంచుతుంది

నిరంతర జీవన పయనంలో వాహనమై తిప్పేను
ఇది పరంపరా రూపంలో భాగమవుతుంది చరిత్రలో
నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో కవితలో
శబ్ద విపంచి నాదమయం అవుతుంది
కనిపించని మంటల్ని ఆర్పే ఫైర్ ఇంజన్ కావచ్చు
వినిపించని మాటల్ని ఎదలో ప్రతి ధ్వనిస్తుంది

మానస పటంపై గతాన్ని ప్రతి ఫలింప చేసి
కోరే కాలాన్ని తెచ్చి ముందు నిలబెడుతుంది
మనిషిలో దాగిన శక్తిని బయట పెడుతుంది
దీనితో యుక్తిని ఉపయోగానికి తెస్తుంది

హ్లాదమెంతో భయదమంత ప్రపంచంలో
దుఃఖం పొరలు తొలగించి, రాగం ఒలికిస్తుంది
బ్రతుకులో దోషాన్ని వేలెత్తి చూపుతుంది
మనసులోని గుణాల్ని పైకి తేల చేస్తుంది

మనో దర్పణానికి పట్టిన దుమ్ము వదలించి
శుభ్రపరచి నిజ ముఖాన్ని ప్రతిఫలింప చేస్తుంది
బూజు దులిపి ఆలోచనకు పునర్నవ రూపమిస్తుంది
అంతవరకు తెలియని అనుభవ కేంద్రం స్థాపిస్తుంది

స్నేహం దయ త్యాగం సహనం న్యాయం దిశలను
హృదయానికి పరిచయం చేస్తుంది అమూల్య సంపదగా

18. పచ్చని అవతారం

పశ్చాత్తాపం హృదయ కమలాన్ని సత్వరం
మలిన రహితం చేసి మనోజ్ఞత నిస్తుంది
తాపంలో ప్రభవించిన మేఘం ఎగసి
వర్షంతో సస్యమయం చేసేను? భూమిని

గత చరిత్రను పునర్భవ మొంద చేసేనా?
మనిషి విషయంలో ఎప్పటికపుడు కొత్తగా
రూప మవతరించాలిసిందే బ్రతుకులో
గతం మరపున బడవచ్చు పునరాగమనం జరగదు

మనసున ఫిల్మ్‌లా జ్ఞాపకాలొకటొకటీ ముక్కలుగా
ఇక్కడన్నీ సమానమే దేనిపట్ల సుముఖత లేదు విముఖత లేదు
మనో దర్పణంలో ముందు తన ముఖం కనిపిస్తుంది
మంచి చెడు పరిశీలనలో తనవైపు మొగ్గు చూపేను

క్షణాలు మంచు ముక్కలవలె కరగతూ కదలుతూ
ఒకదాని వెనుక ఒకటి, ప్రవాహ రూపం పొందుతాయి

ఆయుధం వహించిన మనిషి మతిలో ఆర్ద్రత
రసాకృతికి పునరాలోచనయే వీలు కలిగిస్తుంది
ఒక సమయంలో హెచ్చరికగా పని చేయవచ్చు
మరణ భయం లేచి మనసుతో రణాన్ని తరించేను

ఎత్తు పల్లాలపై మట్టి బంగారం పై దృష్టి సమానమై
అన్వేషణలో దూరాలు నడవలేని దారులు లేవు

ఆరంభంలో ఎదురుపడే ప్రశ్నలకు
జవాబులు మాత్రం పయనంలో లభిస్తాయి
దారిలో పూల వాన పడవచ్చు, పిడుగులు జారవచ్చు
మేఘంతో భూమి పచ్చని అవతారం ఆశించవచ్చు

19. సరికొత్త దృశ్యం

ఏది ఆగుతుంది, ఆగదు. ఏదీ! చలన శక్తులచే
క్షణాలు ఆగవు, బ్రతుకులు నిలవ్వు, ఆయువు ఆగదు
అక్షర ప్రపంచంలో కవి కర్మ అయిన కవిత తప్ప
గాలి ఆగదు ! బహు దూరం వెళుతుంది దిశలలో

మనసు నిలవదు నిరంతర చలన రూపంలో
దారిలో ఎన్నిటినో స్పృశిస్తుంది కదలిస్తుంది, పలకరిస్తుంది
బంధనం నుండి ముక్తమైన మనిషి
నడవగలడు పరుగెత్తగలడు పైకెగిరి నడవలేడు

మనిషికి కొన్ని పరిమితులలోనే జీవన గమనం
ఇది వాస్తవం సుందర జగత్తుతో అనుభవ రూపం

చెట్టు మాట్లాడుతుంది గాలితో స్వేచ్ఛగా
గాలి మాట్లాడుతుంది విశాల జలధితో
అలలు మాట్లాడతాయి సాగే పడవలతో
గగనం మాత్రం పైనుండి చూస్తుంది వింటుంది

పిల్లలు పెద్దల తోనే కాదు, చుట్టూ ఉన్న
వస్తువులతో ఊహా జగత్తులో మాట్లాడేను
మరొకరి మాట కన్న తమదే ప్రాధాన్యంతో
మనిషిలో మనిషి క్లుప్తంగా గుప్తంగా మౌనంగా

మాటల పొట్లాన్ని కవిత భద్రంగా అందిస్తుంది
కనిపించని గాలిలో అనుభవ పరిమళాలతో నింపుతుంది

నింగి వైపు చూస్తే స్వర్గం దేవతలు మనసులో మెదలేరు
ఉంది లేంది సందిగ్ధ భ్రమణంలో, మనసు మగ్నమవుతుంది

అంటించిన కారక వత్తిలా చుట్టూ ఆశా చక్రం
ఔనన్నా కాదన్నా సరికొత్త జీవన దృశ్యంతో నిండుతుంది

20. మనసుకు హ్లాదం

ఏకాంతంలో ప్రతి వ్యక్తిలో స్వేచ్ఛా రూపం దిద్దుకునేను
దేని కయిన సిద్ధంగా చంపడానికీ చావడానికీ
రణం పేరుతో, మరొకటయితే సమాజ ప్రమేయంతో
ఇంటి నుండి బయట పడితే చెట్టు నీడ ఆప్తం

తాను ధరించిన మనో వేషంపై మౌనం వహించేను
మరొకరు వహించిన వేషంపై చర్చలు జరిపేను
అసలు స్వచ్ఛమైన మనిషి ఎక్కడ? తెలియదు
రాజ్యాంగంలో భద్రంగా ఉన్న మాట వాస్తవం

రోజు ఉదయ రశ్మితో నిర్మలమైన ఆలోచనతో
నిద్రకు చేరే సరికి పేరుకున్న మలిన రూపం
వీథిలో అలజడి, ఆక్రందన, ఆవేగంతో
మనుషులు బురద చల్లుకుంటూ ఒకరిపై ఒకరు

వీరుడు ధైర్యాన్ని వరిస్తాడు, సాహసాన్ని నింపుకుంటాడు
శ్రమలో పని చేసే శక్తిలో ప్రవాహ రూపం పొందుతుంది
మరచింది జ్ఞాపకం చేసేందుకు కూడలిలో విగ్రహం
ఎవరి పనిలో వారు తొందరలో, దీని సంగతి మరచేరు

ప్రతి వ్యక్తిలో మదిలో ఏదో ఒక ఆయుధం
తన కిష్టమైంది అన్నిటకీ సిద్ధంగా ఉంటుంది
బయటికి మాత్రం పూల గుత్తి ముఖంతో
యశో కిరీటానికి ఆరాటంతో అభిమాన ఘనం!

ప్రబోధాలు శాసనాలు కాలం చెల్లినవి
పట్టుకొని వేలాడడం పయనం ఆగడమే
మేఘం గర్జిస్తుంది పిడుగు భయం నింపుతుంది
వర్షం కురుస్తుంది అవనికి హ్లాద రూపమిస్తుంది

21. భిన్న రుచి

బ్రతుకులో ఏ మూలనొ ఏ వైపో చీకటి తప్పదు
తోడు నీడ అంటుకొనీ మనసుకు ఊరటగ
భద్రత కవకాశం తాప హరణ గుణ స్పర్శ
ఇది వీడని మచ్చగ తలచే వారూ ఉన్నారు

ఉదయ కిరణ స్పర్శతో ముడి వీడుతుందని
ఆశ సహజం ! ఇది సంశయ పదంగా మారేను
పుట్టిన క్షణం నుండి మొదలైన జీవితం
విజ్ఞత దశ నుండి రోజు కొక కొత్త దృశ్యం

ఆశాలతకు పూచిన పూలు చూపు నలంకరించేనా?
ఆశా బంధం నుండి సమస్యల చిక్కుముడులు ఏర్పడేను
కల్పనలో కళా జగత్తు ఊగేను
వాస్తవ గతి అనుభవ రుచి చూపేను

మోట కట్టి తోటకు నీరందగ జేసేరొకరు
ఎండిన చెట్లను కట్టెలుగా మార్చేరొకరు
శ్రమ శక్తి ఒకరిలో క్రియా శక్తి ఒకరిలో
ఏది దేని కన్నది ఎవరి ప్రయోజనంలో వారు

పై కెగసే జ్వాలా చిత్రం చూడాలని ఒకరు
చెట్ల తలల వేదిపైన హిమ దృశ్యం చూడాలని ఒకరు
అన్నీ అవసరమైనవి జీవన చలనంలో
కలసి రాని సమయంలో, గాలిలో అప స్వరం

ఆకు రాలిన చెట్ల తలల వేదిక పై
గ్రీష్మ తాండాన్ని కనుగొనాలని ఒకరు
వర్షా జలనృత్యం చూడాలని ఒకరు
తానో "భిన్న రుచి" లో, రాగ సుందరతను మరచేరా?

22. కొత్త దారిన

న్యాయానికి మద్దతుగా నిరసనకు ఉపకరణంగా
కవిత వెడలుతుంది ధర్మ పీఠం నుండి హృదయంతో
కవిలో అక్షర తూణీరం శబ్ద మయమై
మానసికంగా ఎదుర్కొనే శక్తి ముందు పొందేను

తరగని పదాలతో విశ్వశాంతి కవచం ధరించి
కొత్త ప్రపంచం లోకి ప్రవేశపెడుతుంది
జీవన ప్రస్థానంలో ఏ కవిత చివరి సమాధానం కాదు
ఏ మాట మానుష కథలో చివరి అస్త్రం కాదు

వేగాన్ని సమర్థించదు, శత్రుతను పెంచదు
సమరస భారంతో సమత మమత నవతతో
బ్రతుకు కవిత సమాంతరాలు రైలు పట్టాలవలె
జంక్షన్‌లో కలుస్తాయి, దిశదిశలలో చీలుతాయి

కవిత ఏ ఒకరి సిఫారసుతో పనిలేదు
మనసు మాత్రమే తెరచిన ద్వారమై
లోనికి అనుమతితో స్వాగత మిస్తుంది
సూచన హెచ్చరికలు ఉపదేశం చేస్తుంది

సంస్కార సంపుటితో ఏర్పడిన వ్యక్తిత్వం
అస్తితలో భాగమయింది ఒకటే ప్రమాణం
రణ క్షేత్రంలో యోధుడు శక్తి ప్రదర్శనలో
సమాజ రంగంలో కవి, అభినవరుచి పెంచేను

జీవన యానంలో దారి చూపుతుంది కవిత
ప్రగతి పథం వైపు వ్యక్తిని నడిపిస్తుంది
ఎవరెంత వినియోగం చేసినా ఎప్పటికీ కొత్తగా
ఎంతో ఇంకా మిగిలి ఉందే, సృజన మనోమయం

23. ఆశా పూర్ణమై

కాలాన్ని హరిస్తుంది, వశం చేసుకుంటుంది
మరో జగత్తును మనసులో దింపుతుంది
నిర్వ్యాజంతోనూ సవ్యాజంగానూ అనుభూతి కళతో
ద్వేషం హత్య హింసను మరపించే ప్రేమతో

బలవంతునిదే కాదు సర్వం సహ అందరిదీ
హేతువు కతీతమైన స్పందన గుణ రూపంతో
ఎవరు ఎపుడు ఏ వైపు ముఖం తిప్పినా
మస్తిష్కాల నుండి హృదయ వనంలోకి కవిత

నిదుర పట్టని రాత్రి బయటికి వస్తే
పై నుండి చుక్కలు మనసు విప్పుతాయి
చంద్రుని రాకతో నిరాశ తొలగుతుంది
అందరిపై సమాన ప్రకాశంతో వెన్నెల హ్లాదంగా

స్వార్థంలో సూది మొనంత భూమిని ఇచ్చేందుకు
నిరాకరణంలో ఒకరు అహంకార శిఖరం నుండి
ఏ రోజూ ఉదయం నుండి రాత్రి వరకు
రవి కిరణ స్పర్శతో ఉత్తేజంలో పనులెన్నో జరిగేను

నిదుర పట్టని రాత్రి కాలక్షేపానికి తగింది
ఏకాంతంలో మనిషి అవసరం తలపిస్తుంది
ఎదురుగ మనుషులు లేని సమాజ బంధం
మరునాటికి జన గణ రూపంతో ప్రత్యక్షం

ఆయువు గతిలో సుందరమైన యశోరూపం
చేసే పని విలువల్ని బట్టి వాస్తవానుభవంలో
మేఘంలా పక్షుల్లా పైన ఎగిరే ఆలోచనలు
ఆర్ద్ర భావ మయమై కవిత ! ఆశాపూర్ణమవుతుంది

24. సమతులనం

ఏమీ తెలియని శిశువుగ అవతరించి అవని చేరి
అన్నీ తెలిసిన పరిణత వృద్ధులాగ మనిషి నిష్క్రమణం
వజ్రంలా కఠినత కుసుమంలా మెత్తనతో
మనో రూపానికి రెండు కొసలు మనుషులలో

అటునుండి ఇటు ఇటు నుండి అటు గమనాగమనంలో
మధ్య మధ్య శుష్కమైన శూన్యమైన హృదయమతులు
ఆయువు కదలికతో తీర్చిన యశోరూపం
వాస్తవాను భవంలో హిత కరమైనది కోల్పోయేరు
మొదట తెలిసేది సృజన హృదయ స్పందన గతి
దిశదిశలో ముందుకు వెళ్ళిపోయే పవనానికి మాత్రమే

భూకంపం శిథిలాలు తుపాను వరదలతో దృశ్యాలు
ఆల్బంలో వచ్చే తరాలకీ కథలు తెలిసేందుకు
ఎండిన స్థితులలోను పచ్చని దశలలోను
చెట్లు మాట్లాడుతాయి నింగిలో మనిషితో హృదయం విప్పి

ఆకాశం ఆశీర్వదిస్తుంది మేఘ బృంధంతో
మనుషుల సహకారం అల్లుకొనీ పూల తీవెల వలె
జీవన రూపాన్ని ఉన్న స్థితిలో సార్థక మొనరించేను
మానస వేదికపై మయూర నర్తనంతో ఉల్లాసకరంగా

ఉన్నదనుకొనే అతీతం విశ్వమయతతో
మనసుకు ఆదర్శ శిఖరాలపై తిప్పేను

అలలవలె కదలే కోర్కెలపై పయనం
ఒక సందర్భంలో మనో రమణీయం
వెనక నుండి ఎంతకయినా తాత్వికం
మనసును సమతులనంలో నిలుపుతుంది

25. ప్రకృతి చిహ్నం

మస్తిష్క శిఖరం నుండి హృదయ వనం దాకా
ఏ రోజు ఉదయంతో మొదలై రాత్రితో ముగిసేను
సర్వ ప్రపంచం ఒక ఎత్తు
మనిషి జీవితం ఒక ఎత్తు

కవిత బుజాలపై శిశువు వలె
ఎన్నిటికో స్థానానికి అవకాశం
మనిషి చేతిలో ఉన్నట్లే ఉంటుంది, కాలం
అంతా తన మహిమే అన్నట్లు చేస్తుంది

అరచేతిలో చిక్కిన పావురాయిని తలపిస్తుంది
ఉన్నట్లుండి నింగిలోకి బాణంలా దూయవచ్చు
దోసిలిలో త్రాగబోయే జలంలా జారవచ్చు
చేతిలో కోసిన పూవులా అన్నీ మరపిస్తుంది

ఒక క్షణం గీసిన అగ్గిపుల్ల వలె మంచికీ చెడుకూ
ఒకదాని బదులు మరొకటికి ఉపకరించవచ్చు

మనిషి మనిషికి మిత్రం కావడం సహజం
శత్రువు కావడం అనుకోని విపరీతం
దారిన వెళ్ళే మనిషి చూపు మనిషిపై
తెలిసిన వారిని పలకరించాలనీ
తెలియని వారిని పరిచయం చేసుకోవాలనీ
జ్ఞాపకాల కోశంలో అన్నీ ! సర్ద బడీ

మానసిక శక్తి తీగెలా సాగుతుంది
వాడినపుడు ఎండినపుడు నేలపై జారినపుడు
తనలో భాగమేదో పోయినట్లనిపిస్తుంది
మనిషిలో వనం ఎప్పటికీ పచ్చగా ప్రకృతి చిహ్నం

26. ఎవరిపైనో

పోయిన వారిని తలచడం కృతజ్ఞతా రూపం
ఉన్న వారిని పేర్కొనడం స్థితి నిర్వాహణ కవసరం
భూమిపై స్థానం ఒక బుద్ధి జీవి మనిషికే కాదు
అన్ని జీవ రూపాలకూ ఉన్నది తమ తమ భాగం

పోయిన వారిని గురించి చింతించడ మన్నదే
ఉన్న వారికి ప్రోత్సాహం అవసరం సంఘంలో
ఏమి జరిగినా, ఏమి చేసినా, ఎవరికైన
వర్తమాన తలం పైనె గమనం, జీవనం

ఆవాసానికీ ఆహారానికి భూమి ఆధారం
అపుడపుడు ప్రకంపనలు శిథిల ముద్రలు వదలుతూ
ఇల్లు గడప దాటి వ్యవహారాల తంత్రం
ఇల్లు గడప లోన బంధు భావ సమాకలనం

అలలతో జలధిలా ఊహలతో మనస్సు
ఇది ఎవరికినీ కన్పించే విషయం కాదు
అనుభవ రూపంలో మాత్రమే దర్శన మవుతుంది
అతీతాన్ని స్పృశించే ఉత్సాహంలో దార్శనికం

అవనిపై నావ నడవదని
నింగిలో బండి నడవదని
తెలిసేది ! ప్రయాణం ఆరంభంలోనే
అవసరంలో మతి పని చేస్తుంది తీవ్రంగా

అలల కదలికతో సూర్య బింబం
చెదరి పోయేట్లు తోచేను, కంటికి
చెదరని సూర్యుడు గగనంలో ఒంటరిగా
ఎవరిపైన ద్వేషం కోపం ఎరగని కిరణాలతో

27. వాస్తవ దృశ్యం

అద్దంలో దృశ్యాల వరస కాదు జీవితం
ప్రత్యక్ష జగత్తుతో ముడివడిన అనుభవ రూపం
కవితకు చెరొకవైపున జీవితమూ సమాజమూ
రెండిటినీ కలిపే ఆశా సూత్రం ! ధనరూపం

బంగారం వెండి మరొకటి వస్తువు
అవసరాలలో విలువలతో సంపద
వ్యక్తి మనో రూపాన్ని క్రమ్మేస్తుంది
నిజ రూపం కనబడ నీయదేమాత్రం

గమనంతో పాటు లక్ష్యంలో జీవన దార్శనికం
తిరిగే శ్రమ చక్రం పైనే ఆధార పడింది
కవిత్వ మొక అక్షర వాస్తవ లోకం
ఆషా మాషీ వ్యవహారం కాదు; అనంతం

స్పందనలో చింతనలో అలజడి ఆక్రందనతో
ఈ కాలంలో నయితే ఇదే ఇదే వస్తువు అమూల్యం
కవితలో జీవన రాగంలో విధాలెన్నో! పార్శ్వాలన్ని
చివరకు ఉద్యమ లహరులపై తేలేను పడవలవలె

భోగం రాగం కోరేంత వరకు
వీరం తేజం ఉన్నంత వరకు
కటుత జడత పోనంతవరకు
కవిత విశ్వమయం హృదయ వశం

సమాజం పునాదిగా కలిగిన అక్షర భవనం
ప్రతి కవి మనసు నుండి కొత్తగ విడుదల అయ్యేను
మాయ మాటలకు వీలు లేని స్వేచ్ఛా కవిత్వంలో
ప్రతి జీవన కోణంలో ప్రజాస్వామ్య వాస్తవ దృశ్యం

28. శ్రేయోరూపం

చిన్నతనంలో చూచి నప్పటి చంద్ర బింబం
జ్ఞాపకం ముద్రతో ఇప్పటి వరకు ఎదురుగ
ఎంతగానొ కష్ట పడే వైజ్ఞానిక యానంలో
ఉపరి తలంపై గోతులు లోయలు దిబ్బలు శిలలు

గతంలో కల్పనలో పొందిన ఆనందం తొలగేనా?
వర్తమానంలో దృశ్యం నిరాశలో తూగాడేనా?
కల్పనలో పాదుకొన్న పరంపరా రూపాలు
సంస్కృతిలో భాగమైనవి, విస్మృతాలయ్యేనా?

జీవితాని కిరు వైపుల నుండి ఎప్పటికీ
కల్పనలు వాస్తవాలు యోచనలూ అనుభవాలు
మనో జలధిలో అలల వలె సాగేను
అలపై పడవల వలె మనుషుల బ్రతుకులు
సృజన విలయ భావ రూపాలకు కవితలో
మిశ్రమ సంకేతాలెన్నో! ఒకే వస్తువులో

అక్షర మొక వాహనం అందులో
కవిత ! చంద్ర సూర్య బింబాల్లా
చీకటి కనపడకుండా పూర్తిగా కప్పేస్తుంది
వెలుతురులో మనిషి తన నీడలతోనే గడపేను

తెలుపు నలుపు నుండి పలు రంగుల మిశ్రమం
ఇపుడు కవితలో కొత్తగా సందిగ్ధ ప్రపంచం

ఏదో ఒక ఆశా బింబం లేని మనసు లేదు
దీన్ని వెలుతురు చీకటి హద్దులు చూపిస్తుంది
అణువులో దాగిన శక్తి ఎంత విలయ కరమో
సృజనలో చూపే హ్లాద మంత శ్రేయో మయం

29. కావలసినవి

కాలం కవి కంటికి చూపిస్తుంది
పిడికిలి మట్టితో సూత్ర పంక్తి లా గాలి
దోసిలి నీరు అవసరమని తెలుసు మనిషికి
పరిచయమైన 'అక్షరం' ఎప్పటికీ సన్మిత్రమే

చెలమ చెరువు బావి ప్రవాహం దాహం తీర్చే రసమయాలు
కవిత రాసాకృతితో ఉత్తేజకరం పలు రీతులలో
ప్రతి కవి తన కవితలో భిన్నమైన స్వీయ పాత్రలో
వివిధ వార్తలలో మారే దృశ్యాలనేకంతో, విశ్వమయం

ఆకలి వేసినపుడు మనిషి ! భూమి పైన
ఆకలి తీరాక కల్పనలో పైకి గగనానికి

జలధి ఎక్కడో లేదు కష్టంలో బాధలో
బిందువెక్కడో లేదు కను కొలకులలో
జీవన కటు రూపం ప్రకృతిలో మార్పులలో

ఆగని కాలంతో పాటుగ ఆయువు పరుగెత్తుతుంది
అలసట ఎరగని రవి చంద్రుల గమనం ఆదర్శకం
ప్రకృతి విరోధం కాదు, జీవన సన్మిత్ర రూపం

ఇది విశ్వంలో ఎక్కడైన ఇదే జీవన భ్రమణం
ఆశా సహజ సుందరతను అవలంబించడమే
పగలు ఉల్లాసంగా గడపే మనిషికి
రాత్రి చుక్కల పూలతో బొన్సాయి రూపం కాదు

బయటి తలుపు తెరవగానే పూచిన పూవు ఎదురుగా
పచ్చని తీగె అల్లుకొన్న ఇనుప గేటు స్వాగతంతో
శశి కిరణం రాత్రి రహస్యపు మూట విప్పి చూపేను
సమాజ చేతనతో కావలసినవన్నీ కవితలో చేరేను

30. వార్తలో జీవితం

వార్తలో బ్రతుకులు వ్యక్తిలో బహు పాత్రల ప్రకటనతో
అనుకోనివి ఊహచే అనుకొన్నవి చర్యచే సమాజగతిలో
మంచి చెడు నిర్ణయం కన్న విస్తృతి లభిస్తుంది
కవితలో అవకాశం వివిధ పార్శ్వాలను తెలుపుతుంది

వ్యక్తిత్వం మారుతుంది సందర్భం వేరవుతుంది
ప్రయోజనం భిన్నమై ఫలితం విశాల మవుతుంది
రంగు లెన్నో కలిసీ దేని కది ప్రత్యేకం ఒకటొకటి
అన్నిటినీ కలసిన తేజో రూపం! ఉదయ రాగం

కవితలో ఇది విడదీయరాని సంశ్లిష్ట మనోజ్ఞం
ప్రతి హృదిలో తీరు తీరున ప్రతిఫలిస్తుంది
చీకటిని తక్కువ అంచనా వేయడం కుదరదు
ఇది మనిషికి శిక్షలో తగిలే సంకెల అవచ్చు

వెలుతురు హృదయానికి పరోక్ష మిత్ర మవుతుంది
భూమి మీద నడిపిస్తుంది, స్వేచ్ఛకు దారి తీస్తుంది

అటు రవి అస్తమయం విషాద రేఖా వలయం
ఇటు శశి ఆగమనం ప్రహ్లాద రాగమయం
ఆకు రాలుతుంది దాని స్థానంలో మరొకటి
క్షణం జారుతుంది దాని స్థానంలో మరొకటి
జారే బాష్ప కణాన్ని ఆపలేరెవరు
ఎగసే అగ్ని కిలను అణచేనా? గాలులు !

బాధలో దుఃఖంలో ఒంటరితనం ఆవహిస్తుంది
చుట్టు విశాల గగనం తలుపులు తెరవబడీ
అంతలో భయం గొలిపే చీకటి తలపుకు వస్తుంది
వర్తమాన కవిత చీకటి భావమయం క్రియాచణం

31. అంచెలుగా

ఆ వీధిలో కొత్తగ పైకెగసిన భవనం
తళ తళ లాడుతూ రంగు రంగులతో అందంగా
ఆ ప్రక్కనే శిథిలాకృతి పొందిన నిలయం
వెల వెల బోతూ పాలిపోయిన వాలకంతో పేదగా

ఎవరు లేకపోయినా, మనిషికి తోడు నీడతో
ముందకు పోవడమే కర్తవ్యం, లక్ష్యంలో
ముందుకు పోయేకొద్దీ గమ్యం వచ్చే కొద్దీ
బుజాలపై శిలలు తొలగి మబ్బులయి కదలేను

ప్రకృతి నుండి కొంత ఎడం తప్పదు మనిషికి
సమాజం అడవిగ మారితేనే కష్టం ప్రమాదం
పూల పండ్ల తోటగా తీర్చడంలోనే ప్రయోజనం
సుక్షేత్రంగా మారవచ్చు; ఇదే ప్రకృతి సంబంధం

ఊయెలపై ఊగే మనిషి సంతోషం దిశలు తాకేను
అయితే ఏ గమ్యం చేరేను? ఏ లక్ష్యం సాధించేను
ఇది పరిమిత చలనంలో మనిషిని కట్టడి చేసేను
విరామ సమయానికి మానసిక హ్లాదం చేకూర్చేను

భూమిపై జీవన హేతు నివాసం స్థిరం కాదు
ఎపుడైనా ఎచటి కయిన మారే వీలుంది
ఉన్నదాని కన్న మంచి మేలు పై కోరిక
మానసికంగా సుగంధ స్థితికై ఆలోచన

వార్తలో కవిత హృదయం తెలిసేందు ఒకరొకరికి
ఎంత కాల మయినా కావచ్చు ! ఏ విధమయినా ఉండొచ్చు
కేవలం శబ్ద పరిచయంతో తృప్తి పడే దెందరో?
బంధుత ఆత్మీయం అంచెలుగా సోపానాలెన్నో

32. పచ్చదనం అద్దుతూ

గగనంలో రాత్రులు చుక్కలు ప్రశ్నల వలె
ఉదయంతో సమాధానాల కయి అన్వేషణ
తెలిసిన నచ్చిన వివిధ రంగాలలో మనిషి
తమ శక్తిని చూపేను వెలుతురులో ధైర్యంతో

దైనందిన సమస్యల చక్రాల క్రింద పడి చితికి
క్రోధంతో వైరంతో రణ సన్నాహం మొదలయ్యేను
సహన శాంతి ప్రేమ త్యాగం దేని స్థానంలో అది
భద్రంగా జీవన గతిలో ప్రతీకలై నిలిచేను

రైతులు పోరాటానికి సిద్ధం కావడం హాస్యా స్పదం
సమస్య తీర్చేకన్నా కాలక్షేపానికి ఉపయోగపడేను
మధ్య మధ్య గుర్తులతో శిలలవలె చూస్తూ
ఉండడమొక దౌర్భాగ్యంలో రాజనీతి చతురత

అగ్ని వంటి ఆకలి అలజడిలో తీక్ష్ణంగా
పోరాటంలోకి దిగి హింసకు దారి తీసేను

ప్రతి మంచి పని కల్పన స్థాయి నుండి
నిర్మాణానికి దారి తీయడం నిరంతర జరిగేను
విపరీత చర్యల్ని తలపడేందుకు సిద్ధంగా
కల్పన శూన్య మని విస్మరించే వీలులేదు

భూమిలో పాతుకొనీ నిలిచిన చెట్టు
జీవన వాస్తవ రూపాల్ని ఆవిష్కరిస్తుంది
మైలు రాయి ఒకటొకటి స్వాగతమిచ్చేను
బలమైన వేరులుతో సందర్భం
మనిషిలో గర్వ రేఖను గీసి చూపేను
కవి ఆలోచనతో పాటు ప్రవాహం సాగేను
కష్ట జీవుల జీవితాలలో పచ్చదనం కోరుతూ

33. తీర్చడం

ప్రతి వస్తువు కవితకు విషయ మర్యాదను నిలుపుతుంది
పాతను వదలి కొత్తను పొందే ఉత్సాహంలో మనిషి
భూమి తలం నుండి స్వయంగా ఎగరలేని వ్యక్తి,
చేతనా చేతన సంపదలకు అధికారం మనుషులదే

ఎగిరే పక్షిని చూస్తూ కళ్ళు తెరచి ఉండి పోవలసిందే
నిరీక్షణలో కాలం గడస్తుంది, కోర్కెలతో
వైజ్ఞానిక శిఖరాలను తాకుతూ మనిషి మేధ
ఇప్పుడు విజ్ఞాన శాస్త్ర ఫలం విమానం యానంలో
ఆశ్చరం నుండి వాస్తవానికి పయనం సుఖకరమై
ఒకనాటి కల్పన ఈనాడు కొంత నిజమయి

సంకల్పంలోని ఆశా రూపం ఫలవంతమై
లక్ష్యాన్ని సాధించేను జీవన శైలి మారేను
స్వప్న తుల్య మయిన కల్పనతో స్థానంలో
కోర్కె ఎగరబోతూ ఆలోచన లెప్పటికీ

ఉదయ నిశా కాలాల మధ్య శ్రమ జీవనం
నదివలెనో గిరివలెనో చేతనా చేతనతో గుప్తంగా
భవితపై విశ్వాసం ప్రగతికి చిహ్నం
తరం నుండి తరం కొత్తను అవలంబించేను

కనుల నుండి జారే ఆనంద బాష్ప బిందువు
రాత్రి వేళ చుక్కలయి మనిషిలో ఆశాబంధం నిలిపేను

కటు కర్కశ కఠినతరంనుండి మనిషి
సహన శాంతి ప్రేమ ఉదారతలు
అవసరానికి కత్తి అంచులవలె కాక
పూల రేకుల్లా తీర్చబడడం విశేషం

34. తన వశం చేసుకోవాలనీ

ఉదార చరితుని చూస్తే మహా తరువు మదిలో మెదలుతుంది
దయా గుణ హృదిని చూస్తే మహానది ఎదలో కదలుతుంది
లోనుండి చైతన్య ప్రసారం ఊహలో కదలి తరలుతుంది
బయట కొన్ని పరిమితులలో తన రూపు దిద్దుకుంటుంది

ఉదయం సన సన్నని మంచు తెరల నుండి రవి
పొందే ఆటంకాలు అలంకార ప్రియాలయ్యేను
ముగ్ధ ముగ్ధంగా కనిపించేను
స్నిగ్ధ భావ చలన రుచి చూపేను

కవికీ జర్నలిస్టుకు అనుబంధం నిజ వార్తా చలనంలో
కవితకు ప్రేరణ అయి అవకాశం తలుపులు తెరవబడేను
చేతిలో వార్తా పత్రిక ! ఆ రోజుకు విషయ నిలయం
ఏ రోజున కారోజు ఒక కొత్త ప్రపంచం చూపించేను

నిశ్చల జల కాసార తలంపై బంతి విసరితే
వలయాకారాల్లో సాగేను అలలు పంక్తులుగా
కవితలో శబ్ద ప్రపంచం విషయానికి బాసటగా
మలుపు తిరిగితేనే ఏదో ఒక మార్పుకు అవకాశం

చిన్న చిన్న నీలి మబ్బు ముక్కలు
అంతటి రవి బింబ తేజాన్ని బంధించేను
ఇంటి ముందు ఉన్న చెట్టు ఏదో కథ చెప్పేను
ఇంటి వెనక నున్న చెట్టు ఏదో వ్యధ తెలిపేను

శాంతి డ్రెస్‌లో కవిత అపుడపుడూ కనిపిస్తుంది
సహనం తలకు చుట్టిన పాగావలె శోభిస్తుంది
కష్టం దుఃఖం ఆసరాగా ధిక్కారం పోరాటం
రాజనీతి రాజకీయం అన్నీ తన వశమవాలనీ

35. రహస్యాన్ని విప్పుతూ

ఏ రోజు కవిత వార్తా లహరులపై తేలుతూ వచ్చేను
అక్షర రూపానికి ప్రేరణతో కవిత వినబడేను
ఏరోజూ సాహస గుణంతో, ముందునకే కవిత
గాలిలో పద పంక్తులు, రహస్యాన్ని విప్పుతూ పోయేను

సమస్యలేని విషయానికి పుష్టి ఎక్కడిది?
చిక్కు ముడులు లేని రహస్య తంత్ర మొక్కడుంది?
నిశ్శబ్ద వాతావరణం ! ఏదో ధ్వని వినిపించాలని
గిరి శిఖరం నుండి జారే ప్రవాహంలా
మౌనం నుండి శబ్దం కవితయై వేగంగా
కవితకు రాత్రి పగలు భేదం లేదు

చిత్రంగా కవితలో ఆయుధం పూల మాల కావచ్చు
ప్రేమ శాంతి కరుణ ఉత్సాహం అందలమెక్కించేను
కవిత అలంకారం అవదు మనో రూపంలో భాగం
శాంతిలో ఆయుధం భద్రతకు రక్షణకు పనికి వచ్చేను

అధికారం ఆధిపత్యం కోరే మనిషి చేతులలో
సర్వం తన వశం కావాలని ఆరాటం ఆకాంక్ష
సందేహం ఉన్నా లోకంలో జరుగుతూనే ఉంది
పత్రికలో ప్రేరణ రూపంలో కవిత సంపదలో భాగం

ప్రాణం ఉన్నంతవరకు అన్నిటిపై ఆజమాయిషీ
నిరంకుశం అయితేనే భయ వాతావరణంలో ప్రమాదం

కనిపించని గాలి సాగినంతవరకు పరిమళం
మనుషుల్ని ప్రేమ వశం చేస్తుంది; అనుభవంలో
శిశూదయం నుండి చివరిదాక ఆలోచనలో
రాత్రి చెడుకు, పగలు మంచికి ప్రతీకలుగా హృదయం

36. దేనికదే సాటి

కవి హృదయం దేనికదే సాటిగా కవితలో
గాలి కూడ చొర రాని రహస్య పేటియై
ఇది ఒక సమాజ వాస్తవానుభవ రూపం
స్పందనలో గిరి శిఖరాలను స్పృశిస్తుంది

గాలి అండతో కవిత ప్రసార మాన మవుతుంది
ఇది తన బుజాలపై నుండి బరువులు దించి
మనుషుల చేతులలో ప్రవేశ పెడుతుంది
ఎప్పటి కపుడు కొత్తదనంతో విలువలు పొందుతుంది

కాలం ఎప్పటికీ మనిషికి ముందుగనే ఉంటుంది
ఎండలో తప్పని నడకలో తలను అరచేతులు కప్పేను
కవితలో ఎప్పటికీ ఎంతో కొంత రహస్యం మిగిలి
అక్షర గతమై కళా జగత్తులో భాగమవుతుంది

చెట్టు నీడ గొడుగు నీడ కప్పు నీడ మబ్బు నీడ వలె
కవిత నీడ ఎన్ని విధాలుగనో తాపంలో ఆదుకునేను
ఇది నదియై సమ దర్శన దృష్టితో సమ భావనతో
అపుడపుడూ అందని వార్తను బయట పెడుతుంది

నిశ్శబ్దంలో స్తబ్ధతను కదలిస్తూ నడిపిస్తూ
చేతనతో కనిపించని సంగతికి దృశ్య రూపమిస్తుంది
తెలియని దెంతో తెలిసినట్లుగ ఉంటుంది
ఇది కళామయం కావడమే కవితలో ప్రత్యేకత

వార్తల ఫిల్మ్‌లో కవి హృదయం శుభ్రమై
పంచబడే ప్రేమతో మనిషిని మారుస్తుంది
అనితర అక్షర కళతో భావ ప్రపంచానికి
ఆర్ద్రమైన హృదయ రాగం ఆశావహమవుతుంది

37. పచ్చని నిజం

జలధి నుండి అవని నుండి తాపంతో
పై కెగసే సన్నని సెగలతో తీగెలుగా పొగలు
సాగి అల్లుక పోతూ వినీల మేఘ బృందం
మల్లె మొగ్గల వలె తొలకరి చినుకులు జారేను

విశ్వ హితం కోరే ప్రకృతి రూపం జన బంధువు
గాలి కొత్త కొత్త వార్తల్ని చేర వేస్తుంది
ప్రదర్శన దృశ్యంలో భాగ మయి మనిషి జీవితం
ఎవరేమి తలస్తే అది సాకారం ఏర్పడేను ఎన్నో

కవితకు వార్తలలో ఆధార మూలాలెన్నో
అన్నీ ఆకర్షణతో పునరుద్భవ రమణీయాలు
కొత్త మనిషి పరిచయ గంధంతో కవిత
అంతవరకు చూడని, తెలియని రస ముద్రలతో

కొందరు శిలా ముఖ మౌనాన్ని వహించేరు
కొందరు నిర్ఝరిణి గల గలలను నదించేరు
కొందరు హర్షాతిరేకంతో రెక్కలు విప్పార్చేరు
ఏ రోజూ ప్రదర్శన శాలలో భాగమై, జీవితాలు

స్నేహం కలహం నుండి సమరం శాంతంతో
విషయం వార్తలలో, పద పంక్తులతో కవిత
మనుషులలో వివిధ స్థాయిలలో జన హిత రూపం
వలయాకార దిశల కోణాలలో ఇష్టంగా పయనం

ఏ రోజూ వార్తా బీజ ప్రభావాలతో కవిత
అక్షర రూపంలో సృజన చేతనితో పరిష్కార సూచన
కనుల నుండి జారే బాష్ప కళికలు ! ఉద్వేగంలో
నిప్పు కణాలు జారేను పచ్చని నిజం బయటికి వచ్చేను

38. మాటకు పదును పెట్టి

పరచబడిన ఆకాశం మహా కేతనం వస్త్రం వలె
మనిషి విశ్వ సంఘటిత శక్తిని సూచిస్తుంది
భూమిపై ఎదిగే మానవ సమాజ రూపానికి
ఆలోచనా దిశను క్రియా యోజనాన్ని తెలుపుతుంది

శిశువుకు ఏ దారిన పోవాలో ముందు తెలియదు
తన కెదురుగ ఉన్న దానిపైనే అడుగులు వేసేను
తాను నడచే భూమి పైనే ఆధార తలాన
పచ్చదనం మధ్య స్వర్ణ సౌధం కోరేను

ప్రాణ భయం ఆయుధాన్ని వరింప జేస్తుంది
శాంతి పథం జన శ్రేయంపై దృష్టి మరలుస్తుంది
ఒడుదొడుకుల్ని సరి చేసుకునే యత్నంలో
అతీత శక్తిని గురించి చింతన మొదలవుతుంది

ఓటమిలో నిరాశలో మనిషి ఒక చోట స్తంభించడు
విజయంపై ఆరాటంతో వికాస భూమిక మొదలువుతుంది
యోజనలో సృజన యానం సాగేను చేతనతో
జీవితం ప్రవాహ రూపమవుతుంది కాలానికి సమాంతరంగా

ఆగని రణ చక్రంతో నెత్తురులో తడిసిన భూమి
పూల వనంకై పంటల రాసులకై ఎదురు చూచేను
నిరంతరం పరీక్షలకు గురి అవుతూ మనిషి
వివిధ పథాలలో భిన్నవాద దార్శనికాలతో

గళం నుండి మాట పెకలని వారి తరపున
మొదట వినబడేది కవి స్వరం ఒకటే అందరికీ
నిదుర నుండి మేల్కొన్న మనిషిలో చేతన ఉదయమై
మాటకు పాటకు పదును పెట్టి వదలేను జీవితంలో

39. ఎప్పటికీ హద్దులలో

చీకటిలో దిశలు కనబడని స్థితిలో
గీసిన అగ్గిపుల్ల వెలుగును చూపేను
భౌతిక మానస గతులు కలిసి పూర్ణత కలిగేను
అంత రంగం నుండి పలుకు టార్చ్‌లైట్ అయ్యేను

కల్పనలో కోట గోడల వలె జ్వాలలు చుట్టూర
చివర కవే మంటలలో ఆహుతి అయ్యేను బ్రతుకులు

చీకటి వస్తే భయంతో గుండె లయ క్రమం తప్పేనా?
మంటల నుండి వెలుతురు నెవరు కోరేరు? నిరంకుశంలో
చంద్రుని రాకతో భయం లేని వెన్నెల చేకూరేను
చుక్కలతో సానుభూతి రూపం తళతళలాడేను

సమాజంలో వ్యక్తి కాలానికి ఆభరణం కాదు
వ్యక్తి ఒక శక్తి, కాలాన్ని కదలించే ప్రేరణ రూపం
బ్రతుకులు పలు రకాలుగా, తీర్చి దిద్దబడేను
ఎక్కడయినా ఎవరి దయినా అవసరం తీర్చేను

ఇది ఏ పరిశోధనలో పక్కకు పెట్టేది కాదు
అన్నింటినీ తన ప్రజ్ఞ చేత సరిచేసే సాధనం
కవితలో ప్రతిఫలించే ప్రపంచం
మనిషి పొందే అనుభవాల సంకలనం

ఊహలో అతీతం జీవన గతిలో పనిచేస్తుంది
తీవ్రవాదంలో చిత్రాన్ని చూపే రక్తాక్షరం
శాంతిని వరించేనా? రణాన్ని ధ్వనించేనా?
కవితలో రెండూ చెరొక వైపు రెక్కలవలె పనిచేసేను

కాల చక్రంతో దేని సమయం బలం దానిదే
జీవితంలో కనిపించే పాత్రల తీరులు వేరు
కవితలో మానవీయం వార్త నుండి ఎప్పటికీ
మనిషిని కాపాడేందుకు సమాజ హితం చూపేందుకు

40. వాస్తవ జయం

పిడికెడు మట్టిలో ఎదురుగా కుండిలో
దోసెడు జలంతో అద్దాల కేసులో
బొన్సాయి మొక్కలతో పూల తీగెల అందంతో
చిరు కవిత నుండి మహనీయం దాక మనోజ్ఞ దృశ్యం

అణువు నుండి మహనీయం దాక మనోజ్ఞమయిన
సృజన కళకు బహు రూపాలను సంతరింపజేసేను

ప్రకృతి శక్తితో పాటు మనిషి రక్తిని తెలిపేను
ఇది నిత్య హరిత కమనీయం జనహిత కరం
భూమి పై చెలక నుండి మహా క్షేత్రం వరకు
భౌతిక మానసికాల తృప్తికి రంజనకు హేతువులు

క్వచి దుష్ణ స్పర్శతో కవితలో శబ్దం
హిమ శకలం వలె రసమయ మయి కదలుతుంది
ఆలోచన శ్రమ చింతన సంప్రీతి కవిత
స్వేచ్ఛా భావనతో హృదయం స్పందించే సాధనం
విశాలమైన ఆకాశ మావరిస్తుంది
విపులమైన భూమిని స్థిరపడుతుంది

భౌతిక మానస లోకాలను సంధించే
శబ్దంతో వంతెన కవిచే నిర్మిత మవుతుంది
చీకటితో తల పడేది ఏమీ లేదు
అది వస్తుంది! ఇది తెలిసిన నిజం ! వెళ్ళిపోతుంది

బొన్సాయి నిలయంలోకి రాగానే స్వాగతం పలుకుతుంది
చింతనచే దిశలు చుట్టగనే హార్దికం ఒలుకుతుంది మహనీయం
అటునుండి భౌతికం, ఇటునుండి మానసికం

వ్యక్తినుండి సమాజ దృశ్యంలోకి మారుతుంది సందర్భం
ఒంటరితనం ముక్కలు సంఘటితమై నచేతనతో
సమాజ శక్తులు వాస్తవ జయంతో అంతులేని కథ అయ్యేను

41. వర్తమాన చలనంలో

నీలి మబ్బు నుండి మెరపు రాత్రి పోవలసిన దిశ చూపేను
మజిలి చేరేది మాత్రం రాత్రి వేళ దీప కాంతిలోనే
గమ్యం గుర్తించేదీ వెలుతురులో కాస్త వెన్నెలలో నో
మైత్రీ గతిలో పవనం ఎప్పటికీ వెనకనే కదలుతుంది

చెట్టు నీడ పగలు విరామానికనుకూలమై సిద్ధంగా
పూలు కోసిన వెలుగు మిని చీకటి చెట్టును తలపిస్తుంది
మార్పు కోరే అవసరాలొకటొకటీ ఎదురయ్యేను
కొత్తకు ఆలోచన మనిషిలో సమాజంలో భాగం

మేల్కొన్న మనిషి బయటకు వచ్చేసరికి మైదానంలో
పురి విప్పిన నెమలి దూరం నుండి శబ్ద తరంగాలకు
చెట్టు క్రింద నర్తన మొదలవుతుంది దృశ్యంలో కళతో
అడుగులు కలిసేను సుతారంగా అంద మొలుకుతూ

హరిణం లయ తప్పని గతులతో ఉల్లాసంగా
తిరుగుతూ అంతలో మాయ మవుతుంది, వనిలో
నడక మొదలైన ఉదయం రవి కిరణం హత్తుకొనీ
పక్షులు కల రవాలతో దారిన మనుషుల్ని ఉత్సాహపరచేను

నేరం పెద్ద బండరాయిలా బ్రతుకు దారులలో
దీన్ని మరో హృదిలో దించే అవకాశం లేదు
మరొకరికి అప్ప జెప్పే వీలు అసలు లేదు
అబద్దాలచే అలంకృతమయిన విషయం తెలియదు

మనసు పొరలలో అడుగున పడి పోయిన “నిజం”
దిశ అంచున దిగిన వివిధ వర్ణ కలనం ఇంద్రచాపంలా
పైకి వచ్చే యత్నంలో ఆశా దృశ్యం భ్రమావరణంలో
వార్త నుండి కవిత లోకి వర్తమాన శ్రవణ దృశ్య పరంపరలు

42. విశేష తేజంతో

మనిషిలోని ప్రకృతి సహజ పూల వనం వదలి
ఎండుతుందనో వాడుతుందనో ! త్రుంచ బడుతుందనో!
మట్టిలో కలిసేననో ఇక ఇది కనబడదనో
ఇది తొలగిన స్థానంలో శిల్పాలను తలచేరా?

శిల్పాలకు ఆహ్వానం పలకవచ్చు మార్పుకు గుర్తుగా
దేని అస్తిత దానిదే దేని తత్వం దానిదే
ఒకదాని కొకటి ఏదీ ప్రత్యామ్నాయం కాదు
హృదయ వశత మాని, ఏ నిపుణతకు చోటులేదు

పరివర్తన తప్పనిదీ కాలాంతరాన పలు రీతులలో
ఏదయినా అది మాత్రం మూలచ్ఛేదం కారాదు
నిర్మాణంలో కలలో ఒకటొకటి జారేను
వస్తు తత్వ మేదో, అది మాత్రం చివరకు మిగిలేను

నేడు మనిషి వెంటబడి వేటాడే మనుషులు
రేపు బ్రతుకును నిప్పులపై ఆటలాడించవచ్చు
పైన సూర్యునితో భూమిపై మనిషి నడిచినంత
మేర లోని ఆలోచన కిరణమై ఉండి పోదు మతిలో

చంద్రబింబ సమంగా ప్రభావ రూపంతో హృదయం
చీకటిలో హ్లాద పూర్ణమైన గుణంతో ప్రకాశించేను
మనిషి చుట్టు తెలిసిన తెలియని మనుషు లెందరో
అగ్ని చర్య జల చలనం పవన గమనం మట్టి సృజనతో
గగన దార్శనికంతో కవిత కనిపించని గోడల్ని తొలగించేను

'నిజం' ఎగిరే గాలి పటంలా చేతి కందనిదీ
నిలవనిదీ, గాలిలో మేఘంలా మనసులో తేలిపోయేను
అనుభవ గమనంతో విశేష భావనా తేజంతో కవిత!

43. ఆమోద ముద్రలతో

సూర్యుడు చంద్రుడు పాత బడి మారిపోవడం జరగదు
ఇవి కవితలో హృదయానికి తాత్కాలిక వస్తువులు కావు
కవి దృష్టిని ప్రతి వస్తువులో కొత్త విషయంకై అన్వేషణ
జీవన పరంపరలో భాగమై నవ్యత చేకూర్చేను

చెల్లని నాణెంపై దృష్టిపోదు, చరిత్ర శాల యే శరణ్యం
పయనంలో నిగ్గు తేలిన అమూల్యానికే ప్రాధాన్యం
పవన గతిలో ప్రవాహ మొక సుందర వాస్తవం
ఏకాంతానికి దిశ ఒకటే ! తన ముఖాని కెదురుగా

సమాజ చక్రాలకు చుట్టు దిశలు అవహించి
వ్యక్తిగా ఏమైనా సమాజంలో పాత్ర అందరిదీ
పై కెగిరే పక్షులు గూటిలోకి చెట్టుపైకి
గోడ లెరగని విశ్వంలో, ఎవరి బ్రతుకు వారిది

జీవితాన్ని పాలించే అవకాశం ఆవేగం ఆమోదం
మనిషిలో సత్వర ప్రయోజనానికి పట్టం కట్టేను
ఎగిరి వచ్చి భూమిపై మనిషి బుజాన పావురం
సమరానికి వీడ్కోలుతో శాంతికి స్వస్తితో

తిరిగే సమాజ చక్రంపై వ్యక్తి ప్రభావం
ఏదయినా వ్యక్తి స్వేచ్ఛను మ్రింగేయ రాదు
సందేహ స్థితిలో అందరికీ దార్శనికం మెరసేను
జీవన గమనంలో సుగమత కలిగించేను

వ్యక్తికి మాత్రం నిరంతర చేతనతో
కలలకు వాస్తవ రూపమివ్వడమే పని
ఇది క్రమంగా సమాజ శక్తిగ మారేను
తరం నుండి తరానికి ఆమోద ముద్రలతో

44. చీకటి రుచి చూడాలని

పదును లేని కత్తిని రణ రంగంలో ప్రవేశమెక్కడిది?
సృజన స్పృహ లేని మనసుకు కవిత్వ రక్తి ఎక్కడిది?

పగలు వెలుగు ఉన్నంతవరకు రాత్రి చీకటికి నో ఎంట్రీ
చంద్రుని హృదయంపై దృష్టితో, నిశా రహస్యంపై ఆరా

శుభ్రమైన అంతరంగ దీప్తి తోనే కనిపిస్తుంది
మనో దర్పణం, కొంత ఆకు పూవు ఫలం నిజంతో

ఆగమనం నిష్క్రమణంలో నియతమైన రవి
ఎంత కాలం గడచినా పాత బడే ప్రశ్న లేదు

కాలం చెల్లిన నాణెం వలె పాతబడేది కాదు
కవిత కాలాని కతీతమైన విలువలతో
ఎగసి వచ్చి పైబడే పరివర్తనం బ్రతుకులో
చుట్టూ విశేషావసరాలతో పరంపరలో భాగమై

ఏకాంతానికి దిశ ఒకటే ముఖానికి సూటిగా
కదలే సమాజ చక్రం చుట్టూ ఆశలతో
అనుమానం సందేహం ప్రగతికి ఆటంకాలయి
గోడలు లేని స్వేచ్ఛలో మనసు స్వతంత్రమవుతుంది

ఏకాంతం చుట్టూ ప్రహరిని కోరుతుంది
ఏ రోజు కారోజు సుఖంగా గడవాలని
చింతనలో ఏకాంతం మనిషిని నడిపించేను
సమాజ చక్రం గమనంలో కవియే కేంద్రం

వెలుతురు చీకటి మధ్య రేఖపై నిలిచిన
మనిషిలో రెండిటి పరిచయాలతోనే జీవితం
వెలుతురులకు అలవాటు పడి బ్రతకలేని
మనుషులకు, చీకటి రుచి చూడాలని ఉంటుంది

45. రుతువుల కలయికతో

కాలిబాట ఎప్పటిదో? ఏర్పడింది ఇప్పటికీ
ఎప్పటి కపుడు కొత్తవి రావచ్చు అవసరాల మేరలలో
ఊరు నుండి ఊరుకు అందలం ఎక్కిన సంతోషం
పరిచయ మాత్రంతో శాశ్వత మిత్ర మవుతుంది

ఏ రోజున ఉదయ కిరణంతో మనోజ్ఞంగా
మనిషితో కలిసి తరువులు ! నడవాలని కోరిక

కొమ్మలు ఊగేను, ఆకులు గలగలలాడేను
అంతలో భూమిలో కూరుకున్న వేరులు
అనుభవాన్ని వెనక్కి లాగేను మెలకువగా
మనసున ఆలోచనలు భ్రరింపచేసేను

ఏ చెట్టు అనల రాగం వినిపించలేదు
తరువులోని స్పందన బంధుత చూపించగలదు
కాలాన్ని నిలువరించి ప్రకృతిని మన్నించేను

అణువణువున ప్రతి రుతువులో ప్రభావ ముద్రలతో
తమలోని జీవ బంధుతను బయటికి ప్రకటించేను
ప్రతి వస్తువు తనలో, లేని గుణంకై నిరీక్షణం
తన బంధం భూమితో ముడిపడి ఉందని తెలిసీ

సమాజ రూపానికి సమాంతరంగా ఎదగాలని చూచేను
తెలిసి తెలియని అమాయక స్థితిలో బ్రతకేను
మనుషులు సందిగ్ధ స్థితిలో కల్పనలో బ్రతికేరు

ప్రతి వ్యక్తి తన దైన బ్రతుకును తలపిస్తూ సమాజంలో
ఏదో ఒక విజయాన్ని సాధించాలని, ఎప్పటికీ ఉంటుంది
మెలకువలో గగనాన్ని అరచేతితో తాకాలని
నిద్దురలో జలనిధి లోతులు కొలవాలని
అవనిపై మనిషిలో మరో మనిషిని చూడాలని
రుతువుల కలయికలో కాలాన్ని జయించాలని

46. సానుభూతి స్పర్శతో

ఇంటి గేటు నల్లు కొన్న తీగెకు పూలవలె ఆలోచనలు
తనకు వీటిలో ఉపయోగపడేవి మాత్రం ఏ కొన్నో
మిగతావి ఎవరెవరికో ? ఆపైన భూమి నలకరించేను
చేతి కందనున్న ఫలితం, ఎవరు నమ్మింది వారికి నిజం

ఆకాశం దాహంతో అలమటించే సమయాలలో
భూమి క్షుధతో విలవిలాడే దరిద్ర వేళలలో
మేఘం చినుకులు రాల్చక పోతే, సృష్టికి అర్థం లేదు
కార్యకారణ సంబంధానికి, కాస్త ఎడం జరిగినట్లే

గాలి కదలుతుంది ఎదను స్పృశిస్తుంది, ఆప్యాయంగా
ఆశను నిలుపుతుంది, ఆకాశ మంత పరుస్తుంది
నిరాశను వదలుతుంది, జలధి అలలపై
బ్రతుకులో భరోసాతో అన్నీ, తమ తమ విధులలో

ఎక్కడి కక్కడ పెంచబడే ఉద్యానక జీవితాలు
వర్తమాన సమాజంలో అనుభవ దృశ్యాలతో
ముందుకు వెళ్ళే వాస్తవం, వెనకనే స్వప్న శకలాలు
కాస్త కాస్త నిజం పంచి పెడుతూ భరోసాగా

ప్రతి వస్తువు దొక చరిత్ర తెలిసినా తెలియక పోయినా
మనిషిలో వాస్తవం సుడులు తిరుగుతూ స్థితులలో
శిలల మధ్య ధైర్యంతో అలలపై వేగ వంతంగా
వర్తమాన ప్రవాహమై నిరంతర పురోగమనంతో కవిత

మనిషిలో అహంకారం మనసు అడుగున వేరులతో
సందర్భంలో అన్వయం మారవచ్చు, అగ్నులు పూయవచ్చు
శిశువు చేతిలో వెన్న ముద్ద కావచ్చు
అద్దంలో అందే చంద్ర బింబం కావచ్చు

నిశ్శబ్దంలో వేదన శబ్దంలో ఆక్రందన క్షణంలో
మరపించే సానుభూతి స్పర్శతో, కదలుతుంది మానవం

47. కార్యకారణ సంబంధంతో

పైరు పంట పూవు ఫలం తోటతో ప్రకృతి మయం
భూమి ఎప్పుడెవరి దయినా ఇప్పుడు మానవులందరిదీ
వన నది సంపద భాగ్యంతో జీవన ప్రమాణాలు పెరిగేను
ప్రజల యానంలో సుగమత సుందరతలతో స్థాయి హెచ్చేను

విశ్వంలో మనిషి పాత్ర అనుపమం నిరంతరం
ఇది ప్రకృతితో సమాజ బంధం దృఢతర మొనరించేను
స్వేచ్ఛను దురుపయోగ పరచే వారెందరో
తమ ఆధిక్యం కయి లౌకిక వ్యూహాల ప్రయోగాలతో

మనిషి బ్రతుకు జడం కాదు, శిల్పారామంగా మలచలేరు
జల యానంలో అలలపై తరలే పడవల వంటిది

శత్రువు ఉనికికి నిప్పంటుకొనీ, కారణమైదైతేనేం
అది ఆ ఒక దానికి పరిమితం కాదు
పక్కన ఉన్నవి కూడా దగ్ధం కావచ్చు
చర్యను సరిదిద్దే సూచన చేస్తుంది కవిత

ఏది జరిగినా "ధర్మ సాధన"మైన శరీరం తోనే
మానుష చరిత్రలో యశో ద్వారం నుండే

సమాజ శ్రేయంకై ఉదగ్రమైన భయద పథంలో
మనుషులు మరణ భయంతో కంపిత మయ్యేరు

ఆయుధంతో గాయపడిన మనసు ఉత్తేజం పొందేను
చరిత్ర పుటలలో కనబడనిది, రక్తాక్షరాలలో మానవం

బాధల గాథలతో నిండిన జీవితాలు
పరివర్తన లక్ష్యం తోనే ముందుకు సాగేను

వర్తమాన కథ, ఎవరికిష్ట మైనా కాకపోయినా
జరిగేది మాత్రం, కార్యకారణ సంబంధంతోనే

48. అంతరంగ స్పర్శతో

దూరాన పర్వత శిలపై చింతనలో ఒకరు
ఊరు మధ్య మహా తరువు నీడన బోధలలో ఒకరు
అందని ఎత్తులో ఆసన మధిష్ఠించి పాలనలో ఒకరు
మరొకరు గాలిలో పతంగిలా ఎగసి, తిరుగాడుతూ

నాలుగు దిశలలో నలుగురు ఇంద్ర చాప రూపాలు
వారి మధ్య వివిధ వస్తు చయంతో పెద్ద మేజు వలె గగనం
ప్రేయో బంధంతో ఒకరు, శ్రేయో భావనతో ఒకరు
సమాజ దర్శనంతో ఒకరు, మానవ భావనతో ఒకరు

అయినా దిశ దిశ ప్రతి కోణంలో ప్రజలు సమూహాలుగా
మేలును, మంచిని సౌజన్యం సాభాగ్యం సౌహార్దం కోరీ
పలు మూలల నుండి ఉదారత లేని బీభత్స దృశ్యాలు
మానస హంసను మరచి, బయట హింసలో మనుషులు తేలేరు

ఆచరణంలో అనల శిఖలను పోషించడమే పనిలో
ఎవరి ఇల్లు ఆస్తి ఏది బూది అయితేనేం?
తన నిలయం పచ్చగ ఉంటే చాలు నన్నట్లుగా

ఇంత కాలం నిరంకుశ పద ఘట్టనలో
నలిగిన బ్రతుకుల గుర్తులు సమాజ చరిత్రలో
దుమ్ము కమ్మి మాసిపోయి ఏ మూలనో శిథిలాలలోనొ

రా ! రానీ ! హృది ! నవ విభాత మానవ తేజం
ప్రజాస్వామ్య పవనంతో పునీత రూపం పొందనీ
అంతరంగ స్పర్శలో జీవితాలు గడవనీ
ఒకే మాట ! ప్రతినతో దిక్కులు నినదించనీ

బ్రతుకులో ఆధునిక మానవ రూపం ఎదగనీ
హిమ యవనిక అయినా, జ్వాలా తోరణమయినా
మనో నిలయాని కవసరం ఎంతో ఉపయోగిస్తుంది
సమయం సందర్భంలో జనాభిమత నవపథంలో

స్వేచ్ఛా కవిత్వం - 119

నిప్పులపై మేఘం

మాదిరాజు రంగారావు

2022

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

119 SWECCHA KAVITHVAM

NIPPULAPAI MEGHAM

(cloud over Fire)

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2022

Presented to
my wife
Smt. Indira

పీఠిక

విశిష్ట వేదిక

"నిప్పులపై మేఘం" నేటి సమాజ స్థితికి కావలసినదీ. ఉత్తమమైన లక్ష్యాన్ని అందుకోవలసిన యత్నం అవసరమైంది. ఇందులో వివిధ సందర్భాల్లో ప్రసక్తమయింది, స్వేచ్ఛా కవిత్వరూపంగా పరిణమించింది. స్వేచ్ఛా కవిత్వంలో వస్తువు ఎంత విపులమైందో విషయాలెంత వైవిధ్యంతో కూడినవో లక్ష్యాలెంత విశాలతతో సంపన్నమయినవో గమనించవచ్చు.

వర్తమాన కాలంలో చూచేవీ చూడక తప్పనివీ తెలిసినవీ వార్తలలో చోటు చేసుకున్నవీ ఇందులో దార్శనికతను పొందాయి. ఇందులో సద్యఃస్పందనంతో ఎప్పటికపుడు పొందే కవితా రూపంలో విశాలతకవకాశం కలిగింది, వివిధతల్ని పొందింది.

స్వేచ్ఛా కవిత్వం పరంపరలో ఇది 119వది. ఇందులో కవిత్వం శబ్దార్థాల అంచుల్ని దాటి అర్థాంతర స్ఫూర్తితో విశేషాంశాల్ని కలిగింది. మానవ జీవితం – సమాజం – యథాస్థితి నుండి పురోగమన శీలంతో పొందే వికాస గుణాన్ని ఎత్తి చూపడం జరిగింది. మార్పు అనివార్యం, ఏ క్షేత్రంలో ఏ విధంగా ఏ లక్ష్యంతో అన్నవి ముఖ్యమైనవి. ఇది ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికంతో వినూత్నమయింది. ఈ కారణంగా స్వేచ్ఛా కవిత్వం అనేక విషయాల్లో వచన కవిత్వంలోని అంశాలతో భేదిస్తుంది. సమన్వయ భావంతో సమాదర శీలంతో విశిష్టమైంది.

దీనికి సూక్ష్మ వివేచనతో సాగే సాహిత్య విమర్శ అవసరం. ఈనాడు వస్తూన్న కవిత్వంలో ముఖ్యంగా తెలుగులో ఎవరి అస్తిత్వం వారిది ఎవరి వ్యక్తిత్వం వారిది. ఎవరి ఆలోచన అనుభవం లక్ష్యం ప్రయోజనం వారిదిగా ప్రత్యేకతల్ని కలిగింది. సహృదయులైన సద్విమర్శకుల బాధ్యతల్ని పెంచుతూంది. ఇపుడు ఎవరూ ఎవరికీ మోడల్ కాదు. కవి సర్వ స్వతంత్రం. కవిత్వం స్వేచ్ఛామయం. దృష్టి విశ్వమయం కాక తప్పదు.

ఇక సృజన రూపం భావ రూపా (Images)లతో ప్రతీక (Symbolic)లతో వ్యంగ్య శోభితంగానూ, ప్రజాస్వామ్య దార్శనిక లక్ష్యంతోనూ విలసిస్తూంది. అభివ్యక్తిలో ధారా రూపం ఆవిష్కృతమయింది. వెనక్కి తిరిగి చూచే అవకాశం లేని ముందు చూపుతో వేగవంతమైంది. తనదైన విశిష్టతను పొందింది.

– మాదిరాజు రంగారావు

1. బ్రతుకులు ఆగవు

కాలం నిలవదు ఊపిరి విరామ మెరగదు
పట్టాలపై రైలు ప్రయాణాన్ని తలపిస్తుంది జీవితం

వచ్చే ఉదయం వెలుగును ఆలస్యం చేయదు
నిజం బయట పడే నని కొందరిలో భయం
అద్దిన పలు రంగులతో అసలు సమస్య మూలం
కనిపించక పోవచ్చు నని కొందరి అనుమానం

కవి హృదయం నిరంతర సమాజ గతిలో
తరలే జీవన గాథల దృశ్యాలెన్నో
ఎవరి దృష్టి వారి వరకు పరిమితం

చెరువు ఎండి నీరు నెవరో ఎత్తుక పోయారనుకోనేరు
అంతలో నీలి మబ్బు వచ్చి సమయానికి
ఆదుకునే మిత్రమై ప్రియమై కదలాలని

తమ దాహం తీరిన చాలు నను కునేరు కొందరు
తమ బిందెలు నిండిన చాలు నను కునేరు మరొకరు
స్వార్థం ఎంతవరకు తీసుక వెళ్ళేదీ తెలియదు
అంతవరకు ప్రపంచాన్ని ఇరుకు గదిగ మార్చేరు

తాగేందుకు నీరు, పంటలు ఫలించేందుకు నీరు
బ్రతికేందుకు అవసరాలు తీరే ప్రయోగాలెన్నో!

మనిషిలో వెలుగు దివ్వె వెనుక నున్న చీకటి రూపం
బయటికి వచ్చే అడుగు జాడలలో క్షేమంతో
దరిద్రం ! బాధాకర దృశ్యాలతో జీవికలలో
శాంతం తల క్రిందులై ఆవేదనపై చేయిగా

ఒకరి నుండి ఒకరు దూరమై ప్రవాసాలు
కాలం ఆగదు మనిషికి బ్రతుకు తెరువులలో
ఆహారం భద్రత క్షేమం కోసం పయనం తప్పదు
కొన ప్రాణంతో రోజులు గడవడ మొక దౌర్భాగ్యం

2. ఎప్పటికీ

కాలం నిలవదు, తలపులు ఆగవు
ఎక్కడయిన ఎవ్వరయిన కోరే దొకటే
సమభావం సమన్యాయం మానుష ధర్మంతో
స్వేచ్ఛా జగంలో అభినవ జీవన యానం

మట్టి కుండల వలె ఇసుక మేడలవలె
బ్రతుకు లెన్నో ఇప్పటికీ, భయ కంపనలతో
ఎపుడే కష్ట సమయంలోను ఆపద ఘడియలలోను
భిన్నమై శిథిలమై రణఛాయలను చూపేను

చుట్టు క్రమ్మిన అగ్ని శిఖల మధ్య
పచ్చదనం నిలుపుకొనే ఆశతో అందరూ
నడిచినంత మేర బయట భూమిపై
స్వాగత మిచ్చేందుకు సిద్ధంగా ఉంటుంది ప్రకృతి

అనుకోని ఆపదలు ఊహించని ప్రమాణాలు
ఒకటొకటి మనిషిని అవరోహణలో దింపేను
క్రిందికి జార్చేను, రాళ్ళపై విసరేను
కనుల ముందు బీభత్స దృశ్యం ! ప్రగతిని శంకించేను

కన్నీటి బిందువులో జలధి అల ఎగసేను
దీనిని దాటే యత్నం ప్రతి బ్రతుకులో అంతో ఇంతో
కాలం నిలవదు మానవ చర్యలు ఆగవు
మాటలలో గర్భితమైన కవిత కావచ్చు; ఎపుడైనా

పరీక్షలో జారిన ఎర్రని చుక్కలు చూచి
భయంతో మనస్సు శరణు వేడేను;
మాటలతో దిగి సూటిగా కవిత కావచ్చు
పూల దండ కావచ్చు; కత్తివేటు కావచ్చు

ఎప్పటికైనా బ్రతుకు సంసిద్ధంగా ఉంటుంది
భయ మూలంతో ఎదిగే చెట్టును తలపించరాదు
నెత్తురు చారల దృశ్యం కారణమేదయితేనేం?
మనసులో భయం పాదును ఎదగనీయరాదు

3. అన్నీ ఎంతో కొంత వరకు

కాలం కదలుతుంది రవిబింబం పతాకతో
వ్యక్తి ముఖాన తనదైన పతాక రెపరెపలాడుతూ
ముడుతలు మడతల ఊహల కదలికలతో
గాలికి విప్పారుతూ నిలకడ హృదయంతో

సంఘంలో ఒకరి పతాకను మరొకరు
బల సంపద అధికారాల నేపథ్యంలో వశం చేసకోనీ
రాత్రి వేళ చేక్కలు మిల మిలలాడే పతాకలు
పగటి వేళ నింగి నావహించిన ప్రకాశ రూపం!

జనపదం బయట పచ్చని చెట్ల చాటు నుండి
సమతను కోరే ఆశలతో ఆయుధ శబ్దం ! తరచుగా
దారిన పోయే వారికి ప్రాణ హాని లేకుండా
భద్రత చర్యలతో దృశ్యం మారణ చిహ్నాలతో

తీవ్ర తీవ్ర విభేదాలు చండ చండ చర్యలు
ఘర్షణతో వ్యూహ రచనలో పై చేయి ఎవరిది?
ఇప్పటిదాకా జరిగినదంతా
ఎవరికి వారు ఆధిపత్య బలంపైనే

గన్ కల్చర్ పెరిగి స్వేచ్ఛలో
సమాజ చరిత్రలో అధ్యాయం నెత్తురు శీర్షికతోనే

విత్తు నుండి ఫలం దాకా వివిధ దశలలో
బ్రతుకంతా చెట్ల వలె మనోజ్ఞ దృశ్యం అవాలనే

ఎక్కడెక్కడో ఉన్న పదాలు చేరి ఒకచోట
వాక్యమై కవితయై సమాజ సంబంధ మేర్పడేను

విత్తులలతో మూలం చివురులు కొమ్మలు
పూలతో పండ్లతో మనిషి ఆశారూప మెప్పటికీ
గాలి వీస్తుంది హఠాత్తుగా తీవ్రమైన వేగంతో
బలం లేని చెట్టు విరుగవచ్చు, కూలవచ్చు

ఈ విసరిన విలయ చర్య ఎపుడు బడితే అప్పుడు రాదు
ఈ బిగిసిన మృత్యు హస్తం, సమాజ కథలో భాగం

4. శిల్పమై దైవమై

రవి పయనించిన దారిన కిరణ ప్రభావ ముద్రలు
ఆపై ఇవి నల్లని రంగు బొమ్మలుగ మారడం విచిత్రం
కొన్ని అనుకోని ఘటనలతో ప్రకృతిలో వస్తు ప్రపంచం
అనుకొనే విధంగా తీర్చబడే జీవన కలనం సమాజం

ఒకటా? రెండా? లెక్కలేనన్ని! దారి పొడవునా
వెలుతురు లోనే వస్తువు తన అస్తిత చూపేను
వైవిధ్యం భిన్నత్వం విశ్లేషణ వివరణ కవకాశం
భావనలో ప్రజాస్వామ్యం అనుభవంలోకి వచ్చేను

చీకటిలో ఒంటరిగా ఉన్న మనిషి
పై నుండి తోడుగ చుక్కలు ! కనిపెడుతూ

ఇంతవరకు ప్రకృతి నేపథ్యంతో అమరిన జీవితం
యంత్ర ప్రభావంతో రూపంతో లక్ష్యం మారేను
నిన్న పరిచయమైన మనిషి మరునాడు కనిపిస్తే
గుర్తు పట్టలేని సందడితో వీధులు కోలాహలంగా

మాటి మాటికీ వ్యక్తికి తన శక్తిని గుర్తుకు తెచ్చేను
కిరణానికి నిన్న నేడు భేదం లేదు; ప్రకాశం తప్ప
ప్రభుత నుండి ఆరోహణలో దైవంగా మారే
మనిషి ! నిజరూపం నుంచి మరొకటి వహించేను

అతీత శక్తికి ఆధారంగా నిలిచిన విగ్రహం
వివిధ స్థాయిలలో ఆకర్షణ ! మనసును సరికొత్త
మలుపును తిప్పేను వ్యవహారిక జగత్తుపైన
మరో జగత్తును చూపేను; కళాత్మకమై

ఎంత వెలుగు ఉన్నా ఒక చీకటి ముక్క
శిల్పమై దైవమై మనిషుల ఆవరణలోనే తిరిగేను

5. ఏదో ఒక పేరుతో

ఇరు చేతులు ఖాళీగా ఏ పని లేకుండా
ఏదో ఒక పేరుతో గడవడం అలవాటయింది
మట్టి గడ్డతో ఒక అర చేయి చాచి
ఇంకొక అర చేయి ఎత్తి శూన్యంలో

మట్టి గడ్డపై కోష్ణ బాష్ప బిందువు జారి
పచ్చని మొక్క అవతరించేనా? నిప్పు పూలు పూచేనా?
ఒకరికి సౌభాగ్యం కథ వినాలనీ
ఒకరికి దౌర్భాగ్యం వ్యథ వినాలని

ఆశల వెనకన విశ్వాసాలొకటొకటీ
మనిషి చావ కుండ బ్రతికేందుకు
బంధు గణంలో భాగమై ఆదుకునేరా?
ప్రకృతి సహకారంతోనే అడుగు పడేది

నాగలి చాలులో అదృష్టం వరసలు తేలేనా?
జల దేవత ఆర్ద్ర హృదయం, ప్రభావం చూపేనా?
ఆలోచనలో భయ భావ మంతరించేనా
ఆచరణంలో పంటలు సంతోష రూపమెత్తేనా?

ఏదో పేరుతో ఏదో ఒకటి జరుగుతుంది
అనుకోనిది ఒక మారు అనుకొన్నది ఒకమారు
ఇష్ట మేదయితే మనసు మొగ్గు అటు వైపు
రుతువులన్ని బ్రతుకులో అమృత స్వరం వినిపించవు

అరచేతులలో రుతువులు తిరుగాడవు క్రమ చక్రంలో
భూమి ఆకాశం మధ్య మనిషి ఇహ పర చింతనలో

6. సమరానికి హేతువై

ఈ విశాల పృథ్విపై కావలసిన స్థలం ఎంతో?
స్వేచ్ఛలో బలం ధనం అధికారం అంచులు స్పృశించేరు

ఆధిపత్య భావనతో విస్తరించి చరిత్రలో అగ్ని శిఖలుగా
అలజడి సమయాలెన్నో ఒకదాని నొకటి తరుము కొనీ
ఏ వస్తువు ఏ ప్రాణిని ఈ అవని తిరస్కరించదు
దిశ లెపుడూ చాచిన ఆశీర్వాద హస్తాలతోనే

శాంతి స్వర మెంత స్నేహ మొలక బోసినా
నెత్తురు చుక్కలతో నేల అలంకృతం కావలసిందేనా
ఆ వెనక నుండి మంచు తెరలు కదలుతాయి
శభ్ర పరుస్తూ తమ దారిన వెళిపోతారు

కవి హృదయం దేనికీ అతీతం కాదు
అన్నిటినీ వశం చేసుకుంటూనే స్పందిస్తుంది
దేని ప్రత్యేకత దానిది! అక్షర నిలయంలో
కోకిల స్వరంతో పాటు సింహగర్జనమూ వినిపిస్తుంది

ప్రజలను చూస్తుంటే చరిత్ర పుటలలో కన్నా
వారి నాల్కలపైనే ఎక్కువ సమాచారం దొరుకుతుది
స్వేచ్ఛలో వ్యక్తులు తమ అస్తితను విస్తరించేరు
ఇది ఏ దారి పట్టేది ఏ రూపం వహించేదీ తెలియదు

మౌనం వీడి సచేతనతో ఎప్పటికిని మానవం
మనిషి వెనకనే దారి తప్పకుండా కనిపెడుతుంది
మనసులో కల్పన ! కళా మయతను పొందుతుంది
రెండూ కలిసి కవితకు విలువను పెంచుతాయి.

వాస్తవము కల్పన రెండూ చక్రాలవలె కలిసి
కాల వాహనంలో ప్రపంచమంతా తిప్పుతాయి కవులను
చిన్న గాయం వైరానికి మూలమయితే
పెద్ద గాయం సమరానికి హేతువుగా మారేను

7. చేతికందినపుడే

వెన్నెల లేనంత మాత్రాన రాత్రి శత్రువు కాదు
చీకటి ఉన్నంత మాత్రాన భయంతో పనిలేదు
కొందరికీ సమయం విరామ సంకేతం
శ్రమ జీవన కథలో శాంత భావనా మనోజ్ఞం

స్నేహం వైరం రెండూ వెలుతురు చీకటి ప్రతీకలుగా
తలచే స్థితులలో రెండిటి అవసర మేర్పడుతుంది
అలజడి అశాంతి క్రోధం అసహనంతో నేడు
అగ్గిపుల్ల గీసి నంత సులభంగా శత్రు చర్యలు

వెలుతురులో దిశ దిశలో చీలిన దారులు
లక్ష్యంలో ఒక దానితో మరొకటి పోటీ

చీకటి కుటి గూడు, గుడిసె లేని
ఊరు కనిపించేనా? సమాజ వికాసంలో
ఎండిన కొమ్మలతో, చెట్టును తలపించేనా?

వస్తువు కనిపించని చీకటి రాజ్యంలోనూ
మాట వినిపిస్తుంది, మాట అలరిస్తుంది
ధ్వని చిత్రం ! దేని కది మానవ శక్తిని కదలిస్తుంది
ఎంతటి అననుకూలంలోనూ, ఎక్కడో అనువైన పార్శ్వం
తనలో నచ్చిన విషయానికి ఎక్కడలేని విభవం

ఆటంకాలొకటొకటి దాటుతూ సమాధానపడుతూ
పోవడమొకటే శరణ్యమనిపిస్తుంది, సంక్లిష్టస్థితిలో
పంక్తి నుండి తొలగి, ఎక్కడో కార్నర్‌లో
ఒంటరిగా గడపడమొక విశేషమేమీ లేదు
ఎన్నిటినో సమాజ సందర్భాలను కోల్పోయి
అర్థవంతమయిన బ్రతుకు నుండి దూరమయ్యేరు
చీకటి గదిలో పడిన వ్యక్తిత్వం ఎంతటిదయినా
తాళపు చెవి చేతికందితేనే ! బయటపడేది!

8. వెలగడమొక విజయం

ఈ భూమి తలంపై ప్రాణాలు పోయే వారు
ఈ జగతి పథంలో ఎంత కయిన తెగించేవారు
మారణ రణ కలహ దృశ్యాల్ని చూపేవారు
రోజు పుటలతో బ్రతుకును గ్రంథంగా చూపేవారు

బ్రతుకులో ఉన్న 'నిజం' ఒకటే అందరిలో !
అది ఉండే విధం వేరు, పొందే తీరులు వేరు
రణ క్షేత్రంలో పడిపోయిన వీరులు
పగిలిన మట్టి కుండలవలె చెల్లా చెదరైన శరీరాలు

స్వార్థం వ్యూహంలో చిక్కుకున్న ఆలోచనలు
ఎప్పటికీ రణ చరణాలపైనే ! దూకవు
ఇది తీవ్రంగా వేగంగా పని చేసేందుకు
నిరంతరం తమ తమ శక్తుల నుపయోగించేరు

ఎవరు ఎవరిలాగ బ్రతకలేరు, నమూనా అసలు లేదు
ఎవరి స్వేచ్ఛ వారిది, పరిమితుల ప్రాకారాలతో
తీక్ష్ణ కిరణాలతో ధగధగ లాడ చూస్తుంది
హ్లోద కిరణాలతో తళ తళ లాడ చూస్తుంది
వాన చినుకులతో కళకళ లాడ చూస్తుంది
అన్నిటినీ కాలం అలంకరించుకొని, నడుపుతుంది
చకితంగా పచ్చదనంలోకి మార్పు, మనోజ్ఞంగా
ఆర్ద్ర హృదయంతో మనిషిలో జీవ శక్తిని ప్రసాదించేను

కష్టంలో సౌఖ్యంలో అలవాటు పడిన బ్రతుకులు
ప్రాణం ఉన్నంత వరకు బల ప్రదర్శనకు పూనుకొనేను
వాస్తవాను భవాల నెదుర్కొనే సంకల్పంతో యత్నంలో
మనుషులు తమ తమ విభవాలను కీర్తిని చాటేరు

కొండపైకి దీపంలా ఆరోహణలో మనిషి బ్రతుకులో
మెరుపై కిరణమై బింబమై వెలగడమొక విజయం

9. బ్రతికినంతకాలం

ఒక భేదం ఒక కలహం ఇరువురి మనసుల్ని
వైరం అంచులలో తిప్పుతుంది, ఎప్పటికీ
ఒక స్నేహం ఒక బంధుత ఇరువురి మనసుల్ని
విజయం శిఖరంపై నిలుపుతుంది, సుచిరంగా

బ్రతుకులన్ని జీవ నదీ తీరాలలో గడచి పోవు
ఎండిన చెరువో నదియో ఎదురుగ ఎందరికో!
దాహం తీరేందుకు దూరం నడవాలిసిందే
ఎక్కడ బడితే అక్కడ దొరికే తీర్థం కాదు

ఎదురుపడే సమస్య బహు సామాన్యమైంది
అది ప్రశ్నల దండతో స్వాగతమిస్తుంది
వహించడమా? సహించడమా? తీర్చడమా?
ఎవరి కెపుడు? జన హితకర విశాల దృష్టిలో!

ఒకరి చేతిలో చిక్కిన పావురం
ఎపుడు ఎగిరి పోయేదీ తెలియదు
ఒకరి చేతి లోకి వచ్చిన అధికారం
దేని కోసమనేది ? ఎప్పటికీ చింతనలో

దారిలో చేతిలో చుట్టిన పంచాంగంతో ఎదురై
ఎవరు ? ఎవరి మూఖాన్ని చదివి చెప్పేదీ తెలియదు
ఇంటి ముందు ఏ భిక్షువు చేతిలో
ఎవరి నుండి ఏ వస్తువు దొరలేదీ తెలియదు

ఏ ప్రశ్నకు సరియైన జవాబు లేదు
అన్నీ తెలియని స్థితిలో, సందిగ్ధ భ్రమణంలో
రాజ్యాన్ని ఆయుధ శాలా నిలయంగా మార్చేరా?
దేహాన్ని మానవ బాంబుగా తీర్చేరా?
రాజకీయ నిపుణత అయినా, మత ప్రస్థానమయినా
అంతవరకు కనిపించని అదృష్టం ! కనుల ఎదుట నిలిచేనా?

10. సంబంధం ఇప్పటిదా?

ఈ దశ వరకు అడవిలో గడపింది చాలక
మను ముందు ఇంకా ఉద్యమ కేంద్రం చేసుకోవాలని
మానవం అంతరించి క్రమంగా సమాజంలో
ఆటవికం పై చేయిగ రాజ్యమేల చూచేనా?

ఎంతో సాధించిన మనిషి అంతలోన
సూక్ష్మజీవి విష క్రిమి బారిన పడడం ఆశ్చర్యం
సూర్యుని తేజాన్ని చంద్రుని హ్లాదాన్ని పొందాలని
కాంక్షా రూపం మనిషిలో ! చీకట్లను మరచేను

యాంత్రిక సమస్యలతో సతమతమయ్యే సమాజం
గమనం ఆగే ప్రశ్నలేదు, వివిధ గతులలో సాగేను
స్వచ్ఛతకు శుభ్రతకు నిలయం అంతరంగం
ఎంతటి సమస్యకయినా పరిష్కారానికి సిద్ధంగా

పూల వనంలో వికసించిన పూలను చూస్తూ
హ్లాదంతో గడిపే సమయంలో గాలి దుమ్ము
చూచే కళ్ళకే కాదు, సుందర వాతావరణానికీ
బాధ ! కశ్మల వాతావరణానికి కారణమై బ్రతుకులో

స్మృతిలో భద్ర పరచబడి అక్షరరూపంలో చేరి
కనిపించని గతాన్ని బయటికి తీస్తుంది కవిత
మనిషికిపుడు సుందర పరిమళ స్వచ్ఛత శుభ్రత
అవసరాన్ని మాటిమాటికీ జ్ఞాపకం చేస్తుంది, మనస్సు

భావనలో బలం విషయంలో నిజం
రెండు రెక్కలపై కవితను త్రిప్పుతుంది
మట్టి అంటని విహాయసంపై యానం
మనస్సు బులుపు తీర్చడమేకాదు, ఆరోగ్యకరమూ
తోటలో పూలు నిండుగా మృత్యుభయం లేదు
నింగిలో శాంతి పదంతో పూచిన హృదయంతో

మేఘం నుండి మెరుపు తీగె సిగ్నెల్‌తో
ప్రాణాధారం నీరు అవసరంతో వర్షం ! ఉరుములలో
భూమికి దిగుతుంది ! సస్య శ్యామల మతితో
మట్టికి మబ్బుకి సంబంధం ఇప్పటిదా? ఎప్పటిదో?

11. ఇష్టమైంది

ఇష్టమైంది అయినా సగం నిద్రలో హఠాత్తుగా
ప్రేలిన ఆయుధం! పలకరించినా హెచ్చరించినా
రాజ్యంలో శత్రువుగా ఎదుర్కోవలసిందేనా?
ప్రజాస్వామ్యంలో సమరసతకు తావులేదా?

రణరంగం ప్రణాళికలో; ఎవరికి వారు
అడవి దారి పట్టేరా? అనల కీలలయ్యేరా?

ఉదయం శాంత సమయమని రణ సన్నాహం ఆగదు
రాత్రులు కనిపించని చీకటి భయంతో రణ రచన ఆగదు
ఏ శత్రుత ఏ ఒక పక్షంలో సాగదు
స్థాయి భేదాలలో గతులు మారవచ్చు
అరణ్య మెప్పటికీ సంపన్మయం
తన వనరులతో బ్రతుకులు కాపాడేను

నీళ్ళపై పడవలా కవిత దూరమైనా
నింగిలో విమానంలా నవత అంత దగ్గరగా
మనిషి ఇంతవరకు పొందినదేదీ పోగొట్టుకోడు
కొత్త దానికై ఆరాటం, ఆవేదన హేతుదృష్టితో

చరిత్రకు రూపం ఇచ్చిన మానవ జీవన దశలు
ఆత్మ తృప్తితో పాటు విలువలకూ ప్రాధాన్యం

నాటకంలో ఎవరి పాత్ర వారికి ఇష్టం
అది ఎట్లా ఉన్నా మంచిదైనా చెడుదైనా
అంతర్నాటక మయిన వ్యక్తి జీవితం
విశాల మానవ వేదికపై ఒక భాగం

మనసులో అగ్ని ఒక పొరలో
మరొక పొరలో జలతలం ఎప్పటికీ
ఎంతో కొంత నిజం తెలిసిన మనిషి
కల్పన కన్నా వాస్తవ బింబాన్ని కోరేను

12. విరామంలో సుప్తంగా

ఆదర్శానికి కొక పతాక ఆలోచన కొక పథం
వైవిధ్యం అనంతం అయిన భావ జగం మనోమయం
మిత్రత కెందరో ! వివిధ దశలలో దిశలలో
సమాజ బంధంతో బ్రతుకు విలువ పెంచేరు

ఉన్న ఒక నాలుక తోనే ఎవరితోనైనా మాట ముచ్చట
మనిషి కొక నాలుకను మార్చడమంటూ ఉండదు
దారిలో శిలలు ఎప్పటి నుండో ఎదురు చూస్తూ
శిల్పాలుగా మార్చే శిల్పికై వైవిధ్య నిరీక్షణలో ఉన్నవి

స్వేచ్ఛలో అంతరంగ మొకటే ఎవరిలోనైనా
మంచు ఫలకం నుండి నీరులా; బ్రతుకు తరలుతుంది
దరిద్ర మేరూపంలోనై ఉండవచ్చు;
జీవన గతిలో ఎవరినైన ఆట పట్టిస్తుంది

ఎదురు పడిన మనిషి ! అగ్నిలా అనిపించకూడదు
కదలుతూన్న ప్రవాహం లాగ స్పృశించి పోవలసిందే
మంచిని గ్రహించే లోపల పగలు వెళ్ళిపోతుంది
చెడును తెలుసుకునే లోపల రాత్రి వచ్చేస్తుంది

గతం పాత వస్తువులా మూలన పడి ఉండవచ్చు
వర్తమాన మెదురుగ కొత్త వస్తువులా ఉంటుంది
ఇరువురికీ భవిత గురించి తెలియదు కాని, ఇష్టమైంది
వివేకాని కందితే, అది అమృత రాగం వినిపిస్తుంది

చిత్రంగానో శిల్పంగానో నిశ్శబ్దంగా ఉండే కన్నా
మంచో చెడో మనిషి సశబ్దంతో ఉంటేనే సార్థం
రాలిన పూవుకీ వచ్చే పూవుకీ మధ్య విరామంతో
సృజన చేతన ఉంటుంది, సుప్తంగా అమరంగా

రుతువు రుతువున కొక వేరు వేరు పతాకతో
కాలం వస్తుంది; దేని ప్రయోజనం దానిది
మనిషి మనో లోకానికి సృజన రూపమిస్తుంది
ఆదర్శం అవసరం రెండిటినీ కలుపుతూంది

13. భాగమయింది

బాధా చక్రంపై హృదయం తిరుగుతుంది
గుండ్రంగా బయటకు రాలేకుండా
బరువులు తగ్గాలని ఒక వైపు నుండి
బాధ్యతలో ఫలాలు దక్కాలని మరోవైపు నుండి

శూన్య బిందువుల నుండి రేఖలు సాగి
చిత్రాకృతి ! విజయేచ్ఛను తెలిపేను
దార్శనికంతో పాటు స్వేచ్ఛా కవిత్వం
కవిలో ! చేరాలిసిన విజయానికి ఆశయం

ఎంత కాలమయినా ఎంత దూరమయినా
తరం నుండి తరాని కందించే బాధ్యతతో
సామాన్యుల బ్రతుకులు సుఖమయమొనర్చే
యత్నంలో పరిశోధనా ప్రపంచంలో కవులు

ఉదయ మయిందో లేదో పక్కనే నీడ
సిద్ధంగా చేతికందని సంకెల వలె

ఒక చేతిలో నాటే మొక్క
ఒక చేతిలో వాటర్ క్యాన్‌తో
మనిషి పురా మిత్రం
సమాజ సంపదలో భాగం

ఆరోజు ఏర్పడే లోటును తీర్చే ముందుగ
సంకల్పంతో మనిషిలో ! క్రియా దృశ్యం

పలు భేదాలతో మట్టి పాత్రలు వేదికపై
నాటకంలో భాగమై తమలో క్రియా శక్తితో
ఏ ఆశా చక్రం తన వేగం కోల్పోదు
పనిలో స్థిరపరచే ప్రతి మనిషిలో

ఆడే నాటకంలో ప్రతిపాత్ర చలన శక్తితో
నిర్నిరోధంగా సమాజ లక్ష్యం చేరే సంకల్పంతో

14. మృత్యు పాశం తొలగిస్తూ

పదం పదం కలిసి కవిత
ఆ వెనుకనే కదలే జలధి అలలు
సృజన చేతన కళతో
ఆర్ద్ర భావ మయమై ముందుకు నడపేను

మదిలో తోచే అర్థంలో వస్తువు తూగేను
సృజన చరితకు విజయ రూప మొసగేను
తనకు నచ్చిన నేర్చిన పనిలో కుశలతతో
గడచేను బ్రతుకులు ! సంకుచిత వలయం దాటి

స్వేచ్ఛా జీవన పాత్రల తీరుల కవకాశం
లోన ప్రభుతకు చోటుతో విశాలతను పొందేను
ఉద్యమ సంరంభంలో ఉద్రేకం ఉద్వేగం కలిసి
ఆదర్శం పక్కనే ఆచరణం తప్పని కర్తవ్యంలో

కణ కణలాడే నిప్పుల కుంపటుల వలె
వీధులలో బారులుగా మనుషులు! ఉద్యమ ఘనులు
మానుష శక్తిని ప్రకటించే నిపుణత చూపేరు
తరాలుగా ఆలోచనలో చెట్ల కిరువైపుల బ్రతుకులు
ఆధిపత్య జాలంలో చిక్కిన దరిద్ర రూపాలు
ఒకటొకటి మట్టి బొమ్మలవలె విచ్చిపోయే దృశ్యం

ఇవి మట్టిలో కలవడ మొక చారిత్రక వాస్తవం
జనావాస నగర శిథిలాలు, మానవ సంస్కృతి శకలాలు

కాలానికి విలువల వెలుగు రేకులు తొడుగుతూ
ఉదయ స్వర్ణ లిపిలో స్వేచ్ఛా స్పందనల్ని తలపించేను
ఉద్యమ సాధనలో పరీక్షలో ఎన్ని ఆటంకాలో
అన్నిటినీ అధిగమించే స్వాభిమాన ఉత్సాహ రూపాలు
దీనికి సమాంతరంగా నైతిక పవమానం
విసరబడిన మృత్యు పాశాన్ని దూరం తొలగిస్తూ

15. ఉద్యమ వేదికయై

క్షణాలు నిప్పు కణాలవలె కదలే క్రూరమైన సమయం
ఎంతటి వారయినా బూది దిబ్బగ మారాలిసిందే
మనిషితో మనిషి సమాజ సంబంధం అనివార్యం
ఎప్పటిదో ఇప్పటికీ పుట్టిన క్షణం నుండి

దార్శనిక పరిమితుల్ని దాటి జీవన గతులతో
మనిషిలో పూలు వాడి నింగిపైన ఆలోచనలు

వ్యక్తిలో కేంద్రీకృతమయిన రాజకీయ దార్శనికం
సమాజ గతిలో నిరంకుశానికి మూలమయ్యేను
భూమిపై సంపద తన హస్త గతమయ్యే
యత్నం ప్రతి మనిషిలో సుప్తంగానో గుప్తంగానో
ఎదుట వ్యక్తిలో వెలుగుల నార్పే ప్రయోగాలతో
నిరంతరం తన కథను నడప జూచేను

తలలు ఒరిగి కిరీటాలు పక్కకు తొలగినా
మస్తిష్క శిఖరాల నింకా పూర్వ పద్ధతినే అలంకరించేరు
ప్రజాస్వామ్య నిలయా లెక్కడి కక్కడ శిథిలమై
స్వయం రాజ్య విభవానికి తాపత్రయ పడేరు

మ్యూజియంలో భద్ర పరచిన కిరీటాలు జ్ఞాపక చిహ్నాలై
ఇప్పటికీ వేదికపై నాటకంలో ప్రత్యక్ష మయ్యేను ఇంపుగా
మనిషిని పురి కొల్పేను, శిథిలాలలో వెదకే పనిలో
కనిపించని తమ తమ ప్రియమైన వస్తువుల్ని ఇప్పటికీ

జలధిలో అలలవలె బ్రతుకులో సందర్భాలు ఘటనలు
ఒడ్డుకు చేరే దాకా మనుషులు కష్టాలకు గురి అయ్యేరు

ఏ కాస్త వీర భావం సోకినా సూర్యుణ్ణి సయితం
తమ జేబులో వేసుకొనే వీరులు శ్రమ వేదికపై
ప్రజాస్వామ్య బంధువులు, ఎప్పటిదో చరిత్రను తమ తమ
కొత్త కోణాలలో మరో రూపాన్ని ఇచ్చేరు మతి ప్రభలతో

16. మినహాయింపు లేదు

తన భౌతిక రూపం భూమిపై దిగ కుండానే
మేఘం నీలి నీడలతో ఆ తాపాన్ని హరిస్తుంది
కనులకు హ్లాదంగా క్లిష్టత లేకుండా పయనం
మనిషిని ఓడగ మారుస్తుంది! సజల తలం భ్రాంతిలో

వచ్చే మార్పులపై మౌన మెవరు వహించినా
జరిగేది ఏదీ ఆగదు, ఉద్గమన స్థాయి తగ్గవచ్చు

గగనం పైకన్న మనిషికి భూమిపై ప్రీతి
బ్రతుకున కాధార సూత్రమొకటే అది, ఆశ
ఇది ఉన్నంత వరకు పొందే సంపద విభవం
శూన్యభాండ గగనం నుండి చేతులలో పడేనా?

మైత్రి ప్రేమ బంధుత ఆత్మీయం వ్యక్తిత్వం
సంకలన రూపం ఎవరి స్వతంత్రం వారిది, స్వేచ్ఛలో
వైరం ద్వేషం అజ్ఞానం స్వార్థం అమానవం
వికార రూపాలలతో వికల పరుస్తూ కలుపుతూ

ఎవరి కథ ఏది ఎట్లా ఉన్నా కథనం ఆగదు
ఒక మృత్యువుకు తప్ప దేనికీ భయపడనిదీ ప్రస్థానం
ఇది కవితకు నాల్గు వైపుల సింహం ఎంబ్లమ్ వలె
వ్యవహారంలో మ్రోగేను, విలువలతో మార్పులతో

పాలన వాణిజ్యం అనుభవం విజ్ఞానంతో
శాంతికై నిరీక్షణం ! వెలగు దారుల అన్వేషణం
ధగ ధగ లాడే మనోజ్ఞ మయిన ఉదయం ఆహ్వానిస్తుంది
రాత్రి వేళ చంద్రుడు చుక్కలు ధైర్య కవచాలను తొడిగేరు

ప్రపంచాన్ని స్వంతం చేసుకొనే తీవ్ర యత్నం
ఎక్కడయిన ఆగవచ్చు, దూరమయినా కావచ్చు
ఎప్పటికపుడు మారే పరిమితుల సమస్య
మరునాటికి ఒడ్డున నావలా నిలవచ్చు
ఏదో ఒక పుష్పంగా ఎదురయ్యే ఉదయ కిరణం
అనల కణాలను రాల్చవచ్చు / చిమ్మవచ్చు

ఇది కథలో భాగం అందరికీ చెందింది
ఎవరికీ మినహాయింపు జరిగే ప్రశ్నలేదు

17. బ్రతుకు విలువ

కోట గోడపై అంచుల నుండి ఎగసిన జ్వాలా రూపం
నియంతల రాజ్యంలో ఇంకా వికాస శిఖరం కనిపించేనా?
దీర్ఘ దీర్ఘ తరంగా లాగిన సైనికుని బాణం
గురి తప్పి చెవి పక్క నుండి దూసుక పోయేనా?

ఇదొక హెచ్చరికగా సరిపోట్టుకో బడేనా?
అధికార శిఖరం నుండి అహంకార విస్ఫోటం
సమాజ చలన రూపంలో మార్పులు చూపేనా?
శిథిలాల పట్ల అభిలాష, మనిషి పట్ల అభిమానం సుందర వాస్తవం

గమ్యం చేరే పయనంలో మానవత పూలు పూచి
ఫల రూపంలో సమాజ భాగ్యంపై, ఆశలు రేపేనా?
దప్పిక ఆకలి తీర్చే వెలుగులు నింపే ప్రజాస్వామ్యం
దార్శనికంగా నడవడం అషామాషీ వ్యవహారం కాదు

సరదాకు కాదు సంపాదనకు కాదు విలాసాలకు కాదు
మానవ శ్రేయాన్ని మంట కలిపే చర్యలు; పనికి రానివి

అర చేయిలో సాగిన అదృష్ట రేఖలా
ఎడారిలో ఎచటో సన్నని జలధార!
ఇరువైపుల వీడని పచ్చని దృశ్యం
ఆశా రూపానికి, సజీవ చిహ్నం

చెట్టు ముందు వేటుకు సిద్ధంగా మనిషి
తోటి మనిషి పెను ఘాతానికి, వెనుదీయని మతితో
ఎరుపుతో ఉదయం, నెత్తురులో ముంచి తీసింది కాదు
నలుపుతో నిశీథి, మృత్యువు వేసిన పందిరి నీడ కాదు

గుంపునుండి విడిగా నీతి లేని చర్యలతో నేతలు
ఎవరికి వారు తమ ప్రభుతలు నిలవాలనీ
నీటి పాయ ఇరువైపుల పచ్చని మొక్కలతో
హిత వాక్యాలొకటొకటీ, బ్రతుక విలువ చూపేను

18. ప్రతి బింబం

అనుకున్న గమ్యం చేరే లోపల ఆకర్షణ లెన్నో?
అనల చిత్రాలో మంచుతెరలో జల సేచనలో మరొకటో
పయనంలో శంకలు ప్రశ్నలు కల్పనలు కఠిన వాస్తవాలు
వాస్తవాను భవ వాహనాలపై మనసు నలంకరించేను

చీకటి వేదికపై రాత్రి ! చుక్కల సమావేశం ఉండనే ఉంది
ఫలితం ! ఏ సూర్యోదయమో ? అనుకునేరు అమాయకులు
తెరచిన ప్రపంచ పుస్తకంలో ఒక పేజి అయిన రోజు
కథలో సన్నివేశ సందర్భంలో సంఘనటలు తప్పనివీ

ప్రతి మనిషిలో వేరు వేరు మూలాలతో చెట్లవలె
దిశలు సాచిన శాఖలతో సాగే బ్రతుకులు
ఎవరి అనుభవం స్మృతిలోకం జ్ఞాపకాలు వారివి
అవసరాలకు మనుషులు కలిసే ఎవరికి తప్పని సమాజం

తరాల కందే చరిత్ర ! ఎప్పటికీ అసంపూర్ణమే
విశ్వాసాలకు వ్రేలాడుతూ సంశయాస్పద నిర్ణయాలు
అభిలాష ఉన్నంతవరకు అన్వేషణ కొనసాగుతుంది
తెలియని విషయాలు కల్పనలచే పూరింపబడేను

దృష్టి పడేది చూపు నిలిచేది తమ అభిరుచుల తోనే
తిరిగే చక్రంపై పట్టు కొమ్మల వలె అందే ప్రశ్నలు !
మాయమైన వాస్తవాన్ని ఇష్టమైన వాటిచే నింపేను
చీకటి బొమ్మల్ని వెలుతురు మనుషులుగా మార్చాలనీ!

రాత్రివేళ గగనంలో చంద్రుడు గూడులో దీపంవలె
మెరసే పగలు సూర్యుడు ! మనిషిలో మెలకువను పరచేను

ఎంతటి వారయినా! ఏ విధం పని అయినా సందర్భం తరిగి
కాలం గడచే కొద్దీ పరిమిత రేఖల మధ్యనే జీవితం
జరిగిందీ జరుగుతూంది జరుగబోయేది కలిపి
సమాజ గతిలో భాగమై కవితలో బింబించేను

19. తనదై

గాలికి ఊగే కొమ్మలతో నడవ లేని చెట్లు
మనుషులతో పాటు నడవాలని మాట్లాడాలని
తనకు కనిపించేవెన్నో అన్నిటిలో మిన్న మనిషి
కవులు మాట్లాడే తీరు విశ్వంలో ప్రతి వస్తువుతో

ఆప్తంగా ప్రేమగా బంధువుగా మిత్రంగా పరిచయంగా
తోటి మనుషులతో పాటు చరాచర జీవ జాలం
అన్నిటికీ స్థానం ప్రమేయం అందరికీ అవకాశం కవితలో
ఎంత పదును కత్తియైనా ఈ వెలుతురు బంధం తెగదు
కవితకు చోటు ఎప్పటికీ బహుమానంగా రుచిగా
పూర్వుల ఆర్జిత సంపదతో వర్తమాన రూపంలో ఎప్పటికీ

ఉదయ కిరణ స్పర్శతో మంచు పలకలు
కరగి శబ్ద మయమై కవితలో నదించేను
విశ్వమయమై దూర దూరం సందేశం దార్శనికంలో
క్షణ క్షణం నవం నవంలో పరివర్తన గమనంలో

ప్రతిభ చేత కవితలో రసాకృతి అయింది
దేశం కాలంతో పనిలేని సమస్త మానవం
కల్పన వాస్తవం కాదని అందరికీ తెలుసు
అయినా మక్కువ దానిపైనె తృప్తి రేఖ జరుగుతూ
అందంగా లోని విషయంగా కనిపిస్తుంది
భవితకు బీజంగా, ప్రణాళికకు పథంతో

కవి మనసులో జీవ నది నిరంతరం కదలుతుంది
స్వనిస్తుంది గమనంలో, బ్రతుకును పండిస్తుంది
పరిసరాలలో పచ్చదనం ఆర్ద్రత స్నిగ్ధతతో
కవితకు అమరతను అనుభవింపచేస్తుంది

మృత్యువు కన్న బలమైంది లేదు, ఏదీ
ఒక్క కవిత తప్ప ! అక్షర రూపంలో తనదై

20. నిజం మెరుపులో

'నిజం' స్వర్ణ స్పర్శతో తెలుపులో నని తెలిసిందే
స్వచ్ఛం శుభ్రం స్ఫుటం అమలినం విలువలతో
సహస్ర కోణాలలో ప్రకాశ మాన స్థితులతో
దృష్టి కొక విధంగా, వెలిగే రహస్య బింబం

ఇది హృదయ గతం స్పందన తోనే సాధ్యం
చేతి కంద బోయేంత దగ్గరలో కోరిక పెంచే
హరిణమొ ! మయూరమొ ! చంద్ర బింబమొ

పొద్దు పొడుపులో మేల్కొన్న మనిషి
తెరచిన కళ్ళకు బయట ముందగ కనిపించేది
గేటు నల్లుకొన్న తీగెకు పూచిన పూవు

తల్లికై ఎదురు చూచే శిశువు ముఖంలా
అక్షరాకృతితో బయట పడిన కవిత

వాడి రాలి మట్టిలో కలిసేది ఆలోచన చేయని
మనిషికి కావలసింది తన మనసుకు హత్తుకొనేది

పుట్టినప్పటి నుండి రోజులు నడచేను అలలవలె
సహస్ర మాన చంద్ర దర్శనం ఒక విశేష ఘట్టం
ఈ సందర్భంలో లాభాల్ని నష్టాల్ని మంచిని చెడునూ
గుణించి చెప్పే నిర్ణయాధికారమెవరిది? ఎంతవరకు?

ఎప్పటికప్పుడు కొత్త సమస్యలతో సాగే బ్రతుకులో
క్షామంలో రాలే చినుకుల్ని లెక్కపెడుతూ గడిపేరా?

ఉషసు కిరణ స్పర్శతో తర తమ భేదం లేకుండా
మనిషి మనో దిశలను నిర్మలినమయ్యేనని మురిసేరా?

దీని కెదురుగా సాయం సంధ్యా సమయంలో
చకితంగా దృశ్యం! దహన భ్రమను పొందేరా?

ఎరుపుతో పలు రంగుల కలయికలో 'నిజం'
తెలిసే లోపల రోజు గడచి పోతుంది
'నిజం' ఉనికిని పసిగట్టేలోపల
ఆ రోజు చివర లిప్త ! నమస్తే చెబుతుంది

21. ఆచరణం

దారిలో పాత బడిన చెదరిన కోట కనిపిస్తే
మౌన భాషలో తన కథ చెప్పాలని చూస్తుంది
ఇక కవుల విషయంలో హృదయం చెప్పే మాటలే మాటలు
తెలియని రహస్య మేదయినా తెలిసేనని ఆలోచన

శిథిలావస్థలో తొలగిన దర్వాజాల తో
నిశ్శబ్దం చుట్టుకున్న గతం లోకి ప్రవేశం
ఏ ఒకరికి అనుకున్నంత సుకరం కాదు
ఎక్సరే దృష్టితో ఆలోచన! ఫలించవచ్చు ! కొంతవరకు

తెలుపు నలుపు రంగులలో వార్తా విశేషాలు
కాలం గడచే కొద్దీ పలు రంగుల కలయికతో
కొత్త రూప మవతరిస్తుంది సంకీర్ణంగా
జన సంస్కృతిలో భాగమై మర్యాదను పొందేను

ఒంటరి తనం నుండి సమూహ చేతనతో
స్థాయిని పెంచేదిగా విభవానికి దగ్గరగా
విజయ శబ్ద లహరులపై తేలుతూ మనుషులు
తమ ఉనికికై పోరాటాలు ! సమాజంలో వరసగా

శిలల నుండి బాంబుల దాకా ఆయుధ దశలలో
గడచిన బ్రతుకులు ! శక్తి ప్రదర్శనలో భాగాలు
వదలిన బాణాల బాంబుల సంఖ్య కన్న
చర్యలలో లక్ష్యాన్ని ఛేదించేది, ఒక్కటి చాలు

గిన్నిస్ బుక్‌లో చేరే పేరుకయి ఉత్సాహంలో
సాధారణ జీవన స్థితి భగ్నం కారాదు
పలు వాహన రూపాలలో పయనించే అక్షరాకృతి
ఉన్న సమాజ ప్రకారాన్ని తెలుపుతుంది కవితయై

కవి నుండి కవితలోకి, వ్యక్తి నుండి సమాజానికి
సరికొత్త రూపంతో తిరిగే సమాజ చక్రం ఆచరణంలో

22. సృజన ప్రపంచంలో

సృజనలో కవి మనో రూపం చేతనతో వికసించేను
ఇది మాట్లాడని వస్తువు లేదు, సన్మతితో
కలలకు తగిన సమ స్థితిలో ఆలోచన
పలు రంగుల దుస్తులతో ఆకర్షిస్తుంది

కవులకు సమాజం బంధు సమం విశ్వమయం
జ్ఞాపకాలు స్థిరంగా నిలిచేవి కావు, మెరపులవలె
అలల వలె దాని వెనుక మరొకటి కదలుతూ
వాటిపై కవిత కదలుతుంది వాహన ప్రియంగా

అంతర్యానంలో ప్రతి కవి ఏదో ఒక వాహనంలో
తనదైన కవితా ప్రపంచాన్ని సంఘానికి ప్రసాదించేను

భూమికీ గగనానికీ మధ్య వయొలిన్‌వలె రోదసి
గాలుల తీగెలపై వాద్య స్వరం అంతర్గతమై కవితలో

కాలి దారిలో ముళ్ళు పరచ బడవచ్చు
రణ క్షేత్రంలో నిప్పు పూలు అలంకృతం కావచ్చు
బాధల గాథల్ని, మోసుక పోయే గాలి వీటిని
ఏ జలధిలోనో కొండపైనో వదలిపోతుంది

అనుభవం దేని కదే ఎప్పటికీ కొత్తగా
బ్రతుకులో కొత్త ప్రకాశ రూపాన్ని చూపిస్తుంది
చర్యలలో విప్లవం అగ్నిని మాత్రమే తలపించదు
చీకటిలో పయనానికి దార్శనిక దీపం చూపిస్తుంది

వేదనలో మనసు మాటల చిత్రాలు వదలుతుంది
ఇది ఒకరి బదులు మరొకరు చేపట్టేది కాదు
మాటల బొమ్మలాటలో బ్రతుకుల కాలక్షేపం కన్నా
సృజన శక్తి చలనంలో ఆచరణ రూపం శ్రేయం

వ్యవహార జగత్తులో కవిలో వర్తన రూపం వేరు
సృజన ప్రపంచంలో వెలిగే దార్శనికం అస్తిత్వం వేరు

23. తక్షణ కర్తవ్యం

తెరచిన తలుపులు కిటికీలతో వర్తమానం
మూసిన చెదరిన వాలకంతో గతం
భవిత గురించి ఆలోచనలో సుందర నిలయం
ప్రతి మనసులో కాలం పొందే నివాస రూపం

పోయే క్షణం నుండి వచ్చే క్షణంతో నిరంతరం
ఇరు వైపుల సృజన వికృత స్థితులతో సమాజం
మనిషి సమీపిస్తే మాట వెడలుతుంది ఆప్తంగా
ఏకాంతలో పాట సాకారం పొందుతుంది గుప్తంగా

జనావాసాన్ని వదలి అడవుల్ని ఆశ్రయించేరు
విప్లవ వాదంతో ఉగ్ర తేజ పథ పంక్తులతో
కొందరు అలముకొన్న చీకట్లను తుడిచేయాలని
ఇవి అట్లా పోయేవి కావు ! ఏ బలానికీ లొంగేవి కావు

తామే ఉదయ కిరణ పంక్తులుగా భూమిపై
కదలాలని కోరిక, జన హిత చింతనలో తేలుతూ
అడవి బాటలో నడకకు అడ్డంకులు ఏవేవో
రాళ్ళు ముళ్ళు అనుమానాలను తొలగ జేస్తూ పోయేరు

తోటి మనుజుల నుండి అవరోధాలను దాటుతూ
ప్రజాస్వామ్య విధానంలో తొలి దశలో సమస్యలు
నిరంకుశం నయ మనిపించవచ్చు కాని అది సరికాదు
సమాజ పరివర్తనలో దొరికిన స్వేచ్ఛను
స్వార్థంలో బంధించే కుటిల నీతి లేకపోలేదు
సామాన్యులతోపాటు పాలకుల పై బాధ్యత ? ఎక్కువగా

ఒకరి వాదం మరొకరికి విరోధం కావచ్చు
ఒకరి నడవడి మరొకరికి ప్రమాదం కావచ్చు
ఆధిపత్యం పోకడ పూర్వ నిరంకుశంలో భాగం
దుష్ప్రభావ సంకేతాలు తొలగడం తక్షణమవసరం

24. వెలుతురు హృదయంతో

నిశావేళ చీకటిలో సమాధిలో కనిపించే చోట
ఉదయ కర స్పర్శతో సజీవ కళతో వాస్తవం
పూలు పండ్లు పంటలతో మనుజుల దృశ్యం
తోచే ఉదార చరితను ప్రత్యక్షంగా ప్రదర్శించేను

చంద్రునిలో నీలి మచ్చలా జీవన వర్తనలో నేరం
స్మృతి నుండి జారేవి కావు తుడిచేస్తే పోయేవి కావు

కంటికి కనిపించని గాలి ప్రభావ గుణంతో
ప్రజాస్వామ్య బంధువుగ కనిపించేను స్వేచ్ఛలో
ఆకులు కదిలేను అలలు లేచేను
మబ్బులు సరేసరి ! ఉత్సాహంగా కదలేను
మనసుకు రెక్క లొచ్చినట్లు తలచేను

నడకలో కాలి కింద అణగిన గడ్డి పోచ
అంతలో తల ఎత్తి తరువు కావాలని ఉబలాటం
అంతస్సత్వంతో మనుషులు ! ఆకాశమంత యశస్సుతో
గుర్తింపుగ కాలానికి, చరిత్ర రూపమిచ్చెరు

అందని ఎత్తులో గగనం అమాయకమైన శూన్యంతో
భూమి పైన మనిషిలో ఆశలు పెంచేను
ఎవరి కైన కోర్కెలు తీరేది, ఈ భూమిపై ఉండగనే
మోదమో ఖేదమో తప్పనివి ఈ శరీరం ఉండగనే
ప్రేమకూ ద్వేషానికి మిత్రతకూ శత్రుతకూ ఆకరం సమస్య

ప్రతి గాయం కొత్త పాఠం నేర్పుతుంది
ప్రతి కవిత కొత్త లోకం చూపుతుంది
ప్రతి వేదన జరిగిన ఘటనపై నినదిస్తుంది
స్పందనలో ప్రజాస్వామ్య భావనతో ఉత్తేజం
ఒక కవిదే కాదు బాధ్యత సమస్త ప్రజలదీ
చీకటి భావనలో సంకుచితం పోయి విశ్వాసమవతరించేను
వెలుతురు హృదయంతో బ్రతుకులు విశాలతను పొందేను

25. అంతరంగ స్పృహతో

తాననుకున్నది తప్పి పోవచ్చు
అనుకోనిది! అర చేతిలో పడవచ్చు
ఏది జరిగినా ఎట్లా మారినా
సమాధాన పడడమే మనిషి పని

మేఘం వస్తుంది తీర్చి ఇంద్రధనుస్సు అవతరిస్తుంది
స్వాగత రూపంలో భూమిని దీవిస్తుంది సంతోషింప చేస్తుంది
వర్షాశీస్సులతో ప్రజలను కనిపెట్టుకొనీ ఆకాశం వంగుతుంది
దృశ్యం మారుతుంది, జీవన గమనంలో ప్రతి ఒక్కరి మనసులో

తెల్లని కాగితంపై నీలి అక్షర పంక్తుల్లా
పరచబడిన విశాల కాల పటంపై మబ్బులు
కవిత వ్రాసేందుకు ప్రత్యేకంగా సమయం ఉండదు
ప్రతిభ ! కూర్చుకుంటుంది, తనకు తగిన విధంగా

వెన్నెల శాలువ కప్పుకొని వస్తుంది రాత్రి
ప్రజల్లో చీకటి గురించి భయాన్ని పోగొట్టేదిగా

కాలం ఒడ్డును కోరేది కొందరు
యానంలో పడవకై నిరీక్షణలో

కాలం నీడను కోరేది కొందరు
వీడ లేని ప్రకృతిపై విశ్వాసంతో
అనుభవ శాలలో దృశ్యాలెన్నో
ఒకటొకటీ చరిత్రను జ్ఞాపకం చేసేను

ఏవో కొన్ని ప్రశ్నలకే జవాబులు దొరికేను
మిగతావి గాలి కెగిరి పోయేను గాలిపటాలవలె

కవిత ఎవరినీ గాయపరచదు
తగిలిన గాయం పట్ల శమన గుణంతో
కవిత ఎవరి తరపున వాదించదు
అంతరంగ స్పృహతో శాంతిని కోరేను

26. అందుకునేది

గోడకు వేలాడే క్యాలెండర్‌లో తేదీలతో రోజు
వర్తమాన పీఠం పై కూర్చున్న ప్రభుత రూపమే
లిప్తలు ప్రజలై స్వేచ్ఛా సందర్భంలో
చరిత్ర కెక్కే మానవ హక్కుల పోరాటం
వర్తమాన చలనంలో భవితపై చూపుతో
సమత నవత పట్టాలపై వాహనం ఎప్పటికీ

దాహంలో దోసిలి నీటికై కరువై
జలరాశి సముద్రం మేఘాలను వదలుతుంది
మౌనంలో జ్ఞాపకాలు అలలవలె కదలుతాయి
శాంతంలో వర్తమాన లక్షణాలు సృజన కళతో
సౌభాగ్యం సౌందర్యం తనదే అన్నట్లుగా
యధార్థ జీవితంలో విపరీతం వెలగవచ్చు
అనుకోని మలుపులతో పయనం సాగేను
పరిచయాలు కొత్త యాచనలో భాగం కావాలనీ

ఏ వైపు నుండో విసరిన బాకు ఎవరికైనా
గురి తప్పి ఇంతలో పక్కనుండి వెళ్ళే
వాహనం అద్దాలు భగ్నమైన దృశ్యం
దిశ నుండి దిశకు సమస్యలో తూగాడేన

దరిద్రాన్ని ఎవరికీ పంచన వసరం లేదు
భాగ్యరాశి నెవరికీ పంచ బుద్ధి కాదు
క్షుద్రతలో మనుషులలో అపాయకర ప్రయోగాలు
కంటికి కనబడని కథ ఆగదు, ముందుకు సాగుతుంది

మనిషిలో చేతన దీపంలా వెలుగుతూ
కావలసిన వస్తువును వెదకుతాయి కళ్ళు
పోవలసిన దారిని వెదక నవసరం లేదు
అటు నుండి చీకటి, ఇటునుండి వెలుతురు

రెండిటి మధ్య ఆలోచన ! మనిషిలోఎప్పటికీ
ఇరు తీరాల్ని స్పృశిస్తూ ఏ చేయి ఎప్పుడు
దేన్ని అందుకునేదీ తెలియదు బ్రతుకులో
అది తన కనుకూలం కావచ్చుకాకపోవచ్చు

27. వాహన మేదయినా

లిప్తలు గడుస్తాయి ఆయువు తరుగుతుంది
లిప్తలు చేరతాయి వయస్సు పైబడుతుంది
ప్రతి అనుభవ మొక ఆభరణం అమూల్యం
చిన్నదో పెద్దదో ఆడంబరం కాదు, అవసరానికి

స్వర్ణమొ రజతమొ మిశ్రమ లోహ సంచయమో
ఆహార్యంలో వెసులుబాటు, చేతన కళతో
ప్రతి కవిత తన దయిన సజీవ పాత్రలలో
సమాజ వేదికపై చతురత చూపేను

భౌతిక వర్తనకు పూర్ణత కూర్చేను
మానవ తృప్తికి దారులు చూపేను
నిశ్శబ్దంలో శబ్దాన్ని అందుకొని
భావనలో మానుషాన్ని దర్శింపచేసేను

శబ్దంలో నిశ్శబ్ద ప్రవాహాన్ని చేరుకొని
పయనంలో కనిపించే దృశ్యాలు కవితలో

కలహ ప్రియులకు యుద్ధం అనివార్యమవుతుంది
శాంతి ప్రియులకు సహనం ఆచరణీయమవుతుంది
ఇరువురు జీవన ప్రవాహానికి చెరొకవైపు
మధ్యలో క్రియా శక్తులు వాస్తవ చరిత్రలో

అంతరాలు విభేదాలు లేంది సమాజ రూపం లేదు
పోత పోసిన ఫలకాలు కాదు, ఏర్పడే సంస్థితులు

ఆలోచనలకు ఆకాశం హద్దు కాదు
ఆనందం పరిమితులలో హృదయ వశం

యుద్ధం విజయం ఓటమి స్నేహం దేని కదే
తనలో చక్కగ ఇముడ్చు కునేను కవిత

కొన్ని సుందర వనాల్లా తీర్చబడేను శ్రద్ధగా
మనుసుల్ని అతీత విషయాలతో అలంకరించేను

కవిత ఏ వాహనం లోనయినా పయనిస్తుంది
లక్ష్యం ప్రధానం ! సహకారులు తోడు నీడగా

28. అహంకార పార్శ్వాలు

అహంకార మందరిలో ఏదో ఒక బీజం భూతమై
బ్రతుకులు గడచే కొద్దీ జీవన రూపానికి ప్రేరణయై
జీవన గతిలో మార్పుకు కారణమవుతుంది
వాస్తవ రూపానికి వేగ శక్తి నింపుతుంది

సృజన కళలో ప్రతిభను ప్రదర్శిస్తుంది
సదహం కారంనుండి దురహంకారం వరకూ
కోపం నేరం మోసం పీడన కలహకారణాలతో
నిప్పు రవ్వయై ఎగసి జ్వాలా దృశ్యం చూపేను

ఆలోచన లెన్ని విధాలో కవితలో
అహంకార ప్రతీకలన్ని పార్శ్వాలుగా
వ్యక్తిలో విరాట్ రూపాన్ని తలపిస్తుంది
సృజన విలయ కారణ మూలాలు మనిషిలో

మట్టి కలప ఇనుము గాజు ప్లాస్టిక్ బొమ్మలతో
మనో వేదికపై బ్రతుకులు పాత్రల్ని చూపిస్తుంది
ప్రతి ఒకరి మనసులో కొలువు తీరి ఎంతో కొంత
ఏ పని కయినా సిద్ధంగా ఉంటుంది, బ్రతుకులో

తరంనుండి తరంలో కొత్త ప్రపంచం అంతో ఇంతో
ఆశా రూపాన్ని ఎంతదూరమైన విస్తరింపచేసేను

వెనుక నుండి అహంకారం ప్రేరణ నిస్తుంది
భూమిని ముక్కలు చేసి పంచబడుతుంది
గాలిని పంచుకునేరా? వెలుగును పంచుకొనేరా?
పురా చరిత్రను మరచి కొత్త చరిత్ర చూపాలనీ

ఆగమనం నుండి నిష్క్రమణం వరకూ వెలిగే
ఆరని జీవకళతో దీపంలా, మనస్సు
వెలుగు నీడ ప్రభావాలతో అనుభవాలలో
అస్తితను చేకూర్చేను? లేంది జీవితమెక్కడ

ఎంత వారయినా ఎంత ప్రభుత లోనూ
ప్రశ్న పైకి ఉబుకుతుంది, ఏదో సందర్భంలో
ప్రశ్నకు జవాబు ఎప్పటికీ అసమగ్రమే
అహంకార పార్శ్వాలలో ఎవరికేది లభించేనో

29. స్పందన

నింగి నుండి వంతులుగా భూమిపై
పరీక్షలు జరిపే సూర్య చంద్రులకు
విసుగు లేదు భయం లేదు నేలపై మనిషికి తప్ప
ఒకటా రెండా? విషయాలెన్నో! ధైర్య మవసరం

ఎంతటి గొప్ప కార్యమయినా
ఎంతటి మహా వ్యక్తి అయినా
ఎపుడైనా ప్రశ్నలకు గురికాక తప్పదు
దీని కెంతో అనుగుణం ప్రజాస్వామ్యం విధం

మార్పులో ప్రగతిని నిలిపేసే చేతులు లేక పోలేదు
అవి ప్రక్కకు జరిపి ముందుకు పోవడమే శరణ్యం
నిలిచి పోవడం వదలని దౌర్భాగ్యం బలహీనత
ప్రజల ఆర్త రవానికి సంస్పందనమే కవిత

బాధా స్వరం విన్న కవి చెవి పక్క నుండి
వేదనలో స్పందన హృదయం, చేరుతుంది
అక్షర ధామంలో శబ్దాకృతి ఏర్పడి
వరిస్తుంది స్వనిస్తుంది కవితయై సరిస్తుంది

సుడిగాలిని దాటుతుంది
తుఫాన్‌లను తరిస్తుంది
మంటల యవనికలను కరుణతో తొలగిస్తుంది
విశ్వమయం కవిత ! ఉదార ప్రకాశంతో

నీవు నేను భేదం లేని సమాజ స్థాపనలో
అధికతలకు వీలులేదు
న్యూనతకు తావు లేదు
అణద్రొక్కే అరాజక దృశ్యం కనిపించదు

మార్పుకు అండగా ప్రగతికి తోడుగా
తరం నుండి తరానికి ప్రేరణ నవశక్తిగా

నిజం బరువు బుజాలపై కాదు మనసులో
అంతరంగ స్పందనతో జీవన గీతం వినిపించేను

30. చరిత్ర వెలసేను

జన హిత మహా కార్యంలో ఉత్తమ లక్ష్య సాధనలో
తగిలిన గాయం గులాబి పూవును తలపించేను
ఉదయం వస్తుంది పురా తేజోరూప మెప్పటిదో
ఆలోచనలు కొత్తగ తత్కాలంలో అనుభవాలతో

కనిపించీ కనిపించని సంసార మనో మూలంతో
పూవు ఫలం లాంటి కవితలో సందేశం ఆనందం అందరిదీ
నిలయం నుండి బయటకి, బయటి నుండి నిలయానికి
వెలుతురు నుండి చీకటికి చీకటి నుండి వెలుతురుకు

ఈ చివర నుండి ఆ చివర వరకు రవి
ధరా తలంపై ఎవరేమి చేసేదీ తెలుసుకునేను
మనిషిలో అంతరాత్మ చేతన ! కళలతో
అలసత కవకాశం లేని కిరణ స్పర్శతో

శ్రమ బంధువు మనిషిలో చేతన రూపం
కాలాన్ని కరగించేను ప్రకాశ గీతం
ఆశయ పరివర్తనతో వెలిగే నవత
కవి యశో నిలయానికి తోరణమవుతుంది

కన్నీటి చుక్కలతో ఆర్ద్రమైన కవిత
సృజన శక్తికి జలద పీఠ మవుతుంది
వివిధ శక్తులు సమీకృత మైన వ్యక్తిలో
పలు సందర్భాలలో భయం చోటు చేసుకునేను
ధైర్యంతో ఎగసి తిరిగి రావలసిన అవసరం కలిగేను
పరిచయాల నుండి స్నేహ బంధాలకు దారితీసేను

రగులుతూ రగులుతూ ఎగసే మంటలాగ
బ్రతుకులో కలహాలు కార్పణ్యాలు పొగలతో
ఎక్కడెక్కడో కుప్పలు కుప్పలుగా దరిద్ర తాండవం
మేఘం దయచేస్తుందనే భాగ్యంకై మనోజ్ఞమై
కత్తితో పనిలేని పూల గుచ్ఛంతో హృదయం
జల నృత్యంలో భాగమై కవిత వెడలుతుంది

రోజు రోజుకు మారే జీవన దృశ్యాలు కలిసి
సామ్యవాద ప్రజాస్వామ్యంలో భాగమై చరిత్ర వెలసేను

31. సంక్షుబ్ధ సమయంలో

చిటికెలలో పందిరిపై తీగెను ప్రాకించి మనిషిలో
పూలను పొందాలని శోభా పరిమళ లహరులతో
గగనానికి నిచ్చెన వేసి చుక్కలను కలవాలని
చంద్రునితో కలచాలనం చేసి తోడుగ నడవాలని

హోర్డింగుల రాతల వలె తలరాతలు కనిపించేనా?
జీవన గమనంలో రహస్యాలు అందరికీ వేరువేరుగా
గగనం హేంగర్‌కు వేలాడే దుస్తుల వలె మబ్బులు
అది స్వంతం చేసుకొని చిరమై నిలవాలని మనుషులు

నాలుక ఒకటే, దీని నుండి ఎన్ని మాటలో?
పిట్ట నుండి పిడుగుల వరకు మధ్యలో ఎన్నో !
స్వర్ణ భేదాలతో లయ విన్యాసాలతో
మనసు ఒకటే తరగల వలె ఆలోచనలెన్నో

కళ్ళు రెండు చూచే దృశ్యం ఒకటే
చెవులు రెండు వినే శ్రవ్యం ఒకటే
జలధిలో పయనం ఒడ్డుకు చేరే దాక భయంతో
నేలపై అడుగు పడగానే, అదృష్టం అందినట్లుగా

గగన మంత ధైర్యంతో ప్రాణం కుదుటపడుతుంది
వచ్చే కష్టాలను లెక్కలేసి, పొందే లభాలను మరచేరు

ఆయుధాన్ని ధరించి తోడుగ తలచేరు కొందరు
దీనితో జరిగేను మంచి చెడుల మార్పులెన్నో
ఆవేశం లోనో అమాయకంలోనో
దూసుకొని వచ్చి పడే బులెట్!
ఆయుధం అండలో ఎన్ని రాజ్యాలో?
ఒకరి బదులు మరొకరు నిరంకుశులెందరో?

భద్రత రక్షణ అధికత గౌరవ సూచిక ఆయుధం
సంక్షుబ్ధ సమయంలో ప్రయోగం ఒక క్లిష్ట సమస్య

రణ మంటే ముందుగ సాయుధ ప్రదర్శనం
వాహనమై మార్తాండ తేజం, కదలుతుంది జీవితం

32. సమాధాన హృదయంతో

క్రింద ప్రేలే ఆయుధ బలంతో మంటలకు
పైన కదలే నీల జలదాన్ని రప్పించాలని

విధ్వంసానికి చిహ్నంగా రక్షణకు ప్రభుతగా నిలచి
మానుష పథాన్ని తప్పడమొక తెలిసిన వాస్తవం చరిత్రలో
రణ చరణానికీ శాంతి కామనకూ అవకాశంతో
నిర్వహణంలో పాత్ర లెన్నో! రణ తంత్ర విభాగంలో

ఒక సుందర వాస్తవ జీవన పథం దార్శనికం
చిర లక్ష్యంతో నినాదాలకు ఉత్తేజం కలిగించేను
కొండల్ని నదుల్ని చెట్లను ప్రాణుల్ని స్పృశిస్తూ
వస్తుంది పవమానం తానే ప్రాణం పోసే దాతగా

అద్దంలో తన ముఖం అందంగా కనిపించేను
మరొకరి ముఖంలో నయితే ! అనుకోనివి కనిపించేను

అడవిలోని గుహలోకి వెళ్ళే ఆలోచన మనిషిలో
తిరిగి మొదలు కావడం విచిత్రం
సాగే ప్రవాహం రూపానికి వెనక నుండి
అలల మద్దతు తోనే ముందుకు సాగేను

వినాశన పర్వంలో జరిగే ఆయుధం పాత్ర
మానుష ధర్మానికి వ్యతిరేకం కావచ్చు
ఏది ఏమయినా గెలుపు ముఖ్యమై
ఆదర్శంలో దార్శనికం వెనకబడుతుంది

కాలాన్ని దాటాలని ప్రవాహం వలె జీవితం
ఎప్పటికీ కాలాన్ని అనుసరిస్తూ పోయేను

దార్శనికాలెన్ని అయినా ఆదర్శాలెన్ని అయినా
స్వార్థ జగత్తులో అన్నీ తలలు వంచి పోవలసిందే

అంతరాత్మ ప్రకాశంలో వెడలిన కవిత
దేనికీ లొంగని శబ్ద ప్రపంచంతో
చూపేను మానవ రూపం! సార్థకంగా
ఏ ప్రశ్న కయినా సమాధాన హృదయంతో

33. చివరి లక్ష్యం

చండమైన రవికిరణం "ఓ" జోన్ పొర దాటగనే
హాదానికి దగ్గరగా, కోష్ణతను ప్రదర్శించేను
లోన ఉన్న ప్రాణ వాహ్ని కనిపించని వాస్తవం
పైకెగసే మంట జీవన కల్పనలో లౌకికం

వైరం రాజుకొని మంటలు కలహ కారణాలయ్యేను
భేదాలను శత్రువులను పెంచడం బహు సులభం
దీని పరిణామం ఊహించని స్థాయిలో విపరీతం
బ్రతుకులో అసహనం సాధారణ ఘర్షణలకు పరిమితమైంది
స్వార్థంచే చరిత్రను జ్వాలా రూపంగా మార్చేరు
అగ్నికి సృజన శక్తితో పాటు దహన శీలమూ ఉంది

కవిత ఒకటే, కళాత్మకంతో స్తిమితంలో మనసుకు
శాంతి పథం చూపేను, అమృత శక్తి పెంచేను
మనుషులలో ఆశలన్ని ఒకే విధం
వాటి వాటి ప్రయోజనాలు వేరు వేరు

పుట్టుక మొదలు తనకూ లోకానికీ మధ్య వంతెన
సమాజం! మనుషుల రూపం చూపుతో మాటతో కూడింది
చినుకులతో చెట్టు పరవశమవుతుంది, సృజన స్పృహతో
తడిసిన ఆకులతో చేతులు చాచి స్వాగతిస్తుంది
హృదయ స్పందనాన్ని ఎవరికీ పంచేది కాదు
ఒంటరి తనం నుండి సమాజంలోకి మనిషి! కవితలో

గిరి శిఖరం నుండి నదిలా మస్తిష్కంలో ఆలోచన
విజయంలో విలువలతో అందరిదీ భాగం అయ్యేను

ఉదయం కాగితంపై స్వర్ణాక్షరాలు
ఒక్కొక్కరికి ఒక్కొక విధంగా విశేషమై
నింగిలో ఎగిరే పక్షుల్ని తలపించేను
నేలపై మొలకెత్తే పచ్చని మొక్కలవలె మురిపించేను

చేయాలిసిన దెంతో ఉన్నా ఆగనిదీ కాలం
తృప్తి రేఖతో గడిస్తే చాలనిపించేను
ఎవరెన్ని ఘన కార్యాలను చేసి చూపినా
చివరకు చేరే లక్ష్యం మహా నదికి సముద్రమే !

34. ఏదీ ఆగదు

ఏదీ ఆగదు మరీ ముఖ్యంగా నయితే కాలుం
క్షణాలపై మనిషి జీవితం పయనిస్తుంది
కదలుతూనో తేలుతూనో ఎగురుతూనో విరామంలోనో
ఎవరి ఇష్టం వారి అభిమతంతో అవసరంతో

పుట్టుక నుండి కనులముందు ఎదురుగా శుభ్రంగా
పరచబడిన తెల్లని కాగితం వలె ఆయువు దీర్ఘంగా
రోజు కొకటి నవంగా సాగినంత వరకు జీవితం మాత్రం
ఉదయ ప్రవేశంతో అనుభవం కొత్తగా ఉన్మీలితమవుతుంది

చీకటి తెరపై అచటచట వెలుగురేఖల దృశ్యం కనిపించవచ్చు
పగలే కాదు రాత్రులు కూడ వాస్తవ సుందరతలు చూపేను
ఏ మాటలోనో ఏ గీతలోనో విషయాకృతి చూడవచ్చు
ఒక రోజున ఖాళీ జగాలు మధ్య మధ్య ఎదురు పడవచ్చు

అవి మరునాడు ప్రశ్నల ముఖాలుగా మారవచ్చు
రోజు గడవడం ఆగదు, క్షణాలు కరగడం మానవు
ఉన్న వర్తమానం జరిగి గతమవుతుంది ఉన్న స్థితులలో
వెనక నుండి భవిత ! పద మెత్తుతుంది, రాకకు సిద్ధంగా

మనిషిలో ప్రాయోజితమైంది సర్వం
వ్యక్తి నుండి సమాజానికి చెందినదువుతుంది
కాలిక స్పృహ లేంది, జీవన గమనంలేదు
ఆదాన ప్రదానంతో పూర్ణాకృతి పొందేను

అవసరానికి దప్పిక తీర్చే నదిలో
దోసిలిలో నీరు గ్రహించి తాగినట్లు
తీరాలను పచ్చగ తీర్చే తడిలో అణువలలరినట్లు
ఉదయం ఉత్సాహం, సాయం హ్లాదం తృప్తిరేఖ నిచ్చేను

ఒక మంచి మాటకై మనసు ఎదురు చూస్తుంది
ఒక నీటి చుక్కకై ఎడారి పైకి చూస్తుంది
చిరు దివ్వెకై రాత్రి చీకటి స్వప్నిస్తుంది
రణంలో తగిలిన గాయం ! పాఠం అవుతుంది బ్రతుకులో

ఎప్పటికీ కొత్తగా పరిచయమైనట్లు
పురా దృశ్యాన్ని ప్రతిఫలించేను మదిలో తెరపై

35. ప్రజాస్వామ్య బంధుత

మౌనంలో చిరునవ్వు వెనుక అర్థం
స్పందనలో భావ జగం కవితలో
చూపు నుండి మనసుకు చేరుతుంది
ఆత్మ కళను పొందేను ఆ క్షణం

భూమి పైన చెట్టు నీడ మబ్బును శంకిస్తుంది
నీరు బదులు చల్లని ఆశ్రయాన్ని తలపిస్తుంది
ఏ దయితేనేమి? అని సరిపెట్టుకునేరా? ఎవరైనా
ప్రాణం నిలిపే నీరు, పై నుండి రావలసిందే

పవమాన వాహనంపై సాగే మేఘుం
పయనం ముందునకే! వెనక్కి తిరిగి రాదు
దీని స్థానంలో కొత్తది చోటు చేసుకుంటుంది
గగనానికి మేఘుం అలంకారమయ్యేనా?
ప్రాణానికి ఆధారం అనేది, జీవన వాస్తవం
ఇలపై సస్య శ్యామల హృదయం చూపాలనీ

దిశదిశలో ప్రకృతికి సమాజానికి
తలపై నీటి కుండలాగ నిలవాలని
చేతు లెత్తి చెట్టు దీన్ని అందుకోవాలని
వరదలో ముంచి బాధకు గురి చేయొచ్చు

ఆర్తిని కనబరచేను మనిషి కల్లోలంలో
ఇది కల్పన కవకాశం లేని యధార్థ స్థితి
తొలకరి చినుకు సృజనకు నాంది అయింది
ఒక చేతిలో హలంలో మరో చేత కలంతో మనోమయం

మధ్య నుండి ఆయుధంతో మనుషులు ! ఒకరొకరు
ఉదయం పూలకు కుంకుమకు బదులు
నెత్తురు చుక్కలతో, విచిత్ర సందర్భం ఘటనలతో
కంచెలతో గుడిసెలు ఒక మూలన దరిద్ర దృశ్యం

రంగుల గోడలతో మేడలు ఎదురుగా
శైశిర దరిద్ర్యాన్ని తరిమి, వసంత సంపద కూర్చే
ప్రజాస్వామ్య బంధుతకు ప్రతీక మేఘుం
అన్నిటికీ సమభాగంతో సమాజంలో నవత

36. హైదరాబాద్

హైరాన ఎరగని శాంత జీవన ఖండం హైదరాబాద్
సహనం స్నేహం సమభావంతో లౌకిక వాదంతో నగరం
వందల ఏండ్ల వారసత్వ సంపదతో ఇది తెలంగాణ రాజధాని
భిన్న భిన్న సంస్కృతుల పలు భాషల కలనంతో సంపన్నయం

ఏ పనులపైనొ వచ్చి ఇచట మోజుపడి వసించేరు
ఎక్కడెక్కడి నుండో ఇక్కడి చల్లని నీడను కోరేరు
ఎవరయినా ఎపుడైనా హృదయం పలుకుతుంది స్వాగతం
బయటి దర్వాజా తెరచే ఉంటుంది, సులభ ప్రవేశంకై

ముందు బ్రతుకు తెరువు! చూపిస్తుంది
స్నేహ సుమం మనిషి ముఖం వికసితమవుతుంది
సమాజ చలనంలో జీవన రుచి చూపిస్తుంది
తెలంగాణ గుండె కాయ నగరంలో చార్మినార్

ఏ విరోధాలు నిరోధాలు అసమ్మతులు లేకుండా
కృషి ఫలం అదృష్టం ! అరచేతిలో బింబించేను
వివిధ రంగాలలో కావలసినవి ఎన్నో ! అయినా
ఉన్నంతలో తృప్తి రేఖతో వికాస చర్యలు చూపేను

రోజులు గడచేను డిటోగా ఆలోచనలు సరికొత్తగా
రాత్రి కన్న కలలు ఉదయం చెట్ల కొమ్మలపై
పక్షుల వలె! పై కెగరనున్న కోర్కెల రూపాలు
తిరిగే వాస్తవ చక్రంపై మనుషులు భ్రమణంలో

మనిషి చెక్క బొమ్మకాదు స్వేచ్ఛా చేతన రూపం
మూసిన పిడికిలిలో పదును కత్తి పిడి సంధితమై
తెరచిన పిడికిలిలో ఎగురనున్న శాంతి కపోతం
కవిని మరచినా, మరవలేని కవిత "చార్మినార్"

ఇపుడు నవ రాష్ట్రం తెలంగాణ శిరోవజ్ర మకుటం
నాలుగు దిశల నుండి దారులు కలిసిన చార్మినార్

పైన నీలి మబ్బు ఛత్రంగా ఆశా మయమై
క్రింద నీటి పాయలు చెరువులుగా ప్రాణ రక్షణలో
భిన్న వాద వివాదాలలోను మానవ ధర్మానికి పీఠం
సమ భావనతో జీవన గుణ ప్రజాస్వామ్య నవ తేజం

37. మౌన నిలయం

ఇంటి ముందో వెనకనో ప్రక్కలనో చెట్టు
ప్రకృతిలో మనిషి బ్రతుకును భాగం చేసేను

మనిషిలో ఒంటరి తనాన్ని వదలించే తీరుతో
తపో రూపంలో మౌనంగా ఉంటుందొకటి

చెట్టు నడవ లేదు, గాలికి ఊగవచ్చు
పూలతో పండ్లతో భాగ్యరూపం చూపేను
పై నుండి మేఘం జలసేచన దీవెనలతో
కాలం వెళ్ళబుచ్చేను మనిషికై అన్నట్లుగా

వీడని సహాయ విధంతో బ్రతుకంతా ఆకర్షణతో
చెట్లు! సమాజానికి తోడుగా కనిపించేను
ప్రకృతి నుండి మనిషికి దగ్గరి బంధువుగా
ఎప్పటికీ ఉండేది విరామమెరగకుండా కనిపెట్టుకొనీ

దీని నుండి వస్తువు లెన్నో, మనిషికి వాడుకునేవి
కలప నుండి సుమ ఫల రూపంలో వితరణగా
తాప శమనం బాధ హరణం అనవరతం
ఇల్లు కన్న నీడ ! సుఖ మనిపించవచ్చు

సస్యం నుండి వట వృక్షం దాకా
గాలులు వీస్తాయి హృదయాన్ని స్పృశిస్తూ
అనుపమ రమణీయమైన ఆత్మ బంధువుగా
సమాజ రూపానికి కొత్త బలాన్ని ఇచ్చేను

దీని నీడన చేరతాయి ప్రాణులు
ఉదార చరితకు నిలయమని తెలిసీ
మంద తీవ్ర వేగ గతులతో గాలులు
ఊహల్ని సుందర వాస్తవ మొనర్చేను
మనుషుల అస్తితల్ని విశాల తర మొనర్చేను
చెట్టులో మనిషి రూపం సరిదిద్దబడేను

నదిలో అలలు మాట్లాడతాయి గాలితో
చెట్టు నీడ మాట్లాడుతుంది గాలితో
తరువయినా నది అయినా ఒకటే! గాలికి
మనిషిలో మౌనం అవసరానికి నిలయం

38. తెలిసేది కవి హృదికే

ఊహ నుండి అనుభవ తలంపై కవి హృదయం
నిరంతర వసంత స్పృహతో పని చేస్తుంది కవితలో
ప్రతిభాధీనమైన సృజన, ఏ భేద భావ రేఖలు లేనిది
మానవ వికాస విజయాలకు ప్రేరణ అవుతూంది

అక్షర పంక్తులలో మేఘం వలె చరిస్తుంది
పద యుగ గతిలో నిర్ఝరివలె సరిస్తుంది
సమాజ చింతన క్షేత్రంలో భాగమైంది
వ్యక్తి చరిత్రలో ఒకటై సార్థక మవుతూంది

తుపానులు రానీ వరదలు ముంచెత్తనీ
సుడిగాలులు రేగనీ భూమి కంపించనీ
ఓడినట్లనిపించే మనిషి ! తనలో శక్తితో
క్రికెట్ ఆటలో చివరి ఓవర్ ! బ్యాటింగ్‌లో
చివరి బంతిపై సిక్సర్‌లా విజయ శోభ కూర్చేను

దేశానికి పొలిమేరలు ! జీవితాలకు పరిమితులు
నగరమయితే ట్రాఫిక్ ఆంక్షలు ! జీవన సుగమతకయి
ఎక్కడికక్కడ అవసరాలకు గోడలు కర్టెన్లు! సవరించుకుంటూ
పరిచయాలు ! స్నేహాలు బంధుతల ప్రసారాలతో
ఎన్ని విధాలుగనో కలుస్తూ విడిపోతూ తెలిసినంతలో

దారిలో మనుషులు మౌనంగా ఎందరో?
శిలలను తలపించేరు ఎదిగని బ్రతకులలో చెట్లుగాను
మనిషిలోని శక్తిని మాటి మాటికి గుర్తు చేసేను
ఎవరి లోకం వారిది ! మరొకరికి తెలిసేది కొంతే

ఏది తప్పో ఏది ఒప్పో పూర్తిగా తెలిసే దెవరికి
విచక్షణగల మనిషి మనో దృష్టికి మాత్రమే శక్యం
నాటిన విత్తు ఎదుగుతూ తన శక్తిని గుర్తు చేస్తుంది
ఎవరి అభిరుచి అభిమతి వారిది, కవి హృదికే స్పందన విశేషం

39. చీకటిని వరించదు

ఆధునిక యుగంలో కవుల స్ఫటిక హృదయం
కుసుమ దళంవలె మెత్తని మనో రూపం
సంఘంలో ఇంకా శేషాలుగా ఉన్నది
అణచివేత మీద అసమతలకు వ్యతిరేకం
మనిషిని బాధించే పీడించే వర్తనలకు విరోధం
ఒక సమయం పోరాటానికి సిద్ధం కావాలసి రావచ్చు

చీకటిలో తేజో బింబం, కాలానికి ఆభరణం కాదు
మనిషికి అవసరమైన ప్రయోజనం ప్రజాస్వామ్య పథం
అందరికీ చెందిన సమిష్టి చేతన వ్యవహార జగంలో
ఆరోహణలో లక్ష్యం! సర్వ జన హితకర విశ్వమయం

అపుడపుడు జ్వాలా రూపం పొందవచ్చు
మబ్బులోని ఆర్ద్రతతో సాగవలసి రావచ్చు
ప్రతి మెట్టుపై ఘర్షణ నినదించవచ్చు
ఇది ఎవరి మెప్పు కయి కాదు, ఒప్పుకోలుకు కాదు

మనుషులలో మనుషుల పట్ల సహభావం వర్తనం
సమాజ దృశ్యంలో భాగమై వ్యక్తిత్వం ఏర్పడేను
ఇపుడు ప్రకృతి నుండి యంత్ర దశకు వేగవంతమై
ప్రతిచోట పరిణామంలో సుఖమూ భాగ్యం కొరబడీ

ఏదో ఒక సమయం చీకటి తెర జారుతుంది
క్షణ క్షణం చింతనలు వెలుగు రాకనే కోరేను
సృజన రూపం రస రమ్య కల్పనతో ముళ్ళతో కృషిఫలం
తప్పని విధ్వంసంతో పాటు అవసర నిర్మాణం జరిగేను
స్థితిలో కమనీయత ఉపయోగిత, రెండూ కోరే
ఎప్పటికపుడు మలిన రహిత క్షాళనం జరిగేను

పల్లె నుండి నగరానికి ఆలోచనలో ప్రజలు
సుఖవంతం భాగ్యవశం కావాలనే బ్రతుకులు

బ్రతుకులో ఏర్పడే శూన్యం మానవంతో నింపాలని
మనిషిలో పరిపూర్ణత కోసం ఆరాటం తనలో
లోన వెలిగే దీపం పుష్పమొ ఫలమొ కాదు, అవసర రూపం
సమాజ శాంతి కోసం చీకటిని వరించడం దోషం

40. క్షాళనం

సూరుణ్ణీ చంద్రుణ్ని మస్తిష్కంలో నింపాలని ఒకరు
తనలో ఆశాలోకం పరివర్తన దిశగా వాస్తవ రేఖలపై
భుజాలపై కనిపించని బరువు అనుభవంలో జీవన కారణమై
చీకటిలో దారులెన్ని ఉన్నా కనిపించని సమయం సంకుచితమై

ప్రతిక్షణం ఉత్సాహంతో ధైర్యం వహించవలసి వస్తుంది
తలదూరని చూడరాని చేయరాని పనులకలవాటు పడితే
సమాజ నిర్మాణానికి ఆటంకం, గ్రాఫ్‌లో పతనం కావడం
స్వచ్ఛత సుందరత దార్శనికత మనిషి అస్తిత్వం పెంచేను

మనసులో చీకటికి వీలులేని స్వయం ప్రకాశంతో
మానవ మస్తిష్కంలో ఒక ప్రయోగం కావచ్చు
బుజాలపై నుండి బరువు తరం నుండి తరానికి
అందుతుంది మనిషిని త్రిప్పుతుంది ఆశా జగత్తులో

చీకటి గుహనుండి బయటి వెలుగులోకి
ఊరు నుండి నగరానికి జీవన ప్రయోజనాలతో సాగేను
పైనుండి క్రిందికి దిగి సాగే జలపాతంలా
జీవిత మెప్పటికీ ఒక పురోగమన చేతనతోనే

ఏ ఒక పక్షమో నిర్దిష్టం కాదు కవిత
కోరినా కోరకపోయినా అతీతమైన కాలంతో
ప్రకృతి దృశ్యంలో భాగమై వ్యక్తిత్వం
సమాజ పరిణామంలో కొత్తగా మారేను

జరిగే కాలంలో శూన్యతను నింపేది మానవం
మనిషిలో పూర్ణతను పొందడం సులభం కాదు
ఉదయ కళతో సూర్యుడు ఉత్తేజ పరచేను
ఉల్లాస కళతో చంద్రుడు ఆహ్లాద పరచేను

పంచ భూతాలలో దేని నెవరు ఆపలేరు
పూర్వం ధర్మం పేరుతో ఇప్పుడు మానవం
పాలనలో అధికారంలో సుందర వాస్తవమై
బ్రతుకుల్ని ప్రకాశవంతం చేసే కృతిలో
మనిషి జీవితం ఎప్పటికపుడు క్షాళనమవుతూ

41. రివాల్వర్ - చిచ్చుబుడ్డి

ముందుకు సాగే నడకలో పద పదాన
నేలపై దాని స్థానం నిశ్చయమవుతుంది
ఇందులో ఎవరి ప్రమేయమూ ఉండదు
అభిలాషలో సంకల్ప ప్రభావంతోనే పయనం

ఇల్లు గడప దాటి బయటికి వెళ్ళిన మనిషి
తిరిగి ఇంటిలోకి వచ్చేనని పరివారం నిరీక్షణం
అనుభవ నిలయం ఒక సుందర వాస్తవం
చుట్టూ పక్షులవలె తిరిగే కల్పనల కవకాశంలో

పిట్ట గూడు కావచ్చు గుడిసో పాకో ఏదయినా కావచ్చు
భవనం కావచ్చు, పరిరక్షణలో క్షేమ కరంగా
మనుషుల పై రూపం ఒకటే! దేహ నిర్మితం
ముఖం కనులు చేతులు కాళ్ళు హృదయం మేధతో
ఊహలతో చేష్టలతో పయనంలో గమ్యం వేరు వేరుగా
ఇవియే మనుషులలో భిన్నతతో వైవిధ్యం చూపేను
మనిషి నుండి మనిషిని గుర్తించేదీ వీటి చేతనే
నిన్నను మన్నిస్తూ నేటిని అవలంబించేరు బ్రతుకులో

గాలి స్పృశిస్తూ పోతుంది కొత్త మిత్రంలా
ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడమే దీని పని
ప్రతి కవిలో స్వంతమైన సృజన ప్రపంచం
అభినవ రమణీయ మయిన కవిత కూడ ఇదే మోస్తరు

రోజూ చూచే చెట్టు మూల మదే
కొమ్మలు ఆకులు పూలు పండ్లతో
శిశిరంలో ఆకు రాలి, గ్రీష్మంలో ఎండిపోయి
మేఘంకై ఎదురు చూచేను ఉన్ముఖ స్థితిలో
చినుకుకయి ఎదురు చూచి చూచి
భూమిపై బాష్పకణం జారి ఆర్ద్రమయ్యేనా?

కోలాహల ప్రపంచంలో ఒకరి జేబులో రివాల్వర్
మరొకరి మనస్సు మిన్నంటిన వెలుగులతో చిచ్చుబుడ్డి

చలిలో వెచ్చదనం తాపంలో చల్లదనం కవితలో
అక్షర సమాహితమై పదపదాన అశ్వరింఖ ధ్వనించేను

42. మేఘం ప్రతిబింబం

అక్షర రూపం కవితకు మనోజ్ఞమైన విశాల వేదిక
ప్రగతికై నవ యానంలో ఎదురు చూచే దెందరో
అలజడిలో కవిత నవ నవమై ఈ సందర్భంలో
ఎడారిలో తల ఎత్తిన పచ్చని మొక్కను తలపించేను

అలలవలె ముందుకు వచ్చే ప్రశ్నలకు
జవాబుకు వరసగా చెలియలి కట్టయే
సమర దృశ్యం నుండి దృష్టి అనుభవంతో
ఇరుపక్షాలు 'శాంతి' ఒప్పందానికి తరలేను

నిన్న గుణవంత మనుకున్న విషయం
నేడు దోష మయమవడం విచిత్రం
సమాజాన్ని బింబించే అక్షర ముకురం
వర్తమాన చరిత్ర గతి సూచిక కవిత్వం

అదే మనసు అదే సమాజం తర తరానికీ
మార్పులతో సమూహాల మధ్య ఎడం పెరిగేను
గుణ దోషాలకు దూరంగా అంతరంగం
ప్రక్కనున్న కొండను చూచి ఏ నది భయపడదు

రవి చంద్రుల్ని తన బుజాలపై నిడుకొనీ
తలపై చీకటితో, కాలం పయనిస్తుంది ఆగదు
ఇది అర్థం కాని ప్రపంచం కాదు
సార్థక మయ్యే వాస్తవానుభవ నిలయం

మనిషిలో మనిషి పరిచయం స్నేహం మధ్య
విభేదాలు సహజమై చరిత్ర పుటలు పెరిగేను

ఉదయం బయటికి రాగానే రవి కిరణం
ప్రతి మనిషికి తన పని ముట్టును చేతులకందిస్తుంది

మనిషికి నిరీక్షణ మొక శిక్షా భేదం కాకూడదు
నదిలో నావలా కాలంతో జీవిత పయనం సహజం

అశాంతిలో కవిత ! వాస్తవ చిత్రమై, ఆ సమయంలో
అక్షర దర్పణంలో రావలసిన మేఘం ప్రతిఫలించేను

43. ఈనాటి స్థితి

కవితలో శబ్దం విరిసిన పూవు వలెనో
మెరసే మణి వలెనో నిప్పు కణం వలెనో
వర్తమాన స్థితులలో ఎపుడేది ఎదురయ్యేదీ
ఎవరి కేమి జరిగేది ముందుగ తెలియ దెవరికీ

శబ్దం నుండి నాదం ప్రియంగా బహు ఇష్టంగా
గాలిలో అమరుతుంది తేలుతూ శ్రావ్యంగా
శ్వాసలో ప్రాణానికి శభ్రమైన గాలి అవసరం
బ్రతుకులో ఆయువుకు స్వచ్ఛమైన స్థితి ముఖ్యం

బాధించే గుణంలో పాటు అగ్నికి
ఉపయోగపడే సూక్ష్మ తత్వమూ ఉంది
గాలికై వెదక నక్కర లేదు ఎవరూ
నీటికై చూచే అవసరం కలగవచ్చు

వర్తమాన గమనంలో విషమత లెన్నో
ఇవి వికారమైన మనస్సు పర్యవసానాలు
అన్నీ ఎప్పటికీ ఉండేవే ! ఇప్పటికీ
శాఖోపశాఖలుగా విస్తరించి చూపట్టేను

అడుగడుగున కష్టం నష్టం బాధ వేదనలో
తప్పనివీ వీడనివీ అధిగమించడమే కర్తవ్యం
మిన్న కుండ ఉండడం బాధ్యతను మరవడమే
చుట్టూ ప్రకృతి సంపదలో కావలసినవెన్ని ఉన్నా
మనుషుల చలనంతోనే సమాజానికి అస్తితలో వైవిధ్యం
సందేహం భ్రమలకు తావు లేదు, సంకల్పానికి పెద్ద పీట

అందరిలో ఉంటుంది అంతశ్చేతన మేల్కొనీ
క్రియలో ప్రగతికి దీనికి ప్రేరణ మవసరం
బాధల పొట్లాలతో వేదన మంటలతో
ఎదురు పడేరు మనుషులు ఎదుర్కొనే స్థితులలో

శ్వాసకు శుభ్రమైన గాలి, బ్రతుకులో స్వచ్ఛమైన నడవడి
ప్రజాస్వామ్య దార్శనికానికి చేతనతో నవ సమాజ మవసరం

ఆలయ శిఖరంపై సాయం వేళ వరసగా కూర్చున్న పక్షులు
రెపరెపలాడే రెక్కలతో రావాలసిన శాంతిని గుర్తుకు తెచ్చేను

44. చీకటిపై దృష్టి

ఈ కాలంలో రాజకీయమంటే, ప్రభ్రష్ట జగం
జ్వాలా చలనంతో దేని కయిన తెగించేరు, తలపడేరు
అంటించిన బొగ్గు కుప్పల వలె నిప్పుల చర్యలు
దిబ్బల వలె పైకెగరే బూది వలె జీవన రేఖల

ఈ సందర్భంలో కట్టెల అవసర మేమిటి?
అంటే ! చలి కాచుకొనేందుకని సమాధానం
ఈ మాత్రం దానికేనా! నరికేది గొడ్డలితో
అంటే ఇవి యజ్ఞ శాలకని కవి సమాధానం

అగ్గి పుల్ల గీసి నిశ్చలంగా నిర్భయంగా ఘన కార్యంలా
సిగరెట్ అంటించు కొనే వారు లేకపోలేదు
అరణి నుండి అగ్ని సవనం సందర్భంలో పవిత్రమయ్యేనా?
పశ్చాత్తాపంతో పరిహారంగా పుణ్యవంత మయ్యేనా?
మేధ నుండి అగ్ని కోపంలో తాపంతో వాయు పథంలో
బ్రతుకుల క్రియ రూపాలెన్నో చేతికందే దిశలలో

ఏదో ఒక నచ్చిన పనిలో మనసుకు విరామ మెక్కడిది?
అక్షర ప్రపంచంలో ఏదో ఒక లౌకిక తంత్రంలో పెద్దలు
కవితకు సరిపడే మోతాదులో లౌకిక వ్యవహార జగం
ప్రాణాలు నిలిపే గాలిలో నిర్మలంగా శుభ్రంగా ఉండాలనీ

తుపాను రావచ్చు ఎదురు పడి నిలిచే దెవరు?
కరుణ జలాలతో ముఖాలు ప్లావితమయ్యేను
వరదల వేగంలో తీవ్రతల్ని ఎవరు ఆపగలరు?
ప్రకృతితో సమాజం తమ ఉనికిని చాటేను

నడతలో అడుగులు పడేను భూమి తలంపై
చింతనలో మస్తకం గగనంలో తిరిగెను దివికై
లోనుండి బయటికి బయట నుండి లోనికి
వ్యక్తిలో స్వేచ్ఛ ఇపుడు సమాజ నవ సంబంధంతో

కాలం ఎవరికీ ఆటంకంగా పరిణమించదు
సంస్కరణం పరివర్తనలో వాహనమవుతుంది
మనసులో వెలిగే ఆంతర దీపం స్వేచ్ఛగా
చీకటిపై దృష్టి పెట్టడం సహజం అనివార్యం

45. శూన్యంలో స్వర్గం - నరకం

స్వర్గాన్ని పొంది పుణ్యం తరిగి, తిరిగి భూమికి వచ్చిన వారులేరు
నరకాన్ని చేరి అనుభవ కథలతో, మరలి వచ్చినవారెవరు? లేరు
భూమిపై బాగా ఉంటే స్వర్గ శకలమా? లేంది నరకమా?
కల్పనలో మనిషికి ఆశా ప్రపంచం, అరచేతిలో సుందర వనం

భ్రమలో మనసుకు కోరిక మీరిన స్థితిలో బ్రతికేరు
పురా సమాజం నుండి విప్లవ దశ వరకూ ఇదే మోస్తురు
స్పృశించేరు కవితలుగా చిత్రాలుగ శిల్పాలుగ మారేను ఎవరి ఇష్టం వారిది
అధికారం ప్రభుత స్నేహం వైరం రణం శాంతి జీవన చలనంలో
అవసరాలలో తూణీరం నుండి బాణాల్లా వెడలేను!, ఇదొక ప్రపంచం
కవిత గురించి ఎవరో అడిగితే నిఘంటువును ముందు పెట్టి
కావలసిన పదాల నేరుకోమనేరా? నచ్చిన రూపాన్ని నిర్మించుకోమనేరా!

కళ్ళముందు అక్షర గతిలో కవితలు
పలు రంగులలో మదిలో పూల వనంలా
దరిద్రా కృతిలో నరకం బాగా ఉంటేనో స్వర్గం
సమాజంలో వీటిని గురించి కథలెన్నో!
వివరణలు వ్యాఖ్యానాలు వాదాలు నమ్మకాలు
ఏదేశానికాదేశం ! ముక్కలుగా తమ ఆశా రూపాలు
ఎక్కడికక్కడ దూరదూరం చెదరిన స్థితుల్ని
ఒక చోట చేర్చిన ఆకర్షణ రూపంలో చరిత్ర

ఒక నాటికి ఎవరికినీ జవాబులు దొరకని ప్రశ్నలు
ఎప్పటికిని పూర్తి అవని పజిల్ ముఖాలతో బ్రతుకులు
ఊహలు చర్యలు రెండూ కలిసిన దార్శనికం
ఫలవంతం కావడమొక ప్రజాస్వామ్య విజయం
అరచేతుల రేఖలతో వ్యూహ రచన; కనిపిస్తూనే
అంకెలు తరువాత చేర్చు కోవచ్చుననీ ముందుగ శూన్యంతో

స్వర్గం నరకం రెండూ శూన్యంలో బంధితమై
కావ్యంలోనయితే స్వేచ్ఛగ ప్రతి ఫలించేను

46. వెలుతురు చీకటికతీతంగా

మొదటి నుండి చివరి దాక వెలుతురు చీకటి కోణాలతో
ప్రకృతి భూమికలో సమాజ చలన వేదికపై మానస బింబాలతో
అతిథి పాత్ర నిర్వహించి మేఘం తన దారిన వెళ్ళిపోతుంది
రాకపోకల వాహనం తన మిత్రం గాలితో వెలుతురు చీకట్లలో

ఉన్న కాసేపటిలో ప్రకృతిలోని సృజన శక్తిని మేల్కొల్పుతుంది
మనిషిలో రాగాన్ని మెరపిస్తుంది, హృదిని నవ గీతం ధ్వనిస్తుంది
మనసులో అశాంతి అణగి ఆలోచన స్తిమిత పడుతుంది
మూత బడిన దిశల తలుపులు తెరవబడి ఆహ్వానం లభించేను

పోవలసిన దారులు కార్య కలాపాలకెదురు చూస్తూ ఒకటొకటీ
గగనానికెగసేను ఆశలొకొటొకటి అవనికి చేరేను ఉత్సాహంగా
గాలి మాట్లాడుతుంది కింద మనుషులతో పైని మబ్బులతో
ప్రతి ఒకరిలో హృదయ కమలం రేకులు విప్పారేను

మాట వెనక దాగిన నిజం నుండి పరిమళాలు గుబాళించేను
మనిషిలోని సంకల్పానికి మబ్బుల విధి నిర్వహణం కలిసేను
అనుభవ జగత్తులో నయితే, మనిషికి తెలియనివే ఎక్కువ
మతిలో కత్తి అంచు మెరవచ్చు, గతిలో నిప్పు రవ్వ లెదురు కావచ్చు

చీకటిని నామ రూపాలు లేకుండ చేయాలని ఉదయ కిరణం
ఇది జరిగేది కాదని మనిషి వెనక నున్న నీడ చెబుతుంది
ఇది దులిపేస్తే పోయేది కాదు, తోసేస్తే జారేది కాదు
దీని నుండి బయట పడిన వ్యక్తి, ఆయుధంగా మలచు కొనేను

గీసిన అగ్గిపుల్ల వెలుగుకు చీకటి వ్యధ అంతరించదు
ఎక్కడో సన్నని వెలుగు జాడ పట్టుకొని మనసు నావహిస్తుంది

ఆ చీకటి ఈ వెలుతురుల కతీతంగా మనిషి మనస్సు
తన అధికత చూపేను ప్రజాస్వామ్య చింతనలో
ధన బలం అంగబలం మనో బలంతోనే
ఏ స్వామ్య మయినా ఏ వాదమయినా ఏ దార్శనిక మయినా

మనిషిలో పగలు రాత్రి వెన్నెల చీకటి
పరిమిత స్వేచ్ఛలో చెట్టు తన ఇష్టంగా
కొన్ని హద్దులలో జీవితం సమాజ బంధంతో
దీపం తన అస్తితకై చీకటి కోసం ఎదురు చూచేను

స్వేచ్ఛా కవిత్వం - 120

తెలియని వాస్తవం

మాదిరాజు రంగారావు

2022

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

120 SWECCHA KAVITHVAM

TELIYANI VASTHAVAM

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Year of Publication 2022

Presented to
my wife
Smt. Indira
on her Birth Day

పీఠిక

స్వేచ్ఛా కవిత్వంలో 120వది **"తెలియని వాస్తవం"** ఉదయం వార్తా పత్రికల్ని చూచే దృష్టికి వచ్చే కొన్ని కొన్ని సంగతులు ప్రేరణగా వచ్చినవి. వీటిలో రాజకీయ, సామాజిక, వైయుక్తిక ఇంకా జీవితంలో ఇతర క్షేత్రాలకు చెందిన విషయాలు, వీటి వెనక నుండి పని చేశాయి. అప్పటికపుడు ఒక్కొక్క రోజున ఒక్కొక అంశానికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. అయితే ఇందలో కవితా రూపాన్ని పొందేప్పుడు మాత్రం గుప్తంగా ఉండే విధంగా పైకి అచ్ఛాదనంతో ఆవిష్కృత మయినాయి.

కేవలం ఉన్న విషయం ఉన్నట్లుగా వ్రాయడం బదులుగా వ్యక్తి – సమాజం– అవసరాలు – విలువలు – అనుభవాలు – ఆలోచనలు చారిత్రక కళా దార్శనిక దృష్టికోణాల్లో వెలువడినాయి. లేకపోతే కేవలం వార్తను పత్రికలోంచి తీసి అందించినట్లవుతుంది. ఈ పద్ధతి కవిత్వానికే మాత్రం పనికి వచ్చేది కాదు.

అందువల్ల ఏదో ఒక విధంగా తనకు నచ్చిన పద్ధతిలో కవి మనసులో విత్తును తరువుగా మార్చవలసి ఉంటుంది. తప్పదు. అపుడే కళాత్మకత సిద్ధిస్తుంది. ఆధునిక కవిత్వం గురించి సమాలోచనంలో పరిశీలనం ఇంకా విరివిగా జరగవలసి ఉంది. కవిత్వం వలన ప్రయోజనం ఏమిటో రచన విన్నాక, చదివాకనే వివేచన కందుతుంది. లేంది ఇవి చేతిలో కొయ్య ముక్కలే ! బొమ్మలతో కవి ఆడుకోవలసిందే

"స్వేచ్ఛా కవిత్వం" ఈ పథంలో "దార్శినిక మేదయినా, విశ్వాసాలేవయినా ప్రగతి శక్తులకు కనీసం సూచనగా, హితవుగా ఉండవలసిన స్థితిని తలపిస్తూంది. కవిత్వం ఎన్నో అంశాలతో అనుగుణంగా అనితరంగా అభినవంగా అనుభవానికి రావడం ముఖ్యం. ఇది మరచిపోతే దారి తప్పినట్లే. ఇది స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. ప్రజాస్వామ్య సామ్యవాదం దార్శనిక చేతనతో సృజనకు వికాస రూపమిస్తుంది. స్వేచ్ఛా కవిత్వం బహు ముఖాలలో పలు అంశాల సమాకలనంలో భిన్నమైంది. ప్రత్యేకతల్ని కలిగింది. తనదైన దార్శనిక, నైతిక, సామాజిక, వైయుక్తిక, కళాత్మకమైన విలువలతో విశిష్టమైనది. మానవీయ భావనా హృదయంతో వర్తిస్తుంది. నా దృష్టిలో ఈ మహాకృతి 120 భాగాలతో స్వేచ్ఛా కవిత్వం ప్రక్రియలో, వ్యక్తి – సమాజం – ప్రకృతి – ప్రపంచం గురించి విశేష విషయ భావనతో సంపన్నమయింది. ఇతిహాస కావ్య (సమాజ వికాస పరంపరతో) మనో భూమికలలో నిర్వహింపబడింది, కళాత్మకమైంది.

ప్రతి సాహిత్య విమర్శకు సంబంధించిన సమస్యల పట్ల నిష్కర్షగా వివేచనతో కూడిన ఆలోచన కనిపిస్తుంది. పూర్వ పరంపరలో భాగాలయిన సాంస్కృతిక తేజాన్ని గౌరవిస్తుంది. దీనిచేత కవిత్వంలో వస్తువు విపులతను పొందుతూంది, విషయం బహుముఖీనతను నిలుపుకుంటుంది. ప్రజాస్వామ్య దార్శనికతను కలిగింది, అభినవ దృష్టికి అవకాశం లభిస్తుంది. ప్రజాస్వామ్య సామ్యవాద హృదయవశమయింది.

ఉగాది 2-4-2022 **– మాదిరాజు రంగారావు**

1. శ్రమ యానంలో

ఇంటి ముందు వసారాలో ఊగే
వేలాడే పంజరానికి రెక్కలు అమర్చి
యంత్రమయంలో ఉన్న పక్షికి
గగన మంతా తనదే ఆధిపత్యం ! అనుకునేను

అనుకోని అదృష్టం ! చేతి కందినట్లవుతుంది
చూపులో దిశా వలయాన్ని చుట్టేను
తన ప్రభుతకు ఆటంకం లేదనుకునేను
ఒంటరిగా నయినా పయనానికి సిద్ధం

ప్రకృతి పై విజయ కాంక్ష మనిషిలో
ఇప్పటిదా? వికాస దశలు పెరిగే కొద్దీ
మనసుకు ఉత్సవనంలో ఆనందమెంతో
అందులో వేగంగా గమ్యం చేరే సుఖయానంలో

విమానమొక అనుభవ సుందర వాస్తవం
శూన్యమనుకునే నింగిలో హేతు బలంతో
గ్రహాల మధ్య భ్రమణంలో ఒకటొకటీ
అతీతాన్ని తెలుసుకునే చర్యలు ! ఎప్పటికీ

చూడనిది చూడాలని, అందనిది అందాలని
యత్నంలో విజ్ఞానం నిశితమైన పరీక్షలో

ఊహలోని దివి కొత్తగా చూపు చివర వేలాడేనా?
స్పందనలో కవి హృదయం కవితాకృతి పొందేనా?

అపుడపుడు గగనంలో నీల మేఘం కదలుతుంది
భూమిపై మనిషి! పచ్చదనంతో ఫల సంపదకై
ఎదురు చూచేను ! జీవితాని కవసరమైనవి
ఇది వ్యక్తి నుండి సమాజానికి చేరడం ! విశిష్టం

శ్రమ చరిత్రలో ఆలోచన ఆచరణం సమతూకంలో
బ్రతుకు తూన్న వాస్తవ గతికి భిన్నమైన లోకం
ఇది మానవ గాథలతో శ్రమ జీవన యానం
ఎంత కాలమయినా దూరమైనా యత్నం జరుగుతూనే

2. ఆయుధం అనుకోకుండా

బ్రతుకు మూట నేల పైకి విసరి వేసినట్లు
చెదరిన ఆశా రూపాలు ! మనిషి ఆలోచనలో
కల్పనల్ని వదలి వాస్తవ దృశ్యాలను చూపేను
ఇవి చీకటి శకలాలుగ మారేనా?
బొమ్మలుగా ! మనిషిలో వేదిక చేరేనా?
సమాజ సంపదయై ఉదయం విలువలు పెరిగేను

ఊహలో కొత్త జగం నిరంతరం అనుభవ రూపాలతో
ఆలోచన చే అన్వేషణతో సంకలనం ! ప్రతి మనసులో
కవుల దృష్టి కోణంలో సమాజ సమస్యలొకటొకటీ
మరొకరికి కనిపించని విషమ జాలంతో విశ్వమయమై

ప్రఫుల్ల భావ గణంతో సృజన బయట పడేను
అంతరంగ ప్రకాశంతో జీవన వనం ఎదిగేను
ప్రజాస్వామ్య పీఠం నుండి పాలన సమాజావసరం
మానవ హిత లక్ష్యంతో పొందే పరివర్తన స్థితులతో

సమాజ ధారా ధునియై కవిత ! అర్థత కవకాశం కలిగేను
జన జీవన చలనంలో భాగమై అందరిదీ అవుతుంది
గోడకు తగిలించిన ఇష్టమైన ఆదర్శానికి ప్రతినిధి
రూపం పూల దండ చే అలంకృతమై కనిపించేను
పక్కనుండి వాలుగ ఆయుధం ! రూపాన్ని స్పృశించేను
రెండూ మానస భౌతిక స్థాయిల్లో మనిషి అవసరాలై
అస్తితలో మానవం ఎత్తులు పెంచేను, పైకి
సరికొత్త ప్రకారాలతో సమాజాన్ని మార్చలనీ
ఎందరిలోనో సంరంభం! విపణిలా ప్రతి వ్యవహారం
జేబులోనో బ్యాగ్‌లోనో బంగరు నాణెం ఒకటే కాదు
జీవన చలనంలో అవసరానికి విలువలతో మానవం

అమావాస్య చీకటి ముక్కల వలె అనుమానాలు
మనిషి మనిషికీ మధ్య ప్రేలేను ఆయుధం అనుకోకుండా

3. ప్రకృతి - సమాజం

శిలలెన్నో చుట్టు ! మౌనంగా నిశ్చలంగా కఠినంగా
ఇవి ద్రవ రూపం పొంది జలాలై సరించే దెపుడు?
హిమ శిల లయితే కిరణ స్పర్శతో కొంత ఆశ
కాకపోతే ! శిల్ప మూర్తులై కళా ఖండాలయ్యేను

జలధిలో పొంగి తరలే అలలను అడ్డుకునే
స్థిర సంకల్పంతో ఏండ్లుగా ఉన్నవి ప్రకృతిలో భాగమై
తుపానులో అలలు గట్టు దాటే దృశ్యం క్వాచిత్కం
ఇది సమాజ స్థితికి వార్నింగ్ కూడా అవుతుంది.

జలధి హోరు ఘోషతో పేద గుండె ధ్వనించేను
నిరోధింప జాలని విషమ సమస్య! ఉత్క్రమించేనా?
క్లిష్టమైన బ్రతుకులో విషాద ప్రభావం! ముంచేసేనా?
ఇది స్పందనలో పలికే కవి హృదయానికి తెలుస్తుంది

పగలు రాత్రి భేదం లేదు విరామ మసలు లేదు
ఒడ్డున ఉన్న ఏ వస్తువు తోనూ నిమిత్తం లేదు
చెలియలి కట్టచే బంధిత మయినా, అలలు!
తుపాను చర్యలతో ఉద్యమం భయాంకిత. మవుతుంది

మనిషిలో శిలాత్వం పలు విధాలుగా ఇంకా నిలిచీ
బ్రతుకులో నదీత్వం ఎండిన ముఖవాలకంతో
ప్రకృతిలో మార్పుకు లోనయ్యే ప్రతి విషయం
సమాజంలో జీవన గతిలో ప్రతిబింబించేను

దేహానికి భూమిపై అడుగులు వేస్తూ నడవాలని
ఎపుడో అవసరాల్ని బట్టి వాహనాల వినియోగం
పయనించే మనిషి శిరసు గగనతలం తాకాలని
వైజ్ఞానిక మతిలో సాంకేతిక నైపుణితో పరిశోధన

ప్రకృతిలో తుఫాను బ్రతుకులో అరాజక శబ్దంతో
సమాజ సన్నివేశంలో బీభత్స దృశ్యాన్ని చూపేను
జీవన గతిలో అపుడపుడూ తప్పని సంక్షోభం
ప్రకృతిలో తుపాను ప్రభావాన్ని తలపించేను

4. అదృష్ట రేఖ

ప్రకృతి దృశ్యంలో నది, మానవతా రాగం వినిపిస్తుంది
అలలను ముందుకు నడిపించేను గాలి అవిరాళంగా
శిలల కలలు కంటూనే ఉంటాయి
ఝరులు రస పథం చూపిస్తూంటాయి

చెట్ల వలె బ్రతుకులు భాగ్య దశను చేరేను
ఇపుడు అడవికీ సమాజానికీ భేదం తరుగుతూంది

గగనంలో ఎదిరి విహరించలేదనే చింత లేదు
మనుషుల కిపుడు చేకూరిన విమాన యాన గతిలో

చీకటిలో స్వర ధుని హృదయాన్ని అలరిస్తుంది
బాధలలో సానుభూతి స్పందనల్ని నింపుతుంది

నిశి చీకటి కరగి ఉదయం వెలుతురుగా మారి
లోకానికి మేలు చేసే, ఆలోచనతో
శుభ్రమైన మనో రూపంతో మనుషులు సిద్ధంగా
దేనినయినా ఎదుర్కొనే నైతిక బలహృదయంతో

భూమి అయితే వాహనమై, నింగి అయితే విమానమై
జలధి అయితే నావ అయి దుర్గమాన్ని దాటేను మనిషి
ఒంటరిగా వచ్చినా వ్యక్తి, బ్రతుకులో ఎప్పటికీ
చుట్టు ప్రకృతి భూమికతో ప్రాణుల చలన దృశ్యంతో

జారిన భాష్ప కణంతో తేజో రేఖ
కవితలో అనుభూతి కిరణాన్ని వదలేను

శాసించే ఆధిపత్య బలంలో ప్రభువులాగ సూర్యుడు
కవితను రాగ రంజితమైన ప్రకాశంతో నింపేను
అతీతమైన ఊహలకు ఆలవాలమయ్యేను
మెరుపుతోనో వెన్నెలతోనో రవిచంద్రుల కళలతోనో!

భౌతికం మానసం ప్రకారాలతో అతీత స్పృహ
బయటికి సూచితం కావచ్చు, ప్రకటితం చేయవచ్చు
హేతువు నతిక్రమించి దివి ఖండం, మదిలో దిగేను
భాగ్య రాశిగా ఆకర్షించేను బ్రతుకులో అదృష్ణ రేఖను

5. పయనంలో

పరివర్తనలో సమాజాన్ని తల క్రిందులు చేసే ఉద్యమాలు
జన పదం నుండి నగరంలోకి స్థావరాల్ని చేరేను
నింగిలో మానవ శ్రేయంకై బయలు దేరిన ఆదర్శం
అనల భావ జాలంతో స్తబ్ధతను పోగొట్టాలనీ!

జన పదాలు వదలి చెట్లపై కొమ్మల చాటున
గుట్టల మాటున పొదల వెనక రణ చతురులు
ఇంత వరకు సాధించిన సంస్కృతి ఏమయ్యేను?
అవసరమైనవి మారు వేషాలలో అన్నీ పట్నం భూమికలో

విప్లవం జేబులో అద్దంలా పని చేయదు
తన ముఖం మాత్రమే అందంగా కనిపించాలనీ
ఏ రెండు ముఖాలు ఒకే విధం కావు ఎన్నటికీ
క్షణ క్షణం ఆచి తూచి అడుగులు వేయిస్తుంది, అనుమానం

సమాజ సంక్షోభం కుదుట పడటం
చిన్న పిల్లల్ని లాలించి నట్లు కాదు

తొట్రు పాటులో రాగాన్ని సరిదిద్దే యోచన
తడుముకొనే మాటలో లయ తీర్చే యత్నం
హఠాత్తుగా విషాదం అలము కున్న పరిసరాలలో
మనుషులు గంతులు వేసేరా? సంతోషపడేరా?
సానుకూల శత్రుభావ రంగుల రేఖలలో
కనబడే ముఖాల్ని గుర్తించడమంత సులభం కాదు

స్వేచ్ఛకు గుడ్‌బై చెప్పే ఉద్యమ రూపం
ఎన్ని విధాలయినా మారవచ్చు! నడవడిలో
ఉదగ్ర చర్యలతో ఒక మజిలీ తర్వాత మరో మజిలీ
చేరేందుకు సిద్ధంగా ఉండాలి, ఎంత కష్టమయినా
ఈ ఉద్యమ మంటేనే కష్టాల రాళ్ళ గుట్టలదారులలో
దారితప్పే గమ్యంతో అడవికి బ్రతుకులు అర్పణం
ఈ విద్య పరిశోధన విజ్ఞానం ఉదార చరిత్రలు
ఎవరి కోసం ? దారి తప్పకుండా మనుషుల బ్రతుకుల కోసం

6. సాధ్యం

కొత్త చరిత్రను సృజించ గల మనిషి చర్యలు
ఉన్న చరిత్రను ధ్వంసం చేసేను సమరంలో

ఎవరి బ్రతుకు మరొకరి బ్రతుకుకు బదులు కాదు
కాలం అందరికీ ఒకటే మనుషులు వేరు! పనులు వేరు
విప్పారిన పద్మంలా మనిషి ముఖం విజయంలో
ముడుచుకున్న రేకులతో మనిషి బ్రతుకు ! ఓటమిలో
జీర్ణ, శీర్ణ శిథిలాలలో వెదకవలసిందే సమాజంలో
తన కిష్టమైనదేదో నష్టమైంది! తెలియని స్థితిలో
నిరంతరం సాగేది మానవ యానం ఆగదు
ఎంత కాలమయినా ఎంత దూరమైనా ఉన్నది భద్రతలో

అమావాస్య మనో రూపంతో జరిగిన కాలం భయదం
జ్ఞప్తికి రావచ్చు; ముక్కలు ముక్కలుగా వెన్నెలయై
ఏ జీవితమూ ఆ ఒక్కరికే మితం కాదు
ఇతరుల అనుభవ ముద్రలతో సంబంధం తోనే సాగేను

ఉదయం మొదటి కిరణంతో చకితంగా
రాత్రి చీకటి సమస్య తీరేనని ఆశ
ప్రతి మనిషిలో తాను ఉన్న సమయ దిశను మరచి
సంశయ ప్రాకారాల మధ్యనుండి స్వేచ్ఛను కోరేను

ఒకరికి చీకటి తమ అవసరానికి కాపాడే కవచం
ఏ రహస్య గుహలోనొ ఏ కనిపించని పేటిలోనొ
గుప్తంగా ఉన్నది బయట పడేనని చింతనలో మనసు
జీవన చలనంలో దోషానికి అండను కోరే వారూ

మౌనంలో శిల తన శిల్పంకై కథను కల్పనలో
కవికి వినిపిస్తుంది, ఎవరు వినినా వినకపోయినా
మండే జ్వాలతో కరచాలనం చేయాలిసి రావచ్చు
అందుకే కురిసే మేఘంతో పయనం కోరికలో ముఖ్యం
ఈ కోరిక తీరడమొక అతీతమైన విషయం
వ్యక్తి రక్తి నుండి సమాజ శక్తిలోకి పరివర్తనతో సాధ్యం

7. కాస్త దూరంలో

ఈ సమయం కావలసింది ఆదిపత్యం కాదు
అనుకుంటే చాలు! శిఖరంలా పొడుచుక వస్తుంది
ధూలి క్రమ్మి పొగలు ఎగసి మంచు కురిసి
చాటు చాటు నుండి మబ్బుల్లో రవిలా కనిపించేను

మేలు చేసే వెన్నో పాతవి ఇప్పటికి ఉపయోగంలో
అంతరాత్మ మేల్కొని ఉంటే కనిపించే వెన్నో ఉంటాయి
భూమితో ముడివడి సమస్య ఎప్పటికీ
దేశం రాజ్యం జీవన సంస్కృతి నిర్మాణంలో

భూమిని వదలి సమస్యలేని చోటులేదు
కాలం అద్దంలా తన ముఖాన్ని బింబించదు

ప్రభుత ధనం అధికారంతో గడచిన బ్రతుకులు
జైలు పాలయి బేల్ నుండి విడుదలై వీధులలో
కుండీలో ఎదిగే మొక్కను తలపించేను
హుండీలో నయితే ఇబ్బడి అయ్యేనని ఆశకూడా

ఆశలు సాధించే యత్నంలో మనిషి చర్య
నైతిక ప్రకాశంతో దారి తప్పదనే
ప్రతి రుతువు స్వాగతం పలుకుతుంది
ఉన్న స్థితిని సరిదిద్దుకునే పనిలో మనిషి

చిన్నతనం నుండి పెద్దతనం దాక బ్రతుకులో
సాగిన చరిత్ర ముక్కనొకటి అంటించుకొని
రెపరెపలాడాలని మనిషిలో ఆయువు కోరిక
ధరిత్రి పై విశాలమతి సహృదయతను పొందేను

అనుభవంలో అక్షరం కవితయై నదిస్తుంది
కవితలో ఆర్ద్రత సృజన శక్తికి జీవమిస్తుంది
ప్రకటన నిరసన ఉద్యమ కవితలెన్ని విధాలో
విప్లవ చరణాలతో ధ్వనించే కళాకృతులెన్నో
సమయ సమయం కలాన్ని పట్టుకొనే పయనంలో
ఎప్పటికీ కావలసిన అమూల్యాలు! బెత్తెడు దూరంలో

8. పగలు రాత్రి

సమయ సమయం క్షణాలలో చెట్టు నీడ మారేను
చిన్నగనొ, పెద్దగనో ! కాలం చూపే ప్రభావంతో
సరసిలో నిలచిన ఓడలవలె నీడలు
పయనానికి సిద్ధమైన మనిషిని తీసుకపోయేదెవరు
తాననుకునేది అయితే తృప్తిగా
లేకపోతే నిరాశా మయమైన చీకటి ఎదురుగా

మిత్రత శత్రుత ఇష్టం అనిష్టం లాభం నష్టంతో
విపణి వీధులలో తిప్పుతుంది ధనం! మనిషి మనసును
సమస్య పరిష్కారానికి వేదిక అంతరంగమొకటే !
ఇదొకటి ఉన్నదని తెలిసే దెందరికి
తెలిసినా ఖాతరు చేసేవారెందరు?
ఆరోహణలో సుగమత కోరేవారైనా సరే

తనలో మరొకరు ఉన్న సంగతి తెలుపుతుంది అంతరంగం
భేదం తెలిసేది హేతువు కోరేదీ అన్ని పరీక్షలతోనే సాధ్యం
ఆరోజు పనులు ముగించుకొని విరామణంలో
కొత్త ముడులతో బయటికి వచ్చే పాత్రలెన్నో

జీవన రహస్య నిలయ కవాటాలు తెరవబడుతూనే
అంతలో మహానిద్ర ముంచుకొని రావచ్చు
జలధి అలలపై పయనం మొదలువుతంది
వెలుతురు చీకటి క్షణాలపై గట్టుకు చేరాలనీ

గట్టుకు చేరే లోపల మెలకువలో లోకం
పలు రంగులతో రేఖలతో చిత్ర నిలయమై

వస్తూ పోయే మనుషులు వర్తనలు అవే ప్రవృత్తులవే
చీకటి వెన్నెల కథలతో కాలం గడపాలని కోరిక

ఉదయ ప్రకాశంతో మెలకువలో
తనవంతు పనులలో బ్రతుకును పరుగెత్తిస్తూ
పగలు వికాస లోకం చూపులో నిలబడితే
రాత్రి బూది రిబ్బలుగా కనబడేను సర్వం

9. నిజం కావడం

ప్రతిభతో కూడుకున్న కళాత్మకం రమణీయం
కవిత! వివిధ స్థాయిలలో వ్యక్తుల నుండి
సమాజ చలనంలో జీవ వంతమయిన విజయం
దీని మూలం ఎప్పటిదో ప్రాచీనం ప్రకృతి అనుబంధం

మనిషిలో వికాస రూపం చేతనతో
జన సమూహాల జీవన స్థాయిలతో నిండినదీ

శ్రమ బంధువు మాట పాట కళాత్మక రుచితో
విరామ వేళలలో మనసును రంజింపచేసేను
శ్రమ క్రమంలో దేహానికి సత్త్వం చేకూర్చేను
భౌతిక మానసిక ముఖాలతో వ్యక్తిత్వం సమకూరేను

కవితలో జీవన కోణాలెన్నో తరతమ భేదం లేకుండా
కవిలో అన్ని సమస్యలూ పరిష్కార యోగ్యత కలవే
వందల ఏండ్లుగా ప్రజల మౌఖిక పరంపరలో
సాగేను మాట, పాట ఈ జీవన తీరం అంచులలో

అరణ్యంలో నడుస్తూ ఉంటే ప్రక్కనున్న చెట్లు దాటుతూ
అవి తమతో నడుస్తూ ఉన్నట్లే ఉంటుంది సస్నేహంగా
ఈ బ్రతుకులలో అడవులు పెనవేసుకొనీ కనిపించేను
వెనక నుండి శిలలు కనిపెడుతూనే ఉంటాయి

దూరం చూస్తే పైకెదిగిన మేడలు వరసగా
ఆకాశం బుజాన చేయి వేసి నిల్చినట్లు ఉంటుంది
ఎండకు భయపడని వానకు ధైర్యం చెదరని
చలికి చలించని హృదయం వసంతానికి దగ్గరగా
దృశ్య పరంపర మార్పులతో రుతువు వెనక రుతువు క్రమంలో
మనిషికి పాఠాలు నేర్పేను, జీవన వాస్తవ తలాన తిప్పేను

ఆలోచన వేరవుతుంది, ఫలితం మరొకటి వస్తుంది
ధన బలానికి ప్రాధాన్యం ఇప్పటిదా? ఎప్పటిదో!
సమాజ వికాసంలో వివిధ దశలు మనుషులపై
ప్రభావ మొక సుందర కల్పనయై నిజం కావడం విశేషం

10. ఏది నిజ రూపం

ఈ లోకంలోకి ఆగమనమెంత విశేషమో
ఈ లోకం నుండి నిష్క్రమణమంత ప్రత్యేకం
ఈ రెండు కొసల మధ్య వ్యక్తి జీవితం
శాఖోపశాఖలుగా ప్రకృతి ప్రభావాలతో సమాజ బంధాలతో

సామాన్యం నుండి విశిష్టందాక పయనం
ఈ మధ్య ఆయువు కాలంలో అస్తితలో తన వ్యక్తిత్వం
ఇది వికాస విజయ కళలతో ప్రకాశ గుణ రూపం
ఎక్కడి కక్కడ పరిమితులతో యశోభావ బింబం

అనుమానాలు సన్మానాలు నిరాశలు ఓటములు
స్వాదుత కటుతలు తన కోసమె అన్నట్లుగా
అన్నిటినీ అధిగమించి శత మానంలో ఒకరు
చేసేదెంతో ఉన్నా! కుంచితమైపోయేను మధ్యలో

చుట్టలు, చుట్టుకొనీ స్వార్థ వలయ కోణాలతో
మట్టి నుండి మొలకెత్తే వాస్తవాన్ని మరచేను
మనిషిలో వ్యవహార జగత్తు ఎంత పెద్దదో?
కేంద్రంగా ధనం, సంపద సంచయ విజయం

ఈ భూమిపై బ్రతుకునకు కావలసినవి అన్నీ దొరుకుతాయి
అనుభవ కళలో మనిషి వాస్తవ రూపం నిలబడుతుంది

మనసులో శ్రమ చేతన స్వప్న సదృశం కారాదు
అది సంధ్యా వేదికపై జ్వాలా రూపంగా తోచవచ్చు
అది బాధా గగనంలో హ్లాద కరం మేఘం అవచ్చు
శ్రమ జీవన శక్తి ప్రకటనం లేంది సమాజం లేదు

ఏమి చేసినా తన ఆనవాలు పూర్తిగ దొరకదు
ఏది మిగిలినా అది తన ప్రాతినిధ్యం వహించదు
ఒకే విధంగా మొదలైన రోజు పోను పోను మార్పులెన్ని విధాలో?
రణం అనివార్యమయి పట్టిన పిడికిలిలో మట్టి నుండి
ఆశ మొలకెత్తవచ్చు! పూలు పూయవచ్చు, ఖడ్గం చూపవచ్చు
ఇది నిజ జీవన రూపమని చెప్పగలదేది? ఎవరు? ఎప్పుడు?

11. చతురతలో

ఉదయం ఒంటరిగా వాకింగ్‌లో ఉన్న వ్యక్తిలో కవి
కనిపించే ఇష్టమైన వస్తువులతో మాట్లాడుతూ పోయేను
కల్పన లోనివి మదిలో కవితలుగా అడుగులు పడేను
పవన వీచి అంతలో అమృత క్షణాల్ని తీసుకపోయేను

జలధి తీరం చేరిన ఆశా మతికి తన ముందు
తరలి వచ్చే అలలు ! నిరంతరాయంగా రస పథంలో
ఇవి ఆగాక పయనం సాగించ వచ్చునని కొందరు
ఇది సాధు గుణానికి చిహ్నంగా తలచేరు కొందరు

రేపటికి తగ్గవచ్చుని "ఆపైన పయనం" అనకునేరు
రోజులు గడచేను ఆగనివై ఏ రోజున నిరీక్షణలో
ఎవరి కేది అవసరమో? తెలియని చేతన ప్రపంచం
అన్నీ తెలిసినట్లు ప్రకాశించడం కవిత్వ విలసనం

లోకంలో పరిచయం లేని వెన్నో! ఎదురుగా వస్తువులు
కవితలో కవి అనుభవ సుందరతను శబ్దించేను

ఈ చివర నుండి ఆ చివర వరకు పరచబడిన
వస్తు చయంతో కవిలో సూపర్ మార్కెట్ సృజన నిలయం
ఎవరి కవసర మైనవి వారికి అందుబాటులో ఉండేను
కొరత లేని సమాజం ! కోర్కెలు తీరే అవకాశాలతో

బ్రతుకులో బయట పడని కోర్కెలవలె
సాయం వాకింగ్‌లో వెలుగుల నిష్క్రమణంతో
బాధా దృశ్యంతో జారే కన్నీటి చుక్క నిప్పు కణమై ఎగిరేను
ఈ లోపల గాలి వీచి తన వెంట తీసుకపోయేను

వెలుగుల నిష్క్రమణంతో వాస్తవం మరుగున బడేను
రాత్రి ప్రాణ రక్షణకు నియతమైన ఆయుధం
మరొకరి ప్రాణం తీసేదయి వ్యధాయభరం కావచ్చు

తలుపులు మూసినా సందు చేసుకొని కిరణంలా
కవి హృదయం చేరుతుంది కవిత కళామయమై
గాయపరచే కారణాలెన్నో! తప్పుకునే దారులన్ని! చతురతలో

12. యోచనలో కవితయై

ఎవరు కోరినా కోరక పోయినా అవసరంలో
లభించేవి ప్రకృతిలో సరిపడగా ఎన్నో ఎప్పటికీ
సహజంగా జీవన కారణాలు శ్రేయో రూపాలు
ఉన్న భూమిపై గాలి వెలుగు నీరు సృజన నవం

శ్రమ జీవన సంకేతాలతో జీవిత మంతా
మనిషి బ్రతుకు భాగ్య శ్రేణులుగా మారేను

ఒక సమయంలో మూసిన పిడికిలిలో ఎదురవుతుంది
డబ్బు ఉండవచ్చు స్వర్ణం ఉండవచ్చు క్షేత్రం ఉండవచ్చు
ఆశ పెంచవచ్చు విశ్వాసం నిలపవచ్చు
శూన్య నిలయంలా చకిత పరచవచ్చు

ఆదేశం ఉపదేశం సూచనతో అలరించవచ్చు
నిరసన ప్రతి ఘటనలతో హెచ్చరికలు ఉండవచ్చు
జలధి అదే ! ఎదురు చూసే మేఘమదే చినుకులవే
అనుబంధంతో సమాజ శక్తిని పెంపొదిస్తూంది

తోట వనం క్షేత్రం పచ్చని బయలుతో
వ్యూహ రచన రాజ నీతి విజయాశయ లక్ష్యంతో
రావలసిన కావలసిన మొలకలు మొక్కలు తరువులతో
దేశదేశ సంచరణ శీలంతో మనుషులు జీవన పదకాలతో

భాగ్య రాసులుగా జీవన శక్తి సమూహాలవలె
కలహ సహన రణం శాంతి అవే! ప్రతి మెట్టుపై

ఎవరు కోరినా కోరకపోయినా సరిహద్దులు పరిమితులతో
మానుష జీవన సంచలనం ఎప్పటికప్పుడు విశాలమై
ఆహారం ఆరోగ్యం ఆయువు సంతోషం కోరే
మట్టిపై నడకతో మట్టిలేని మనసుతో మనోజ్ఞం

బహిర్ముఖ యానంలో భౌతిక జగత్తూ
అంతర్విధ పథకంలో మానస వికాసం
ఎప్పటికప్పుడు తీరం చేరే సంకల్పం ప్రయోజనం
ఎవరికి వారు యోచనలో కవితయై ప్రతిక్షణం

13. తెలిసిన కల్పన

అణు శకలం నుండి వస్తువు ప్రయోజనం వరకు
నిరంతరం అన్వేషణలో పరిశోధనలో ఫలితాల అంచనాలతో
విజ్ఞానం వెలుతురులో మనుషుల అస్తితలను కాపాడే
చింతనలో ఎవరికి వారు అన్ని క్షేత్రాలలో శ్రమ జీవనం

ఉదయం లేచింది మొదలు పడుకునే వరకూ
వృత్తిలో ప్రవృత్తిలో అపాయాలు దాటాలని నీడల పడవలపై
రాత్రి వెన్నెల దుస్తులతో చీకటి బొమ్మలు వరసగా
రోజూ చీకటి ముసుగులలో వెలుతురు శిల్పాలు

మనిషిలో తారాడే కోరికలెన్నో ఉంటాయి
అన్నిటినీ చేరాలనుకోవడం పూర్తిగా జరగనిది
ఇది ఎక్కడ బడితే అక్కడ పొందేవికావు
ఇవి ఎప్పుడు బడితే అప్పుడు దొరకేవి కావు

తీరాలిసిన ఆశలు కుప్పలుగా మనో నిలయంలో
ఇవి దాచడ మొక పెద్ద ప్రయత్నం
జేబులో అద్దం తీసి ముఖం చూచుకునేరు
ఎన్ని వెలుగులు ! నీడలు ! కొలువు తీరి ఉన్నదీ

విరిసిన పూల దండలా కన్పించే ముఖంలో
ఉన్న మొగలి దళాలు దాచేస్తే దాగేవి కావు
ఎక్కడున్నా గుప్పున పరిమళ రేఖలతో
మనిషి మనసు నాకర్షించే ముళ్ళ పట్టలు

ముందుకు పడిన అడుగు వెనక్కి పడదు
ఎంత దూరమయినా సాగవలసిందే
కాలం ఎప్పటికీ ప్రగతి పథంలో వాహనమై
ఎవరికి నచ్చింది వారు ఎన్నుకొని సాగేరు

మూసిన పిడికిలిలో కవిత! ఏ రూపంలో ఉండేది
తెలిస్తే కావలసిందేముంది, తెరిస్తేనే తెలిసేది
పుష్పమై విరిసేదీ, తూటాయే దూసేదీ
ఎవరి నలంకరించేదీ ఎవరికి తగిలేదీ

ఎవరి మనసు పూల తోటగా మారేదీ
ఎవరి ఊహ, ఆయుధాన్ని వహించేది తెలియని వాస్తవం

14. దిశ దిశలో వర్తమానం

వర్తమానం మౌన శిలా ఘన రూపం వహించలేదు
జలధి ఘోషలతో ప్రవాహం అలలతో కదలే ఆకులతో
మాట్లాడుతుంది చిన్న పిల్లల వలె కదలే మబ్బులతో
గతిలో విశ్వ వ్యాప్త చలనంలో ఉదార హృదయంతో

శిశువు గళ స్వనం నుండి వృద్ధ గుండె చప్పుడు దాకా
ప్రాణ రవం స్వరం నుండి ఆర్త రావ చక్రం వరకు
జన సమూహం! కోలాహల సంరంభంలో శబ్ద చిత్రమై
ఎక్కడి కక్కడ ముక్కలుగా అవసరాల మేర శ్రవణీయమై

ఆరోహణ పరివర్తనలో శబ్దం మనుషుల్ని కలుపుతూ
సమస్య చింతన దిశలో ఆలోచన ప్రతిధ్వనిస్తుంది
వెనుక గతం ముందు భవిత, మధ్య వర్తమానం!
పూచిన పూల తీగెవలె వీటిని కలుపుతుంది సస్నేహంగా

ఇది మానవ చరిత్రకు ఆకరమైంది జీవవంతమైంది
కొందరికి నిశ్శబ్ద మంటే ఎక్కడలేని భయం తెలియకుండనే
ఒంటరి తనంలో జరుగరాని దేదో జరిగేనని మదిలో
చూపులో శూన్యాన్ని రేఖా చిత్రాలతో నింపుతుంది
సాక్ష్యం లేదని తెలియదని చేద తాడులా ఊహ
సృజనలో మనసును సుందర పూల వనంలా మారుస్తుంది

ఎక్కడ నుండో ధ్వని తరంగం వచ్చి స్పృశిస్తుంది ప్రేమగా
ఇది మిగిలిన కథను బయటకు తీయవచ్చు
ఈ సమయం ఆకాశం నాద లహరులతో
ధైర్యం ఇస్తుంది పయనంలో మనిషిని నిలబెడుతుంది!

పులి అయినా స్వేచ్ఛలో జీవన భద్రత అవసరం
లేడి అయినా స్వేచ్ఛలో ప్రాణానికి రక్షణ అవసరం
వ్యక్తి స్వేచ్ఛను స్వాగతిస్తుంది ప్రజాస్వామ్యం
పాలనలో అందరికీ జీవన న్యాయం అవసరం

నాల్గు దిశల అన్నిటికీ అందం గంధంతో వాతావరణం అవసరం
కవితలో కళతో అంతరంగం శబ్దిస్తుంది రసమయమై

15. నిరంతర కాలాన్ని అతిక్రమిస్తూ

ప్రతి అక్షరం శబ్ద గతం భావ మయం
సహన శాంత ప్రేమ క్రోధ శత్రు భయ ధైర్యాలతో
ఇది తాత్కాలికం, బహువిధ కోణాలలో మారుతూ
కాలం గడిచే కొద్దీ కవితలో జీవన క్షేత్రం పెరిగేను

ఎచ్చటనో నున్న వ్యక్తి బహు దూరంలో మరో రాజ్యంపై
దేశంపై విజయంకై గిరులు నదులు దేశాలు దాటి
పరుగులు తీసేను ధన సంపద యశో విభవంకై
అనుభవ సీమలలో అందరూ ఒకటే మనోజగంలో

స్థలం ఏదీ ఇంకా లేనట్లుగా, ఎంత ఉన్నా సరిపోదు
ఇంకా ఏదో కావలని చిన్న మెత్తు తేడా లేదు, సహించేది లేదు

చీకటిలో అద్దం ఏమి చూపిస్తుంది
తెల్లవారి అద్దంలో పరచబడిన వెలుతురులో ముఖాలు
ప్రకృతితో పాటు బ్రతుకులో భాగమయి పోతుంది
గంధం చెక్క పెట్టెలో జ్ఞాపకాలు ఎప్పటివో

చీకటికి బదులు నీడలు ఒకటొకటీ పేరుకొనీ
కాలం ప్రవాహకత ఆగినట్లుగా అనిపించేను
మనిషిలో మరోవైపు ప్రయోజన రూపాన్ని చూపేను
ఎప్పటికీ అందరికీ అవసరమైంది, 'నిజం'
కవితలో గుప్తంగా అంతరంగ ప్రకాశ రేఖతో
బయట పడేను మనిషిలో ప్రపంచాన్ని విప్పారగ చేసేను

మనిషికీ మనిషీకి మధ్య ఎడం తగ్గి, పోను పోను
స్వేచ్ఛలో స్నేహ బంధంతో, విపుల ప్రజా స్వామ్య భావన

మనసుకూ మనసుకూ మధ్య పచ్చదనం పెరిగి పెరిగి
సృజన కళలు వనీ సుమ ఫలాలలను బయటకు చూపెట్టేను.

ఒక జ్ఞాపకం నుండి మరో జ్ఞాపకం మొలకెత్తేను
ఇది విశ్వ శక్తిలోని అపూర్వ ప్రపంచం, నీదీ నాదీ

చీకట్లకు "నిజం" భయపడదు, తరగదు ఆగదు
కాలాన్ని అతిక్రమిస్తూ నిరంతరం ఉదయ రాగం వినిపించేను

16. వ్యక్తి నుండి సమాజం దాక

నగరంలో ఎన్ని ఏండ్లు ఉన్నా ఏయే మూలలు తిరిగినా
ఎంత మంది పరిచయాలు స్నేహాలు లభించినా మనిషిలో
పూర్వారణ్యం గుర్తులు మిగులుతాయి, పైకి వస్తాయి
మనసులో బ్రతుకులో వ్యక్తి ముద్రతో సమూహ గుణంతో

దేశ ద్రిమ్మరి నిలయం! చెట్టు నీడ, రైల్వేజంక్షన్ మరో మూల
తప్పని తీరులెన్ని విధాలో! పలు రీతులలో మనుషులు
మైలు రాయి నిరంతరం ! మనిషి బడలికను కొలుస్తుంది
బయటకన్న నగరంతోనే త్వరగా తెలిసేదీ వేగం పెరిగేదీ

తెరచిన కిటికీ నుండి చెట్టు! సరి అయిన మానవ రూపాన్ని
తొంగి తొంగి చూస్తుంది! పదే ఎండను సర్దుతుంది
అడ్డుగా ఉన్నవి అనుకున్న చెట్ల కొమ్మలు ! ఆకులు సర్దుతూ
వసంత కిరణ శోభను ముఖాలకు అద్దుతుంది తిన్నగా

ఇంటిముందు బయట గేటు ! ఇంచుమించు, సవినయంగా
అన్నిటిని మరచి స్వాగత వచనంతో పలకరిస్తుంది
బ్రతుకు బరువును మోసుకొనీ ఎక్కడివక్కడా చేర్చే
మనిషి ! దేనికయిన తెగించి సాహసం చూపేను

సంక్లిష్టమయిన స్థితుల నుండి ముందుకు జరుగుతూ
కాలం ! బ్రతుక్కి నిలయ చక్ర రూపమిస్తుంది
అరణ్యాన్ని మహా నగర రూపంలోకి సరిదిద్దడమొకటి
నగరాన్ని మానవతా పూర్ణమైనదిగా చేయడమొకటి

అరణ్యంలో నడుస్తూంటే కాలిబాధ! భయం పొర ఆవరిస్తుంది
మహా నగరంలో నడుస్తుంటే ధైర్య కవచం తొడిగినట్లు ఉంటుంది
భయమూ, ధైర్యం రెండూ ఎప్పటికీ అవసరాల కోర్కెల
మేరలలో, మనిషి వెనుక మరో మనిషి, తేజంతో నడుస్తూ

నిశ్శబ్దం రేకులు విప్పారితే గగన పద్మమవుతుంది
మనిషి వెనక మనిషి ఎవరి కిష్టమున్నా లేకపోయినా

తన వెనక తోడుగ నడుస్తుంటే మట్టిపై వాస్తవతలంపై
ఎవరికి ప్రీతికరం కాదు ? అరణ్యం నగరం రెండూ చెరొక వైపున

బ్రతుకులో బహువిధ పార్శ్వాలతో సంపన్నమై
జీవన భాగ్యాన్ని పూర్ణం చేసే యోజనలో క్రియలలో
వ్యక్తి నుండి సమాజం దాక నిరంతరం

17. అవసరాల మేరలలో

ఎప్పటినుండో ఇప్పటికీ అవసరాల మేరలలో ఉద్యమాలు
మనుషులలో కోరే మార్పులకు బలమైన సంకేతాలు
ఇది దార్శనిక నిబద్ధతతో చిట్ట చివరి అస్త్రం
విజయమయ్యేవెన్నో, విఫలమవుతూ వచ్చేవెన్నో అనుభవంలో

సంఘంలో సాధారణ మానవ స్వేచ్ఛ నుండి
దేశాల మనుషుల స్వతంత్రంలో జరిగేవీ
ఆ సమయం ఒకరిలో సాయం సంధ్య తలపుకు రావచ్చు
ఆ రోజున విషమ చక్ర ధ్వనిలో చరమ స్వనం కావచ్చు

నిశితమైన తీవ్రమైన మార్పుకై అలజడి సమాజంలో
శాంతి రేఖ చెదరవచ్చు అలజడి ప్లవించవచ్చు
ప్రతి పేరుది మనసులో అంతో ఇంతో విశ్లేషణలో ఈహలు
ఉద్యమంతో పట్టిక సిద్ధంగా ఉంటుంది ప్రతి మదిలో

సాకారం పొందేందుకు ఉద్యమానికి క్రియాశక్తి అవసరం
వ్యక్తిలో చుట్టలుగా ఉన్నవి ఉత్సాహం విప్పారగ చేసేను
లోన మనో భూమికలో పయనం సాగుతుంది
కలాంతరాన చరిత్ర పుటలలో శాఖోపశాఖలుగా పెరిగేను
సామాజిక రాజకీయ కళా దార్శనికాలెన్ని విధాలో
బ్రతుకులో అపూర్వం అవశ్యం, తలుపులు తెరుస్తుంది

అవసరాలలో ఉద్యమం ఆదర్శానికి ఆచరణం చూపుతుంది
ఇది నిరంతర చలనశీల సంఘ శక్తికి బంధువు
దీనికొక కాల నియతి లేదు, మనుషుల ఎన్నిక లేదు
చిన్న కారణం ఉత్సాహం రెక్కలు విప్పారగ చేసేను

ఏదీ ఆగదు ప్రయోజనంలో మగ్నమైంది సాధించేదాకా
ఆగినట్లనిపించవచ్చు, అంతలో మరొకటి అందుకోవచ్చు

సామాజిక సాంస్కృతిక సాహిత్య కళా విజ్ఞానమయం
లౌకిక ప్రయోజనాల నుండి దార్శనిక లక్ష్యాల వరకు
జీవన వాస్తవ తలంపై భంగం వాటిల్ల కూడదనే
యోజనలో అవరోధాలెన్నో మలుపులెన్ని తిరిగేనో

విభేదాలు కలహాలు ఒకటొకటీ తీర్చబడుతూ
అన్నిటినీ కలుపుకొని ఎవరి జీవన పయనం వారిది.

18. ఆశలు అందరివీ

వ్యక్తిలో స్వేచ్ఛా జగత్తు సీమల పెరిగేను
క్రియాచరణానికి జీవన క్షేత్రం మారేను
స్వతంత్ర మయిన వ్యక్తి స్వేచ్ఛ కోరుతుంది
ఎక్కడి కక్కడ బాధ్యతలతో లక్ష్యంతో పరిమితులతో

ఆశా నవ తోరణాలతో వీధులు తీర్చబడేను
జీవన రూపానికి పార్శ్వాలెన్నో ! అన్ని ఉద్యమ ప్రతిధ్వనులు
చరిత్రలో మనిషి హృదయ స్పందనల్ని వినిపించేను
విజయం కోరే మనిషి ఉత్సాహ రూపం కనిపించేను

సాయం వేళకు చల్ల బడే సరికి
పగలు ఎండలకు వాడిన ముఖాలతో గడ్డి పోచలు
భాగ్యానికి చాలా దూరంగా దరిద్రాకృతికి దగ్గరగా
మనిషిలో పచ్చని ఆలోచనకు పురి కొల్పేను

వాలిపోయిన గడ్డి పోచలకు తమ కథలు
మరొకరి చెప్పాలని ఉబలాటం ఊగుతూ
ప్రకృతిలో సృజన విలయ కలయికతో రూపాలు
మనిషిలోని అనివార్య ప్రభావాల్ని సూచన చేసేను

మంచు బిందువు తాకి ప్రాణం లేచి వచ్చినట్లయి
ఒక్కొక్క రాయి శిఖారాలతో తలనుపైకి ఎత్తేను
చూచే కొద్దీ లోయలో చెరువులో తలపించవచ్చు
చీకటిలో గుప్తంగా వెన్నెలలో అస్పుటంగా రాత్రులు

నీలి మబ్బు నుండి నీరు క్రిందికి దిగి నదియై
భూమిపై పాటగ మారుతుంది, పట్టరాని సంతోషంతో
వాలు వెంట పరుగెత్తే హృదయం మనిషి పోలినదై
నీటి పాయలవలె ఆలోచనలు రసమయమొనర్చేను

దీనికెన్ని అడ్డంకులో ప్రగతిని శంకింపజేస్తూ
బ్రతుకులో విలువలపై విశ్వాసంతో జీవన యానం

ఎప్పటికప్పుడు జలధారలో ప్రమాదం జరగకపోదు
దీన్ని సరి చేసుకొనే సామర్థ్యంతో మనిషి ముందుకే
ఇంతవరకు సాగింది, మునుముందు సాగేది
సమాజగతిలో ఆశలు అందరివీ, ఆశయాలు ఎందరివో

19. జ్వాలా తోరణమై

ఈ కాలాన ఉద్యమం నిరసన ప్రతిఘటన విభేదాలతో
ఆయుధం! పలు స్థాయిలలో విప్లవ జ్వాలా తోరణం
ఏమైనా సమాజ జీవన రేఖలకు భంగం రాకుండా
శాంతి చరణాలపై విజయంకై విలువలతో పోరాటం

ఆశా శిఖరాలపై వెలుతురు పతాక రెపరెపలాడుతూ
మనిషికి తన ఉన్నత గమ్యం సూచిస్తుంది
మనిషి యశో రూపానికి దారులు విప్పారే
స్నేహ సుందర దృశ్యంకై ఆరాటంలో చిక్కులు

దూరాన పలుపుకు కట్టేసిన దూడల్లా
యువత దేశ భూమి వైపు చూస్తూ
ఎప్పటికపుడు కొత్తది చేయి కందేను
శ్రమ కేతనంతో మనిషి ముందుకు నడచేను

మనిషి చూపు వైపే మబ్బులలో మెరుపులు
భూమిపై చినుకులకు క్రొత్త సృజన కోరుతూ

ఎవరేమి మాటలాడేది? కొందరికి అక్కరలేదు
మనిషి మౌనంగా తన పనిలో చక్ర భ్రమణంలో
బలం ఉన్నచోట భాగ్య రాశి సంచయంకై
ఎప్పటికపుడు చీకటి రాత్రిని చూచినట్లు ఉంటుంది

ఎవరికి వారు ఒంటరిగా కోట గోడలలో
తన అధికారాన్ని నిలుపు కోవడంలో గడపేను

నాలుక నృత్యం చేస్తే సరిపోదు, చిత్ర విచిత్రంగా
రాజనీతి చతురతతో కాలం! క్షేమంగా నడవాలని
ప్రతి మనిషిలో శిఖలతో చీలిన వృక్ష శాఖల అస్తిత
పూవు కోసం ఫలం కోసం అయినా మరెన్నిటిపైనో పరోక్షంగా

సంపదలో భాగంగా ఎదురు చూచేను మనిషి
ఉద్యమానికుపకరించే విషయాలను ఎన్నైనా
ఒక హిత కార్యచరణంతో సమాజ శ్రేయంకై
నిఖిల మానవ భావ సూత్రం మనసును బంధిస్తుంది

20. దూరం కావచ్చు

ప్రతి రుతువు ప్రభావం అంతో ఇంతో బ్రతుకుల్ని
రూపంతో పాటు అంతశ్శక్తిని తీర్చి దిద్దేను మనిషిలో

తమ బాధలు మరొకరికి చెప్పాలని దారిలో గాలులు
ఈ జలధి ! వలకు వశం కాదని తెలుసు! అయినా యత్నం జరిగేను

ఒడ్డుపై నిల్చొని చూస్తే ఆశ్చర్యంతో పాటు భయం
భూమిపై దృశ్యం మారుతుంది వర్షంచే జలాలతో

పది మందితో సమాజం గాలికి కదిలే అలలచే
అలసిపోయి లక్ష్యంలో సొక్కుతూ సొలుతూ

సమయ సమయ మొక శబ్ద లహరి వినిపిస్తుంది
మనిషి మనిషిలో కొత్త జగం చూపిస్తుంది
మబ్బు నుండి నీరు నదియై ప్రవహించడం సహజం
శ్రమ నుండి వికాస రూపం విప్పారడం జరుగుతుంది

చిన్నదొ పెద్దదో ఉద్యమం దేనికయినా
అంకిత భావంతో ఆగని శ్రమ చక్రం తిరిగేను
పది మందితో సమాజం సరికొత్త పుటలతో
గాలికి కదలే అలలు కలిసినంత సులభంగా

అందరికీ చెందిన ప్రపంచం చుట్టూ తప్పదు
సందర్భం మారితే మళ్ళీ బ్రతుకు స్థాయిలలో మార్పులు

తన లోతును చూపాలనీ, తన విపులత పెరగాలనీ
ఆర్భమైన లహరుల పని ఇదే ! ఉద్యమ గమనంలో
కవిలో మానవ రూపం తెరచాటునుండి పనిచేసేను
ఈ రూపాలను బ్రతుకు తెరపైన నీడలలో చూపాలని కోరిక

ఎదుట ఘోర విపత్తులో దిగిన సమాజం
శక్తి ఉన్నది లేచి నిలబడుతుంది, నలుగురిలో
బ్రతుకు పైర్ బోర్డు ముఖంతో ఎదురుకాదు
దీని కోసం ఎంత ఆలోచన ! అన్వేషణ జరిగేనో?

మబ్బు నుండి నీరు కోరేరు నది నుండి పాటనూ
ఆలోచనలో మనిషి కోరేను ఉద్యమ తరఫున పూచీ

తుపాను సృజించవచ్చు శిశిరానికి పెద్ద పీట లభించవచ్చు
మనిషిలో వసంత శోభను దూరం చేయవచ్చు ఉద్యమం

21. పాత్రలు మారుతూ

ఎంత పదును తేలితే అంత సహనంతో పనిచేస్తుంది
కత్తి! దీని బదులు ఆయుధ మేదయినా! ఉద్యమంలో
ఆలోచన రక్త రేఖలతో చిత్రాన్ని దింపవచ్చు
నిర్హేతుక మైన అనుభవ పరంపరల్ని పొందవచ్చు

జరప తలచిన, హత్య ఆగినా ఆగవచ్చు
గాయాలతో అలంకరింప బడవచ్చు
కోపానికో తాపానికో శాపానికో దారి తీయవచ్చు
ఆ క్షణం అధిగమిస్తే భద్రంగా అంతా ఒకే

నాలుకపై శబ్దం పూవై జార వచ్చు
చల్లని గీతం ఎదను స్పృశించవచ్చు
వెచ్చని మంటను ప్రదర్శించవచ్చు
శబ్దానికి శక్తి బహు విస్తారం దిశలదాకా

రాగంలో వేదనలో గుండె లయ తప్పే మాట నిజం
అయితేనేం వేరొక విధాన్ని పట్టుకుంటుంది, కదలుతుంది

ఒక ఊరు ఒక వ్యక్తి ఒక అనుభవ ముద్ర
మనస్సులోన నిలుస్తుంది అచంచలంగా ఎప్పటికీ
మాటి మాటికీ మనస్సు పైపైకి వస్తూ తారాడుతుంది
ఇది మాటలో కవిత అవుతుంది, పాట కావచ్చు

మెలకువ హద్దులలో బ్రతుకులు
కలలను వదలుతాయి! నిద్రా జలధి ఒడ్డున
కలలో చెట్లు నడుస్తున్న దృశ్యం
మనిషి చుట్టూ మనుషులు వివిధ కార్య కలాపాలలో
స్మృతిలో సృజన రూపం! వెడలుతుంది! ఆర్ద్రంగా

తరం నుండి తరానికి చేరుతుంది, శబ్దం
వేళ్ళు పాతుకొనీ అపుడపుడు పూలు పండ్లు అందించేను

ప్రతి పూవులో ఏదో తన కథ చెప్పాలని
ప్రతి కవితలో ఏదో ఒక వ్యధ చూపేను
ప్రతి మనిషిలో ఏదో ఒక విజయ గాధ
ఎప్పటికీ అదే ! పాత్రలు మారుతూ, లక్ష్యం ఒకటే!

22. విజయ సాధనం

మనిషికి కల ఎంత సహజమో!
మనుషుల కోర్కెలంత వాస్తవం

దార్శనికం భవిష్యత్తు రెండూ
చెరొక వైపు నుండి పగలు రాత్రిలా
కలను వాస్తవాన్ని స్వంతం చేస్తాయి
మదిలో కొత్త ఆలోచనల్ని దించుతాయి

పగలు అనల కీలా చిత్రాలతో
రాత్రి ధూమ రేఖా వల్లికలతో
ఉన్న వస్తువు పెంపు కోసం
లేని వస్తువు పొందడంకై
మనిషి చేసే శ్రమ జీవన ప్రయాణం
భౌతిక మానస మిశ్రమ జీవన చిహ్నం

ప్రతిదీ శూన్యంతో ముడిపెట్టి నిరాకరణ దృష్టితో
బ్రతికితే! జీవితానికి లక్ష్యం లభించేదెపుడు?

లోయల్ని దాటి కొండల్ని ఎక్కి గాలి
వార్తను అవతలికి చేరవేస్తుంది
ఉత్సాహం ఉద్వేగం, ఉత్తేజం ఉద్రేకంతో
నాలుగు వైపుల నుండి ఉద్యమం రూపొందేను

జన హృదయంలో ఎప్పటకీ ఉండేది
రాజ్య విస్తరణ కాంక్ష, ప్రభుతను మీటుతూ
ఆకులు రాలే శిశిరాన్ని ఎవరు ప్రేమిస్తారు
నిప్పులేని చోట మంటల్ని చూపే గ్రీష్మం ఒకటే

పాలన చేసిన పీఠంపై ఏదో ఒక రోజున
కరుణించే దైవం కూర్చోవచ్చు ఏలవచ్చు

రుతువు నాశ్రయించని కాలం లేదు
నింగి నాశ్రయించని మబ్బులేదు
భూమి నాశ్రయించని మనిషిలేడు
నీడలేని పగలు స్వప్నంలోనే సాధ్యం

ఏ పని చేసేవారికి దానికి సంబంధించిన విషయం
ప్రాణ ప్రదం సముచిత విజయంకై సాధనం, ఉద్యమం

23. ఆలాగేనా

ఉదయ లిప్త వికసించిన గగన పద్మ శోభతో
జగతికి స్వాగతం పలికే సుందర సమయం
చూస్తూ ఉండగానే జ్వాలా రుణ రూపం వహించేను
సమాజ గతిలో మనిషిలో రావలసిన పరివర్తనం

వ్యక్తిలో మార్పు జీవ సహజ జీవన రూపం
కవితలో శబ్దం ఏ మనోజ్ఞ రూపమెత్తేదీ
ప్రవాహంలో ఏ పడవ ముందుకు వచ్చేదీ
ఎవరికీ ముందుగ తెలియని రహస్య ప్రకాశం

ఏ భావ జగానికి తీసుక వెళ్ళేదీ తెలియదు
నిశా ఖడ్గ ధార ఇంకా మిగిలి ఉండవచ్చు
అట్లా ఉంటేనే బ్రతుకులో నాటకీయం
కల్పన లేని సందర్భం అంతా ఆవేళకు జరిగేది

కాల వాహనంపై అందరివీ జీవన రూపాలు
పయనించే వాహనం? ఏదో ? రెండు కాళ్ళ పైనో
అడుగు పడని చోట లభించవచ్చు సాగవచ్చు
కాలానికి వాహక వాహన రూపాల్లో అన్నిటి పైన ప్రీతి

ఏ పక్షం వహించదు, వాహన సౌకర్యం అందరిదీ
తమ స్వంతం చేసుకొనే కోరికతో స్వార్థపరులు
ధనం బలం పేరు ప్రతిష్ఠ అధికారం అన్నిటినీ
ఉపయోగంలో వెనుకాడని విచిత్ర జీవన హేతువులు

వినోద వికాస చలనంలో సహకరించే విపరీత మనస్కులు
సంస్కృతి శిఖరాలపై అడుగులు వేస్తూ సమాజం గడచేను
బాధల్ని ముక్కలు చేసి దూరం విసరేయలేరు
వాటి నుండి మొలకలు తమ ముఖాలు చూపలేవు

దారిన పోయే వారి మాటలు వారి పాటలు
సానుభూతి అలలపై కదలి పోయే పడవలు చేక్కలు

విశాల గగనం హృదయంపై చంద్రబింబం పెరుగుతూ
శిశువు వలె మనిషి ఎప్పటికీ ఇంతేనా? అమాయకంగా

24. నీడలో దాచుకొని

చెట్టు వేరులో గుప్తమైన విధాలనేకంతో మానవం
మట్టి నుండి ఆ దేశం జీవన రూపం పోతలతో ప్రత్యేకం
కాలం చక్రంతో పాటు తిరిగేను మానవ శ్రమ రూపం
ఒక సుందర కల్పన మనసులో భద్ర పరచుకొనీ

తన పనిలో దేశంలో జన హృదయం స్పందనతో
తరతరాల గమనంలో గుప్తమైన తీరులతో
కాల చక్ర భ్రమణంలో అంచుల్ని వదలని ధృతితో
వ్యక్తి పరిమితుల నుండి విశాల తరమైన విశ్వ స్పృహతో

ప్రవహించే నదిని చూడగనే కాలం గుర్తుకు వస్తుంది
వీచే గాలులను తలచగనే ప్రాణం ఊపిరి నిండేను
ఇవి సమాజ స్థాయిలో ఒకటొకటీ
వ్యక్తి దృష్టి పడని బాధ్యతను పైకి తీస్తాయి

సంతోషం పరితాపం పగలుకు ఇరువైపులలో
వాస్తవ కల్పన రేఖలతో బ్రతుకులు తీర్చేను
ముళ్ళు గుచ్చుకొనీ, సూదులు దిగినట్లే పయనంలో
బయటి విషయం కథలో బహు జటిల మవుతూంది
బాధా రహితమైన శాంత సమాజంకై
ప్రతి వ్యక్తిలో తనదైన విశిష్టమైన ఆలోచనతో
ఉదయం నుండి సాయం వరకు కాలం ఎప్పటికీ
కోటలు భగ్నం కావచ్చు రాజరికం దగ్ధం అవచ్చు

ఎదురుగా మనిషి మరో మనిషి ముందు శత్రువయినా
ఎత్తిన జన్మ ! కరవాలంతో నిలిచి ఉండదు

ఉద్యమ శక్తికి ముందు వీధిలో ఉద్యమ ప్రభావమొకటొకటీ
పెరెడ్ జరుగుతుంది ఉత్సాహదీప్తిని నిలుపుతుంది

నీడ తన వెనకనే రావడ మెవరికిష్టం
దీనిని రక్షణగా మిత్రంగా తొడుగుగా తలచేరు

ఎప్పుడు కను మరుగయ్యేదీ తెలియని స్థితిలో
కథలోని తృప్తి రేఖ 'గుప్త' పేటిలాగా దాగీ

25. దారి దారికీ ప్రకాశం

అనల స్పర్శ అగ్ని స్పృహ ఏ పనికయినా అవసరం
ఒకే ఒక చిట్ట చివరి ఊపిరి అనల నృత్యం
భూమిపై ఉదార వేదికపై ఉద్వేగ పూర్ణ చరణాలలో
గ్రీష్మాన్ని వేరుగ సాధించడమంత సులభం కాదు

గగనంలో అణువణువు తెలంగాణ ప్రతిధ్వనులు
పిడికిలి దెబ్బలకన్న చతురమైన నిర్వహణ రీతులు
రుద్ర వీణ తీగెలు కదలి శత్రు భయదమయ్యేను
తీగెలు మంటలుగా ఎగసి వ్యాపించే కన్నా ముందు
స్ఫులింగాలు, మెరపులు దశదశలో ఉత్సాహశక్తులు
మానవ పథంలో ముళ్ళవలె రాళ్ళ వలె అశాంతి

ఉదాత్త లక్ష్యానికి అవసరం ఒక రాజనీతి పద్ధతి
లేనిది కుటిలమై జటిలమై సమస్య విషమ మవుతుంది
ఇది రాజనీతి స్థాయిలో మానవతా బంధంలో
ఏ ఉద్యమానికి తీసి పోనిది శాంతి నీతిమయం

రాజ్యాంగం ప్రామాణికమై జనతను ఆదుకునేను
ప్రజాస్వామ్యం లక్ష్యంగా సమాజాన్ని తీర్చేను
చార్మినార్ వద్ద పావురాళ్ళ కలరవం
తెలంగాణ భవితకు ఆశావాహం చేసేను

సమత నవత రెండు భుజాలపై బరువులతో
రాష్ట్రం వివిధ కోణాల్లో ప్రయోజనం నినదిస్తుంది

హింస హత్య రాష్ట్రంలో ఎన్నటికీ తావులేదు
దీనికి నిదర్శనమే రాష్ట్రావతరణం "శాంతి" తెలంగాణ

పయనంలో విసరిన నిప్పు రవ్వలు రాళ్ళు
సుందరతను వదలి, కటుతను విషమతను చూపాలా?

ఎవరికల వారిది పరిమితమైన అనుభవంలో
అందరిలో వెలిగే మానసిక జ్యోతి ఒకటే

వేరు వేరు అవసరాలకు వేరు వేరు ప్రకారాలతో
దారి చూపుతుంది నైతిక భావనతో అలంకృతమై

26. మనిషి మనిషికీ

అభిమానం ఉత్సాహం ఉద్వేగం త్యాగం మానవం
కలిసిన ఒక విగ్రహం ! ఉద్యమ కారుల హృదిలో
ఇది ఒక మేఘమై ఉదార చరిత చూపవచ్చు
ఇది ఒక బింబమై చీకటి ముఖం తొలగవచ్చు

వ్యక్తిత్వం దిద్దే ఎవరి వర్ణ రేఖలు వారివి
లేనిది మరొకరికి వేలెత్తి చూపడం సహజం
రాష్ట్రం సాకారమై నేడు శాంతిని కోరే విజయ ముఖంతో
సంఘంలో ఉద్యమ చరిత్ర మనిషి విలువను ఎత్తి చూపుతుంది

సమన్వయం కోరే బడుగు ప్రజలు శాంతి సూత్రంపై
కార్యాన్ని సాధించే నిపుణత హర్షణీయమై ప్రజా స్వామ్యంలో
వేరు వేరు దారులలో పయనించే ప్రజలకు
రాష్ట్ర చరిత్రను ఒక ఆదర్శ జగత్తుగ మార్చేను

నిశ్శబ్దంలో స్తబ్దత ఎప్పటికి ఆమోదం కాదు
శబ్దంతో చేతనయై ఎప్పటికి బ్రతకవలసిందే

ఈ చివరి నుండి ఆ చివరి వరకు
ఉదయం నుండి సాయం సంధ్య మధ్య
చీకటి వెన్నెల హ్లాదకరం, స్నేహమయం
అవడం కాల పరీక్షను గెలవడమే

ఇంతవరకు మస్తిష్కాకాలలో ఆలోచనలు జరిగింది
ఇపుడు ప్రగతి పథంలో కొంత రూపం సాగింది

ఆశ నిరాశ రెండిటి మధ్య మనుషులలో
భేద భావం లేని సుందర జీవితం
ఇంతవరకు కలలను పాలించే కలలలో ఒకటొకటీ
ఇపుడు వస్తువుపై ప్రభుతను చూపేను

చిన్న చూచిన ప్రభాత కాంతుల మేళనం
ఈ రోజు కనిపించకపోవచ్చు
ఇది కవిత్వానికీ వర్తిస్తుంది సహజంగా
కవిత్వానికి గీటురాయి సమాజ శక్తికి ప్రతీకని గుర్తించడం

ఏ రోజు ప్రత్యేకత దానిదయినట్లే
బ్రతుకులోను మనిషి మనిషికీ భేదం

27. సమాజానిదే

బ్రతికేందుకు చుట్టూ పరచిన పచ్చని రసమయం
చేయరానివి చూపినట్లుగ అక్కడక్కడ ఎరుపు ఉదయం

అడుగు పడితే పాతాళానికన్నట్లు మనిషి అడుగుజాడలు
ఉండవచ్చు; ఆదర్శం వేరయితే లక్ష్యపథం వేరయితే
రాత్రి చీకటి నెవరు వరిస్తారు; ఏది ఉన్నా చేతిలో
దీపంతో మనిషి కొంతవరకు ముందుకు నడిచేను

ఎన్నిటినో మరపించే నిద్రకు వశమై
మనసు కనేది ! కలలు ! ఇంతకు మించినవి, స్వర్గ నరకాలు

చీకటిలో నడిచే మనిషి ! ఎదురుపడిన మనిషికి
దారి చూపగల మతి ప్రభతో నడవాలిసి ఉంది
మంచుకు మలినం అంటదు, వెంటనే
శుభ్రంగా బయటపడిన నీరుగా మారుతుంది

శిలా ఖండంవలె పడి ఉన్న మనిషిలో దాహం తీర్చేను
కట్టెముక్కవలె ఎండి పడి ఉన్న మనిషిలో ఆకలి తీర్చేను

ఉదయ రేఖలతో బయటికి వచ్చిన
ప్రతి మనసు వెనక మిత్రంలా రవి కిరణం
ఆ ప్రక్కనే చీకటి ముఖాలతో నీడలు
ఇంకా గెలవాలిసి ఉన్నవి ఎన్నో
రెండిటిని సమాధాన పరుస్తూ మనోరూపం
సమాజ రూపానికి సుస్థితి చేకూర్చేను

మనిషి హృదయం స్పందిస్తూ వినిపిస్తుంది
దీని కతీతంగా ప్రాణం ముఖ్య పాత్రలో
ఉన్న పొరల క్రిందనో ఎన్ని తెరల చాటునో
రవి కిరణం ! వీటికి ఉత్సాహకర తేజం

హృదయం దేనితోనూ పోల్చేది కాదు
సూక్ష్మ సూక్ష్మ స్పందనలో కొత్తలోకం చూపిస్తుంది
కవిత ఎన్ని ఎందరు చెప్పినా నామమాత్రం కవిచే
సమాజం నుండి సమాజానికి సమాజానిదే అవుతుంది కవిత!

28. ఎదుర్కోవడమే

కోపం తాపంతో ప్రేమ రాగంతో కరుణ హింసతో
స్పందనలో మనిషిలో తర తమ భేదాలు
కవితా హృదయం భయస్థితికి చెదరదు
ఇంకా తీవ్రతరం వేగవంత మవుతుంది
వీటి పరిమితులెవరికినీ చెప్పడం కుదరలేదు
భూమి ఆకాశం సముద్రం జనతను దాటుతుంది

ఉద్యమ కాలంలో విప్లవానికి సంధికి అవకాశం
విజయం పొందితే మనిషి ఉన్నతికి నిదర్శనం
మాటలూ చేతలు వేరు వేరు స్థానాల నుండి
అన్యోన్యం చేకూరే మంచిపైన సమదృష్టి
ఆదర్శానికి వాస్తవానికి మధ్య ఎడం
తగ్గితేనే, ఏ సంధి అయినా, సాధ్యం

సమాజ పరిణామ దశలపై దృష్టి పెడుతూ
ప్రజల ముఖ్యావసరాలపై చూపును నిగిడించాలి
ఒకరి సంపదను దగ్ధం చేసే సందర్భం రాకూడదు
ఒకరి ప్రాణం తీసే, ఆవశ్యకతను పొందకూడదు

ఉద్యమంలో తగిలిన గాయం ఉద్యమకారులకు
పూవు మొగ్గలానో విప్పారిన పూవులానో తృప్తిని ప్రసరిస్తుంది

ప్రజలంతా ఒకే తాటిపై రావడం ఎప్పటికీ కుదరదు
కొందరు తొలగవచ్చు తప్పవచ్చు; నీతి వేరు కావచ్చు

దార్శనిక, క్షేత్రం నుండి పరివర్తనలో వాస్తవ భూమికలోకి
మనిషి బహు సులభంగా పయనించేను, ఉద్యమంలో
ఏ వైపు నుండి నిరాశను చూపదు ఉద్యమం
ఏ ముఖంలోను సందిగ్ధత ఏర్పడదు యత్నంలో

ఎంత పెద్ద గాయమయినా ఉద్యమంపై ఇష్టం
ఎంత చిన్న గాయమయినా సానుభూతి కవచం

ఉద్యమచరణంలో విజయగాథలే ఎక్కువ
ఏవైపు నుండైనా పెరిగిన ఒత్తిడులను ఎదుర్కొవడమే

29. అనల రావం మేఘ రాగం

కవితలో అక్షరం బొగ్గు ముక్కకాదు
నవతలో అక్షరం సుద్ద ముక్క కాదు
రెండూ కవులకెంతో ఉపయోగకరాలై
సమాజ విశ్లేషణకెంతో తోడ్పడేను

ఒక చుక్క కన్నీరు జారేప్పుడు
ఒత్తిడిలో జరిగే విస్ఫోటం
సమాజ శక్తిని పరీక్షకు నిలుపుతుంది
స్వాంతనం కన్నా ప్రోత్సాహం ముఖ్యమవుతుంది

ఈ విశాల సమాజంలో పార్శ్వాలెన్నో
కింది నుండి పైకి అమరిక పొరలెన్నో
కవిత్వంలో అన్ని ఒకరొకరిదొక విధం
అగ్ని గానం మ్రోగవచ్చు మేఘరాగం వినబడొచ్చు

ఉదయ కిరణమంటే, మనిషిలో
ధైర్య వచనం నింపే ఉత్సాహ తేజం
దేశ కాల భేదం లేకుండా అంతటా
ఉన్న దృశ్య ప్రపంచాన్ని చూపుతుంది

సృజనకు మూలం తన ప్రభావ రూపం
మేఘం వలె భూమిని ఊరట పరుస్తుంది

ప్రగతి పథంలో దారులు తెలియని వెన్నో
వాస్తవానుభవంలో పొందే విజయాల వికాసం ముఖ్యం

ఇప్పటికీ ప్రభాత కాంతి చూడనివారు ఉన్నారు
బయటికి ఏ పనులలోనో మగ్నమై వారున్నారు

శిలలవలె పడి ఉండే కన్నా మనుషులు
ఉపయోగంతో ప్రకాశరూపం శ్రేయం
బుజాలపై గగనాన్ని వహించే కోరిక కన్నా
మానుష శక్తికి తగిన కార్య కలాపం మంచిది

ఏది మంచి ఏది చెడు విశ్లేషణలు గడపేరు
రెండిటికీ మూలం జీవన వాస్తవ స్పందనం

30. అంతర్జాల వాస్తవం

పలికే వ్రాసే అక్షరాలకే ! పద పదంలో
సూర్య కళలో చంద్ర కళలో నక్షత్ర మణులో
జీవి పాలిటి వరం! అమృత బంధు స్పర్శతో
విభవమో విజయమో సకలమో శకలమో సంపదో !

ఎన్ని విషయాలయినా తనలో విలీనమై ఏకాకృతిని పొందే
కవితారూపం నవ లోకం వంటిది కవి జీవితాన

కవితకు ఆదర్శం వాదం ఉద్యమం విలువలు చేకూర్చేను
చరిత్రలో మాయమయిన వాస్తవ దృశ్య మావిష్కరించేను

లోన ఉన్న మరో మనిషి దాహంలో
మంచు ముక్క గొంతులో జారినట్లు ఉంటుంది
బయట నుండి వచ్చే గాలికి
కిటికీ తలుపులు తెరచినట్లు ఉంటుంది

ఇది ఏ ఇంద్రజాలం కాదు; కనుకట్టు విద్యకాదు
ఒకప్పుడు కోష్ణస్పర్శ ఒకపుడు సుమదళ గంధం
మాట హృదికి హత్తుకునే చర్య మది నిండితేనొ
అనుభవ మర్యాదా ఝరిని దాటిస్తుంది

శబ్దానికి నిర్దిష్టమైన చోటు దొరుకుతుంది
దేన్ని మార్చాలనుకున్నా, అది ఇల్లు మారి నంత పని

అయారామ్‌కు గయారామ్‌కు పాత్రల ప్రమేయం లేని నాటకం
మనిషి మనిషికీ సహృదయ స్థానంలో సంకల్ప జగం
సమయ సమయం వివిధ వర్ణ సమీకరణం, మనోజ్ఞం
సాధార దృష్టి పడినా పడకపోయినా వేషం మారేను సమయసమయం

దేశం స్థానం వేరువేరు అయినా లక్ష్యం ఒక చోట చేరి
ఇంటర్నెట్‌లో సజీవ చర్యలతో సమావేశాలు

అవసరంలో విషయం మానవ శక్తిచేత లభిస్తుంది
బొమ్మలతో పనిలేదు! నిరంతరం జనతతో సంచరణ భ్రమణం
కవి మనో రూపం వికాస దశల పరిణామంతో
ప్రతి పని ఉద్యమ స్ఫూర్తితో మునుముందుకు సాగుతుంది
ఎక్కడి వారు అక్కడనే పాల్గొనే వీలు ఉన్న
అందరి కందుబాటులో అంతర్జాల వాస్తవ జీవితం

31. నావ తోడుగా

ఉద్యమంలో నీలి చర్యతో
విసిరిన రాయికి తగిలిన గాయంలా
చంద్ర బింబంపై మచ్చ
రవి సాయం వేళకు జ్వలించి జ్వలించి
రాత్రితో స్నేహ సంధిలోకి ఆరిపోతూ ఉన్నట్లు ఉంది
జలధి లాగేస్తున్నట్లు ఉంది

చితిలోకి ప్రవేశించి వెనక్కి వచ్చిన పాత్ర
నాటకంలో కళామయం, వాస్తవాన బాధాకరం
వెలుతురు లిపిని పరిచయం చేసేను రవికిరణం
ఏ రంగులోనయినా వస్తువును ప్రదర్శిస్తుంది

కవితకు పట్టాభిషేకం ప్రతి హృదిలో జరిగేను
మనిషిలో మానసాన్ని ఏలుతుంది; అప్పటికీ
బాధా తప్తమైన మనిషి రాల్చే కన్నీటి చుక్కలొకటొకటీ
అగ్ని గీతం రూపు దిద్దుకొనే సంగతి ఎవరికి తెలియదు

భాష లెన్ని విధాలో అన్ని విధాల చరిత్రతో
ఒకే ఒక మానవ వికాస శక్తిని ప్రదర్శిస్తుంది
హృదయ బంధువు కవిత! సర్వజన విశ్వమయం
దీనికి ముందుగ మనోవేది సవనానికి సిద్ధం కావాలి

మిత్రత, శత్రుత భేదం స్నేహం సమరం శాంతం
అన్నిటినీ తనలో ఒకటిగా బింబించే సృజనరూపం
కవిత ! ఏ పని చేసినా వాస్తవానుభవంలో
అర్ధ సహితమై, మానవ శ్రేయానికి దారులు చూపేను
కవితకు మరో వ్యక్తితో పరిచయమున్నా
లేకపోయినా తన ప్రభావ హృదయాలతో బ్రతుకుతుంది

కన్నీటి చుక్క బరువుతో తులతూగే
ఒక్క సంపదతోనే బ్రతుకులు సార్ధం కావు
దీనికి జవాబుగా ఒక వేలెత్తి పైకి చూపేరు
దీనికి మరొకరు భూమిపై కిందికి చూపేరు

లోకంలో బ్రతుకు సముద్ర మయినా సరే
నావ ఒకటి తోడు ఉంటే ! అంతే చాలు

32. వాస్తవ ప్రకాశం

లోకం అగ్ని జ్వాలా శిఖరమయినా పరవాలేదు
మధ్యలో మంచు క్రమ్మిన గిరి తలముంటే చాలు

ఉద్యమ స్ఫూర్తిని ఎవరు ఆపలేనట్లు
కవిత్వ చేతన నెవరు నిలిపి వేయలేరు

పురా సంస్కృతి వెలుగులతో మెరపు తీగెల పందిరి వలే
స్వేచ్ఛకు చోటు ఉన్నవ్యవస్థలో ప్రజాస్వామ్య మొకటే
ఉన్న వ్యవస్థను కూల్చేసే ధోరణిలో ఒకరు
ఉన్న దానిని అనుకూలం చేసుకునే వారు కొందరు

అందరికీ ఒకటే ఇష్టం అవదు రంగు రుచి గంధంతో
వస్తువు ! మనిషి మనిషికొక తీరులో జీవితం తీర్చబడేను

ఎదురుగ కోపంలో ముఖాన్ని ఎడారిగా
చూడాలని అనుకోరెవరు? ఎంతటి శత్రుతలోనూ
స్వంత ఆస్తిని ఎవరయినా కొంతవరకే నియంత్రణం చేయగలిగేది
మిగతాది ఆధిపత్య జాలంలో చిక్కిన మరో అధిపతిది

ఏదీ శాశ్వతం కాదని అన్నిటిని వదలి
అప్పటికపుడు శిశిరాకృతి పొందేరా?
రాలిన ఆకుల స్థానంలో కొత్త ఆకులు
కనబడేనని నమ్మకం మాత్రమే నిలుపుతుంది

ఇంద్రధనుసు నీలిమబ్బు మెరపుతీగె
ఎంతో కాలం ఉండవు ప్రకృతి దృశ్యంలో
ఎంత ప్రాణ ప్రదాలయినా! అవి ఉండేవి కొంతవరకే
జీవన భాగ్యానికి దోహదపడేను కోరనివయినా

మనిషిలో క్రూరత కత్తులలో దాగేనా?
మనసులో ఆర్ద్రత లేని వేళ చూచేనా?

దోషం నేరం పీడన హింసతలో మనిషి
వేల యేండ్లుగా బ్రతుకులు నడపే మనుషులు
తన చరిత్ర నిర్మాత తానే అని తెలియక పోవడం
విచిత్రమే కాదు! దౌర్భాగ్యం ! అవివేకం
దీని నుండి మహా పద్మంలా జీవితం ఎదగాలని

33. వాస్తవ ప్రకాశం

ఒక మాట నిలిచి పోతుంది అనుభవ ముద్రతో
మనో నిలయంలో ప్రదర్శన శాలలో చేరుతుంది
పరిచయమయిన మనిషి ముఖంలో కాల క్రమేణ
ఏదైనా ప్రకృతి దృశ్యం! ప్రతి ఫలించవచ్చు! మనసులో

మంచుచే శుభ్రమై ఉదయ రశ్మిచే మనోజ్ఞమై
కవి నుండి కవిత ఏ ఏ వేషం భాషా భూషణంతో
బయట పడి ఎవరి నలరించేది తెలియని రహస్యం
హృదయం ప్రమాణ మంటే సమస్య జటిల తరమవుతుంది

ఎదపై జమ్‌జా లాగ దిగాలని ఒకరు
మెడలో పూల దండలాగ అమరాలని ఒకరు
ఏ దేశమయితేనేం? అధికతకు శిఖరమై తాను
నిలవాలని కోరిక, ప్రతి మదిలో మొలకై తరువై

ఏ వేష భాష భూషణ కళతో పరివర్తన
ప్రవర్తమాన మయ్యేదీ తెలియదు, దశలుగా
అక్షర రూపంలో అస్తితను పొందే చరిత్ర
సార్ధకమై దార్శనికంలో దారి చూపుతుందనే

విషయం కొత్త దుస్తుల్లో బయటపడుతుంది
శాంతి కొన ఊపిరితో శిథిలాల్లో మిగిలే ఉంది
ఈ త్రిపథగ ప్రవాహం వ్యక్తి ప్రకృతి సంఘంలో
కలిసిన నిరంతర రూపం ఎన్ని వేల ఏండ్ల నాటిదో

ఇది ఏ సముద్రంలో కలవాలని కోరుకోదు
భూమిపై సమాజాన్ని చుడుతూ పోవాలనే
ఉషస్సు తొలి రూపం చూడాలనుకుంటే
ముందుగా లేచి బయట నిరీక్షించవలసిందే
శ్రమ బంధువులు మనుషులు ఆరోహణలో కదలేరు

నేలపై మట్టి అంటేనని చెట్టుకొమ్మలపై
నిలయం నిర్మించేరా, సమస్య తీరేనా?
ఎంత ఎదిగినా తెలియని వాస్తవాలెన్నో! బ్రతుకులో

విప్పిన పూల రేకులు లెక్క పెట్టడంతోనే
ఉన్న ఆయువు కాస్త ఇగిరిపోతుంది

హృదిలో నిజరూపం వాస్తవాకృతి ప్రకాశంలోనే
వస్తువు తెలిసేదీ సమస్య తేలేదీ, శక్తి మేల్కొనేదీ

34. సహభావం

భూమి ఉంది, ఉంటుంది మనిషి కోసం అమ్మలా
చెట్టు నిలచి ఉంటుంది ప్రకృతి ప్రతినిధియై
పూవు ఫలం కలపతో మర్యాదాకృతియై
ఎన్నిటి సహకారాలతోనో మనిషి జీవితం

మనిషికీ మనిషికీ మధ్య స్నేహం ప్రేమ ఆప్తం ప్రకాశంతో
సూర్యుడు పక్కకు జరిగేను, చంద్రుడు వెనక్కి తరలేను

మనిషిలో మనుషు లెందరో పరస్పర సహ జీవనంతో
ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు విజయ పీఠం వలెనై
అపుడపుడు కొందరిలో వెనక్కి వెళ్ళే కోరిక బలంగా
వెనక్కి నడిపిస్తుంది యధా స్థితిలో సుఖం గుప్తతతో

కాలం ఆగదు తేలికగనో బరువుగనో యంత్ర సమం
గతం సకల సంపన్మయమై నిలవడానికి
ఏది మారినా ఆయువులో క్రమం తప్పదు
కల్పన నుండి ముక్తమై భవిత, ఎదురుగ దార్శనికంతో

ఏది ఎట్లా ఉన్నా సంఘంలో తప్పని పరిమితులతో
మహా పరివర్తన మెపుడో ఉద్యమంతో తలక్రిందులుగా

ఒక స్థలం నుండి మరో స్థలానికి లాభంపై దృష్టితో
విశాల పృథ్విపై ఉన్నత శిఖరంతో మనిషి సాగే నిర్ఝరులతో

నిరసన ప్రతిఘటన కలహ యుద్ధాలెన్నివిధాలో
అన్నిటిని క్రమించేను మానుష యత్నంలో ఉద్యమం
సృజనలో అగ్ని శిఖయై కవిత జ్వాలాకృతి పొందేను
సిగరెట్ కాల్చడానికే కాదు! బ్రతుకులో ఎన్నిటినో పొందడానికీ

ఉదయం జ్వాలా రూపం రాసులుగా బూదియై
గగనం విప్పారిన మందారవనాన్ని తలపిస్తుంది

ఏరోజు కారోజు వెలుతురు కాగితంపై
నీలి అక్షరాలతో అగ్నిమయం చేసేను మనిషి
మనిషికి మనిషి తోడుగా ఏకాంతం నుండి ముక్తమై
హృదిలో భయం గాలికి ఆకులా మరపున బడచేసేను

35. చక్రభ్రమణం

ఉక్రెయిన్ పెద్ద దేశం రాజధాని మొదటి
మహానగరం 'కీక్ పై రష్యా యుద్ధం ప్రకటితమై
మానవశక్తిని పరీక్షకు నిలుపుతూంది, తీవ్రంగా మొదలైంది
రెండో పెద్ద నగరం 'ఖర్కివ్" పై పోరు చండంగా సాగేను
కీక్ పై విజయాన్ని పట్టుదలగా రష్యా యుద్ధ వార్త
గుండెల్ని పరికంపితం చేసే ఘోర చర్య ఆలోచనల్ని
మంటలుగా మార్చే శత్రు భావం! రణం ..
బాధా రవాలతో 'సర్వం' విషాదంలో మానవత
మంట గలిసిన వాటిలో ఒకటవుతూంది

మనుషుల ఆలోచనలు క్రియా కలాపాల
మధ్య ఎడం సందిగ్ద స్థితులతో గడచేను
స్వదేశంలోని ప్రజలు ఆత్మార్పణకు సిద్ధంగా
రణ సేనలు విజయానికి పట్టుదలగా సాగుతున్న
యద్ధం ఓటమి గెలుపుల మధ్య బతికే సామాన్యుల దుస్థితి
బాధామయమై కలచివేసే మరో కోణంలో
'జలారస్"లో చర్చలు మొదలయినాయి ఒత్తిడిలో
ఇప్పుడైనా ఫలితం మాత్రం విషాద మయమే

రాజధాని 'కీర్"పై యుద్ధం మొదలయి
రష్యా సేనల విజృంభణం రక్త సిక్త దృశ్యాలతో
బాధా స్వర విషాదాలతో ఇరు పక్షాల యుద్ధం
గురించి తెలియని అమయాకుల ఇక్కట్లు ప్రజలలో

తప్పెవరిది? దోషి ఎవరు? ఈ
సమస్య యుద్ధంలో తేలగానే అంతా మరిచి పోయేరు
చివరిమాట ఎంతవరకు లేదు,
రణ సమాప్తి రేఖ అన్నది లేదు బ్రతుకులు కాల ప్రవాహంపై
తేలుతూ పోయేరు కఠోర వాస్తవం! ఎవరి సుందర
స్వప్నం వారిది, ఎప్పటికీ మండెను పట్టుకొని వ్రేలాడుతూ
ఎంతకయిన సాహసిస్తుంది, సముద్రాన్ని లంఘింపగ
జేస్తుంది, నదితో పోటీగా పరుగిడుతుంది ఇది
యధార్థమయ్యేసరికి, ఆయువు చిత్రశాలగా మారుతుంది

36. ఒకటొకటీ వినిర్మాణంలో

కొందరు తమకు తాము ఎప్పటికీ
యుద్ధ కళా నిపుణులుగా తలచేరు
నేటుగనో చాటుగనో రణ తంత్రం లేంది
కాలం గడవదు, తమ ఆయువు తరగదు

ఇది జీవితాలనల్లుకొని సంతోషం కలిగిస్తుంది
సమర పరంపరలతో పురోగతిని సూచిస్తుంది
సామాజిక లక్ష్యంతో వాస్తవాన్ని గుర్తిస్తుంది
రణ క్రియకు దారి తీసే పరిస్థితులలో
ఉద్యమమయినా వ్యవస్థలో బీభత్సకాండ రూపొందవచ్చు
తిరిగి శాంతి పదంతో మేలును చేకూర్చవచ్చు

కుదుపబడిన వ్యవస్థలో స్థిమితం ఏర్పడవచ్చు
చీకటిలో వెలుతురులకు దారి లభించవచ్చు

దేశ దేశాలతో వైషమ సంబంధాలలో
సమర చక్ర భ్రమణం మొదలవుతుంది
వేగ మందుకొనీ నాశన పర్వంలో శిథిలాలతో
ఆవాసాలు, ఆలయాలు, విరోధానుభవం అమేయం

పొగలు క్రమ్మిన ఊరు విడిచి మరో దిశకు
ప్రజలు క్షణాలలో ఆపదకు గురి అయ్యేదీ తెలియదు
ఎవరి బ్రతుకులో వారు గడపే స్వేచ్ఛ అవసరం
సామాన్యుని ఆయువు మండే కొరకంచు కాకూడదు

అణగి అణగి సాగి సాగి ఉద్యమం ఒక కోరికతో
హఠాత్తుగా దండయాత్రలో సుడులను పొందేను
శిథిలాల మధ్య గాయాల రక్తపు గుర్తులతో
కష్టాల నష్టాల బాధల వేదనల సంకలనం
ఎవరయినా ఎంత కాలం ఓర్వగలరు
తిరుగుబాటు విరాగిత రెండే కర్తవ్యాలయ్యేను

ప్రజలో బ్రతుకులు శైశిర దృశ్యాన్ని పొందేను
శూన్య ముఖాలలో దీనాకారంతో ఎదురుగ నిరుపేదలు

న్యాయం ధర్మం ఎవరివైపు ? సత్యం విజయం విభవ మెవరికి?
స్నేహం ఐక్యం సహనం శాంతి ఒకటొకటి వినిర్మాణంలో

37. విలువల కోసం

ఉక్రేయిన్ రాజధాని మొదటి మహా నగరం 'కీర్'
భయానక దృశ్యాల్ని విడుదల చేసేను విషాద ముద్రలతో
ప్రతిఘటనను ఎదుర్కోవలసి పోరాట మతిశయించింది
దశ దిశలలో మృత్యు పాశాలు ఒకదాని
తరువాత మరొకటి చుట్టుముట్టే యత్నం విషాద దృశ్యం
ప్రజలు వేయి లక్షలలో ఆ ప్రాంతం నుండి నిర్వాసితులు
భాగ్యంగా ఉన్న నివాసం క్షణంలో కడుపేదగా మారేను
ఈ ప్రాంతం ఎండిన నదివలె ఎడారి దారి పట్టేనా?

రణ తంత్రంలో వెలుగులు బయటికి వచ్చేసరికి
మనిషికి చీకటిలో కావలసినవి సమకూడేనా?
ఏది తెలిసి చేసినా తెలియక చేసిన పర్యవసానం
ఎంత చేదు అయినా ప్రజలు భరించవలసిందే

ఎవరి జన్మ భూమి వారికి తల్లితో సమానం
ఎవరి త్యాగ శీలం వారికి సాటిలేని అపూర్వం
హింసతో రణం అతిశయించి చరిత్రను గాయపరుస్తుంది
సహనం శాంతి ప్రేమ స్నేహం అడుగులు వెనకకు మరలేను

శత్రువు సంహారానికి ఎప్పటిదో ప్రణాళిక
ఇప్పుడు చెప్పరాని సంతోషానికి వేదిక అయ్యేను
బాధాలలో మొదలై దుఃఖంతో గడచి
విషాదాక్రాంతమై బ్రతుకులు కనుమరుగయ్యేను

ఇక్కడ నగరం చుట్టూ జనపదాలు
విరిగిన కొమ్మల రాలిన ఆకుల చెట్లతో
పావురాళ్ళు చిలకలు చెట్లపై కాక
సిమెంటు స్తంభాలపై గోడలపై వచ్చి వాలేను
మళ్ళీ తమ తమ స్థానాలు చేరేనని ఆశ
ఆశలో కొన ఊపిరి ఇంకా మిగిలి నట్లనిపించేను
ఇరువైపుల నుండి విషాద పర్వ సృజన ఎవరి కోసం
మనిషి కోసం మనిషిలో విలువల కోసం
మనో జగం మానవ ప్రపంచంతో ఎప్పటికీ అవసరమే

38. రంగుల ముసుగులలో

మనిషి మేధ నుండి రణ రహస్య తంత్రాలన్నీ పుట్టినవి
మనిషిని హరించేను దీన్ని ఆనందించడం రాక్షసం

ప్రపంచాన్ని దాచి పెడుతుంది చీకటి వస్తువును కనబడనీయదు
వెన్నెలకు మాత్రం ఉదయ రశ్మిలో నిశ్శబ్దంగా
తాను చేరిపోవాలని ఉబలాటం ఎప్పటినుండో
అన్నీ యథాతథంగా ప్రకృతిలో మూల గుణాలతో

లోని నీరు గడ్డ కట్టి మంచు శిలయై
ఎన్ని రూపాలనో పొందేను ఆశకు సంకేతాలు
అవును! రేపు కోష్ణమైన సదాలోచనకు
కరిగి పారి నదియై ప్రాణం కాపాడేను

చెలగాటం మనిషిని నిప్పులతో అలంకరించేను
ప్రభాత రూపానికి భేదం లేకుండా పోతూంది
సరికొత్త ప్రసారంతో రేపు జీవిత మూలదేనా?
ఎవరి కోసం మనిషి బ్రతుకు తన భాగం కోసం

భూమిపై కల్లోలాన్ని ఆకాశం చూస్తూనే ఉంది
జన మహా సమూహం సముద్రంగా భయపెడుతుంది
భూమిపై బ్రతికే మనిషి నరనరంలో రక్తం బదులు
ఈ రణ సమయంలో అగ్ని జలధిని తలపించేను

బ్రతుకులో జీవనస్వేచ్ఛను దగ్ధం చేస్తూ
భూమిపై అనుభవ వికాసాన్ని మంటగలుపుతూ
శాంతి కోరే మనసుకు కోలుకోరాని చిచ్చుతో
ఒక పక్షంలో ఆనందం మనిషిని బులిపించేను

రణ సన్నాహ క్రమంలో మనిషికి మనిషి శత్రువు
కావడంలో ఆశ్చర్యం ఏముంది? చంపుకోవడం తప్ప
ఇపుడు ప్రాణభయం లేని స్థానాలకు తరలేరు
పలురంగుల ముసుగులలో మానవతను కాపాడుకునేరు

39. ఇంకిన శాంతి బిందువు

మనిషి, మనిషికొక విధం ముసుగు బొమ్మల్లా
సైనికుల చేతుల్లో ఆయుధాలు ఆటవస్తువులు కారాదు

శిశిరం ఆవరించి రెండు బుజాలపై శూన్యంతో
చెప్పుకోవడానికి ఏమీలేని జీవన భావనతో

ఈ జరిగే రణం ఎవరి కోసం
ఆ కోరే విభవం ఎవరి కోసం
అంటే బ్రతుకులో ప్రజల కోసమనేరు
గుడ్డ కాల్చి పైకి విసరినట్లుంది జవాబు

రగిలి రగిలి మంట లెగసి సర్వం ఎడారియై
జల బిందువు కై తహతహ
పచ్చని మొక్కకై వేదన ఈ క్షణంలో
ఇక్కడ కష్టం నష్టం లేని బ్రతుకులేదు

ఎన్ని మారులు యుద్ధాలు వచ్చి పైబడినా
ఇందులో ఏదీ చివరిది కాలేదు, కాదు
ఇది కూడ అంతే! మళ్ళీ మళ్ళీ మళ్ళీ
వచ్చి పైబడేను, మనిషిలో వికృత రూపం చూపేను
మనిషిలో అహంకార విస్ఫోటానికి అవకాశంతో
సమాజంలో చర్యలు విపరీత గుణాలతో
మనసును అతిశయ చర్యలకు పురికోల్పేను
మనిషి పక్షిలా పంజరంలో ఉన్న సంగతి తెలుస్తుంది

మంటలో బూదిలో మిగిలిన నివాసాల శిథిలాలు
ఎవరి కోసం మనిషి ఎదిగేను? మనిషి కోసమే
మనిషిలో గొప్ప విజయం చేతన తొలగని వాస్తవంలో
ఆలోచనలు సాగడం; క్రియా రూపాలు ఉద్యమించడం
రణ సన్నాహంతోపాటు పక్కనుండి మౌనంగా
శాంతికి పట్టాభిషేకం జరగాలని ప్రజల కోరిక

ఇది ఇట్లా ఉండగా ఉక్రెయిన్‌లో రెండు వేర్పాటు ప్రాంతలనీ
స్వతంత్ర దేశాలుగా గుర్తించడమొక తీరని ఆటంకం
వీటి రక్షణకై శాంతి దళాలను పంపే ఆలోచన
పుతిన్ మేధలో శాంతి బిందువు ప్రవాహ రూపం పొందేనా?

40. శాంతి కవచం

నిశ్శబ్ధంగా ఉన్న ప్రకృతి నుండి భీకర శబ్దానికి
ముక్కలు కాని గుండె, ఆయుధ శబ్దానికి విలవిలలాడుతుంది

చిన్న మాటకు మనిషి గుండె వికలితమవుతుంది
వ్యక్తి తేజాన్ని మానవ గౌరవాన్ని అణచే కోరిక
మనిషి నుండే మనిషిపైన నెరవేరని సంకల్పం
విరివిగా పచ్చని ఆకులతో పూల పండ్లతో రావాలనీ

ఆకలి వేస్తే రణంలో ఎడారి సమ స్థితిలో
మనిషి ఏమి చేసేను? గంతులు వేసేనా?
ఆలోచనలో ఉత్సాహం పొంగులెత్తవలసిందే
క్రియలో మానుష ధర్మం కనబడవలసిందే

బహు సులభంగా కీర్తిని పొందే ఆలోచన
తన దోషాలను మరపున బడ చేసేను, మనిషిలో

మనిషిని వీడని బలం మానవం
అవసరానికి కల్పన చోటు చేసుకుంటుంది
మోసం గుప్తంగా తల ఎత్తి చరిస్తుంది
ఒంటరిగా, సమూహంలో ఇది వాస్తవ చలనం

ఎదురుగా వచ్చే ముఖంలో ఎప్పుడో చూచిన
చిత్రం! ఒకటొకటీ కనబడుతూ పోయేను
అవి వ్యక్తి గతాలు కావు, నిఖిల మానవానివి
ఎప్పటికీ ఉండేవి ఎక్కడ ఉన్నా మనిషిని వెంటాడేవి

ఎవరి దారి వారిదే అన్నట్లు మనిషిలో ఆలోచన
లేకపోతే అందరికీ చెందిన విషయం
చూచే మనిషి చేతిలో ఉలికై ఎదురు చూచేరు
అందరు మౌనంగా శిలా శిలారూపమెత్తేరు

గాయ పరచడమెంత సులభమో మనిషికి
ఉపశమనం కలిగించడం అంత కష్టం
మిగిలిన మచ్చ చేత జ్ఞాపకం నిలుస్తుంది ఎప్పటికీ
మనిషికి ముందుగా శాంతి కవచ మందిస్తుంది

41. కొత్త కవితకై

రాసిన కవిత కొత్తగా ఉండాలని కవిలో ఉబలాటం
కొత్తది చదవాలని వినాలని పాఠకుల కోరిక
ఇది ఉన్మద శిఖరం కావచ్చు, ప్రమాద మవచ్చు
ఇది అతిశయమయితే అస్పష్టం అక్షర ప్రపంచం

స్వరం మాట టేప్‌కు ఒప్పజెప్పి తాను స్వేచ్ఛగా
ఎన్ని ఏండ్లు గడచినా తనలో చుట్టలు చుట్టుకొని
సమయానికి తమ కిష్ట మయిన విధంగా రచన మారుతుంది

చరిత్రలో జరిగేదే ఇది! ప్రతి దశలో
కొత్తవి అంతలో తిష్ట వేస్తాయి? బాహాటంగా
బావిలో మంచినీరు తోడే తాడు అవసరమవుతుంది
దారిలో కనబడే హానిచేసే సర్పమవుతుంది

కొన్ని కవితలు వర్తమానంలో జరిగేవి
కొన్ని కవితలు ఎప్పుడో జరిగినవై ఉండేవి
రెండిటిలో సారం ఒకటే కవిలో ఉన్న శక్తితో
లక్ష్యంతో చేరే గమ్యం, స్థానాలు వేరు వేరు

ఎందరో కొందరికి సూర్యుని బింబమై తేజాన్ని ఇచ్చేను
ఎందరో కొందరికి చంద్రుని బింబమై హ్లాదాన్ని ఇచ్చేను
రెండు విధాలలో ఆరితేరిన ఘనులు లేకపోలేదు
ఎందరో లేఖకులు పాఠకులు ఒకరిని మీరి ఒకరు

ప్రజలు సరేసరి ఆటలో పాటలో హద్దులలో
కొత్తగ అనిపించే వస్తువు విషయం లక్ష్యంగా
విషమ తలం భూమిపై అనుకోని మార్గంలో
ప్రమాదం అందరికీ తెలిసిన వాస్తవం

సమతలంగా ఉన్న భూమిపై పథంలో
ప్రమాదం ! ఎందరికో ! తెలియని యథార్థం

ప్రతి వ్యక్తి పూర్ణ ఫలంతో పచ్చనిచెట్టు తనలో ఎదగాలని
ముళ్ళతో అనుభవింపరాని వస్తువు కంటికి కనబడరాదని

42. కల్పనకు తావులేదు

ఎప్పటిదయినా కవితకు పాత లేదు
ఎప్పటికీ సరి కొత్త దైన ఉగాది వలె

ఇది అందవచ్చు, అందకపోవచ్చు, తెలియకపోవచ్చు
చేయి చాచితే అందేలోపల గాలికెగిరి పోవచ్చు
అప్పటి కపుడు మానసికావసరమైంది కావచ్చు
ఎపుడో ఉపయోగం చూపవచ్చు జీవితంలో

పట్ట నట్లుగా చూస్తూ పోవడం ఒక సరదా
పట్టినట్లుగ దానిలో మునగడం ఒక అనుభవం
నిన్నటికీ ఈ రోజుకూ కాలగతిలో తేడా లేదు
మనుషులు వేరు పాత్రలు వేరు దుస్తులు వేరు వేరు

మాటలో తేడా ఉండవచ్చు వెళ్ళే గమ్యం వేరు కావచ్చు
తేడా లేనిది ఒక మనస్సు అంతరంగ ప్రకాశం
పల్లె అయినా పట్టణ మయినా గుండె చప్పుడు ఒకటే
మేధ ఎన్న పరిమితుల్లో ఎవరి శక్తి కొలది వారు

అవసరాల్ని బట్టి నిపుణతలు మనిషిలో అంతో ఇంతో
వీధులలో హోర్డింగులపై ప్రకటనలవలె ఆకర్షించేరు

తెలియని తనంతో లోకం లోకి బయలుదేరి
తెలిసిన తనంతో ఇంటికి చేరేను మనిషి
ఆ కనిపించే శిఖరాలు నివాసాలు కావు
ఆ వినిపించే గాలి మాటలు పనికి వచ్చేవి కావు

తల్లి కొంగు చాటున పిల్లల వలె పల్లెలు
ఒకటొకటి నగరం అంచులు చేరి కలిసిపోయేను

పల్లెలో తెలుపు నలుపు ఎరుపు మూడు రంగులు
నగరంలో వీటి మిశ్రమ రూపాలనేకం జీవితంలో

నగరంలో పేవ్ మెంట్‌పై పడుకొనే పేదలు
వాస్తవానికి రెక్కలు వస్తాయిని కలలో తిరగవచ్చు

ఊరులో పొలం పనులలో శ్రమ పథంలో
కల్పనకు తావులేని జీవితం వాస్తవ బలంతో

43. ఏ రోజునకదే

ఒక జ్ఞాపకం వెనక నుండి చరిత్ర శకలం
దృశ్యంలో మానవ రూపం మూల మనోజ్ఞం
జారిపోని ఆదర్శం చెక్కు చెదరకుండా
మరో కొత్త డ్రెస్‌లో బయట పడేను

గతంలో కలహ కారణ రణ సంఘటనలు
చెలగాటంలో పడి, విపరీతాలు సృజిస్తే
వర్తమాన శాంత వాతావరణంలో జన సమూహం
వనిలో పుష్పాలు అలరిస్తాయిని, ఆశా రూపం
ఇది కవితలోనే సులభ సాధ్యం, మరెక్కడా కాదు
సహజమైన వ్యక్తిలో జీవ శక్తిని నిలబెడుతుంది

మనిషిలో వికృత చర్యల శిథిలాల గుట్టలు చూపిస్తే
పరంపరల్తో వర్తమానం, భాగ్యాన్ని ఊహ చేసేను
నేడు కురిసిన వానలు మనసులో పదిలంగా
రేపు వచ్చే పంటను జ్ఞాపకం చేసేను
ఆశలు పెరగడం కన్న వాటి విలువలలో ఉంది విశేషం
మరో వికాస రూపానికి ఆకృతిని ప్రసాదించేను

సమాజం ఎప్పటికీ తిరగే రణ చక్రం కాదు
చక్రం క్రింద నలిగిన కోర్కెలు పయనంలో ఎన్నో
ఎవరు ఎవరినీ గాయపరచే ఉద్దేశంలో ఉండరు
అడ్డులేని కారణంగా అవకాశం మితి మీరేను

చర్యలలో మార్పులు కొత్తదనం తీసుకు రావచ్చు
ఆర్ద్రమైన అనుభవం మనిషిని జయంవైపు తీర్చవచ్చు

ఎదురుగ దర్భలపై అమృత బాండం నిలపబడీ
కొంచెం ఆలస్యం, కాస్త అవివేకం కథను మార్చేను
మళ్ళీ కథలో సన్నివేశం పునరావృతం కన్నా
మనసును జాగ్రతలో ముంచి పైకి తీయవచ్చు

ఇది అతీత విషయమై అక్షర నిలయంలో
మనిషిని తన జీవన భద్రతల్ని చేకూర్చేను

ఎన్నిటికో జీవిత రూపం తీర్చబడే సమాజం
జ్ఞాపకాలతో అవసరాలతో ఏ రోజునకదే పరివారంలో పండుగ

44. మార్పు కోరుతుంది

స్థానికతలకు పట్టం కట్టవచ్చు ఉదారంగా
బయట నుండి కావలసింది రాక తప్పదు కూడా
ఆదాన ప్రదానాలు ఇచ్చి పుచ్చు కోవడాలు
సమాజంలో అవసరమైన వ్యక్తుల కోర్కెల పైనే

రాజకీయ తంత్రాలతో ఇపుడు ఆర్థికాల జోరు
దేశానికి మౌలిక పరంపరా బలం, తప్పని నైతిక పథం

ఈనాటి కవితల హోరు జలధి తలను మీటుతూ పోయేను
విశాల జీవన క్షేత్రంలో పంటలు రైతుల ఇష్టం పైనే
సంక్లిష్ట మయిన సమాజంలో సంశ్లిష్టమయిన రాజనీతిలో
వ్యక్తి నుండి సమాజానికి పయనం ప్రతి స్థాయిలో

గుప్తమైన లాభాల అపేక్షతో రాసులుగా, చీకటి నిలువలు
అక్కడక్కడ సనసన్నని వెలుగుల దారుల గుర్తులతో
చిన్ని చిన్ని శిలల వలె ఎవరికి తెలియకుండా నడిపించేరు
తమ తమ పరిమితులతో, కట్టల బలంతోనే చెరువులు

ఎంత దూరమైన ఏ దిశలోనయినా తమ తమ హద్దులతో
మార్పులతో బ్రతుకులు చిన్న నుండి పెద్ద దాక
ఈనాటి కవితకు వస్తువు ఇంతా అంతా కాదు
భూమిని మ్రింగేదీ, నింగిని కప్పేదీ, మనిషిని నడిపేదీ

మనిషిలోని నిజం రంగులలో బొమ్మలు చూపుతుంది
బొగ్గుకు బూదికి అగ్నికి సమయానికి భేదం చూపేను
జలధిలో అలల కల్లోలం, బ్రతుక్కి నేపథ్యం
బాల్యం నుండి జరా క్రాంత స్థితి దాకా
మూల బలంపై నిలుస్తుంది చెట్టు పచ్చగా
మనిషి నుండి మనిషికి సాగిస్తుంది స్నేహ బంధం

మనిషికి తనలో తలపించే ఆదర్శ రూపం ఝుంఝులో
ఏ క్షణంలో మూలం పెళ్ళగిలి కూలేదీ తెలియదు

కొత్తవి వంగినా పాతవి విరిగినా నిలకడగా
నాలుగు కాలాల పాటు నిలిచేవి చెట్లు
మనుషుల బ్రతుకులు తలపించే ఆదర్శ రూపాలు
ఒత్తిడులులో మార్పును కోరుతుంది సమాజం

45. విశ్వపీఠం

చిన్న పాటి దయినా సమస్య లేంది బ్రతుకు విలువ తెలిసేనా?
కొద్ది పాటిదైన కష్టం లేంది బ్రతుకు పైని బరువులు తెలిసేనా

ప్రజాస్వామ్యం సామ్యవాదం రెండూ రైలు పట్టాలవలె
ఎంత దూరమయినా ఆఖరికి నీటిపై వంతెనపై

ఈ చివరి నుండి ఆ చివర వరకు సూటిగా నిశ్చలంగా
సమన్వయ రూపం రెండూ కలిసి పనిచేస్తే
సమాజ రూపం ఏర్పడేను, దారులు కలిసేది జంక్షన్‌లో

ఆ రెండు పట్టాలపై ఎన్ని బోగీలయినా ఎందరినయినా
పీఠంపై కూర్చున్న పాలకులు ఎవరి కోసమంటే?
సంపద సంచయం కోసమా? ఆధిపత్యం కోసమా?

అప్పటికప్పుడు సద్యో నిర్గతమయ్యే బాష్పకణం
క్రిందికి దిగని మేఘాన్ని పైపైనే జయిస్తుంది
ఉన్నచోట నుండి కదలని భూమిపై క్షణంలో
ఉపరితలాన్ని ఆవహిస్తుంది, అగ్ని కణమై మెరుస్తుంది

కన్నీరుకు మస్తిష్కంలో రిజర్వు నిలయం లేదు
ఎప్పుడు బడితే అపుడు కదలదు కనులనుండి

బ్రతుకు జలధిలో దాగిన సంపదను
పైకి తీసి అందరికీ పంచ బడుతుంది
పేద నుండి వస్తువు కావలసిన వారికి
ఎందులోనో, భాగ్యవంతు డయినా సరే
చరిత్ర నేపథ్యంలో సామాజిక పాత్రలో
గడ్డ కట్టిన కొండల్లా నిరంకుశ రూపాలు
అవి కరగి వెలుతురుగా ప్రవహించడం
ఒక స్వప్నం అనుకున్నది జరకగ పోవడం

నీతి నియమ నిబంధనలతో దేశాన్ని చక్క బెట్టాలని ఒకరు
విశాల ప్రయోజనాలతో విశ్వమయంగా జన హితంగా

ఇపుడు అమాయకుల ప్రదర్శనలు వీధి వీధినా ఎక్కువై
నిచ్చెనపై ఆరోహణల హంగామా, చెప్పనవసరం లేదు

ఎవరెంత కాదన్నా ఆగకపోవచ్చు ప్రపంచీకరణం
సంకుచితం వీడి మనిషి మనసు విశ్వపీఠం పొందవచ్చు.

46. తలుపులు తెరుస్తూ

ఉదయం ఒక దిశలో అస్తమయం మరో దిశలో
బ్రతుకులు మరో మంచి రోజుకయి ఎదురు చూస్తూ
దశ దశలో వేరు వేరు ప్రధాన శాఖా రూపాలతో
సమాజానికి వస్తు వినిమయ దశల దశల నుండీ

మాట పలికిన కొద్దీ, స్ఫుటత ఎక్కువ అవుతుంది
పాట పాడిన కొద్దీ, రుచిర మెక్కువ అవుతుంది
సూక్ష్మ సూక్ష్మ తలతో చీకటిని వడపోస్తూ పోతే
మిగిలేది చీకటియే, సాంద్రమైన శిలాకృతి తప్పదు

వెలుతురు వేరై చీకటి పంచబడీ కొందరిలో
మనిషిలో మంచి చెడు వేరవుతాయని ఆశలు

ఉరుకులతో నిరసన ప్రతిఘటన వ్యతిరేక సూచనలు
కవితలో కవికి పుష్కలంగా ప్రకృతి నుండి విషయ సంపద

పొడి పొడి మాటలతో కాదు కవిత్వం ఎప్పటికప్పుడు
తడి తడి మాటలతోనే భూమి నుండి మొక్కలవలె

స్వేచ్ఛా కవిత్వం కొత్త అక్షర ధ్వని జగతిని సృజిస్తుంది
కవి హృదయం మనిషికి సంస్కృతి సంపద నందిస్తుంది
ఆత్మ బలంతో సుశిక్షిత సైనికుల నిర్వహణ రూపం
వ్యూహ రచన వెనక నుండి నడిపిస్తుంది రాజనీతిని

జలధిలో అలల కల్లోలం బ్రతుకులో స్థితుల ఉల్లోలం
ఎదుర్కొనే ఆత్మ విశ్వాసంతో ఆదర్శం అన్నిటికన్న మిన్న కవితలో
కవితలో స్వేచ్ఛ అక్షరానికి మానవాకృతి నిస్తుంది
ప్రతి వ్యక్తిలో పరంపరా రూపంలో విజయం చూపిస్తుంది

మనిషిలో విజయ పరంపరపై ఆకాంక్ష
ఆశా మూలానికి సంకేతంగా ఎప్పటికీ

మధ్య మధ్య ముక్కల్ని కలిపే లింకులతో
గొప్పవారి జీవితాలు, ఇది ఆగని పయనం

నీటిపై గాలిలో నేలపై ఎక్కడికయినా మనిషిలో
ప్రపంచ ద్వారం తలుపులు తెరవబడుతూ ఒకటొకటీ

47. తెలియని వాస్తవం

మట్టి పైన జీవిత కాలం, ఇది శాశ్వతమనుకునేరా?
మానవతా పరిమళాన్ని మదిలో దాచుకొనేరా?
మానుష ధర్మాన్ని కలలు అడుగున విసరేసి
పైపై ఉపాయాలకు ఉత్సాహ రేఖలు కూర్చేరు

రేపటి ముందస్తు ప్రణాళిక సిద్ధ పరచుకొని
తెల్లవారే సరికి కథలో పథం, కొత్తది ఎదురుగా
పచ్చని హార్దిక రుచి ఒక వైపున ఇష్టంగా
వెచ్చని ఆర్ధిక గతి ఇంకొక వైపున బలంగా

శాంతానికి పీఠం లభించిన వాహనంతో శక్తి ఏలితే
ఆయుధాలకు సెలవు, విరామ దశలో నిలుపుతూ
బయట ముఖంలో అనుమాన ఛాయలు ప్రమాదకరాలు
పోయినంత మేర ఇష్టమైన విధంగా రాజ్యమేలే ఆలోచనలు

ఆయుధం శౌర్య శక్తి ప్రకటన సాధనం
అవకాశం దొరికితే చాలు పరపీడన సులభం
పోయినంత మేర బ్రతుకుల్ని తీరుస్తుంది
అయితే మొదటి శ్రమ సాధనం నాగలి
వ్యవసాయ జీవన ప్రపంచం నాగలి తోనే
ఇప్పుడున్న వ్యవస్థకు మూలం, ఎప్పటిదో

కష్టంలో సానుభూతినీ బాధలో సహనాన్నీ
ఉపకరణంలో నాగలినీ మౌనంగా క్షేత్రంలో
విస్తరణకవకాశంతో, జీవన సందర్భం
పరంపరా రూపాన్ని పొందుతుంది అభిమానం

ప్రజాస్వామ్యంలో కావలసినవి లభించేంతవరకు
నిరసనలూ పోరాటాలు ఉద్యమాలు ఆయుధం బయటపడేను

దారిలో సముద్రమో మహా నదియో గిరులో
దాటరాని భయంలోను ధైర్యంతో తరించేరు

పురాయుగం నుండి ఆధునికం వరకు
దశ దశ సంస్కృతి చిహ్నాలుగ ఆప్తంగా

48. సమ భావన

అగ్నికీ నీరుకూ సమ భావనతో
శీతాన్ని తాపాన్ని సమంగా ఎదుర్కొనే విధంతో
జీవ శక్తికి ఆయువు నిస్తుంది కాలం
హృదయ స్పందనకు ఆకృతినిస్తుంది కవిత!

చూపుకు కనిపించే దిశదిశలో ఎందరో శ్రమ జీవులు
ఒకరి తరువాత ఒకరు తరువుల వలె నిలిచి
కర్షకలోకంతో ఇంద్ర ధనస్సును తలపిస్తుంది
ఇది పలు రంగులతో తీర్చబడే కళారూపంతో

స్వచ్ఛత శోధన పరిణామ వికారాలతో
అనుభవ ప్రపంచంతో మానవ జీవితమొకటే
చంద్రుడు జారి తన ముఖం చేరినట్లు ఉంటుంది
ఉదయం నేరుగా హృదయంపై దిగినట్లు ఉంటుంది

రోజు మొదలయింది, భయం లేదు, గడుస్తుంది
రేపటి గురించి చింతనం, జరగక తప్పదు
ఆలోచన అనల శిఖలపై నడుస్తుంది
మనిషికి మబ్బుల మెట్లపై నడవాలనీ

ఈ కాలం సైనికుల అయుధాలతో
పనిలేని శూన్యమే సంస్కృతి కోరేను

కావలసిన అవసరాలు తీర్చలేక
విషమ స్థితి విభేదాలతో, ఇరుపక్షాలు
రణ రంగంలోకి దిగడం చరిత్రలో
ఇప్పటికీ !ఇదే పార్ములా రణ తంత్రంతో

ఇది కల కాదు, వాస్తవం సామ్యవాద ప్రజాస్వామ్యంలో
ఎవరు ఏది కోరినా దాన్ని గురించి ఆలోచన చేస్తుంది

ప్రకృతి సంపద అయినా సమాజ శక్తి అయినా
మనిషి కవసరం లేనిది లేదు, ప్రపంచంలో

ఇటు ఆపతం అటు జలద శకలం
చీకటి తోనే మానవ చేతనకు గుర్తింపు

శ్రమ జీవులపై రవి కిరణం సూటిగా
దిగుతుంది అప్పుడు భూమి జ్ఞాపకం వస్తుంది

లోనుండి పని చేసే కర్మ వీరులెందరో
ప్రవృత్తులు వృత్తులతో క్రియా రూపాలు

49. ఈ ముఖం ముందు అద్దంలో

కిరణ ప్రకాశంతో ఆశా నవలోకం అద్దంలో
తన ముఖం వెనక నుండి ఎన్ని ముఖాలతో
వరసగ దోషాలు గుణాలు అతీతాలు విజయాలు
ఒకటి తరువాత ఒకటి, దేని సంఖ్య దానికి మితమై

బయటికి కనిపించే ముఖం ఒకటే ఎవరైనా
లోన పొంచి ఇవి, వెనకనే ప్రతినిధులుగా

తటాక జలాలపై కదలే చంద్ర బింబంగానో
కదలిపోవు అలలపై సూర్య కిరణ పంక్తులుగానో
రాత్రివేళ సమావేశమయిన చుక్కల వలెనో
అన్నిటినీ మించి లోన హత్తుకొన్న సమాజ హృదయంతో

ఎవరెక్కడి నుండైనా అన్నీ మౌనంగా దర్శనమిస్తాయి
ఆ వ్యక్తి మనసు పుటలు విప్పి చూపిస్తాయి
సాధారణ జీవితంలో జరిగే విశేషం ఏమీలేదు
అనుభవ శాలలో చేరడం పరంపరను పొడిగించడమే

మేఘం క్రిందికి దిగడం భూమికి మహా ఇష్టం
అయితే ఇది సాధ్యం కాదని తెలిసిందే,
భవితకు మొదటి గేటు వర్తమాన క్షణం
ఇది తెరవబడితేనే లోనికి ప్రవేశానికి అవకాశం

అద్దం ముందు నిలిస్తే ముఖ బింబం వెనక తరలే
దేని కది, ఇతరులకు కనిపించని ప్రదర్శనలో భాగం
అవనిపై నీడపై నింగిలో పయనించాలని ఉన్నా
ఏది దేనికి తగునో అది అంతలోనే చేరేను

అకాశాన్ని ఆవరిస్తూ చలనంలో ఆలోచన
ప్రకృతి ప్రాణి మనిషి పరిచయం రికార్డులో
ఇది కవితకు ఆకరం, ఆలోచనలో మననీయం
ఇది నవతకు స్వాగతం ప్రగతికి నిర్దేశకం

కదల లేని దానికి ఎగిరే రెక్కల నిస్తుంది
తొలగలేని చీకటికి దీపశిఖ నందిస్తుంది
చీకటిలో ఒకటైన కలిసిన వాస్తవానికి
పయనంలో విజయ బంధువు అవుతుంది

50. ముగియని సమరం

మనిషిలో మనిషి మనిషితో మనిషి ప్రకృతితో మనిషి
ఇదొక తడవతో ముగిసేది కాదు. నిరంతరం జరిగేది
మధ్య మధ్య విరామ చిహ్నాలతో శాంతి సమాదరణంతో
చలనం లేని బ్రతుకుల్ని ఒక్కమారు కుదిపి నడిపించేను
క్రియా శీలంలో కోపం వైరం ద్వేషం
చోటు చేసుకొని విజృంభిచేను; సమరస్పృహతో

నింగి ఉన్నదని విశాలంగా నాలుగు కాలాలలోను
నీలి మబ్బులు అలంకరించవు, ముత్యాలు జాలువారవు
తన తోడుగ నడచే జన పథంలో భాగమై
సమాజ శక్తికి సాధనమైన మనిషిని నిలబెట్టేను
తమ బ్రతుకులలో సాధారణ స్థాయికి దూరమై
తిండి గుడ్డ ఇల్లు ఎరగని, విసరబడిన మనుషులెందరో

కాలం గడచే కొద్దీ ఆరోహణలో చింతనతో మనుషులు
మార్చే ప్రజాస్వామ్య రేఖలకై ఎదురు చూచేరు
మనిషి ముఖం సంస్కరణ శోభకు వేదిక కావాలని
ఎంత కాలం గడచినా ఇంకా ఎందరిలోనో శిలాత్వం

అలజడి ఉద్యమ కలహ సమర గుణాలతో ఒకరొకరు
దిశదిశ కొక విశేష పదగతులతో గమ్యాలతో మనుషులు
మార్పును కోరే ఆలోచనలను సాకారం చేసే యత్నం
శిథిలాల నుండి నిర్మాణ జగత్తుకై ఎదురు చూస్తూ
బ్రతుకు అంచులతో పలు రంగులలో వాస్తవాలు
శిలా బంధువులై కోర్కెల పూల భావనతో

ఒక దేశం ఒక వ్యక్తి ప్రతినిధిగా ఆదర్శంలో
ప్రజాస్వామ్య చేతన ఒక సుందర నిర్మాణంలో

భగీరథుని కథకు ఆధునిక వ్యాఖ్యాన రూపమయ్యేను
నైతిక పథంలో ఆదర్శం! తీరుతెన్నులు తప్పనివై ఒప్పనివై

సాయం ఛాయలలో తేజం ఓడిన ముఖాన్ని చూపేనా?
ఉదయ సమయంలో కిరణం తన విజయాలను చెప్పేనా

భయ భయంగా నడచే మనిషి నడతలో స్వేచ్ఛ ఇపుడు
అద్దంలో ముఖ బింబం వెనకనే ప్రజాస్వామ్య చేతనతో కదలేను

51. తెలిసిన రహస్యం

శరీర కష్టంతో పాటు మానస విభవం నష్టంతో
మనిషిలో అతీత శక్తిని తరగ జేసేను, అనైతికంతో

క్షోభాకుల జీవితాన వేదనతో ఊహ శాఖలు
వ్యక్తి బ్రతుకు కావ్యం సంఘ రూప మితిహాసం

అద్దంలో కనిపించే ముఖం, అదే నిన్నటిదే
మృత్యు స్పర్శకు తప్ప చివరి దాక, మారనిదీ
దీని వెనకు నున్న భవిత కనిపించనిదీ
బాధకు ముక్కలయి దేనికది బొమ్మలుగా
ఏకాంత వేదిపై పలికేను ఆడేను పాడేను
ఆలోచనలో మార్పులు అనుక్షణం జరుగుతూనే

బయటికి కనిపించని ఆలోచన నావయై జలధిలో
పయనంలో తీరం చేరేందుకు ఎవరి యత్నం వారిది

తీర ప్రాంతాలలో చల్లని తోటలలో ముళ్ళ కన్న
పూల అనుభవ పవనం వికాస రమణీయం

రోజు అవసరాలు బ్రతుకు ప్రయోజనాలు పెరగడంతో
విస్తరించిన శ్రమ సమాజం, గుర్తింపుకు లోనయింది
మార్పులకు తల ఒగ్గి సమాజంలో ఇష్టంగా
సంస్కృతిలో సంపద ముఖ్య పాత్ర వహించేను

బ్రతుకులో కార్య కలాపాల క్షేత్రాలు విస్తృతమై
మనిషి శక్తి పట్ల నమ్మకం దృఢ తర మయ్యేను
ఏదీ వ్యర్థం కాదు, ఎప్పటికీ నిరూప యోగం కాదు
ఒకరి ఆశల సౌధాన్ని మరొకరు కూల్చ నవసరంలేదు

జీవన గతిలో శ్రమ విభవం పాత్ర పెరిగి
నైతిక వ్యక్తిత్వం ఉదయ సూర్య స్వర్ణ మయమయ్యేను

రణ మంటే ఆటలో గంతులు వేయడం కాదు
ప్రతి ఒక్కరి తలపై యశోమకుట మలంకరించేను

దార్శనికంలో విభేద మంటే మనిషిలో ఎదురుగా
జలధిలో అలలపై ఊగుతూ పయనించడం కాదు
ఎంతటి విపరీతంలోను ఎవరూ ఎవరికీ కాకుండాపోరు
చరిత్రలో మునుగుతూ తేలుతూ మానుష శక్తికి నిదర్శనమయ్యేరు

52. సమస్యల బరువులో

చరిత్రకు మరపు ఎక్కువ! సమస్యల బరువుతో క్రుంగిన
శిథిలాలలో స్మృతులలో చీకటిలో కనిపించనిదే ఎక్కువ
సమయం సందర్భం కలిసి మానవం అనుకోనిది చేరి
కాలం మనిషిని తిప్పుతుంది! బ్రతికినంత వరకూ

కాలాన్ని ఎవరూ వెలిగించ నవసరం లేదు
అది నిరంతరం వెలుగుతూనే ఉంటుంది
చేతనతో మనిషిలో సుందర వాస్తవ గతిలో
మెలకువ రేఖలతో చీకటి బొమ్మల నాటకం

కణ కణాన లాభాలెన్నో అడుగడుగున పోటి గతిలో
ఎంత ఎత్తు అయినా, దూర మెంత అయినా వ్యూహ రచనతో
అంకెల గారడితో విశ్వమంత ప్రదర్శన జరిగేను
శుష్కమైన శాఖాకీర్ణమైన బ్రతుకులతో సామాన్యులు

సంక్షోభం వెనక నుండి సంక్షేమం కోరే సన్మతులు
నిశ్శబ్ద ప్రపంచాన్ని నాదమయం చేసేరు; ఇష్టంగా
దీని కిది మానవ ధర్మానికి అంకిత మవుతుందని
మనిషిలో అంతః కరణం, సుందర లోకం నిర్మిస్తుంది

రవి కిరణం ఒక సమయంలో కనుమరుగవుతుంది
మళ్ళీ కనిపించే ఆశా బీజాన్ని నాటి గుడ్ బై చెబుతుంది
నీతులెన్ని విధాలో అన్ని శాఖలుగా జీవిత మల్లుకొనీ
పలు విధాల పూలతో పూర్ణత కవకాశంతో ప్రపంచీకరణ
సంకేత స్థాయిలో హృదయ స్పందనం మరచేనా?
సుఖ సంతోషం పరివర్తన పై వ్యక్తిత్వంలో వెలిగేనా

శిథిలాలు స్మృతులు చీకటి చుక్కలు శుష్క ముఖాలు కనిపించనివి
స్థాయిలో సంకేతంపై హృదయ స్పందనం మరచేనా
సగటు మనిషి జీవన ప్రమాణం అవగతం అయ్యేనా?
శుష్కమైన హస్తాలతో, ఎత్తిన బ్రతుకులతో మనుషులు
ఎక్కడ బడితే అక్కడ! ఆశా లోకాన్ని తలచుకుంటూ కదలేరు

చీకటి నుండి వెలుతురుతో మట్టి నుండి నవ సృజనతో
ఘర్షణ నుండి సమన్వయ దశలు దశలుగా మానవ ప్రస్థానం

53. ప్రపంచీకరణం

వీధిలో పడిన తళ తళ లాడే కరెన్సి నాణేల్ని
ధగధగ లాడే నిప్పు కణాల్ని గ్రహించే దెవరు
ఇవి ఏ పెట్టెలో ఏ బ్యాగులో నిలిచేవి కావు
ఇవి కోరే వారెందరు? ఎవరో? తెలియదు

ఏ తట్టలోనొ బుట్టలోనొ ఒదిగేది కాదు వాణిజ్యం
ఏ బ్యాగ్‌లోనొ పెట్టెలోనొ పట్టేది కాదు వర్తకం
ఒక కవితలో తప్ప, ఎక్కడ విశాలత దొరకదు
ఒక మానవ ధర్మంలో, తప్ప ఎక్కడా నిలవదు

కవి హృదయానికి వెచ్చదనం కలిగించేను
కవితను ఉత్సాహంగా నడిపించేను
జీవన ప్రయోజన దిశల చుట్టూ తిరిగి
కుంపటి స్థానంలో హవనానికి ఆశ్రయ మయ్యేను

కన్నీటి కణంలో బాధ నుండి అనల కళలు
పాత దారిని మరపించేను, కొత్త దారిని చూపించేను

నెంబర్ లేని ఖైదీ డ్రెస్‌లో ఒకరు
ఒక చోటు నుండి మరో చోటుకు తిరుగుతూ
తనకేది కావాలో అది ముఖ్యమై అంతర్జాలంలో
క్షణాలలో సాధించే లాభాల ఆలోచనలో పిల్లి మొగ్గలు

ఏ దారిన అయిన స్వేచ్ఛగా పయనించేందుకు
సందేహంలో జీవన చక్రం భ్రమణం జరిగేను

ఎవరి కిష్టమైంది వారు అభిమాన ముద్రలతో
మిగతావి పక్కకు జరిపి వేరు పడ చేసేరు

పూలు ఎన్ని విధాలో! మనో గుణాలెన్ని విధాలో
ఇంతకూ నెంబరు లేకుండా ఆ ఖైదీ డ్రెస్ ఎవరిది?

నేర చరితతోనా? దోష భయం తోనా?
గాలికి నూయిలో పడి అడుగున చేరి రాలేని స్థితిలోనా?
వికసించిన పుష్పం లా చుక్కల మధ్య చంద్రునిలా
అయ్యో అనిపిస్తుంది! నేలపై ధూళిలో కుసుమంలా రోజూ

పూలు ఎన్ని విధాలో ! మనో గుణాల కలయికలన్ని రూపాలు
ఇంతకూ నెంబర్ లేని ఖైదీ డ్రెస్‌లో ఎవరు? ఎవరికి తెలుసు

నిజం చెప్పడానికి వాస్తవం తెలిసేందుకు సమస్యలెన్నో
అందరికీ తెలిసిన అనుభవంతో ప్రపంచీకరణం, ఒక ప్రయోగం

54. ఆయుధంతో జీవితం

ప్రతిఫలనంలో ఎదురుగ అద్దంలో మనిషి ముఖం
నీ దయినా నాదయినా మరొకరిదైనా క్రితం క్షణంలోది కాదు
ఇది స్వేచ్ఛా కవిత్వం! మనో దర్పణంలో, బింబించేను
సమత భవిత నవతతో స్వతంత్ర కథకు ప్రేరణం

మనిషి కను చూపుకు కనిపించని వస్తువును చీకటి రాత్రిలో
ఒక కిరణం సమయానికి పట్టుకొని బయట పెడుతుంది
పేద వాని కనులలో వెచ్చని బాష్ప కణాల్ని
మంచు చుక్కలుగా మారుస్తుంది ప్రజా స్వామ్యం

స్వచ్ఛమైన జీవన గతితో అడుగులు పడాలనీ
శుభ్రమైన రాజ నీతితో పాలన నడవాలనీ
మనిషికీ మనిషికీ మధ్య నాటిన ముళ్ళ కంచె వలె
శత్రుతను తొలగించే సులభత, మనిషితోనే సాధ్యం

చీకటిలో నయినా గుండె ధైర్యంతోనే
ఎవరి కయిన విజయం, రణ చరణంలో సాధ్యం
ఉపదేశాన్ని అనుసరించి ఆచరణం
పదును కత్తి అంచుపై నడక వంటిది
గాయ పరచవచ్చు, నెత్రు చిత్ర మేర్పడవచ్చు
మృత్యువు తన సీమలలో త్రిప్పవచ్చు

జల తటాన స్పృశించే తరంగాలలో
శిథిలమైన ఆకృతిలో నిలయం! ఎప్పటిదో?
పరివర్తనలోనైనా శిల్ప నిలయంగా తీర్చే దెవరని?
పాత దానిపై అభిమానం పోదు
కొత్త దానిపై దృష్టి ఆశా నవ సహజం
చరిత్ర పుటలలో కన్నీటి ముత్యాలతో

పక్కనే చెట్టు! తన నీడకు రంగులు కోరేను
మనిషి మనసు కిర్మీర కళా పాత్ర వహించాలనీ

చేతనతో హృదయం కుసుమిత మవుతుంది
జల సిక్తంతోనే కొమ్మకు పచ్చదనం వస్తుంది

చూస్తూ చూస్తూ ఉండగనే ఆర్ద్ర వలయంలోకి భుజగం
ఆ వెనకనే చెట్టు కొమ్మపై పక్షి నిశ్శబ్దంగా
కాస్త దూరంలో ! ఎక్కు పెట్టిన బాణంతో విలుకాడు

మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

A) స్వేచ్ఛా కవిత్వం

❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం రచనా కాలం 1953 - 2002

i. స్వేచ్ఛా నవం : 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపిథం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నెల్

❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019

ఇది జీవితం : 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబద్ధం

B) పరిశోధన – సమాలోచనం

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

సంక్షిప్త పరిచయం

మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, ప్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి.తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

BRIEF SKETCH

Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 798847